వ్యాస మహాభారతం

(తెలుగు వచనం)

శల్య సౌప్తిక స్త్రీ పర్వాలు



దాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

దాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

963

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
శల్య సౌప్తిక స్త్రీ పర్వాలు

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894.8278
రామ - మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

శల్య సౌప్తిక స్త్రీ పర్వాలు

ప్రథమ ముద్రణ : వినాయకచవితి (సెప్టెంబరు 2010)

20 సంపుటాల వెల : రూ. 720/-

C 27481

సుందరయ్య గ్రంథాలయం సంస్థ
A C.No 96363
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

ప్రతులకు
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, పోలకంపాడు,
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

కీ॥శే॥ కరెడ్ల గోపాలకృష్ణమూర్తి గారి స్మృత్యర్థం

వారి ధర్మపత్ని కమలమ్మ

కుమారులు - కోడళ్లు :

వెంకట సీతారామశాస్త్రి - అనంతలక్ష్మి

సుందరశర్మ - లలితా రాజేశ్వరి, శ్రీనివాస్ - రోజామీనాక్షి

టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్మిల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.



కీ॥శే॥ మోచర్ల రామకృష్ణ శర్మ గారు

వారి స్మృత్యర్థం

టైటిల్ బోర్డు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని వరలక్ష్మి

కుమారుడు :

పూర్ణ వెంకట రామశర్మ

క్షీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి స్మృత్యర్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని సుభద్ర

కుమారులు - కోడళ్లు :

శ్రీయుతులు శ్రీనివాస్ - సౌభాగ్యలక్ష్మి

సత్యనారాయణ (చినబాబు) - యామినీలక్ష్మి

కుమార్తెలు :

భవాని, విశాలాక్షి

రచయిత :

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి,
వారి ధర్మపత్ని శ్రీమతి సీత

రచయిత :

డాక్టర్ సూరం శ్రీనివాసులు,

వారి ధర్మపత్ని శ్రీమతి సులోచన

ఎందరో మహానుభావులు

శల్య సౌప్తిక స్త్రీ పర్వాలు ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి, శ్రీ వెలంపల్లి దాశరథి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతాజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంత తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది అభిగమ్యకృతే దానం అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కొరెడ్ల సుందరశర్మ గారు. వాళ్లు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వం తానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతాజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకొంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా॥ సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా। ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా॥ ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	।	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.	।	శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

వీటిని అందంగా డి.టి.పి. తయారుచేసిన బెవర వెంకటరమణ, వి.యస్.గ్రాఫిక్స్ వారికి మా కృతజ్ఞతాభివందనములు.

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది, ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణ మని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో **ఆనృశంస్యాన్ని** (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజ; ధృతరాష్ట్ర, దుర్యోధనులను ప్రతినిధులుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని

అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమ్మతవీరులను కూడా చూపించాడు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం - వ్యాస మహాభారతం (తెలుగు వచనం).*

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాబ్జేషు యే
లోకానాం స్థితి మావహన్త్యవిహతాం స్త్రీపుంపయోగోద్భవాం
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్పంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమాబ్జభవ శ్రీకన్దరా శ్శ్రేయసే

ఇట్లు
అనువక్తలు

---

* మహాభారతం యథాతథంగా అనగా అధికపాఠాలతో సహా ఇచ్చాం. అధికపాఠాలు చిన్నపైజులో, బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య

శల్య పర్వం

1. శల్యాభిషేక పర్వము - 28

1.	సంజయుడు నగరమునకు వచ్చుట - వార్త విని ధృతరాష్ట్రుని మూర్ఛ. (55)★	19
2.	ధృతరాష్ట్ర విలాపము. (70)	21
3.	కౌరవసైన్య పలాయనము. (61)	24
4.	కృపాచార్యుని మాటలు. (51)	27
5.	దుర్యోధనుని నిశ్చయము. (52)	30
6.	శల్య దుర్యోధన సంవాదము. (30)	32
7.	శల్యుడు సైన్యాధిపతియగుట. (46)	34
8.	వ్యూహ నిర్మాణము. (45+$\frac{1}{2}$)	36
9.	సంకుల యుద్ధము - కౌరవ సేన పలాయనము. (47)	38
10.	సంకులయుద్ధము - ముగ్గురు కర్ణపుత్రులవధ (68)	39
11.	శల్య భీమసేనుల యుద్ధము. (63)	42
12.	చేకితానవధ - చంద్రసేన ద్రుమసేనులవధ (63)	45
13.	శల్యుని యుద్ధము. (48+2)	48
14.	అర్జునాశ్వత్థామల యుద్ధము - సురధుని వధ. (48)	50
15.	శల్యునితో నకుల, సాత్యకుల యుద్ధము. (43)	52
16.	శల్య యుధిష్ఠిరుల యుద్ధము. (68)	54
17.	శల్య వధ (91+3)	58
18.	శల్యానుచరుల వధ - కౌరవసేన పలాయనము. (40)	62

★ బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య. రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
19.	భీముడు ఇరవై ఒక్క వేలమంది పదాతులను చంపుట. (70+1)	64
20.	సాత్యకి శాల్వుని వధించుట. (27)	68
21.	సాత్యకి కృతవర్మల యుద్ధము (37)	70
22.	సంకుల యుద్ధము - 1 (49)	72
23.	సంకుల యుద్ధము - 2 (92)	74
24.	అర్జునుడు దుర్యోధనుని వైఖరిని గర్హించుట - రథికులను సంహరించుట. (66)	78
25.	దుర్యోధన పలాయనము (63)	82
26.	భీముడు పదకొండుమంది ధార్తరాష్ట్రులను చంపుట. (42)	85
27.	సుశర్మ వధ (57)	86
28.	సహదేవుడు ఉలూకుని, శకునిని సంహరించుట. (68)	89
	2. హ్రదప్రవేశ పర్వము - 1	
29.	దుర్యోధనుడు మడుగులో ప్రవేశించుట. (105+8)	92
	3. గదా పర్వము - 36	
30.	కృపద్రౌణి కృతవర్మలు దుర్యోధనునితో మాట్లాడుట. (67)	98
31.	సుయోధన - యుధిష్ఠిర సంవాదము. (73)	102
32.	యుధిష్ఠిర సుయోధన సంవాదము (71)	105
33.	భీమసేన దుర్యోధన సంవాదము. (58)	109
34.	బలరాముని రాక (22)	112
35	ప్రభాసోత్పత్తి కథనము. (90)	113
36.	త్రితాఖ్యానము (55)	118
37.	సారస్వతోపాఖ్యానము - 1. (67)	121

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
38.	సారస్వతోపాఖ్యానము – 2. (59)	124
39.	సారస్వతోపాఖ్యానము – 3. (38)	128
40.	సారస్వతోపాఖ్యానము – 4. (32)	130
41.	సారస్వతోపాఖ్యానము – 5. (40+$\frac{1}{2}$)	131
42.	సారస్వతోపాఖ్యానము – 6. (42)	133
43.	సారస్వతోపాఖ్యానము – 7. (49)	136
44.	కుమారాభిషేకోపక్రమము. (53)	138
45.	కుమారాభిషేకము. (115)	141
46.	తారకవధ (108+$\frac{1}{2}$)	147
47.	వరుణాభిషేకము (33)	152
48.	బదరపాచన తీర్థమహిమ. (68)	154
49.	ఇంద్ర – రామ – యమునా – ఆదిత్య తీర్థాల మహిమ (24)	158
50.	ఆదిత్య తీర్థమహిమ (69)	159
51.	దధీచి సారస్వతమని చరిత్ర (53)	162
52.	వృద్ధకన్యా తీర్థమాహాత్మ్యము (29)	165
53.	కురుక్షేత్ర మహిమ (26)	167
54.	భీమదుర్యోధన యుద్ధమును చూచుటకు బలరాముని రాక (41)	168
55.	భీమదుర్యోధనులు యుద్ధసన్నద్ధులగుట (51)	171
56.	గదాయుద్ధారంభము (46)	173
57.	భీమదుర్యోధన గదాయుద్ధము (70+2)	175
58.	దుర్యోధన వధ (62)	179
59.	యుధిష్ఠిర విలాపము (31)	182

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
60.	బలరామ సాంత్వనము. (48+8 $\frac{1}{2}$)	184
61.	కృష్ణపాండవ దుర్యోధన సంవాదము (71+15)	187
62.	వాసుదేవుని సాగనంపుట (45)	192
63.	ధృతరాష్ట్ర గాంధారీ సమాశ్వాసనము (78)	194
64.	దుర్యోధన విలాపము. (43+ $\frac{1}{2}$)	198
65.	సేనాపతిగా అశ్వత్థామకు అభిషేకము (46)	200

సౌప్తిక పర్వం

1. సౌప్తిక పర్వము - 9

1.	అశ్వత్థామ ఆలోచనము. (69)	203
2.	ద్రౌణి - కృప సంవాదము (35)	207
3.	అశ్వత్థామ నిశ్చయము. (36)	209
4.	అశ్వత్థామ సూచనను కృపాచార్యుడు నిరాకరించుట. (34)	211
5.	అశ్వత్థామ - కృపుడు - కృతవర్మ పాండవ శిబిరానికి బయలుదేరుట (40)	213
6.	అశ్వత్థామ చింతించుట. (34)	215
7.	అశ్వత్థామ శివునిద్వారా కత్తిని పొందుట (68)	217
8.	రాత్రియుద్ధమున పాంచాలాదిసంహారము. (159+ $\frac{1}{2}$)	221
9.	దుర్యోధన ప్రాణత్యాగము. (63)	230

2. ఐషీక పర్వము - 9

10.	యుధిష్ఠిరశిబిర ప్రవేశము (31)	234
11.	అశ్వత్థామను చంపుటకై భీముడు వెళ్ళుట. (31+ $\frac{1}{2}$)	236
12.	కృష్ణ యుధిష్ఠిర సంవాదము (41)	238

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
13.	అశ్వత్థామ బ్రహ్మాస్త్రమును ప్రయోగించుట. (22)	240
14.	అర్జునుడు బ్రహ్మాస్త్రమును ప్రయోగించుట (16)	242
15.	బ్రహ్మశిరోస్త్రము పాండవగర్భమున ప్రవేశించుట - 1. (35)	243
16.	బ్రహ్మశిరోస్త్రము పాండవగర్భమున ప్రవేశించుట - 2 (37)	245
17.	కృష్ణ యుధిష్ఠిర సంవాదము (26)	247
18.	మహాదేవుని కోపము - అనుగ్రహము (26)	248

స్త్రీ పర్వం

1. జలప్రదానిక పర్వము - 15

1.	ధృతరాష్ట్ర విలాపము - సంజయుని సాంత్వనము. (44)	251
2.	విదురుడు ధృతరాష్ట్రుని ఊరడించుట - 1 (37)	254
3.	విదురుడు ధృతరాష్ట్రుని ఊరడించుట - 2 (20)	256
4.	విదురుడు ధృతరాష్ట్రుని ఊరడించుట - 3 (20)	257
5.	విదురురుడు ధృతరాష్ట్రుని ఊరడించుట - 4 (24)	258
6.	విదురుడు ధృతరాష్ట్రుని ఊరడించుట - 5 (14)	260
7.	విదురుడు ధృతరాష్ట్రుని ఊరడించుట - 6 (29+1)	261
8.	విదురుడు ధృతరాష్ట్రుని ఊరడించుట - 7 (53)	262
9.	విదురు వచనము (23)	265
10.	ధృతరాష్ట్రుడు రణభూమికి బయలుదేరుట. (20)	267
11.	ధృతరాష్ట్రుడు కృప - అశ్వత్థామ - కృతవర్మలను కలియుట. (24)	268
12.	ధృతరాష్ట్రుడు భీమప్రతిమను బ్రద్దలు చేయుట. (30)	269
13.	ధృతరాష్ట్రుడు పాండవులను చేరదీయుట. (17)	271

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
14.	పాండవులను శపింపబూనిన గాంధారిని వ్యాసుడు శాంతింపజేయుట. (21)	272
15.	జలప్రదానికపర్వము (44)	273
	2. స్త్రీ విలాప పర్వము - 10	
16.	రణభూమిలో గాంధారి విలాపము (61)	276
17.	దుర్యోధనుని చూసి గాంధారి విలపించుట. (32)	279
18.	దుశ్శాసనాదులను చూసి గాంధారి విలపించుట. (28)	281
19.	గాంధారీ విలాపము - 1 (21)	283
20.	విరాటస్త్రీల విలాపమును గాంధారి వర్ణించుట (35)	284
21.	కర్ణ దర్శనము. (14)	286
22.	జయద్రథుని, దుశ్శలను చూసి గాంధారి విలపించుట. (18)	287
23.	శల్యాదులను చూసి గాంధారి విలపించుట. (42)	288
24.	భూరిశ్రవుని, శకునిని చూసి గాంధారి విలపించుట. (30)	291
25.	గాంధారి శ్రీకృష్ణుని శపించుట. (50)	293
	3. శ్రాద్ధ పర్వము - 2	
26.	దహన సంస్కారాలు (44)	296
27.	కుంతి కర్ణజన్మను గూర్చి చెప్పుట. (30)	298

। శ్రీమాత్రే నమః ।

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
శల్య పర్వం

1. సంజయుడు నగరమునకు వచ్చుట - వార్త విని ధృతరాష్ట్రుని మూర్ఛ.

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

నరుల మనస్సులే నివాస స్థానమైన నారాయణునికీ, నరోత్తమునికీ, సరస్వతీ దేవికీ, వ్యాసమహర్షికీ నమస్కరించి శ్రీమహాభారతమును చదువవలెను/ చెప్పవలెను.

జనమేజయుడు అడిగాడు. "ద్విజా! యుద్ధరంగంలో అర్జునునిచే అలా కర్ణుడు చనిపోతే, కొద్దిగా మిగిలిన కౌరవసైన్యం ఏం చేశారు? పాండవుల బలం వృద్ధి పొందటం చూసి, దుర్యోధనుడు వారితో సమయోచితంగా ఎలా వ్యవహరించాడు ? ద్విజశ్రేష్ఠా ! పూర్వీకుల చరిత్రను వినాలని కోరుతున్నాను. దానిని చెప్పవలసినది." వైశంపాయనుడు చెపుతున్నాడు. "రాజా! కర్ణుడు చనిపోతే, దుర్యోధనుడు శోక సాగరంలో మునిగిపోయాడు. అంతటా నిరాశ వ్యాపించింది. హా కర్ణా! హాకర్ణ! అని పలుమార్లు శోకిస్తూ, దుర్యోధనుడు యుద్ధరంగంలో మిగిలిన రాజులతో అతికష్టంతో తన శిబిరం చేరాడు. రాజులు ఎంత ఓదార్చినా, దుర్యోధనుడు కర్ణవధనే స్మరిస్తూ మనశ్శాంతిని పొందలేకపోతున్నాడు. దుర్యోధనుడు దైవాన్నీ, జరుగబోయే దాన్నీ బలీయమని తలచి, యుద్ధం చేయటానికి నిశ్చయించుకొని మళ్ళీ యుద్ధానికి బయలుదేరాడు. దుర్యోధనుడు శల్యుని యథావిధిగా సేనాపతిని చేసుకొని, మిగిలిన రాజులతో యుద్ధానికి బయలుదేరాడు. భరతశ్రేష్ఠా! కౌరవ పాండవసేనల మధ్య ఘోరయుద్ధం ప్రారంభమయింది. సైన్యంతో కూడిన శల్యుడు యుద్ధం చేసి, మధ్యాహ్న కాలానికి ధర్మరాజుచే చంపబడ్డాడు. దుర్యోధనుడు యుద్ధంలో తన బంధువర్గం మరణించటం చూసి, శత్రుభయంతో యుద్ధరంగం వీడి, పెద్ద మడువులో ప్రవేశించాడు.

అదే రోజు అపరాహ్ణకాలంలో దుర్యోధనుని ముట్టడించి, భీమసేనుడు అతనిని యుద్ధానికి మడుగునుండి బయటకు రప్పించి పడగొట్టాడు. దుర్యోధనుడు పడిపోతే మిగిలిన ముగ్గురు రథికులు కృపాచార్య, కృతవర్మ, అశ్వత్థామలు రాత్రి నిద్రలోనున్న పాంచాల, సోమకులను చంపివేశారు. తరువాతి ప్రొద్దుట దుఃఖశోకాలతో నిండి, సంజయుడు శిబిరం నుండి బయటకు వచ్చి హస్తినాపురం ప్రవేశించాడు.

అతడు పురంలో ప్రవేశించి, చేతులు పైకెత్తి, మిక్కిలి దుఃఖిస్తూ, వణుకుతూ రాజభవనంలో ప్రవేశించాడు. దుఃఖంతో సంజయుడు, దుర్యోధనుని మరణంతో మనం సర్వస్వం కోల్పోయామని విలపించాడు. విధి బలీయమైనది. పురుష ప్రయత్నం నిరర్థకం. ఇంద్రునితో సమానమైన బలం కల్గినా, నీ పుత్రు లందరు పాండవులచే చంపబడ్డారు. మిక్కిలి క్లేశంతో కూడిన సంజయుని చూసిన హస్తినాపుర ప్రజలు, ఉద్వేగభరితులై "హా ! రాజా!" అని విలపించారు. దుర్యోధనుని మరణవార్త విని, పిల్లల దగ్గర నుంచీ, అందరూ ఆర్తనాదాలు చేశారు. అచ్చట పురప్రజలు చైతన్యం లేనివారి వలె ఉన్మత్తులై, మిక్కిలి దుఃఖిస్తూ ఇటూ అటూ పరుగులు తీస్తున్నట్లు కనపడింది. వ్యాకులు డయిన సంజయుడు రాజభవనంలో ప్రవేశించి, ప్రజ్ఞానేత్రుడయిన ధృతరాష్ట్రుని చూశాడు. భరతశ్రేష్ఠా! కోడళ్ళు, గాంధారి, విదురుడు, స్నేహితులు, జ్ఞాతులు, ఇతరహితైషులతో కూడి ధృతరాష్ట్రుడు కర్ణుని మరణానంతర పరిణామాలను ఆలోచిస్తున్నాడు. సంజయుడు ఏడుస్తూనే, మాటలు తడబడుతూ, 'సంజయుణ్ణి నేను నమస్కరిస్తున్నా'నని ధృతరాష్ట్రునితో అన్నాడు. 'రాజా! శల్యుడు, శకుని, శకుని కొడుకు యుద్ధంలో మరణించారు. సంశప్తకవీరులు, కాంబోజులు, శకులు, మ్లేచ్ఛులు, పర్వతీయులు, యవనులు అందరూ చంపబడ్డారు. తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు సంబంధించిన వీరులెందరో యుద్ధంలో మరణించారు. రాజులు, రాజపుత్రులు అందరూ యుద్ధంలో చంపబడ్డారు. భీమసేనుడు చెప్పినట్లు, దుర్యోధనుడు కూడా నేలకొరిగాడు. తొడలు విరిగి దుర్యోధనుడు ధూళితో నిండి, నేలమీద పడ్డాడు. ధృష్టద్యుమ్నుడు, శిఖండి, యుధామన్యువు, ప్రభద్రకులు, పంచాలురు, చేది వీరులు సంహరింపబడ్డారు. భారతా! మీ పుత్రులంతా, ఉపపాండవులూ, కర్ణపుత్రుడు వృషసేనుడూ అందరూ మరణించారు. యుద్ధంలో పదాతి సైన్యం అందరూ, ఏనుగులు, రథికులూ, గుఱ్ఱాలు చంపబడ్డాయి. రాజా! కౌరవ పాండవులలోని మీకు సంబంధించినవారు కొందరు మాత్రమే మిగిలారు. కాలాధీనమయిన లోకంలో, స్త్రీలు మాత్రమే మిగిలారు. పాండవ పక్షంలో ఏడుగురు, మీ పక్షంలో ముగ్గురు వీరులు మాత్రం మిగిలారు. పాండవ

పక్షంలో అయిదుగురు పాండవులు, శ్రీకృష్ణుడు, సాత్యకి మిగిలారు. మీ పక్షంలో కృపాచార్య, కృతవర్మ, అశ్వత్థామలు మిగిలారు. రాజశ్రేష్ఠా! కౌరవపాండవ పక్షాల్లో, యుద్ధంలో అక్షౌహిణుల సైన్యం తలపడింది. కాని వీరు మాత్రం మిగిలి అందరూ మరణించారు. భరతశ్రేష్ఠా! దుర్యోధనుని, అతని శత్రుత్వాన్ని ఆసరా చేసుకొని కాలం జగత్తునంతా నాశనం చేసింది."

సంజయుని కఠోర వచనాలు విని, ధృతరాష్ట్రుడు చైతన్యహీనుడై నేలపై పడిపోయాడు. అంతలో విదురుడు శోకసంతప్తుడై క్రింద పడ్డాడు. ఆ కఠోర వచనాలు విన్న గాంధారి, అందరు కురుస్త్రీలు, రాజ పరివారమంతా తెలివి తప్పినట్లు, భూమిమీద పడి విలపించారు. ఆ సమయంలో ఆ దృశ్యం, వస్త్రంమీద గీసిన చిత్రంలా కన్పించింది. అటుపిమ్మట ధృతరాష్ట్రమహారాజుకు అతికష్టం మీద స్పృహ వచ్చింది. మిక్కిలి దుఃఖిస్తూ, వణుకుతూ, అన్ని దిక్కులూ చూస్తూ విదురునితో "ప్రజ్ఞాశాలీ ! విదురా ! పుత్రహీనుడనై అనాథనైన నాకు నీవే దిక్కు' అని పలుకుతూ తిరిగి తెలివి తప్పి నేలమీద పడ్డాడు. రాజును చూసి, అక్కడ ఉన్న బంధువులు ముఖంమీద చల్లటి నీళ్ళను చల్లి, విసరుకర్రలతో విసిరారు. చాలాసేపటికి మహారాజు తెలివి తెచ్చుకొని, పుత్రశోకంతో మాట్లాడలేకపోయాడు. రాజా! కుండలో ఉంచిన పాములాగా, పెద్దగా నిట్టూరుస్తున్న రాజును చూసి, సంజయుడు కూడా విలపించాడు. అలాగే స్త్రీలందరు, గాంధారి రోదించారు. పిమ్మట చాలా సేపటికి మోహం పొందుతున్న ధృతరాష్ట్రుడు విదురునితో ఇలా అన్నాడు. 'స్త్రీలందరూ, గాంధారీ, అట్లే నా స్నేహితులందరూ ఇచ్చటినుండి వెళ్లిపొండి. నా చిత్తం భ్రమిస్తోంది.' మహారాజు ఇలా అంటే విదురుడు, వణికిపోతూ స్త్రీలనందరినీ అచ్చటినుండి పంపివేశాడు. పిమ్మట తెలివి తెచ్చుకొని, దీనంగా విలపిస్తున్న మహారాజును సంజయుడు చూశాడు. దీర్ఘంగా నిట్టూర్చే ధృతరాష్ట్రుని విదురుడు చేతులు జోడించి మధురవచనాలతో ఓదార్చాడు."

2. ధృతరాష్ట్ర విలాపము.

వైశంపాయనుడు చెప్పుతున్నాడు. "స్త్రీలందరూ అచ్చటినుండి వెళ్లాక, ధృతరాష్ట్రుడు మిక్కిలి దుఃఖిస్తూ, వేడిగా నిట్టూరుస్తూ, మాటిమాటికి చేతులూపుతూ విలపించి, చివరకు ఇలా పలికాడు. "సూతా! యుద్ధంలో పాండవులు నష్టం లేకుండా, క్షేమంగా ఉన్నారని నీవు చెపితే నాకు ఎంతో దుఃఖం కలుగుతోంది. నిశ్చయంగా నా హృదయం వజ్రమంత కఠినమయింది. కనుకనే పుత్రులమరణవార్త విన్నా వేయి ముక్కలు కాలేదు. సంజయా!

పుత్రుల బాల్యం, వారి బాలక్రీడలను స్మరిస్తూ, వారి మరణం తలవగానే నా హృదయం పగిలిపోతోంది. గ్రుడ్డివాడి నవటం చేత పుత్రుల రూపాన్ని నేను ఎన్నడూ చూడలేదు. అయినా పుత్రస్నేహం వల్ల ఎల్లప్పుడూ వారి మీద ఎంతో ప్రీతి ఉంది. నా పిల్లలు బాల్యం దాటి, యౌవనం పొంది, పిమ్మట మధ్య వయస్కులయ్యారని విని, ఎంతో సంతోషించాను. అట్టి నా పుత్రులు నేడు ఐశ్వర్య పరాక్రమహీనులై, చంపబడ్డారని విని, వారినే తలుస్తూ మనశ్శాంతిని పొందలేకపోతున్నాను. పుత్రా ! అనాథనైన నా దగ్గరకు రా! నీవు లేకపోతే నాకు ఎట్టిగతి పడుతుందో! రాజుల నందరిని విడిచి, దుష్ట డయిన రాజులా చంపబడి, నేలమీద ఎలా పరుండిఉన్నావు ? బంధువులను, స్నేహితులను, అంధుడగు ముసలి తండ్రిని విడిచి ఎక్కడకు వెళ్ళుతున్నావు ? రాజా ! నీ ఆ దాక్షిణ్యం, ప్రీతి, ఇతరులను గౌరవించే ప్రవృత్తీ ఏమైనాయి? పరాజయం ఎరుగని నీవు, యుద్ధంలో పాండవులచే ఎలా చంపబడ్డావు ? వీరా! లేవగానే నన్ను తండ్రీ ! తండ్రీ ! యని, మహారాజా !, లోకనాథా అని పలుమార్లు ఎవరు పిలుస్తారు ? పుత్రా! నన్ను కౌగలించుకొని, ఆనందబాష్పాలతో కర్తవ్యం ఉపదేశించమని అడిగేవాడవు. ఆ మంచి మాటలను ఇపుడు పలుకు.

పుత్రా! "విశాలమయిన భూమండలం నా (దుర్యోధనుని) అధీనంలో ఉన్నట్లు పాండునందనుని అధికారంలో లే"దని నీవు చెప్పడం నేను విన్నాను. 'భగదత్తుడు, కృపాచార్యుడు, అవంతిరాజులు, జయద్రథుడు, భూరిశ్రవుడు, సోమదత్తుడు, బాహ్లీకుడు, అశ్వత్థామ, భోజుడు, మగధరాజు, బృహద్బలుడు, క్రాథుడు, శకుని, లక్షలకొద్దీ మ్లేచ్ఛులు, శక, యవనులు, సుదక్షిణుడు, సుశర్మ, భీష్మ పితామహుడు, ద్రోణాచార్య, కృపాచార్య, శ్రుతాయు, అయుతాయు, శతాయు, జలసంధ, అలాయుధ, అలంబుష, సుబాహువులు, ఇంకా ఇతర రాజులూ ధనప్రాణాలు విడిచి, నా కోసం యుద్ధం చేయటానికి సిద్ధపడ్డారు. వారందరి మధ్యలో నుంటూ, సోదరులతో కూడిన నేను, యుద్ధంలో పాండవులనూ, పంచాలురనూ ఎదుర్కొంటాను. చేది రాజులను, ద్రౌపది పుత్రులను, సాత్యకి, కుంతి భోజ, ఘటోత్కచులను యుద్ధంలో ఎదుర్కొంటాను. ఈ వీరులలో ఒక్కొక్కడే పాండవులను ఎదుర్కొనటానికి సమర్థుడు. పాండవులతో వైరం కల్గిన వీరందరు కలిసి యుద్ధం చేస్తే ఇంకేం చెప్పాలి ? పాండవ అనుయాయులతో వీరంతా యుద్ధం చేసి వారందరిని చంపేస్తారు. కర్ణు డొక్కడే నాతో ఉండి పాండవులను చంపగలడు. తరువాత సమస్తరాజులు నా అధీనంలో ఉంటారు. శ్రీకృష్ణుడు యుద్ధానికి కవచధారణ చేయ'డని దుర్యోధనుడు నాతో చెప్పాడు. సూతా! నా దగ్గర దుర్యోధనుడు ఇలా చెప్పితే యుద్ధంలో పాండవులందరు

చంపబడినట్లే అని నేను అనుకొన్నాను.

ఇట్టి వీరుల మధ్యలో ఉండి కూడా, చక్కగా పోరాడే నా పుత్రు లందరు యుద్ధంలో చంపబడ్డారంటే ఇది దైవికం గాక మరేమిటి ? సింహం నక్కతో పోరాడి చచ్చినట్లు, భీష్ముడు శిఖండితో తలపడి, మరణించాడు. సర్వశాస్త్ర పారంగతుడైన ద్రోణాచార్యుడు పాండవుల చేతిలో ప్రాణాలు వదిలాడు. ఇదంతా దైవికంకాక మరేమిటి ? దివ్యాస్త్రజ్ఞానం కల కర్ణుడు యుద్ధంలో చంపబడ్డాడు. భూరిశ్రవస, సోమదత్త, బాహ్లీకులు యుద్ధంలో పరలోకం పొందారు. దీనికంతటికి దైవం కారణంగాక మరేమిటి ? భగదత్తుడు, జయద్రథుడు కూడా చంపబడ్డారు. ఇది దైవికం కాక మరియేమి? సుదక్షిణ, జలసంధ, శ్రుతాయు, అయుతాయువులు కూడా మరణించారు. భాగధేయం కాక మరేమి ? పాండ్యరాజు పాండవుల చేతిలో చావటం దైవికం గాక మరియేమి ? బృహదల్బుడు, మగధరాజు, ఉగ్రాయుధుడు, అవంతిరాజ కుమారులు, త్రిగర్తనరేశుడు, సంశప్తకవీరులు చంపబడటం భాగధేయం కాక మరియేమి ? అలంబుషుడు, ఋష్యశృంగపుత్రుడు, అలాయుధుడు కూడా మరణించటం భాగధేయం కాక మరియేమి ? యుద్ధదుర్మదులు, గోపాలుయిన నారాయణులు, అనేక మ్లేచ్ఛవీరులు చావడం భాగధేయం కాక మరియేమి ? సుబలపుత్రుడగు శకుని, పుత్రుడు ఉలూకుడు సైన్యంతో సహా చంపబడటం భాగధేయం కాక మరియేమి ? వీరూ, ఇంకా ఎంతోమంది అస్త్రధారులు, రాజులు, రాజకుమారులు యుద్ధంలో చనిపోవటం భాగధేయం కాక మరియేమిటి ? ఎంతోమంది అస్త్రధారులు, యుద్ధదుర్మదులు, ఇంద్రునితో సమానమైన పరాక్రమం గల క్షత్రియు లెందరో మరణించటం భాగధేయం కాక మరియేమి ? నా పుత్రులు, పౌత్రులు, స్నేహితులు, సోదరులు చంపబడటం దౌర్భాగ్యం కాక మరియేమి ? నిశ్చయంగా మనుష్యుడు భాగధేయంతో కూడి జన్మిస్తాడు.

భాగ్యంతో కూడినవాడు శుభాలను పొందుతాడు. భాగ్యహీనుడనై నేను పుత్రులను పోగొట్టుకొన్నాను. వృద్ధుడ నైన నేను, ఇక శత్రువుల వశమై ఏమి అవుతానో! సంజయా! వనవాసం మినహా మరొకటి ఏదీ నాకు మంచిది తోచదు. బంధుజననాశం వల్ల నేను వనానికి వెడతాను. రెక్కలు తెగిన పక్షివలె ఇట్టి అవస్థను పొందిన నాకు, వనవాసం తప్ప మరొకటి శ్రేయస్కరం కాదు. దుర్యోధనుడు, శల్యుడు, దుశ్శాసనుడు, వివింశతి, మహాబలుడయిన వికర్ణుడు చంపబడ్డారు. ఒంటరిగా నా నూర్గురు పుత్రులను చంపిన భీమసేనుని ఉత్తమ శబ్దాలను, పెద్దమాటల్ని నేను ఎలా వినగలను ?" దుర్యోధన వధచే శోకసంతప్తుడనైన నేను, పదే పదే వాగుతూ ఉండే భీమసేనుని పరుషవచనాలను ఎలా వినగలను ? వైశంపాయనుడు చెపుతున్నాడు. "రాజా! పుత్రుల మరణంతో, బంధునాశంతో, శోకసంతప్తుడైన

ధృతరాష్ట్రుడు మాటిమాటికి మోహం చెందుతూ, చాలాసేపు విలపిస్తూ, దీర్ఘంగా నిశ్వసించి, జరిగిన పరాభవం తలచుకొని చింతిస్తూ, తిరిగి సంజయుని యుద్ధసమాచారం గురించి అడిగాడు. "భీష్మద్రోణులు, కర్ణుడు యుద్ధంలో చంపబడ్డారని తెలుసుకొని నా పుత్రులు ఏం చేశారు ? నా పుత్రులు యుద్ధంలో ఎవరిని సేనాపతిగా చేసినా, వారిని అచిరకాలంలోనే పాండవులు చంపేస్తున్నారు. మీరందరు చూస్తుండగానే, యుద్ధంలో అర్జునుడు భీష్ముని పడగొట్టాడు. అట్లే అందరి సమక్షంలోనే ద్రోణాచార్యుడు చంపబడ్డాడు. అలాగే మీరందరూ చూస్తుండగానే, అర్జునుని చేతిలో కర్ణుడు మరణించాడు. దుర్యోధనుని అపరాధం వలన ప్రజానాశం జరుగుతుందని మహానుభావు డగు విదురుడు ముందే నాకు చెప్పాడు. చూడటానికి సమర్థులైయుండి కూడా, కొంతమంది మూఢులు బాగుగా చూడలేరు. మూఢుడనైన నా విషయంలో అలాగే జరిగింది. దూరదృష్టి గల ధర్మాత్ముడగు విదురుడు ఏమి చెప్పాడో అదే జరిగింది. సత్యవాది మాటలు నిజమయ్యాయి. దైవవశాన నాబుద్ధి మందగించి, విదురుని మాటలను వినలేకపోయాను.

సంజయా ! ఆ అవినయ ఫలితం ఏమిటో మళ్లీ చెప్పు. కర్ణుడు చంపబడితే సేనాధ్యక్షస్థానంలో ఎవరున్నారు? అర్జునుని, శ్రీకృష్ణుని ఎవరు ఎదుర్కొన్నారు ? యుద్ధరంగంలో యుద్ధం చేయాలనుకొన్న మద్రరాజుకు కుడి, ఎడమ, వెనుక భాగాలలో రక్షకులు ఎవరు ? సంజయా! మీరందరు అక్కడ ఉంటుండగానే మద్రరాజు, నా పుత్రుడు దుర్యోధనుడు పాండవులచే ఎలా చంపబడ్డారు ? భరతవంశ వినాశనాన్ని అంతా ఉన్నది ఉన్నట్లు చెప్పు. యుద్ధంలో నా కొడుకు దుర్యోధనుడు ఎలా చంపబడ్డాడో కూడా చెప్పు. సమస్త పంచాలురు సేనతో సహా ఎట్లా చంపబడ్డారు? ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ద్రౌపది అయిదుగురు పుత్రులు ఎట్లా చనిపోయారు ? పాండవులు, శ్రీకృష్ణుడు సాత్యకి, కృపుడు, కృతవర్మ, అశ్వత్థామ యుద్ధంలో ఎట్లా బ్రతికి బయటపడ్డారు ? యుద్ధం ఏ విధంగా ఎలా జరిగిందో అంతా వినదలచుకొన్నాను. సంజయా! నీవే చెప్ప సమర్థుడవు."

3. కౌరవసైన్య పలాయనము.

సంజయుడు చెపుతున్నాడు. "రాజా! కౌరవ పాండవుల పరస్పర సంఘర్షణంవల్ల కల్గిన వినాశం సావధానంగా విను. అర్జునుని చేతిలో కర్ణుడు చనిపోతే మీ సైన్యం చెల్లాచెదరయింది. ఎన్నోసార్లు వెనుకకు మళ్లించబడింది. ఎంతో మంది వీరుల వినాశం జరుగుతోంది. అర్జునుడు సింహనాదం చేశాడు. దానిని విని నీ పుత్రు లందరు ఎంతో

భయపడ్డారు. సైన్యాన్ని సంఘటితం చేయటానికి గాని, పరాక్రమించటానికి గాని ఎవరూ ఉత్సాహం చూపలేదు. అర్జునుని చేతిలో ద్వీపంవంటి కర్ణుడు చనిపోతే, బాణాలచే గాయపడిన సైన్యం చెల్లాచెదరయింది. అనాథులై రక్షకుని కోరే మీవారి పరిస్థితి, సింహం బారినపడిన లేళ్ళవలె, కొమ్ములు విరిగిన ఎడ్లవలె, కోరలు పీకిన సర్పాలవలె అయింది. సాయంకాలం అర్జునుని చేతిలో పరాజితులమైన మేము శిబిరాలకు తిరిగివచ్చాం. మన సైన్యంలోని ఎంతోమంది వీరులు మరణించారు. గాయపడ్డారు. నీ పుత్రు లందరు అచ్చటినుండి పారిపోయారు. వారి కవచాలు ధ్వంసమయ్యాయి. చైతన్యం నశించి వారికి దిక్కు తోచలేదు. వారందరు పరస్పరం కొట్టుకొంటూ, భయంతో దిక్కుతోచక "నన్నే అర్జునుడు వెంటాడుతున్నాడు. భీమసేనుడు వెంటాడుతున్నా"డని అనుకొంటూ ఉత్సాహం కోల్పోయి క్రింద పడిపోయారు. కొందరు మహారథులు గుఱ్ఱాలను, కొందరు ఏనుగులను, మరికొందరు రథాలనెక్కి, పదాతిసైన్యాన్ని వదలి భయంతో పారిపోయారు. పరుగులు తీసే ఏనుగులు రథాలను భగ్నం చేశాయి. మహారథులు అశ్వారూఢులను, అశ్వసమూహాలు పదాతి సైన్యాలను గాయపరిచాయి. పాములూ, దొంగలతో నిండిన అడవిలో సహచరులు తప్పిపోతే, మిగిలినవారికి దిక్కుతోచనట్లు, కర్ణుడు చనిపోతే నీవాళ్ళ పరిస్థితి అలా అయింది. భయంతో లోకం అంతా అర్జునమయంగా చూస్తున్నారు. భీమసేనుని, భయంతో పారిపోతున్న సైన్యాన్ని చూసి, దుర్యోధనుడు హాహాకారాలు చేస్తూ తన సారథితో ఇలా అన్నాడు. "ధనుర్ధారియై సైన్యం వెనుక భాగంలో యుద్ధం చేసే నన్ను అర్జునుడు దాటి వెళ్ళలేడు. కనుక వేగంగా గుఱ్ఱాలను ముందుకు తోలు. యుద్ధం చేసే నన్ను దాటి ముందుకు వెళ్లటానికి అర్జునుడు సాహసించడు. నేడు శ్రీకృష్ణునితో సహా అర్జునుని, భీమసేనుని, మిగిలిన శత్రువులనూ చంపి కర్ణుని చావుకు ఋణం తీర్చుకొంటాను."

దుర్యోధనుని వీరోచిత వచనాలను విని రథసారథి సువర్ణ భూషితాలయిన అశ్వాలను ముందు నడిపించాడు. గజ, అశ్వ, రథ హీనులైన ఇరవై అయిదువేల పదాతి సైన్యం మెల్లమెల్లగా పాండవులను ఆక్రమించింది. భీమసేనుడు, ధృష్టద్యుమ్నుడు చతురంగబలాలతో వారిని చెల్లాచెదరు చేసి గాయపరిచారు. సైనికు లందరు భీమసేన ధృష్టద్యుమ్నులను ఎదుర్కొన్నారు. సైనికులు తమను ఎదుర్కోవడం చూసి, భీమసేనుడు కోపగించి, రథం నుండి దిగి, గదను పట్టి వారితో తలపడ్డాడు. ధర్మయుద్ధం కోరే భీమసేనుడు, రథం మీద ఉంటూ పదాతులతో యుద్ధం చేయటం తగదని తలచి, బాహుబలం ఆశ్రయించి, యుద్ధం చేశాడు. దండపాణి అయిన యమధర్మరాజువలె,

పెద్ద గదను చేతబూని శత్రుసంహారం చేశాడు. తమ ప్రాణాలను, బంధువులను లెక్కచేయని పదాతి సైన్యం, మిడతలు అగ్నిని వలె భీముని చుట్టుముట్టింది. సైనికులు భీమసేనునితో తలపడి, యమధర్మరాజును చూచిన ప్రాణులవలె ఆర్తనాదాలు చేశారు. భీమసేనుడు డేగవలె యుద్ధరంగంలో తిరుగుతూ, ఖడ్గంతో, గదతో ఇరవై అయిదువేల మంది సైనికులను చంపాడు. భీముడు పదాతిసైన్యాన్ని చంపి, మళ్లీ ధృష్టద్యుమ్నుని ముందుంచుకొని యుద్ధానికి బయలుదేరాడు. అర్జునుడు రథికసేనను ఆక్రమించాడు. నకుల సహదేవులు, సాత్యకి దుర్యోధనుని సేనలను చంపుతూ, శకునిమీద విరుచుకుపడ్డారు. వారంతా శకుని రౌతులను వాడియైన బాణాలతో గాయపరచి, వారిని వెంటాడారు. వారి మధ్య ఘోర యుద్ధం జరిగింది. తరువాత అర్జునుడు త్రిభువన విఖ్యాతమైన గాండీవాన్ని ధ్వనిస్తూ, మీ రథిక సైన్యంలోకి ప్రవేశించాడు. కృష్ణుడు సారథియై, శ్వేతాశ్వాలతో సంధింపబడిన రథాన్ని, యోధ్ద అయిన అర్జునునీ చూసి మీ సేన భయంతో పారిపోయింది. రథాశ్వాలు లేకుండా, బాణాలతో వారింపబడుతున్న ఇరవై అయిదువేల పదాతి సైనికులు అర్జునుని ముట్టడించారు. ఆ పదాతి సైన్యాన్ని చంపి, వెంటనే ధృష్టద్యుమ్నుడు, భీముని ముందిడుకొని అచ్చట ప్రత్యక్షమయ్యాడు. ధృష్టద్యుమ్నుడు గొప్ప ధనుర్ధరుడు, మహాయశస్వి, శత్రుగణాన్ని నాశనం చేసేవాడు. పావురం రంగు అశ్వాలూ, కోవిదార వృక్ష చిహ్న ధ్వజమూ కల రథంపై ధృష్టద్యుమ్నుని చూసి, నీ సైనికులు భయంతో పారిపోయారు. సాత్యకితో కూడి నకుల సహదేవులు, శీఘ్రంగా అస్త్రాలను ప్రయోగించగల శకునిని వెంబడిస్తూ కనబడ్డారు. చేకితానుడు, శిఖండి, ద్రౌపది పుత్రులు, మీ పెద్ద సైన్యాన్ని సంహరించి, శంఖనాదం చేశారు. యుద్ధం నుండి పరాఙ్ముఖులై పారిపోయే మీ సైనికులను పాండవవీరులు తరిమికొట్టారు. మీ పుత్రుని మిగులు సైన్యం ఎదురుపడితే, అర్జునుడు వారిని చూసి, కోపగించాడు. పిమ్మట అర్జునుడు బాణాలతో వారిని ఆక్రమించాడు. ఆ సమయంలో పైకెగసిన ధూళితో ఏమీ కనబడలేదు. అంతా తమోమయం అయింది. భూమండల మంతా బాణాలతో కప్పబడింది. మీ సైనికులు భయంతో పారిపోయారు. సైన్యం పారిపోతుంటే దుర్యోధనుడు శత్రుపక్ష, స్వపక్షసేనలను రెంటినీ ఆక్రమించాడు. దుర్యోధనుడు పాండవులను యుద్ధానికి ఆహ్వానించాడు. పాండవ వీరులు కోపగించి, గర్జించే దుర్యోధనుని మాటిమాటికి బాధిస్తూ, వివిధ శస్త్రాలను ప్రయోగిస్తూ ముట్టడించారు. దుర్యోధనుడు కూడా తడబాటు పడకుండా, బాణాలతో శత్రువులను ఎదుర్కొన్నాడు. అచ్చట తమపుత్రుని అద్భుత పరాక్రమాన్ని మేము తిలకించాం. పాండవు లందరు దుర్యోధనుని అతిక్రమించ లేకపోయారు.

దుర్యోధనుడు, గాయపడిన తన సైన్యం ఎక్కువ దూరం వెళ్లిపోలేదని చూసి, నిశ్చయించుకొన్నాడు. యుద్ధం చేయాలని నిశ్చయించుకొన్న దుర్యోధనుడు తన సైన్యాన్ని ఉత్సాహపరుస్తూ ఇలా అన్నాడు. "పాండవులు మిమ్మల్ని చంపలేని సురక్షిత ప్రదేశం ఈ భూమిమీద కాని పర్వతాల్లో కాని కన్పించటం లేదు. మీరు పారిపోవడం వలన లాభమేమిటి ? పాండవుల బలం చాలా తక్కువ. కృష్ణార్జునులు గాయపడ్డారు. మనమందరం ఇచ్చట కలిసి నిలిస్తే, మన విజయం తథ్యం. మీరు వేరుపడి పారిపోతే, పాండవులు మిమ్ము వెంటాడి చంపుతారు. అంతకంటె రణరంగంలో చావడం మంచిది. క్షత్రియ ధర్మాన్ని అనుసరించి, వీరులకు యుద్ధంలో మరణమే సుఖప్రదం. ఇక్కడ చచ్చేవాడికి దుఃఖం ఉండదు. మరణానంతరం అనంత సుఖాన్ని పొందుతాడు. ఇక్కడకు వచ్చిన వీరు లందరూ వినండి. పారిపోతే శత్రువైన భీమసేనుని వశమవుతారు. మీ పెద్దవారు ఆచరించిన ధర్మాన్ని మీరు విడవటం తగదు. యుద్ధాన్ని విడిచి, క్షత్రియుడు పారిపోవడం కంటె పాపం వేరొకటి లేదు. స్వర్గాన్ని పొందటానికి యుద్ధధర్మాన్ని మించిన మార్గంలేదు. ఎంతోకాలంగా ఆచరించిన పుణ్యకర్మల వలన పొందే స్వర్గాన్ని, వీరుడు యుద్ధం వలన వెంటనే పొందుతాడు." దుర్యోధనుని మాటలు విని, వీరులందరు పాండవులతో తలపడటానికి తిరిగి వచ్చారు. పరాజయాన్ని సహించనివారు యుద్ధం చేయాలని నిశ్చయించారు. వెంటనే కౌరవపాండవుల మధ్య దేవాసురయుద్ధంవలె, భీషణ సంగ్రామం ప్రారంభమయింది. మహారాజా ! నీ కొడుకు దుర్యోధనుడు తన సర్వ సైన్యంతో యుధిష్ఠిరాది పాండవులను ముట్టడించాడు."

4. కృపాచార్యుని మాటలు.

సంజయుడు చెపుతున్నాడు. "మహారాజా ! యుద్ధభూమి శ్మశానాన్ని తలపిస్తూ భయంకరంగా కనబడుతోంది. వేలకొలది వీరులు మట్టిలో కలిసిపోయారు. యుద్ధరంగం చూసి, దుర్యోధనుడు శోకంలో మునిగిపోయి యుద్ధ విముఖ డయ్యాడు. అర్జునుని పరాక్రమాన్ని చూసి, సైన్యం ఉద్వేగానికి లోనై విచారంలో మునిగి ఆర్తనాదాలు చేస్తోంది. ఇట్టి దయనీయ స్థితిని చూసి వృద్ధుడూ, సచ్ఛీలుడూ అయిన కృపాచార్యుడు దయతో దుర్యోధనుని సమీపించి, ఇలా అన్నాడు.

"మహారాజా! నేను చెప్పేది శ్రద్ధగా విను. నీకిష్టమైతే ఆచరించు. క్షత్రియులకు యుద్ధధర్మాన్ని మించిన ధర్మంలేదు. కనుక వారు యుద్ధమార్గాన్ని ఆశ్రయిస్తారు.

క్షత్రియధర్మాన్ని పాటించేవాడు పుత్రుడు, సోదరుడు, తండ్రి, మేనల్లుడు, మేనమామ, బంధుజనం, ఇలా తన వాళ్ళందరితో యుద్ధం చేయవలసి వస్తుంది. యుద్ధంలో శత్రువును చంపడం, లేదా తాను చావడం ఉత్తమ ధర్మం. పారిపోవడం అధర్మం. కనుక ఈ పరమార్థాన్ని తెలుసుకొని క్షత్రియులు జీవనం సాగించాలి. అందుచేత ఇపుడు కొన్ని హితవచనాలు చెపుతాను. భీష్మ, ద్రోణ, కర్ణ, జయద్రథులు, నీ సోదరులు, నీ పుత్రుడు లక్ష్మణుడు యుద్ధంలో మరణించారు. ఇక మన పక్షాన మనల్ని చేరటానికి ఎవరు మిగిలారు ? ఎవరిపై యుద్ధభారముంచి రాజ్యాన్ని పొందాలనుకున్నామో వారంతా శరీరం విడిచి బ్రహ్మవేత్తల గతిని పొందారు. మహారథు లందరూ పోవడంతో మనం నిరాశ్రయులమయ్యాం. ఎంతోమంది రాజులను పోగొట్టుకొని దయనీయ స్థితిని పొందాం. అందరూ బ్రతికుండగానే అర్జునుడు పరాజితుడు కాలేదు. శ్రీకృష్ణుడు రక్షకుడుగా ఉండగా అర్జునుడు దేవతలకు కూడా దుర్జయుడు. ఇంద్రధనుస్సు వంటి కాంతిగల్గి, ఇంద్రధ్వజం వలె ఎత్తయిన అర్జునుని వానర ధ్వజాన్ని చూసి, మన మహాసైన్యం భయంతో కంపించిపోయింది. భీముని సింహనాదమూ, పాంచజన్య శంఖధ్వనీ, గాండీవ ధనుష్టంకారమూ – వీటిచే మన హృదయాలు సమ్మోహాన్ని పొందుతున్నాయి. ప్రకాశించే మహావిద్యుత్తు నయనకాంతిని అపహరించినట్లు, అలాత చక్రం తిరుగుతున్నట్లు అర్జునుని గాండీవం కన్పిస్తోంది. అర్జునుని చేతిలో ఇటునటు తిరిగే బంగారు గాండీవధనుస్సు, దట్టమైన మేఘాలలో విద్యుల్లతవలె, అన్ని దిక్కులా కన్పిస్తోంది. రాజా! వసంతంలో అడవిని అగ్ని దహించినట్లు, నీ బలాన్ని అస్త్రవేత్త అయిన అర్జునుడు దహించి వేశాడు. చొచ్చుకొని వస్తున్న మహేంద్రుని వంటి అర్జునుని చూస్తే, నీ సైనికులకు నాలుగుకోరలున్న ఏనుగు అనిపించింది. ఏనుగు తామరకొలను కలచివేస్తున్నట్లు, అర్జునుడు నీ సేననూ, రాజులనూ, భయపెట్టాడు. సింహం లేళ్ల సమూహం మీద పడి భయపెట్టినట్లు, సేనలమీద పడి అర్జునుడు ధనుష్టంకారంతోనే భయపెడుతున్నట్లు మేము చూశాం.

లోకాలన్నిటా ప్రశస్తికెక్కిన ధనుర్ధరులూ, విలుకాండ్రలో శ్రేష్ఠులూ అయిన కృష్ణార్జునులు కవచాలు ధరించి, జనంలో సంచరించారు. ఒకరినొకరు చంపుకొంటూ, భయంకరమైన యుద్ధం మొదలయి నేటికి పదిహేడు రోజులు అయింది. అర్జునునిచే నీ సేన చెల్లాచెదరయింది. అర్జునుడు నీ సైన్యాన్ని కంపింపజేశాడు. అర్జునుని బాణాలకు జయద్రథుడు లక్ష్యం అవుతుంటే ఆ సమయంలో కర్ణుడు ఎక్కడ ? సహచరులతో కూడిన ద్రోణుడు ఎక్కడ? నేను ఎక్కడున్నాను? మీరెక్కడ ? కృతవర్మ ఎక్కడకు వెళ్ళాడు ? నీ సోదరుడు దుఃశ్శాసనుడు సోదరులతో కూడా ఏమయ్యాడు ? నీ సంబంధీకులు,

సోదరులు, సహాయకులు మాత్సర్యయు లందరిని ఓడించి, అర్జునుడు అందరూ చూస్తూండగానే, సమస్తమూ ఆక్రమించి జయద్రథుని చంపాడు. ఇకమనకు ఎవరు మిగిలారు ? అర్జునుని జయించే పురుషు డిక్కడ ఎవడున్నాడు ? అతని దగ్గర రకరకాల దివ్యాస్త్రాలున్నాయి. గాండీవధనుష్టంకారం మన ధైర్యాన్ని అపహరిస్తోంది. నీ సేన వ్యాకులత చెందింది. మన సేనాపతి చనిపోయాడు. ఇట్టి పరిస్థితిలో, ఎండుగడ్డిలో జ్వలించే అగ్నివలె, అర్జునుడు మన సేనమధ్యలో విహరిస్తాడు. సభామధ్యంలో భీముడు ఏమి పలికాడో, దానిని సఫలం చేసి చూపించాడు. ఇంకా చేస్తాడు.

కర్ణుడు యుద్ధంలో ప్రముఖుడుగా ఉంటూండగా పాండవుల రక్షణలో ఉన్న సేనను అర్జునుడు రక్షించాడు. అందుచేత కర్ణుడు ఏమీ చేయలేకపోయాడు. సత్పురుషులైన పాండవుల యెడ, మీరు నిష్కారణంగా ఎన్నో అకృత్యాలు ఆచరించారు. దానికి ఫలమే ఇది. ఆత్మరక్షణకోసం, ప్రయత్న పూర్వకంగా వీరుల నందరిని ఒక్క త్రాటిపైకి తీసుకొనివచ్చావు. కాని ఇప్పుడు నీ బ్రతుకు సంశయంలో పడింది. దుర్యోధనా! సమస్త సుఖాలను అనుభవించడానికి శరీరమే సాధనం. అదిపోతే దాని నాశ్రయించినవన్నీ పోతాయి. కనుక నిన్ను నీవు రక్షించుకో. శత్రువులకంటె మనబలం తగ్గినా, లేక వారితో సమానమయినా వారితో సంధి చేసుకోవాలి. శత్రువులకంటె మన బలం పెరిగినప్పుడే యుద్ధం చేయాలని బృహస్పతి మతం. ఇప్పుడు మనం పాండవులకంటె శక్తి హీనులం. కనుక పాండవులతో సంధి చేసుకోవడం శ్రేయస్కరమని నాకు తోస్తోంది. తనశ్రేయస్సును పట్టించుకోక, శ్రేయస్సును కోరే వారిని అవమానించేవాడు తొందరలో రాజ్యభ్రష్టుడు అవుతాడు. శ్రేయస్సునూ పొందలేడు. రాజా! రాజు దగ్గర తలవంచి మనం రాజ్యాన్ని పొందినట్లైతే అదే శ్రేయస్కరం కాగలదు. మూర్ఖంగా పరాభావాన్ని పొందేవాడు శ్రేయస్సును పొందలేడు. యుధిష్ఠిరుడు దయాస్వభావుడు. ధృతరాష్ట్రుడు, శ్రీకృష్ణుడు చెప్పితే అతడు నీకు రాజ్యాభిషేకం చేస్తాడు. అపరాజితులైన యుధిష్ఠిరార్జున భీమసేనులు తప్పక శ్రీకృష్ణుని మాట వింటారు. ధృతరాష్ట్రుని మాటలను శ్రీకృష్ణుడు జవదాటడు. కృష్ణుని మాటలను యుధిష్ఠిరుడు జవదాటడని నే ననుకొంటున్నాను. పాండవులతో సంధి చేసుకోవటమే నీకు క్షేమమని తలుస్తున్నాను. వారితో యుద్ధం మాత్రం కాదు. ఏదో భయంతోనో, పిరికితనంతోనో ఈ మాటలు చెప్పట్లేదు. నీ హితాన్ని కోరి చెపుతున్నాను. ప్రాణం పోయే దశలో నామాటలను గుర్తు చేసుకొంటావు." ఈ విధంగా కృపాచార్యుడు విలపిస్తూ, దీర్ఘనిశ్వాసాలు విడుస్తూ మోహంతో శోకించాడు.

5. దుర్యోధనుని నిశ్చయము.

"రాజా! కృపాచార్యుడు ఇలా చెపితే దుర్యోధనుడు వేడిగా, దీర్ఘంగా నిట్టూర్చి ఊరకున్నాడు. కొద్దిసేపు ఆలోచించి దుర్యోధనుడు కృపాచార్యునితో ఇలా చెప్పాడు. "స్నేహితునిగా మీరు చెప్పవలసినదంతా చెప్పారు. ప్రాణాలను సయితం లెక్కచేయక, యుద్ధం చేస్తూ చేయవలసిన దంతా చేశారు. మీరు శత్రుసేనలలోనికి చొచ్చుకొనిపోయి, మహారథులయిన పాండవులతో యుద్ధం చేయటం అందరూ చూశారు. చనిపోయే రోగికి ఔషధం రుచించనట్లు, మంచిమనసుతో మీరు నాకు చెప్పిన మాటలు నన్ను తృప్తి పరచటం లేదు. యుధిష్ఠిరుడు జూదంలో మాచే జయింపబడ్డాడు. రాజ్యం నుండి భ్రష్టుడు గావింపబడ్డాడు. మామీద ఎట్లా విశ్వాసం ఉంటుంది ? మా మాటలను ఎట్లా నమ్ముతాడు ? పాండవహితం కోరే శ్రీకృష్ణుడు దూతగా నాదగ్గరకు వస్తే నేనతనిని మోసగించాను. నేను ముందువెనుకలు ఆలోచించక ఆ పనిచేశాను. ఇప్పుడు నామాట ఎలా అంగీకరిస్తాడు ? సభామధ్యానికి బలాత్కారంగా కొనిరాబడిన ద్రౌపదివిలాపాన్ని, మనం పాండవుల రాజ్యాన్ని అపహరించటాన్ని కృష్ణుడు సహించడు. ప్రభూ! కృష్ణార్జునులు ఇద్దరు అయినా, వారిది ఒకే ప్రాణం. ఒకరినొకరు ఆశ్రయించిఉన్నారు. పూర్వం నేను విన్నది ఇపుడు ప్రత్యక్షంగా చూస్తున్నాను. మేనల్లుడు చంపబడినాడని విని, శ్రీకృష్ణుడు చాలా కష్టం మీద నిద్రిస్తున్నాడు. అపరాధం చేసిన మనల్ని అతడెలా క్షమిస్తాడు ? అభిమన్యు వధచే అర్జునుడు కూడా శాంతంగా లేడు. మనం ప్రార్థించినా, నా హితంకొఱకు ఎట్లా ప్రయత్నం చేయగలడు ?

పాండవ మధ్యముడైన భీమసేనుడు మహాబలవంతుడు. అతడు భయంకరమైన ప్రతిజ్ఞ చేశాడు. అనునయించినా అతడు తలవంచడు. (విరుగుతాడే కాని వంగడు). నకుల సహదేవులు సోదరులిద్దరూ అస్త్రకవచాలను ధరించి, నాతో వైరం పెంచుకొని, యమునివలె భయంకరంగా ఉన్నారు. విప్రోత్తమా ! ధృష్టద్యుమ్నుడూ, శిఖండి ఇద్దరూ నాతో శత్రుత్వం పెంచుకొన్నవారు. వారెలా నా హితానికి పాటు పడతారు? ఏకవస్త్ర, రజస్వల అయిన ద్రౌపదివి, దుశ్శాసనుడు అందరూ చూస్తుండగానే సభలోకి ఈడ్చుకు వచ్చి, వివస్త్రను గావించాడు. పాండవులు ఇదంతా స్మరిస్తూనే ఉన్నారు. కనుక వారిని యుద్ధంనుండి మరల్చటం శక్యంకాదు. ద్రౌపదికి మనం కష్టం కల్గించినప్పటినుండి ఆమె మన వినాశాన్ని కోరుతూ, ప్రతీకారం తీర్చుకొనేంతవరకు వ్రతం పూని, నేలమీద శయనిస్తోంది. తనభర్తల అభీష్టసిద్ధి కోసం ద్రౌపది ఉగ్రతపస్సు చేస్తోంది. శ్రీకృష్ణుని

సోదరి సుభద్ర మానాభిమానాలను విడిచి ద్రౌపదికి సేవ చేస్తోంది. ఇలా శత్రుత్వం పెరుగుతూనే ఉంది కాని ఇది ఏవిధంగానూ చల్లారదు. అభిమన్యు వధవలన క్రుద్ధులైన పాండవులతో నేను ఎలా సంధి చేసుకోగలను? సమస్త భూమండలాన్నీ పాలించిన నేను, ఇప్పుడు పాండవుల అనుగ్రహంతో రాజ్యాన్ని ఎలా అనుభవించగలను ? రాజులందరిపై సూర్యునివలె ప్రకాశించిన నేను, దాసుని వలె ఎలా యుధిష్ఠిరుని అనుసరించగలను ? స్వయంగా ఎన్నో భోగాల్ని అనుభవించి, ఎంతోమందికి ధనధాన్యాల్ని దానం చేసిన నేను, దీనులతో దీనంగా ఎలా జీవించగలను ?

మీరు పలికిన హితవచనాలను నేను తప్పుపట్టటం లేదు. కాని సంధి చేసుకొనటానికి తగిన కాలం కాదని తలుస్తున్నాను. యుద్ధం చేయటమే ఉచితమని భావిస్తున్నాను. ఇది మనకు యుద్ధం చేసే కాలం, కాని సంధి కాలం గాదు. తండ్రీ ! నేను ఎన్నో యజ్ఞాలను ఆచరించాను. ఎంతోమంది బ్రాహ్మణులకు దక్షిణలు ఇచ్చాను. కోరికలు తీరాయి. వేద పారాలు విన్నాను. శత్రువులను అణగద్రొక్కాను. సేవకు లందరూ బాగా పోషింపబడ్డారు. దీనజనం ఉద్ధరింపబడింది. ఇప్పుడు నేను పాండవులతో సంధికై ఇలా మాట్లాడలేను. శత్రురాజ్యాల్ని జయించాను. స్వరాజ్యాన్ని పాలించాను. ఎన్నో సుఖాల్ని అనుభవించాను. ధర్మార్థకామాల్ని సేవించాను. పితృ క్షత్ర ఋణాల్ని తీర్చుకొన్నాను. ఈ లోకంలో ఎవ్వడూ నిరంతరం సుఖంగా ఉండలేడు. ఇక రాజ్యం, యశస్సు స్థిరమెలా అవుతాయి? ఇహలోకంలో కీర్తిని ఆర్జించాలి. అది కేవలం యుద్ధంతోనే సాధ్యం. ఇంట్లో క్షత్రియుడు మరణించటం నిందింపదగినదే. **ఇంట్లో శయ్యామరణం క్షత్రియులకు అధర్మం.** యజ్ఞయాగాదుల నాచరించి, అరణ్యంలో లేక యుద్ధంలో తనువు చాలించిన క్షత్రియుడు మహత్వాన్ని పొందుతాడు. రోగగ్రస్తుడైన ముసలివాడు, చుట్టూ చేరి జ్ఞాతులు ఏడుస్తూ ఉంటే, వారిమధ్యలో చనిపోయినవాడు పురుషుడేకాదు. భోగభాగ్యాల్ని విడిచి ఉత్తమగతిని పొందినవారి గతినే, నేను యుద్ధం ద్వారా పొందుతాను.

శూరులు, సదాచార సంపన్నులు, యుద్ధం నుండి వెనుదిరగని వారు, సత్యమార్గాన్న వలంబించే ధీమంతులు, యజ్ఞయాగాలు చేసేవారు, శస్త్రావభృధంచేత పవిత్రులు. వీరందరు నిశ్చయంగా స్వర్గలోకాన్ని పొందుతారు. యుద్ధంలో వీరమరణం పొందినవారిని, అప్సరసలు సంతోషంగా చూస్తారు. పితృగణం వారిని దేవసభలో పూజింపబడుతున్నట్లు తిలకిస్తారు. వారు స్వర్గలోకంలో అప్సరసలతో కూడి ఆనందంగా ఉంటారు. దేవతలు, యుద్ధంలో వెనుదిరగని శూరులూ ఏమార్గంలో వెళ్లారో, మనం కూడా అలాగే భీష్మ, ద్రోణ, జయద్రథ,

కర్ణ, దుశ్శాసనులతో బాటు అదే మార్గాన్ని ఆశ్రయిద్దాం. ఎంతోమంది వీరులు నాకోసం యుద్ధంచేసి, బాణాలచే గాయపడి, రక్తసిక్తమై యుద్ధభూమిలో పడిఉన్నారు. ఉత్తమాస్త్రవేత్తలు, శాస్త్రోక్తంగా క్రతువులాచరించే శూరులు, యుద్ధంలో ప్రాణాలు విడిచేవారు, యథాన్యాయంగా ఇంద్రలోకాన్ని పొందారు. పూర్వులు అలా స్వయంగా వేసిన మార్గం, ఇపుడు సద్గతికి చేరా అనుకొనే రణవీరులు మహావేగంతో చేరుతూ ఉండటంవల్ల దుర్గమం అవుతోంది. కిటకిటలాడుతోంది. ఆ వీరులు నాకోసం ప్రాణత్యాగం చేశారు. వారిని స్మరిస్తూ, వారి ఋణాన్ని తీర్చుకొనటానికి ప్రయత్నించే నాకు, రాజ్యం మీద మనసు పోవటం లేదు. స్నేహితులను, సోదరులను, పితామహులను పోగొట్టుకొని, నా ప్రాణాలు రక్షించుకొంటే, లోకం తప్పక నన్ను నిందిస్తుంది. బంధుహీనుడనై ముఖ్యంగా మిత్రులు లేకుండా నేను యుధిష్ఠిరుని పాదాల మీదపడి, రాజ్యం సంపాదిస్తే అది ఎటువంటిదవుతుంది ? కనుక, ఇంతవరకు లోకవినాశాన్ని చేసిన నేను, యుద్ధం చేసి స్వర్గం పొందుతాను. మరో మార్గంలేదు." దుర్యోధనుని మాటలు విన్న క్షత్రియులు చాలా బాగున్నవని చెపుతూ, అతని మాటలను స్వాగతించారు. పరాజయశోకాన్ని వీడి, పరాక్రమం చూపటానికి సిద్ధపడి, యుద్ధం చేయటానికి నిశ్చయించుకొన్నారు. పిమ్మట కౌరవసేన యుద్ధాన్ని అభినందిస్తూ, తమ వాహనాలను విశ్రమింపజేసి, రెండు యోజనాల దాకా వెళ్లి నిలిచారు. హిమాలయం యొక్క పవిత్రమైన, శుభప్రదమైన, వృక్షరహిత శిఖర ప్రాంతంలో, రక్తవర్ణపు నీటితో కూడిన సరస్వతీ నదిని చేరి, వారంతా స్నాన జలపానాలు చేశారు. రాజా! కాలంచే ప్రేరేపింపబడిన క్షత్రియులందరూ మీ పుత్రుడు ఉత్సాహం కల్గిస్తే, మనస్సును దృఢం చేసుకొని, తిరిగి రణభూమికి బయలుదేరారు."

6. శల్య దుర్యోధన సంవాదము.

సంజయుడు చెపుతున్నాడు. "యుద్ధాన్ని అభినందించే క్షత్రియ వీరులంతా హిమాలయ పర్వత సానుప్రదేశానికి వచ్చి చేరుకొన్నారు. శల్యుడు, చిత్రసేనుడు, శకుని, అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ, సుషేణుడు, అరిష్టసేనుడు, ధృతసేనుడు, జయత్సేనుడు, వీరంతా అచ్చటే రాత్రంతా గడిపారు. యుద్ధంలో కర్ణుడు చనిపోతే, పాండవులకు భయపడిన మీ పుత్రులు, హిమాలయ పర్వత ప్రదేశంలో తప్ప మరెక్కడా శాంతిని పొందలేదు. యుద్ధానికి అన్ని ఏర్పాట్లు గావించుకున్న వీరులంతా, శల్యసమీపంలో దుర్యోధనుని యథావిధిగా సత్కరించి ఈ విధంగా పలికారు. "రాజా! నీవు ఒకరిని సేనాపతిని చేసి

శత్రువులతో యుద్ధంచెయ్యి, అతనిచేత సురక్షితులమై మేము శత్రువులను జయించగలం." అటుపిమ్మట దుర్యోధనుడు రథాన్నెక్కి అశ్వత్థామ దగ్గరకు వెళ్ళాడు.

అశ్వత్థామ రథికులలో శ్రేష్ఠుడు, యుద్ధానికి సంబంధించిన సమస్త విషయాల్ని తెలిసినవాడు. యుద్ధంలో శత్రువులకు యమునివంటివాడు. సుందరాంగుడు. కప్పబడిన శిరస్సు, శంఖం వంటి కంఠం కలవాడు. ప్రియంగా మాట్లాడుతాడు. వికసించిన పద్మపత్రాల వంటి నేత్రాలు, పెద్దపులివలె భయంకర ముఖమూ కలవాడు. మేరువు వలె ఉన్నతుడు. స్కంధ, నేత్ర, గమన, వచనాలలో శివుని వాహనమైన వృషభం వంటివాడు. బలిసి, దృఢమై విశాలమైన బాహువులు, విశాలమైన వక్షఃస్థలమూ గలవాడు. బల వేగాలలో గరుత్మంతునితో వాయువులతో, తేజస్సులో సూర్యునితో, బుద్ధిలో శుక్రాచార్యునితో, రూప, ముఖకాంతులలో చంద్రునితోను సమానుడు. అవయవసంధులు సువర్ణపాషాణ తుల్యాలు. ఊరు, కటి, జంఘలు బాగా గుండ్రంగా ఉన్నాయి. పాదాలు, వ్రేళ్లు, చూడముచ్చటగా ఉన్నాయి. సృష్టికర్త యత్నపూర్వకంగా, గుణాల్ని యోజన చేసి, అవయవ నిర్మాణం చేసినట్లున్నాయి. అశ్వత్థామ సర్వలక్షణ సంపన్నుడు, కుశలుడు, వేదనిధి. శత్రువులను వేగంగా జయించగల సమర్థుడు. శత్రువులకు అజేయుడు. పది అంగాలు, నాల్గు చరణాలతో కూడిన ధనుర్వేదం చక్కగా తెలిసినవాడు. సాంగవేదాలను ఇతిహాస పురాణాలనూ ఎరిగినవాడు. ఉగ్రతపస్సుతో శివుని ఆరాధించిన అయోనిజా డయిన ద్రోణాచార్యుని వలన అయోనిజయందు పుట్టిన అశ్వత్థామ కర్మలు నిరుపమానాలు. రూపం అద్వితీయం. సర్వవిద్యా పారంగతుడు, గుణాలకు సాగరం వంటివాడు. అనిందితుడు, అట్టి సర్వగుణోపేతుడైన అశ్వత్థామను చేరి దుర్యోధనుడు ఇలా అన్నాడు. "గురుపుత్రులైన మీరే మా అందరికి దిక్కు. మీ ఆదేశం ప్రకారం సేనాపతి కోసం ఎదురు చూస్తున్నాం. ఎవరి సారథ్యంలో మేమందరం కలిసి పాండవులను జయించగలమో అట్టి సేనాపతిని సూచించండి."

అశ్వత్థామ చెపుతున్నాడు. "కులం, రూపం, తేజస్సు, యశస్సు, సంపత్తితో కూడి సర్వగుణోపేతుడయిన శల్యుడు మనకు సేనాపతి అగుగాక. ఆత్మీయు లయిన మేనల్లుళ్లను విడిచి, మన పక్షం చేరిన శల్యుడు కృతజ్ఞుడు. గొప్ప సైన్యంతో, శల్యుడు రెండవ కుమారస్వామి వంటివాడు. రాజోత్తమా! దేవతలు దుర్జయుడైన స్కందుని సేనాపతిగా చేసుకొన్నట్లు, మనం శల్యుని సేనాపతిగా చేసుకొని శత్రువులను జయిస్తాం." అశ్వత్థామ ఇలా చెపితే, రాజులంతా శల్యుని చుట్టుముట్టి జయజయధ్వానాలు చేశారు. వారంతా

ఆవేశంతో యుద్ధానికి నిశ్చయించుకొన్నారు. దుర్యోధనుడు భూమి మీద నిలబడి చేతులు జోడించి, రథంపైనున్న భీష్మద్రోణతుల్యుడయిన శల్యునితో ఇలా అన్నాడు. "మిత్రమా! ఇతడు శత్రువా? స్నేహితుడా? అని విద్వాంసులు పరీక్ష చేసే సమయం మన మిత్రులందరికి వచ్చి పడింది. మీరు సేనాపతియై ముందుండి సైన్యాన్ని నడిపించండి. మీరు యుద్ధానికి వెళ్ళగానే మందబుద్ధులైన పాండవ పాంచాలురూ, మంత్రులూ అంతా నిశ్చేష్టు లయిపోతారు." దుర్యోధనుని మాటలు విన్న శల్యుడు, రాజుల సమక్షంలో దుర్యోధనునితో ఇలా అన్నాడు. "కురు రాజా! మీరు అనుకొన్న దానిని నేను చేస్తాను. నా ప్రాణ, రాజ్య, సంపదలన్నీ మీ హితం కోసమే." దుర్యోధనుడు అంటున్నాడు. "మాతులా! సాటిలేని నిన్ను సేనాపతిగా ఎన్నుకొంటున్నాను. స్కందుడు యుద్ధంలో దేవతలను వలె, మీరు మమ్మల్ని రక్షించండి. స్కందుడు దేవతలకు సేనాపతి అయినట్లు, మీరు సేనాపతిగా అభిషిక్తులై, ఇంద్రుడు రాక్షసులను వలె, మీరు శత్రువులను జయించండి."

7. శల్యుడు సైన్యాధిపతియగుట.

సంజయుడు చెపుతున్నాడు. "దుర్యోధనుని మాటలువిని, ప్రతాపవంతుడైన శల్యుడు అతనితో ఇట్లన్నాడు. "దుర్యోధనా! కృష్ణార్జునులను రథికులలో శ్రేష్ఠులని నీవు తలుస్తున్నావు. వారిద్దరూ, బాహుబలంలో నాతో సమానమైనవారు కారు. యుద్ధంలో దేవ, రాక్షస, మనుష్యులతో కూడిన భూమండలమంతా, నాతో తలపడటానికి సిద్ధమయినా, క్రుద్ధుడనై వారితో యుద్ధం చేయగలను, ఇక నాకు పాండవు లెంత ? యుద్ధంలో పాండవులనూ, ఎదురుపడిన సోమకులనూ జయిస్తాను. నేను నీకు తప్పక సేనాపతి నవుతాను. ఇందులో సందేహం లేదు. శత్రువులు దాటి వెళ్ళలేని వ్యూహాన్ని రచిస్తా. నిజం చెపుతున్నా. సందేహ పడనక్కర లేదు." శల్యుడు ఇలా చెప్పగానే, కష్టాలలో కూరుకుపోయిన దుర్యోధనుడు ఆలస్యం చేయక, యథావిధిగా శల్యుని సేనాధిపతిగా అభిషిక్తుని చేశాడు. రాజా! శల్యుని సేనాధిపతిని చేయగానే, మీ సైన్యం సింహనాదం చేసింది. మంగళవాద్యాలు మ్రోగాయి. మద్రదేశీయులూ, మహారథులు ఎంతో ఆనందపడుతూ శల్యుని స్తోత్రం చేశారు. "శల్యా! చిరంజీవియై ఎదురైన శత్రువులను జయించు. నీ భుజబల సహాయంతో, ధృతరాష్ట్ర పుత్రులు శత్రు సంహారం చేసి, సమస్త భూమండలాన్ని శాసించుగాక. మీరు యుద్ధంలో దేవ, రాక్షస, మానవులందరిని జయించగలరు. మర్త్య ధర్ములయిన సృంజయ, సోమకులు మీకెంత ?" ఈ విధంగా వీరులందరూ శల్యుని

ప్రశంసిస్తుంటే, అతడు సామాన్యులు పొందలేనంత ఆనందాన్ని పొందాడు.

శల్యుడు చెపుతున్నాడు. "రాజా! నేను ఈ రోజు పాండవులతో కూడా పంచాలు రందరిని యుద్ధంలో చంపేస్తాను. లేదా చంపబడి నేనే స్వర్గ లోకానికి పోతాను. యుద్ధభూమిలో నిర్భయంగా తిరుగాడే నన్ను లోకమంతా చూస్తుంది. పాండవు లందరూ, శ్రీకృష్ణుడూ, సాత్యకీ, పంచాల చేది దేశవీరులూ, ద్రౌపది పుత్రులూ, ధృష్టద్యుమ్నుడూ, శిఖండీ, ప్రభద్రకు లందరూ నా పరాక్రమాన్ని, ధనుర్బలాన్ని కనులారా చూస్తారు. పాండుపుత్రులు, చారణ సహిత సిద్ధగణమంతా, ఈ రోజు యుద్ధంలో అనాయాసంగా నేను చేయబోయే యుద్ధాన్ని, అస్త్ర పరాక్రమాన్ని, భుజబలాన్నీ చూస్తారు. చూసి పాండవ మహారథులు ప్రతీకారం చేయాలని కష్టపడతారు. రాజా! నేడు పాండవ సైన్యాన్ని యుద్ధభూమిలో నలుదిక్కులా పరుగెత్తిస్తా. నీ ప్రీతికోసం, ద్రోణభీష్మ కర్ణులను మించి, యుద్ధంచేస్తూ, రణభూమిలో విహరిస్తా."

సంజయుడు చెపుతున్నాడు. "శల్యుడు సేనాపతిగా అభిషిక్తుడు కావడంతో, కౌరవసైన్యంలో కర్ణుడు లేడనే బాధ కనిపించలేదు. సైనికులంతా సంతుష్టులై, శల్యునిచేతిలో పాండవులు చంపబడతారని అనుకొన్నారు. మీసైన్యమంతా ఎంతో ఉల్లాసంగా, ప్రసన్నచిత్తంతో ఆ రాత్రి నిద్రపోయింది. మీసేన యొక్క హర్షోద్రేకాన్ని గమనించి, యుధిష్ఠిరుడు క్షత్రియుల సమక్షంలో శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. "మాధవా! సర్వసైన్య పూజితుడైన శల్యుని దుర్యోధనుడు సేనాపతిగా చేశాడు. శ్రీకృష్ణా! మీరే మాకు నాయకులు, సంరక్షకులు, కనుక నేను చెప్పిన విషయాన్ని పర్యాలోచన జేసి, తదుపరి చేయదగిన దానిని చేయండి." అప్పుడు శ్రీకృష్ణుడు ఇట్లన్నాడు. "ఋతాయన పుత్రుడైన శల్యుని గూర్చి నాకు బాగా తెలుసు. అతడు పరాక్రమవంతుడు, తేజస్సంపన్నుడు, విశేషించి మహాత్ముడు, బుద్ధిశాలి, విచిత్రంగా యుద్ధం చేసేవాడు, నేర్పుతో అస్త్రశస్త్రాల్ని ప్రయోగిస్తాడు. యుద్ధంలో భీష్మద్రోణ కర్ణులతో సమానుడు శల్యుడు - ఇంకా చెప్పాలంటే వారిని మించిన పరాక్రమం గల వాడని నా అభిప్రాయం. ఎంత ఆలోచించినా, యుద్ధం చేస్తుంటే, శల్యునితో సమానమైన వీరుని నేను ఊహించలేకపోతున్నాను. శిఖండి, అర్జున, భీమ, సాత్యకులకంటె, ధృష్టద్యుమ్నుని కంటె మిక్కిలి బలశాలి శల్యుడు. సింహంలా, ఏనుగులా పరాక్రమించే మద్రరాజు, ప్రళయకాలంలో ప్రజలపై కోపించిన కాలునివలె, నిర్భయంగా రణరంగంలో విహరిస్తాడు. వ్యాఘ్రసదృశ పరాక్రమశాలియైన నీవు తప్ప యుద్ధంలో శల్యునికి ఎదురేగి పోరాడేవారు లేరు. దేవలోకంతో సహా, ఈ భూమండలంలో నీవు తప్ప యుద్ధంలో శల్యుని చంపేవాడే

లేడు. కనుక ప్రతిరోజూ యుద్ధంచేస్తూ, నీ సైన్యాన్ని నిర్వీర్యపరిచే శల్యుని, ఇంద్రుడు శంబరాసురుని వలె యుద్ధంలో చంపివేయి. శల్యుని చంపితే నిశ్చయంగా నీదే విజయం. కనుక నామాట విని, శల్యునిపై దండెత్తి, ఇంద్రుడు నముచిని వలె అతనిని చంపు. 'నామామ' అని దయ చూపకు. క్షత్రియధర్మాన్ని పాటించి శల్యుని చంపు. భీష్మద్రోణ కర్ణు లనే మహాసాగరాన్ని దాటి, ఇప్పుడు నీవు పరివారంతో కూడా, శల్యు డనే గోష్పాదంలో మునిగిపోకు. నీ తపోబలం, క్షాత్రబలం రెండింటినీ యుద్ధరంగంలో చూపించు. మహారథుడైన శల్యుని వధించు. "శ్రీకృష్ణుడిలా పలికి సాయంకాలం తనశిబిరానికి వెళ్ళాడు. శ్రీకృష్ణుడు వెళ్లిపోయాక, ధర్మపుత్రు డయిన యుధిష్ఠిరుడు తన సోదరులు, పాంచాలురు, సోమకులను సాగనంపి, ఆ రాత్రి అంకుశంలేని ఏనుగు వలె శయనించాడు. కర్ణుడు చంపబడ్డాడని, మిక్కిలి సంతోషంతో ఆ రాత్రి సుఖంగా నిద్రపోయారు."

8. వ్యూహ నిర్మాణము.

సంజయుడు చెపుతున్నాడు. "తెల్లవారగానే, దుర్యోధనుడు కవచాల్ని ధరించి, యుద్ధానికి సిద్ధం కమ్మని నీ సైనికులకు చెప్పాడు. రాజు అభిప్రాయం తెలుసుకొని, సైనికులు యుద్ధానికి సన్నద్ధమయ్యారు. యుద్ధభేరీలు మ్రోగాయి. యుద్ధానికి బయలుదేరిన సైనికులతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా ఉంది. యుద్ధంలో చావగా మిగిలిన సైన్యం, మృత్యువునే వెనుకకు మళ్లించి, బయలుదేరినట్లు కనిపించింది. మహారథులంతా శల్యుని సేనాపతిగా చేసుకొని, సైన్యాన్ని విభజించి, యుద్ధానికి సిద్ధమయ్యారు. మీ సైనికులు, కృపాచార్య, కృతవర్మ, అశ్వత్థామ, శల్య, శకునులు, మిగిలిన రాజులంతా దుర్యోధనుని కలసి సాదరంగా నియమం చేసుకొన్నారు. మనలో ఏ ఒక్కడూ, ఏ విధంగానూ, ఒంటరిగా పాండవులతో యుద్ధం చేయరాదు. యుద్ధం చేస్తున్న ఒక్కడినీ విడిచి పోరాదు. అలా చేసినట్లైతే పంచమహాపాతకాలు, ఉపపాతకాలు పొందుతాడు.

అశ్వత్థామ శత్రువులతో ఒంటరిగా యుద్ధం చేయరాదు.

మనం ఒకరినొకరిని రక్షించుకొంటూ, శత్రువులతో యుద్ధం చేయాలి. ఈ విధంగా నియమం పెట్టుకొని, శల్యుని సేనాపతిగా చేసుకొని శత్రువులపై విరుచుకుపడ్డారు. అదే విధంగా పాండవులు కూడా వ్యూహరచన చేసి కౌరవసేనను ఆక్రమించారు. రథాలు, ఏనుగులు వేగంగా ముందుకు కదిలాయి." ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు. "సంజయా ! ద్రోణ, భీష్మ, కర్ణుల వధవృత్తాంతాన్ని విన్నాను. శల్య, దుర్యోధనుల వధను వినిపించు."

సంజయుడు చెపుతున్నాడు. "యుద్ధంలో సైనికులు, ఏనుగులు, గుఱ్ఱాలు వధింపబడిన తీరు చెపుతాను స్థిమితంగా విను. యుద్ధంలో ద్రోణ, భీష్మ, కర్ణులు పడిపోయాక కూడా, శల్యుడు పాండవుల నందరిని వధిస్తాడని, నీ కొడుకులకు బలీయమైన ఆశ కలిగింది. అట్టి బలవత్తరమైన ఆశను పెట్టుకొని, ఓదార్పు పొందిన నీ పుత్రులు, యుద్ధంలో శల్యుని ఆశ్రయం పొంది, వారంతా తమకు తాము సనాథుల మని తలచారు. కర్ణుడు చంపబడటం వలన పాండవులు సింహనాదం చేశారు. అపుడు నీ కొడుకుల్ని మహాభయం ఆవహించింది. శల్యుడు యోధులను ఊరడించి, సమృద్ధమయిన సర్వతోభద్రమనే వ్యూహం రచించి, ధనుష్టంకారం చేస్తూ, రథారూఢుడై పాండవుల నాక్రమించాడు. శల్యుని రథసారథి దాని శోభను పెంచాడు. శల్యుడు మీ పుత్రుల భయాన్ని పోగొట్టుతూ యుద్ధానికి బయలుదేరాడు.

శల్యుడు వ్యూహానికి ముఖభాగంలో ఉన్నాడు. అతనితో మద్రదేశీయ వీరులు, దుర్జయులైన కర్ణపుత్రులు కూడా ఉన్నారు. వ్యూహం ఎడమ భాగంలో త్రిగర్త వీరులతో కూడి కృతవర్మ, దక్షిణ పార్శ్వ భాగంలో శకయవన సేనతో కూడి కృపాచార్యుడు, వెనుకభాగంలో కాంబోజ సైన్యంతో అశ్వత్థామ ఉన్నారు. వ్యూహం మధ్యభాగంలో కురువీర రక్షితుడై దుర్యోధనుడు, అశ్వసైన్యంతో శకుని ఉన్నారు. వారితో కూడా, ఉలూకుడు సర్వసైన్యంతో యుద్ధానికి ముందుకు సాగాడు. పాండవులు కూడా వ్యూహరచన చేసి, సేనను మూడు భాగాలుగా విభజించి, మీ సైన్యాన్ని ఆక్రమించారు. ధృష్టద్యుమ్నుడు, శిఖండి, సాత్యకి, ముగ్గురు, మూడుగా విభక్తమైన సైన్యాన్ని ముందుకు నడిపిస్తూ, శల్యుని సేనను ఆక్రమించారు. తన సైన్యంతో కూడిన యుధిష్ఠిరుడు, శల్యుని చంపే కోరికతో అతనిపై దండెత్తాడు. అర్జునుడు కృతవర్మను, సంశప్తక గణాన్ని వేగంగా ఆక్రమించాడు. భీమసేనుడు, సోమకులు శత్రుసంహారం చేయడానికి కృపాచార్యుని ముట్టడించారు. నకుల సహదేవులు, శకుని, ఉలూకులను ఎదుర్కొనటానికి సిద్ధపడ్డారు. ఈ విధంగా వివిధాయుధాలను ధరించి, మీ పదివేల మంది సైనికులు పాండవులను ఎదుర్కో సాగారు."

ధృతరాష్ట్రుడు అడుగుతున్నాడు. "సంజయా! భీష్మద్రోణకర్ణులు యుద్ధంలో చంపబడిన పిమ్మట యుద్ధరంగంలో స్వపరపక్షాలలో ఎంతెంత సేన మిగిలిఉన్నది?" సంజయుడు చెపుతున్నాడు. "భారతా ! మీ పక్షంలో పదకొండువేల రథాలు, పదివేల ఏడు వందలు ఏనుగులు, రెండు లక్షల గుఱ్ఱాలు, మూడుకోట్ల పదాతి సేన మిగిలింది. పాండవుల వద్ద ఆరువేల రథాలు, ఆరువేల ఏనుగులు, పదివేల గుఱ్ఱాలు, రెండుకోట్ల

పదాతిసేన మిగిలింది. రాజేంద్రా ! వీరే మళ్ళీ యుద్ధానికి ఉపక్రమించారు. ఇలా సేనా విభాగం చేసుకొని, శల్యుని సారథ్యంలో, మీ సైనికులు పాండవులపై దండెత్తారు. అట్లే పాండవులు, పాంచాలవీరులు అక్కడకు చేరుకొన్నారు. పిమ్మట మీవారికీ, ఇతరులకూ యుద్ధం మొదలయింది."

9. సంకుల యుద్ధము - కౌరవ సేన పలాయనము.

సంజయుడు చెపుతున్నాడు. "రాజేంద్రా! కౌరవులకు సృంజయులతో దేవాసుర సంగ్రామంవలె భయంకర యుద్ధం జరిగింది. పదాతిసైన్యం, రథ, గజ, అశ్వసైనికులు పరాక్రమం చూపిస్తూ ఒకరితోనొకరు తలపడ్డారు. వర్షాకాలంలో, ఆకాశంలో మేఘాల గంభీర గర్జనవలె, యుద్ధభూమిలో, భయంకరాకృతికల ఏనుగుల పరుగుల భీకరధ్వని వినబడుతోంది. మదించిన ఏనుగులు ఢీ కొట్టడంతో, ఎంతోమంది రధికులు రధాలతో సహా క్రిందపడ్డారు. ఎంతోమంది వీరులు ఇటూ అటూ పరుగులు తీశారు. రథికులు అశ్వసముదాయాన్ని, పాదరక్షకులనూ తమ బాణాలతో పరలోకానికి పంపారు. ఆశ్వికులు రణరంగంలో తిరుగుతూ, మహారథాలను అడ్డుకొని వానిపై, ప్రాస, శక్తి, ముష్టులతో కొట్టారు. ధనుర్ధరు లయిన పురుషులు కొందరు, ఒంటరిగానే చాలామంది మహారథికులను అడ్డుకొని యమలోకం పంపారు. మరికొందరు మహారథులు ఏనుగులను, శ్రేష్ఠ రథికులను అడ్డుకొని యుద్ధం చేసే, పారిపోయే రథికులను చంపారు. ఎన్నో ఏనుగులు, తమపై బాణవర్షం కురిపించే రథికుని నాల్గువైపులా చుట్టుముట్టి చంపాయి. గజసైన్యం గజసైన్యంతో, రథికులు రథికులతో తలపడి శక్తి, తోమర, శరాలతో యమలోకానికి పంపారు. హిమాలయాల సానుప్రదేశాలలోని హంసలు, నీటి కోసం భూమిమీదకి ఎగురుకొంటూ వేగంగా వెళ్ళినట్లు, రణభూమిలో గుట్టాలు అంతటా అటునిటు పరుగెత్తాయి. రాజా! గుట్టపుడెక్కలు గ్రుచ్చుకొన్న భూమి నఖక్షతాలతో కూడిన స్త్రీవలె శోభించింది. గుట్టపుడెక్కల శబ్దాలచే, రథచక్రాల ధ్వనిచే, పదాతి సైన్యం కోలాహలంచే, ఏనుగుల ఘీంకారాలచే, యుద్ధభేరుల భీకర శబ్దాలచే, శంఖధ్వనులచే ప్రతిధ్వనిస్తున్న భూమి పిడుగులు పడే శబ్దాలను తలపిస్తోంది. ఏనుగు తొండాలవలె, ఎంతోమంది వీరుల బాహువులు భూమ్మీద తెగి పడి, ఇటు అటూ పొర్లాడుతూ భయంకరంగా ఉన్నాయి. నేలమీద తెగిపడే శిరస్సుల ధ్వని, తాటిచెట్లనుండి జారిపడే పండ్ల శబ్దాన్ని తలపిస్తోంది. రక్తంతో తడిసి తెగిపడిన తలలతో, భూమి బంగారు పద్మాలతో కూడినట్లు అనిపిస్తోంది. విప్పారిన నేత్రాలతో, తెగిపడిన తలలతో, భూమి పద్మాలతో కప్పబడినట్లుంది. చందనలేపనం కల్గి, అమూల్యాలైన కేయూరాలతో కూడి,

తెగి, నేలపై పడిన బాహువులు ఇంద్రధ్వజాల వలె ఉన్నాయి. వానితో రణభూమి భాసిస్తోంది. రణభూమి పుష్పించిన వనంవలె భాసిస్తోంది. రక్తసిక్తాలైన శరీరాలతో తిరుగాడే యోధులు, పుష్పించిన పలాశవృక్షాల వలె కనబడతున్నారు. శర తోమరాల దెబ్బలచే రణభూమిలో పడిన ఏనుగులు చెల్లాచెదరైన మేఘాలవలె ఉన్నాయి.

అప్పు డచ్చట పరలోకం వైపు ప్రవహించే నది ఏర్పడింది. అందులో రక్తమే జలం, రథాలే సుడులు, ధ్వజాలు వృక్షాలు, ఎముకలు రాళ్ళు రప్పలు, తెగిన భుజాలే మొసళ్ళు, ధనుస్సులు ప్రవాహం, ఏనుగులే పర్వతాలు, అశ్వాలే రాళ్ళు, మేదస్సు మజ్జయే నీటిబురద, ఛత్రాలు హంసలు, గదలు నావలు, కవచాలు తలపాగలు. వీనితో నది కప్పబడింది. పతాకాలే సుందరవృక్షాలు, చక్రాలే చక్రవాక పంక్తులు, త్రివేణువులే సర్పాలు. భయంకర నది శూరులకు హర్షాన్ని, భీరువులకు భయాన్ని కల్గిస్తోంది. కౌరవ సృంజయులతో అది నిండి ఉంది. ఈ విధంగా హద్దులు మీరి, భయంకర యుద్ధం జరుగుతూండగా, అర్జునుడు, భీముడు ఇరువురూ శత్రువులను అచేతనులను చేశారు. వారి దెబ్బలకు, మీ విశాలసేన మదించిన యువతివలె తెలివి తప్పింది. వారిద్దరు కౌరవసేనను మూర్ఛలో ముంచి, శంఖాలు పూరించి, సింహనాదం చేశారు. ఆ భీకరశబ్దాన్ని విని, ధృష్టద్యుమ్న శిఖండులు ధర్మరాజును ముందుంచుకొని శల్యునిపైకి దండెత్తారు. అక్కడ మేము భయంకరమై ఆశ్చర్యకరమైన విషయాన్ని గమనించాం. విడివిడిగా ఉన్న సైనిక దళాలన్నీ ఏకమై, శల్యునికి అండగా యుద్ధం చేశాయి. నకుల సహదేవులు అస్త్రాలు చేత బూని, జయేచ్ఛతో వేగంగా శల్యుని ఢీకొన్నారు. పాండవులు తమ బాణాలతో కౌరవ సేనను దెబ్బ తీస్తే మీసేన వెనుదిరిగింది. మీ పుత్రులు చూస్తూ ఉండగానే నలుదిక్కులకూ పారిపోయింది. కౌరవసేనలో అలజడి బయలుదేరింది. పారిపోయే మీ సేనను "నిలు నిలు" అనే పాండవుల కేకలు వినపడ్డాయి. మీ సైన్యం పాండవుల చేతిలో పరాజితమై పారిపోయింది."

10. సంకులయుద్ధము - ముగ్గురు కర్ణపుత్రులవధ

సంజయుడు చెపుతున్నాడు. "చెల్లాచెదరైన సైన్యాన్ని గమనించి, ప్రతాపశాలి శల్యుడు సారథితో, గుఱ్ఱాలను వేగంగా తోలమని చెప్పాడు. "శ్వేతచ్ఛత్రం ధరించి ఎదురుగా ధర్మరాజు నిలిచి ఉన్నాడు. అక్కడకు తొందరగా నన్ను తీసుకువెళ్ళు. యుద్ధంలో ఆ ధర్మజుడు ఈరోజు నాముందు నిలవలేడు." శల్యుడు ఈ విధంగా చెప్పగా, సారథి రథాన్ని యుధిష్ఠిరుని దగ్గరకు తీసుకువెళ్ళాడు. అంతలో పాండవుల విశాలసేన త్వరగా

అక్కడకు చేరింది. ఉప్పొంగే సముద్రాన్ని తీరం నిలుపు చేసినట్లు, శల్యుడు వారిని ఒంటరిగా కట్టడి చేశాడు. శల్యుని సమీపించగానే, పాండవసేన ముందుకు సాగలేకపోయింది. సమరంలో యుద్ధనాదం చేస్తున్న శల్యుని చూసి, మృత్యువును లెక్కచేయక, కౌరవసేన తిరిగి యుద్ధభూమికి మరలారు. కౌరవసేన విడివిడిగా వ్యూహరచన గావించి, యుద్ధభూమికి మరలిరావడంతో, వారిరువురి మధ్య భీకరయుద్ధం జరిగి, రక్తం ఏరులై పారింది.

నకులుడు కర్ణపుత్రు డయిన చిత్రసేనునిపై దండెత్తగా, వారిద్దరు పరస్పరం తలపడి, దక్షిణ ఉత్తర దిక్కులనుండి వచ్చిన రెండు జలమేఘాల వలె, బాణవర్షం కురిపించారు. ఇద్దరు అస్త్రవిద్యలో ఆరితేరినవారే. బలశాలులు, రథ యుద్ధంలో నేర్పరులు. ఒకరినొకరు చంపుకొనటానికి అవకాశాన్ని అన్వేషించే వారిద్దరిలోనూ, ఎటువంటి అంతరమూ నేను గమనించలేదు. మహారాజా ! చిత్రసేనుడు వాడియైన బల్లెంతో నకులుని పిడికిలి ప్రదేశంలో ధనుస్సును విరిచాడు. ధనుస్సు భగ్నం చేసి, బెదురులేకుండా చిత్రసేనుడు మూడు వాడియైన బాణాలతో, నకులుని లలాటం మీద గాయపరిచాడు. వాడియైన బాణాలతో నకులుని రథాశ్వాలను చంపాడు. మూడు మూడు బాణాలతో ధ్వజాన్ని, సారథిని పడగొట్టాడు. శత్రుభుజాల నుండి విడివడి, లలాటం మీద గ్రుచ్చుకొన్న మూడు బాణాలతో, నకులుడు మూడు శిఖరాల పర్వతం వలె భాసించాడు. ధనుస్సు భగ్నంకాగానే, రథహీను డయిన నకులుడు డాలు, ఖడ్గం చేతబూని పర్వతశిఖరం నుండి సింహంవలె, రథం నుండి క్రిందికి దూకాడు. పాదచారియై ఆక్రమిస్తున్న నకులునిపై, చిత్రసేనుడు బాణవర్షాన్ని కురిపించాడు. నేర్పూ, పరాక్రమమూ కల నకులుడు డాలుతో వానిని వారించి, నాశం చేశాడు. నకులుడు సమస్త సైన్యం చూస్తుండగానే, చిత్రసేనుని సమీపించి అతని రథాన్నెక్కాడు. అతడు అందమైన ముక్కు, విశాలమైన నేత్రాలు, కర్ణి కుండల మకుటధారియైన చిత్రసేనుని శిరస్సును దేహంనుండి వేరుచేశాడు. సూర్యునితో సమాన కాంతిగల చిత్రసేనుడు రథం వెనుకకు పడిపోగా, అతనిని చూసి, పాండవ మహారథులు నకులుని ప్రశంసిస్తూ, సింహనాదం చేశారు.

తమ సోదరుడు చనిపోవడం చూసి, వెంటనే కర్ణపుత్రులయిన సుషేణ, సత్యసేనులు శరవర్షం కురిపిస్తూ, నకులునిపైకి దండెత్తారు. మహారణ్యంలో పెద్దపులులు రెండు కలిసి, ఏనుగును చంపాలని దానివైపు పరుగెత్తినట్లు; తీక్ష్ణస్వభావం కల్గిన వారిద్దరు సోదరులు ధారగా నకులునిపై శరవర్షం కురిపించారు. నలువైపుల నుంచీ బాణాలతో కొట్టబడుతున్నా, మరొక ధనుస్సును తీసికొని, రథమెక్కి, క్రుద్ధుడైన యమునివలె,

నకులుడు యుద్ధంలో నిలిచాడు. మహారాజా! వారిద్దరు సోదరులు వంగిన కణుపులు గల బాణాలతో నకులుని రథాన్ని ముక్కముక్కలు చేయనారంభించారు. అప్పుడు చతురుడైన నకులుడు మందహాసం చేసి, నాల్గు బాణాలతో సత్యసేనుని గుఱ్ఱాలను చంపాడు. రాజేంద్రా! వెంటనే బాణం సంధించి, నకులుడు సత్యసేనుని ధనుస్సును ఖండించాడు. మరియొక రథమెక్కి, రెండవ ధనుస్సును తీసుకొని సత్యసేన సుషేణులు నకులునిపై దాడిచేశారు. ఎటువంటి తొట్రుపాటులేని నకులుడు రెండు రెండు బాణాలతో వారిద్దరిని గాయపరిచాడు. సుషేణుడు క్షురప్రంతో నవ్వుతూనే నకులుని ధనుస్సును ఖండించాడు. కోపంతో తన్ను తాను మరచిన నకులుడు మరియొక ధనుస్సు తీసుకొని, అయిదు బాణాలతో సుషేణుని గాయపరచి, ఒక బాణంతో అతని ధ్వజాన్ని భగ్నం చేశాడు. సత్యసేనుని ధనుస్సును, చేతితొడుగునూ నకులుడు భగ్నం చేస్తే జనమంతా గట్టిగా ఆక్రోశించారు.

మరియొక ధనుస్సును తీసుకొని, సత్యసేనుడు నకులుని బాణాలతో కప్పివేశాడు. నకులుడు ఆ బాణాల్ని వారించి, రెండు రెండు బాణాలతో సత్యసేన సుషేణులను గాయపరిచాడు. ఆ ఇద్దరు సోదరులు, వేరు వేరు బాణాలతో నకులుని, అతని రథసారథిని పీడించారు. సత్యసేనుడు వేరువేరు బాణాలతో నకులుని ధనుస్సును, రథపు కాడిని ఖండించాడు. అతిరథుడయిన నకులుడు రథంమీదే ఉండి, రథశక్తిని గ్రహించి, సత్యసేనునిపై ప్రయోగించాడు. అది అతని వక్షఃస్థలాన్ని చీల్చివేసింది. ప్రాణహీనుడై సత్యసేనుడు రథంనుండి క్రిందపడ్డాడు. సోదరుడు చనిపోతే, క్రుద్ధుడైన సుషేణుడు నేలమీద నుండియే, నకులునిపై బాణవర్షాన్ని కురిపించాడు. నాల్గు బాణాలతో నకులుని నాల్గు గుఱ్ఱాలను చంపి, అయిదింటితో ధ్వజాన్ని ముక్కలు చేసి, మూడు బాణాలతో సారథి ప్రాణాలు తీసి, సుషేణుడు సింహనాదం చేశాడు. నకులుడు రథహీను డవటం గమనించి, ద్రౌపది పుత్రుడయిన సుతసోముడు తన పినతండ్రిని రక్షించటానికి పరుగెత్తాడు. సుతసోముని రథాన్నెక్కి, నకులుడు కొండనెక్కిన సింహంవలె భాసించాడు. మరియొక ధనుస్సును చేతబూని, సుషేణునితో యుద్ధం చేశాడు. ఇరువురు మహావీరులు బాణవర్షం కురిపిస్తూ, పరస్పరం చంపుకోవాలని ప్రయత్నించారు. సుషేణుడు మూడు బాణాలను నకులునిపై, ఇరవై బాణాలు సుతసోముని బాహువులపై, వక్షఃస్థలం మీద ప్రయోగించాడు. నకులుడు కోపించి, బాణవర్షంతో సుషేణుని నలుదిక్కులా ఆక్రమించాడు. పిమ్మట తీక్ష్ణాగ్రం, వాడి, వేగమూ కల అర్ధచంద్రాకార బాణాన్ని కర్ణపుత్రునిపైకి ప్రయోగించాడు. సైన్యమంతా చూస్తుండగానే, ఆశ్చర్యం కలిగేటట్లు,

ఆ బాణం సుషేణుని శిరస్సును ఖండించింది. సుషేణుడు నేలగూలాడు. కర్ణపుత్రుల వధను, నకులుని పరాక్రమాన్ని చూసి, మీసేన భయంతో పారిపోయింది.

అప్పుడు శత్రుసంహర్త, సేనాపతి అయిన మద్రరాజు శల్యుడు కౌరవసేనను రక్షించాడు. మాటిమాటికి సింహనాదం చేస్తూ, ధనుష్టంకారం చేస్తూ, మద్రరాజు పారిపోతున్న కౌరవసేనను నిలుపు చేసి, నిర్భయుడై యుద్ధరంగంలో నిలిచాడు. ధనుస్సు చేతబూనిన శల్యుడు రక్షకుడు కాగా, చింతలేని మీ సైనికులు శత్రువులను ముట్టడించడానికి సిద్ధమయ్యారు. రాజా! మీ మహాసేన ధనుర్ధరు డయిన మద్రరాజుకు నాల్గువైపులా కాపుగా నిలిచి యుద్ధానికి సిద్ధపడ్డారు. సాత్యకి, భీమసేనుడు, నకుల సహదేవులు యుధిష్ఠిరుని ముందుంచుకొని, యుద్ధానికి బయలుదేరారు. యుద్ధరంగంలో వీరులు యుధిష్ఠిరుని చుట్టూ ఉంటూ సింహనాదం చేశారు. తీవ్ర బాణ శంఖధ్వనులను, వివిధ గర్జనలను కూడా చేశారు. అదే విధంగా మీ సైనికు లందరూ మద్రాధిపతిని చేరి చక్కటి వ్యవస్థ కల్గి, తిరిగి యుద్ధాసక్తులయ్యారు. అంతలో కపిధ్వజ డయిన అర్జునుడు సంశప్తకులను చంపి, కౌరవసేనను ముట్టడించాడు. అదే విధంగా ధృష్టద్యుమ్నుడు ముందుగల పాండవులంతా, వాడియైన బాణాలతో మీసేనపై విరుచుకు పడ్డారు. పాండవుల బాణాలతో కప్పబడిన కౌరవసేన సమ్మోహానికి గురి అయింది. వారికి దిక్కులు, విదిక్కులు తెలియటం లేదు. పాండవులు ప్రయోగించే వాడియైన బాణాలకు ఎంతోమంది వీరులు చనిపోయారు. మీ వారిని అంతటా కట్టడి చేశారు. మహారథులైన పాండుపుత్రులు కౌరవసేనను నాశం చేస్తుండగా, మీ కుమారులు వందల, వేలకొలది పాండవ సైనికులను చంపసాగారు. వర్షాకాలంలో రెండు నదులవలె, రెండుసేనలు పరస్పరం చంపుకొంటూ, మిక్కిలి సంతాపం చెందారు. ఆ మహాయుద్ధ సమయంలో కౌరవపాండవ సేనల మధ్య గొప్ప భయం ఆవరించింది."

11. శల్య భీమసేనుల యుద్ధము.

సంజయుడు చెపుతున్నాడు. "మహారాజా! మహాసంగ్రామంలో, ఇరుపక్షాల సైనికులు పరస్పరం చంపుకొంటూ, క్షోభపడుతూండగా కొందరు పారిపోతున్నారు. ఏనుగులు ఘీంకారాలు చేస్తున్నాయి, పదాతి సైన్యం అరుస్తోంది. ఎన్నో అశ్వాలు చచ్చిపడుతున్నాయి. సమస్త ప్రాణులు దారుణంగా నశించిపోతున్నాయి. వివిధ అస్త్రాలు పరస్పరం ఢీకొట్టుతున్నాయి. రథాలూ, గజాలు ఒకదానికొకటి కొట్టుకొంటున్నాయి. వీరులకు హర్షం, భీరువులకు

భయం కలుగుతోంది. వీరు లంతా ఒకరినొకరు చంపుకొనటానికి చొచ్చుకొని పోతున్నారు. ప్రాణాలు తీసుకొనటానికి మహాఘోరమూ, యమరాష్ట్ర వర్ధకమూ అయిన సంగ్రామం జరుగుతోంది. కౌరవ పాండవసైనికులు వాడియైన బాణాలతో ఒకరినొకరు చంపుకొంటున్నారు. సూర్యోదయమై పూర్వాహ్ణకాలం అయింది. భీరువుకు భయంకలిగిస్తూ, భయంకర యుద్ధం జరుగుతోంది. పాండవ రక్షణలో, వారి సైన్యం మృత్యువును గెంటివేసి, మీ సేనతో తలపడింది. ప్రహార చతురులయిన పాండవుల చేతిలో, కౌరవసేన దవాగ్నిలో చిక్కుకున్న లేడివలె విలవిలలాడింది. బురదలో కూరుకుపోయిన బలహీన మయిన ఆవువలె, పాండవుల చేతిలో బాధపడుతున్న కౌరవసేనను ఉద్ధరించటానికి, శల్యుడు పాండవుల నాక్రమించాడు. యుద్ధంలో విజయంతో శోభిల్లే పాండవులు కూడా మద్రరాజును సమీపించి, వాడియైన బాణాలతో అతనిని బాధించారు. మద్రరాజు ధర్మరాజు చూస్తూండగానే వందలకొలది తీక్ష్ణమైన బాణాలతో వారి సైన్యాన్ని బాధించాడు.

ఎన్నో అశుభనిమిత్తాలు కలిగాయి. పర్వతాలతో సహా భూమి శబ్దం చేస్తూ కంపించింది. దండ శూలాలవలె ప్రకాశించే అగ్రభాగం గల ఉల్కలు సూర్యమండలాన్ని ఢీకొని, పూర్తిగా చెల్లాచెదరయి ఆకాశం నుండి భూమ్మీద పడ్డాయి. రాజా! ఆ సమయంలో మృగాలు, మహిషాలు, పక్షులు సేనకు వామభాగంలో ఎన్నోసార్లు వెళ్ళాయి. శుక్రమంగళ గ్రహాలు బుధునితో కలిసి, పాండవులకు పృష్ఠభాగంలోను, మిగిలిన రాజులందరి పురోభాగంలోను ప్రత్యక్షమయ్యాయి. శస్త్రాల అగ్రభాగంలో జ్వాలలు పుట్టి, అవి కళ్ళను బాధిస్తూ వర్షిస్తున్నాయి. వీరుల శిరస్సుల మీద, ధ్వజాల మీద కాకులు, గుడ్లగూబలు దాక్కొంటున్నాయి. పిమ్మట సంఘటితమైన ఇరుపక్షాల నడుమ భీకరమైన పోరు జరిగింది. కౌరవులు ఏకీకృతమై పాండవసేనను ముట్టడించారు. వర్షించే ఇంద్రునివలె, యుధిష్ఠిరునిపై శల్యుడు బాణవర్షం కురిపించాడు. శల్యుడు వాడియైన పది పది బాణాలతో భీమసేనుని, ద్రౌపది పుత్రులను, నకుల సహదేవులను, ధృష్టద్యుమ్న, సాత్యకి, శిఖండులను ఒక్కొక్కరిని గాయపరిచాడు. వెంటనే వర్షాకాలంలో ఇంద్రునివలె, బాణవర్షాన్ని కురిపించాడు. వేలకొలది ప్రభద్రకులు, సోమకులు శల్య బాణాలతో నేలకొరుగుతూ కనబడ్డారు. రాజా ! శల్యుని బాణాలు తుమ్మెదల, మిడతల సముదాయంవలె, మేఘాలనుండి పిడుగుల వలె క్రిందపడ్డాయి. శల్యుని బాణపు దెబ్బలుతిని ఏనుగులు, గుఱ్ఱాలు, రథికులు, పదాతిసైన్యం ఆర్తనాదం చేసింది. ఊగిసలాడింది. క్రిందపడింది. ప్రళయకాల యమునివలె శల్యుడు కోపం, పౌరుషం ఆవహించిన శత్రువులను బాణాలతో కప్పివేశాడు. అతడు శత్రుసంహారం చేస్తూండగా, పాండవసేన పారిపోయి, అజాత శత్రువైన యుధిష్ఠిరుని ప్రక్కన చేరింది.

హస్తలాఘవం కల శల్యుడు తీక్ష్ణమైన బాణాలతో పాండవసేనను అణిచి, పిమ్మట బాణవర్షంతో యుధిష్ఠిరుని కొట్టాడు. క్రుద్ధు డయిన యుధిష్ఠిరుడు అశ్వపదాతి సైన్యంతో వచ్చే శల్యుని, అంకుశంతో మత్త గజాన్ని వలె, వాడియైన బాణాలతో వారించాడు. శల్యుడు యుధిష్ఠిరుని పైకి విషసర్పం వంటి బాణాన్ని ప్రయోగించాడు. అది వేగంతో అతన్ని గాయపరిచి, నేలమీద పడింది. అప్పుడు కుపితుడైన భీమసేనుడు ఏడు బాణాలతో శల్యుని పీడించాడు. సహదేవుడు అయిదు బాణాలతో, నకులుడు పది బాణాలతో, ద్రౌపదీ పుత్రులు అనేక బాణాలతో శల్యుని బాధించారు. పర్వతంపై మేఘం వర్షించినట్లు వారంతా శల్యునిపై బాణవర్షం కురిపించారు. కుంతీపుత్రులు శల్యుని అడ్డుకోవడం చూసి, కృతవర్మ, కృపాచార్యులు కోపంతో అటువైపు పరుగెత్తుకు వచ్చారు. వారితో బాటు ఉలూకుడు, శకుని, అశ్వత్థామ, మీపుత్రు లందరూ మెల్లమెల్లగా అచ్చటకు చేరి రణభూమిలో శల్యుని రక్షించారు. క్రుద్ధుడైన కృతవర్మ మూడుబాణాలతో భీమసేనుని గాయపరిచి, ముందుకు వెళ్ళకుండా వారించాడు. కృపాచార్యుడు తన బాణ వర్షంతో ధృష్టద్యుమ్నుని పీడించాడు. శకుని ద్రౌపది పుత్రులను, అశ్వత్థామ నకుల సహదేవులను ముట్టడించారు. దుర్యోధనుడు కృష్ణార్జునులను బాణాలతో హింసించాడు. రాజా! ఈ విధంగా అక్కడికక్కడ మీ సైనికులకూ, శత్రువులకూ విచిత్రమైన ద్వంద్వ యుద్ధం సాగింది.

కృతవర్మ యుద్ధంలో భీమసేనుని ఋక్షవర్ణాలైన అశ్వాల్ని చంపాడు. అప్పుడు భీముడు రథంనుండి క్రిందికి దిగి, గదను చేతబూని యుద్ధం చేశాడు. శల్యుడు సహదేవుని ఎదుటనే అతని గుఱ్ఱాలను చంపాడు. వెంటనే సహదేవుడు కత్తితో శల్యపుత్రుని వధించాడు. కృపాచార్యుడు ఏ తొట్రుపాటు లేక యత్నశీలుడై అసంభ్రాంతుడు, అధిక ప్రయత్నశీలుడూ అయిన ధృష్టద్యుమ్నునితో తలపడ్డాడు. అశ్వత్థామ ఎక్కువగా కోపగించక, పది పది బాణాలతో, నవ్వుతూ ఉన్నట్లు, ద్రౌపది పుత్రులు ఒక్కొక్కరిని గాయపరిచాడు. కృతవర్మ మళ్లీ భీమసేనుని గుఱ్ఱాలను చంపాడు. హతాశ్వుడైన అతడు వెంటనే రథం దిగి, కుపితుడై, దండం చేతబూనిన యమునివలె గద తీసుకొని, కృతవర్మ అశ్వాలను, రథాన్ని భగ్నం చేశాడు. రథం నుండి క్రిందికి దూకి, కృతవర్మ అచ్చటి నుండి పారిపోయాడు. క్రుద్ధుడైన శల్యుడు సోమకపాండవ వీరులను సంహరిస్తూ, మళ్లీ తీక్ష్ణమైన బాణాలతో యుధిష్ఠిరుని బాధించాడు. భీముడు పండ్లుకొరుకుతూ, శల్యుని నాశమే లక్ష్యంగా చేసుకొని, గదను చేతబూని విరుచుకు పడ్డాడు.

ఆ గద జ్వలించే ఉల్కవలె, ఉట్టి యందున్న భయంకర విషసర్పంవలె ఉన్నది. చందనాగురు ద్రవ్యాల పూత పూసుకొని కోరిక గల ప్రియురాలి వలె, ఆ గద అంతా వస, మేదస్సులచే కప్పబడి, యమధర్మరాజు నాలుకవలె కనపడుతోంది. ఆ గద వందలకొలది శ్రేష్ఠ ఘంటల ధ్వనులతో భాసిల్లుతోంది. ఇంద్రుని వజ్రాయుధం వలె, కుబుసం విడిచిన విషసర్పంవలె, కన్పించే ఆ గద గజమదజలంతో పూయబడి ఉంది. సమస్త ప్రాణులకు భయంకల్గిస్తూ, వారి సైన్యానికి ఆనందాన్నిస్తూ ఉంది, ఆ గదతోనే, కైలాస భవనంలో మహాబలు డయిన భీమసేనుడు మహేశ్వర సఖుని (కుబేరుని) యుద్ధానికి ఆహ్వానించాడు. ఆ గదతోనే భీమసేనుడు ఎంతోమంది వారించినా, ద్రౌపదికి ప్రియం చేయడం కోసం గర్జిస్తూ, కుబేరభవనంలో ఉండే ఎంతోమంది మాయావులు, గర్వితులయిన గుహ్యకులను చంపాడు. అట్టి వజ్రమణిరత్నమయమూ, వజ్రం వలె బరువైన గదను చేతబూని భీముడు శల్యునిపైకి దూకాడు. భీమసేనుడు ఆ గదతో శల్యుని నాల్గు అశ్వాల్ని మోదాడు. క్రుద్ధుడైన శల్యుడు భీమసేనుని విశాల వక్షఃస్థలాన్ని, తోమరంతో పొడిచాడు. అది అతని కవచాన్ని ఛేదించి లోపలికి వెళ్ళింది. భీమసేనుడు ఎంతమాత్రం చలించక, తోమరాన్ని వక్షఃస్థలం నుండి బయటకు లాగి, దానితో శల్యుని రథసారథి హృదయాన్ని చీల్చాడు. రథసారథి రక్తం క్రక్కుతూ దీనుడై శల్యుని ఎదుట రథం నుండి క్రిందపడ్డాడు. శల్యుడు అక్కడినుండి వెనక్కి తగ్గాడు. భీముని ప్రతీకార చర్యను చూసి, ఆశ్చర్యపడిన శల్యుడు గదచేతబూని శత్రువును చూడసాగాడు. భీమసేనుని, ఘోరపరాక్రమాన్ని చూసి, కుంతీపుత్రులు ప్రసన్న చిత్తులై అతనిని ప్రశంసించారు."

12. చేకితానవధ - చంద్రసేన ద్రుమసేనులవధ

సంజయుడు చెపుతున్నాడు. "రథసారథి క్రిందపడటం చూసి, శల్యుడు వేగంగా ఉక్కు గదను చేతబూని, కొండవలె స్థిరంగా నిలిచాడు. ప్రళయకాలంలో జ్వలించే అగ్నివలె, పాశం ధరించిన యమధర్మరాజువలె, శిఖరంతో కూడిన కైలాసంవలె, వజ్రాయుధ ధారియయిన ఇంద్రునివలె, త్రిశూలధారి రుద్రునివలె, అరణ్యంలో మత్తగజంవలె నున్న శల్యునిపైకి, పెద్దగదను తీసుకొని, భీమసేనుడు వేగంగా దూకాడు. పిమ్మట శంఖనాదాలు, వేలకొలది యుద్ధవాద్యాలు, వీరుల హర్షాన్ని పెంపొందించే సింహనాదాలు వెలువడ్డాయి. ఆ ఇద్దరు యోధులను చూసి, ఇరుపక్షాలవారు **బాగుబాగు** అని వారిని ఉత్సాహపరిచారు. యుద్ధంలో భీమసేనుని వేగాన్ని శల్యుడు, బలరాముడు తప్ప మరొకరు సహింపలేరు.

భరింపలేరు. అలాగే శల్యుని గదావేగాన్ని, భీమసేనుడు తప్ప మరియొక వీరుడు ఎదుర్కొనలేడు. గదలను చేతబూనిన ఆ శల్యభీమసేనులు ఎద్దులవలె రంకెవేస్తూ, మండలాకారంగా తిరుగుతున్నారు. మండలాకారంగా తిరగడంలో, గదను త్రిప్పడంలో ఆ ఇద్దరు పురుషసింహులలో హెచ్చుతగ్గులు కన్పించటం లేదు. శల్యుడు తనగదతో భీమసేనుని గదను కొట్టితే, అగ్నిజ్వాలలు వెలువడ్డాయి. అట్లే భీమసేనుడు శల్యుని గదను కొట్టితే, వాటినుండి నిప్పులవర్షం కురిసింది. అది ఎంతో ఆశ్చర్యం అనిపించింది.

మహాగజాలు దంతాలతోవలె, పెద్దపెద్ద ఎద్దులు కొమ్ములతో వలె, ఆ ఇద్దరు మహావీరులు అంకుశాల వంటి గదాగ్రాలతో పరస్పరం కొట్టుకొన్నారు. గదాఘాతాలతో నెత్తురోడుతున్న శరీరాలతో, వారిద్దరు పుష్పించిన పలాశ వృక్షాల వలె భాసిల్లారు. మద్రరాజు గదచే కుడి ఎడమల దెబ్బలు తిన్నప్పటికీ, భీమసేనుడు కొండవలె చలించలేదు. అట్లే మాటిమాటికి భీముని గదచే కొట్టబడుతున్నా, శల్యుడు ఏనుగుచేత మహాపర్వతం వలె చలించలేదు. పురుష సింహులిద్దరి గదాఘాతధ్వనులు వజ్రాఘాతాలవలె అన్ని దిక్కులా వినబడ్డాయి. మహావీరు లయిన శల్య భీములు గదలను చేతబూని ఒకసారి వెనుకకు తగ్గి, ఒకసారి మధ్యమార్గస్థులయి, మరియొకసారి మండలాకారంగా తిరుగుతూ విహరిస్తున్నారు. వారు గదాయుద్ధంలో ఎనిమిది అడుగుల ముందుకువచ్చి, లోహమయ గదలతో, అమానుష కర్మలతో పరస్పరం తలపడ్డారు. వారిద్దరు భయంకర గదలతో మండలాకారంగా తిరుగుతూ, శిఖరాలతో కూడిన పర్వతాలవలె, పరస్పరం కొట్టుకొన్నారు. శల్యభీములు అన్యోన్య గదాయుద్ధంలో క్షతగాత్రులై, ఇద్దరు వీరులు, ఇంద్రధ్వజాలవలె ఒక్కసారిగా నేలమీద పడ్డారు. అప్పుడు ఇరుపక్షాల వీరులు హాహాకారాలు చేశారు. మర్మస్థానాలలో గట్టిదెబ్బలు తగలటం చేత, ఇద్దరు వీరులు మిక్కిలి వ్యాకులత చెందారు. అంతలో కృపాచార్యుడు శల్యుని తన రథంమీద కూర్చుండబెట్టుకొని, యుద్ధభూమినుండి దూరంగా తీసుకుపోయాడు. గదాధారియైన భీమసేనుడు నిముసంలో తిరిగిలేచి, శల్యుని యుద్ధానికి ఆహ్వానించాడు. పిమ్మట మీ సైనికులు వివిధ శస్త్రాలను తీసుకొని, వివిధ వాద్యధ్వనులతో పాండవసేనతో తలపడ్డారు. దుర్యోధనాదులు రెండు చేతులూ, శస్త్రాలూ పైకెత్తి, కోలాహలం చేస్తూ శత్రువులను ముట్టడించారు. కౌరవసేనను చూసి పాండవులు సింహనాదం చేస్తూ దుర్యోధన ప్రముఖులవైపు వెళ్ళారు. మీదపడే పాండవసేనను చూసి, మీ పుత్రుడు వేగంగా ప్రాసం ప్రయోగించి, చేకితానుని హృదయం మీద కొట్టాడు. మీ పుత్రుని వలన గాయపడిన చేకితానుడు రథం మీద రక్తసిక్తుడై, చీకట్లుక్రమ్మి పడిపోయాడు. చేకితానుడు చనిపోవటం

చూసి, పాండవ వీరులు వేరువేరుగ బాణవర్షాన్ని కురిపించారు. విజయంతో ఉప్పొంగే పాండవులు, మీ సైన్య మందంతటా అందరూ చూసే విధంగా తిరుగాడారు.

పిమ్మట కృపాచార్యుడు, కృతవర్మ, శకుని, శల్యుని ముందిడుకొని ధర్మరాజుతో తలపడ్డారు. ధృష్టద్యుమ్నునితో దుర్యోధనుడు యుద్ధం చేశాడు. మీ పుత్రునిచే ప్రేరేపించబడి, మూడువేల మంది యోధులు అశ్వత్థామ నాయకత్వంలో అర్జునునితో పోరాడారు. హంసలు మహాసరోవరంలో ప్రవేశించినట్లు, మీ సైనికులు యుద్ధ విజయానికై దృఢసంకల్పం కల్గి, ప్రాణాల మీద ఆశ వదులుకొని, శత్రుసేనలోనికి చొచ్చుకొని పోయారు. ఇరుపక్షాల సైనికుల మధ్య ఘోరయుద్ధం జరిగింది. శ్రేష్ఠవీర నాశకమయిన ఘోరయుద్ధం ప్రారంభం కాగానే, గాలిచే ఎగరగొట్టబడి ధూళి పైకెగసింది. ఏమీ కనిపించని వాతావరణంలో భయరహితులవలె, యోధులు యుద్ధం చేస్తున్నారు. పాండవ వీరులు తమ పేర్లతో పరిచయం చేసికొనటం విని, మీ సేన పరస్పరం గుర్తుపట్టగల్గుతున్నారు. పైకెగసిన ధూళి, పరస్పర వధవలన ప్రవహించే రక్తంవలన ఉపశమించింది. చీకటి తొలగి దిక్కులు నిర్మలమయ్యాయి. ఆ విధంగా భయంకరమైన ఘోరయుద్ధం జరుగుతుండగా, ఇరుపక్షాల సైనికులలో ఏ ఒక్కరూ వెనుదిరగలేదు. బ్రహ్మలోక తత్పరులై, యుద్ధంలో విజయం కోరే సైనికులందరూ స్వర్గం కోరుతూ, యుద్ధంలో పరాక్రమించారు. స్వామి ఋణాన్ని తీర్చుకొనటానికీ, స్వామికార్యాన్ని నెరవేర్చటానికీ, స్వర్గం పొందాలనే మనసుతో యోధులు యుద్ధం చేస్తున్నారు. వివిధ శస్త్రాలను ప్రయోగిస్తూ, పరస్పరం ప్రహారం చేస్తూ, సైనికులు ఒకరినొకరు లక్ష్యంగా చేసుకొని గర్జించారు. ఇరుపక్షాల సైనికుల మధ్య చంపు, పీడించు, పట్టుకో, దెబ్బకొట్టు, చీల్చు అనే మాటలు వినబడుతున్నాయి.

పిమ్మట శల్యుడు యుధిష్ఠిరుని చంపదలచి, వాడియైన బాణాలతో అతనిని బాధించాడు. మర్మజ్ఞుడయిన అర్జునుడు, మందహాసం చేస్తున్న వానివలె పదునాల్గు బాణాలతో శల్యుని మర్మస్థానాల్ని పొడిచాడు. శల్యుడు యుధిష్ఠిరుని అడ్డగించి చంపాలని, క్రోధంతో అనేక బాణాలతో అతనిని బాధించాడు. సైనికులు అందరూ చూస్తుండగానే శల్యుడు వంగిన కణుపులు గల బాణాలతో యుధిష్ఠిరుని కొట్టాడు. ధర్మరాజు కుపితుడై వాడియైన బాణాలతో శల్యుని గాయపరిచాడు. యుధిష్ఠిరుడు డెబ్బది బాణాలతో చంద్రసేనుని, తొమ్మిది బాణాలతో శల్యునిసారథిని, అరువది నాల్గు బాణాలతో ద్రుమసేనుని చంపాడు. యుధిష్ఠిరునిచే తన రథసారథి మరణిస్తే, శల్యుడు ఇరువది అయిదు మంది చేది వీరులను సంహరించాడు. వాడియైన ఇరువది అయిదు బాణాలతో శల్యుడు సాత్యకిని,

అయిదింటితో భీమసేనుని, నూరు బాణాలతో మాద్రీ పుత్రులను హింసించాడు. రణభూమిలో ఇలా విహరిస్తున్న శల్యుని పైకి ధర్మరాజు విషసర్పతుల్యాలైన వాడి బాణాలను ప్రయోగించాడు. యుధిష్ఠిరుడు యుద్ధంలో ఎదురుగానున్న శల్యుని ధ్వజాగ్రాన్ని భల్లం ద్వారా రథంనుండి వేరుచేశాడు. పాండుపుత్రుడు ఛిన్నం చేయగా, క్రిందపడే ధ్వజాగ్ర భాగాన్ని, విరిగి క్రిందపడే పర్వతశిఖరం వలె మేమంతా చూశాం. ధ్వజం విరిగి క్రిందపడటం, యుధిష్ఠిరుడు ఎదురుగా నిలవటం చూసి, శల్యుడు కోపగించి శరవర్షాన్ని కురిపించాడు. శల్యుడు మేఘుని వలె బాణవర్షాన్ని కురిపించాడు. సాత్యకి, భీమసేన, నకుల సహదేవులను ఒక్కొక్కరిని అయిదేసి బాణాలతో గాయపరిచి శల్యుడు వెంటనే యుధిష్ఠిరుని బాధించాడు. పిమ్మట మేము ఆకాశంలో మేఘమాల వలె, యుధిష్ఠిరుని వక్షఃస్థలమంతా కప్పిన శరపంక్తిని చూశాం. కుపితుడైన శల్యుడు అవనతమైన కణుపులు కల్గిన బాణాలతో యుధిష్ఠిరుని నలువైపులా కప్పేశాడు. ఇంద్రునివలన జంభాసురుని వలె, యుధిష్ఠిరుడు బాణసమూహంతో బాధింపబడ్డాడు."

13. శల్యుని యుద్ధము.

సంజయుడు చెపుతున్నాడు. "ఆర్యా! యుధిష్ఠిరుని శల్యుడు యుద్ధంలో బాధిస్తుంటే సాత్యకి, భీమసేన, నకుల సహదేవులు రథాలతో అతనిని ముట్టడించారు. అంతమంది మహారథులు కలిసి ఒక్క శల్యుని బాధించడం చూసి, అందరూ సాధువాదాలు పలికారు. సిద్ధులు, మహర్షులు అక్కడకు చేరి, హర్షంతో ఆశ్చర్యమని పలికారు. భీమసేనుడు శల్యుని ఒక బాణంతో కొట్టి, తిరిగి ఏడు బాణాలతో హింసించాడు. సాత్యకి కూడా ధర్మరాజును రక్షించటానికి, నూరు బాణాలతో శల్యుని కప్పి, సింహనాదం చేశాడు. నకుల సహదేవులు అయిదేసి బాణాలతో శల్యుని హింసించి, తిరిగి ఏడు బాణాలతో బాధించారు. శల్యుడు ఆ మహారథులచే పీడింపబడినా, శత్రువేగాన్ని కట్టడి చేసే ఘోరమయిన ధనుస్సును ఎక్కుపెట్టి, ఇరువది అయిదు బాణాలతో సాత్యకిని, డెబ్బది బాణాలతో భీమసేనుని, ఏడు బాణాలతో నకులుని బాధించాడు. శల్యుడు సహదేవుని శరసహిత ధనుస్సును బల్లెంతో ముక్కలు చేసి, ఇరువది ఒక్క బాణాలతో అతనిని గాయపరిచాడు. అప్పుడు సహదేవుడు మరియొక ధనుస్సును చేతబూని, విషసర్పాకృతికల్గి, జ్వాలాగ్ని సమానాలైన అయిదు బాణాలతో తన మామను గాయపరిచాడు. మిక్కిలి కోపంతో సహదేవుడు, వంగిన కణుపులు కల్గిన బాణంతో శల్యరథ సారథిని కొట్టి, తిరిగి మూడు

బాణాలతో అతనిని గాయపరిచాడు. భీమసేనుడు డెబ్బది బాణాలతో, సాత్యకి తొమ్మిది బాణాలతో ధర్మరాజు ఆరు బాణాలతో శల్యుని శరీరాన్ని గాయపరిచారు. మహారథులచే గాయపడిన శల్యుని శరీరం నుండి, పర్వతం నుండి గైరిక ధాతుమిశ్రిత జలం వలె రక్తం ప్రవహించింది. రాజా ! వారందరిని శల్యుడు వేగంగా అయిదు అయిదు బాణాలతో గాయపరచడం అద్భుతం అయింది.

శల్యుడు మరొక భల్లంతో యుధిష్ఠిరుని ధనుస్సును భగ్నం చేశాడు. ధర్మరాజు మరియొక ధనుస్సును తీసికొని అశ్వ, రథ, ధ్వజ సారథులతో కూడా శల్యుని బాణాలతో కప్పివేశాడు. యుధిష్ఠిరుని బాణాలతో కప్పబడి, శల్యుడు అతనిని పది తీక్ష్ణమైన బాణాలతో కొట్టాడు. యుధిష్ఠిరుడు శల్య బాణాలతో దెబ్బతింటే, క్రుద్ధుడైన సాత్యకి శల్యుని అయిదు బాణాలతో గాయపరిచాడు. శల్యుడు క్షురప్రంతో సాత్యకియొక్క మహాధనుస్సును ఖండించి, భీమసేన ప్రముఖులను మూడు మూడు బాణాలతో కొట్టాడు. అప్పుడు సాత్యకి క్రుద్ధుడై, స్వర్ణదండం కల్గి అమూల్యమైన తోమరాన్ని శల్యుని పైకి ప్రయోగించాడు. భీమసేనుడు జ్వలించే సర్పంవంటి బాణాన్ని, నకులుడు శక్తి ఆయుధాన్ని, సహదేవుడు సుందరమైన గదను, ధర్మరాజు శతఘ్నిని అతనిపై ప్రయోగించారు. ఆ అయిదుగురు మహారథులు ప్రయోగించే శస్త్రాల్ని శల్యుడు తన శస్త్రసముదాయంతో శీఘ్రంగా వారించాడు. సిద్ధహస్తుడైన శల్యుడు తన భల్లంతో సాత్యకి ప్రయోగించిన తోమరాన్ని భగ్నం చేసి, భీమసేనుడు ప్రయోగించిన సువర్ణ భూషిత శరాన్ని రెండుముక్కలు చేశాడు. నకులుడు ప్రయోగించిన శక్తిని, సహదేవుని గదను శల్యుడు తన బాణ సముదాయంతో వారించాడు. భారతా ! పాండవులు చూస్తుండగానే శల్యుడు రెండు బాణాలతో యుధిష్ఠిరుని శతఘ్నిని ఛేదించి సింహనాదం చేశాడు.

సాత్యకి శత్రువిజయాన్ని సహించలేకపోయాడు. అతడు మరియొక ధనుస్సును చేతబూని, క్రుద్ధుడై రెండు బాణాలతో శల్యుని గాయపరచి, మూడు బాణాలతో అతని సారథిని కూడా కొట్టాడు. రాజా! అనంతరం శల్యుడు మిక్కిలి కోపించి, మావటివాడు అంకుశాలతో మహాగజాలను పొడిచినట్లు, పది బాణాలతో యోధు లందరిని గాయపరిచాడు. శల్యునిచే వారింపబడుతున్న పాండవ మహారథులు యుద్ధంలో అతనికి ఎదురుగా నిలబడలేకపోయారు. దుర్యోధనుడు శల్యుని పరాక్రమాన్ని చూసి, పాండవ, పాంచాల, సృంజయులు చనిపోయారనే భావించాడు. మహాబాహువయిన భీమసేనుడు ప్రాణాల మీద వ్యామోహాన్ని విడిచి, శల్యునితో తలపడ్డాడు. నకుల, సహదేవులూ మహారథుడైన

సాత్యకి కూడా శల్యుని చుట్టుముట్టి బాణవర్షాన్ని కురిపించారు. ఈ నల్గురు పాండవ యోధులూ చుట్టుముట్టిన శల్యుడు, ప్రతాపంతో వారందరితో యుద్ధం చేయసాగాడు. రాజా! మహాసమరంలో ధర్మరాజు క్షురప్రంతో శల్యుని చక్రరక్షకుని చంపాడు. తన చక్రరక్షకుడు చనిపోగానే, మద్రరాజు బాణాలతో శత్రుపక్ష వీరులను ముట్టడించాడు. సమరంలో తమ పక్షం వీరులందరిని శల్యుడు చుట్టుముట్టితే ధర్మరాజు ఇలా అనుకొన్నాడు. "యుద్ధంలో శ్రీకృష్ణుని మాటలు ఎలా సఫలం అవుతాయి ? క్రుద్ధుడైన శల్యుడు నా సైన్యాన్నంతటినీ నశింపజేయడు గదా!

నేను, నాసోదరులు, సాత్యకి, పాంచాల, సృంజయ యోధులు అందరూ కలిసి కూడా శల్యుని ఎదుర్కోలేకపోతున్నాం. మహాబలుడగు మామ నేడు మమ్ములనందరినీ చంపగలడు. అపుడు శ్రీకృష్ణుని మాట ఎలా యథార్థమవుతుంది?"

"ధృతరాష్ట్ర ! పిమ్మట రథ, గజ, అశ్వసహితులై అందరు పాండవ వీరులు శల్యుని బాధిస్తూ ఆక్రమించారు. శల్యుడు నానావిధ శస్త్రసముదాయంతో, ప్రారంభమైన శస్త్రవర్షాన్ని చిన్నాభిన్నం చేశాడు. శల్యుడు ప్రయోగించిన బాణాలవర్షం ఆకాశంలో వ్యాపించిన మిడతలవలె చూశాం. యుద్ధరంగంలో శల్యుడు ప్రయోగించిన బాణాలు, మిడతల సముదాయంవలె నేలరాలుతూ కనపడ్డాయి. మద్రరాజ ధనుస్సునుండి వెలువడిన శరజాలంతో ఆకాశమంతా నిండిపోయింది. బాణాలతో అంతటా అంధకారం వ్యాపించింది. అందులో పాండవులది గాని, మాదిగాని ఏదీ కనిపించలేదు. మద్రరాజు కురిపించే బాణవృష్టితో పాండవుల సైన్య సాగరం అల్లకల్లోలం కావడం చూసి, దేవ, గంధర్వ, దానవులు ఆశ్చర్యపోయారు. సమస్త పాండవ వీరులను తన బాణాలతో ఆచ్ఛాదన చేసి, శల్యుడు యుధిష్ఠిరుని చుట్టుముట్టి సింహనాదం చేయసాగాడు. సమరంలో శల్యుని బాణాలతో కప్పబడిన పాండవ మహారథులు శల్యునివైపు ముందుకు సాగలేకపోయారు. ధర్మరాజును ముందిడుకొన్న భీమసేనాది రథికులు శల్యుని విడువలేదు."

14. అర్జునాశ్వత్థామల యుద్ధము - సురథుని వధ.

సంజయుడు చెపుతున్నాడు. "అశ్వత్థామ, అతని అనుచరులు, త్రిగర్త దేశీయ మహారథులు లోహ మయ బాణాలతో అర్జునుని బాధించారు. అర్జునుడు సమరంలో మూడు బాణాలతో అశ్వత్థామను, రెండు రెండు బాణాలతో మిగిలిన యోధులను గాయపరిచాడు. తిరిగి వారినందరిని శరవర్షంతో కప్పివేశాడు. అర్జునుని వాడియైన బాణాలతో గాయపడినా, మీసేన అర్జునుని విడిచిపెట్టలేదు. అశ్వత్థామను ముందిడుకొని,

కౌరవ మహారథులు రథసమూహంతో అర్జునుని చుట్టుముట్టి, అతనితో తలపడ్డారు. వారు వేసిన శరాలతో అర్జునుని రథం నొగలు నిండిపోయింది. కృష్ణార్జునులు శరాఘాతాలను పొందటం చూసి, కౌరవ వీరులు సంతసించారు. ప్రభూ ! అర్జునుని రథం నొగ, చక్రాలు, కాడి, పగ్గాలు, కాడికర్ర, కోడుపీట అన్నీ బాణాలతో నిండిపోయాయి. మీ వీరులవలన అర్జునునికి ఇటువంటి దురవస్థ పూర్వమెపుడూ చూడలేదు. వినలేదు. విచిత్రాలయిన రెక్కలు కల్గి, వాడియైన బాణాలతో ఆచ్ఛాదితమైన అర్జునుని రథం, భూమిమీద ఉల్కాశతంతో ప్రజ్వరిల్లే విమానంలా భాసిస్తోంది.

అర్జునుడు వంగిన కణుపులు కల్గిన బాణాలతో, మేఘుడు వృష్టితో పర్వతాన్ని వలె మీ సేనను కప్పివేశాడు. సమరంలో పార్థనామాంకిత బాణాలతో దెబ్బలు తిన్న మీసేన అర్జునుని అట్లే చూస్తూ, సమస్తం అర్జున మయంగా తలచారు. అర్జును డనే అగ్ని, కోపంతో వెడలిన బాణా లనే జ్వాలలను ప్రదీప్తం చేసి, ధనుష్టంకార మనే వాయువుచే ప్రేరితమై, మీ సైన్య మనే ఇంధనాన్ని శీఘ్రంగా తగులబెట్టింది. భారతా ! పడిపోయే చక్రాలు, కాడులు, అమ్ములపొదులు, జెండాలు, రథాలు, రథంనొగలు, కోడిపీటలు, కాడిపలుపులు, రథపుటిరుసులు, పగ్గాలు, మునికోలలు, కుండలాలు, తలపాగలతో సహా పడిపోతున్న తలలు, భుజాలు, అంతటాపడి ఉన్న భుజస్కంధాలు, గొడుగులు, చామరాలు, కిరీటాలరాసులు అన్నీ అర్జునుని రథమార్గంలో కనిపిస్తున్నాయి.* అర్జునుని రథమార్గం, రక్తమాంసాలచే బురద బురద అయి, అటు తిరగటం కష్టమయింది. ఆ రణభూమి రుద్రుని క్రీడాస్థలం వలె, పిరికివాళ్ళకి భయాన్ని, వీరులకు హర్షాన్ని కల్గించింది. అర్జునుడు యుద్ధంలో రెండు వేల రథాల్ని భగ్నంచేసి, పొగలేకుండా ప్రజ్వరిల్లే అగ్నివలె ప్రకాశించాడు. యుద్ధరంగంలో అర్జునుని పరాక్రమాన్ని అశ్వత్థామ వారించాడు. పురుష శ్రేష్ఠులు, ధనుర్ధరులలో శ్రేష్ఠులయిన ఆ ఇద్దరు పరస్పర వధేచ్ఛతో తలపడ్డారు. మహారాజా ! గ్రీష్మఋతువు చివర రెండు మేఘాలు దారుణంగా వర్షించినట్లు, వారిద్దరు బాణవృష్టిని కురిపించారు.

వారిరువురి యుద్ధం చాలాసేపు ఒక్కవిధంగానే జరిగింది. మరల శస్త్రాలతో ఘోరయుద్ధం ఆరంభమైంది. అశ్వత్థామ తీక్ష్ణమైన పండ్రెండు బాణాలతో అర్జునుని, పది బాణాలతో శ్రీకృష్ణుని గాయపరిచాడు. పిమ్మట అర్జునుడు ముహూర్తకాలం గురుపుత్రుని

---

* *వి॥ యుగం = కాడి; తూణీరం = అమ్ములపొది; ఈష = బండినొగ; అనుకర్షం = కోడిపీట; త్రివేణువు = బండినొగకట్టు; అక్షం = ఇరుసు, బండిచక్రం, యోక్త్రం = త్రాడు పలుపు పగ్గం; ప్రతోదాలు = మునికోల, చెర్నాకోల*

సమ్మానించి, హర్షోత్సాహాలతో గాండీవ ధనుస్సును ఎక్కుపెట్టాడు. అర్జునుడు అశ్వత్థామ యొక్క అశ్వ రథ సూతులను భగ్నం చేసి, ముందుమృదువుగాను, తరువాత బాణాలతో తీవ్రంగాను అతనిని కొట్టాడు. అశ్వాలు చనిపోతే అదే రథంమీద నిలబడి, ద్రోణపుత్రుడు పరిఘవంటి లోహమయ ముసలాన్ని అర్జునునిపైకి విసిరాడు. అర్జునుడు తనమీదకు వేగంగా వస్తున్న ముసలాన్ని ఏడుముక్కలు చేశాడు. ముక్కలయిన ముసలాన్ని చూసి, అశ్వత్థామ పరిఘను చేతిలోనికి తీసుకొని పార్థుని మీదకు విసిరాడు. పరిఘను చూసి, అర్జునుడు అయిదు ఉత్తమబాణాలతో దానిని ముక్కలు చేశాడు. అర్జునుడు మరో మూడు భల్లాలతో అశ్వత్థామను పీడించాడు. పార్థునిచే మిక్కిలి గాయపడినప్పటికీ, అశ్వత్థామ పౌరుషాన్ని ఆశ్రయం చేసుకొని, ఇసుమంతయు కంపించలేదు. రాజా! క్షత్రియు లందరూ చూస్తుండగానే, అశ్వత్థామ మహారథి అయిన సురథుని శరసముదాయంతో కప్పివేశాడు. యుద్ధంలో సురథుడు కూడా, మేఘగర్జన గల రథంతో అశ్వత్థామను ఆక్రమించాడు. సురథుడు అగ్ని విషసర్పతుల్యాలైన బాణాలతో అశ్వత్థామను కప్పివేశాడు. క్రుద్ధుడై మీదకు వచ్చే సురథుని చూసి, అశ్వత్థామ కర్రదెబ్బతిన్న పామువలె రెచ్చిపోయాడు. కనుబొమలు చిట్లిస్తూ, పెదవులు నాకుతూ, అశ్వత్థామ కోపంతో సురథుని చూసి, యమదండతుల్యమైన తీక్ష్ణబాణాన్ని ప్రయోగించాడు. ఇంద్రునిచే ప్రయోగించబడిన వజ్రాయుధం భూమిని చీల్చి ప్రవేశించినట్లు, ఆ బాణం అతివేగంగా సురథుని హృదయాన్ని చీల్చి, లోపలికి ప్రవేశించింది. సురథుడు నేలమీద పడ్డాడు. సురథుడు చనిపోగానే వెంటనే అశ్వత్థామ అతని రథాన్ని ఆరోహించాడు. పిమ్మట సంశప్తకులతో కూడిన అశ్వత్థామ అర్జునునితో తలపడ్డాడు. మధ్యాహ్న సమయంలో అర్జునునికి శత్రువులతో ఘోరయుద్ధం జరిగింది. ఆ సమయంలో మన వీరుల పరాక్రమాన్ని చూస్తూ, ఇంతమంది వీరులతో అర్జును డొక్కడే ఒంటరిగా పోరాడే ఆశ్చర్యకరమైన సన్నివేశాన్ని చూశాం. పూర్వకాలంలో ఎంతో రాక్షససేనతో ఇంద్రుడు పోరాడినట్లు అర్జును డొక్కడు ఇంతమంది వీరులతో తలపడ్డాడు."

15. శల్యునితో నకుల, సాత్యకుల యుద్ధము.

సంజయుడు చెపుతున్నాడు. "మహారాజా! దుర్యోధన ధృష్టద్యుమ్నులు బాణాలతో గొప్ప యుద్ధం చేస్తున్నారు. వర్షాకాలంలో అన్నివైపులనుంచి మేఘాలు జలధారలు వర్షించినట్లు, వారిద్దరి నుండి వేలకొలది శరధారలు వర్షించాయి. దుర్యోధనుడు తీవ్రవేగం గల అయిదు బాణాలతో ధృష్టద్యుమ్నుని పీడించి, మళ్లీ ఏడు బాణాలతో అతనిని గాయపరిచాడు.

దృఢ పరాక్రమం గల బలవంతు డయిన ధృష్టద్యుమ్నుడు, డెబ్బది బాణాలతో దుర్యోధనుని బాధించాడు. దుర్యోధనుడు పీడింపబడటం చూసి, అతని సోదరులందరు విశాలసేనతో ధృష్టద్యుమ్నుని చుట్టుముట్టారు. అంతమంది వీరులు తన్ను చుట్టుముట్టినా, శూరుడైన ధృష్టద్యుమ్నుడు అస్త్రలాఘవాన్ని ప్రదర్శిస్తూ, యుద్ధక్షేత్రంలో విహరించాడు. శిఖండి ప్రభద్రకులతో కలసి కృతవర్మతోను, మహారథుడైన కృపాచార్యులతోను యుద్ధం చేశాడు. అక్కడ కూడా, జీవితం మీద ఆశ వదులుకొన్న సైనికుల మధ్య, ప్రాణాలను పణంగా పెట్టే, ద్యూతమనే ఘోర సంగ్రామం జరుగుతోంది. శల్యుడు అన్ని దిక్కులా బాణవర్షాన్ని కురిపిస్తూ, సాత్యకి, భీమసేనులతో సహా పాండవులను పీడించాడు. నకుల సహదేవులతో కూడా పరాక్రమంతో, అస్త్రబలంతో శల్యుడు తలపడ్డాడు. మహాసమరంలో శల్యబాణాలతో బాధింపబడే పాండవులను రక్షించటానికి, ఏ మహారథులూ ముందుకు వెళ్ళలేకపోయారు. ధర్మరాజు శల్యునిచే బాధింపబడుతూండగా, నకులుడు వేగంగా శల్యుని ఆక్రమించాడు. నకులుడు యుద్ధంలో శల్యుని శర సముదాయంతో కప్పి వేసి, మందహాసం చేస్తూ పదిబాణాలతో అతని రొమ్ము మీద కొట్టాడు. పది బాణాలను నకులుడు ధనుస్సు అనే యంత్రం ద్వారా ప్రయోగించాడు. తన మేనల్లు డయిన నకులునిచే పీడింపబడిన శల్యుడు, వంగిన కణుపులు గల బాణాలతో అతనిని బాధించాడు. పిమ్మట యుధిష్ఠిరుడు, భీమసేనుడు, సాత్యకి, సహదేవుడు అందరూ కలసి శల్యుని ఆక్రమించారు. రథశబ్దాలతో దిక్కులను పిక్కటిల్లజేస్తూ, భూమిని కంపింపజేస్తూ, వేగంగా తనను ఆక్రమిస్తున్న వీరులను శల్యుడు ముందుకు సాగకుండా నిరోధించాడు.

శల్యుడు యుద్ధంలో మూడు బాణాలతో యుధిష్ఠిరుని, అయిదింటితో భీమసేనుని, సాత్యకిని వందబాణాలతో, సహదేవుని మూడు బాణాలతో గాయపరచి, క్షురప్రంతో నకులుని ధనుస్సును ముక్కలు చేశాడు. నకులుడు వెంటనే మరొక ధనుస్సును తీసుకొని, శరవర్షంతో శల్యుని రథాన్ని ముంచివేశాడు. ఆర్యా! యుధిష్ఠిర సహదేవులు పది పది బాణాలతో శల్యుని వక్షఃస్థలాన్ని గాయపరిచారు. భీమసేనుడు అరువది బాణాలతో, సాత్యకి పది బాణాలతో మద్రరాజును హింసించారు. క్రుద్ధుడైన శల్యుడు తొమ్మిది బాణాలతో సాత్యకిని గాయపరచి, తిరిగి డెబ్బది బాణాలతో హింసించాడు. వెంటనే శల్యుడు సాత్యకిని పిడికిలి మీద కొట్టి, బాణాలతో సహా ధనుస్సును ముక్కలు చేసి, అతని నాలుగు గుర్రాలను చంపాడు. సాత్యకిని రథహీనుని చేసి శల్యుడు నూరు బాణాలతో అతనిని గాయపరిచాడు. పదిబాణాలతో క్రుద్ధులైన నకులసహదేవులను,

భీమసేనుని, యుధిష్ఠిరుని హింసించాడు. పాండవులంతా కలిసి కూడా శల్యుని ఎదుర్కోలేకపోవడమనే ఆశ్చర్యం అతని పౌరుషంలో చూశాం. శల్యునిచే పీడింపబడుతూ, పాండవులు అతని వశమవటం చూసి, సాత్యకి వేగంగా అతనిని ఆక్రమించాడు. సాత్యకి సమరభూమిలో ఉన్న మద్రరాజును చూసి, పది బాణాలతో పీడించి 'నిలు, నిలు' అని పలికాడు. సాత్యకి వలన మిక్కిలి గాయపడిన శల్యుడు కూడా వాడియైన బాణాలతో సాత్యకిని కూడా గాయపరిచాడు. కౌంతేయులు సాత్యకితో తలపడే మద్రరాజును వధించాలని రథాలతో ఆక్రమించారు.

అచ్చట సంకుల యుద్ధం జరిగింది. సింహాలవలె గర్జిస్తూ యుద్ధం చేసే శూరుల రక్తం నీళ్ళవలె ప్రవహించింది. సింహాలు గర్జిస్తూ పరస్పరం తలపడినట్లు, వీరుల మధ్య భయంకర యుద్ధం జరిగింది. వారి సహస్రబాణ సముదాయాలతో రణభూమి అంతా నిండిపోయింది. ఆకాశంకూడా బాణమయంగా కనిపించింది. వీరులచే ప్రయోగింపబడిన బాణాలతో ఒక్కసారిగా అంతటా అంధకారం అలుముకొని, మేఘచ్ఛాయవలె క్షనిపించింది. రాజా! కుబుసాలు విడిచిన పాములువంటి స్వర్ణపుంఖాలు గల బాణాలచే దిక్కులన్నీ భాసిల్లాయి. శత్రుసంహారకు డగు శల్యుడు ఒక్కడే అంతమంది వీరులతో యుద్ధంచేస్తూ అద్భుతం చేశాడు. మద్రరాజు భుజాలనుండి విడువబడిన భయంకర బాణాలతో భూమిఅంతా నిండిపోయింది. రాజా! పూర్వకాలంలో దానవసంహారానికి ఇంద్రరథంవలె, శల్యుని రథాన్ని యుద్ధభూమిలో విహరించడం చూశాం."

16. శల్య యుధిష్ఠిరుల యుద్ధము.

సంజయుడు చెపుతున్నాడు. "మీమ్మట మీ సైనికులు రణభూమిలో మద్రరాజును ముందు ఉంచుకొని, వేగంతో పాండవుల మీద విరుచుకుపడ్డారు. మీసైనికులంతా క్లేశాలనుభవిస్తున్నా సంఖ్యాబలంతో యుద్ధోన్మత్తులై ముందుకు సాగుతూ, ఒక్కసారిగా పాండవసేనను క్షోభింపజేశారు. యుద్ధంలో కౌరవసేనచే దెబ్బతిన్న పాండవవీరులు కృష్ణార్జునులు చూస్తుండగానే, భీముడు వారిస్తున్నా సరే నిలబడలేకపోయారు. కుపితుడైన అర్జునుడు పదాతి దళంతోకూడా కృపాచార్య కృతవర్మలను బాణ సముదాయంతో ముట్టడించాడు. సహదేవుడు సైన్యంతో సహా శకునిని ముట్టడించాడు. నకులుడు ప్రక్కనే ఉండి మద్రరాజును చూశాడు. ద్రౌపది పుత్రులు ఎంతోమంది రాజులను ముందుకు సాగకుండా నివారించారు. శిఖండి ద్రోణపుత్రు డయిన అశ్వత్థామను నిలువరించాడు. భీమసేనుడు గదను చేతబూని

దుర్యోధనునీ, సైన్యంతో కూడి యుధిష్ఠిరుడు శల్యునీ వారించారు. పాండవుల సంపూర్ణ సేనతో ఒంటరిగా యుద్ధంచేసే శల్యుని అద్భుత పరాక్రమాన్ని అపుడు చూశాం. అప్పుడు యుధిష్ఠిర సమీపంలో శల్యుడు, చంద్రుని సమీపంలో శనైశ్చరగ్రహంవలె కనబడ్డాడు. అతడు విష సర్పాలవంటి బాణాలతో యుధిష్ఠిరుని పీడించి, మళ్లీ భీమసేనుని వైపు పరుగెత్తి, శరవర్షంతో అతనిని ఆక్రమించాడు. శల్యుని యుద్ధలాఘవాన్ని, అస్త్రకౌశలాన్ని చూసి మీ వీరులు, శత్రు పక్షంవారూ కూడా ఎంతో ప్రశంసించారు. శల్యునిచే బాగా దెబ్బతిని, మిక్కిలి గాయపడిన పాండవ సైనికులు యుధిష్ఠిరుడు అరుస్తున్నా యుద్ధభూమి విడిచి పారిపోయారు.

మద్రరాజుచే తమ సైన్యం చంపబడుతుంటే ధర్మరాజు కోపపరవశు డయ్యాడు. యుధిష్ఠిరుడు పౌరుషంతో విజయమో, వీరమరణమో యని నిశ్చయించుకొని మద్రరాజును కొట్టాడు. అతడు తన సోదరులను, శ్రీకృష్ణుని, సాత్యకిని పిలిచి ఇట్లు చెప్పాడు. "భీష్మ, ద్రోణ, కర్ణులు, ఇతర రాజులు కౌరవపక్షంలో పరాక్రమించి యుద్ధంలో మరణించారు. మీరంతా పురుషకారంతో ఉత్సాహం చూపి మీ పనిని నిర్వర్తించారు. ఇక నాభాగంగా నాకోసం శల్యు డొక్కడు మిగిలిపోయాడు. ఇతనిని యుద్ధంలో జయిస్తానని భావిస్తున్నాను. దీనికి సంబంధించి నా మనస్సులో ఉన్నమాట మీ కందరికీ చెపుతాను. యుద్ధంలో ఇంద్రునికి కూడా అజేయులు శూర సమ్మానితులయిన నకుల సహదేవులు నా రథచక్ర రక్షకులుగా ఉంటారు. క్షత్రియధర్మ పాలకులు, సమ్మాన యోగ్యులు, సత్యప్రతిజ్ఞ లయిన నకుల సహదేవులు నాకోసం తనమామ అయిన శల్యునితో యుద్ధం చేస్తారు. శల్యుడు నన్నుగాని, నేను శల్యునిగాని వధిస్తాము. మీ అందరికి కళ్యాణమగుగాక. ఇది నా సత్య వాక్కుగా మీరంతా తెలుసుకోండి. క్షత్రియధర్మాన్ని అనుసరించి నేను నాభాగాన్ని పూర్తి చేసే లక్ష్యంతో, విజయమో వీరమరణమో అని, శల్యునితో నేడు యుద్ధం చేస్తా. కనుక రథ యోజకులు నారథంలో యథావిధిగా అధికంగా శస్త్రాలు, ఇతర సామగ్రిని ఏర్పాటు చేయండి. సాత్యకి నా రథం దక్షిణ చక్రాన్ని, ధృష్టద్యుమ్నుడు ఉత్తరచక్రాన్ని రక్షిస్తుంటారు. అర్జునుడు వెనుక భాగాన రక్షకుడుకాగా శస్త్రధారులలో శ్రేష్ఠుడు భీముడు పురోభాగాన ఉంటాడు. ఈ ఏర్పాటుతో నేను శల్యుని మించిపోతా" నన్నాడు యుధిష్ఠిరుడు. వెంటనే సోదరహితంకోరే పాండవులు అలాగే చేశారు. పిమ్మట పాండవసేనకు, విశేషించి పంచాల, సోమక మత్స్యవీరులకు ఆనందం కలిగింది. యుధిష్ఠిరుడు ఇలా ప్రతిజ్ఞ చేసి, మద్రేశుని ముట్టడించాడు. పాంచాలవీరులు శంఖం, భేరులు, యుద్ధవాద్యాలను వాయిస్తూ

సింహనాదం చేశారు. కురుశ్రేష్ఠ లంతా రోషంతో కూడి, హర్షోల్లాసంతో వేగశీలు డయిన మద్రరాజును ఆక్రమించారు. గజఘంటానాదంతో శంఖధ్వనులతో వాద్యాల మహాశబ్దాలతో భూమి అంతా మారుమ్రోగుతోంది.

అప్పుడు మీ పుత్రుడు దుర్యోధనుడు, వీర్యవంతుడైన శల్యుడు వారందరినీ ముందుకు రానీయకుండా నిరోధించారు. శల్యుడు ధర్మరాజుపై శంబరాసురునిమీద ఇంద్రునివలె, శరవర్షాన్ని కురిపించాడు. అదేవిధంగా ధర్మరాజు కూడా సుందరమైన ధనుస్సును చేతబూని, ద్రోణునిచే ఉపదేశింపబడిన వివిధ అస్త్రవిద్యలను ప్రదర్శిస్తూ, బాగా విచిత్రరీతిలో శరవర్షాన్ని కురిపించాడు. యుద్ధరంగంలో విహరించే యుధిష్ఠిరుని దగ్గర ఎటువంటి బలహీనత కనబడలేదు. మాంసాన్ని పొందాలనే కోరికగల రెండు సింహాలు పరస్పరం తలపడినట్లు, వారిద్దరూ యుద్ధంలో వివిధ బాణాలతో తలపడి ఒకరినొకరు గాయపరిచారు. రాజా! భీమసేనుడు యుద్ధకుశలుడైన మీ పుత్రుడు దుర్యోధనుని; ధృష్టద్యుమ్న, సాత్యకి, నకుల సహదేవులు శకుని మున్నగు వీరులను ఎదుర్కొన్నారు. నీ యొక్క దురాలోచన ఫలితంగా, విజయాన్ని కోరే మీకూ, శత్రుసేనలకూ మధ్య ఘోరయుద్ధం జరిగింది. దుర్యోధనుడు యుద్ధానికి ఆదేశించి, అవనతమైన పర్వులుగల బాణంతో భీముని సువర్ణమయ ధ్వజాన్ని ముక్కలు చేశాడు. చిరుమువ్వలతో చూడ్డానికి అందంగా ఉన్న ధ్వజం భీమసేనుడు చూస్తూండగానే శబ్దాలతో క్రిందపడింది. పిమ్మట దుర్యోధనుడు వాడియైన క్షురంతో, ఏనుగు తొండం వంటి భీమసేనుని ధనుస్సును విరక్కొట్టాడు. ధనుస్సు విరిగిపోతే భీమసేనుడు రథశక్తితో నీ పుత్రుని ఉరస్సును భేదించాడు. వెంటనే అతడు రథంమీద మూర్ఛపోయాడు. దుర్యోధనుడు మూర్ఛపోతే భీముడు తిరిగి క్షురప్రంతో అతని సారథి శిరస్సును ఖండించాడు. భారతా! సారథి మరణిస్తే గుర్రాలు రథాన్ని తీసుకొని, నలుదిక్కులా పరుగెత్తాయి. అప్పుడు మీ సైనికులు హాహాకారాలు చేశారు.

మహారథుడైన ద్రోణపుత్రుడు నీ పుత్రుని రక్షించటానికి అటు పరుగెత్తాడు. కృపాచార్య కృతవర్మలు కూడా నీ కొడుకును రక్షించడానికి వచ్చారు. సైనికులంతా చెల్లాచెదరవుతూండగా దుర్యోధనుని అనుచరగణం భయపడ్డారు. అప్పుడు అర్జునుడు ధనుస్సు ఎక్కుపెట్టి, బాణాలతో వారిని చంపాడు. యుధిష్ఠిరుడు అమర్షతో కూడి దంతాలవలె తెల్లనై, మనోవేగం కల గుఱ్ఱాలను స్వయంగా ప్రేరేపించి, మద్రేశుని వైపు పరుగుతీయించాడు. అచ్చట మృదుస్వభావుడు, జితేంద్రియుడూ అయిన యుధిష్ఠిరుడు

కరోరు డవటం ఆశ్చర్యంగా చూశాం. కోపంతో వణుకుతూ, విప్పారిన కన్నులతో కుంతీ పుత్రుడు వాడియైన బాణాలతో ఎంతోమంది వందల వేలకొలది సైనికులను చిన్నాభిన్నం చేశాడు. ధర్మరాజు తనకు ఎదురుపడిన సేన నంతటిని శరాఘాతాలతో, వజ్రాయుధంతో ఇంద్రుడు కొండలను వలె నేలగూల్చాడు. బలీయమైన వాయువు మేఘాలను చెల్లాచెదరు చేస్తున్నట్లు, బలవంతు డయిన యుధిష్ఠిరు డొక్కడే అశ్వసూతధ్వజ రథ సహిత రథికులను నేలకూలుస్తూ వారితో ఆడుకొన్నాడు. క్రుద్ధుడైన రుద్రుడు పశువులను సంహరించినట్లు యుధిష్ఠిరుడు కుపితుడై యుద్ధంలో ఆశ్వికులను, అశ్వాలను, పదాతి సైన్యాన్ని చిన్నాభిన్నం చేశాడు. అతడు అంతటా శరవర్షం కురిపిస్తూ, యుద్ధభూమిని శూన్యంగా చేసి, మద్రరాజుపై దండెత్తి అతనిని "శల్యా"నిలు అని అన్నాడు. యుద్ధంలో భయంకరంగా ప్రవర్తించే యుధిష్ఠిరుని పరాక్రమాన్ని చూసి, మీ సైనికులంతా భయపడ్డారు. శల్యుడు మాత్రం అతనిని ఎదిరించాడు. వారిద్దరు మిక్కిలి కోపించి శంఖనాదం చేస్తూ, ఒకరినొకరు పిలుచుకొంటూ, రెచ్చగొడుతూ తలపడ్డారు. శల్యుడు శరవర్షంతో యుధిష్ఠిరుని పీడిస్తే అతడు బాణవర్షంతో శల్యుని కప్పివేశాడు. ఆ సమయంలో వీరు లిద్దరు కంకపత్రయుక్త బాణాలతో కూడి రక్తంకారుతూ కనబడ్డారు. వసంత ఋతువులో పుష్పించిన రెండు పలాశ వృక్షాల వలె వారు భాసిల్లారు. ప్రాణాల్ని పణంగా పెట్టుకొని, యుద్ధం చేసే ఇద్దరు వీరులనూ చూసి, సైనికులంతా వారిలో ఎవరికి విజయమో నిశ్చయించుకొనలేక పోతున్నారు.

భారతా! మద్రాధీశుని చంపి యుధిష్ఠిరుడు రాజ్యాన్ని అనుభవిస్తాడా? లేక మద్రరాజు యుధిష్ఠిరుని చంపి రాజ్యాన్ని దుర్యోధనునికి అప్పగిస్తాడా? అని వీరులు ఏ నిశ్చయానికీ రాలేకపోయారు. యుద్ధం చేసే ధర్మరాజుకు అంతా సవ్యమయింది. పిమ్మట శల్యుడు యుధిష్ఠిరునిపైకి నూరు బాణాల్ని ప్రయోగించి, వాడియైన బాణంతో అతని ధనుస్సును ఖండించాడు. యుధిష్ఠిరుడు మరో ధనుస్సును తీసుకొని, మూడువందల బాణాలతో శల్యుని గాయపరిచి, క్షురంతో అతని ధనుస్సును ఖండించాడు. నాల్గు బాణాలతో అతని గుఱ్ఱాలను చంపాడు. తిరిగి రెండు వాడియైన బాణాలతో ఇద్దరు పార్శ్వ రక్షకులను హతమార్చాడు. పిమ్మట ప్రకాశించే వాడియైన బల్లెంతో అతని ధ్వజాన్ని ఖండించాడు. ఇదంతా చూసి, దుర్యోధన సేన అక్కడినుండి చెల్లాచెదరైంది. శల్యుని అవస్థను గమనించి, అశ్వత్థామ అక్కడకు వేగంగా వచ్చి తనరథంపై అతనిని కూర్చుండబెట్టుకొని, అక్కడినుండి వెళ్లిపోయాడు. యుధిష్ఠిరుడు హుంకరిస్తూ, ముహూర్తకాలం

వారిని వెంబడించాడు. పిమ్మట శల్యుడు మందహాసం చేస్తూ, మరోరథం ఎక్కాడు. అది శోభిల్లే మహామేఘాలవలె ధ్వనిచేస్తోంది. అందులో యంత్రాది సామగ్రి కూర్చబడింది, శత్రువులకు అది గగుర్పాటు కలిగిస్తోంది."

17. శల్య వధ

సంజయుడు చెపుతున్నాడు. "పిమ్మట శల్యుడు మరియొక ధనుస్సును తీసుకొని, యుధిష్ఠిరుని గాయపరిచి, సింహం వలె నాదం చేశాడు. శల్యుడు వర్షించే మేఘునివలె క్షత్రియవీరులపై బాణవర్షాన్ని కురిపించాడు. అతడు పది బాణాలతో సాత్యకిని, మూడు మూడింటితో భీమసేనుని, సహదేవుని గాయపరచి, వెంటనే యుధిష్ఠిరుని పీడించాడు. అతడు అశ్వ, రథ, కూబరాలతో సహా వీరు లందరిని తనబాణాలతో బాధించాడు. గజాల్ని, గజారోహకుల్ని, అశ్వాల్ని, అశ్వారూఢుల్ని, రథ రథికుల్నీ ఒక్కసారిగా నాశం చేశాడు. అతడు సాయుధాలైన భుజాల్ని, ధ్వజాల్ని ఖండించాడు. దర్భలుపరిచిన వేదిలాగా భూమి నంతటినీ అతడు యోధులను పరిచినట్లు చేశాడు. మృత్యువువలె, యమునివలె శత్రుసైనికులను సంహరించే శల్యుని పాండవ పాంచాల, సోమకవీరులు మిక్కిలి కుపితులై చుట్టుముట్టారు. యుధిష్ఠిరునితో తలపడే శల్యుని భీమసేన, సాత్యకి, నకుల సహదేవులు తమతో యుద్ధానికి ఆహ్వానించారు. ఆ వీరులు శల్యుని వారించి, ఉగ్రవేగం కల బాణాలతో కొట్టారు. భీమసేన, నకుల, సహదేవ, సాత్యకులచే రక్షింపబడే యుధిష్ఠిరుడు మిక్కిలి వేగంగల బాణాలతో శల్యుని వక్షఃస్థలాన్ని కొట్టాడు. బాణపీడితుడైన మద్రాధిపతిని చూసి, దుర్యోధనుని ఆదేశంతో సిద్ధమైన నీ రథికసేన యుధిష్ఠిరుని ఎదురుగా వచ్చి చుట్టుముట్టారు. శల్యుడు వెంటనే ఏడు బాణాలతో యుధిష్ఠిరుని పీడించాడు. యుధిష్ఠిరుడు కూడా తొమ్మిది బాణాలతో శల్యుని గాయపరిచాడు. శల్య యుధిష్ఠిరు లిద్దరు బాణాలతో ఒకరినొకరు ఆచ్ఛాదించుకొన్నారు.

అటుపిమ్మట శల్యుడు సూర్యాగ్నులతో సమానమైన తేజస్సుగల బాణంతో యుధిష్ఠిరుని రొమ్ము గ్రాయపరిచాడు. గాయపడినా, యుధిష్ఠిరుడు బాగా ప్రయోగించిన బాణంతో మద్రాధిపతిని మోది, ఎంతో సంతసించాడు. శల్యుడు క్షణంలో తేరుకొని, కోపంతో శీఘ్రంగా నూరుబాణాలతో యుధిష్ఠిరుని పీడించాడు. యుధిష్ఠిరుడు కుపితుడై, తొందరగా తొమ్మిది బాణాలతో శల్యుని హృదయాన్ని, కవచాన్ని భేదించి మరో ఆరుబాణాలతో గాయపరిచాడు. మద్రాధిపతి ధనుస్సును ఎక్కుపెట్టి, ఎన్నో బాణాల్ని ప్రయోగించాడు.

రెండు బాణాలతో యుధిష్ఠిరుని ధనుస్సును విరిచాడు. యుధిష్ఠిరుడు భయంకరమైన మరియొక ధనుస్సును చేతబూని, తీక్ష్ణమైన బాణాలతో శల్యుని అంతటా గాయపరిచాడు. అప్పుడు శల్యుడు తొమ్మిది బాణాలతో భీమసేనుని, యుధిష్ఠిరుని సువర్ణమయమైన దృఢకవచాన్ని భేదించి, వారి భుజాల్ని చీల్చివేశాడు. పిమ్మట తేజోవంతమైన క్షురంతో యుధిష్ఠిరుని ధనుస్సును భగ్నం చేశాడు. కృపాచార్యుడు ఆరుబాణాలతో యుధిష్ఠిరుని రథసారధిని కొట్టగానే, అతడు వారి ఎదుటే నేలమీద పడ్డాడు. మద్రరాజు నాల్గుబాణాలతో యుధిష్ఠిరుని రధాశ్వాలను చంపి, పాండవయోధుల వినాశానికి పూనుకొన్నాడు.

ఇతరులకు సాధ్యంకాని, అద్భుతమైన దుష్కరకర్మను తన విషయంలో ఒక్క శల్యుడు మాత్రం చేయటం చూసి, ధర్మరాజు విషాదగ్రస్తుడై 'ఇంద్రావరజుడైన శ్రీకృష్ణుని మాటలు విధిబలంచే వ్యర్థంకావుకదా! యుద్ధంలో నీవు శల్యుని చంపమని శ్రీకృష్ణుడు పలికిన పలుకులు మరొకవిధంగా కాకూడదు గదా' అని చింతించాడు.

యుధిష్ఠిరుని యెడల మద్రరాజు ఇలా చేస్తే, భీమసేనుడు వేగం కల బాణంతో అతని ధనుస్సును భగ్నంచేసి, రెండు బాణాలతో గాయపరిచాడు. మిక్కిలి కుపితుడైన భీముడు మరొకబాణంతో శల్యసారథి శిరస్సును ఖండించి, అతని నాల్గుగుఱ్ఱాలను కూడా చంపాడు. భీముడు, సహదేవుడు ఇద్దరూ శల్యునిపై బాణవర్షం కురిపించారు. ఆ బాణాలతో శల్యుడు మోహితు డవటం చూసి, భీముడు బాణాలతో అతని కవచాన్ని ఛేదించాడు. భీమబలు డయిన శల్యుడు సహస్రతారాంకితమైన డాలు, కత్తి తీసుకొని రథంనుంచి క్రిందికి దూకి, కుంతీపుత్రునివైపు పరుగెత్తాడు. అతడు నకులుని రథం కొయ్యను విరిచి, యుధిష్ఠిరుని ముట్టడించాడు. మీదిమీదికి వచ్చే శల్యుని ధృష్టద్యుమ్నుడు, ద్రౌపదీ పుత్రులు, శిఖండి, సాత్యకి ఒక్కసారిగా నాల్గువైపులా ముట్టడించారు. భీముడు తొమ్మిది బాణాలతో అతని డాలును ముక్కలు చేశాడు. తిరిగి మీసేన మధ్యలో హర్షంతో గర్జిస్తూ, అతడు భల్లాలతో అతనికత్తి పిడిని భగ్నం చేశాడు. భీమసేనుని అద్భుతకర్మను చూసి, పాండవవీరులు, రథికులు సంతసించారు. వారు బిగ్గరగా నవ్వుతూ నాదం చేశారు. శంఖాలను ఊదారు. భయంకర శబ్దాలతో సంతప్తులైన కౌరవవీరులు విషాదంతో అచేతనులవలె అయ్యారు. రక్తసిక్త శరీరాలతో వారు తలొక దిక్కుకు పారిపోయారు.

శల్యుడు, సింహం లేడిని పట్టుకొనటానికి ఉరికినట్లు, ఒక్కసారిగా, వేగంగా యుధిష్ఠిరునివైపు బయలుదేరాడు. తన గుఱ్ఱాలూ, సారథి చంపబడితే ప్రజ్వరిల్లే అగ్నివలె, కోపంతో భాసించే యుధిష్ఠిరుడు మద్రాధిపతిని చూసి, అతనిమీద వేగంగా దాడిచేశాడు. శ్రీకృష్ణుని మాటలను తలుచుకొని శల్యుని చంపటానికి నిశ్చయించి సూతాశ్వాలు, చనిపోగా

వట్టి రథంపై నిలబడి ధర్మరాజు శక్తిని కాంక్షించాడు. యుధిష్ఠిరుడు శల్యుని పనులను స్మరిస్తూ, ఇక నాభాగమే మిగిలిఉన్నదని తలచి, శ్రీకృష్ణుడు చెప్పిన ప్రకారం శల్యవధకై సంకల్పించాడు. ధర్మరాజు, కనకంవలె ప్రకాశించే శక్తిని చేతబూని, లోలోపల కోపిస్తూ, రోషంతో మండే కళ్ళను పెద్దవిచేసి మద్రరాజును చూశాడు. రాజా! పవిత్రాతఃకరణుడు, పాపరహితు డగు ధర్మరాజు రోషంతో చూసినా గాని, మద్రరాజు మాడి బూడిద కాలేదంటే, నాకు ఆశ్చర్యంగా ఉంది. పిమ్మట యుధిష్ఠిరుడు సుందరమై, భయంకరమైన దండం గల్గి మణులచే ప్రకాశించే దేదీప్యమాన శక్తిని మద్రరాజు మీదకు వేగంగా ప్రయోగించాడు. నిప్పుకణాలను వెదజల్లుతూ ప్రకాశించే ఆ శక్తి ప్రళయకాలంలో ఆకాశం నుండి క్రిందపడే పెద్ద ఉల్కవలె, వేగంగా శల్యునిమీద పడటాన్ని అక్కడి కౌరవవీరులంతా చూశారు. పాశం చేతిలోకల కాళరాత్రివలె ఉగ్రరూపం గల్గి, యముని ధాత్రివలె, భయంకరమైన బ్రహ్మదండంవలె, అమోఘమైన శక్తిని ధర్మరాజు ప్రయత్నపూర్వకంగా ప్రయోగించాడు. పాండవులు ఆ శక్తిని చందనం, మాల, అగ్రాసనం, పాన భోజనాలతో ప్రయత్నపూర్వకంగా పూజించారు. అది ప్రళయకాల సంవర్తకాగ్నివలె ప్రకాశిస్తోంది. అథర్వాంగిరస మంత్రాలచే ప్రకటితమైన కృత్యవలె మిక్కిలి భయంకరంగా ఉంది. శత్రువుల ప్రాణాలను, శరీరాన్ని లక్ష్యంగా చేసుకొని, భూమ్యంతరిక్ష జలాశయ ప్రాణులను చంపడంలో సమర్థమైన ఆ శక్తి త్వష్ట (విశ్వకర్మ) శంకరుని కోసం తయారుచేసినది. చిరుగంటలు, పతాకలు, మణి వజ్రాలతో కూడినది, వైదూర్యమణులు పొదగబడినది. తప్తకాంచనమయదండం కలది. ఆ శక్తిని విశ్వకర్మ యథావిధిగా ప్రయత్నపూర్వకంగా తయారుచేశాడు. బ్రహ్మద్వేషులను అంతం చేయటంలో అమోఘమైనది. బలప్రయత్నాలచే మిక్కిలివేగం కల్గిన శక్తిని యుధిష్ఠిరుడు మద్రరాజును వధించటానికి ఘోరమంత్రాలచే అభిమంత్రించి, తగినరీతిగా ప్రయత్నంతో విడిచిపెట్టాడు. క్రోధంతో నృత్యంచేస్తున్న వానివలె ధర్మరాజు దృఢమైన బాహువులను ముందుకు చాచి, శల్యునిపైకి శక్తిని ప్రయోగించి 'పాపీ! నువ్వు చంపబడినట్లే!' యని గర్జించాడు.

మద్రవినాశకాలంలో యుధిష్ఠిరుని రూపం పూర్వకాలం త్రిపురాసుర సంహారంలో మహేశ్వరుని రూపంవలె ఉంది. అతని శరీరకాంతులతో ప్రభామండలం ప్రకాశిస్తోంది.

ఎవరూ వారింప శక్యంగాని శక్తిని యుధిష్ఠిరుడు సర్వశక్తులూ ఒడ్డి, ప్రయోగించాడు. ఆశక్తి శల్యుని మర్మస్థానాల్ని చీల్చి, విశాలమైన వక్షఃస్థలాన్ని ఛేదించి, అతని కీర్తినంతటిని దగ్ధం చేస్తూ, జలంవలె వెనుదిరగక భూమిలో దిగబడింది. గాయాలవలన ముక్కు, కళ్లు, చెవులు ముఖంనుండి స్రవించిన రక్తంతో శల్యుని శరీరమంతా తడిసిపోయింది.

శల్యుడు వజ్రాయుధంచే కొట్టబడిన పర్వత శిఖరాలవలె, రెండు చేతులు చాచి, రథంనుండి నేలమీద పడ్డాడు. వసుధను ప్రేయసిని వలె చిరకాలం అనుభవించి, సర్వావయవాలతో ఆమెను కౌగలించుకొని నిద్రించువానివలె శల్యుడు ఉన్నాడు. ధార్మికమైన యుద్ధంలో ధర్మసూనుడగు ధర్మరాజుచే చంపబడిన శల్యుడు యజ్ఞంలో యథావిధిగా హవిస్సును పొంది శాంతించిన స్విష్టకృత్ అనే అగ్నివలే శాంతించాడు. శక్తి శల్యుని హృదయాన్ని చీల్చింది. ఆయుధ ధ్వజాలు చిన్నాభిన్నా లయ్యాయి. విగతజీవు డయ్యాడు. అయినప్పటికీ వర్చస్సు అతన్ని విడిచిపెట్టలేదు. పిమ్మట యుధిష్ఠిరుడు ఇంద్రధనుస్సు వలె కాంతిమంతమైన ధనుస్సును తీసుకొని, సర్పసంహారంచేసే గరుడుని వలె వాడియైన బల్లెములతో క్షణకాలం శత్రునాశం చేశాడు. యుధిష్ఠిరుని బాణసమూహంచే ఆచ్ఛాదితులైన మీ సైనికులు ఏమీ కనపడక ఒకరినొకరు గాయపరచుకొని, బాధచెందారు. శరీరాలనుండి రక్తం కారుతూండగా, వారు తమ ఆయుధాలను, జీవితాన్ని వదులుకొన్నారు.

శల్యుడు నేలకొరగగా భ్రాతృతుల్య గుణసంపన్నుడైన అతని అనుజుడు రధారూఢుడై యుధిష్ఠిరునిపైకి దండెత్తాడు. తన సోదరుని మరణానికి ప్రతీకారం తీర్చుకోవడానికై, శల్యుని సోదరుడు అనేక బాణాలతో అతనిని గాయపరిచాడు. అప్పుడు ధర్మరాజు త్వరగా ఆరుబాణాలతో అతనిని హింసించి, రెండు క్షురాలతో అతని ధనుస్సును, ధ్వజాన్ని భగ్నం చేశాడు. అనంతరం ప్రకాశించే దృఢమైన, వాడి బాణంతో ఎదురుగా ఉన్న శల్యసోదరుని శిరస్సును ఖండించాడు. పుణ్యం నశిస్తే స్వర్గం నుండి భ్రష్టు డయిన జీవునివలె, అతని శిరస్సు రథంనుండి క్రిందపడింది. వెంటనే రక్తసిక్తమైన అతని శరీరం రథంనుండి క్రిందపడింది. అదిచూసిన మీసైన్యంలో అలజడి రేగింది. కౌరవసేన హాహాకారాలు చేస్తూ పారిపోయింది. భయపడిపారిపోతున్న మీ సైనికులమీద బాణవర్షం కురిపిస్తూ, సాత్యకి వారిని వెంబడించాడు. సాత్యకి రావడం చూసి ఆ కృతవర్మ నిర్భయునివలె త్వరితంగా అతనిని నిరోధించాడు. వృష్ణివంశ వీరులగు సాత్యకి కృతవర్మలు బలీయాలైన రెండు సింహాలవలె పరస్పరం తలపడ్డారు. ఆ యిద్దరు వీరులు సూర్యసమకాంతులుకల బాణాలతో ఒకరినొకరు ఆచ్ఛాదన చేశారు. ఆ యిద్దరి వీరుల ధనుస్సులనుండి వెలువడిన శీఘ్రగతికల్గిన బాణాలను గాలిపటాలవలె ఆకాశంలో వ్యాపించటం చూశాం. కృతవర్మ పదిబాణాలతో సాత్యకిని, మూడింటితో గుఱ్ఱాలను గాయపరిచి, ఒక బాణంతో అతని ధనుస్సును విరిచాడు. రెండుముక్కలైన ధనుస్సును విడిచి, సాత్యకి దానికంటె వేగశాలియగు మరియొక ధనుస్సును శీఘ్రంగా గ్రహించాడు. సాత్యకి పదిబాణాలతో కృతవర్మ హృదయాన్ని గాయపరిచాడు. పిమ్మట చక్కని భల్లములతో కృతవర్మ యొక్క

రథాన్ని, దాని కాడిని, విరిచి, శీఘ్రంగా అతని గుఱ్ఱాలను, పార్శ్వ రక్షకులను, సారథిని వధించాడు. కృతవర్మను రథహీనునిగా చూసి, కృపాచార్యుడు అతనిని శీఘ్రంగా తన రథంపై కూర్చుండబెట్టుకొని దూరంగా తీసుకుపోయాడు.

మద్రరాజు శల్యుడు చావడం, కృతవర్మ రథహీను డవడం చూసి, దుర్యోధనసేన తిరిగి రణరంగం నుండి పారిపోయింది. అంతటా ధూళి వ్యాపించటంచేత శత్రుసేనకు ఈ విషయం తెలియలేదు. ఎక్కువమంది వీరులు మరణించడం చేత సేన వెనుదిరిగింది. పిమ్మట భయంకరంగా పైకెగసిన ధూళి క్షణకాలంలోనే రక్తప్రవాహాలచే ఉపశమించటం వారు చూశారు. తన సేన అంతా భగ్నమయిందని దగ్గరనుండి దుర్యోధనుడు చూసి, వేగంగా వచ్చే పాండవులను అందరినీ ఒక్కడే అడ్డుకొన్నాడు. రథాలతో కూడిన పాండవులను, ధృష్టద్యుమ్నుని, దుర్జయుడగు ఆనర్తుని చూసి అతడు వాడియైన బాణాలతో వారిని వారించాడు. మనుష్యులు తమను సమీపించిన మృత్యువును తప్పించుకోలేనట్లు శత్రుపక్షీయులు దుర్యోధనుని దాటి ముందుకు వెళ్ళలేకపోయారు. కృతవర్మ కూడా మరియొక రథాన్ని ఎక్కి, అక్కడకి తిరిగి వచ్చాడు. యుధిష్ఠిరుడు నాల్గుబాణాలను ప్రయోగించి, కృతవర్మ నాల్గు అశ్వాలను చంపి, ఆరు బల్లెములతో కృపాచార్యుని గాయపరిచాడు. అప్పుడు అశ్వత్థామ గుఱ్ఱాలు చనిపోవడంతో రథహీనుడైన కృతవర్మను యుధిష్ఠిరుని నుండి దూరంగా తీసుకుపోయాడు. పిమ్మట కృపాచార్యుడు ఆరు బాణాలతో యుధిష్ఠిరుని హింసించి, ఎనిమిది వాడియైన బాణాలతో అతని గుఱ్ఱాలను గాయపరిచాడు. మహారాజా! **నీ పుత్రునితో కూడిన నీ దురాలోచనతో** ఈ విధంగా యుద్ధ శేషం జరిగింది. యుధిష్ఠిరుని చేతిలో శ్రేష్ఠమహాధనుర్ధరుడు శల్యుడు చావగా, కుంతీ పుత్రు లందరు ఒకచోటకు చేరి, సంతోషంతో నిండిపోయారు. శల్య మరణాన్ని చూసి, శంఖనాదాలు చేశారు. వృత్రాసుర వధ జరిగినప్పుడు దేవతలందరు ఇంద్రుని స్తుతించినట్లు, పాండవవీరులు యుధిష్ఠిరుని ఎంతో ప్రశంసించారు. భూమి ప్రతిధ్వనించేటట్లు ఎన్నో వాద్యాలను వాయించారు.

18. శల్యానుచరుల వధ - కౌరవసేన పలాయనము.

సంజయుడు చెపుతున్నాడు. "రాజా! శల్యుడు చంపబడగానే, అతని అనుయాయు లయిన ఏడువందల మంది రథికులు కౌరవసేననుండి నిష్క్రమించారు. అప్పుడు దుర్యోధనుడు పర్వతంవంటి ఏనుగునెక్కి, ఛత్రం ధరించి, వింజామరలు వీస్తూండగా అచ్చటకు వచ్చాడు. వెళ్ళవద్దు, వెళ్ళవద్దని మద్రదేశీయ వీరులను వారించడంతో, వారంతా యుధిష్ఠిరుని చంపవలెనన్న కాంక్షతో పాండవసేనలోనికి చొచ్చుకొనిపోయారు. యుద్ధం చేయాలని

దృఢంగా నిశ్చయించుకొని, వారంతా ధనుష్టంకారం చేసి, పాండవులతో యుద్ధం ఆరంభించారు. శల్యుడు చంపబడగా, అతని అనుచరగణమైన మద్రరాజుకు ప్రియం చేయాలనుకొనే మద్రవీరులు యుధిష్ఠిరుని పీడిస్తున్నారని విని, మహారథుడైన అర్జునుడు గాండీవధనుష్టంకారం చేస్తూ, రథఘోషతో నాల్గు దిక్కులను పిక్కటిల్లచేస్తూ అక్కడకు వచ్చాడు. పిమ్మట అర్జునుడు, భీమసేనుడు, నకుల సహదేవులు, నరశ్రేష్ఠుడగు సాత్యకి, ద్రౌపదీ పుత్రులు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, పాంచాలసోమక వీరులు అందరూ యుధిష్ఠిరుని రక్షించటానికి అతనిని చుట్టుముట్టారు. పాండవవీరులు మొసళ్ళు సాగరాన్ని వలె శత్రువులను క్షోభపెట్టసాగారు. పాండవవీరులు మీ సైనికులను కంపింపచేశారు. మీ సైనికులు కూడా పాండవసేనలో అలజడి రేపారు. మహారధికు లగు వారంతా పాండవసేనను అల్లకల్లోలం చేస్తూ 'యుధిష్ఠిరు డెక్కడ ? వీరులైన వారి సోదరులు ఇక్కడ ఏల కనిపించటం లే ?' దని బిగ్గరగా అరిచారు. 'ధృష్టద్యుమ్నుడు, సాత్యకి, ద్రౌపదీ పుత్రులు, పాంచాలవీరులు, శిఖండి వీరంతా యెక్కడ?' యని అరిచారు. ఈ విధంగా అరుస్తున్న మద్రరాజు అనుయాయులను ద్రౌపదీపుత్రులు, సాత్యకి చంపడం ప్రారంభించారు. యుద్ధంలో శత్రువులచే చంపబడుతున్న మీ సైనికులు కొందరు రథచక్రాలతో, మరికొందరు విచ్ఛిన్నమైన విశాల ధ్వజాలతో నేలకొరుగుతూ కనపడ్డారు.

రాజా! యుద్ధంలో పాండవవీరులంతా నలువైపులా ఆక్రమించటం చూసి, మీ పుత్రుడు వారిస్తున్నా ఆ వీరులంతా ముందుకు దూసుకుపోయారు. దుర్యోధనుడు ఆ వీరులందరినీ అనునయిస్తూ వారించినా, ఆ మహారథులంతా అతని ఆదేశాన్ని శిరసావహించలేదు. మహారాజా! అప్పుడు మాటనేర్పుగల గాంధార రాజపుత్రుడు శకుని దుర్యోధనునితో ఇట్లన్నాడు." మనమంతా చూస్తూండగానే మద్రదేశీయ సేన ఎలా చంపబడుతోంది ? యుద్ధంలో నీవు నిలబడిఉండగా ఇది యుక్తంకాదు. మనమంతా కలిసి యుద్ధం చేద్దామని శపథం చేసుకున్నాం. నృపా! శత్రువులు మన సేనను సంహరిస్తూంటే నీవు ఎలా సహిస్తున్నావు ?" దుర్యోధనుడు చెప్పాడు. "నేను ముందు వీళ్ళందరినీ వారించా, కాని వాళ్ళు నామాట వినకుండా శత్రుసేనలోనికి చొరబడి వాళ్ళచే చంపబడ్డారు." శకుని చెప్పాడు. "నృపా! యుద్ధ భూమిలో అమర్షకులోనై వీరులు స్వామి ఆజ్ఞనుకూడా ధిక్కరిస్తారు. వారిపై కోపం తగదు. ఉపేక్షించటానికి ఇది సమయంకాదు. మనమంతా కలిసి మద్రాధీశుని అనుచర గణాన్ని రక్షించటానికై గజ, తురగ, రధాలతో వెడలి మహా ప్రయత్న పూర్వకంగా ఒకరినొకరు రక్షించుకొందాం." సంజయుడు చెపుతున్నాడు. రాజా! ఈ విధంగా ఆలోచన చేసి, వీరంతా మద్రదేశ సైనికులున్న ప్రదేశానికి వెళ్ళారు. శకుని

చెప్పగా, దుర్యోధనుడు విశాలసేనలో సింహనాదం చేస్తూ, భూమిని కంపింపజేస్తున్నట్లు ముందుకు సాగాడు. అప్పుడు మీ సేనలో చంపండి, గాయపరచండి, పట్టుకోండి, దెబ్బకొట్టండి, నరకండనే మాటలు ప్రతిధ్వనించాయి. మద్రరాజు అనుచరగణమంతా ఒక్కసారిగా ఆక్రమించడం చూసి, పాండవ వీరులు మధ్యమ గుల్మాన్ని, ఆశ్రయించి, వారిని ఎదుర్కొన్నారు. మద్రరాజు అనుచరులగు ఆ వీరులంతా ముహూర్తకాలంలోనే వారిచేతుల్లో మరణించటం కనబడింది. మేము అక్కడికి వెళ్ళేటప్పటికే, మద్రదేశవీరులు శత్రువుల చేతిలో హతులయ్యారు. పాండవసేన సంతోషంతో కిలకిలారావాలు చేశారు.

అన్నివైపులా పైకి నిలబడిన కబంధాలే కనపడ్డాయి. సూర్యమండలం మధ్యనుండి పెద్ద ఉల్క క్రిందపడింది. విరిగినరథాలతో, కాష్ఠాలతో, చచ్చిపడిన మహారథులతో నేలకొరిగిన గుట్టలతో భూమి అంతా నిండిపోయింది. మహారాజా! యుద్ధభూమిలో వాయువేగం గల గుఱ్ఱాలతో కూడికి కట్టివేసిన యోధుల్ని ఇటూఅటూ తీసుకొనిపోవటం కనిపించింది. కొన్నిగుఱ్ఱాలు యుద్ధభూమిలో విరిగిన చక్రాలు గల రథాల్ని తీసుకొనిపోతూంటే, మరికొన్ని సగం సగం మిగిలినరథాల్ని తీసుకొని, నాల్గుప్రక్కలా తిరుగుతున్నాయి. అక్కడక్కడ యోక్త్రాలతో (కూడిమోకులు)కట్టిన అశ్వాలు కనబడ్డాయి. పుణ్యం క్షీణించగానే స్వర్గంనుండి క్రిందపడే సిద్ధపురుషులవలె, కొంతమంది రథికులు క్రిందపడుతూ కనపడ్డారు. మద్రరాజసైనిక వీరులు చంపబడితే, మేము ఆక్రమించటం చూసి జయేచ్ఛగల పాండవయోధులు శంఖధ్వనులతో, బాణాలతో కోలాహలంచేస్తూ, వేగంగా మమ్మల్ని ఎదుర్కొన వచ్చారు. మాదగ్గరకు వచ్చి, లక్ష్యాన్ని ఛేదించడంలో కుశలులైన పాండవవీరులు తమ ధనుస్సుల్ని ఇటునటు త్రిప్పుతూ, సింహనాదం చేశారు. మద్రరాజు నేలకొరగడాన్ని, అతని సేన కళ్ళెదుటే చంపబడటమూ చూసిన దుర్యోధన సేన తిరిగి అక్కడినుండి పారిపోయింది. మహారాజా! విజయంతో ఉప్పొంగే ధనుర్ధరులయిన పాండవులచే దెబ్బతిన్న కౌరవసేన తొట్రుబాటుతో తలో దిక్కుకు పారిపోయింది."

19. భీముడు ఇరవై ఒక్క వేలమంది పదాతులను చంపుట.

సంజయుడు చెపుతున్నాడు. "శల్యుడు యుద్ధంలో చంపబడగా మీ సేన, మీపుత్రులు యుద్ధరంగం నుండి విముఖు లయ్యారు. అగాధ సాగరంలో పడవ ముక్కలయితే, ఆ సాగరాన్ని దాటాలని కోరుకొనే వ్యాపారులు వ్యాకులపడినట్లు, యుధిష్ఠిరునిచే మద్రరాజు చంపబడితే, మీసైనికులు బాణాలచే దెబ్బతిని భయభ్రాంతు లయ్యారు. సింహాలచే పీడింపబడిన లేళ్ళవలె, కొమ్ములు విరిగిన వృషభాల వలె, దంతాలు విరిగిన గజాల వలె

మీసేన తమను తాము అనాధలుగా తలుస్తూ, రక్షకుని కోరుకొంటోంది. అజాతశత్రునిచే పరాజితులైన మేము మధ్యాహ్న సమయంలో యుద్ధరంగం నుండి వెనుదిరిగాం. శల్యునిమరణంతో ఏ వీరుని మనస్సులోనూ సేనను నడిపించాలని గాని, పరాక్రమం చూపాలని గాని ఉత్సాహం లేదు. భీష్మద్రోణ కర్ణులు యుద్ధంలో మరణిస్తే మీ యోధులలో ఎటువంటి దుఃఖం, భయమూ, కలిగాయో, తిరిగి అదే భయమూ, దుఃఖమూ, శల్య మరణంతో వారిలో కలిగాయి. మహారథుడగు శల్యుడు చంపబడితే, ఎంతోమంది వీరులను పోగొట్టుకొనిన కౌరవసేన, వాడియైన బాణాలతో గాయపడి చెల్లాచెదరై, జయం విషయంలో నిరాశ, నిస్పృహలకు లోనయింది. మద్రరాజు మరణిస్తే మీసేన భయంతో పారిపోయింది.

కొంతమంది గుఱ్ఱాలమీద, ఏనుగులమీద, మరికొంతమంది రథాలనెక్కి తొందరగా పారిపోయారు. పదాతి సైన్యం కూడా పారిపోయింది. రెండువేల ఏనుగులు శల్యుడు మరణించగానే పరుగెత్తిపోయాయి. మీసైన్యం రణభూమినుండి నలుదిక్కులకు పారిపోయింది. వారంతా బాణపు దెబ్బలచే గాయపడి ఆయాసపడుతూ పారిపోవడం కూడా మేము చూశాం. పరాజితులై దెబ్బతిని, ఉత్సాహం కోల్పోయి, పారిపోయే మీ సైనికులను, విజయోత్సాహం గల పాంచాల పాండవ వీరులు వెంబడించారు. శూరుల బాణాల చప్పుళ్ళు, పుష్కలమైన సింహనాదాలు, శంఖధ్వనులు ఇవన్నీ అక్కడ భయంకర వాతావరణాన్ని కల్పించాయి. భయంతో పారిపోయే కౌరవసేనను చూసి, పాంచాల, పాండవులు, తమలో తాము ఇలా అనుకొన్నారు. "సత్యతత్పరు డయిన ధర్మరాజు నేడు శత్రుహీను డయ్యాడు. దుర్యోధనుడు దేదీప్యమానమయిన రాజ్యలక్ష్మికి దూర మయ్యాడు. యుద్ధంలో తనపుత్రుడు చంపబడ్డాడని విని, ధృతరాష్ట్రుడు విహ్వలుడై భూమ్మీద పడి దుఃఖాన్ని అనుభవిస్తాడు. కుంతీపుత్రుడు అర్జునుడు ధనుర్ధరులందరిలో శ్రేష్ఠుడని నేడు తెలుసుకొంటాడు. దుర్బుద్ధితో పాపమాచరించిన ధృతరాష్ట్రుడు తనను తాను నిందించుకొంటాడు. హితాన్ని కోరిన విదురుని వచనాల్ని సత్యమని అతడు భావిస్తాడు. ఈ రోజు మొదలుకొని దాసునివలె ఉంటూ, యుధిష్ఠిరునికి పరిచర్యలు చేస్తూ, పాండవులింతకుముందు ఎన్ని కష్టాలు అనుభవించారో ధృతరాష్ట్రుడికి తెలియునుగాక.

ధృతరాష్ట్రుడు శ్రీకృష్ణుని మాహాత్మ్యాన్ని తెలుసుకొనుగాక, యుద్ధంలో అర్జునుని ఘోరమైన ధనుష్టంకారనాదం,అతని అస్త్రబలం, బాహుబలం కూడా తెలుసుకొనుగాక. ఇంద్రుని అసుర సంహారంవలె, యుద్ధమందు భీముని చేతిలో దుర్యోధనుడు మరణిస్తే, అతని బలపరాక్రమా లెటువంటివో ధృతరాష్ట్రుడు ఈరోజు తెలుసుకొంటాడు. దుశ్శాసన

వధ సమయాన భీమసేనుడు ఏమి చేశాడో, దానిని అతడు తప్ప ఈ లోకంలో ఎవడూ చేయలేడు. దేవతలకు కూడా దుర్జేయుడైన శల్యుని యుధిష్ఠిరుడు చంపాడనే వార్త విని, ధృతరాష్ట్రుడు అతని పరాక్రమాన్ని తెలుసుకొంటాడు. యుద్ధంలో శకుని, ఇతర వీరులు చంపబడటం చేత, రణరంగంలో శత్రువులకు అంతుచిక్కని నకుల సహదేవుల పరాక్రమాన్ని కూడా అతడు తెలుసుకొంటాడు. ఎవరిపక్షంలో ధనంజయుడు, సాత్యకి, భీమసేనుడు, ధృష్టద్యుమ్నుడు, ద్రౌపదీ పుత్రులు, నకుల సహదేవులు, శిఖండి, స్వయంగా యుధిష్ఠిరుడు యోధులుగా ఉన్నారో వారికి విజయం ఎందుకు లభించదు ? జగన్నాథుడు, జనార్దనుడూ అయిన శ్రీకృష్ణుడు ఎవరికి రక్షకుడో, ఎవరి పక్షాన ధర్మ మున్నదో వారికి విజయం ఎందుకు కలుగదు ?

హృషీకేశుడు సర్వలోక విభువగు శ్రీకృష్ణుడు ఎవరికి రక్షకుడో వారికి లాభం, జయం కలుగుతాయి. వాళ్ళకు పరాజయం ఎక్కడి నుంచి కలుగుతుంది ?*

యుద్ధంలో భీష్మ, ద్రోణ, కర్ణ, శల్యులు, ఇంకా ఇతర వేలాది శత్రువీరులపై విజయం సాధించటం ఒక్క యుధిష్ఠిరునికి తప్ప మరెవ్వరికి సాధ్యం? సత్యయశోనిధి యగు శ్రీకృష్ణుడు ఎవరికి రక్షకుడో వారికే ఇది సాధ్యం." ఈ విధంగా మాట్లాడుకొంటూ సృంజయ వీరులు హర్షోత్సాహంతో పారిపోయే మీ వీరులను వెంబడించారు. పరాక్రమవంతుడగు అర్జునుడు తమ రథసేనను ముట్టడించాడు. నకుల సహదేవులు, సాత్యకి శకునిపై దండెత్తారు. భీమసేనుని భయంతో పీడితులై పరుగెత్తే మీ సమస్త యోధులను చూసి, దుర్యోధనుడు విజయానికై రథసారథితో ఇట్లన్నాడు. "ధనుస్సును చేతబూని నేనిక్కడ నిలబడిఉండగా అర్జునుడు నన్ను దాటబోతున్నాడు. కనుక నా గుఱ్ఱాలను సేనయొక్క వెనుక భాగానికి పోనియ్యి. సేన పృష్ఠభాగంలో ఉండి యుద్ధం చేసే నన్ను, మహాసాగరం వలె అర్జునుడు ఎటువైపునుంచీ దాటి ముందుకు పోవటానికి సాహసించడు. సూతా! పాండవుల ధాటికి తట్టుకోలేక, మన సైనికులు పారిపోవటం వలన ఎగిరిన ధూళి అన్నివైపులా వ్యాపించింది. దానిని చూడు. మాటిమాటికి భయాన్ని కల్గించే ఘోరాలైన సింహనాదాలను విను. కనుక సూతా ! మెల్లగా వెళ్ళు. సేన జఘన భాగాన్ని రక్షించు. యుద్ధంలో నేను నిలబడి పాండవులను నిరోధిస్తే, నా సేన శీఘ్రంగా తిరిగి వచ్చి మరల పరాక్రమాన్ని చూపిస్తుంది." మీపుత్రుని వీరోచిత వచనాలను విని,

---

* లాభస్తేషాం జయస్తేషాం కుతస్తేషాం పరాభవః ।
యేషాం నాథో హృషీకేశః పర్వలోకవిభుర్హరిః ॥

రధసారథి గుఱ్ఱాలను మెల్లమెల్లగా ముందుకు తోలాడు. అచ్చట గజాశ్వరధికులు లేకుండా కేవలం ఇరువది ఒక్క వేల పదాతిసైనికులు మాత్రం జీవితం మీద ఆశ వదులుకొని, యుద్ధానికి సన్నద్ధులయ్యారు. నానాదేశాలలో పుట్టినవారు, నానానగరవాసులయిన వీరులు మహాకీర్తిని కోరుతూ, యుద్ధానికి సిద్ధమయ్యారు. ఉత్సాహంతో ఒకరిపైనొకరు ఆక్రమించే రెండుపక్షాల సైనికుల మధ్య ఘోర భయానకమగు సంఘర్షణ జరిగింది. రాజా! అప్పుడు భీమసేనుడు, ధృష్టద్యుమ్నుడూ చతురంగ సేనా సహాయంతో నానాదేశీయ వీరులను కట్టడి చేశాడు. యుద్ధభూమిలో మిగిలిన పదాతి సైన్యం ఉత్సాహంతో సింహనాదం చేస్తూ, భుజాలు చరచుకొంటూ, వీరలోకం పొందగోరి, భీమసేనుని ఎదుర్కొన్నది. భీమసేనుని సమీపించి రోషభరితులై, యుద్ధ దుర్మదులైన కౌరవ వీరులు గర్జించడం తప్ప రెండవ మాట మాట్లాడలేదు. వారు సంగ్రామంలో భీమసేనుని నాల్గువైపులా ముట్టడించి, హింసించారు. పదాతిగణం యొక్క దెబ్బలను సహిస్తూ, భీముడు మైనాకపర్వతం వలె, తనస్థానంనుండి చలించలేదు. మహారాజా! కుపితులైన పదాతిసేన భీముని పట్టుకొనటానికి ఇతర యోధులను ముందుకు వెళ్ళనీయకుండా వారించారు.

పదాతిసేన తనను ముట్టడిస్తే భీముడు మిక్కిలి కోపగించాడు. అతడు రధంనుండి వేగంగా క్రిందికి దిగి, పదాతియై సువర్ణమయమైన విశాలగదను చేతబూని, దండధారి అయిన యమునివలె, మీ వీరులను సంహరించాడు. రథాశ్వహీనులయిన ఇరవై యొక్క వేల పదాతులను భీముడు గదతో మోది, చంపాడు. భీమసేనుడు పదాతిసేనను సంహరించి, అంతలోనే ధృష్టద్యుమ్నుని ముందిడుకొని కనబడ్డాడు. బాగా పుష్పించిన కర్ణికార వృక్షం గాలిచే భగ్నమై నేలమీద పడినట్లు, రక్తసిక్తులైన పదాతి సైనికులు చచ్చి నేలకొరిగారు. అక్కడ నానాదేశాలనుండి వచ్చిన నానాజాతుల వారు, వివిధశస్త్రాలను ధరించినవారు, విభిన్నకుండలాలను ధరించిన యోధులు అంతా మరణించారు. పతాకా ధ్వజాలతో ఆచ్ఛాదితమైన పదాతిసేన ఛిన్నాభిన్నమై రౌద్రంగా, ఘోరంగా, భయానకంగా ఉంది. పిమ్మట సైన్యంతో కూడి యుధిష్ఠిర ముఖులు మీ పుత్రుడైన దుర్యోధనుని వైపు పరుగెత్తారు. మీ సైనికులు యుద్ధం నుండి విముఖులై పారిపోవటం చూసి, ధనుర్ధరులగు ఆ పాండవ వీరులు సముద్రుడు వేలను వలె మీ పుత్రుని ఉల్లఘించి, ముందుకు పోలేకున్నారు. అప్పుడు మేమంతా కలిసి మీ పుత్రుని అద్భుత పరాక్రమాన్ని చూశాం. కుంతీపుత్రు లందరూ కలిసి కూడా మీ పుత్రుని దాటి ముందుకు వెళ్ళలేకపోయారు. తమసేన పారిపోవాలని నిశ్చయించుకొన్నా ఎక్కువదూరం వెళ్ళకపోవటంతో దుర్యోధనుడు గాయపడిన సైనికులను పిలిచి ఇట్లన్నాడు.

"మీరు పారిపోవడం వలన ప్రయోజనమేమి? ఈ భూమిమీద కాని, పర్వతాలలోగాని పాండవులు మిమ్ములను చంపని ప్రదేశాన్ని నేను చూడట్లేదు. పాండవుల వద్ద ఇప్పుడు తక్కువసేన మాత్రమే ఉన్నది. కృష్ణార్జునులు కూడా గాయపడ్డారు. మనమందరం కలిసికట్టుగా ఉంటే నిశ్చయంగా విజయం మనదే. పాండవుల యెడల అపరాధం చేసిన మీరు, ఎవరికివారు పారిపోతే పాండవులు మిమ్మల్ని వెంబడించి, చంపుతారు. కనుక యుద్ధంలో మరణించటమే శ్రేయస్కరం. ఇక్కడకు వచ్చిన క్షత్రియ వీరులంతా వినండి. మృత్యువు వీరుని, పిరికివానిని కూడా చంపుతూంటే క్షత్రియుడ నని చెప్పుకొని యుద్ధం చేయని మూర్ఖుడు ఎవ డుంటాడు ? కనుక భీమసేనుని ఎదుర్కొనటమే శ్రేయస్సు, క్షత్రియధర్మాన్ని అనుసరించి యుద్ధంలో మరణమే సుఖాన్నిస్తుంది. మనుష్యుడు ఎప్పటికైనా మరణించవలసిందే. ఇంట్లోకూడా మృత్యువుకు మినహాయింపులేదు. కనుక క్షత్రియధర్మం అనుసరించి, యుద్ధంలో మరణించటమే క్షత్రియుడికి తగును. వీరుడు శత్రువులను చంపితే ఇహలోకంలో సుఖపడతాడు. మరణిస్తే పరలోకసుఖం పొందుతాడు. కనుక స్వర్గప్రాప్తికి యుద్ధధర్మాన్ని మించినమార్గం లేదు. యుద్ధంలో మరణించిన పురుషుడు అచిరకాలంలోనే పరలోక సుఖాన్ని పొందుతాడు." దుర్యోధనుని మాటలు విని, అందరు వీరులు అతనిని సమ్మానించి, పాండవులను ఎదుర్కొనడానికి తిరిగి వచ్చారు. వారు తిరిగి ఆక్రమించటం గమనించి, పాండవులు సేనావ్యూహం చేసుకొని వారిని ఎదుర్కొనడానికి బయలుదేరారు. అర్జునుడు గాండీవ ధనుస్సును చేతబూని, ధనుష్టంకారంచేస్తూ, రథంమీద అక్కడకు చేరుకొన్నాడు. నకుల సహదేవులు, సాత్యకి శకునిని ముట్టడించారు. వారంతా హర్షోత్సాహాలతో వేగంగా మీ సేనపై విరుచుకుపడ్డారు."

20. సాత్యకి శాల్వుని వధించుట.

"పారిపోయే మీసైన్యం మళ్లీ వెనుదిరిగి పాండవసైన్యాన్ని ఎదుర్కొనటానికి శత్రుసంహారం చేసే పర్వతమంత ఏనుగు నెక్కి మ్లేచ్ఛ గణాధిపుడయిన శాల్వుడు పాండవుల సేనను ఎదిరించాడు. రాజా! ఆ ఏనుగు మహాభద్రకులంలో పుట్టింది. దుర్యోధనుడు నిత్యం దానిని పూజించేవాడు. గజశాస్త్రజ్ఞులచే బాగా అలంకరించబడింది. యుద్ధాలలో నిత్యమూ వాహనంగా దాన్ని ఉపయోగిస్తారు. శాల్వుడు ఆ గజరాజాన్ని అధిరోహించి, ప్రాతఃకాలంలో ఉదయపర్వతంపైనున్న సూర్యునివలె భాసిల్లాడు. గజారూఢుడై వచ్చిన శాల్వుడు అక్కడ పాండవ సేనను ఆక్రమించి, ఇంద్రుని వజ్రాయుధంవలె పదునైన

భీకర బాణాలతో వారిని చిన్నాభిన్నం చేశాడు. పూర్వకాలంలో ఐరావతం మీద కూర్చొని శత్రుసంహారం చేసే ఇంద్రుని బాణ ప్రయోగం, శత్రువులు నేలకొరగడం మధ్య అంతరాన్ని దేవదానవులు తెలుసుకోలేకపోయేవారు, అలాగే మహాయుద్ధంలో శాల్వుని శరప్రయోగానికీ, శత్రువుల యమలోకప్రాప్తికీ అంతరం గమనించలేకపోయారు.

పాండవులు, సోమకులు, స్ృంజయవీరులు రణభూమిలో ఆ ఒక్క గజరాజు సంచారాన్ని, మహేంద్రుని ఐరావతం వేల రీతుల్లో సంచరిస్తున్నట్లు అంతటా దాన్నే చూశారు. ఆ ఏనుగు శత్రుసేనను పారద్రోలుతుండగా, అది అన్నివైపుల నిరోధింపబడినట్లు అనిపించింది. తీవ్రభయంవలన రణభూమిలో ఆ సేన నిలువలేకపోయింది. అప్పుడు సైనికు లందరూ ఒకరినొకరు త్రొక్కుకొంటూ పారిపోతున్నారు. ఆ శాల్వరాజు పాండవమహాసేనను వేగంగా భంగపరిచాడు. ఆ గజరాజు వేగాన్ని సహించలేని ఆ సేన, ఆ సమయంలో నాల్గుదిక్కులకు పారిపోయింది. వేగంగా భంగపడిన పాండవసేనను చూసి, నీ సేనలోని ముఖ్య యోధు లందరూ రణభూమిలో శాల్వరాజును అభినందించి, చంద్రునివలె తెల్లగా ఉన్న శంఖాలను పూరించారు. ఆపై శంఖధ్వనితోపాటు కౌరవులు చేస్తున్న హర్షనాదాలను విని, పాండవ స్ృంజయసేనాపతి అయిన పాంచాలరాజ కుమారుడు దానిని సహించలేక కోపానికి లోనయ్యాడు. ఆపై ఆ మహాత్ముడు విజయానికై త్వరపడుతూ ఆ ఏనుగుకు ఎదురువెళ్ళాడు. అది ఇంద్రునితో యుద్ధం చేస్తూ జంభుడు ఇంద్రవాహనమైన ఐరావతంపై దాడిచేసినట్లుంది. అలా రణభూమిలో వేగంగా మీదకు వస్తున్న ఆ ధృష్టద్యుమ్నుని చూసి, రాజసింహుడైన శాల్వుడు ద్రుపదసుతుని చంపటానికి వెంటనే ఆ ఏనుగును అతనిపైకి ఉసిగొల్పాడు. ఆ గజరాజు వేగంగా మీదకు రావటం చూసి, ధృష్టద్యుమ్నుడు మూడు గొప్ప బాణాలతో దానిని గాయపరిచాడు. ఆపై మహాత్ముడైన ధృష్టద్యుమ్నుడు మరో అయిదు వందల బాణాలను ఆ ఏనుగు కుంభస్థలంపై ప్రయోగించాడు. అప్పుడు ఆ మేటి ఏనుగు వాటితో గాయపడి, రణభూమిలో వెనుదిరిగి వేగంగా పారిపోయింది. ఆ గజరాజు వేగంగా గాయపడి వెనుదిరిగి పారిపోవటం గమనించి, శాల్వుడు కొరడాలతో, అంకుశాలతో దానిని వేగంగా ధృష్టద్యుమ్నుని రథంవైపుకు మరలించాడు. వేగంగా మీదకు వస్తున్న ఆ ఏనుగును చూసి, ధృష్టద్యుమ్నుడు భయంతో వణికిపోతూ, గదను తీసికొని వెంటనే తన రథం మీదనుండి క్రిందకు దూకాడు. ఆ మహాగజం ఘీంకరిస్తూ స్వర్ణభూషితమైన ఆ రథాన్ని గుర్రాలతో, సారథితో సహా మర్దించి, తొండంతో పైకెత్తి దానిని నేలకేసి కొట్టింది.

ఆ గజరాజుచే పీడింపబడిన పాంచాలరాజ కుమారుని చూసి, భీముడు, శిఖండి, సాత్యకి త్వరపడుతూ వేగంగా ఆ ఏనుగుపై దాడిచేశారు. ఆ రథికులు అన్నివైపులా ఆక్రమిస్తున్న ఆ ఏనుగు వేగాన్ని బాణాలతో వెంటనే నిరోధించారు. అలా వారిచే నిరోధింపబడిన ఆ ఏనుగు రణభూమిలో గింజుకొనసాగింది. ఆ తరువాత శాల్వరాజు బాణాలను అంతటా కురిపించాడు. ఆ బాణాల దెబ్బతింటున్న పాండవరథికులు గుంపులుగా అటు ఇటూ పారిపోయారు. రాజా! ఆ పై పాంచాలరాజ కుమారులు, సృంజయులు ఆ శాల్వపరాక్రమాన్ని చూసి, హాహాకారాలతో రణభూమిని ప్రతిధ్వనింపజేస్తూ, ఆ ఏనుగును అన్నివైపుల నుండి నిరోధించారు. పాంచాల రాజకుమారుడు – ధృష్టద్యుమ్నుడు త్వరపడుతూ కొండకొమ్మువలె ఉన్న గదను తీసికొని, వేగంగా ఆ ఏనుగు వెంటబడ్డాడు. ఆ తర్వాత వేగశాలి అయిన పాంచాల రాజకుమారుడు పర్వతంలా కనిపిస్తూ, మేఘంవలె ప్రకాశిస్తూ మదజలాన్ని స్రవిస్తున్న ఆ ఏనుగును గదను త్రిప్పి, గట్టిగా కొట్టాడు. దానితో దాని కుంభస్థలం బ్రద్దలైంది. పర్వతంలా ఉన్న ఆ ఏనుగు ఆర్తనాదాలు చేస్తూ, ముఖం మీది గాయంనుండి రక్తాన్ని కార్చుతూ, భూకంపంతో కదిలిన కొండవలె నేలగూలింది. అలా గజరాజు పడుతున్నప్పుడే, నీ కుమారుని సేన హాహాకారాలు చేయసాగింది. అంతలో సాత్యకి శాల్వరాజు శిరస్సును పదునైన భల్లంతో ఖండించాడు. వెంటనే శాల్వుడు ఏనుగుతో సహా పడిపోయాడు."

21. సాత్యకి కృతవర్మల యుద్ధము

సంజయుడిలా చెప్తున్నాడు. "యుద్ధానికే వన్నె తేగల శూరుడైన శాల్వుడు చనిపోగానే, గాలికి కూలిపోయిన మహావృక్షంవలె నీ సేన వేగంగా చెదరిపోయింది. కృతవర్మ భంగపడిన ఆ సేనను చూసి, రణభూమిలో శత్రుసైన్యాన్ని నిలువరించాడు. వెనుకకు వచ్చిన ఆ శూరులు రణభూమిలో బాణవృష్టి కురుస్తున్నా, కొండలా స్థిరంగా నిలిచిన సాత్యకిని చూశారు. కౌరవులు పాండవులతో ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడారు. అక్కడ కృతవర్మకు శత్రువులతో ఆశ్చర్యకరంగా యుద్ధం జరిగింది. సమీపించటానికి కూడా వీలులేని పాండవ సేనను ఒంటరిగా నిరోధించాడు. పరస్పరం హితాన్ని కోరుకొనే కౌరవసైనికులు కృతవర్మ ప్రదర్శించిన దుష్కర పరాక్రమాన్ని చూసి, ఆనందంతో పెద్దపెట్టున సింహనాదాలు చేశారు. ఆ ధ్వనితో పంచాలురు బెదరిపోయారు. అపుడు సాత్యకి కౌరవసేనను ఎదిరించాడు. ఆ సాత్యకి మహాబలుడైన క్షేమధూర్తిరాజును ఎదిరించి, ఏడు పదునైన

బాణాలతో ఆయనను యమసదనానికి పంపించాడు. పదునైన బాణాలను కురిపిస్తూ వస్తున్న ఆ సాత్యకిని చూసి, కృతవర్మ వేగంగా ఎదురువచ్చాడు. మహాపరాక్రమశాలులు, ఆ సాత్యకి కృతవర్మలు ఒకరిపై ఒకరు దాడిచేశారు. ఆ ఇద్దరి భీకర సమాగమంతో పాంచాలురు, పాండవులు, రాజశ్రేష్ఠులైన ఇతరయోధులు కేవలం ప్రేక్షకులయ్యారు.

వృష్ణి - అంధక మహారథులైన ఆ ఇద్దరూ ఉత్సాహంగా పోరాడుతున్న ఏనుగులవలె, నారాచాలతో, వత్సదంతాలతో ఒకరినొకరు కొట్టసాగారు. వృష్ణిశ్రేష్ఠులైన ఆ ఇద్దరి విండ్లనుండి వేగంగా, బలంగా విడిచిన బాణాలు ఆకాశంలో వేగంగా ఎగిరే పక్షులవలె కనిపించాయి. కృతవర్మ సాత్యకిని ఎదిరించి, నాలుగు పదునైన బాణాలతో నాలుగు గుర్రాలను గాయపరిచాడు. ఆ సాత్యకి అంకుశం దెబ్బతిన్న ఏనుగువలె కోపించి, ఎనిమిది బాణాలతో కృతవర్మను గాయపరిచాడు. ఆపై కృతవర్మ సానబెట్టి పదునెక్కించిన మూడు బాణాలను పూర్తిగాలాగి, విడిచి, సాత్యకిని కొట్టి, ఒక బాణంతో అతని ధనుస్సును ఖండించాడు. సాత్యకి విరిగిన ఆ వింటిని విడిచి, వేగంగా మరొకవింటిని బాణాలతో సహా తీసికొన్నాడు. అతిరథుడు అయిన సాత్యకి ఆ మేటి వింటిని తీసికొని, వేగంగా ఎక్కుపెట్టి, కృతవర్మపై దాడిచేశాడు. ఆపై సాత్యకి పది పదునైన బాణాలతో కృతవర్మ సారథిని, గుర్రాలను, ధ్వజాన్ని కూడా భంగపరిచాడు. రాజా! కృతవర్మ తీవ్రరోషానికి లోనయి, శూలాన్ని ఎత్తి, సాత్యకిని చంపాలని భుజవేగమంతా వినియోగించి, విసిరాడు. సాత్యకి పదునైన బాణాలతో ఆ శూలాన్ని ఖండించి, పొడిచేసి పడగొట్టాడు. దానితో కృతవర్మకు స్పృహ తప్పినంత పని అయింది. ఆపై మరొక భల్లంతో కృతవర్మ రొమ్ముపై కొట్టాడు. ఆ సాత్యకి తన గుర్రాలను, సారథిని సంహరిస్తే, కృతవర్మ రథాన్ని వీడి రణభూమిలో నేలపై నిలిచాడు. ఆ ద్వైరథయుద్ధంలో వీరుడైన కృతవర్మ విరథుడుగా జేయబడగా, సేనల కన్నింటికీ మహాభయం కలిగింది.

కృతవర్మ సారథిని, గుర్రాలను పోగొట్టుకొని విరథుడు అయితే నీ కుమారునిలో కూడా ఎంతో విషాదం కలిగింది. కృతవర్మను గమనించి, సాత్యకిని చంపాలని కృపాచార్యుడు దూసికొని పోయాడు. మహాబాహువైన కృతవర్మను రథంపై ఎక్కించుకొని, వెంటనే రణభూమినుండి దూరంగా తీసికొనిపోయాడు. సాత్యకి రణభూమిలో నిలువగా, కృతవర్మ విరథుడు కాగా దుర్యోధన సైన్యమంతా మరల యుద్ధవిముఖ మైంది. అయితే సైన్యం రేపిన దుమ్ము వారిని కప్పివేయటంతో పాండవసేనలు వారిని గమనించలేకపోయారు. దుర్యోధనరాజు తప్ప మిగిలిన నీ వారందరూ పారిపోయారు. తనకు దగ్గరగానే భగ్నమై,

తనసేన పారిపోవటం చూసి, దుర్యోధనుడు వెంటనే వేగంగా శత్రువులపై దూకి, ఒంటరిగానే వారందరినీ నివారించాడు. నీ కొడుకు – దుర్యోధనుడు తీవ్రకోపానికిలోనయి, తడబాటు లేకుండా, సావధానంగా పాండవులపై, ధృష్టద్యుమ్ననిపై, శిఖండిపై, ద్రౌపదికొడుకులపై, పంచాల, కేకయ, సోమక, సృంజయ సేనా సమూహాలపై పదునైన బాణాలను కురిపించాడు. యజ్ఞంలో మంత్ర పవిత్రమైన మహాగ్ని ప్రకాశించినట్లు, దుర్యోధన నరపాలుడు కూడా రణభూమిలో అంతటా తానై ప్రకాశించాడు. మర్త్యులు మృత్యువును ఎదిరించలేనట్లు, రణభూమిలో శత్రువులు దుర్యోధనుని ఎదిరించలేకపోయారు. అంతలో మరొక రథాన్ని ఎక్కి, కృతవర్మ వచ్చాడు."

22. సంకుల యుద్ధము - 1

సంజయుడు చెప్తున్నాడు. "మహారాజా! నీ కొడుకు దుర్యోధనుడు రథస్థుడై, రుద్రునివలె శత్రుదుస్సహుడై ప్రకాశించాడు. దుర్యోధనుడు ప్రయోగించిన వేలకొలది బాణాలతో భూమి కప్పబడింది. పాండవసేనా సాగరంలో దుర్యోధనుని బాణాలతో గాయపడని సైనికుడు కానీ, గుర్రం కానీ, ఏనుగు కానీ, రథం కానీ ఒక్కటీ లేదు. యోధులందరు నీ కుమారుని బాణాలు తగిలియే కనిపిస్తున్నారు. అంతా ఆవరింపబడ్డారు. దుర్యోధనుడు రణభూమినంతా బాణమయం చేశాడు. నీ యోధులు, శత్రుయోధులలో దుర్యోధను డొక్కడే మగవాడుగా నాకు అనిపిస్తున్నాడు. అక్కడ నీ పుత్రుని పరాక్రమం అద్భుతంగా కనిపించింది. పాండవులందరూ కలిసి కూడా దుర్యోధనుని ఒక్కనిని ఎదిరించలేకపోయారు. భరతర్షభా! రణభూమిలో వంద బాణాలతో యుధిష్ఠిరుని, డెబ్బయి బాణాలతో భీమసేనుని, అయిదు బాణాలతో సహదేవుని, అరవైనాలుగు బాణాలతో నకులుని, అయిదు బాణాలతో ధృష్టద్యుమ్ననిని, ఏడు బాణాలతో ద్రౌపది కొడుకులను, మూడు బాణాలతో సాత్యకిని గాయపరిచాడు దుర్యోధనుడు. ఒక భల్లంతో సహదేవుని వింటిని విరగగొట్టాడు. సహదేవుడు మరొక పెద్ద వింటిని తీసికొని, దుర్యోధన నరపాలుని పదిబాణాలతో గాయపరిచాడు. నకులుడు భీకర రూపంగల తొమ్మిది బాణాలతో దుర్యోధనుని గాయపరిచి, సింహనాదం చేశాడు. వంగిన కణుపులు గల బాణంతో సాత్యకి, డెబ్బయి మూడు బాణాలతో ద్రౌపదేయులు, అయిదు బాణాలతో ధర్మరాజు, ఎనభైబాణాలతో భీమసేనుడు దుర్యోధన నరపాలుని గాయపరిచారు. ఆ పాండవులు బాణ సమూహాలను కురిపిస్తున్నా, దుర్యోధనుడు చలించలేదు. మహామనస్వి అయిన ఆ దుర్యోధనుని హస్తలాఘవం,

సౌష్ఠవం, పరాక్రమం లోకంలోని సర్వభూతాలను మించి ఉండటం అందరికీ కనిపించింది.

రాజేంద్రా! నీ యోధులు కవచాలు ధరించి, కొంచెం కూడా ఖాళీ లేకుండా దుర్యోధనుని చుట్టూ నిలిచారు. వారు దుర్యోధనుని సమీపించి, ఆతతాయు లయిన పాండవులను ఎదిరించారు. అప్పుడు అశ్వత్థామ క్రుద్ధుడై, అన్ని వైపులకు ప్రయోగిస్తున్న వివిధ బాణాలతో, రణభూమిలో భీమసేనుని నిరోధించాడు. యుద్ధంలో ఆ వీరులకు దిక్కులే తెలియటం లేదు. ఇక విదిక్కుల నెలా గ్రహిస్తారు ? భారతా! వారిద్దరూ క్రూరపరాక్రములు. ఇద్దరూ సహింపరాని వారు. ఒకరిపై ఒకరు బదులు తీర్చుకొనగోరుతూ ఇద్దరూ ఘోరంగా పోరాడసాగారు.

వీరుడైన శకుని యుధిష్ఠిరుని పీడించాడు. శకుని యుధిష్ఠిరుని నాలుగు గుర్రాలను చంపి, పెద్దగా సింహనాదం చేశాడు. దానితో పాండవ సేనలకు కోపం వచ్చింది. ఇంతలోనే యుధిష్ఠిరుని, సహదేవుడు తన రథంపై రణభూమి నుండి తప్పించి తీసికొని పోయాడు. ఆపై యుధిష్ఠిరుడు మరొక రథాన్ని ఎక్కి, తొమ్మిది బాణాలతో శకునిని గాయపరిచాడు. మరల అయిదు బాణాలతో గాయపరిచి, పెద్దపెట్టున సింహనాదం చేశాడు. ఆ చిత్ర యుద్ధం ఘోరరూపాన్ని ధరించింది. సిద్ధ చారణ సేవితమైన ఆ పోరు ప్రేక్షకులకు హర్షాన్ని కలిగించింది. నకులుని ఉలూకుడు అన్నివైపులా శరవృష్టిని కురిపిస్తూ ఎదిరించాడు. అదే రీతిగా శూరుడైన నకులుడు రణభూమిలో శకునిని మహాశరవృష్టితో అన్నివైపుల నుండి నివారించాడు. ఉత్తమ వంశంలో పుట్టిన వారు ఒకరిపై ఒకరు బదులు తీర్చుకొన గోరుతూ, పోరాడుతూ కనిపించారు. రాజా! సాత్యకి కృతవర్మతో పోరాడుతూ శోభించాడు. దుర్యోధనుడు ధృష్టద్యుమ్నుని వింటిని విరగగొట్టి, ఆపై అతనిని పదునైన బాణాలతో గాయపరిచాడు. ధృష్టద్యుమ్నుడు కూడా గొప్ప ఆయుధాన్ని చేతబట్టి, విలుకాండ్రు అందరూ చూస్తుండగా దుర్యోధన నరపాలునితో పోరాడాడు. ఆ ఇద్దరి మహాసంగ్రామం రెండు గొప్ప మదపుటేనుగుల మధ్య పోరాటం వలె ఉంది. కృపుడు క్రుద్ధుడై, ద్రౌపది కొడుకులను వంగిన కణుపులు గల అనేక బాణాలతో గాయపరిచాడు. ఇంద్రియాలతో జీవి పోరాడినట్లుగా కృపుడు ద్రౌపదేయులతో పోరాడాడు. ఆ పోరాటం ఘోరంగా, అనివార్యంగా, హద్దులు లేకుండా జరిగింది. వారు కూడా ఇంద్రియాలు పామరుని పీడించినట్లు కృపుని పీడించాడు. కృపుడు కోపించి, రణభూమిలో వారితో ఎదురు పోరాడాడు. ఇలా కృపునకు వారితో చిత్ర యుద్ధం జరిగింది. అది పదే పదే ఎగిసిపడుతూ, విషయాలపై ఆసక్తి చూపే ఇంద్రియాలతో దేహి పోరాడినట్లుంది.

రాజా! సైనికులు సైనికులతో, ఏనుగులు ఏనుగులతో, గుర్రాలు గుర్రాలతో, రథికులు రథికులతో కలబడ్డారు. మరల ఘోరమైన సంకులసమరం సాగింది. మహారాజా! ఇది చిత్రంగా ఉంది. ఇది ఘోరంగా ఉంది. ఇది రౌద్రంగా ఉంది. అనేటట్లు అనేక విధాలుగా ఘోరంగా పోరాటాలు జరిగాయి. రథచక్రాల ద్వారా, ఏనుగుల నిశ్వాసాలద్వారా చెలరేగిన దుమ్ము సంధ్యాకాల మేఘంవలె సూర్యగమన మార్గమంతా వ్యాపించింది. సూర్యుడు ఆ దుమ్ములో కలిసిపోయి కాంతి హీను డయ్యాడు. ముహూర్తకాలంలోనే వీరుల నెత్తుటితో రణభూమి తడిసి అన్నివైపుల దుమ్ము కనిపించకుండా పోయింది. భారతా! ఆపై మరల ఆ దారుణమధ్యాహ్న వేళలో బలానికి, స్థాయికి తగిన రీతిగా ద్వంద్వ యుద్ధాలు ప్రారంభమయ్యాయి.

23. సంకుల యుద్ధము - 2

సంజయుడు చెపుతున్నాడు. 'అలా భయంకరంగా యుద్ధం జరుగుతుంటే నీ పుత్రుని సైన్యం పాండవులతో తలపడింది. ఆ మహారథులను తీవ్రప్రయత్నంతో నివారించి, నీ కొడుకు పాండవసేనతో పోరాడాడు. అది గమనించి, నీ పుత్రుని విజయాన్ని కోరుతున్న యోధులు వెంటనే మరలివచ్చారు. వారు మరలిరాగానే దారుణంగా యుద్ధం జరిగింది. నీ వారికీ, శత్రువులకూ మధ్య దేవాసుర సంగ్రామం వంటి పోరు జరిగింది. శత్రుసేనలో కానీ, నీ సేనలో కానీ యుద్ధవిముఖు డొక్కడూ లేడు. కేవలం అనుమానంతోనూ, సంజ్ఞలతోనూ పరస్పరం దాడి చేస్తున్నారు. తీవ్ర వినాశనం జరుగుతోంది. అప్పుడు ధర్మరాజు మహాక్రోధంతో రాజులతో సహా ధార్తరాష్ట్రులను యుద్ధంలో జయింపగోరాడు. బంగారు రెక్కలు గలిగి, సానబెట్టిన మూడు బాణాలతో కృపాచార్యుని గాయపరిచి, నాలుగు బాణాలతో కృతవర్మ హయాలను కొట్టాడు. కృతవర్మను అశ్వత్థామ తప్పించి తీసికొనిపోయాడు. అప్పుడు కృపాచార్యుడు ఎనిమిది బాణాలతో ధర్మజుని గాయపరిచి, బదులు తీర్చుకొన్నాడు. ఆపై దుర్యోధన నరపాలుడు యుధిష్ఠిరు డున్న చోటికి ఏడువందల రథాలను పంపించాడు. ఆ రథికులు యుధిష్ఠిరుని చుట్టుముట్టి, మేఘాలు సూర్యుని కప్పివేసినట్లు బాణాలతో ధర్మజుని కనిపించకుండా చేశారు. శిఖండి మొదలయిన రథికులు దాన్ని సహించలేకపోయారు. తీవ్రకోపానికి లోనయ్యారు. మేటి గుర్రాలు పూన్చిన రథాలనెక్కి కౌంతేయుడైన యుధిష్ఠిరుని రక్షణకై వచ్చారు. ఆపై కౌరవపాండవుల మధ్య నెత్తురు నీరులా ప్రవహించే భీకర సంగ్రామం జరిగింది. అది యముని రాజ్యాన్ని వృద్ధిపొందించింది.

కౌరవులలో ఏడు వందల మంది రథికులను చంపి, పాండవులు పాంచాలురతో కూడి మరల దాడి చేశారు. అక్కడ నీకుమారులకు పాండవులతో మహాయుద్ధం జరిగింది. అటువంటి యుద్ధాన్ని గతంలో చూడలేదు. వినలేదు కూడా.

ఆ రీతిగా అంతటా ఏ హద్దులు లేకుండా యుద్ధం జరుగుతోంది. నీ యోధులు, శత్రుయోధులు కూడా మరణిస్తున్నారు. గొప్ప శంఖాలను పూరిస్తూ, యోధులు నినాదాలు చేస్తున్నారు. విలుకాండ్ర ఉక్రోషాలు, సింహనాదాలు, గర్జనలతో తీవ్రయుద్ధం జరుగుతోంది. మర్మస్థానాలు బ్రద్దలవుతున్నాయి. ఆర్యా! జయాభిలాషతో యోధులు పరుగులు పెడుతున్నారు. అంతటా సంహారం జరిగి భూమిపై శోకం చెలరేగింది. ఎంతోమంది ఉత్తమస్త్రీల సీమంతాలు చెదరిపోతున్నాయి. హద్దులెరుగని ఆ దారుణసంగ్రామం జరుగుతుంటే జగద్వినాశనాన్ని సూచిస్తూ మహాదారుణంగా ఉత్పాతాలు పొడసూపాయి. రాజా! శబ్దం చేస్తూ పర్వతాలతో, వనాలతో సహా భూమి కంపించింది. దండాలతో, కౌరవులతో సహా ఎన్నో తోకచుక్కలు సూర్యమండలాన్ని ఢీకొడుతూ, అన్ని దిక్కులా వ్యాపిస్తూ, నేలబడుతున్నాయి. నాలుగువైపుల నుండి సుడిగాలులు వీచాయి. ఏనుగులు కంటతడి పెడుతున్నాయి. తీవ్రంగా వణికిపోతున్నాయి. ఈ ఉత్పాతాలను లెక్క చేయకుండా, క్షత్రియులు మరల యుద్ధానికి సమాయత్తమయ్యారు. స్వర్గానికి వెళ్ళగోరి, పుణ్యప్రదమైన కురుక్షేత్రంలో పోరాటానికి దిగారు. ఆపై గాంధారరాజు కొడుకైన శకుని "ముందు నిలిచి పోరాడండి. వెనుకనుండి పాండవులను సంహరిస్తాను" అని సేనలను హెచ్చరించాడు. దానితో మన యోధులంతా బయలుదేరగా వేగశాలులయిన మద్రయోధులు, ఇతరసేనలు ఉల్లాసంతో కిలకిలారావాలు చేయసాగారు. పాండవులు మరల మనసేనలను సమీపించి, బాణవృష్టిని కురిపించసాగారు. కొద్దివ్యవధిలో శత్రువులు మద్రరాజ సేనను సంహరించారు. అది చూసి దుర్యోధనసేన మరలా పారిపోసాగింది. శకుని మరల "వెనుదిరగండి. ధర్మమెరుగని వారు మీరు. పోరాడండి. పారిపోయి ఏం సాధిస్తారు" అని సైనికులతో అన్నాడు.

గాంధారరాజు దగ్గర పదివేల ఆశ్వికసేన ఉంది. పెద్ద ప్రాసాలతో పోరాడగల సైనికులు వారు. ఆ సేనతో పరాక్రమించి, జనవినాశనం చేయసాగాడు శకుని. పాండవసేనను వెనుకనుండి పదునైన బాణాలతో సంహరించసాగాడు. గాలి మేఘాలను చెదరగొట్టినట్టు ఆ శకునిసేన పాండవ మహాసేనను చెదరగొట్టి, అన్నివైపులా భంగపరిచింది. యుధిష్ఠిరుడు తనకు దగ్గరలోనే తన బలం భంగపడటం చూసి, శాంతంగా అప్పుడు సహదేవుని పిలిచి ఇలా అన్నాడు. "ఈ శకుని కవచాన్ని ధరించి వెనుక నుండి మనసేనను పీడిస్తూ,

సేనాసంహారం చేస్తున్నాడు. ఈ దుర్మతి విషయం చూడు. నీవు ద్రౌపది కొడుకులతో కూడిన ఈ శకునిని చంపు. నేను పాంచాలురతో కూడి రధసేనను దగ్ధం చేస్తాను. ఏనుగులు, గుర్రాలు అన్నీ నీతో కొనిపో. మూడువేల మంది సైనికులను తీసికొని పో. వారిని చుట్టు నిలుపుకొని శకునిని చంపు". ఆపై ఏడు వందల ఏనుగులు, వాటిపై ధనుస్సులు ధరించి యోధులు, ఆయిదు వేల గుర్రాలు, సహదేవుడు, మూడు వేలమంది కాల్బలం, ద్రౌపది కొడుకులు అన్నివైపుల నుండి రణభూమిలో యుద్ధదుర్మదుడైన శకునిపై దాడిచేశారు. రాజా! శకుని పాండవులను అతిక్రమించి, వెనుకవైపు నుండి సేనను సంహరించసాగాడు. పాండవుల ఆశ్వికులు కోపంతో కౌరవరథికులను అతిక్రమించి, శకునిసేనలో ప్రవేశించారు. ఆ ఆశ్వికులు రణభూమి మధ్యలో నిలిచి, శకుని మహాసేనపై బాణవృష్టిని కురిపించసాగారు. రాజా! నీ దురాలోచన ఫలితంగా అక్కడ మహా సంగ్రామం జరిగింది. వీరపురుషులు దానిలో పాలు పంచుకొన్నారు. గదలు, ప్రాసాలు పైకి లేచాయి. అల్లెత్రాటి ధ్వనులు ఆగిపోయాయి. రథికులు ప్రేక్షకు లయ్యారు. నీ వారికీ శత్రువులకూ మధ్య భేదమేమీ కనిపించలేదు. శూరుల బాహువుల నుండి వెలువడుతున్న శక్తులు రాలిపడుతున్న తారలవలె కౌరవ పాండవులకు కనిపించాయి. రాజా! నిర్మలాలైన ఋష్టులు అక్కడక్కడ పడుతూ ఉంటే వాటితో వ్యాపించిన ఆకాశం ఎంతో అందగించింది. అన్నివైపులా పడుతున్న ప్రాసాలు ఆకాశంలో వ్యాపించిన మిడతలవలె కనిపించాయి. వేలకొలది గుర్రాలు గాయపడిన ఆశ్వికులతో పాటు నెత్తురోడుతూ, పడిపోతున్నాయి. సైనికులు ఒకరిపై ఒకరు దాడిచేసి, ఒకరి నొకరు పిండిచేస్తూ, నోళ్ళ నుండి నెత్తురు క్రక్కుతూ తీవ్రమైన గాయాలతో కనిపిస్తున్నారు. ఆపై సేనలు రేపిన దుమ్ముతో అంతటా గాడాంధకార మేర్పడింది. ఆ ప్రదేశం నుండి ఎందరో పారిపోవటం గమనించాను. రణరంగమంతా దుమ్ముతో కప్పబడగా గుర్రాలు, మనుష్యులు పారిపోవటం చూశాను. మరికొందరు నేలపై బడి, విపరీతంగా నెత్తురు క్రక్కుతున్నారు. మనుష్యులు జుట్టుజుట్టు పట్టుకొని కదలడానికి వీలు లేనంతగా ఒరుసుకొంటున్నారు. మహాబలులు గుర్రాల మీదనుండి పరస్పరం లాగుకొంటున్నారు. మల్లులవలె కలబడి ఒకరినొకరు కొడుతున్నారు.

ప్రాణాలు పోయిన వారినెందరినో గుర్రాలు అటు ఇటు లాగుతున్నాయి. తమను తాము శూరులుగా భావించుకొన్న ఎందరో పురుషులు అక్కడక్కడ నేలబడి కనిపిస్తున్నారు. చెదురుమదురుగా చేతులు తెగి, జుట్టు ఊడి, నెత్తురోడుతూ కనిపిస్తున్న వేలమందితో రణభూమి నిండిపోయింది. చనిపోయిన అశ్వాలతో, ఆశ్వికులతో నేల అంతా నిండిపోగా ఒక్క గుర్రం కూడా ఎంతో దూరం కదలలేకపోయింది. సైనికుల

కవచాలు రక్తంతో తడిశాయి. శస్త్రాలు చేత బట్టి, విండ్లను ఎత్తిపట్టి, వివిధ భీకరాయుధాలతో పరస్పర వధాభిలాషతో సైనికులు రణభూమిలో మరీ దగ్గరగా నిలిచి పోరాడుతున్నారు. సైనికులలో చాలామంది మరణిస్తున్నారు. శకుని ముహూర్తకాలం యుద్ధంచేసి, చావగా మిగిలిన ఆరువేల గుర్రాలతో సహా అక్కడనుండి తొలగిపోయాడు. అదే రీతిగా నెత్తురోడుతున్న పాండవసేన కూడా చావగా మిగిలిన ఆరువేల గుర్రాలతో సహా అక్కడనుండి తొలగిపోయింది. వారి వాహనాలన్నీ అలసిపోయాయి. ప్రాణాలమీద ఆశను కూడా వీడి, బాగా దగ్గరగా పోరాడుతున్న పాండవుల ఆశ్వికులు నెత్తురోడుతూ ఇలా అంటున్నారు. "రథాల మీద నిలిచి పోరాడటమే వీలు కావటంలేదు. ఇక మహాగజాల మాట చెప్పేదేముంది ? రథాలు రథాలమీదకే వెళ్ళాలి." ఏనుగులు ఏనుగులమీదకే వెళ్ళాలి. శకుని పారిపోయి తన సేనలో కలిసిపోయాడు. ఆ సుబలరాజు తిరిగి యుద్ధానికి రాడు. ద్రౌపది కొడుకులు, ఆ మదపు టేనుగులతో సహా మహారథుడైన పాంచాలరాజు - ధృష్టద్యుమ్నుడున్న చోటికి వెళ్లిపోయారు. సహదేవుడు కూడా ఒంటరిగా యుధిష్ఠిర నరపాలుడున్న చోటికి వెళ్ళాడు. అలా వారు అక్కడనుండి బయలుదేరగా సుబలసుతుడైన శకుని మరల కోపంతో ధృష్టద్యుమ్నుని సేనను ప్రక్కనుండి సంహరించసాగాడు. అప్పుడు మరల నీ వారికీ, శత్రువులకూ మధ్య జీవితాశ కూడా లేకుండా ఘోర సంగ్రామం జరిగింది. వేల కొలదిగ వీరులు అక్కడకు చేరుకొన్నారు. ఆ వీర సమాగమంలో ఒకరినొకరు తీక్ష్ణంగా చూసికొన్నారు. కత్తులతో తెగిన తలలు పడుతుంటే తాటిపండ్లు నేలరాలుతున్నట్లు పెద్ద చప్పుడయింది. రాజా! ఛిన్నభిన్నమై కవచాలు లేని శరీరాలు, ఆయుధాలతో సహా బాహువులు, తొడలు నేలగూలుతుంటే రోమాంచజనకంగా కటకటమని పెద్దచప్పుడు వినిపిస్తోంది. మాంసం కోసం పక్షులు ఒకదానిపై ఒకటి దూకినట్లు యోధులు, పదునైన శస్త్రాలతో సోదరులను, పుత్రులను, మిత్రులను చంపుతూ మీదపడుతున్నారు. ఉభయ పక్షసేనలు ఒకరినొకరు "నేనే ముందు,. నేనే ముందు" అంటూ వేలకొలదిగ సైనికులను సంహరిస్తున్నారు. ఆసనాల నుండి జారిపడుతున్న ఆశ్వికులతో పాటు వందలు, వేలకొలదిగ గుర్రాలు నేలబడుతున్నాయి. రాజా! నీ దురాలోచన ఫలితంగా గుర్రాలు ఎన్నో నేలగూలి ఛటపటలాడుతున్నాయి. కవచాలు ధరించిన సైనికులెందరో గర్జనలు చేస్తూ, శత్రువుల మర్మస్థానాలను ఛేదిస్తున్నారు. నీవారు అలసటకు లోనై, క్రోధంతో నిండి, దప్పికగొని, పదునైన శస్త్రాలతో గాయపడి ఉన్నారు. వారి వాహనాలు కూడా అలసిపోయాయి. అక్కడి నెత్తుటి వాసనతో ఎందరో సైనికులు వివేకాన్ని కోల్పోయి, తమ దగ్గరగా వచ్చినవారు శత్రువులైనా, తమవారైనా సరే వచ్చినవారిని వచ్చినట్లు చంపుతున్నారు.

రాజా! జయాన్ని అభిలషిస్తున్న క్షత్రియులెందరో శరవృష్టి దెబ్బతిని, ప్రాణాలు పోగొట్టుకొని, నేలపై పడియున్నారు. తోడేళ్ళకు, గ్రద్దలకు, నక్కలకు ఆనందాన్ని కలిగించే ఆ భీకరదినంలో నీ కుమారుడు చూస్తుండగానే దారుణంగా సేనావినాశం జరిగింది. గాయపడుతూ కూడా నీవారు కానీ, పాండవులు కానీ వెనుదిరగటం లేదు. ప్రాణాలున్నంతవరకు శక్తిననుసరించి దెబ్బతీసి, ఆపై గాయాలనుండి నెత్తురు క్రక్కుతూ, యోధులు పడిపోతున్నారు. అక్కడ ఒక శవం ఒక చేతితో జుట్టు చేత జిక్కిన తలతో, మరొక చేతిలో నెత్తుట తడిసి, పైకెత్తియున్న కత్తితో కనిపిస్తోంది. యుద్ధకోలాహలం కొంచెం తగ్గగానే, శకుని చావగా మిగిలిన కొద్ది గుర్రాలతో మరల పాండవ సేనపై దాడిచేశాడు. ఆ తరువాత జయాన్ని అభిలషిస్తున్న పాండవులు కూడా వేగంగా శకునిపై దాడిచేశారు. పాండవులు యుద్ధంయొక్క పారాన్ని దాటగోరుతున్నారు. అందువలన కాల్బలం, ఏనుగులు, ఆశ్వికులు ఆయుధాలనెత్తి శకునిని అన్నివైపుల నుండి ఆక్రమించి, బందిఖానాలో ఉంచినట్లుంచి వివిధ శస్త్రాలతో దాడిచేశారు. చుట్టుముట్టిన పాండవ సేనను చూసి నీ సేనలోని రథికులు, ఆశ్వికులు, కాల్బలం, హస్తిపకులు అందరూ పాండవులపై దాడిచేశారు. పుణ్యం ముగియగానే సిద్ధులు స్వర్గలోకవిమానాల నుండి పడినట్లు రథికులు రథాలనుండీ, హస్తిపకులు ఏనుగులమీద నుండి పడిపోయారు. ఆ మహాసంగ్రామంలో ఆ యోధులు తండ్రులను, సోదరులను, మిత్రులను చంపుతున్నారు. కొందరు కన్నబిడ్డలను కూడా సంహరిస్తున్నారు. భరతసత్తమా! ఆ మహాదారుణ సంగ్రామం ఏ హద్దులూ లేకుండా సాగిపోయింది.'

24. అర్జునుడు దుర్యోధనుని వైఖరిని గర్హించుట - రథికులను సంహరించుట.

సంజయుడిలా చెప్తున్నాడు. 'పాండవులు నీ సేనను సంహరిస్తే కోలాహలం మందగించింది. ఇంకా మిగిలి ఉన్న ఏడు వందల గుర్రాలతో శకుని వెనుకకు వచ్చాడు. ఆ శకుని కౌరవసేనను సమీపించి, వారిని యుద్ధానికి తొందరపెడుతూ "అరిందములారా! హర్షోత్సాహాలతో పోరాడండి" అని వారితో పలికి 'మహా బలుడైన దుర్యోధనుడెక్కడ?" అని అక్కడున్న క్షత్రియులను అదే పనిగా అడిగాడు. క్షత్రియులిలా అన్నారు.. "మహాబలుడు, కురురాజు అయిన దుర్యోధనుడు అడుగో రణమధ్యంలో రథాలు నిలిచి యున్నచోట ఉన్నాడు. మేఘ గర్జనవంటి భీకరధ్వని వినిపిస్తున్న ఆ చోటికి వేగంగా వెళ్ళు. అక్కడ

దుర్యోధనుని చూడగలవు". శకుని వీరులను చుట్టూ నిలుపుకొని, నీ కొడుకు దుర్యోధనుడున్న చోటికి వెళ్లాడు. ఆ శకుని రథసేనలో నున్న దుర్యోధనుని చూసి ఆనందించి, తనను కృతార్థునిగా భావించుకొని, నీ సేనలోని రథికులనందరినీ ఆనందింపజేస్తూ దుర్యోధన నరపాలునితో ఇలా అన్నాడు. "రాజా! రథసేనను సంహరించు నేను గుర్రాలనన్నింటినీ గెలిచాను. ప్రాణాలమీద ఆశ వదిలితే తప్ప రణభూమిలో యుధిష్ఠిరుని గెలవలేము. యుధిష్ఠిరుని రక్షణలోనున్న రథసేనను సంహరించిన తరువాత ఈ ఏనుగులను, కాల్బలాన్ని, ఆశ్వికులను కూడా చంపుదాం". ఆ శకుని మాట విని జయాభిలాషగల నీవారు ఉల్లాసంగా, వేగంగా పాండవసేనపై దాడిచేశారు. అందరూ అమ్ములపొదులను తెరచి, ధనుస్సులను చేతబట్టి, వాటిని ఝుళిపిస్తూ సింహనాదాలు చేశారు. మరల అల్లెత్రాటి టంకార ధ్వని, విడిచిన బాణాల దారుణ శబ్దం కూడా వినిపించింది. ధనుస్సులనెత్తి సమీపిస్తున్న వారిని చూసి, కౌంతేయుడైన అర్జునుడు దేవకీసుతునితో ఇలా అన్నాడు.

"స్తిమితంగా గుర్రాలను నడిపించు. ఈ సేనాసముద్రంలో ప్రవేశించు. ఈరోజు పదునైన బాణాలతో శత్రువులను అంతం చేస్తాను. జనార్దనా! ఇప్పటికే ఈ మహా సంగ్రామంలో పరస్పరం తారసపడి, పద్దెనిమిది రోజులు అయ్యాయి. ఈ కౌరవులసేన అపారమైనది. కానీ యుద్ధంలో నేటికే చాలావరకు నశించింది. **విధి ఎటువంటిదో చూడు.** మాధవా! సముద్రమంత దుర్యోధనసేన మనతో కలబడి, చిన్న మడుగంత అయింది. భీష్ముడు పడిపోగానే దుర్యోధనుడు సంధి చేసికొని ఉంటే మేలు జరిగేది కానీ మూర్ఖుడైన దుర్యోధనుడు ఆ పని చేయలేదు. భీష్ముడు యథార్థమూ, హితకరమూ అయిన మాట చెప్పాడు. కానీ బుద్ధిహీనుడైన సుయోధనుడు దానిని కూడా చేయలేదు. శంతనుసుతుడు పడిపోయిన తరువాత కూడా ఇంకా యుద్ధం చేస్తున్నారంటే ధృతరాష్ట్రసుతులు మూర్ఖులనీ, పామరులనీ భావిస్తున్నాను. ఆ తరువాత శ్రేష్ఠుడైన ద్రోణుడు మరణించాడు. కర్ణుడు, వికర్ణుడు కూడా చనిపోయాడు. అయినా సంహారం ఆగలేదు. సైన్యం చాలా కొంచెం మిగిలింది. కర్ణుడు పుత్రసహితంగా చంపబడ్డాడు. అయినా సంహారం ఆగలేదు. వీరుడైన శ్రుతాయువు, పురువంశీయుడైన జలసంధుడు, శ్రుతాయుధుడు చనిపోయారు. అయినా సంహార మాగలేదు. భూరిశ్రవుడు, శల్యుడు, శాల్వుడు, అవంతివీరులు చనిపోయారు. అయినా సంహార మాగలేదు. జయద్రథుడు, బాహ్లికుడు, సోమదత్తుడు, రాక్షసుడైన అలాయుధుడు చనిపోయారు. భగదత్తుడు, కాంబోజరాజు, దుశ్శాసనుడు చనిపోయారు. అయినా సంహార మాగలేదు. కృష్ణా! ప్రాంతీయ

రాజులెందరో బలశాలులై కూడా యుద్ధంలో చనిపోయారు. అయినా భీమసేనుడు సేనాపతుల నందరినీ సంహరించాడు. అయినా మోహం వల్లనో, లోభం వల్లనో సంహార మాగలేదు.

రాజవంశంలో, విశేషించి కురువంశంలో పుట్టి, దుర్యోధనుడు తప్ప మరెవ్వడూ నిరర్థకమైన ఇటువంటి మహావైరాన్ని పూనలేదు. పరులు తమకన్నా గుణాలలో, బలంలో పరాక్రమంలో అధికులని తెలిసి కూడా తమ హితాహితాలను గ్రహించి, వివేకంతో యుద్ధాన్ని విరమించగల ప్రాజ్ఞు డెవడుంటాడు ? పాండవులతో సంధి చేసికొమ్మని నీవు హితవచనాలు పలికినా మనస్సు పెట్టనివాడు ఆ దుర్యోధనుడు. ఇక ఇతరులు చెపితే ఎలా వింటాడు ? సంధివిషయంలో భీష్ముని, వీరుడైన ద్రోణుని, విదురుని కూడా తిరస్కరించిన వాడు దుర్యోధనుడు. అటువంటివాడికి ఇప్పుడు మందు ఏముంది ? జనార్దనా! పెద్దవాడైన తండ్రి మాటలను, హితాన్ని కోరి హితవచనాలు పలికిన తల్లిని తన మూర్ఖత్వం కారణంగా తిరస్కరించాడు. వారిని పరాభవించి కాదు పొమ్మన్నాడు. అటువంటి వాడికి ఎవరి మాటలు రుచిస్తాయి ? జనార్దనా! ఇతడు తప్పనిసరిగా వంశ వినాశనానికే పుట్టాడు. ఇతని చేష్టలు, రాజనీతి ఆ రీతిగానే కనిపిస్తున్నాయి. అచ్యుతా! ఇప్పటికైనా దుర్యోధనుడు రాజ్యమివ్వడనే నా అభిప్రాయం. మహాత్ముడైన విదురుడు నాతో ఎన్నోసార్లు ఇలా చెప్పాడు. "మానదా! దుర్యోధనుడు బ్రతికియున్నంతకాలం రాజ్యమివ్వడు. దుర్బుద్ధి అయిన దుర్యోధనుని ప్రాణాలు ఉన్నంతకాలం పాపరహితులైన మీపై కూడా పాపిష్ఠప్రవర్తనే కొనసాగిస్తాడు". కృష్ణా! యుద్ధంతప్ప దుర్యోధనుని గెలవటానికి మరో ఉపాయం లేదు. సత్యద్రష్ట అయిన విదురుడు నాకు ఈ మాటే ఎప్పుడూ చెప్తుండేవాడు. మహాత్ముడైన విదురుడు చెప్పిన మాటకు తగినట్లుగానే ఉన్న ఈ దురాత్ముని నిశ్చయాన్ని నేనిప్పుడు తెలిసికొంటున్నాను. పరశురాముడు యథార్థమైన హితవచనాన్ని దుర్యోధనునికి చెప్పాడు. ఆ మాట విని కూడా, ఈ దుర్బుద్ధి ఆయనను పరిహసించాడు. వినాశకాలం దాపురించినట్లే! సుయోధనుడు పుట్టినప్పుడే "ఈ దుర్మార్గుని వలన క్షత్రియులందరూ నశిస్తా"రని సిద్ధులు పదే పదే చెప్పారు. జనార్దనా! వారు చెప్పిన ఆ మాట ఇప్పుడు యథార్థమవుతోంది. దుర్యోధనునికోసం రాజులు ఎందరో నశించిపోతున్నారు. మాధవా! నేడు రణభూమిలో యోధుల నందరినీ సంహరిస్తాను. క్షత్రియులను వేగంగా సంహరించగానే, శిబిరం శూన్యంకాగానే, తన చావుకోసం దుర్యోధనుడు మనతోనే పోరాటానికి ఇష్టపడతాడు. అతడు చావగానే వైరం ముగుస్తుందని నా ఊహ. వార్ష్ణేయా! నా ప్రజ్ఞనుబట్టి, విదురవచనాన్ని బట్టి, దుర్యోధనుని చేష్టలను బట్టి ఆలోచిస్తే అలాగే జరుగుతుం దనిపిస్తోంది.

కాబట్టి వీరా! మహాబాహూ! సేనలో ప్రవేశించి పదునైన బాణాలతో రణరంగంలో దుర్యోధనునీ, అతని సేనను సంహరిస్తాను. మాధవా! దుర్యోధనుడు చూస్తుండగానే ఈ దుర్బలసేనను సంహరించి ధర్మరాజుకు క్షేమాన్ని కలిగిస్తాను".

సవ్యసాచి అలా అనగానే పగ్గాలు చేతబట్టి ఉన్న కృష్ణుడు ఆ శత్రుసేనలోకి నిర్భయంగా ప్రవేశించాడు. ఆ సేన ఒక అడవివలె ఉంది. కుంతాలు, కత్తులు, బాణాలతో భయంకరంగా ఉన్నది. శక్తులు ముళ్ళవలె అక్కడ నిండిఉన్నాయి. గదలు, పరిఘలు కాలిబాటలవలె, రథాలు ఏనుగులు పెద్ద చెట్లవలె కనిపిస్తున్నాయి. గుర్రాలు, కాల్బలం లతలవలె వ్యాపించాయి. మహాయశస్వి అయిన కృష్ణుడు ఉన్నత పతాకం గల రథంతో దానిలో ప్రవేశించి, సంచరించసాగాడు. రాజా! శ్రీకృష్ణుని సారథ్యంలో ఆ తెల్లగుర్రాలు రణభూమిలో అర్జునుని కొనిపోతూ, అన్ని దిక్కులలో కనిపిస్తున్నాయి. అర్జునుడు మేఘం జలధారలను కురిపించినట్లు తీక్ష్ణబాణాలను వందలకొలదిగా కురిపిస్తూ, రథంతో ఆ సేనలో ముందుకు సాగాడు. ఆ బాణాలనుండి పెద్ద చప్పుడు పుట్టింది. అర్జునుడు సైనికులను బాణాలతో కప్పివేశాడు. ఆ బాణ సమూహాలు వారి కవచాలపై తగుల్కొనకుండా నేలబడుతున్నాయి. ఆ బాణాలు ఇంద్రుని వజ్రంవలె గాఢ స్పర్శను కలిగిస్తూ సైనికులను, ఏనుగులను, గుర్రాలను చంపి, కూతపెడుతున్న పక్షులవలె రణభూమిలో పడుతున్నాయి. ఆ బాణాలు రణభూమినంతటినీ కప్పివేశాయి. ఆ రణరంగంలో దిక్కులు కానీ, మూలలు కానీ తెలియటం లేదు. అర్జునుని పేరున ఉన్న బాణాలతో అక్కడి ప్రపంచమంతా నిండిపోయింది. దావాగ్ని ఏనుగులను తగులబెట్టినట్లు అర్జునుడు పదునైన బాణాలతో సంహరిస్తుంటే, ఆ భీకరకౌరవ యోధులు అర్జునుని విడిచి వెళ్ళలేకపోతున్నారు. ప్రజ్వలిస్తున్న సూర్యునివలె అర్జునుడు ధనుర్బాణాలు ధరించి, అగ్ని చెత్తను తగులబెట్టినట్లు రణభూమిలో యోధులను దగ్ధం చేశాడు. ఆటవికులు అడవిలో అంటించిన నిప్పు తీవ్రంగా పెరిగి, తపింపజేస్తూ పెద్ద చెట్లను, ఎండిపోయిన తీగల గుంపులను, చెత్తా చెదారాన్ని దహించేసినట్లు బాణాలతో అర్జునుడు నీ కుమారుని సేననంతటినీ దహించివేశాడు. అర్జునుని బాణాలు ప్రాణాంతకాలు. సైనికుని మీద కానీ, గుర్రం మీద కానీ, మహాగజంపై కానీ అర్జునుడు రెండవ బాణాన్ని ప్రయోగించలేదు. అర్జునుడు ఒక్కడే నీ మహారథసేనలో ప్రవేశించి, ఇంద్రుడు రాక్షసులను చంపినట్లు అనేకరూపాలు, ఆకారాలు గల బాణాలతో నీ కుమారుని సేనను సంహరించాడు.'

25. దుర్యోధన పలాయనము

సంజయుడిలా చెప్తున్నాడు. 'యుద్ధంలో వెనుదిరగకుండా కౌరవశూరులు ఎంత ప్రయత్నిస్తున్నా వారు చూస్తుండగానే అర్జునుడు గాండీవంతో వారి సంకల్పాన్ని వ్యర్థపరిచాడు. మేఘం జలధారలను కురిసినట్లు అర్జునుడు బాణ వృష్టిని కురిపిస్తున్నాడు. ఆ బాణాల స్పర్శ వజ్ర స్పర్శవలె కఠినం. మహాశక్తి గల ఆ బాణాలను సహించటం కష్టం. అర్జునుడు నీ సేనను అలా సంహరిస్తుంటే నీ కుమారుడు చూస్తుండగానే ఆ సేన రణభూమినుండి పారిపోయింది. రాజా! కొందరు తండ్రులను పిలుస్తున్నారు. కొందరు ఇతర సహాయకులను పిలుస్తున్నారు. కొందరు బంధువులను, సోదరులను, సంబంధులను (వియ్యంకులను) ఎక్కడివారి నక్కడే వీడి పారిపోతున్నారు. ఎందరో మహారథులు తీవ్రంగా గాయపడి మూర్ఛపోయారు. అర్జునుని బాణాల దెబ్బతిన్న మనుష్యులు రణభూమిలో పడి, నిట్టూర్పులు విడుస్తున్నారు. ఇతరులు వారిని రథాలపై కెక్కించి, ముహూర్తకాలం ఆశ్వాసించి, తాము కూడా విశ్రమించి, దప్పిక తీర్చుకొని, మరల యుద్ధానికి వెళుతున్నారు. కొందరు నీ కుమారుని ఆదేశాన్ని అనుసరించి, మరల పోరాడాలన్న తలంపుతో గాయపడినవారిని వీడిపోతున్నారు. భరతసత్తమా! మరికొందరు నీరుత్రాగి, గుర్రాలను కూడా విశ్రమింపజేసి, కవచాలు ధరించి యుద్ధానికి వెళ్తున్నారు. కొందరు గాయపడిన సోదరులను, తండ్రులను, పుత్రులను అనునయించి, శిబిరంలో నిలిపి, మరల యుద్ధంపై మనస్సు పెడుతున్నారు. రాజా! మరికొందరు రథాలను ఉపకరణాలతో సిద్ధం చేసికొని, ప్రాధాన్యాన్ని అనుసరించి మరల పాండవ సేనలోని వీరులతో యుద్ధానికై ముచ్చటపడుతున్నారు. కొందరు స్వర్ణాలంకరణలు గల రథాలతో వేగంగా వచ్చి పాండవసేనలోని ధృష్టద్యుమ్ననితో యుద్ధానికి తలపడ్డారు. ధృష్టద్యుమ్నుడు, శిఖండి, నకులుని కొడుకు శతానీకుడు నీ రథసేనతో పోరాడసాగారు.

ఆపై నీవారిని చంపటానికై ప్రయత్నిస్తూ ధృష్టద్యుమ్నుడు మహాసేనను చుట్టూ నిలుపుకొని తీవ్రకోపంతో పరాక్రమించాడు. ఆ ధృష్టద్యుమ్నుని మీదకు నీ కొడుకు అనేక బాణసమూహాలను ప్రయోగించాడు. రాజా! ఆ తరువాత విలుకాడైన నీకుమారుడు ఎన్నో నారాచాలతో, అర్ధనారాచాలతో ధృష్టద్యుమ్నుని నాలుగు గుర్రాలను చంపి, అతని బాహువులపై, రొమ్ముపై గాయపరిచాడు. ఆ ధృష్టద్యుమ్నుడు గాయపడి, అంకుశం పోటుతిన్న ఏనుగువలె కోపంతో దుర్యోధనుని నాలుగు గుర్రాలను బాణాలతో మృత్యువు దగ్గరకు పంపాడు. భల్లంతో అతని సారథి తలను శరీరం నుంచి వేరుచేశాడు. దానితో

దుర్యోధన నరపాలుడు ఒక గుర్రాన్ని ఎక్కి, అక్కడనుండి కొంచెం ప్రక్కకు తప్పుకొన్నాడు. దుర్యోధనుడు తన సేన పరాక్రమాన్ని కోలుపోయిందని గ్రహించి, శకుని దగ్గరకు వెళ్ళాడు. ఆ రీతిగా రథసేన భంగపడగానే మూడువేల మదపుటేనుగులు పాండవరథికులను అందరినీ అన్ని వైపులనుండి నిరోధించాయి. రణభూమిలో గజసేన చుట్టుముట్టిన ఆ పంచపాండవులు మేఘాలు చుట్టుముట్టిన గ్రహాలవలె శోభించారు. మహారాజా! ఆపై కృష్ణసారథి అయిన అర్జునుడు లక్ష్యాన్ని గమనించి, రథంతో ముందుకు సాగాడు. పర్వతాలవలె నున్న ఏనుగులు తనను చుట్టుముట్టగా నిర్మలాలు, తీక్ష్ణాలు అయిన బాణాలతో గజసేనతో పోరాడసాగాడు.

అక్కడ అర్జునుని ఒకే ఒక బాణంతో దెబ్బతిని, శరీరాలు బ్రద్దలై కొన్ని ఏనుగులు పడిపోయి, కొన్నిపడిపోతూ కనిపించాయి. బలశాలియై, మదపుటేనుగువలె నున్న భీమసేనుడు ఆ ఏనుగులను చూసి, పెద్ద గదను చేతబట్టి దండం చేతబట్టిన యమునివలె రథంమీదనుండి దూకి వేగంగా వాటిమీద దాడిచేశాడు. గదనెత్తి పట్టిఉన్న ఆ భీమసేనుని చూసి, నీ సేనలు బెదరిపోయి, మలమూత్రాలు విసర్జించాయి. వృకోదరుడు గదను చేతబట్టగానే కౌరవసైన్యమంతా ఉద్వేగానికి లోనయింది. పర్వతాలవంటి ఆ ఏనుగుల కుంభస్థలాలను భీమసేనుడు గదతో బ్రద్దలు చేశాడు. కుంభస్థలాలు బ్రద్దలై అటు ఇటు పరుగెత్తుతూ పడిపోతున్న ఎన్నో ఏనుగులను చూసి, నీ సైనికులు భయపడ్డారు. కోపించిన యుధిష్ఠిరుడు, నకులసహదేవులు కూడా పదునైన బాణాలతో ఏనుగులను యమసదనానికి పంపారు. దుర్యోధనుని ఓడించి, ఆ నీ కొడుకు గుర్రమెక్కి, పారిపోగానే ధృష్టద్యుమ్నుడు ఏనుగులు చుట్టుముట్టిన పాండవులను అందరినీ చూశాడు. వెంటనే ఆ పాంచాల రాజకుమారుడు ఏనుగులను చంపే ఉద్దేశంతో వాటిపై దాడికి బయలుదేరాడు. దుర్యోధనుడు ఆ రథసేనలో కనిపించకపోయే సరికి అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ "దుర్యోధనుడు ఎటువెళ్ళాడు ?" అంటూ క్షత్రియులనడిగారు'. జరుగుతున్న జనసంహారంలో దుర్యోధనుడు కనిపించకపోవటంలో ఆ మహారథులు నీకుమారుడు చనిపోయాడని భావించి, ముఖాలు పాలిపోగా నీ కుమారుని గురించి అందరినీ అడగసాగారు. కొందరిలా చెప్పారు. "సూతుడు చనిపోగానే దుస్సహమైన ఆ పాంచాలరాజసేనను విడిచి, శకుని దగ్గరకు వెళ్ళిపోయాడు". తీవ్రంగా గాయపడిన మరికొందరు క్షత్రియులు ఇలా అన్నారు. "దుర్యోధనునితో పని ఏమిటి ? బ్రతికి ఉన్నాడో లేదో చూడండి. అందరూ కలిసి పోరాడండి. రాజు మీకిప్పుడేం చేయగలడు ?" అక్కడ పోరాడుతున్న క్షత్రియుల వాహనాలు

దాదాపు నశించాయి. వారి శరీరాలు చితికిపోయాయి. వారు శరపీడ ననుభవిస్తూ అస్పష్టంగా ఇలా పలికారు. "మన చుట్టు ఉన్న ఈ సేననంతా చంపివేద్దాం. పాండవులు అందరూ గజసేనను చంపి, మనదగ్గరకే వస్తున్నారు". వారి మాటలు విని మహాబలుడైన అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ, ఈ ముగ్గురు మేటి విలుకాండ్రు దుస్సహమైన ఆ పాంచాలరాజసేనా వ్యూహాన్ని భంగపరిచారు. ఆ శూరులు రథసేనను వీడి, శకుని ఉన్న చోటుకు బయలుదేరారు.

రాజా! వారలా బయలుదేరగానే ధృష్టద్యుమ్నుని ముందు నిలుపుకొని, పాండవులు నీ సేనను సంహరిస్తూ, అక్కడకు వచ్చారు. మహోల్లాసంతో మీదకు వస్తున్న ఆ మహారథులను చూసి, నీ సేనలోని పరాక్రమశాలులైన వీరులు అప్పుడు జీవితం మీద ఆశను వదులుకొన్నారు. నీ సేనల ముఖాలు పాలిపోయాయి. వారి ఆయుధాలు నశించిపోయాయి. పాండవసేన వారిని చుట్టుముట్టింది. రాజా! అప్పుడు నేను నా ప్రాణాలను లెక్కచేయకుండా మరో నలుగురు మహారథులను వెంటబెట్టుకొని గజాశ్వసేనలతో ధృష్టద్యుమ్నసేనలతో పోరాడసాగాను. కృపాచార్యుడున్న తావున మేము యుద్ధానికి దిగాం. కానీ, అర్జునుని బాణాల తాకిడితో మేమయిదుగురమూ పారిపోయి ధృష్టద్యుమ్నుని దగ్గరకు వచ్చాం. అక్కడ మామధ్య మహాసంగ్రామం జరిగింది. ధృష్టద్యుమ్నుని చేతిలో మేమంతా ఓడిపోయాం. ఆపై అక్కడనుండి పారిపోయాం. అప్పుడు మహారథుడైన సాత్యకి నా దగ్గరకు రావటం చూశాను. నాలుగు వందల రథాలతో రణభూమిలో సాత్యకి నాపై దాడిచేశాడు. ధృష్టద్యుమ్నుని గుర్రాలు అలసిపోయి ఉన్నాయి. ఆయననుండి కష్టపడి తప్పించుకొన్న నేను దుష్టుడు నరకంలో పడ్డట్టు సాత్యకి సేనలో పడ్డాను. ముహూర్తకాలం అక్కడ భీకరమూ, ఘోరమూ అయిన యుద్ధం జరిగింది. మహాబాహువైన సాత్యకి నా యుద్ధసామగ్రిని నాశనం చేశాడు. మూర్ఛిల్లి నేలగూలిన నన్ను ప్రాణాలతో పట్టుకొన్నాడు. ఆపై ముహూర్తకాలంలోనే గదతో భీమసేనుడు, బాణాలతో అర్జునుడు ఆ గజసేనను సంహరించారు. పర్వతాలవంటి ఆ మహాగజాలు చితికిపోయి, అన్నివైపులపడి ఉన్నాయి. పాండవులు ముందుకు సాగటం కూడా కష్టమైంది. అప్పుడు భీమసేనుడు ఆ మహాగజాలను ప్రక్కకు తొలగిస్తూ, పాండవులకు రథమార్గాన్ని కల్పించాడు. అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ రథసేనలో దుర్యోధనుడు కనిపించక పోవటంతో మహారథుడైన ఆ నీ కొడుకును వెదుక సాగారు. వారు ధృష్టద్యుమ్నుని వీడి శకుని దగ్గరకు వెళ్ళిపోయారు. జరుగుతున్న ఆ జనవినాశంలో దుర్యోధనుడు కనిపించనందువల్ల కలతచెందారు.

26. భీముడు పదకొండుమంది ధార్తరాష్ట్రులను చంపుట.

రాజా! భీమసేనుడు యుద్ధంలో గజసేనను సంహరించాడు. ఇతర సైన్యాన్నీ సంహరించసాగాడు. భీమసేనుడు కోపంతో యమునివలె రణభూమిలో సంచరించసాగాడు. దుర్యోధనుడు కనిపించటం లేదు. దానితో చావగా మిగిలిన నీ కొడుకులు అందరూ కలిసి భీమసేనునిపై దాడిచేశారు. దుర్మర్షణుడు, శ్రుతాంతుడు, జైత్రుడు, భూరిబలుడు, రవి, జయత్సేనుడు, సుజాతుడు, దుర్విషహుడు, దుర్విమోచనుడు, దుష్ప్రధర్షుడు, శ్రుతర్వుడు - ఈ నీ కుమారులు అందరూ యుద్ధవిశారదులు. వీరంతా కలిసి భీమసేనునిపై దాడిచేసి, అన్నివైపులా నిరోధించారు. ఆపై భీముడు మరల తన రథంపై నిలిచి, నీ కుమారుల మర్మస్థానాలపై పదునైన బాణాలను ప్రయోగించాడు. మహాసంగ్రామంలో భీముడు నీ కొడుకులపై బాణప్రయోగం చేస్తుంటే వారు గోతిలో నుండి ఏనుగును లాగినట్లు భీమసేనుని దూరంగా తీసికొనిపోయారు. దానితో కోపించిన భీముడు రణభూమిలో దుర్మర్షణుని తలను ఒక క్షురప్రంతో నరికి, నేలపై పడగొట్టాడు. ఆపై భీముడు మరొక భల్లంతో నీకొడుకైన శ్రుతాంతుని సంహరించాడు. ఆ తరువాత నవ్వుతూ జయత్సేనుని బాణంతో గాయపరిచి, రథాసనం నుండి పడగొట్టాడు. అతడు వెంటనే మరణించాడు. మారిషా! ఆ తరువాత శ్రుతర్వుడు వందబాణాలతో భీముని గాయపరిచాడు. దానితో కోపించిన భీముడు జైత్రుడు, భూరిబలుడు, రవి - అనే ఈ ముగ్గురిని మూడు బాణాలతో గాయపరిచాడు. దెబ్బతిన్న ఆ మహారథులు చనిపోయి, రథాలమీద నుండి పడిపోయారు. ఆ తరువాత భీముడు మరొక బల్లెంతో దుర్విమోచనుని కొట్టి మృత్యుసన్నిధికి పంపాడు. ఆ తరువాత నీ కొడుకులైన దుష్ప్రధర్షుని, సుజాతుని ఒక్కొక్కరిని రెండు రెండు బాణాలతో యుద్ధంలో చంపివేశాడు. మీదకు వస్తున్న నీకుమారుని - దుర్విషహుని చూసి భీముడు భల్లంతో పడగొట్టాడు. భల్లందెబ్బతిన్న దుర్విషహుడు విలుకాండ్రు అందరూ చూస్తుండగానే రథంమీద నుండి పడిపోయాడు.

రణభూమిలో ఒక్కని చేతిలో తన సోదరులు అనేకులు చనిపోవటం చూసి, సహించలేక శ్రుతర్వుడు భీమునిపై దాడిచేశాడు. ధనుస్సును ఆకర్షిస్తూ, అనేక బాణాలను భీమునిపై ప్రయోగించాడు. రాజా! ఆ శ్రుతర్వుడు మహాసంగ్రామంలో భీముని వింటిని ఖండించాడు. ఆపై విల్లు విరిగిన భీమునిపై ఇరవై బాణాలను కురిపించాడు. ఆపై మహాబలు డైన భీమసేనుడు మరొక వింటిని తీసికొని, నీకుమారునిపై బాణాలను కురిపించి "నిలు! నిలు!" అని అరిచాడు. రాజా! ఆ తరువాత శ్రుతర్వుడు కోపించి,

వింటిని చేపట్టి, బాణాలతో భీమసేనుని బాహులపై, రొమ్ముపై గాయపరిచాడు. ఆపై భీముడు కోపానికి లోనయి నీ కుమారుని సారథిని, నాలుగు గుర్రాలను బాణాలతో యమసదనానికి పంపించాడు. రాజా! శ్రుతర్వుడు విరథుడై కత్తిని, డాలునూ చేతబట్టాడు. కత్తిని చేబడుతుండగానే భీమసేనుడు ఒక క్షురప్రంతో అతని తలను శరీరం నుండి పడగొట్టాడు. ఆ వీరుడు పడిపోగానే నీ వారంతా భయమోహితులై కూడా భీమసేనునితో పోరాడదలచి రణభూమిలో అతనిపై దాడిచేశారు. ఆ సేనాసాగరంలో చావగా మిగిలిన వారు కవచాలు ధరించి, అలా మీదకు వస్తుండగానే ప్రతాపవంతుడైన భీమసేనుడు వారిని నిరోధించాడు. ఆపై సేనలతో సహా అయిదువందల మంది మహారథులను చంపి, మరల రణభూమిలో ఏడువందల గజసేనను సంహరించాడు. గొప్ప బాణాలతో లక్షమంది సైనికులను, ఎనిమిది వందల గుర్రాలను చంపి, భీముడు విరాజిల్లాడు. భీమసేనుడు నీకుమారులను చంపి, తనను కృతకృత్యునిగా భావించుకొన్నాడు. జన్మ సఫలమైన దనుకొన్నాడు. రాజా! అలా పోరాడుతూ నీవారిని సంహరిస్తున్న భీముని చూడటానికి కూడా నీ సేనలు ఉత్సాహపడలేదు. భీముడు కౌరవులనందరినీ పారద్రోలి, వారి అనుచరులను చంపి, ఆపై పెద్ద ఏనుగులకు భయాన్ని కలిగిస్తూ బాహువులు అప్పళించాడు. దాదాపు అందరూ చావగా కొద్దిగా మిగిలిన నీ సేన దైన్యానికి లోనయింది.'

27. సుశర్మ వధ

సంజయుడిలా చెప్తున్నాడు. 'మహారాజా! అప్పుడు నీ కొడుకులు దుర్యోధనుడు, సుదర్శనుడు మాత్రమే మిగిలి ఉన్నారు. ఇద్దరూ అశ్వసేన మధ్య నిలిచియున్నారు. ఆపై ఆశ్వికుల మధ్య నిలిచియున్న దుర్యోధనుని చూసి, కృష్ణుడు అర్జునునితో ఇలా అన్నాడు. "దాదాపు శత్రువులందరూ చనిపోయారు. నీ కుటుంబం సురక్షితంగా ఉంది. అదిగో! అటు సాత్యకి సంజయుని బంధించి తెస్తున్నాడు. భారతా! యుద్ధభూమిలో పాపాత్ములైన ధార్తరాష్ట్రులతో, వారి అనుచరులతో పోరాడి నకులసహదేవులు అలసిపోయారు. ఇటు కృపుడు, కృతవర్మ, మహారథు డైన అశ్వత్థామ దుర్యోధనుని వీడి, ఎక్కడో ఉన్నారు. ప్రభద్రకులందరితో సహా దుర్యోధన బలాన్ని చంపి, ఈ ధృష్టద్యుమ్నుడు పరమశోభతో నిలిచిఉన్నాడు. పార్థా! ఈ దుర్యోధనుడు ఛత్రాన్ని ధరించి, ఆశ్వికుల మధ్య నిలిచి మాటిమాటికీ ఇటే చూస్తున్నాడు. సైన్యాన్ని అంతటినీ వ్యూహాత్మకంగా నిలిపి యుద్ధభూమిలో నిలిచిఉన్నాడు. పదునైన బాణాలతో ఇతనిని చంపి కృతకృత్యుడవు కాగలవు. అరిందమా!

గజసేన చనిపోయినట్లు, నీవు సమీపిస్తున్నట్లు గ్రహించి వీరు పారిపోకముందే సుయోధనుని చంపు. ఎవరినైనా పంపి ధృష్టద్యుమ్నుని వేగంగా రమ్మని కబురుపెట్టు. దుర్యోధనుని సైన్యం అలసి ఉంది. ఈ పాపాత్ముని ఇప్పుడు విడువకూడదు. దుర్యోధనుడు నీ సేన నంతటినీ చంపి, పాండవులను ఓడించాలని భావించి, మహోగ్రరూపాన్ని ధరించాడు. కానీ తన బలం పాండవుల పీడనకు లోనై మరణించిందని గ్రహించి తప్పనిసరిగా యుద్ధానికి వస్తాడు ఆ రాజు. అది తనచావు కోసమే."

కృష్ణుడు అలా అనగానే అర్జునుడు కృష్ణునితో ఇలా అన్నాడు. "మాధవా! భీముడు మిగిలిన ధార్తరాష్ట్రుల నందరినీ సంహరించాడు. కృష్ణా! ఎదుట నిలిచియున్న ఈ ఇద్దరూ ఇక ఉండరు. భీష్ముడు పడిపోయాడు. ద్రోణుడు మరణించాడు. సూర్యసుతుడైన కర్ణుడు చనిపోయాడు. మద్రరాజైన శల్యుడు మరణించాడు. జయద్రథుడు చనిపోయాడు. సుబలసుతుడైన శకునికి సంబంధించిన అయిదువందల గుర్రాలు మిగిలాయి. రెండువందల రథాలు మాత్రమే మిగిలాయి. జనార్దనా! వందకుమించి ఏనుగులు, మూడువేల సైనికులు మాత్రమే మిగిలారు. మాధవా! ధార్తరాష్ట్రసేనలో అశ్వత్థామ, కృపుడు, త్రిగర్తరాజు సుశర్మ, ఉలూకుడు, శకుని, సాత్వత వంశీయుడైన కృతవర్మ - ఈ కొద్దిమంది వీరులే మిగిలిఉన్నారు. లోకంలో కాలంనుండి ఎవ్వడూ తప్పించుకోలేడు. ఆ రీతిగా తన సైన్యమంతా నశించినా దుర్యోధనుడు యుద్ధానికై నిలిచియున్నాడు చూడు. ఈ రోజుతో యుధిష్ఠిర రాజు శత్రురహితుడు కాగలడు. శత్రువులలో ఒక్కడూ నానుండి తప్పించుకో లేడనుకొంటున్నాను. కృష్ణా! మదోన్మత్తులై ఈ రోజు యుద్ధభూమిని విడిచిపెట్టనివారు వారు మానవేతరులైనా సరే! అందరినీ చంపివేస్తాను. ఈ రోజు యుద్ధభూమిలో తీవ్రకోపంతో, పదునైన బాణాలతో శకునిని చంపి, యుధిష్ఠిరుని చిరకాల జాగరణను పోగొడతాను. శకుని మోసంతో జూదంలో అపహరించిన రత్నాల నన్నింటినీ మరల వెనుకకు తెస్తాను. ఈరోజు పాండవులు యుద్ధంలో సంహరించిన పతులను, పుత్రులను చూసి, హస్తిన నగరంలోని స్త్రీలు అందరూ ఏడుస్తారు. కృష్ణా! పని అంతా ఈరోజే ముగుస్తుంది. దుర్యోధనుడు ఈనాడు ప్రజ్వలించే రాజ్యలక్ష్మిని, ప్రాణాలను కూడా పొగొట్టుకొంటాడు. వార్ష్ణేయా! నన్ను చూసి భయపడి దుర్యోధనుడు రణభూమినుండి పారిపోకపోతే అతడు చచ్చినట్లే భావించు. ఈ అశ్వసేన నా గాండీవ ధనుష్టంకారాన్ని సహించలేదు. ముందుకు పద! అందరినీ సంహరిస్తా.

రాజా! అర్జునుడు అలా అనగానే కృష్ణుడు దుర్యోధనసేన వైపు గుర్రాలను నడిపించాడు. ఆ సేనను చూసి అర్జున, భీమసేన, సహదేవులు ముగ్గురూ యుద్ధసామగ్రితో

సిద్ధమై, సింహనాదాలు చేస్తూ, దుర్యోధనుని సంహరించాలని బయలుదేరారు. ధనుస్సులనెత్తి, ఒక్కటై వేగంగా వస్తున్న వారిని చూసి, శకుని రణభూమిలో ఆతతాయు లయిన పాండవుల వైపు దూసికొని వచ్చాడు. నీ కుమారుడైన సుదర్శనుడు భీమునిపై దాడిచేశాడు. సుశర్మ, శకుని అర్జునునితో పోరాడసాగారు. దుర్యోధనుడు గుర్రమెక్కి, సహదేవుని ఎదిరించాడు. రాజా! ఆపై నీ కొడుకు వేగంగా ప్రయత్నపూర్వకంగా ప్రాసంతో సహదేవుని తలపై తీవ్రంగా కొట్టాడు. నీ కుమారునిచే దెబ్బతిని శరీరమంతా నెత్తురు కారుతుండగా పాములవలె నిట్టూరుస్తూ, సహదేవుడు రథాసనంపై కూర్చుండిపోయాడు. ఆపై సహదేవుడు మరల చైతన్యాన్ని తెచ్చుకొని, తీవ్రకోపంతో, తీక్ష్ణశరాలను దుర్యోధనునిపై కురిపించాడు. అర్జునుడు కూడా యుద్ధంలో పరాక్రమించి, గుర్రాలమీదనున్న శూరుల తలలను నరికివేశాడు. అప్పుడు అర్జునుడు అనేక బాణాలతో ఆ ఆశ్వికసేనను చిన్నాభిన్నం చేశాడు.

వాటిని అన్నింటినీ పడగొట్టి, త్రిగర్త రథికుల మీదకు వెళ్ళాడు. ఆపై త్రిగర్త మహారథు లందరు ఒక్కటిగా కూడి అర్జునునిపై, వాసుదేవునిపై శరవృష్టిని కురిపించారు. అర్జునుడు క్షురప్రంతో సత్యకర్మపై దాడిచేసి, అతని రథంనొగలను ఖండించాడు. రాజా! ఆ మహాయశస్వి క్షురప్రంతో వేగంగా స్వర్ణకుండలాలతో అలంకరింపబడిన అతని శిరస్సును నరికివేశాడు. యోధు లందరూ చూస్తుండగానే సత్యేషువును కూడా సంహరించాడు. తరువాత అర్జునుడు మూడు బాణాలతో సుశర్మను గాయపరిచి, వారి రథాల నన్నింటినీ దెబ్బతీశాడు. ఆపై అర్జునుడు ఎంతో కాలంనుండి దాచిఉంచిన తీక్ష్ణ క్రోధవిషాన్ని క్రక్కుతూ, వేగంగా సుశర్మ మీదకు వెళ్లాడు. అర్జునుడు వందబాణాలతో సుశర్మను కప్పివేసి, ఆపై అతని గుర్రాలను కొట్టాడు. ఆపై యమదండం వంటి బాణాన్ని తీసికొని, నవ్వుతూ, దానిని వేగంగా సుశర్మ మీదకు విసిరాడు. క్రోధంతో మండిపడుతున్న ఆ విలుకాడు విసిరిన ఆ బాణం రణభూమిలో సుశర్మను సమీపించి, ఆయన హృదయాన్ని బ్రద్దలు చేసింది. మహారాజా! ఆ సుశర్మ ప్రాణాలు కోలుపోయి, పాండవులందరికీ ఆనందాన్ని, నీవారికి దుఃఖాన్ని కలిగిస్తూ నేలగూలాడు. సుశర్మను చంపి, అతని కుమారులు నలభై అయిదు మందినీ బాణాలతో నశింపజేశాడు. ఆపై అర్జునుడు పదునైన బాణాలతో సుశర్మ అనుచరుల నందరినీ చంపి, చావగా మిగిలిఉన్న కౌరవసేనలోనికి చొచ్చుకొనిపోయాడు. రాజా! కోపించిన భీముడు అవహేళనతో బాణాలతో నీకుమారుడైన సుదర్శనుని కప్పివేశాడు. ఆపై నవ్వుతూ కోపంతో బాగా తీక్ష్ణమైన క్షురప్రంతో అతని తలను శరీరం నుండి వేరుచేశాడు. తరువాత అతని అనుచరులు వివిధ శరాలను కురిపిస్తూ, భీముని చుట్టుముట్టారు. ఆపై వృకోదరుడు ఇంద్రుని వజ్రం వంటి కఠిన స్పర్శగల పదునైన బాణాలను నీ సేనపై

అన్నివైపులనుండి కురిపించాడు. ఆపై క్షణకాలంలో భీముడు ఆ సేనను సంహరించాడు. భారతా! అలా వారు సంహరింపబడుతుంటే సేనాధ్యక్షులు భీమసేనుని సమీపించి, పోరాడసాగారు. వారందరిపై భీముడు భీకర బాణాలను కురిపించాడు. రాజా! అలాగే నీవారు కూడా మహారథులైన పాండవులను మహాశరవర్షంతో అన్నివైపుల నుండి నివారించారు. శత్రువులతో పోరాడుతున్న పాండవులు, పాండవులతో పోరాడదలచుకొన్న నీవారు రణభూమిలో ఏకమొత్తంగా కలిసిపోయారు. రాజా! అక్కడ ఒకరిచే మరొకరు దెబ్బతిని, ఉభయసేనలోని యోధులు బాంధవులను గూర్చి బాధపడుతూ పడిపోయారు.'

28. సహదేవుడు ఉలూకుని, శకునిని సంహరించుట.

సంజయుడిలా చెప్తున్నాడు. 'రాజా! ఏనుగులు, గుర్రాలు, సైనికులు నశించిపోతున్నా ఆ పోరు సాగుతుండగా సుబలసుతుడైన శకుని సహదేవునిపై దాడిచేశాడు. ఆపై శకుని తన మీద దాడిచేయబోవటాన్ని గమనించి, సహదేవుడు పక్షులవలె వేగంగా పయనించే బాణ సమూహాలను శకునిపై ప్రయోగించాడు. ఉలూకుడు పదిబాణాలతో భీముని గాయపరిచాడు. మహారాజా! శకుని కూడా మూడు బాణాలతో భీముని గాయపరిచి తొంబది బాణాలను సహదేవునిపై కురిపించాడు. వందలకొలదిగ ఉన్నా వారి బాణాలచే కప్పబడిన నీ సేన అక్కడక్కడ అంధకార బంధురమైన ఆకాశంవలె అయింది. బాణాలతో కప్పబడిన గుర్రాలు చనిపోయిన అనేక సైనికులను లాగుతూ పరుగులు పెడుతుంటే, అక్కడక్కడ బాట కూడా నిరోధింపబడింది. ఆశ్వికులతో పాటు గుర్రాలు చచ్చిపోయాయి. వాటితోనూ, తెగిపడిన కవచాలతోనూ, విరిగిన ప్రాసాలతోనూ, ఋష్టులతో, శక్తులతో, కత్తులతో, ప్రాసాలతో, గొడ్డళ్ళతో ఆవరింపబడిన భూమి వివిధ కుసుమాలతో చిత్ర వర్ణంగా తయారయినట్లుంది. యోధులు ఒకరిపై ఒకరు పడి, రణభూమిలో కోపంతో పరస్పరం గాయపరచుకొంటూ, తిరగసాగారు. రణరంగంలో కుండలాలతో సహా తలలు పడిఉన్నాయి. అవి పద్మకేసరాల వలె కనిపిస్తున్నాయి. ఆ ముఖాలు పైకెత్తిన కళ్ళతో, రోషంతో కొరికిన పెదవులతో శోభిస్తున్నాయి. రణభూమిలో తలలు తెగి, కొన్ని కబంధాలు నిలిచి ఉన్నాయి. మరికొన్ని నృత్యం చేస్తున్నట్లు ఎగురుతున్నాయి. మాంసాన్ని తినే జంతువులు అక్కడ గుమిగూడాయి. వాటితో భూమి భయంకరంగా ఉంది. ఆ మహాసంగ్రామంలో సైన్యం కొద్దిగానే మిగిలి ఉంది. దానితో పాండవులు హర్షోత్సాహాలతో కౌరవులను యమసదనానికి పంపించారు.

ఇంతలోనే శకుని ప్రాసంతో సహదేవుని తలపై గట్టిగా కొట్టాడు. ఆ సహదేవుడు కలతపడి రథాసనంపై కూర్చున్నాడు. ఆ స్థితిలో ఉన్న సహదేవుని చూసి, ప్రతాపవంతుడైన భీమసేనుడు తీవ్రకోపంతో సర్వసైన్యాలను నివారించాడు. బాణాలతో వందలు, వేలమందిని చీల్చివేశాడు. అలా ఛేదించి, భీమసేనుడు సింహనాదం చేశాడు. ఆ శబ్దంతో శకుని అనుచరులందరూ భయపడి గుర్రాలు, ఏనుగులతో సహా వెంటనే పారిపోయారు. భంగపడిన వారిని చూసి, దుర్యోధనుడిలా అన్నాడు. "అధర్మజ్ఞులారా! వెను దిరగండి. పోరాడండి. పారిపోయి ఏం చేస్తారు? యుద్ధంలో వెన్ను చూపకుండా ప్రాణాలను విడిచిన ధీరుడు ఈ లోకంలో కీర్తిని, మరణానంతరం ఉత్తమ లోకాలను అనుభవిస్తాడు." దుర్యోధనుడిలా అనగానే శకుని అనుచరులు మరణమే యుద్ధం నుండి మరలింపజేయాలని భావించి, మరల పాండవులపై దాడికి దిగారు. అక్కడ దారుణ కోలాహలం ఏర్పడింది. అంతటా సంక్షోభం నెలకొంది. శకుని అనుచరులను ఎదుట చూసి, విజయానికై ఉద్యమించిన పాండవులు ఎదురుదాడి చేశారు. సహదేవుడు ఊరటచెంది, పదిబాణాలతో శకునిని గాయపరిచి, మూడు బాణాలతో అతని గుర్రాలను గాయపరిచి, నవ్వుతూ శకుని వింటిని బాణాలతో ఖండించాడు. శకుని మరొక వింటిని తీసికొని, అరవై బాణాలతో నకులుని, ఏడు బాణాలతో భీమసేనుని గాయపరిచాడు. ఉలూకుడు కూడా రణభూమిలో తండ్రికి కాపుదలగా నిలిచి ఏడుబాణాలతో భీముని, డెబ్బది బాణాలతో సహదేవుని గాయపరిచాడు.

భీమసేనుడు రణరంగంలో ఆ ఉలూకుని తొమ్మిది బాణాలతో, శకునిని అరవై నాలుగు బాణాలతో, పార్శ్వ రక్షకులను మూడు మూడు బాణాలతో గాయపరిచాడు. నూనె పట్టిన బాణాలతో భీముడు కొడుతుంటే వారు కోపించి, రణభూమిలో మెరుపులతో కూడిన మేఘాలు జలధారలతో పర్వతాన్ని కప్పివేసినట్లు శరధారలతో సహదేవుని కప్పివేశారు. ఆపై ఉలూకుడు సహదేవుని మీదకు వెళ్ళాడు. అలా దూసుకొనివచ్చిన ఉలూకుని తలను సహదేవుడు భల్లంతో ఖండించాడు. ఆ ఉలూకుడు రణభూమిలో పాండవులకు ఆనందాన్ని కలిగిస్తూ, రథంమీద నుండి నేలగూలాడు. అక్కడ తన కుమారుని మరణాన్ని చూసి, శకుని నిట్టూర్చి, విదురుని మాటలు తలచుకొంటూ, ముహూర్త కాలం చింతించి, నిట్టూరుస్తూ, సహదేవుని మీదకు వచ్చి, మూడు బాణాలను ప్రయోగించాడు, సహదేవుడు బాణసమూహాలతో శకుని విడచిన బాణాలను ప్రక్కకు త్రోసి, రణభూమిలో శకుని వింటిని ఖండించాడు. శకుని అప్పుడు పెద్ద కత్తిని తీసికొని, సహదేవుని పైకి విసిరాడు. రాజా! ఘోరరూపంతో వేగంగా మీదకు వస్తున్న శకుని విసిరిన కత్తిని సహదేవుడు నవ్వుతూ రణరంగంలో

రెండు ముక్కలు చేశాడు. శకుని పెద్ద గదను తీసికొని, సహదేవుని మీదకు విసిరాడు. అది వ్యర్థమై నేలగూలింది. ఆపై తీవ్రకోపంతో శకుని ఉద్యమించిన కాలరాత్రివలె మహాఘోరంగా ఉన్న శక్తిని సహదేవునిపైకి విసిరాడు. రణభూమిలో అలా వేగంగా మీదకు వస్తున్న శక్తిని సహదేవుడు నవ్వుతూ కనక భూషణాలు గల బాణాలతో మూడు ముక్కలు చేశాడు. శక్తి వీగిపోవటాన్ని, శకుని భయపడటాన్ని చూసి, నీ వారంతా భయపడి, శకునితో సహా పారిపోయారు. జయోల్లాసంతో పాండవులు పెద్దగా సింహనాదాలు చేశారు.

దానితో ధార్తరాష్ట్ర సైనికులందరు దాదాపు యుద్ధ విముఖు లయ్యారు. వారంతా కలత చెందినట్లు గమనించి, సహదేవుడు ఎన్నోవేల బాణాలతో రణభూమిలో వారిని నివారించాడు. ఆపై గాంధార దేశానికి చెందిన బలిసిన గుర్రాలతో, ఆశ్వికులతో జయసంకల్పంతో రణభూమిలోకి వస్తున్న శకునిని సహదేవుడు ఆక్రమించాడు. తనవంతుగా ఇక శకుని మిగిలి ఉన్నాడని భావించి, సహదేవుడు సువర్ణాంగాలు గల రథంపై శకుని వెంటబడ్డాడు. సహదేవుడు పెద్ద వింటిని తీసికొని, బలపూర్వకంగా ఎక్కుపెట్టి, బాణాలతో శకునిపై దాడిచేసి, అంకుశంతో మదపుటేనుగును వలె కోపంతో అతనిని తీవ్రంగా గాయపరిచాడు. సహదేవుడు శకునిని నిలవరించి ఏదో గుర్తు చేస్తున్నట్లు ఇలా అన్నాడు. "క్షత్రధర్మంలో నిలిచి పోరాడు. మగవాడి వనిపించుకో! మూర్ఖుడా! కొలువు కూటంలో పాచికలు విసిరి జూదమాడుతూ పరమానందపడ్డావు. దుర్మతీ! ఆ కర్మ ఫలితాన్ని ఈ రోజు బాగా చూడు. అప్పుడు మమ్ములను అపహసించిన ఆ దురాత్ము లందరూ చనిపోయారు. వంశానికి చిచ్చువంటి దుర్యోధనుడు, అతడి మేనమామవు నీవూ మిగిలారు. దోటీ (వంకరకత్తి) కట్టిన కర్రతో కొట్టి, చెట్టునుండి పండును రాలగొట్టినట్లు, ఈ రోజు క్షురంతో నీ శిరస్సును ఖండించి, చంపుతాను." మహారాజా! రణభూమిలో పులివలె విక్రమించగల మహాబలుడైన సహదేవుడు అలాపలికి తీవ్రకోపంతో శకునివైపు దూసికొని పోయాడు.

యోధులలో శ్రేష్ఠుడైన సహదేవుడు ఎదిరించరాని వీరుడు. అతడు క్రోధంతో ప్రజ్వలిస్తూ, బలపూర్వకంగా వింటిని లాగి, పదిబాణాలతో శకునిని, నాలుగు బాణాలతో ఆయన గుర్రాలను గాయపరిచి గొడుగును, ధ్వజాన్ని, ధనుస్సును విరగగొట్టి, సింహనాదం చేశాడు. సహదేవుడు శకుని ధ్వజాన్ని వింటిని, గొడుగును విరగగొట్టటమే కాక అనేక బాణాలతో సర్వ మర్మస్థానాలలో శకునిని గాయపరిచాడు. ఆపై మరల సహదేవుడు తట్టుకొనలేని శరవృష్టిని శకునిపై కురిపించాడు. ఆపై కోపించిన శకుని సహదేవుని

యుద్ధంలో చంపదలచి, ప్రాసంతో ఒంటరిగా, వేగంగా అతనిపై దాడిచేశాడు. సహదేవుడు, ఎత్తిన ఆ ప్రాసాన్నీ, పొందికగా ఉన్న శకుని భుజాలనూ రణముఖంలో మూడు భల్లాలతో ఒకేసారి ఖండించాడు. వెంటనే రణమధ్యంలో నిలిచి పెద్దపెట్టున అరిచాడు. వేగంగా పనిచేయగల సహదేవుడు మరల సువర్ణపక్షాలు గలిగి, లోహమయమై అన్ని ఆవరణలను అతిక్రమించగల భల్లాన్ని చక్కగా సంధించి, శకుని తలను శరీరంనుండి పడగొట్టాడు. రణరంగంలో సహదేవుడు స్వర్ణభూషితమై, సూర్యకాంతిగల బాణాన్ని చక్కగా సంధించి, విడువగా దానితో తలను పోగొట్టుకొన్న శకుని నేలగూలాడు. క్రోధంతో నిండిన సహదేవుడు సువర్ణపుంఖాలు గలిగి, సానబెట్టిన వేగశాలి అయిన బాణంతో శకుని తలను పడగొట్టాడు.

ఆ తలయే కౌరవుల అవినీతికి మూలం. రాజా! వీరుడైన సహదేవుడు పొందికగా ఉన్న భుజాలను ముందు నరికివేశాడు. ఆపై నెత్తుట తడిసిన ఆ శకుని శవం ఆ మహారథంనుండి క్రిందపడి ఘోరంగా విలవిలలాడింది. తలతెగి, శరీరం నెత్తుటతడిసి, నేలపై పడిఉన్న శకునిని చూసి, నీ యోధులు భయంతో శక్తిని కోలుపోయి, శస్త్రాలను చేతబట్టి, దిక్కులు పట్టిపోయారు. వారి ముఖాలు ఎండిపోయాయి. చైతన్యం అడుగంటింది. గాండీవఘోషతో బాగా దెబ్బతిన్నారు. వారి రథాలు, గుర్రాలు, ఏనుగులు భంగపడ్డాయి. భయపీడితులై నీ సైనికులు దుర్యోధనునితో సహా పారిపోయారు. భారతా! ఆపై శకునిని రథంమీదనుండి పడగొట్టడంతో ఆనందించిన పాండవులు కృష్ణునితో సహా అత్యుత్సాహంతో సైనికులకు ఉల్లాసాన్ని కలిగిస్తూ, శంఖాలు మ్రోయించారు. అందరూ రణరంగంలో సహదేవుని చూసి అభినందిస్తూ ఇలా అన్నారు. "వీరా! వంచనాపరుడై మహామనస్వి అయిన శకుని, కొడుకుతో పాటు నీచే యుద్ధంలో చంపబడ్డాడు. ఇది అదృష్టం".

29. దుర్యోధనుడు మడుగులో ప్రవేశించుట.

ఆ తరువాత శకుని అనుచరులు క్రుద్ధులై, ప్రాణాలపై ఆశను వీడి, యుద్ధంలో పాండవులను చుట్టుముట్టారు. అప్పుడు సహదేవుని విజయాన్ని అలాగే నిలపదలచి అర్జునుడు వారిని నిరోధించాడు. కోపించిన సర్పంవలె కనిపిస్తున్న తేజస్వి అయిన భీమసేనుడు కూడా పాలుపంచుకొన్నాడు. పరుగులుపెడుతూ వస్తున్న ఆ యోధుల సాయుధాలైన బాహువులను, శిరస్సులను, గుర్రాలను కూడా అర్జునుడు భల్లాలతో ఖండించాడు. లోకైక వీరుడైన అర్జునుడు సంచరిస్తూ కొట్టిన దెబ్బలతో ఆ గుర్రాలు ప్రాణాలు కోలుపోయి, నేలగూలాయి. ఆపై దుర్యోధననరపాలుడు స్వసేనా వినాశాన్ని

చూసి, కోపించి, చావగా మిగిలిన అనేక రథగణాలను, ఏనుగులను, గుర్రాలను, కాల్బలాన్ని మొత్తం ఒకచోట చేర్చి, గుమిగూడిన వారితో ఇలా అన్నాడు. "రణభూమిలో మిత్రసహితంగా పాండవులను, సేనాసహితంగా ధృష్టద్యుమ్నుని సమీపించి, చంపి, వెంటనే వెనుదిరగండి." యుద్ధదుర్మదులైన వారు నీ పుత్రుని అనుశాసనం మేరకు రణభూమిలో పాండవులపై దాడి చేశారు. చావగా మిగిలిన ఆ కౌరవసేనలు వేగంగా దూసుకొని వస్తుంటే పాండవులు పాములవంటి బాణాలను వారిపై కురిపించారు. పాండవులు ముహూర్త కాలంలో ఆ సేనను సంహరించారు. రణరంగంలో ప్రవేశించిన ఆసేనకు రక్షకు డెవ్వడూ కనిపించలేదు. కవచాలు ధరించి యుద్ధానికి సిద్ధమై వచ్చినా భయంతో నిలవలేకపోతున్నారు. పారిపోతున్న గుర్రాలు, సేనల ద్వారా దుమ్ములేచి, వ్యాపించింది. రణభూమిలో దిక్కులూ, మూలలూ తెలియటం లేదు. ఆపై ఎంతోమంది సైనికులు పాండవసేనలో నుండి వెలుపలికి వచ్చి, నీ వారిని వధించ సాగారు. ముహూర్తకాలంలో ఆ సైన్యం నిశ్శేషమయింది. భారతా! నీ కొడుకు దగ్గర కూడిఉన్న పదకొండు అక్షౌహిణుల సేననూ పాండవులు, సృంజయులు యుద్ధంలో చంపివేశారు. నీ సేనలోని మహాత్ములయిన ఆ వేలకొలది రాజులలో ఇప్పుడు దుర్యోధనుడొక్కడే కనిపిస్తున్నాడు. అదీ తీవ్రంగా గాయపడి.

మహారాజా! ఆపై దుర్యోధనుడు అన్ని దిక్కులూ కలయజూశాడు. భూమినంతా గమనించాడు. అంతా శూన్యమే. యోధు లెవ్వరూ లేరు. రణభూమిలో అంతటా పాండవులు తమకోరిక సిద్ధించటంతో ఆనందంగా కేరింతలు కొడుతున్నారు. మహాత్ములైన వారి బాణాల చప్పుళ్ళను కూడా విని, దుర్యోధనుడు శోకంతో నిండి, పారిపోవటాన్ని గురించి ఆలోచించాడు. అతని దగ్గర వాహనాలూ లేవు, సైన్యమూ లేదు. ధృతరాష్ట్రుడిలా ఆడిగాడు. "సూతా! నా సేనలు సంహరింపబడగా, శిబిరం శూన్యం కాగా ఆ సమయంలో పాండవసేనలో ఎవరు మిగిలి ఉన్నారు ? సంజయా! ఇది అడుగుతున్నాను. చెప్పు. నీవు బాగా చెప్పగలవు ? ఆ రీతిగా తన సేన నశించటం చూసి మూర్ఖుడైన నా కుమారుడు - దుర్యోధనరాజు ఒంటరిగా మిగిలి ఏం చేశాడు"?

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! పాండవ మహాబలంలో రెండు వేల రథాలు, ఏడువందల ఏనుగులు, అయిదువేల గుర్రాలు, పదివేలమంది సైనికులు మాత్రమే మిగిలారు. వీరందరినీ తోడుపెట్టుకొని ధృష్టద్యుమ్నుడు రణభూమిలో నిలిచాడు. దుర్యోధన నరపాలుడు ఒంటరిగా మిగిలాడు. రథికశ్రేష్ఠుడైన ఆ దుర్యోధనునకు రణభూమిలో తోడొక్కడూ కనిపించలేదు. మహారాజా! ఆనందంతో గర్జనలు చేస్తున్న శత్రువులనూ, స్వబల వినాశనాన్ని

చూసి, ఆ దుర్యోధనరాజు చనిపోయిన తన గుర్రాన్ని వీడి, భయంతో ఒంటరిగా తూర్పుదిక్కువైపు పారిపోయాడు. తేజస్వి, పదకొండు అక్షౌహిణులకు ప్రభువు అయిన నీ కొడుకు దుర్యోధనుడు గదను చేతబట్టి, కాళ్ళతోనే మడగువైపు నడవసాగాడు.

ఆపై ఆ రాజు కాలినడకనే కొద్ది దూరం వెళ్ళి, ధర్మశీలుడు, ధీమంతుడు అయిన విదురుని మాటలను తలచుకొన్నాడు. "మహాప్రాజ్ఞుడైన విదురుడు గతంలోనే రణభూమిలో మా వినాశనాన్ని, క్షత్రియ సంహారాన్ని తప్పక గ్రహించిఉంటాడు". రాజా! స్వసేనా వినాశనాన్ని చూసి, ఇలా ఆలోచిస్తున్న దుర్యోధనుని మనస్సు దుఃఖంతో తపించిపోయింది. ఆ రాజు మడుగులో ప్రవేశింపదలచుకొన్నాడు. ధృష్టద్యుమ్నుడు మొదలయిన పాండవులు కోపంతో నీ సేనపై దాడిచేశారు. శక్తులను, ఋష్టులను, ప్రాసాలను చేతబట్టి సింహనాదాలు చేస్తున్నా నీ సేనల సంకల్పాన్ని అర్జునుడు గాండీవంతో వ్యర్థం చేశాడు. పదునైన బాణాలతో వారిని అమాత్యులతో, బంధువులతో సహా సంహరించి, అర్జునుడు రథంపై నిలిచి, ఎంతో అందగించాడు. శకుని గుర్రాలతో, రధాలతో, ఏనుగులతో సహా సంహరింపబడగా నీ సేన నరుకబడిన మహారణ్యంలా అయింది. రాజా! ఎన్నో లక్షలుగా ఉన్న దుర్యోధనుని సేనలో కేవలం వీరుడైన అశ్వత్థామ, కృతవర్మ, కృపుడు, నీ కొడుకు - దుర్యోధనుడు తప్ప ప్రాణాలతో నిలిచిన మరొక మహారథుడు కనిపించలేదు.

ధృష్టద్యుమ్నుడు నన్ను చూసి నవ్వుతూ "ఇతనిని బంధించి ఏం లాభం? ఇతడు బ్రతికి ఉన్నా ప్రయోజనమేమీ లేదు" అని సాత్యకితో అన్నాడు. అప్పుడు ధృష్టద్యుమ్నుని మాట విని శిని పౌత్రుడు, సాత్యకి పదునైన కత్తినెత్తి నన్ను చంపబోయాడు. అప్పుడు మహాప్రాజ్ఞుడైన వ్యాసుడు ధృష్టద్యుమ్నుని సమీపించి "సంజయుని ప్రాణాలతో వదలండి. ఇతని నేరీతిగానూ చంపదగదు" అని అన్నాడు. ఆ ద్వైపాయనుని మాట విని, సాత్యకి చేతులు జోడించి, "సంజయా! శుభం, వెళ్ళిరా" అని నాతో అంటూ, నన్ను విడిచాడు. అతని అనుమతిని పొంది, నేను కవచాన్ని విడిచి, నిరాయుధుడనై సాయంకాల సమయంలో నగరంవైపు బయలుదేరాను. శరీరం నెత్తురోడుతోంది. రాజా! ఒక క్రోసెడు దూరం వచ్చాను. అక్కడ గదను చేతబట్టి ఒంటరిగా నిలిచియున్న దుర్యోధనుని చూశాను. తీవ్రంగా గాయపడిఉన్నాడు. నన్ను చూడగానే కళ్ళలో నీరు నిండింది. నన్ను సరిగా చూడలేకపోయాడు. నేను దీనంగా నిలిచాను. ఆ అవస్థలో నన్ను చూస్తూ నిలిచాడు. నేను కూడా రణభూమిలో ఒంటరిగా నిలిచి అలా బాధపడుతున్న అతనిని చూసి, దుఃఖంతో నిండి ముహూర్తకాలం ఏమీ మాటాడలేకపోయాను.

మూర్ధాభిషేకాన్ని పొంది, కిరీటాలు ధరించిన వేలకొలది రాజులు అతనికి కానుకలిచ్చేవారు. అందరూ అతనికి లోబడి ఉండేవారు. గతంలో కర్ణుడొక్కడే అతని కొరకు నాలుగు సముద్రాల వరకు వ్యాపించి, రత్నభూషితమైన పృథివి నుండి పన్ను వసూలు చేసేవాడు. అతని ఆదేశాలను కర్ణుడే శత్రురాజ్యాలలో అమలుచేసేవాడు. అతడు రాజ్యం చేస్తుంటే ఆయుధాల నెత్తవలసిన స్థితి ఎప్పుడూ రాలేదు. హస్తినాపురమందే ఉండి నిష్కంటకంగా, క్షేమంగా రాజ్యాన్ని పాలించాడు. ఐశ్వర్యంలో కుబేరుని కూడా తలచేవాడు కాదు. రాజా! భవనం నుండి భవనానికి వెళుతున్నా, దేవాలయానికి వెళుతున్నా అతని బాట సువర్ణమయం. ఐరావతం వంటి ఏనుగునెక్కి, ఇంద్రునివలె బలశాలియై మహైశ్వర్యంలో సాగిపోయేవాడు. ఇంద్రసమానుడైన అతడు తీవ్రంగా గాయపడి, నేలపై కాళ్ళతో ఒంటరిగా నిలిచిఉంటే చూసి, నాకెంతో దుఃఖం కలిగింది. లోకనాథుడైన అటువంటి రాజుకు సాటిలేని ఆపద కలిగిందంటే... విధి ఎంత బలీయమో కదా!

ఆపై నేను అప్పుడు బంధింపబడటాన్ని, వ్యాసుని అనుగ్రహంతో ప్రాణాలతో విడువబడటాన్ని - అంతా చెప్పాను. అతను ముహూర్తకాలం చింతలో మునిగి, మరల చైతన్యం తెచ్చుకొని, ఆపై సోదరులను గురించి, సర్వ సేనలను గురించి నన్ను అడిగాడు. అప్పుడు నేను ప్రత్యక్షంగా చూసిన సర్వసోదర మరణాన్ని, సైన్య వినాశనాన్ని అతనికి ఇలా చెప్పాను. "రాజా! నీరథికులు ముగ్గురే మిగిలారు. అది నేను బయలుదేరేటప్పుడు వ్యాసుడు నాకు చెప్పాడు". ఆ దుర్యోధనుడు దీర్ఘంగా నిట్టూర్చి, మాటిమాటికీ నన్ను చూస్తూ, చేతితో నన్ను తాకి ఇలా అన్నాడు. "సంజయా! నీవు తప్ప మరెవ్వరూ యుద్ధభూమిలో ప్రాణాలతో లేరు. నాకు ఎవ్వరూ తోడు లేరు. పాండవుల కెందరో సహాయకులున్నారు. సంజయా! ప్రజ్ఞాచక్షువు అయిన ధృతరాష్ట్రునితో నీ కొడుకు మడుగులోనికి ప్రవేశించాడు అని చెప్పు. నీవంటి మిత్రులను, పుత్రులను, సోదరులను కోలుపోయి, పాండవులచే రాజ్యం అపహరింపబడగా నా వంటివాడెలా బ్రతకగలడు ? మహాసంగ్రామం నుండి నేను తప్పుకొని ఈ మడుగులో దూరి, తీవ్రగాయాలతో బ్రతికిఉన్నానని ఇదంతా ధృతరాష్ట్రునకు చెప్పు." మహారాజా! అలా చెప్పి ఆ పెద్ద మడుగులో ప్రవేశించాడు.

ఆ రాజు తన మాయతో నీటిని కూడా స్తంభింపజేశాడు. సుయోధనుడు మడుగులోనికి ప్రవేశించగానే అలిసిపోయిన గుర్రాలపై, ఆ ప్రదేశానికి వచ్చిన ముగ్గురు మహారథులను చూశాను. వారు శరద్వత్పుత్రుడైన కృపుడు, వీరుడు రథికశ్రేష్ఠుడు అయిన అశ్వత్థామ, భోజవంశానికి చెందిన కృతవర్మ. వారంతా బాణాలతో గాయపడి ఉన్నారు. వారంతా నన్ను చూసి వెంటనే నా దగ్గరకు వచ్చి "సంజయా! అదృష్టం కొద్దీ బ్రతికిఉన్నావు" అని నాతో అన్నారు. వారంతా నీ కుమారుడైన దుర్యోధనరాజును గురించి నన్ను "సంజయా! మన రాజు దుర్యోధనుడు బ్రతికియున్నాడా ?" అడిగారు. నేను 'రాజు

క్షేమంగానే ఉన్నా'డని వారికి చెప్పాను. దుర్యోధనుడు నాతో చెప్పిన విషయమంతా చెప్పి, నరాధిపుడైన దుర్యోధనుడు ప్రవేశించిన మడుగును గురించి కూడా చెప్పాను. రాజా! అశ్వత్థామ నా మాటను విని, విశాలమైన ఆ మడుగును చూసి, దీనంగా ఏడ్చాడు. "అయ్యో! ఆ రాజుకు మనం బ్రతికియే ఉన్నామని తెలియదు. అతనితో కలిసి శత్రువులతో పోరాడటానికి మనం చాలు గదా!" అలా అక్కడ చాలాసేపు విలపించి, రథికశ్రేష్ఠులైన ఆ మహారథులు రణభూమిలో పాండవులను చూసి, అక్కడనుండి వెళ్ళిపోయారు. హతశేషులయిన ఆ ముగ్గురు మహారథులు నన్ను చక్కగా అలంకరింపబడిఉన్న కృపుని రథంపై ఎక్కించి, శిబిరానికి తీసికొనివచ్చారు. అక్కడి శిబిర రక్షకులు బాగా భయపడుతున్నారు. సూర్యుడు అస్తమించాడు. నీ కుమారుల వినాశనాన్ని విని, అందరూ ఆక్రోశించారు.

మహారాజా! ఆపై స్త్రీసంరక్షణకై ఉన్న వృద్ధనరులు రాజభార్యలను తీసికొని, నగరంవైపు వెళ్ళిపోయారు. అప్పుడక్కడ భర్తలకై ఆక్రోశిస్తూ, విలపిస్తున్న మహాశబ్దం అంతటా వినిపించింది. ఆ సేనావినాశనాన్ని గురించి విని, స్త్రీలు మాటిమాటికీ ఆర్తనాదాలు చేస్తూ, భూతలాన్ని ప్రతిధ్వనింపజేస్తూ, క్రౌంచపక్షుల వలె విలపించసాగారు. అప్పుడు అలా ఆక్రోశిస్తూ గోళ్ళతో, చేతులతో తలపై కొట్టుకొనసాగారు. జుట్టు పీకుకొనసాగారు. హాహాకారాలు చేస్తూ గుండెలు బాదుకొనసాగారు. రాజా! భర్తలపై ఆక్రోశిస్తూ, దుఃఖిస్తూ ఏడవసాగారు. దుర్యోధనుని మంత్రుల గొంతులు కన్నీటితో తడిశాయి. తీవ్రంగా కలతపడి వారు రాజకాంతలను వెంటబెట్టుకొని నగరానికి వెళ్ళారు. బెత్తాలు చేతబట్టి ద్వారపాలకులు కూడా వెంట వెళ్ళారు. అంతఃపుర రక్షకులు శుభ్రంగా ఉన్న విలువైన పరుపులను తీసికొని నగరానికి బయలుదేరారు. మరికొందరు కంచరగాడిదలు పూన్చిన రథాలపై తమతమ రక్షణలో నున్న స్త్రీలను తీసికొని నగరానికి ప్రయాణమయ్యారు. ఆ కాంతలు అంతఃపురంలో సూర్యునకు కూడా కనిపించనివారు. కానీ వారు నగరానికి వెళ్తున్నప్పుడు జనులందరూ చూశారు. భరతశ్రేష్ఠా! సౌకుమార్యంతో కూడిన ఆ కాంతలు తమవారిని, బంధుజనులను పోగొట్టుకొని, వేగంగా నగరానికి బయలుదేరారు. అప్పుడు భీమసేనునికి భయపడి, గోపాలుర నుండి గొర్రెల కాపరుల వరకు మనుష్యులందరూ హడావుడిగా నగరం వైపు పరుగుపెడుతున్నారు. పాండవులంటే వారికి తీవ్రమైన భయం పట్టుకొంది. అందువలన ఒకరివైపొకరు చూసికొంటూ, నగరంవైపు పరుగెత్తసాగారు.

ఆ రీతిగా అతిభయంకరమైన ఉపద్రవం సంభవిస్తే యుయుత్సువు శోకంతో మూఢుడై కర్తవ్యాన్ని గురించి ఆలోచించాడు. "భీమపరాక్రమం గల పాండవులు యుద్ధంలో

పదకొండు అక్షౌహిణులకు ప్రభువైన దుర్యోధనుని ఓడించారు. ఆయన సోదరులను చంపివేశారు. భీష్ముడు, ద్రోణుడు మొదలయిన కౌరవులందరూ హతులయ్యారు. భాగ్యం కొద్దీ యాదృచ్ఛికంగా నేనొక్కడనే బయటపడ్డాను. శిబిరాలలోని వారంతా అన్నివైపులకూ పారిపోయారు. ప్రభువులు మరణించగానే, ఉత్సాహాన్ని కోలుపోయి సేవకులు ఇటూ అటూ పారిపోతున్నారు. వారిని అంతకు ముందెన్నడూ చూడనిస్థితి. అందరూ దుఃఖార్తులు. వారి కళ్ళు భయంతో కల్లోలపడుతున్నాయి. బెదిరిన జింకల వలె పదిదిక్కులూ కలయజూస్తున్నారు. దుర్యోధనుని మంత్రులలో చావగా మిగిలిన వారు రాజ్యకాంతలను వెంటబెట్టుకొని నగరానికి వెళ్ళిపోయారు. యుధిష్ఠిర వాసుదేవుల అనుమతి తీసికొని, ఆ సచివులతో సహా నగరప్రవేశమే తగినదని నేను భావిస్తున్నాను". అలా భావించి మహాబాహువైన ఆ యుయుత్సువు యుధిష్ఠిర వాసుదేవులకు నిసయం చెప్పాడు. అది విని, సదా జాలినెరిగిన ధర్మరాజు ప్రసన్నుడై, యుయుత్సువును కౌగిలించుకొని విడిచిపెట్టాడు. ఆపై యుయుత్సువు రథమెక్కి, వేగంగా గుర్రాలను నడిపించాడు. రాజకాంతలను నగరంవైపు కొనిపోయాడు. వారితో కలిసి సూర్యాస్తమయ వేళలో వేగంగా హస్తినపురం ప్రవేశించాడు. ఆయన గొంతు, కళ్ళు, నీటితో నిండిపోయాయి. అక్కడ నీ దగ్గరనుండి వచ్చిన మహాప్రాజ్ఞుడైన విదురుని చూశాడు. ఆయన కళ్ళు నీటితో నిండి ఉన్నాయి. మనస్సు శోకంతో దెబ్బతిని ఉంది.

విదురుడు తనకు నమస్కరించి, ఎదుటనిలిచిన యుయుత్సునితో ఇలా అన్నాడు "కుమారా! కౌరవులంతా నశించగా అదృష్టం కొద్దీ నీవు జీవించియున్నావు. రాజు దగ్గరకు వెళ్ళకుండా ఇక్కడకు ఎందుకు వచ్చావు? దానికి కారణమేమిటో వివరంగా చెప్పు". యుయుత్సువు ఇలా అన్నాడు. "రణభూమిలో దాయాదులు, పుత్రులు, బాంధవులతోపాటు శకుని మరణించగా, చావగా మిగిలిన పరివారంలో దుర్యోధన నరపాలుడు తన గుర్రాన్ని విడిచి, భయంతో తూర్పుదిక్కుగా పారిపోయాడు. రాజు శిబిరం నుండి దూరం వెళ్ళిపోగానే అందరూ భయంతో కలతపడి నగరానికి వచ్చేశారు. ఆపై రాజదారలను, వారి సోదరుల భార్యలను అందరినీ వాహనాలపై ఎక్కించి, అంతఃపురాధ్యక్షులు భయంతో పారిపోయారు. ఆపై నేను యుధిష్ఠిర కృష్ణుల అనుమతితో పరుగులు పెట్టిన మన వారి రక్షణకై హస్తినపురం ప్రవేశించాను." యుయుత్సువు చెప్పినమాట విని విదురుడు అది సమయోచిత ప్రవర్తనమని భావించి, అభినందించాడు.

అమేయ స్వరూపుడైన విదురుడు యుయుత్సునితో ఇలా అన్నాడు. "భరతవంశ

వినాశనసమయంలో సమయోచిత కర్తవ్యాన్ని చెప్పి, నిర్వహించి, దయామయుడవై కులధర్మాన్ని రక్షించావు. ఈ మహాసంగ్రామంనుండి భాగ్యం కొద్ది నీవు నగరానికి రావటం చూడగలిగాం. ఇది ప్రాతః కాలంలో ప్రజలు సూర్యుని చూసినట్లుంది. నాయనా! లోభియై, దీర్ఘదృష్టిలేని ధృతరాష్ట్ర మహారాజుకు నీవు ఊతకర్రవు, దైవోపగత మనస్కుడై ఎన్నోసార్లు ప్రార్థించినా నా మాట వినని వాడు తాను. వ్యసన పీడితుడైన ఆయనకు నీవు ఒక్కడవే అన్నివిధాలా ఊరట. ఈ రోజు నీవిక్కడ విశ్రాంతి తీసికో. రేపు యుధిష్ఠిరుని దగ్గరకు వెళ్ళు!" అలా పలికి విదురుడు కళ్ళలో నీరు నింపుకొని, యుయుత్సుని వెంటబెట్టుకొని రాజసదనంలో ప్రవేశించాడు. పౌరజానపదులు దుఃఖంతో హాహాకారాలు, ఆర్తనాదాలు చేశారు. ఆ రాజసదనంలో ఆనందం లేదు. శోభ లేదు. ఒడ్డునున్న తోట నశించిపోయిన జలాశయం వలె జనశూన్యంగా ఉంది. విధ్వంసమైనట్లున్న దానిని చూసి, విదురుడు దుఃఖంనుండి తీవ్రదుఃఖంలో పడిపోయాడు. రాజా! సర్వధర్మవేత్త అయిన విదురుడు కలత చెందిన మనస్సుతో నగరంలో ప్రవేశించాడు. మెల్లమెల్లగా దీర్ఘంగా నిట్టూర్పులు విడువసాగాడు. అప్పుడు యుయుత్సువు కూడా ఆ రాత్రి తన గృహంలో నివసించాడు. తనవారు నమస్కరిస్తున్నా ఆ దుఃఖంలో దానిని అభినందించలేకపోయాడు. కౌరవపాండవుల పరస్పర వినాశనాన్ని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.'

30. కృపద్రౌణి కృతవర్మలు దుర్యోధమనితో మాట్లాడుట.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "సంజయా! రణాంగణంలో పాండవులు సర్వసేనలను సంహరించగా నా సేనలు, మిగిలినవారు ఏంచేశారు ? కృతవర్మ, కృపుడు, అశ్వత్థామ, దుర్యోధనుడు అప్పుడు ఏం చేశారు?" సంజయుడిలా చెప్తున్నాడు. "మహాత్ములైన క్షత్రియుల భార్యలు వెళ్ళిపోయి, అందరూ పారిపోగా, శిబిరం శూన్యం అయింది. ఆ ముగ్గురు మహారథులు తీవ్రంగా ఉద్వేగానికి లోనయ్యారు. ఆ సాయంకాలం గెలుపుతో చేస్తున్న పాండవుల గర్జనలను విని, శిబిరంలోని వారందరూ పారిపోవటాన్ని చూసి, దుర్యోధనుని చూడగోరుగుతున్న ఆ ముగ్గురూ ఆ ప్రదేశం నచ్చక అక్కడనుండి మడుగువైపు బయలుదేరారు. యుధిష్ఠిరుడు కూడా దుర్యోధనుని వధింపగోరుతూ, సోదరులతో కలిసి, రణభూమిలో ఉత్సాహంగా పర్యటిస్తున్నాడు. జయాభిలాషతో, తీవ్రకోపంతో నీ కొడుకును వెతుకుతున్నారు. ఎంత ప్రయత్నించి వెదకినా వారు దుర్యోధనుని చూడలేకపోయారు. ఆ దుర్యోధనుడు గదను చేతబూని, వేగంగా పారిపోయాడు. తన మాయతో నీటిని

స్తంభింపజేసి, ఆ మడుగులో ప్రవేశించాడు. అప్పుడు పాండవుల వాహనాలన్నీ బాగా అలసిపోయాయి. దానితో సైనికులతోపాటు తమ శిబిరానికి వెళ్ళి, నిలిచిపోయారు. ఆ తరువాత పాండవులు విడిది చేయగానే కృపుడు, అశ్వత్థామ, కృతవర్మ మెల్లగా ఆ మడుగువైపు వెళ్ళారు.

దుర్యోధనుడు శయనించిఉన్న మడుగుదగ్గరకు వారు వెళ్ళి, నీటిలో నిదురిస్తున్న ఆ దుర్యోధనునితో ఇలా అన్నారు. "రాజా! లే! మాతో కలిసి ధర్మరాజుతో పోరాడు. గెలిచి, రాజ్యాన్ని అనుభవించు. లేదా మరణించి స్వర్గాన్ని పొందు. దుర్యోధనా! నీవు కూడా పాండవుల సేననంతటినీ సంహరించావు. అక్కడ మిగిలిఉన్న సైనికులు కూడా తీవ్రంగా గాయపడినవారే. రాజా! మారక్షణలో నిలిచిన నీ వేగాన్ని వారు సహించలేరు కూడా. కాబట్టి లే!" దుర్యోధనుడిలా అన్నాడు. "ఈ పాండవకౌరవ సంగ్రామం నుండి తప్పించుకొన్న మిమ్ము చూడగలుగుతున్నాను. ఇది ఎంతో అదృష్టం. మనమంతా విశ్రమించి, శ్రమను తీర్చుకొని, గెలువగలం. మీరంతా అలసి ఉన్నారు. మేము తీవ్రంగా గాయపడి ఉన్నాం. అటు పాండవబలం పెరిగిఉంది. కాబట్టి ఇప్పుడు యుద్ధాన్ని ఇష్టపడటం లేదు. వీరులారా! మీ ఆలోచన ఇంత గొప్పగా ఉండటం ఆశ్చర్య కరమేమీ కాదు. మీకు నాపై ఎంతో భక్తి ఉంది. అయినా ఇది పరాక్రమానికి సమయం కాదు. ఒక రాత్రి విశ్రమించి, రేపు మీతో కలిసి శత్రువులతో నేను పోరాడుతాను. ఇందులో సంశయం లేదు ? దుర్యోధనుడలా పలుకగానే అశ్వత్థామ ఆ రాజుతో ఇలా అన్నాడు. "రాజా! లే! నీకు మేలు కలుగుతుంది. మనం శత్రువులను ఓడిద్దాం. రాజా! నా ఇష్టాపూర్త కర్మలమీదా, దానంమీదా, సత్యం మీదా, జపం మీదా, ఒట్టువేసి చెప్తున్నాను. ఈ రోజు సోమకులను సంహరిస్తాను. ఈ రాత్రి గడిచిపోయేలోగా యుద్ధంలో శత్రువులను చంపలేకపోతే సజ్జను లనుభవించదగిన యాజ్ఞికమైన ప్రీతిని నేను పొందలేను. రాజా! సర్వపంచాలురను చంపేదాకా కవచాన్ని వీడను. నేను సత్యం చెపుతున్నాను. రాజా! నా మాట విను!.

వా రలా మాటాడుకొనే సమయంలో మాంస భారంతో అలసిపోయిన బోయవారు నీరు త్రాగటానికి యాదృచ్ఛికంగా ఆ ప్రదేశానికి వచ్చారు. అక్కడ నిలిచిన ఆ బోయవారు చాటుగా ఆ మాటలన్నీ విన్నారు. అందరూ కలిసి, ఆ వ్యాధులందరూ ఆ దుర్యోధనుని మాట విన్నారు. ఆ మేటి విలుకాండ్రు అందరూ దుర్యోధనుడు యుద్ధానికి సిద్ధపడకపోయినా, తాము యుద్ధాన్ని అభిలషిస్తూ అతనిని బాగా నిర్బంధించారు. కౌరవసేనలోని మహారథులైన ఆ ముగ్గురిని చూసి, నీటిలో స్తంభించి ఉన్న రాజు యుద్ధవిముఖుడని గ్రహించి, నీటిలోనున్న

రాజుకు ఆ మహారథులకు మధ్య జరిగిన సంవాదాన్ని విని, ఆ బోయలు సుయోధనుడు నీటిలోనున్నాడని అర్థంచేసికొన్నారు. అంతకుముందే దుర్యోధనునికై వెదుకుతూ యుధిష్ఠిరుడు అనుకోకుండా అక్కడ తన దగ్గరకు వచ్చిన ఆ బోయవారిని నీ కుమారుని గురించి అడిగిఉన్నాడు. రాజా! ఆపై ఆ బోయవారు అంతకుముందు యుధిష్ఠిరుడు తమతో మాట్లాడిన విషయాన్ని గుర్తుతెచ్చుకొని, మెల్లగా వారిలో వారు ఇలా మాటాడుకొనసాగారు. "దుర్యోధనుని బయటపెడదాం. యుధిష్ఠిరుడు ధనమిస్తాడు. దుర్యోధన రాజు ఇక్కడ మడుగులో ఉన్నాడని మనకు స్పష్టంగా తెలిసింది. కాబట్టి అమర్షణుడైన దుర్యోధనుడు నీటిలో నిదురిస్తున్నాడని చెప్పటానికి అందరం యుధిష్ఠిర రాజు దగ్గరకు వెళదాం. ధీమంతుడు అయిన భీమసేనుడికి నీటిలో పడుకొనిఉన్న దుర్యోధనుని గురించి అందరం చెపుదాం. ఆ భీమసేనుడు దానితో ఆనందించి మనకు ఎంతో ధనమిస్తాడు. ఎండిపోయి, మన శరీరాలను కూడా శుష్కింపజేసే ఈ మాంసం మనకెందుకు?" అలా మాటాడుకొని ఆ బోయవారు ధనాన్ని అభిలషిస్తూ ఆనందంగా మాంసభారాన్ని మోసుకొంటూ పాండవ శిబిరం వైపు వెళ్ళిపోయారు.

దెబ్బతీయటంలో నేర్పరులైన పాండవులు కూడా లక్ష్యాన్ని నిర్ణయించుకొని ఉన్నారు. రణభూమిలో దుర్యోధనుని ఉనికి కనిపించక, ఆ పాపాత్ముని వంచనకు బదులు తీర్చుకొని, వైరాన్ని ముగించదలచి, రణభూమిలో అన్నివైపులకు చారులను పంపించారు. ఆపై ఆ ధర్మరాజు సైనికులందరూ కలసి మరలి వచ్చి, దుర్యోధనరాజు కనిపించలేదని చెప్పారు. ఆ గూఢచారులు చెప్పిన ఆ మాట విని ధర్మరాజు నిట్టూర్పు విడిచి, తీవ్ర చింతకు లోనయ్యాడు. ఆపై పాండవులు దీనంగా ఉండగా, ఆ బోయవారు దుర్యోధన నరపాలుని స్వయంగా చూసి, ఆనందించి, ఆ ప్రదేశం నుండి వేగంగా పాండవ శిబిరానికి వచ్చారు. ద్వారపాలకులు నివారిస్తున్నా, భీమసేనుడు చూస్తుండగానే లోనికి ప్రవేశించారు. వారు భీమసేనుని సమీపించి జరిగినది, తాము విన్నదీ అంతా చెప్పారు. ఆ పై వృకోదరుడు వారికి చాలా ధనమిచ్చి ఆ విషయమంతా ధర్మరాజుకు ఇలా చెప్పాడు. "రాజా! నీవు దుర్యోధనుని ఉనికికై పరితపిస్తున్నావు. బోయవారి ద్వారా అది నాకు తెలిసింది. నీటిని స్తంభింపచేసి పడుకొని ఉన్నాడు." రాజా! ప్రియకరమైన ఆ భీమసేనుని మాట విని, ధర్మరాజు సోదరులతో కలిసి ఆనందించాడు. ఆ మేటి విలుకాడు మడుగులోని నీటిలో ప్రవేశించి ఉన్నాడని విన్న వెంటనే జనార్దనుని ముందుంచుకొని అక్కడకు వెళ్ళారు.

రాజా! ఆపై ఉల్లాసంగా ఉన్న పాండవ పాంచాలుర కిలాకిలారావాలు అంతటా వినిపించాయి. ఆపై సింహనాదాలు చేశారు. కేరింతలు కొట్టారు. క్షత్రియులు వేగంగా ద్వైపాయన హ్రదం దగ్గరకు వెళ్ళారు. అక్కడ రణభూమిలో సోమకులు ఆనందంతో మాటిమాటికి అన్నివైపుల నుండి "పాపాత్ముడైన దుర్యోధనుడు కనిపించాడు" అని అరిచారు. వెంటనే వేగంగా బయలుదేరిన ఆ రథాల భీకరధ్వని ఆకాశాన్ని అంటింది. భారతా! అప్పుడు అర్జునుడు, భీమసేనుడు, నకుల సహదేవులు, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ఉత్తమౌజుడు, యుధామన్యుడు, మహారథుడైన సాత్యకి, ద్రౌపది కొడుకులు, పంచాలురలో మిగిలియున్న వీరులు దుర్యోధనుని పట్టుకోవాలని తమ వాహనాలు అలసియున్నా కూడా వేగంగా యుధిష్ఠిరుని వెంట బయలుదేరారు. అన్ని గుర్రాలు, ఏనుగులు, వందలకొలది సైనికులు కూడా వెళ్ళారు. ఆపై ధర్మరాజు దుర్యోధనుడు దాగిఉన్న ఆ ఘోరమైన ద్వైపాయన హ్రదం దగ్గరకు వచ్చాడు. ఆ మడుగు స్వచ్ఛమైన చల్లని నీటితో మనోహరంగా రెండవ సముద్రంవలె ఉన్నది. అక్కడ నీ కొడుకు విధివశాన అద్భుతమైన రీతిలో మాయతో నీటిని స్తంభింపచేసి శయనించి ఉన్నాడు. దుర్యోధనరాజు గదను చేతబూని ఏ మనిషికీ కనిపించకుండా నీటిలోపల పడుకొని ఉన్నాడు. ఆపై నీటిలోపల పడుకొనియున్న దుర్యోధనరాజు మేఘగర్జన వంటి భీకరధ్వనిని విన్నాడు.

యుధిష్ఠిరుడు కూడా సోదరులతో కలిసి నీ కుమారుని సంహరించాలని ఆ మడుగు దగ్గరకు వచ్చాడు. యుధిష్ఠిరసేన మహాశంఖనాదంతో, రథపు టిరుసుల చప్పుళ్ళతో, పైకి దుమ్ములేపుతూ, భూమిని కంపింపజేస్తూ వస్తోంది. మహారథులైన కృతవర్మ, కృపుడు, అశ్వత్థామ, ఆ శబ్దం విని దుర్యోధనునితో ఇలా అన్నారు. "ఇదిగో! జయోల్లాసంతో పాండవులు ఆనందంగా ఇటే వస్తున్నారు. మేము ఇక్కడనుండి వెళ్ళిపోతాం. మాకు అనుమతి నివ్వు". వారి ఆ మాట విని దుర్యోధనుడు అలాగే "అని చెప్పి, తన మాయతో ఆ మడుగును స్తంభింపజేశాడు. ఆ మహారథులు దుర్యోధనుని అనుమతి తీసికొని శోకపరాయణులై చాలాదూరం వెళ్ళి, అక్కడ ఒక మర్రిచెట్టును చూసి, బాగా అలసిపోయి, దుర్యోధనుని గూర్చి ఆలోచిస్తూ ఆ చెట్టు క్రింద కూర్చున్నారు. మహాబలుడైన దుర్యోధనుడు నీటిని స్తంభింపజేసి పడుకొని ఉన్నాడు. పాండవులు కూడా యుద్ధాన్ని అభిలషిస్తూ ఆ ప్రదేశానికి వచ్చారు. కృపుడు మొదలయిన మహారథులు రథాల నుండి గుర్రాలను విడిపించి, "యుద్ధమెలా జరుగుతుందో? దుర్యోధనుడేమవుతాడో? పాండవులు దుర్యోధనుని ఉనికిని ఎలా తెలిసికొంటారో?" అని ఆలోచిస్తూ అక్కడే కూర్చొని విశ్రమించసాగారు."

31. సుయోధన - యుధిష్ఠిర సంవాదము.

సంజయుడిలా చెప్తున్నాడు. 'అలా ఆ మహారథులు ముగ్గురు అక్కడ నుండి తొలగిపోతే పాండవులు దుర్యోధనుడు దాగిఉన్న ఆ మడుగు దగ్గరకు వచ్చారు. కురుశ్రేష్ఠా! అప్పుడు ద్వైపాయనహ్రదం-దగ్గరకు వచ్చి, దుర్యోధనుడు స్తంభింపజేసిఉన్న ఆ మడుగును చూసి, యుధిష్ఠిరుడు వాసుదేవునితో ఇలా అన్నాడు. "దుర్యోధనుడు ఈ నీటిపై ప్రయోగించిన మాయను గమనించు. స్తంభింపజేసి నీటిపై పడుకొని ఉన్నాడు. మనుష్యుల వలన ఇతనికి ఇప్పుడు భయంలేదు. ఈ దైవమాయను ప్రయోగించి ఇతడు నీటిలోపల ఉన్నాడు. మాధవా! వంచనలో నిపుణుడైన ఈ దుర్యోధనుడు మోసం చేసినా ప్రాణాలతో నాచేతినుండి తప్పించుకొనలేడు. ఒకవేళ ఇంద్రుడే స్వయంగా యుద్ధంలో ఇతనికి సహకరించినా రణభూమిలో ఇతని మరణాన్ని లోకులందరూ చూడగలరు. వాసుదేవుడిలా అన్నాడు. "భారతా! యుధిష్ఠిరా! మాయావి అయిన ఇతని మాయను మాయతోనే దెబ్బకొట్టు. **మాయావిని మాయతోనే సంహరించాలి. ఇది సత్యం.** భరతశ్రేష్ఠా! వ్యూహాత్మకమైన ఉపాయాలతో నీటిలో మాయను ప్రయోగించి, మాయాత్ముడైన సుయోధనుని సంహరించు. వ్యూహాత్మకమైన ఉపాయాలతో ఇంద్రుడు దైత్య దానవుల నెందరినో సంహరించాడు. ఉపాయాలతోనే మహాత్ముడైన ఇంద్రుడు బలిని బంధించాడు. వ్యూహాత్మకోపాయాలతోనే హిరణ్యాక్షుడు చంపబడ్డాడు. హిరణ్యకశిపుడు కూడా వ్యూహంతోనే సంహరింపబడ్డాడు. రాజా! వృత్రుడు కూడా ఉపాయంతోనే మరణించాడు. అనుమానం లేదు. రాజా! అదేరీతిగా పౌలస్త్యుని మనుమడు, రాక్షసుడు అయిన రావణుడు కూడా బంధువులతో, అనుచరులతో సహా వ్యూహాన్ని, యోగాన్ని ఆశ్రయించిన రామునిచే చంపబడ్డాడు. నీవుకూడా అలాగే పరాక్రమించు. రాజా! మహాదైత్యుడైన తారకుడు, పరాక్రమవంతుడైన విప్రచిత్తి - ఈ ఇద్దరు ప్రాచీనులను నేను వ్యూహాత్మకోపాయాలతోనే చంపాను. రాజా! అదే రీతిగా వాతాపి, ఇల్వలుడు, త్రిశిరుడు, సుందోపసుందులు - వీరందరూ వ్యూహంతోనే సంహరింపబడ్డారు. ఇంద్రుడు స్వర్గాన్ని వ్యూహాత్మకోపాయాలతోనే పరిపాలిస్తున్నాడు. యుధిష్ఠిరా! వ్యూహమే అన్నింటికన్నా బలవత్తరమైనది. దైత్యులు, దానవులు, రాక్షసులు, రాజులు వ్యూహాత్మకోపాయాలతోనే మరణించారు. కాబట్టి వ్యూహాన్ని అనుసరించు".

వాసుదేవుడలా అనగానే ధర్మరాజు నవ్వుతూ నీటిలో నున్న దుర్యోధనునితో ఇలా అన్నాడు. "రాజా! సుయోధనా! ఎందుకిలా నీటిలో అనుష్ఠానాన్ని ప్రారంభించావు? క్షత్రియులనందరినీ, నీ వంశాన్నీ కూడా నాశనం చేసి, ఇప్పుడు నీ ప్రాణాలను రక్షించుకొనటానికై

జలాశయంలో ప్రవేశించావు. రాజా! సుయోధనా! లే! మాతో పోరాడు. నరశ్రేష్ఠా! నీ దర్పమూ, నీ అభిమానమూ ఎక్కడకు పోయాయి? అటువంటి నీవు భయంతో నీటిని స్తంభింపజేసి లోపల నిలిచావు. జనులందరూ సభలో నిన్ను శూరుడ వని పలుకుతుంటారు. నీవు నీటిలో పడుకొన్నావు. ఆ నీ శౌర్యం వ్యర్థమను కొంటున్నాను. రాజా! లే! పోరాడు. క్షత్రియవంశంలో, విశేషించి కురువంశంలో పుట్టావు. నీ వంశాన్నీ, నీ పుట్టుకనూ తలచుకో! కురువంశంలో పుట్టినందుకు నీ జన్మను పొగుడుకొంటుంటావే! యుద్ధానికి భయపడి ఇప్పుడు నీటిలో ప్రవేశించి పడుకొన్నావు. రాజా! పోరాడక పోవటం, స్థిరంగా నిలవకపోవటం, రణభూమి నుండి పారిపోవటం సనాతనధర్మం కాదు. ఇది నీచమార్గం. దీనివలన స్వర్గం లభించదు. యుద్ధం అంతాన్ని చూడకుండా నీవు బ్రతకాలని కోరుకుంటున్నావా? ఇక్కడ పడిపోయిన పుత్రులను, సోదరులను, తండ్రులను చూసి సంబంధులను, మిత్రులను, మేనమామలను, బంధువులను చంపించి నాయనా! ఇప్పుడు మడుగులో ఎలా దాక్కొన్నావు ? భారతా! నీవు శూరుడనని భావించుకొనేవాడివే కానీ, శూరుడవు కాదు. దుర్మతీ! లోకమంతా వింటున్నప్పుడు "నేను శూరుడ"నని వ్యర్థంగా పలుకుతావు. శూరులు శత్రువులను చూసి, ఏ స్థితిలోనూ పారిపోరు. శూరా! చెప్పు. ఏ పద్ధతిలో నీవు యుద్ధాన్ని వీడిపోతున్నావు? సుయోధనా! నీవు నీ భయాన్ని విడిచిపెట్టి లే! పోరాడు. సర్వసైన్యాన్నీ, సోదరులను కూడా చంపించి, క్షత్రధర్మాన్ని ఆశ్రయించిన నీవంటివాడు ఇప్పుడు ధర్మాచరణ బుద్ధితో జీవితాన్ని కాపాడుకోవా లనుకోకూడదు. నీవు కర్ణునీ, శకునినీ ఆశ్రయించుకొని మోహంతో నిన్ను నీవు అమరునివలె భావించుకొని, నిన్ను నీవు తెలిసికొనలేదు. భారతా! అటువంటి మహాపాపాన్ని చేసిన నీవు లేచి పోరాడు. నీవంటివాడు వ్యామోహంతో పారిపోవటాన్ని ఇష్టపడటమేమిటి ? సుయోధనా! నీ పౌరుష మెక్కడికి పోయింది ? నీ అభిమానమేమైంది? నీ పరాక్రమ మెటపోయింది? నీ గర్జన లేమయ్యాయి? నీ అస్త్రవిద్యానైపుణ్యం ఏమైంది ? మడుగులో పడుకొన్నావేమిటి ? భారతా! లే! క్షత్రధర్మంతో పోరాడు. భారతా! మమ్ములను ఓడించి, ఈ రాజ్యాన్ని పరిపాలించు. లేదా మాచేత చచ్చి నేలపై నిదురించు. బ్రహ్మ నీకు దీనినే పరమ ధర్మంగా నిర్ణయించాడు. ఆ ధర్మాన్ని యథాతథంగా పాటించు మహారథా! రాజుకు తగినట్లు ప్రవర్తించు".

ధీమంతుడైన ధర్మరాజు అలా అనగానే నీటిలో నున్న దుర్యోధనుడు ఈ రీతిగా పలికాడు. "ప్రాణి భయపడటం ఆశ్చర్యకరమేమీ కాదు. నేను ప్రాణభయంతో, పిరికితనంతో పారిపోలేదు. రథంలేదు. అమ్ములపొది లేదు. పార్శ్వరక్షకులు మరణించారు.

సేనలేదు. రణభూమిలో ఒంటరినయ్యాను. కొద్దిసేపు విశ్రమించదలిచాను. రాజా ప్రాణాలను కాపాడుకోవాలని కానీ, భయంతో కానీ, బాధతో కానీ ఈ నీళ్ళలోనికి ప్రవేశించలేదు. అలసిపోయి ఈ పనిచేశాను. కౌంతేయా! నీవు, నిన్ను అనుసరించివచ్చిన వారు కూడా విశ్రమించండి. నేను లేచి మీ అందరితో రణభూమిలో పోరాడుతాను". యుధిష్ఠిరుడిలా అన్నాడు. "అంతా విశ్రమించాం. చాలా సేపటినుండి నిన్ను వెతుకుతున్నాం. కాబట్టి. సుయోధనా! ఇక లే ! ఇక్కడ పోరాడు. రణభూమిలో పాండవులను చంపి విశాల రాజ్యాన్ని పొందు. లేదా మాచే చచ్చి వీరలోకాన్ని పొందు". దుర్యోధనుడిలా అన్నాడు. "ఎవరికోసం రాజ్యాన్ని కోరుకొన్నానో, ఆ నా సోదరు లందరూ చనిపోయారు. నేలమీది మేటి క్షత్రియు లందరూ మరణించారు. రత్నాలు నశించాయి. ఆ స్థితిలో విధవరాలివలె నున్న రాజ్యాన్ని అనుభవించటానికి ఉత్సాహపడటం లేదు. ఇప్పటికీ పాంచాల పాండుసేనల ఉత్సాహాన్ని భంగపరచి, నిన్ను ఓడించాలనే నేను ఆశిస్తున్నాను. ద్రోణుడు, కర్ణుడు చనిపోయి, పితామహుడైన భీష్ముడు దెబ్బతిన్న తరువాత ఇప్పుడు యుద్ధంతో సాధించ వలసినదేదీ లేదని నేను భావిస్తున్నాను. రాజా! ఇప్పుడు ఈ ఒంటరినేల నీదే కానీ! అసహాయుడైన రాజెవ్వడూ రాజ్యపాలన చేయాలని ఇష్టపడడు. అటువంటి మిత్రులను, పుత్రులను, సోదరులను, పితరులను వీడి, మీరు రాజ్యాన్ని అపహరించగా నా వంటివా డెవ్వడు బ్రతకగలడు ? నా పక్షమంతా నశించింది. నాకు రాజ్యం మీద ప్రీతిలేదు. నేను మృగచర్మాన్ని ధరించి అరణ్యానికి వెళతాను. రాజా! బంధువు లందరూ దాదాపు నశించారు. గుర్రాలు, ఏనుగులు చనిపోయాయి. ఈ రాజ్యం నీదే. నిశ్చింతగా అనుభవించు. రాజా! మృగచర్మాలను ధరించి అరణ్యానికే వెళతాను. ఒంటరినైన నాకు ఇప్పుడు జీవితంపై ఆశలేదు. రాజేంద్రా! రాజులంతా చనిపోయి, యోధులందరూ మరణించి, రత్నాలన్నీ నశించిన ఈ రాజ్యాన్ని సుఖంగా అనుభవించు. మీకు బ్రతుకుతెరువు లేదు గదా!"

ఈ దీనవచనాలను విని, యుధిష్ఠిరుడు నీటిలోనున్న దుర్యోధనునితో ఇలా అన్నాడు. "నాయనా! నీటిలో ఉండి దీనంగా మాటాడకు. పక్షికూతలవలెనున్న నీ మాటలు నా మనస్సుకెక్కటం లేదు. నీవు రాజ్యదానం చేయటానికి సమర్థుడవైనా నీవిచ్చిన రాజ్యాన్ని పరిపాలించాలని నేను కోరుకోవటం లేదు. నీవు దానం చేసినా అధర్మంగా నేను రాజ్యాన్ని స్వీకరించను. క్షత్రియుడు దానం పట్టడం ధర్మమనిపించుకోదు. ఈ సమస్తరాజ్యాన్ని నీవిచ్చినా నేనిష్టపడను. నిన్ను యుద్ధంలో ఓడించి ఈ రాజ్యాన్ని అనుభవిస్తాను. నీవసలు రాజువే కావు. రాజ్యాన్ని ఎలా ఇవ్వగలవు ? రాజా! గతంలో మనం వంశంలో శాంతిని

నిలపటానికి ధర్మబద్ధంగా అడిగినప్పుడు నీవు రాజ్యాన్ని ఎందుకివ్వలేదు ? రాజా! మహాబలుడైన కృష్ణుని అప్పుడు తిరస్కరించి ఇప్పుడు రాజ్యమిస్తావా? నీ మనస్సుకీ భ్రాంతి ఏమిటి ? శత్రువులు ఆక్రమించిన తరువాత ఏ రాజైనా రాజ్యదానాన్ని ఇష్టపడతాడా? కౌరవనందనా! నీవిప్పుడు భూమిని దానమూ చేయలేవు, బలపూర్వకంగా తీసికొననూలేవు. ఈ స్థితిలో దానం చెయ్యాలన్న కోరిక ఏమిటి ? నన్ను యుద్ధంలో ఓడించి ఈ రాజ్యాన్ని పరిపాలించు. రాజా! భారతా! సూదిమొన మోపినంత రాజ్యాన్ని కూడా గతంలో నాకు ఇవ్వని నీవు ఈ రాజ్యాన్ని మొత్తంగా ఎలా ఇవ్వగలవు ? ఇంత ఐశ్వర్యాన్ని పొంది, ఈ రాజ్యాన్ని పరిపాలించి మూఢుడెవడైనా శత్రువులకు భూమిని దానం చేస్తాడా ? నీవు కేవలం మూర్ఖత్వంతో మూఢుడవై తెలిసికొనలేకపోతున్నావు? రాజ్యాన్ని ఇవ్వాలనుకొంటున్నావు కానీ ప్రాణాలు పోగొట్టుకొనబోతున్నావు. మమ్ములను ఓడించి ఈ రాజ్యాన్ని పరిపాలించు. లేదా మాచేత చచ్చి ఉత్తమలోకాలకు వెళ్ళు. రాజా! మనమిద్దరం బ్రతికిఉన్నంతకాలం సర్వప్రాణులకు మన విజయం విషయంలో సంశయముండనే ఉంటుంది. దుర్మోధా! నీ జీవితం ఇప్పుడు నామీద ఆధారపడి ఉంది. నేను స్వేచ్ఛగా నీకు జీవనదానం చేయగలను కానీ నీవు స్వేచ్ఛగా జీవించటానికి తగవు. మమ్ములను తగలబెట్టాలని నీవు విశేష ప్రయత్నం చేశావు. పాములతో కరిపించావు. విషప్రయోగం చేయించావు. నీటిలో త్రోయించావు. రాజా! రాజ్యాన్ని అపహరించటంలోనూ వంచనకు పాల్పడ్డావు. అప్రియ వచనాలు పలికించావు. ద్రౌపదిని లాగించావు. పాపాత్ముడా! ఈ కారణాలవలన నీ జీవితం నశించినట్లే లేలే! పోరాడు! యుద్ధమే శ్రేయస్కరమవుతుంది." రాజా! ఈ రీతిగా గెలుపుతో కూడియున్న పాండవులు మాటిమాటికీ రకరకాలుగా మాటాడసాగారు.'

32. యుధిష్ఠిర సుయోధన సంవాదము

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "నా కుమారుడు స్వాభావికంగానే కోపిష్ఠి పరంతపుడు, వీరుడు, మహీపతి అయిన అతడు అలా బెదిరింపులకు గురి అయి ఎలా ఉన్నాడు ? అతడు అంతకుముందెన్నడూ బెదిరింపులు వినలేదు. రాజుగా సర్వలోకుల గౌరవాన్ని పొందినవాడు. ఆత్మాభిమాని కాబట్టి తన గొడుగునీడ, సూర్యప్రభ కూడా దుఃఖాన్నే కలిగించేవి. అటువంటివాడు ఆ మాటలను ఎలా సహించగలడు ? సంజయా! మ్లేచ్ఛులు, ఆటవికులతో సహా ఈ రాజ్యమంతా దుర్యోధనుని తీవ్రానుగ్రహంతోనే బ్రతకగలగటం నీవు ప్రత్యక్షంగా చూచినదే. సంజయా! పాండవులు తీవ్రంగా బెదిరిస్తున్నారు. తన

భృత్యులెవ్వరూ లేరు. ఒంటరితనంలో చిక్కుకొనిపోయాడు. అటువంటి దుర్యోధనుడు గెలుపుతో కూడిఉన్న వారి పరుషవచనాలు మాటిమాటికీ విని, పాండవులతో ఏమన్నాడు? నాకది చెప్పు."

సంజయుడిలా చెప్తున్నాడు. "రాజా! సోదరులతో కలిసి యుధిష్ఠిరుడు నీటిలోనున్న నీ కుమారుని అలా బెదిరిస్తున్నాడు. విషమస్థితిలోనున్న ఆ నరాధిపుడు ఆ పరుషవచనాలు విని, నీటిలోనుండియే మాటిమాటికీ చేతులను ఊపుతూ యుద్ధం చేయాలని మనసు పడి ధర్మరాజుతో ఇలా అన్నాడు. "పాండవులారా! మీరందరూ మిత్రులతో, రథాలతో, వాహనాలతో కూడిఉన్నారు. నేను ఒంటరిని. కలతపడి ఉన్నవాడిని. రథహీనుడను. నా గుర్రాలు చనిపోయాయి. అనేకులతో కూడి, రథాలతో శస్త్రాలతో నిలిచిన మీతో ఒంటరినై, పాదచారినై, శస్త్రహీనుడనైన నేను పోరాటానికి ఎలా ఉత్సాహపడతాను ? యుధిష్ఠిరా! మీరు ఒక్కొక్కరుగా నాతో యుద్ధం చేయండి. రణభూమిలో ఒక్కడు అనేకవీరులతో పోరాడటం న్యాయం కాదు. ప్రత్యేకించి కవచం కూడా లేక, అలసి తీవ్రంగా గాయపడి, ఆపదలోనుండి, వాహనాలు, సైనికులు కూడా అలసిపోయిన వానితో యుద్ధం న్యాయం కాదు. రాజా! నీ వంటే నాకు భయంలేదు. భీముడన్నా భయంలేదు. వాసుదేవుడన్నా, ధృష్టద్యుమ్నుడన్నా నకుల సహదేవులన్నా, యుయుధానుడన్నా, నీ ఇతరసైనికులన్నా భయం లేదు. నేనొక్కడనే కోపంతో రణభూమిలో నిలిచి, మిమ్ముల నందరినీ నివారించగలను. రాజా! సత్పురుషుల కీర్తి ధర్మంమీదనే ఆధారపడుతుంది. నేను ధర్మాన్ని, కీర్తినీ పాటిస్తూ ఈ మాట అంటున్నాను. నేను లేచి రణభూమిలో వరుసగా వస్తున్న మీ అందరితో వరుసగా పోరాడుతాను. పాండవులారా! నేడు నేను శస్త్రరథహీనుడనైనా సరధులయిన మిమ్ములను నశింపజేస్తాను. స్థిరంగా నిలవండి. ఈ రోజు సోదరులతో సహా నిన్ను సంహరించి కీర్తిమంతులైన క్షత్రియుల ఋణం తీర్చుకొంటాను. బాహ్లీకుడు, ద్రోణుడు, భీష్ముడు, మహాత్ముడైన కర్ణుడు, జయద్రథుడు, భగదత్తుడు, శల్యుడు, భూరిశ్రవుడు, శకుని, మిత్రులు, పుత్రులు, స్నేహితులు, బంధువులు అందరి ఋణం తీర్చుకొంటాను" ఈ మాటలు అని దుర్యోధనరాజు ముగించాడు.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. "సుయోధనా! నీకు కూడా క్షత్రధర్మం తెలిసింది. అదృష్టమే. మహాభుజా! నీ బుద్ధికూడా యుద్ధంవైపు మరలింది. అదృష్టమే. కౌరవ్యా! అదృష్టంకొద్దీ నీవు శూరుడవు. అదృష్టం కొద్దీ యుద్ధమంటే తెలిసినవాడవు. నీవు ఒక్కడవే యుద్ధంలో మా అందరితో విడివిడిగా పోరాడదలచావు. నీకు ఇష్టమైన ఆయుధాన్ని

తీసికొని యుద్ధం చేయి. మేమంతా ప్రేక్షకపాత్ర వహిస్తాం. వీరా! మరల స్వయంగా నీకిష్టమైన వరమిస్తున్నాను. మాలో ఒక్కరిని చంపితే రాజ్యం నీదే. నీవే చనిపోతే స్వర్గానికి పోగలవు". దుర్యోధనుడిలా అన్నాడు. "అలా అయితే యుద్ధంలో నాతో పోరాడటానికి ఒక్క శూరుని ఇవ్వు. నీవంగీకరిస్తే ఆయుధాలలో ఈ గదను మాత్రమే నేను స్వీకరిస్తా. ఆఁ! మీలో ఒక్కరు నన్ను ఒంటరిగా గెలవాలని ఇష్టపడేవారు, రణభూమిలో పదాతియై గదతో నాతో పోరాడాలి. పదే పదే విచిత్ర రథయుద్ధాలు ఎన్నో జరిగాయి. ఈ రోజు అత్యద్భుతమైన గదాయుద్ధమొకటి జరుగుతుంది. మానవులు ఆస్త్రాలను వంతుల వారిగా ప్రయోగించటానికి ఇష్టపడతారు. నీ అనుమతితో ఈ రోజు యుద్ధంకూడా ఒక్కొక్కరితో క్రమంగా జరుగుతుంది. యుధిష్ఠిరా! సోదరులతో సహా నిన్ను గదతో ఓడిస్తాను. పాంచాలురను, సృంజయులను నీ ఇతర సైనికులను కూడా ఓడిస్తాను. దేవేంద్రునితో పోరాటమైనా సరే నాకెప్పుడూ తడబాటు లేదు. యుధిష్ఠిరుడిలా అన్నాడు. "సుయోధనా! గాంధారీసుతా! లేలే! నాతో పోరాడు. నీవు బలశాలివి. యుద్ధంలో ఒంటరిగా గదతో ఒక్కనితో కలిసి పోరాడి పౌరుషాన్ని ప్రదర్శించు. సావధానంగా పోరాడు. ఈ రోజు ఇంద్రుడే నీకు ఆసరాగా నిలిచినా నీవు బ్రతికే ప్రసక్తి లేదు."

సంజయుడిలా చెప్తున్నాడు. 'నరోత్తముడైన నీ కొడుకు దీనిని సహించలేకపోయాడు. పుట్టలో నున్న పెనుబాములవలే నీటిలోపల నుండియే నిట్టూర్చసాగాడు. రాజా! మేలుజాతి గుర్రం కొరడాదెబ్బలను సహించనట్లు మాటల కొరడాతో మాటిమాటికీ రెచ్చగొడుతున్న ఆ ధర్మజుని మాటలను సహించలేకపోయాడు. వీర్యవంతుడైన ఆ దుర్యోధనుడు నీటిని కలతపెట్టి, కాంచనాంగదాలు అలంకరించిన పెద్ద లోహగదను వేగంగా చేతబట్టి, నాగరాజువలె బుసకొడుతూ నీటిలో నుండి పైకి లేచాడు. ఆ నీ కుమారుడు స్తంభింపజేసిన నీటిని ఛేదించుకొని, లోహగదను భుజంపై పెట్టుకొని, సూర్యునివలె ప్రజ్వలిస్తూ పైకి లేచాడు. ఆపై బంగారు అలంకరణలు గల పెద్ద లోహగదను స్పృశిస్తూ దుర్యోధనుడు నిలిచాడు. గదను చేతబట్టిన దుర్యోధనుడు కొమ్ములమొలిచిన కొండవలె, ప్రజల మీద తీవ్రకోపంతో శూలాన్ని ధరించిన రుద్రునివలె కనిపించాడు. గదను దాల్చిన దుర్యోధనుడు తపిస్తున్న సూర్యునివలె ఉన్నాడు. దుర్యోధనుడు గదను చేతబట్టి నిలిస్తే, అతనిని దండపాణి అయిన యమునివలె సర్వప్రాణులు భావించారు. రాజా! నీ కుమారుని వజ్రహస్తుడైన ఇంద్రునివలె, శూలహస్తుడైన శివునివలె పంచాలు రందరు చూశారు. నీటినుండి పైకి లేచిన దుర్యోధనుని చూసి, పంచాలురు, పాండవులు అందరూ ఆనందించారు. పరస్పరం చేతులు కలిపారు. దానిని అపహాసంగా భావించి, నీ కొడుకు దుర్యోధనుడు కోపంతో

కళ్ళు త్రిప్పి, పాండవులను దహిస్తున్నట్లు చూశాడు. భ్రుకుటిని మూడు వంకరలుగా త్రిప్పి, పెదవులు కొరికి పాండవులతో, కృష్ణునితో ఇలా అన్నాడు.

"పాండవులారా! ఈ పరిహాసానికి ఫలాన్ని అనుభవిస్తారు. పాంచాలురతో సహా చచ్చి వెంటనే యమలోకానికి వెళతారు". సంజయుడిలా చెప్తున్నాడు. "నీ కొడుకు- దుర్యోధనుడు ఆ నీటినుండి లేచి, నెత్తురోడుతూ గదాపాణియై నిలిచాడు. నెత్తుటితో అట్టగట్టి నీరు స్రవిస్తున్న ఆ సుయోధనుని శరీరం అప్పుడు స్రవిస్తున్న కొండవలె ప్రకాశించింది. అక్కడ గదను ఎత్తిపట్టిఉన్న ఆ వీరుని కోపించిన యముని వలె, శూలాన్ని చేతబట్టిన రుద్రునివలె పాండవులు భావించారు. ఆపై వీర్యవంతుడైన ఆ దుర్యోధనుడు ఆనందంతో ఆబోతువలె రంకె వేస్తూ, మేఘంవలె గర్జిస్తూ గదతో పాండవులను యుద్ధానికి ఆహ్వానించాడు. దుర్యోధనుడిలా అన్నాడు. "యుధిష్ఠిరా! ఒక్కొక్కరుగా నా దగ్గరకు రండి. ఒకే వీరుడు రణభూమిలో అనేకులతో పోరాడటం న్యాయంకాదు. విశేషించి కవచాన్ని వీడి, అలసిపోయి, నీటతడిసి, తీవ్రంగా గాయపడి, వాహనాలు సైనికులు చనిపోయిన వానితో అనేకులు పోరాడరాదు. నాతో అందరూ తప్పక యుద్ధం చేయాలి. దీనిలోని యుక్తాయుక్తాలు నీకెప్పుడూ బాగా తెలుసు.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. "సుయోధనా! అనేక మహారథులు కలిసి అభిమన్యుని రణభూమిలో చంపినప్పుడు నీకు ఈ ఆలోచన ఎందుకు రాలేదు? క్షత్రధర్మం ఎంతో క్రూరమైనది. ఆపేక్ష లేనిది. జాలి లేనిది. కాకపోతే ఆ స్థితిలోనున్న అభిమన్యుని ధర్మజ్ఞులు, శూరులు, అయి తమత్యాగానికి కూడా సిద్ధపడిన మీరందరూ కలిసి ఎలా చంపగలిగేవారు? న్యాయంగా పోరాడేవారికి ఉత్తమమైన ఇంద్రలోకం లభిస్తుంది. అనేకులు ఒక్కరిని చంపకపోవటమే ధర్మమైతే అప్పుడు చాలామంది కలిసి నీ ఆంగీకారంతో అభిమన్యుని ఎలా చంపారు ? కష్టాలలో నున్న ప్రతిప్రాణి ధర్మశాస్త్రాన్ని పరామర్శిస్తుంది. నిలకడ పొందిన తరువాత పరలోకద్వారాలు మూసివేసినట్లు చూస్తుంది. వీరా! భారతా! కవచాన్ని ధరించు. జుట్టు ముడివేసికో ! నీకు లేనివన్నీ సిద్ధంచేసుకో! వీరా! ఇంకా నీకోరిక మరొకటి తీరుస్తాను నేను. అయిదుగురు పాండవులలో నీ ఇష్టం వచ్చినవానితో పోరాడు. అతనిని చంపితే నీవే రాజువు. మరణిస్తే స్వర్గాన్ని పొందగలవు. వీరా! జీవితం తప్ప నీకిష్టమైన పని ఏం చేయాలో చెప్పు."

సంజయుడిలా చెప్తున్నాడు. 'రాజా! ఆపై నీ కుమారుడు బంగారు కవచాన్ని గ్రహించాడు. స్వర్ణమయమై విచిత్రమైన శిరస్త్రాణాన్ని ధరించాడు. రాజా! శిరస్త్రాణాన్నీ, బంగారు కవచాన్నీ ధరించిన నీ కుమారుడు బంగారు కొండవలె ప్రకాశించాడు. కవచాన్ని

ధరించి, గదను చేబట్టి సిద్ధమై రణశిరస్సున నీ కుమారుడైన దుర్యోధనుడు పాండవులతో ఇలా అన్నాడు. "భరతర్షభా! నీ సోదరులతో ఒక్కరు నాతో గదాయుద్ధం చేయండి. సహదేవుడో, భీమసేనుడో, నకులుడో, అర్జునుడో, నీవో - ఎవరైనా సరే! రణభూమిలో ప్రవేశించి, పోరాడి యుద్ధంలో గెలుస్తాను. పురుషోత్తమా! బంగారు పట్టంతో నిబద్ధమైన ఈ గదతో సుదుర్గమమైన ఈ వైరాన్ని ముగింపజేస్తాను. గదా యుద్ధంలో నాతో సమానమైన వాడు ఎవ్వడూ లేడనుకొంటున్నాను. నా దగ్గరకు వచ్చిన అందరినీ గదతో చంపుతాను. మీలో ఎవ్వరూ న్యాయబద్ధంగా నాతో పోరాడలేరు. నేను నా గురించి ఇలా పొగరుగా మాటాడటం తగినది కాదు. అయినా చెప్పాను. మీ ఎదుటనే దీనిని సఫలం చేసి చూపుతాను. ఈ నా మాట సత్యమో, అసత్యమో ఈ ముహూర్తంలోనే తేలిపోతుంది. నేడు నాతో యుద్ధం చేయదలచినవారెవరో గదను స్వీకరించండి."

33. భీమసేన దుర్యోధన సంవాదము.

రాజా! ఈ రీతిగా దుర్యోధనుడు పదే పదే గర్జిస్తుంటే వాసుదేవుడు కోపించి, యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "యుధిష్ఠిరా! ఒకవేళ ఇతడు యుద్ధానికి నిన్నో, అర్జునునో, నకులునో, సహదేవునో వరిస్తే అప్పుడేమవుతుంది ? రాజా! ఏమిటీ తొందరపాటు ? యుద్ధంలో ఒక్కని చంపితే కురుపతివి కాగలవని ఇలా మాటాడా వేమిటి ? రాజా! మీరు యుద్ధంలో గదాహస్తుడైన దుర్యోధనునితో పోరాడటానికి సమర్థులు కారు. ఇతడు భీమసేనుని సంహరించాలని ఉక్కుమనిషితో పదమూడు సంవత్సరాలపాటు గదా యుద్ధాన్ని అభ్యసించాడు. భరతర్షభా! ఇప్పుడు మన పనిని సిద్ధించుకోవటమెలా ? నృపోత్తమా! దయామయుడవై నీవు తొందరపడ్డావు. రణభూమిలో భీముడు, అర్జునుడు తప్ప మరెవ్వరూ గదాయుద్ధంలో ఇతనిని ఎదిరించలేరు. వాస్తవానికి భీముడు కూడా పెద్దగా పరిశ్రమ చేయలేదు. రాజా! గతంలో నీకూ, శకునికీ మధ్య జరిగినట్లు ఇప్పుడు మరల విషమమైన జూదం ప్రారంభమైంది. భీముడు బలశాలీ, సమర్థుడు; సుయోధనరాజు బాగా పరిశ్రమించిన వాడు. రాజా! బల పరిశ్రమలలో పరిశ్రమయే విశిష్టమైనది. రాజా! అటువంటి శత్రువును నీవు చదునైన బాటలో ప్రవేశపెట్టి, నీవు విషమమార్గంలో నిలిచావు. మాకు కష్టాలు తెచ్చిపెట్టావు. శత్రువులనందరినీ ఓడించి, ఒక్క శత్రువు అదీ కష్టాలలో ఉన్నవాని ద్వారా ఎవరైనా చేజిక్కిన రాజ్యాన్ని పోగొట్టుకొంటారా? ఒకే పందెంపెట్టి ఇలా పోరాడటానికి ఇష్టపడతారా ? ఈనాడు రణభూమిలో గదాహస్తుడైన దుర్యోధనుని గెలవగలవాడు

లోకంలో ఎవ్వడూ కనిపించడు. అమరులకు కూడా అది అసాధ్యం. నీవు కానీ, భీముడు కానీ, నకులుడు కానీ సహదేవుడు కానీ, అర్జునుడు కానీ న్యాయంగా దుర్యోధనుని గెలవలేరు. ఆ సుయోధనరాజు బాగా పరిశ్రమించి ఉన్నాడు. భారతా! అటువంటి శత్రువుతో గదతో పోరాడమనీ, మాలో ఒకరిని యుద్ధంలో చంపి రాజువు కమ్మనీ ఎలా చెప్పావు? వృకోదరుడే తలపడినా మనం న్యాయంగా పోరాడితే గెలుపు సంశయాస్పదమే. మహాబలుడైన ఈ దుర్యోధనుడు బాగా అభ్యాసం చేసిఉన్నాడు. మాలో ఒక్కరిని చంపి నీవు రాజువు కావచ్చని నీవు మాటమాటకీ అన్నావు. కుంతీ పాండుల సంతతికి రాజ్యాన్ని పొందే స్థితి లేనట్లుంది. శాశ్వత వనవాసం కోసమో, మరల భిక్షాటన కోసమో మీరు పుట్టి ఉంటారు."

భీమసేనుడిలా అన్నాడు. "మధుసూదనా! బాధ పడవద్దు. ఈ వైరాన్ని అంతం చేయటం చాలా కష్టం. అయినా ఈ రోజు దాన్ని అంతం చేస్తాను. నేను యుద్ధంలో సుయోధనుని చంపగలను. సందేహంలేదు. కృష్ణా ! ధర్మరాజు గెలుపు స్పష్టంగా కనిపిస్తోంది. నా గద దుర్యోధనుని గద కన్నా ఒకటిన్నర రెట్లు ఎక్కువ బరువు. దుర్యోధనుని గద ఇంతటిది కాదు. మాధవా! వ్యధ చెందవద్దు. నేను ఈ సుయోధనునితో రణభూమిలో గదతో పోరాడటానికి ఉత్సాహపడుతున్నాను. జనార్దనా! మీరంతా ప్రేక్షకులుగా నిలవండి. కృష్ణా! నేను రణభూమిలో దేవతలతో సహా నానాశస్త్రాలను ధరించి మూడులోకాలు ఎత్తివచ్చినా పోరాడగలను. ఇక ఇప్పుడు సుయోధనుడెంత ?" అలా మాటాడుతున్న వృకోదరుని అభినందించి ఆనందించి, కృష్ణుడిలా అన్నాడు.

"మహాబాహూ! నిన్ను ఆశ్రయించియే ధర్మరాజు శత్రువినాశనంతో తన ప్రజ్వల శోభను పొందాడు. సంశయం లేదు. యుద్ధంలో ధృతరాష్ట్ర పుత్రుల నందరినీ నీవే సంహరించావు. రాజులను, రాజకుమారులను, ఏనుగులను సంహరించావు. మహాసంగ్రామంలో నిన్ను ఎదిరించియే కళింగులు, మాగధులు, ప్రాచ్యులు, గాంధారులు, కౌరవులు చనిపోయారు. దుర్యోధనుని కూడా చంపి, విష్ణువు ఇంద్రునకిచ్చినట్లు సాగరాలతో సహా భూమండలాన్ని ధర్మరాజుకు సమర్పించు. రణభూమిలో నిన్ను ఎదిరించి దుర్యోధనుడు నశిస్తాడు. దుర్యోధనుని రెండు తొడలను భంగపరచి నీ మాట నిలబెట్టుకో! ఎప్పుడూ ప్రయత్నపూర్వకంగా దుర్యోధనునితో పోరాడాలి. అతడు బలవంతుడు, యుద్ధనిపుణుడు, నిత్యాభ్యాసం గలవాడు కూడా." రాజా! ఆపై సాత్యకి భీమని అభినందించాడు. ధర్మరాజు మొదలుగాగల పాండవులు, పంచాలురు అందరూ భీమసేనుని ఆ మాటను అభినందించారు. సృంజయులతో కలిసి ప్రజ్వలిస్తున్న సూర్యునివలె నిలిచియున్న యుధిష్ఠిరునితో భీమబలుడైన భీముడిలా

అన్నాడు. "నేను రణభూమిలో ఈ దుర్యోధనునితో కలబడి పోరాడాలని ఉత్సాహపడుతున్నాను. ఈ పురుషాధముడు నన్ను యుద్ధంలో గెలవలేడు. ఖాండవవనంలో అర్జునుడు, అగ్నిని విడిచినట్టు ఈ రోజు చిరకాలంనుండి హృదయంలో తీవ్రంగా జ్వలిస్తున్న క్రోధాన్ని ధృతరాష్ట్రసుతుడైన సుయోధనునిపై విడుస్తాను. పాండవా ! ఈరోజు గదతో ఈ పాపాత్ముని చంపి, నీ హృదయంలోని ముల్లును తొలగిస్తాను. సుఖంగా ఉండగలవు. అనఘా! ఈరోజు కీర్తిమయమైన మాలను నీ మెడలో వేస్తాను. సుయోధనుడు ఈనాడు ప్రాణాలను, కీర్తినీ, రాజ్యాన్నీ కూడా పోగొట్టుకొంటాడు. ధృతరాష్ట్ర మహారాజు కూడా ఈ రోజు నేను తన కుమారుని చంపానని విని, శకుని బుద్ధిలో నుండి పుట్టిన ఆ అశుభకర్మను తలచుకొంటాడు."

అలా పలికి, భీముడు గదను ఎత్తి నిలిచి, ఇంద్రుడు వృత్రుని ఆహ్వానించినట్లు సుయోధనుని యుద్ధానికి ఆహ్వానిస్తూ నిలిచాడు. అతిపరాక్రమవంతుడైన నీ కుమారుడు ఆ ఆహ్వానాన్ని సహించలేక వెంటనే మదపుటేనుగుముందు నిలిచిన మదపుటేనుగువలె ఎదురు నిలిచాడు. గదాహస్తుడై యుద్ధానికి నిలిచిన నీ కుమారుని శిఖరసహితమైన కైలాసగిరినివలె పాండవులందరూ చూశారు. ఒంటరిగా నున్న మహాబలుడైన సుయోధనుని సమీపించి, పాండవులు గుంపుతోడులేని వీనుగును సమీపించినట్లు ఆనందించారు. దుర్యోధనునికి కూడా తడబాటు లేదు. భయం లేదు. గ్లాని లేదు. వ్యథ లేదు. రణభూమిలో సింహం వలె నిలిచాడు.

రాజా! గదను పైకిఎత్తి, కైలాసగిరివలెనున్న దుర్యోధనుని చూసి భీమసేనుడప్పుడిలా అన్నాడు. "వారణావతంలో ధృతరాష్ట్ర మహారాజా, నీవూ కలిసి చేసిన దుష్టకర్మలను తలచుకో! శకుని బుద్ధిని బట్టి చేసిన నిర్ణయం వలన ధర్మరాజు జూదంలో ఓడిపోయాడు. రజస్వల అయిన ద్రౌపది సభామధ్యంలో ఇబ్బందులకు గురి అయింది. దురాత్మా! నిర్దోషులయిన పాండవుల విషయంలో ఇంకా ఎన్నో పాపాలను చేశావు. వాటి మహాఫలాన్ని ఇప్పుడు చూడు. మహాయశస్వి, మనందరికీ పితామహుడూ అయిన గాంగేయుడు నీకోసం శరతల్పం మీద పడుకొనిఉన్నాడు. ద్రోణుడు చనిపోయాడు. కర్ణుడు మరణించాడు. శల్యుడు పోయాడు. శత్రుత్వాన్ని మొదటగా ప్రారంభించిన శకుని యుద్ధంలో చనిపోయాడు. శూరులైన నీ సోదరులు, పుత్రులు సోదరులతో సహా చనిపోయారు. యుద్ధంలో వెనుదిరగని శూరులైన రాజు లెందరో చనిపోయారు. ద్రౌపదికి కష్టాలు కలిగించిన పాపాత్ముడు - ఆ ప్రాతికామి కూడా చచ్చిపోయాడు. కులనాశకుడవు, అధమపురుషుడవు- నీవు ఒక్కడవే

మిగిలావు. నిన్ను కూడా ఈ రోజు గదతో చంపుతాను. ఈ విషయంలో సంశయం లేదు. రాజా! ఈరోజు యుద్ధంలో నీ పాగరునంతటినీ నాశనం చేస్తాను. విఫలమైన రాజ్యకాంక్షను పాండవుల విషయంలో చేసిన దుష్కృతాలను కూడా నశింపజేస్తాను."

దుర్యోధనుడిలా అన్నాడు. "ఇన్ని మాటలెందుకు? నాతో ఈనాడు యుద్ధం చేయి. వృకోదరా! ఈరోజు నేను నీ యుద్ధశ్రద్ధను పోగొడతాను. పాపాత్ముడా! హిమవచ్ఛిఖరంవలె ఉన్న పెద్దగదను పట్టుకొని, గదాయుద్ధానికి సిద్ధపడిన నన్ను చూడటం లేదా? గదను దాల్చి నిలిచిన నన్ను న్యాయంగా పోరాడుతూ ఏ శత్రువు చంపటానికి ఉత్సాహపడతాడు? దేవతలలోని దేవేంద్రుడైనా సరే! శరత్కాలపు మేఘంవలె వ్యర్థంగా గర్జించకు, నీకున్న బలమంతా ఈరోజు యుద్ధంలో ప్రదర్శించు." దుర్యోధనుని ఆ మాటలను విని, విజయాభిలాషులైన పాండవులు, సృంజయులు అందరూ వాటిని అభినందించారు. పిచ్చిపట్టిన ఏనుగును చప్పట్లతో బెదిరించినట్లు మానవులు మరల చప్పట్లతో దుర్యోధన నరపాలుని అభినందించారు. జయాన్ని ఆశిస్తున్న ఆ పాండవుల ఏనుగులు ఘీంకరిస్తున్నాయి. ఆ గుర్రాలు అదే పనిగా సకిలిస్తున్నాయి. ఆయుధాలు ప్రజ్వలిస్తున్నాయి.

34. బలరాముని రాక

సంజయుడిలా చెప్తున్నాడు. 'మహారాజా! మహాభయంకరమైన ఆ పోరు ప్రారంభం కాబోతోంది. పాండవులందరూ కూర్చున్నారు. తన ఇద్దరు శిష్యుల యుద్ధం తటస్థపడగా, అది విని, బలరాముడు అక్కడకు వచ్చాడు. ఆయనను చూసి పరమానందపడి పాండవులు కృష్ణునితో సహా ఎదురువచ్చి పాదాలు స్పృశించి యథావిధిగా పూజించారు. రాజా! అర్చించిన తర్వాత ఇలా అన్నారు. "రామా! యుద్ధంలో నీ శిష్యుల నేర్పరితనాన్ని చూడు". అప్పుడు బలరాముడు పాండవులను, కృష్ణుని గదాపాణియై నిలిచియున్న కౌరవ్యుడైన దుర్యోధనుని చూసి ఇలా అన్నాడు. "నేను వెళ్ళి ఇప్పటికి నలభైరెండు రోజులైంది. పుష్యనక్షత్రంలో బయలుదేరి వెళ్ళాను. శ్రవణనక్షత్రంలో తిరిగి వచ్చాను. కృష్ణా! శిష్యుల గదాయుద్ధాన్ని చూడటానికి ఇష్టపడుతున్నాను." ఆపై గదలను చేతబట్టి వీరులయిన ఆ దుర్యోధన వృకోదరులు యుద్ధభూమిని చేరి విరాజిల్లారు. ధర్మరాజు బలరాముని కౌగిలించుకొని స్వాగతం పలికి, యథావిధిగా కుశలాన్ని అడిగాడు. కృష్ణార్జునులు కూడా బలరామునకు నమస్కరించి, ప్రసన్నులై ప్రేమపూర్వకంగా ఆయనను కౌగిలించుకొన్నారు.

రాజా! శూరులైన నకుల సహదేవులు, ద్రౌపది కొడుకులు అయిదుగురు మహాబలుడైన బలరామునకు నమస్కరించి నిలిచారు. రాజా! భీమసేనుడు, నీ కుమారుడు అలాగే గదలను చేతబట్టి బలరామునకు నమస్కరించారు. అక్కడున్న రాజులందరూ అన్నివైపుల నుండి స్వాగతపూర్వకంగా సత్కరించి, మహాత్ముడైన బలరామునితో "మహాబాహూ! యుద్ధాన్ని చూడు" అన్నారు.

అప్పుడు బలరాముడు సృంజయులతో సహా పాండవులను కౌగిలించి, వారినీ ఇతర రాజులను కుశలమడిగాడు. అలాగే వారంతా కలిసి బలరాముని ఆరోగ్యాన్ని అడిగారు. బలరాముడు మహాత్ములైన ఆ క్షత్రియుల నందరికీ బదులుగా నమస్కరించి, వయస్సులననుసరించి క్షేమసమాచారాన్ని అడిగి, గ్రహించి, జనార్దనుని, సాత్యకినీ ప్రేమతో కౌగిలించుకొన్నాడు. వారి శిరస్సుల నాఘ్రాణించి, క్షేమమడిగాడు. రాజా! వారిద్దరూ కూడా ఆనందంతో దేవదేవుడైన బ్రహ్మను ఇంద్రోపేంద్రులవలె అన్నను సమర్చించారు. భారతా! ఆ తరువాత ధర్మరాజు "బలరామా! సోదరుల ఈ మహాసంగ్రామాన్ని చూడు" అన్నాడు. బలరాముడు ఆ మహారథులచే సత్కరింపబడుతూ పరమప్రీతితో వారి మధ్య కూర్చున్నాడు. నల్లని వస్త్రాలు ధరించిన తెల్లని కాంతిగల బలరాముడు రాజులమధ్య కూర్చొని ఆకాశంలో నక్షత్ర సమూహాల మధ్య చంద్రునివలె ప్రకాశించాడు. ఆ తరువాత ఆ ఇద్దరి మధ్య రోమాంచజనకమైన సంగ్రామం జరిగింది. అది నీ కుమారుల వైరానికి ముగింపు కలిగించింది.

35. ప్రభాసోత్పత్తి కథనము.

జనమేజయుడిలా అడిగాడు. "గతంలో యుద్ధం దగ్గర పడ్డప్పుడు బలరాముడు 'కేశవా! దుర్యోధనునకు సహాయం చేయలేము. పాండవులకూ సహాయం చేయలేను. కాబట్టి నేను నా ఇష్టంమేరకు వెళ్తున్నాను' అని కృష్ణునకు చెప్పి సెలవు తీసికొని, వృష్ణి వంశీయులతో కలిసి వెళ్ళిపోయాడు గదా! బ్రాహ్మణా! తిరిగి అతని రాకను గురించి చెప్పు. బలరాముడు మరల ఎలా వచ్చాడో వివరంగా నాకు చెప్పు. యుద్ధాన్ని ఎలా చూడగలిగాడు ? సజ్జనోత్తమా! చెప్పటంలో నీవు నేర్పరివి."

వైశంపాయనుడిలా చెప్పాడు. 'మహాబాహూ! మహాత్ములైన పాండవులు ఉపప్లవ్యంలో విడిది చేసి, సర్వప్రాణుల హితాన్ని కోరి, సంధికోసం ధృతరాష్ట్రుని దగ్గరకు మధుసూదనుని పంపారు. ఆ కృష్ణుడు హస్తినాపురానికి వెళ్ళి, ధృతరాష్ట్రుని కలిసి, వాస్తవమూ హితకరమూ

అయిన మాట చెప్పాడు. రాజా! దానిని ధృతరాష్ట్రుడు అంగీకరించలేదు. అదంతా నీకు గతంలోనే వివరంగా చెప్పాను. పురుషసత్తముడైన కృష్ణుడు సంధిని సాధించలేక ఉపప్లవ్యానికి తిరిగివచ్చాడు. నరోత్తమా! పని జరగలేదు. కృష్ణుడు ధార్తరాష్ట్రుని దగ్గర సెలవు తీసికొని వచ్చి, పాండవులతో ఇలా అన్నాడు. "కాల చోదితులైన కౌరవులు నా మాటను పాటించటం లేదు. పాండవులంతా నాతో కలిసి, పుష్య నక్షత్రంలో యుద్ధానికి బయలుదేరండి. ఆపై సేనావిభాగం జరుగుతుండగా బలవంతులలో శ్రేష్ఠుడు, మహామనస్వి అయిన బలరాముడు సోదరుడైన కృష్ణునితో 'మధుసూదనా! ఆ కౌరవులకు కూడా సహాయం చేయి' అన్నాడు. కానీ కృష్ణుడు అప్పుడా మాటను మన్నించలేదు. దానితో కోపానికి లోనయి బలరాముడు తీర్థయాత్రకై సరస్వతీ నదీ తీరానికి వెళ్ళాడు. ఆ తరువాత అరిందముడైన కృతవర్మ సర్వయాదవులతో కలిసి అనురాధా నక్షత్రంలో దుర్యోధనుని ఆశ్రయించాడు. సాత్యకితో సహా వాసుదేవుడు పాండవ పక్షాన్ని చేరాడు.

శూరుడైన బలరాముడు వెళ్ళిపోగానే మధుసూదనుడు పాండవులను ముందుంచుకొని పుష్యనక్షత్రంలో కురుక్షేత్రంవైపు బయలుదేరాడు. యాత్రకు బయలుదేరిన బలరాముడు తాను మార్గంలోనే నిలిచి సేవకుల నిలా ఆదేశించాడు. "తీర్థయాత్రకు అవసరమైన సంభారాలనూ, అన్ని ఉపకరణాలను ద్వారకనుండి తీసికొనిరండి. అగ్నులను, యాజకులను కూడా. బంగారాన్ని, వెండిని, ఆవులను, వస్త్రాలను, గుర్రాలను, ఏనుగులను, రథాలను, గాడిదలు, ఒంటెలు మొదలైన వాహనాలను, తీర్థానికి అవసరమైన సర్వసామగ్రిని వెంటనే తీసుకొనిరండి." వేగశాలురై సరస్వతి నదివైపు వెళ్ళండి. ఋత్విక్కులను, వందలకొలది బ్రాహ్మణులను తీసికొనిరండి. బలదేవుడు సేవకులను ఆలా ఆదేశించి, అప్పుడే కురుక్షేత్రం నుండి తీర్థయాత్రను ఆరంభించాడు. సరస్వతి నదివైపు బయలుదేరి దాని రెండు తీరాలలో సంచరించాడు. ఋత్విక్కులు, మిత్రులు, ఇతర ద్విజశ్రేష్ఠులు, రథాలు, గజాలు, గుర్రాలు, సేవకులు అతనివెంట ఉన్నారు. ఎద్దులు, ఒంటెలు, గాడిదలు లాగుతున్న రథాలు ఎన్నో చుట్టూ వస్తున్నాయి. రాజా! ఆయా తీర్థాలలో అలసిపోయినవారికి, రోగులకు, శిశువులకు, వృద్ధులకు ఇవ్వటానికి, యాచక సత్కారానికి అవసరమైన వస్తువులను పెద్దమొత్తంలో సిద్ధం చేయించాడు. విభిన్న ప్రాంతాలలోని ప్రజలు అపేక్షించే వస్తువులను సిద్ధంచేసి, అందజేస్తున్నాడు. ఆకొన్నవారికై అన్నానికై అన్నిచోట్లా ఏర్పాటు చేశాడు. ఏ దేశంలో ఏ యే బ్రాహ్మణులు ఎటువంటి భోజనాన్ని తినాలని కోరితే ఆయా బ్రాహ్మణులకు అప్పటికప్పుడే అక్కడే దానిని సమకూర్చేవారు. బలరాముని ఆదేశాన్ని అనుసరించి

సేవకులు ఆయా ప్రాంతాలలో భక్ష్య పానీయాల రాసులను పూర్తిగా సిద్ధం చేస్తున్నారు. సుఖాన్ని అభిలషిస్తున్న విప్రుల సమర్చనకై విలువైన వస్త్రాలను, పరుపులను, దుప్పట్లను సిద్ధం చేస్తున్నారు. ఏ బ్రాహ్మణుడు ఎక్కడ నిదురించదలచినా, మేల్కొని ఉండదలచినా, అక్కడే అతనికై అన్ని ఏర్పాట్లు సిద్ధమై కనిపించేవి.

ఆ యాత్రలో జనమంతా సుఖంగా ప్రయాణిస్తున్నారు. విశ్రమిస్తున్నారు కూడా. బయలుదేరగోరితే వాహనాలు, దప్పికగొన్నవారికి పానీయాలు, ఆకలిగొన్నవారికి రుచికరమైన అన్నాలు, వస్త్రాలు, ఆభరణాలు సేవకు లక్కడ సమకూర్చేవారు. ప్రయాణిస్తున్నవారికి అందరికీ ఆ మార్గం స్వర్గతుల్యమై సుఖావహమై ఉంది. నిత్యమూ ఆనందసమన్వితమై, శుభకరమై ఉంది. రుచికరమైన ఆహారం లభించేది. ఆ మార్గంలో కొనడానికి, అమ్మడానికీ తగిన దుకాణాలు, వాటి దగ్గర వందలకొలదిగ వివిధ జనాలు ఉండేవారు. ఆ దుకాణాలు రకరకాల చెట్లతో, తీగెలతో, రత్నాలతో శోభించేవి. బలరాముడు నియమపూర్వకంగా ఉంటూ, ప్రసన్నతతో ఆ పుణ్యతీర్థాలలో బ్రాహ్మణులకు ధనాన్ని, యాగదక్షిణలను ఇవ్వసాగాడు. బలరాముడు బ్రాహ్మణోత్తములకు పాలిస్తున్న ఆవులను వేలకొలదిగ దానం చేశాడు. వాటిని మంచి వస్త్రాలతో, వాటి కొమ్ములను బంగారు రేకులతో అలంకరించారు. వివిధ దేశాలలో పుట్టిన గుర్రాలను, వాహనాలను, మంచి దాసీలను దానం చేశాడు. విలువైన రత్నాలు ముత్యాలు, మణులు, పగడాలు, మేలిమి బంగారం, వెండి, లోహపాత్రలు, రాగిబిందెలు బ్రాహ్మణశ్రేష్ఠులకు దానం చేశాడు. ఈ రీతిగా ఆ మహాత్ముడు సరస్వతీ తీరంలో భూరిధనాన్ని దానం చేశాడు. ఆ బలరాముడు క్రమంగా అక్కడనుండి కురుక్షేత్రం వైపు సాగాడు.

జనమేజయుడిలా అడిగాడు. 'సరస్వతీ నదీ తీరంలోని తీర్థాల గుణాలను, పుట్టుకను, తెలియజేయి. వాటిని సేవిస్తే వచ్చే ఫలితాన్ని, కర్మాచరణవలన కలిగే సిద్ధినీ ప్రాధాన్యాన్ని బట్టి యథాక్రమంగా చెప్పు. నాకెంతో కుతూహలంగా ఉంది.' వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'రాజా! తీర్థాల ఫలితాన్ని, గుణాలను, ఉత్పత్తిని అన్ని కోణాలలోనుండి పూర్తిగా చెపుతాను. పుణ్యప్రదమైన ఈ విశేషాలు విను. బలరాముడు ముందుగా ఋత్విక్కులతో, మిత్రులతో, బ్రాహ్మణగణంతో కలిసి పవిత్రమైన ప్రభాసతీర్థానికి చేరాడు. నరేంద్రా! ఆ తీర్థంలోనే క్షయతో బాధపడుతున్న చంద్రుడు శాపవిముక్తిని పొంది మరల తేజస్వియై, జగత్తునంతా ప్రకాశింపజేస్తున్నాడు. అలా చంద్రుని ప్రభాసింపజేసినందువలన ఆ శ్రేష్ఠతీర్థం లోకంలో **ప్రభాసతీర్థంగా** వ్యవహరింపబడింది.' జనమేజయుడిలా అడిగాడు.

'పూజనీయా! చంద్రుడు క్షయకు ఎలా గురి అయ్యాడు? ఆ శ్రేష్ఠతీర్థంలో చంద్రుడు ఎలా మునిగాడు ? మునిగి మరల ఎలా పరిపుష్టడయ్యాడు? ఇదంతా నాకు వివరంగా చెప్పు.'

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'రాజా! తన కుమార్తెలలో ఇరవైఏడుగురిని దక్షుడు చంద్రునకిచ్చి పెళ్ళి చేశాడు. ఆ చంద్రుని భార్యల పరిగణనకై నక్షత్రాలతో సంబంధముండటం వలన వారికవే పేర్లయ్యాయి. వారంతా విశాల నేత్రాలు గలవారు. రూపంలో లోకంలో సాటిలేనివారు. వారిలో కూడా రోహిణి రూపసంపదతో అందరినీ మించినది. దానితో పూజ్యుడైన చంద్రుడు ఆమెపై ప్రీతిగా ఉండేవాడు. ఆమె అతని మనస్సుకు నచ్చింది. సదా ఆమెతోనే సుఖించేవాడు. దానితో ఇతర భార్యలు కోపించారు. వారు తమ తండ్రియైన దక్ష ప్రజాపతి దగ్గరకు పోయి ఇలా చెప్పారు. 'చంద్రుడు మాతో ఉండటం లేదు. ఎప్పుడూ రోహిణినే సేవిస్తున్నాడు. అందువలన ప్రజాపతీ! మేమందరమూ కలిసి ఆహారనియమాలతో, తపశ్చరణతత్పరతతో నీదగ్గరే ఉంటాం.' వారి మాట విని దక్షుడు "భార్యలతో సమానంగా ప్రవర్తించు. అప్పుడే పెద్ద పాపం నీకు అంటకుండా ఉంటుంది" అని చంద్రునితో చెప్పాడు. దక్షుడు వారందరితో "చంద్రుని దగ్గరకు వెళ్ళండి. నా మాటను బట్టి చంద్రుడు మీ అందరితో సమానంగా ప్రవర్తిస్తాడు" అని చెప్పాడు. అలా వీడ్కోలు తీసికొని వారంతా చంద్రుని భవనానికి వెళ్ళారు. రాజా! ఆలా జరిగినా కూడా పూజ్యుడైన చంద్రుడు మరలా రోహిణి మీద ప్రేమతో మాటమాటికీ ఆమెదగ్గరే ఉండేవాడు. ఆ తరువాత వారంతా కలసి మరల తండ్రి దగ్గరకు వెళ్ళి. "నీకు సేవచేస్తూ నీదగ్గరే ఉంటాము. సోముడు మా దగ్గరుండటం లేదు. నీ మాటను పాటించటం లేదు" అన్నారు. వారి ఆ మాటను విని దక్షుడు మరల సోమునితో "భార్యలందరితో సమానంగా ప్రవర్తించు. లేకపోతే నిన్ను శపిస్తాను" అని అన్నాడు.

పూజ్యుడైన చంద్రుడు దక్షుని ఆ మాటలను నిరాదరించి రోహిణితో నివసించసాగాడు. దానితో కోపించి వారు మరల తండ్రి దగ్గరకు పోయి, తలవంచి నమస్కరించి అప్పుడు ఇలా అన్నారు. "చంద్రుడు మాతో ఉండటం లేదు. మాకు నీవే శరణు కావాలి. ప్రభూ! చంద్రుడెప్పుడూ రోహిణితోనే ఉంటున్నాడు. నీ మాటలను లెక్కచేయటం లేదు. మాతో స్నేహాన్ని ఇష్టపడటం లేదు. కాబట్టి మమ్ములనందరినీ కాపాడు. చంద్రుడు మాతో ఉండేటట్లు చూడు". రాజా! అది విని పూజ్యుడైన దక్షప్రజాపతి కోపించి, చంద్రునికై క్షయను సృష్టించాడు. అది చంద్రునిలో ప్రవేశించింది. ఆ క్షయ

ప్రభావంతో చంద్రుడు రోజురోజుకూ క్షీణించసాగాడు. దానినుండి బయటపడటానికి ప్రయత్నం కూడా చేశాడు. మహారాజా! చంద్రుడు వివిధ యాగాలు చేశాడు. అయినా శాపం నుండి బయటపడలేదు. క్షీణిస్తూనే ఉన్నాడు. ఆ రీతిగా చంద్రుడు క్షీణిస్తుండగా ఆపై ఓషధులు పుట్టలేదు. ఆ ఓషధులన్నింటి రుచి, రసం, ప్రభావం పోసాగాయి. ఓషధులు క్షీణిస్తుంటే ప్రజాసంక్షయం జరుగుతోంది. చంద్రుడు క్షీణిస్తుంటే సర్వప్రజలు కూడా క్షీణించసాగారు. ఆపై దేవతలు వచ్చి చంద్రునితో ఇలా అన్నారు.

"ఏమిటిది ? నీ రూపమిలా అయింది. వెలుగొందటం లేదు. మాకందరికీ కారణం చెప్పు. ఎందువలన నీకింత భయం? నీ ద్వారా విషయం విని ఆపై మేము తగిన పని చేస్తాం". వారలా అనగానే చంద్రుడు శాప లక్షణాన్ని, తన క్షయ విషయాన్ని చెపుతూ వారికి బదులిచ్చాడు. ఆ మాటలు విని దేవతలు దక్షుని దగ్గరకు వెళ్ళి ఇలా అన్నారు. "స్వామీ! అనుగ్రహించండి. చంద్రుని శాపాన్ని మరల్చండి. ఈ చంద్రుడు క్షీణిస్తున్నాడు. కొంచెమే మిగిలిఉన్నాడు. దేవేశా! ఈ చంద్రుని క్షయం వలన ప్రజలు కూడా క్షీణిస్తున్నారు. తీగలు! ఓషధులు, వివిధ బీజాలు కూడా నశిస్తున్నాయి. ఆవి నశిస్తే మేమూ నశిస్తాం. మేము లేకపోతే జగత్తే లేదు. జగద్గురూ! ఈ విషయాన్ని గ్రహించి అనుగ్రహించాలి". దేవత లలా అనగానే దక్షప్రజాపతి దేవతలతో ఈ రీతిగా పలికాడు. "ఇది వీలు కాదు. నా మాటను మరల్చటం కుదరదు. ఏదైనా ప్రత్యేక కారణముంటే ఆదే తొలగిపోతుంది. భార్యలందరి విషయంలో చంద్రుడెప్పుడూ సమానంగా ప్రవర్తించాలి. శ్రేష్ఠమైన సరస్వతీ తీర్థంలో మునిగితే చంద్రుడు మరల వృద్ధి పొందుతాడు. దేవతలారా! ఈ నా మాట సత్యం. చంద్రుడు నెలలో సగంరోజులు ఎప్పుడూ క్షీణిస్తాడు. మిగిలిన సగం రోజులు వర్ధిల్లుతాడు. ఈ నా మాట సత్యం. పశ్చిమ సముద్రానికి వెళ్ళి, సరస్వతీ నది కలిసేచోట చంద్రుడు దేవదేవుడైన మహేశుని ఆరాధిస్తే తిరిగి కాంతిని పొందగలడు." ఆపై ఋషి అయిన దక్షుని శాసనం మేరకు చంద్రుడు సరస్వతీ నదికి ప్రథమతీర్థమైన ప్రభాస తీర్థానికి వెళ్ళాడు. చంద్రుడు అమావాస్యనాడు దానిలో మునిగి లోకాలను ప్రభాసింపజేసి శీతాంశుత్వాన్ని పొందాడు. రాజేంద్రా! దేవతలందరు కూడా చంద్రునితో సహా మహాకాంతిని పొంది దక్షుని ఎదుట నిలిచారు. అప్పుడు దక్షప్రజాపతి దేవతలనందరినీ పంపించి, ప్రేమతో చంద్రునితో మరలా ఇలా అన్నాడు.

"నాయనా! స్త్రీలను కానీ, బ్రాహ్మణులను కానీ ఎప్పుడూ పరాభవించవద్దు. నిత్యము సావధానంగా నా మాటను పాటించు. వెళ్ళు." మహారాజా! అలా చెప్పి దక్షుడు

చంద్రుని విడిచి పుచ్చాడు. చంద్రుడు తన నివాసానికి వెళ్ళాడు. ప్రజలు కూడా అంతకుముందువలె ఆనందంతో ఉన్నారు. ఇలా చంద్రుడు శాపగ్రస్తుడైన విషయాన్ని, ప్రభాసతీర్థం తీర్థాలలో గొప్పదైన విషయాన్ని మొత్తం నీకు చెప్పాను. మహారాజా! చంద్రుడు ఎప్పుడూ అమావాస్య నాడు ఉత్తమమైన ప్రభాసతీర్థంలో స్నానం చేసి కాంతిమంతుడై పరిపుష్టి నొందుతాడు. అందువలననే దీనిని ప్రభాస తీర్థమంటారు. చంద్రుడు దీనిలో మునిగియే పరమకాంతిని పొందాడు. ఆ తరువాత బలరాముడు చమసోద్భేదానికి వెళ్ళాడు. ఆ తీర్థాన్ని జనులందరూ చమసోద్భేదమనే అంటారు. బలరాముడు ఆ చమసోద్భేద తీర్థంలో యథావిధిగా స్నానం చేసి, విశిష్ట దానాల నిచ్చి, ఒకరాత్రి నిదురించి, త్వరగా ఉదపాన తీర్థానికి వెళ్ళాడు. అది శుభకరమైన వాటిలో మొదటిది. అక్కడకు చేరితేనే మహాఫలితం సిద్ధిస్తుంది. జనమేజయా! అక్కడి ఓషధుల స్నిగ్ధతవలన, భూమి ఆర్ద్రత వలన సిద్ధపురుషులు అదృశ్యంగా ఉన్న సరస్వతిని కూడా చూడగలుగుతారు.'

36. త్రితాఖ్యానము

వైశంపాయనుడిలా అన్నాడు. 'బలరాముడు **చమసోద్భేదతీర్థం** నుండి బయలుదేరి త్రితమునికి సంబంధించిన **ఉదపాన తీర్థానికి** వెళ్ళాడు. ఆ తీర్థం సరస్వతీ నదీ జలాల్లో ఉంటుంది. బలరాముడు అక్కడ నీటిని స్పృశించి, స్నానాచమనాదులు ముగించి, భూరిధనాన్ని దానం చేసి, బ్రాహ్మణులకు సమర్పించి ఆనందించాడు. అక్కడ మహాతపస్వి అయిన త్రితుడు ధర్మపరుడై వసిస్తున్నాడు. ఆ మహాత్ముడు బావిలో నివసిస్తూ కూడా సోమపానం చేసేవాడు. బావిలోనున్న ఆ మహర్షిని విడిచి, ఆయన సోదరులిద్దరూ ఇంటికి వెళ్ళిపోయారు. దానితో బ్రాహ్మణశ్రేష్ఠుడైన త్రితుడు వారిని శపించాడు.' జనమేజయుడిలా అడిగాడు. 'ద్విజసత్తమా! ఉదపానతీర్థమెలా ఏర్పడింది ? మహాతపస్వి అయిన త్రితుడు దానిలో ఎలా పడ్డాడు? సోదరులు ఆయననెందుకు విడిచిపెట్టారు ? బావిలో ఆయనను వదలి వారు ఇంటికెలా వెళ్ళారు? బావిలోనున్న ఆయన యాగమెలా చేశాడు ? సోమమెలా త్రాగాడు? నేను వినదగినదే అని నీవు భావిస్తే ఇదంతా చెప్పు.'

వైశంపాయనుడిలా చెప్పున్నాడు. 'రాజా! పూర్వయుగంలో ముగ్గురు సోదరులుండేవారు. వారందరూ మునులు. ఏకతుడు, ద్వితుడు, త్రితుడు అని వారి పేర్లు. అందరూ సూర్యునివలె తేజోవంతులు, అందరూ ప్రజాపతిసమానులు, సంతానవంతులు, బ్రహ్మవాదులు, తపస్సుతో బ్రహ్మ లోకాన్ని జయించినవారు. వారి తండ్రి గౌతముడు

నిత్యమూ ధర్మరతుడు. ఆయన వారి తపస్సుతో, నియమాలతో, దమంతో ఆనందించేవాడు. చిరకాలం వారి ప్రేమను అనుభవించి, ఆ పూజ్యుడు తనకు అనుగుణమైన స్థానానికి వెళ్ళిపోయాడు. రాజా! మహాత్ముడైన ఆ గౌతముని యజమానులైన రాజు లందరూ, గౌతముడు స్వర్గస్థుడు కాగానే ఆయన కుమారులను గౌరవించసాగారు. రాజా! వారిలో త్రితుడు తన కర్మపరాయణత్వం, అధ్యయనం కారణంగా తన తండ్రివలె శ్రేష్ఠస్థానాన్ని పొందాడు. అలాగే మహాత్ములు, పుణ్యలక్షణులు అయిన మహర్షులందరూ ఆయన తండ్రి గౌతముని గౌరవించినట్లు మహాభాగుడైన త్రితుని గౌరవించారు. ఆ తరువాత ఒకానొకసమయంలో సోదరులైన ఏకత ద్వితులు యజ్ఞం కోసం, ధనం కోసం చింతించసాగారు. త్రితుని, తీసికొని యజమానుల దగ్గరకు పోయి, యాగాలు చేయించి, పశువులను దానంగా స్వీకరించి, మహా ఫలితాల నివ్వగల యాగాలుచేసి, ఆనందంగా సోమపానం చేద్దామని భావించారు. ఆ సోదరులు ముగ్గురు అలాగే చేశారు. పశువులను పొందాలనే యజమానులందరి దగ్గరకు పోయి వారిచే యాగాలు చేయించి, యజమానులనుండి యాగకర్మలో భాగంగా, శాస్త్రబద్ధంగా అనేక పశువులను పొంది, మహాత్ములైన ఆ మహర్షులు తూర్పుదిశగా వచ్చారు.

త్రితుడు ఆనందంగా అందరికన్నా ముందు నడుస్తున్నాడు. ఏకతుడు, ద్వితుడు పశువులను తోలుకొంటూ వెనుక వస్తున్నారు. పెద్ద పశువులమందను చూసి "ఈ పశువులు త్రితునకు లేకుండా మనిద్దరికే ఎలా దక్కుతాయి?" అని వారిలో ఆశ కలిగింది. ఏకతుడు, ద్వితుడు పరస్పరం మాటాడుకొన్నారు. రాజా! ఆ పాపాత్ములు ఒకరితో ఒకరు అన్న మాటలు విను. 'త్రితుడు యాగవిధిలో నేర్పరి. వేదాలలో నిష్ణాతుడు, ఇటువంటి ఆవులను ఎన్నింటినైనా సంపాదించుకొనగలడు. కాబట్టి మనిద్దరం కలిసి గోవులను తోలికొని వెళ్ళిపోదాం. త్రితుడు వేరుపడి తన ఇష్టంవచ్చిన చోటికి వెళతాడు.' రాత్రిపూట వారు ప్రయాణం చేస్తుండగా దారిలో ఒక తోడేలు కనిపించింది. అక్కడకు దగ్గరలోనే సరస్వతీ నదీతీరాన ఒక బావి ఉంది. అప్పుడు త్రితుడు దారిలో ఎదురుగా నిలిచిఉన్న తోడేలును చూసి, భయపడి పారిపోబోతూ సర్వభూత భయంకరమై, మహాఘోరమై, అగాధమైన ఆ బావిలో పడిపోయాడు. మహారాజా ! ఆపై మునిసత్తముడైన ఆ త్రితుడు బావిలో నుండి ఆర్తనాదం చేశాడు. మిగిలిన ఇద్దరు మునులూ అది విన్నారు. సోదరులైన ఏకత ద్వితులు, త్రితుడు బావిలో పడినాడని గ్రహించి, తోడేలుకు భయపడి, లోభానికి లోబడి, ఆయనను వదలి వెళ్ళిపోయారు. ఆవులకు ఆశపడిన ఆ సోదరులిద్దరూ మహాతపస్వి అయిన ఆ త్రితుని

నిర్జలంగా ఉన్న ఆ బావిలోనే విడిచివేశారు. పాపాత్ముడు నరకంలో ఉన్నట్లు తాను లతలతో, గడ్డితో ఆవరింపబడిన బావిలో పడినట్లు గ్రహించాడు త్రితుడు. మరణభయం కలిగింది. తాను సోమపానానికి దూరమైనట్లు భావించాడు.

అక్కడే ఉండి సోమపానం చేయటమెలా అని ఆ ప్రాజ్ఞుడు మతిపెట్టి ఆలోచించాడు. అలా ఆలోచిస్తూ మహాతపస్వి అయిన ఆ త్రితుడు ఆ బావిలో వ్రేలాడుతున్న ఒక లతను యాదృచ్ఛికంగా గమనించాడు. దుమ్ముకొట్టుకొనియున్న ఆ బావిలో ఆ త్రితముని నీటిని భావించి, సంకల్పమాత్రంతో అగ్నిని స్థాపించి, హోత మొదలయిన స్థానాలలో తననే ప్రతిష్ఠించుకొన్నాడు. ఆపై ఆ మహాతపస్వి ఆ లతనే సోమంగా భావించాడు. ఋక్కులను, యజుస్సులను, సామలను మనసా చింతించాడు. రాజా! చిన్న చిన్న రాళ్ళనే నూరటానికి సాధనాలుగా చేసికొని, ఆ లత నుండి రసాన్ని తీశాడు. నీటినే ఆజ్యంగా భావించాడు. దేవతలకు కూడా భాగాన్ని కల్పించాడు. సోమరసాన్ని తయారు చేసి, ఆహుతులనిస్తూ మంత్రోచ్చారణతో పెద్దగా ధ్వని చేశాడు. రాజా! త్రితమహర్షి చేసిన ఆ శబ్దం స్వర్గందాకా వినిపించింది. బ్రహ్మవాదులు చెప్పిన రీతిగా ఆ యజ్ఞం ముగిసింది. మహాత్ముడైన త్రితుడు మహాయజ్ఞాన్ని చేస్తుంటే స్వర్గలోకమంతా కలతపడింది. కారణం తెలియలేదు. ఆపై బృహస్పతి భీకరమైన ధ్వనిని విన్నాడు. విని, దేవపురోహితుడైన బృహస్పతి దేవతలందరితో ఇలా అన్నాడు. "త్రితుడు యజ్ఞం చేస్తున్నాడు. దేవతలారా! అక్కడకు వెళ్దాం. ఆ మహాతపస్వి కోపిస్తే వేరే దేవతలను కూడా సృష్టించగలడు."

బృహస్పతి చెప్పిన ఆ మాటలు విని, దేవతలందరూ కలిసి త్రితుడు యజ్ఞం చేస్తున్న చోటికి వెళ్ళారు. దేవతలు త్రితుడున్న బావి దగ్గరకు పోయి యజ్ఞకర్మలో దీక్ష పూనియున్న ఆ మహాత్ముని చూశారు. పరమతేజస్సుతో నున్న ఆ మహాత్ముని చూసి "మేము భాగాన్నికోరి వచ్చాం" అని ఆ మహాభాగునితో అన్నారు. అప్పుడు ఆ ఋషి "దేవతలారా! నన్ను చూడండి. ఈ భీకరరూపంలో చైతన్యమెరుగక పడిఉన్నాను" అన్నాడు. ఆపై త్రితుడు యథావిధిగా, మంత్ర సహితంగా, వారికి యాగభాగాల నిచ్చాడు. అప్పుడు వారు ఆనందించారు. దేవతలు ప్రీతమనస్కులై ఆ త్రితుడు కోరుకున్న వరాలను ఇవ్వడానికి సిద్ధపడ్డారు. అప్పుడు త్రితుడు అక్కడ నుండి తనను కాపాడాలని కోరాడు. అలాగే ఆ కూపంలోని నీటిని త్రాగినా, తాకినా సోమపాన ఫలితాన్ని పొందేటట్లు వరమివ్వాలని కోరాడు. రాజా! అక్కడ సరస్వతీ నది అలలతో ఉప్పొంగింది. ఆ పొంగుతో త్రితుడు దేవతలను పూజిస్తూ పైకి వచ్చాడు. 'అలాగే' అని వరమిచ్చి దేవతలు వచ్చినదారినే వెళ్ళిపోయారు. అప్పుడు త్రితుడు కూడా ఆనందంతో తన ఇంటికి వచ్చాడు.

అప్పుడు మహాతపస్వి అయిన త్రితుడు తన సోదరుల దగ్గరకు వచ్చి పరుషవచనాలతో ఇలా శపించాడు. "పశులోభంతో మీరు నన్ను వీడి పారిపోయి వచ్చారు. కాబట్టి ఈ పాపకర్మ ఫలితంగా, నాశాపంతో మీరు తోడేళ్ళుగా మారిపోతారు. దంతాలతో అటూ ఇటూ సంచరిస్తుంటారు. మీకు సంతానరూపంలో కొండముచ్చులు, ఎలుగుబంట్లు, కోతులే పుడతాయి." రాజా! ఆ త్రితుడు అలా అనగానే ఆ సత్యవాది మాటను బట్టి క్షణంలో వారు తోడేళ్ళయి కనిపించకుండా పోయారు. బలరాముడు అక్కడ కూడా నీటిని స్పృశించి, బ్రాహ్మణులను అర్చించి, వివిధ ధనాలను దానం చేశాడు. బలరాముడు నదిలోని ఉదపాన తీర్థాన్ని చూసి, దానిని మాటిమాటికీ ప్రశంసించి, అక్కడనుండి వినశనతీర్థాన్ని చేరాడు.

37. సారస్వతోపాఖ్యానము - 1.

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'ఆపై హలాయుధుడు వినశన తీర్థానికి వెళ్ళాడు. అక్కడ శూద్రులపై, ఆభీరులపై ద్వేషంతో సరస్వతీ నది అదృశ్యమైంది. అందువలన ఋషులు ఎప్పుడూ దానిని వినశన అన్నారు. మహాబలుడైన బలరాముడు అక్కడకూడా సరస్వతీ తీరంలోని నీటిని స్పృశించి, అక్కడ నుండి ఆ సరస్వతీ తటంలోనే ఉన్న సుభూమిక తీర్థానికి వెళ్ళాడు. అక్కడ ఎప్పుడూ తెల్లగా నిర్మలవదనాలతో మున్న అచ్చరలు అలసట లేకుండా వివిధ నిర్మల క్రీడలను ఆడుతుంటారు. దేవతలు గంధర్వులతో సహా ప్రతిమాసం పుణ్యప్రదమైన ఆ తీర్థానికి వస్తుంటారు. రాజా! గంధర్వులు అప్సరోగణాలు కలిసి, అక్కడకు వచ్చి, సుఖపూర్వకంగా సంచరిస్తూ, అక్కడ కనిపిస్తారు. అక్కడ దేవతలు, పితరులు పూపొదరిండ్లలో ఆనందిస్తారు. వారిపై ఎప్పుడూ అదే పనిగా పవిత్రదివ్య కుసుమాలు కురుస్తుంటాయి. రాజా! శ్రేష్ఠమైన సరస్వతీ తీరంలోనున్న ఆ శుభప్రదమైన నేల అచ్చరలకు క్రీడావేదిక. అందుకే సుభూమిక అని దానిపేరు. బలరాముడు అక్కడ స్నానం చేసి, బ్రాహ్మణులకు ధనదానం చేసి, ఆ దివ్యగీతాన్ని, వాద్యాల ధ్వనినీ విని, దేవగంధర్వరాక్షసుల వివిధ విగ్రహాలు చూసి, ఆ తరువాత గంధర్వ తీర్థానికి వెళ్ళాడు. తపస్సంపన్నులైన విశ్వావసువు మొదలయిన గంధర్వులు అక్కడ ఎంతో మనోరంజకంగా నృత్యాలు చేస్తారు. వాద్యాలు వాయిస్తారు. గానం చేస్తారు. అక్కడ బలరాముడు బ్రాహ్మణులకు గొర్రెలు, మేకలు, గోవులు, గాడిదలు, ఒంటెలు, బంగారం, వెండి - ఇలా వివిధ ధనాలను దానం చేసి, ఇష్టభోజనాలు పెట్టించి, మహాధనాలతో వారిని సంతృప్తి పరిచి, ఆ విప్రుల ప్రస్తుతుల నందుకొంటూ బ్రాహ్మణులతోపాటు బయలుదేరాడు.

ఏకకుండలధారి అయిన బలరాముడు ఆ గంధర్వతీర్థం నుండి బయలుదేరి, మహాతీర్థమైన గర్గస్రోతస్సుకు వెళ్ళాడు. అక్కడ తపస్సుచే పవిత్రాంతఃకరణుడై వృద్ధుడైన గర్గముని ఉన్నాడు. ఆయన కాలజ్ఞానం, కాలగతి, గ్రహనక్షత్రాల ప్రాతికూల్యం, ఉత్పాతాలు, దారుణాలు, శుభాలు ఆన్నీ తెలిసిన మహాత్ముడు. సరస్వతీ నది యొక్క శుభకరమైన తీర్థం ఆయన నివాసం. ఆయన పేరు మీదనే దానికి గర్గస్రోతస్సు అని వ్యవహారం. రాజా! సువ్రతులైన ఋషులు అక్కడ గర్గుని కాలజ్ఞానం కోసం ఎప్పుడూ సేవిస్తుంటారు. బలరాముడు అక్కడకు వెళ్ళి, పవిత్ర హృదయులైన మునులకు యథావిధిగా ధనాన్ని దానం చేసి, గొప్ప గొప్ప భక్ష్యాలను విప్రులకు సమర్పించాడు. ఆ మహాయశస్వి అక్కడనుండి **శంఖతీర్థం** వెళ్ళాడు. బలరాముడు ఆ సరస్వతీ నదీ తీరంలో మహాశంఖమనే చెట్టును చూశాడు. అది మేరుపర్వతంవలె ఉన్నతమైనది. శ్వేతపర్వతం వలె కాంతిమంతం. ఋషి సమూహాలు దాన్ని సేవిస్తుంటారు. యక్షులు, విద్యాధరులు, అమితబలం గల రాక్షసులు, అమితశక్తి గల పిశాచాలు, వేలకొలదిగ సిద్ధులు అక్కడున్నారు. వారందరూ కూడా ఆహారాన్ని వీడి, వ్రతనియమాలతో నిలిచి, అప్పుడప్పుడు ఆ చెట్టు పండ్లనే తింటుంటారు. వారు తాము స్వీకరించిన నియమాల ననుసరించి, విడివిడిగా మనుష్యులకు కనిపించకుండా తిరుగుతుంటారు. ఈ రీతిగా ఆ చెట్టు లోకంలో ప్రసిద్ధి చెందింది. ఆ వృక్షం సరస్వతీ తీరంలో లోకప్రసిద్ధమైన పవిత్రతీర్థం. ఆ తీర్థంలో బలరాముడు పాలిచ్చే గోవులను, రాగి పాత్రలను, లోహ పాత్రలను, వివిధ వస్త్రాలను దానం చేసి, ద్విజులను పూజించి, తపోధనుల పూజలనందుకొన్నాడు.

రాజా! ఆ తరువాత బలరాముడు పవిత్రమైన ధ్వైతవనానికి వచ్చాడు. అక్కడకు వచ్చి, వివిధ వేషాలు ధరించిన మునులను చూసి, బలరాముడు నీటిలో మునిగి, బ్రాహ్మణులను పూజించాడు. రాజా! ఎప్పటివలె అక్కడ బ్రాహ్మణులకు విరివిగా భోగసామగ్రిని దానం చేసి, అక్కడనుండి సరస్వతీనదికి దక్షిణపు ఒడ్డున బలరాముడు యాత్ర కొనసాగించాడు. బలరాముడు కొంతదూరం నడిచి దగ్గరలోనే ఉన్న **వాగధన్వ తీర్థానికి** చేరాడు. అది నాగరాజు అయిన వాసుకి నివాసస్థానం. చుట్టూ ఎన్నో పాములుంటాయి. పదునాలుగు వేలమంది మహర్షులు అక్క డెప్పుడూ నివసిస్తుంటారు. దేవతలు అక్కడకు వచ్చి సర్పశ్రేష్ఠుడైన వాసుకిని పాములన్నింటికీ రాజుగా యథావిధిగా అభిషేకించారు. అక్కడ పాములవలన భయం లేదు. బలరాముడు అక్కడ కూడా యథావిధిగా బ్రాహ్మణులకు రత్నసమూహాలను దానం చేసి, అక్కడనుండి తూర్పు దిక్కుకు బయలుదేరాడు. అక్కడ పదే పదే వివిధ తీర్థాలు ఒక లక్షవరకు ఉన్నాయి. అక్కడి తీర్థాలలో స్నానమాడి,

అక్కడున్న మహర్షులు చెప్పినట్లు ఉపవాసనియమాలను పాటించి, అన్ని విధాల దానాలను ఇచ్చి, అక్కడ తీర్థాలలో నివసిస్తున్న మునులకు నమస్కరించి, వారు చెప్పిన దారిలో మరల బయలుదేరాడు. గాలికి దిశమారిన వృష్టివలె సరస్వతి మరల ప్రాఙ్ముఖంగా ప్రవహిస్తున్నవైపు ప్రయాణం సాగించాడు. బలరాముడు అక్కడ నదీమతల్లి అయిన సరస్వతిని చూసి, ఆశ్చర్యానికి లోనయ్యాడు. అక్కడ సరస్వతి నైమిశారణ్య వాసులై, మహాత్ములైన మునుల దర్శనానికై వెనుదిరిగి తూర్పుదిక్కుగా ప్రవహిస్తోంది.

జనమేజయుడిలా అడిగాడు. 'అధ్వర్యుశ్రేష్ఠా! సరస్వతీ నది ఏకారణంగా వెనుదిరిగి తూర్పుదిక్కుగా ప్రవహించింది? దానిని వివరించవలసినదిగా కోరుతున్నాను. ఏ కారణంగా బలరాముడు అక్కడ ఆశ్చర్యానికి లోనయ్యాడు? ఏ కారణంగా, ఏవిధంగా సరస్వతి వెనుదిరిగింది ?' వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'పూర్వకాలంలో పండ్రెండు సంవత్సరాల పాటు సాగే సుదీర్ఘ యజ్ఞం ప్రారంభమైంది. నైమిశారణ్యంలో తపస్సు చేసికొనే ఋషులందరూ ఆ యాగానికి వెళ్ళారు. నైమిశారణ్యవాసుల ఆ ద్వాదశవార్షిక సత్రయాగంలో మహాభాగులైన మునులు చిరకాల మున్నారు. ఆ యాగం ముగిసిన తర్వాత తీర్థసేవన కోసం ఎందరో ఋషులు అక్కడకు వచ్చారు. రాజా! ఋషుల సంఖ్య ఎక్కువైనందువలన ఆ సరస్వతికి దక్షిణతీరంలోని రేవులు నగరాలుగా మారిపోయాయి. నరోత్తమా! ఆ ద్విజశ్రేష్ఠులు తీర్థాన్ని సేవించాలన్న ఆశతో సమంతపంచకందాకా ఆ నదీతీరంలో నిలిచారు. పవిత్ర హృదయులైన ఆ మునులు అక్కడ హోమాలు చేస్తూ, స్వాధ్యాయం చేస్తుంటే ఆ మహాధ్వనితో దిక్కులన్నీ నిండిపోయాయి. ఆ మహాత్ములు చేస్తున్న అగ్నిహోత్రాలు అంతటా ప్రజ్వలిస్తుంటే ఆ నదీమతల్లి ఎంతో శోభించింది.

మహారాజా! అక్కడి తాపసులలో వాలఖిల్యులు, అశ్మకుట్టులు (రాళ్ళతో పగలగొట్టిన పండ్లు తినేవారు), దంతోలూఖలు (దంతాలనే రోళ్లుగా చేసికొన్నవారు), ప్రసంఖ్యానులు (లెక్కపెట్టి తినేవారు), వాయుభక్షులు, జలాహారులు, పర్ణభక్షులు ఉన్నారు. వారు అనేక నియమాలతో కూడి, అరుగులమీదనే పడుకొనేవారు. ఆ మునులంతా సరస్వతీ సమీపంలోనే ఉంటూ దేవతలు గంగను శోభింపజేసినట్లు ఆ నదీమతల్లికి శోభ తెచ్చేవారు. సత్రయాగంలో పాలు పంచుకొన్న ఋషులు వందల కొలదిగ అక్కడ గుమిగూడారు. మహావ్రతులైన వారికి సరస్వతీ తీరంలో ఉండటానికి చోటు కూడా దొరకలేదు. ఆపై యజ్ఞోపవీతాలతోనే వారు ఆ తీర్థాన్ని కొలిచి, అగ్నిహోత్రహోమాలు చేస్తూ, వివిధ కర్మలను ఆచరించారు. ఆపై నిరాశకు లోనై చింతిస్తున్న ఆ ఋషి సమూహానికి సరస్వతి స్వయంగా దర్శనమిచ్చింది. పుణ్యతపస్వులైన ఋషులమీద కరుణతో ఎన్నో తీర్థాలను కల్పిస్తూ, సరస్వతి వెనుదిరిగింది.

ఆ మహర్షులకోసం వెనుదిరిగి ఆ నదీమతల్లి - సరస్వతి మరల పడమటి దిశగా ప్రవహించింది. రాజా! 'ఈ మహర్షులరాకను సఫలంచేసి మరల పడమటి దిక్కుకే ప్రవహిస్తాను' అని భావించి ఆ మహానది ఆ అద్భుతకర్మను చేసింది. ఆ రీతిగా ఆ రేవు నైమిశనామంతో ప్రసిద్ధికెక్కింది. కురుశ్రేష్ఠా! నీవు కూడా కురుక్షేత్రంలో మహాక్రియను చేయి. అక్కడ ఎన్నో రేవులను, వెనుదిరిగిన సరస్వతిని చూసి బలరాముడు విస్మయానికి లోనయ్యాడు.

రాజా! యదునందనుడైన బలరాముడు అక్కడకూడా యథావిధిగా స్నానాచమనాదులు ముగించి, వివిధ భాండాలను, ధనాలను బ్రాహ్మణులకిచ్చి, వివిధ భక్ష్యాలనూ, భోజ్యాలనూ వారికి సమర్పించి, ఆ బ్రాహ్మణుల పూజలనందుకొంటూ బలరాముడు అక్కడనుండి బయలుదేరాడు. ఆ తరువాత హలాయుధుడు సరస్వతీ తీర్థాలన్నింటిలో శ్రేష్ఠమైన **సప్తసారస్వత** తీర్థాన్ని చేరాడు. అక్కడ వివిధ బ్రాహ్మణగణాలు నివిసిస్తుంటాయి. రేగు, ఇంగుదం, గుమ్మిడి, జువ్వి, రావి, తాండ్ర, కంకోలం, మోదుగ, వెదురు, పీలువు, కరూషం, బిల్వం, మామిడి, అతిముక్తం, పారిజాతం, అరటి - ఇంకా వివిధ వృక్షాలు ఆ సరస్వతీ నదీ తీరంపై చూడముచ్చటగా కనిపిస్తున్నాయి. అనేక మునులు అక్కడున్నారు. వారిలో వాయుభక్షులు, జలభక్షులు, ఫలభక్షులు, పర్ణ భక్షులు, దంతోలూఖలికులు, అశ్మకుట్టులు, వానప్రస్థులు కూడా ఉన్నారు. స్వాధ్యాయఘోష అక్కడ ధ్వనిస్తోంది. వందలకొలది మృగసమూహాలతో వ్యాకులమై ఉంది. ధర్మాసక్తులై, హింసకు దూరమైన నరులు ఎందరో అక్కడ ఆ తీర్థాన్ని సేవిస్తున్నారు. అక్కడ మంకణకుడనే మహాముని తపస్సు చేశాడు.'

38. సారస్వతోపాఖ్యానము - 2.

జనమేజయుడు అడిగాడు. 'సప్తసారస్వతమనే పేరు దేనివలన వచ్చింది ? మంకణక మహర్షి ఎవరు ? ఆ పూజ్యుడెలా సిద్ధిపొందాడు? ఆయన నియమ మెటువంటిది ? ద్విజోత్తమా! మంకణకముని ఎవరి వంశంలో పుట్టాడు? ఏం చదివాడు ? దీనిని యథాతథంగా వినగోరుతున్నాను?" వైశంపాయనుడిలా చెప్తున్నాడు. "రాజా! సరస్వతి పేరుతో మరో ఏడు నదులున్నాయి. అవి విశ్వమంతా వ్యాపించి ఉన్నాయి. బలవంతులైన వారు ఎక్కడకు ఆహ్వానిస్తే అక్కడకవి వెళ్ళాయి. అవి **సుప్రభ, కాంచనాక్షి, విశాల, మనోరమ, సరస్వతి ఓఘవతి, సురేణువు, విమలోదక.** మహాత్ముడైన పితామహుడు ఒకప్పుడు మహాయాగాన్ని

చేస్తున్నాడు. విశాలమైన యజ్ఞవాటికలో సిద్ధులైన బ్రాహ్మణు లున్నారు. పవిత్రపుణ్యాహఘోషలతో, వేదనాదాలతో యజ్ఞవాటి ధ్వనిస్తోంది. అప్పుడు దేవతలు కూడా ఆ యాగవిధిలో నిమగ్నులై ఉన్నారు. అక్కడ పితామహుడు యజ్ఞదీక్షతో నున్నాడు. ఆయన ఆ యాగం నిర్వహిస్తుంటే అందరి కోరికలు సిద్ధిస్తున్నాయి. రాజేంద్రా! ధర్మార్థ వేత్తలయిన బ్రాహ్మణులు అక్కడ మనసా భావించిన కోరికలు అక్కడికక్కడే తీరసాగాయి. అక్కడ గంధర్వులు గానం చేస్తున్నారు. అచ్చరలు నాట్యమాడుతున్నారు. అక్కడ దివ్యవాద్యాలు వేగంగా మ్రోగుతున్నాయి. ఆ యజ్ఞసంపత్తితో దేవతలు కూడా సంతసించారు. పరమాశ్చర్యానికి లోనయ్యారు. ఇక మానవుల విషయం చెప్పేదేముంది ? పితామహుడు పుష్కరంలో నిలిచి ఆ మహా యజ్ఞాన్ని నిర్వహిస్తుండగా ఋషులు "ఈ యజ్ఞం అంతగొప్పదేమీ కాదు. నదీమతల్లి అయిన సరస్వతి ఇక్కడ లేదు గదా!" అని ఆయనతో అన్నారు. అది విని పితామహుడు ఆనందించి, సరస్వతిని స్మరించాడు. పుష్కరంలో యాగాన్ని నిర్వహిస్తూ సరస్వతిని ఆవాహన చేశాడు. అక్కడ **సుప్రభ**పేరుతో సరస్వతి కనిపించింది. ఎంతో వేగంగా వచ్చి పితామహుని సత్కరిస్తున్న ఆ సరస్వతిని చూసి, మునులు ఆనందించారు. యాగాన్ని గొప్పగా భావించారు. ఈ రీతిగా నదీమతల్లి అయిన సరస్వతి పుష్కరతీర్థంలో బ్రహ్మకోసం, మనీషుల ఆనందం కోసం ప్రకటమైంది. నైమిశారణ్యంలో అనేక మునులు సమావేశమయ్యారు. వారు వేదవిషయంలో విచిత్రకథలను చెప్పుకొనసాగారు. వివిధ స్వాధ్యాయవేత్తలయిన అక్కడున్న మునులు వచ్చి సరస్వతిని స్మరించారు. అక్కడ సత్రయాగంలో పాలుపంచుకొంటూ వచ్చిన మునులు ధ్యానించగా ఆ మహాత్ములకు సహకరిద్దామని సరస్వతి అక్కడకు వచ్చింది. భారతా! ఆ నైమిశారణ్యంలో సత్రయాజులైన మునుల సన్నిధికి వచ్చిన ఆ నదీమతల్లి **కాంచనాక్షి** అనే పేరుతో సత్కృతులనందింది. గయుడు గయలో ఒక మహాక్రతువును అనుష్ఠిస్తూ, నదీమతల్లి అయిన సరస్వతిని ఆహ్వానించాడు. ఆ గయుని యజ్ఞానికి వచ్చిన సరస్వతిని వ్రతపాలనశీలులైన మునులు **'విశాల'** అన్నారు. భారతా! ఉద్దాలకుడు యాగం చేస్తున్న సమయంలో ఆ యజ్ఞానికి సరస్వతిని ఆహ్వానించాడు. శీఘ్రగామిని అయిన సరస్వతి హిమాలయం నుండి వెలువడి, యజ్ఞందగ్గరకు వచ్చింది. ఉత్తర కోసలభాగంలో అన్నివైపులనుండి మునిమండలం సమావిష్టమైనపుడు ఉద్దాలకుడు యాగం చేస్తూ గతంలో సరస్వతిని ధ్యానించాడు. ఆ ముని కారణంగా నదీమ తల్లి అక్కడకు వచ్చింది. అక్కడ ముని గణాల పూజల నందుతూ ఆ నది **మనోరమ** అని వ్యవహరింపడింది. మునులు ఆమెను మనసా ధ్యానించారు కాబట్టి ఆపేరు. ఋషభద్వీపంలో కురుక్షేత్రంలో మహాత్ములైన కురువు

యాగం చేస్తున్నప్పుడు నదీమతల్లి అయిన ఆ సరస్వతి వచ్చింది. ఆమె పేరు **సురేణువు.** రాజేంద్రా! గంగాద్వారంలో యాగం చేస్తూ దక్షప్రజాపతి స్మరించినప్పుడు కూడా వేగంగా వచ్చిన సరస్వతీ నదికి సురేణు వనిపేరు. మహాత్ముడైన వసిష్ఠుడు కురుక్షేత్రంలో దివ్యజలం గల సరస్వతిని ఆహ్వానించినప్పుడు అది **ఓఘవతి** అని పేరు పొందింది. పవిత్రమైన హిమగిరిపై బ్రహ్మ యాగాన్ని అనుష్ఠిస్తూ సరస్వతిని ఆహ్వానించాడు. అప్పుడు ఆ పూజ్య సరస్వతి అక్కడకు వచ్చింది. **విమలోద** అని వ్యవహరింపబడింది. ఆపై ఆ ఏడు సరస్వతులు ఒక్కటై అక్కడకు వచ్చాయి. కాబట్టి లోకంలో సప్తసారస్వతమని దానికి ప్రసిద్ధి. ఈ రీతిగా పేరుపేరునా సప్తసారస్వతులను గురించి వివరించాను. ఆలాగే పవిత్రమైన సప్తసారస్వత తీర్థాన్ని సంస్మరించాను. రాజా! కుమార బ్రహ్మచారియై, అనుదినమూ సరస్వతీ నదిలో, స్నానమాచరించిన మంకణకుని మహా క్రీడాత్మకమైన చరిత్ర చెపుతా విను.

మహారాజా! ఒకప్పుడు మంకణకుడు అనుకోకుండా సరస్వతీ జలంలో దిగంబరంగా స్నానం చేస్తున్న ఒకస్త్రీని చూశాడు. ఆమె అనింద్యరూపవతి. అందమైన కళ్ళు గలది. వీర్యస్ఖలనమై అది నీటిలోపడింది. ఆ మహాతపస్వి దానిని కలశంలోనికి తీసికొన్నాడు. అది కలశంలోనే ఏడు ముక్కలుగా మారింది. దానిలో నుండి ఏడుగురు ఋషులు పుట్టారు. వారు మరుద్గణాలకు చెందినవారు. వాయువేగుడు, వాయుహుడు, వాయుబలుడు, వాయుమండలుడు, వాయుజ్వాలుడు, వాయురేతసుడు, వాయుచక్రుడు అని వారిపేర్లు. మరుద్గణాలకు మూలపురుషులైన వీరు ఇలా జన్మించారు. రాజా! మూడులోకాలలోనూ ప్రసిద్ధికెక్కిన ఈ మహర్షి చరిత్ర అద్భుతమూ, ఆశ్చర్యకరమూ కూడా. ఒకప్పుడు సిద్ధుడైన మంకణకుని చేయి దర్భమొన తగిలి తెగింది. ఆ గాయం నుండి (రక్తానికి బదులు) శాకరసం స్రవించింది.

ఇది నేను విన్న విషయం. వీరా! ఆ శాకరసాన్ని చూసి, ఆనందంతో ఆ ముని నాట్యం చేశాడు. ఆ మంకణకుడు అలా నాట్యం చేస్తుండగా స్థావర జంగమాత్మకమైన విశ్వమంతా ఆయన తేజస్సుతో మోహానికి లోనై నాట్యమాడ సాగింది. రాజా! బ్రహ్మాది దేవతలు, తపోధనులైన మునులు ఆ ఋషిని గురించి "ఆయన నృత్యాన్ని ఆపాలి" అని మహాదేవునికి విజ్ఞప్తి చేశారు. ఆపై తీవ్రానందానికి లోనయి ఉన్న ఆ మునిని చూసి, మహాదేవుడు దేవతల హితాన్ని కోరుతూ, ఇలా అన్నాడు. 'ధర్మజ్ఞా! ఎందుకు నాట్యమాడుతున్నావు? మునీ ! నీకింత ఆనందం ఎందుకు కలిగింది? నీవు తపస్వివి ధర్మమార్గంలో ఉన్నవాడవు.' ఋషి ఇలా అన్నాడు. "బ్రాహ్మణా! కనిపించటం లేదా? నా

చేతి నుండి శాకరసం స్రవిస్తోంది. స్వామీ! దానిని చూసి మహానందంతో నాట్యమాడుతున్నాను." అప్పుడు రాగమోహితుడైన మునిని చూసి నవ్వి, మహాదేవుడు "విప్రా! నాకు ఆశ్చర్యం కలగటం లేదు. నన్ను చూడు" అన్నాడు. రాజేంద్రా! ముని సత్తమునితో అలా పలికి, ధీమంతుడైన మహాదేవుడు, తన వ్రేలికొనతో తన బొటనవ్రేలిని కొట్టాడు. రాజా! ఆ గాయం నుండి మంచువంటి బూడిద వెలికి వచ్చింది.

రాజా! అది చూసి ఆ ముని సిగ్గుపడి మహాదేవుని పాదాలపై బడి, ఆయనను మహాదేవునిగా గ్రహించి, ఆశ్చర్యంతో ఇలా అన్నాడు. "రుద్రదేవుని తప్ప, మరే దేవతను నేనూ పరాత్పరునిగా భావించను. సురాసురాత్మకమైన ఈ జగత్తుకు శూలధారియైన నీవే గతి. ఈ విశ్వమంతా నీ చేతనే సృష్టింపబడినదనీ, మరల యుగాంతవేళలో నీలోనే లీనమవుతుందనీ మనీషులు చెపుతారు. దేవతలు కూడా నిన్ను తెలిసికొనలేరు. ఇక నేనెంత ? లోకంలోని భావాలన్నీ నీలోనే కనిపిస్తాయి. అనఘా! బ్రహ్మాది దేవతలు కూడా వరదుడవైన నిన్నే ఉపాసిస్తారు. దేవతల సర్వస్వమూ - కర్త, కారయిత నీవే - నీ అనుగ్రహంవలననే దేవతలందరూ నిర్భయంగా ఆనందంగా మనగలుగుతున్నారు.

శంకరా! నీవు ప్రభువువు, పరమైశ్వర్యం వలన నీవు ఎంతో భాసిస్తున్నావు. బ్రహ్మ, ఇంద్రుడు కూడా లోకాలను ధరించి నీలోనే నిలిచి ఉంటారు. మహేశ్వరా! జగత్తుకు మూలం నీవే. నీలోనే జగత్తు ముగుస్తుంది. ఈ ఏడు లోకాలూ నీలోనే పుట్టి వ్యాపించి ఉన్నాయి. దేవతలు సర్వవిధాలా నిన్నే అర్చిస్తారు. స్థావర జంగమాత్మకమైన సర్వప్రాణులకూ నీవే ఉపాదానకారణం (ఆశ్రయం). అభ్యుదయాన్ని ఆకాంక్షిస్తూ కర్మపరాయణులైన మనుష్యుల కర్మలను ధ్యానయోగంతో భావించి వారికి పరమపదమైన స్వర్గాన్ని అందిస్తున్నావు. మహాదేవా! మహేశ్వరా! నీ అనుగ్రహం వ్యర్థంకాదు. కమలేక్షణా! నీవు అందించిన ఉపకరణాలతోనే నేనీ పని చేయగలుగుతున్నాను. అన్నివేళలా అంతటా ఉన్న శంభువును నిన్ను శరణుకోరుతున్నాను.'

ఆ రీతిగా మహాదేవుని స్తుతించి ఆ ముని తలవాల్చి ఇలా అన్నాడు. "దేవా! నేను చపలతతో అహంకారాన్ని ప్రదర్శించే పని చేశాను. అందువలన క్షమింప కోరుతున్నాను. నా తపస్సు నశించకుండా చూడవలసినది." దానితో ప్రీతమనస్కుడై మహాదేవుడు ఆ మునితో ఇలా అన్నాడు. "విప్రా! నా అనుగ్రహంతో నీ తపస్సు వేయిరెట్లు వర్ధిల్లుతుంది. నీతో కూడా నేను నిత్యమూ ఈ ఆశ్రమంలో నివసించగలను. ఈ సప్తసారస్వతంలో నన్ను అర్చించిన నరునకు ఇహపరలోకాలలో దుర్లభమన్నది కొంచెం కూడా ఉండదు. అర్చించిన వారు నిస్సందేహంగా సారస్వత లోకాన్ని చేరుతారు. ఇది మహాతేజస్వి అయిన మంకణకుని చరిత్ర. ఆయన వాయుదేవుని వలన సుకన్యకు పుట్టిన కొడుకు.'

39. సారస్వతోపాఖ్యానము - 3

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'హలాయుధుడైన బలరాముడు సప్తసారస్వతంలో వసించి, ఆశ్రమవాసులను పూజించి, మంకణకునిపై చక్కని ప్రీతిని ప్రదర్శించాడు. బలరాముడు ఆ రాత్రి అక్కడ గడిపి, ఉదయమే లేచి స్నానం చేసి, ద్విజాతులకు దానమిచ్చి, మునిసమూహాల పూజలనంది, మహర్షులందరి అనుమతి తీసుకొని, **ఔశనస** తీర్థానికి చేరాడు. ఆ తీర్థానికి **కపాలమోచనమని** మరొకపేరు. మహారాజా! గతంలో శ్రీరాముడు ఒక రాక్షసుని చంపి, శవాన్ని విసిరి వేశాడు. ఆ రాక్షసుని పెద్దతల మహోదరమహాముని పిక్కలకు తగుల్కొన్నది. ఆ ముని కపాలమోచనంలో స్నానంచేసి ఆ కపాలాన్ని విడిపించుకొన్నాడు. ఆ తీర్థంలో మహాత్ముడైన శుక్రుడు గతంలో తపస్సు చేశాడు. ఆ మహాత్ముని నీతి శాస్త్రమంతా ఇక్కడే పుట్టింది. అక్కడ ఉండియే శుక్రుడు దేవదానవ యుద్ధాన్ని గూర్చి ఆలోచించాడు. రాజా! బలరాముడు ఆ తీర్థాన్ని చేరి, మహాత్ములైన బ్రాహ్మణులకు యథావిధిగా దానాలు చేశాడు.' జనమేజయుడిలా అడిగాడు. "బ్రాహ్మణా! మహాముని అయిన మహోదరుడు శిరస్సును వదిలించుకొన్న ఆ తీర్థానికి కపాలమోచన మన్నపేరు ఎలా వచ్చింది ? అసలు ఆ తల అతని పిక్కపై ఎలా, ఎందుకు చిక్కుకొన్నది?"

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'గతంలో మహాత్ముడైన రాముడు దండ కారణ్యంలో నివసిస్తూ, రాక్షససంహారం చేస్తున్నప్పుడు జనస్థానంలో దురాత్ముడైన ఆ రాక్షసుని శిరస్సును పదునైన వాదరగల క్షురంతో ఖండించాడు. అది ఆ మహారణ్యంలో పైకెగసి, యాదృచ్ఛికంగా ఆ వనంలో సంచరిస్తున్న మహోదరుని పిక్కకు తగిలింది. అతని ఎముకను ఖండించి, లోపలదాకా వెళ్ళింది. అది అలా పిక్కలో దూరగా మహాప్రాజ్ఞుడైన ఆ బ్రాహ్మణుడు తీర్థాలకు కానీ, దేవాలయాలకు కానీ వెళ్ళలేకపోయాడు. ఆ తలకుళ్ళి దుర్గంధంతో కారసాగింది. ఆ మహాముని వేదనకు గురి అయ్యాడు. అలాగే లోకంలోని అన్ని తీర్థాలకు వెళ్ళాడని విన్నాం. మహోదరుడు సర్వనదులకు, సముద్రాలకు వెళ్ళి, అక్కడున్న పవిత్రహృదయులైన మునులకందరికీ ఆ విషయాన్ని చెప్పాడు. సర్వతీర్థాలలో స్నానం చేసినా ఆ కపాలాన్ని వదిలించుకోలేకపోయాడు. ఆ బ్రాహ్మణోత్తముడు **ఔశనతీర్థంగా** ప్రసిద్ధికెక్కిన సరస్వతీ తీర్థం సర్వపాపవినాశక మనీ, గొప్ప సిద్ధిక్షేత్ర మనీ మునులు చెప్పగా విన్నాడు. ఆ తరువాత ఆ బ్రాహ్మణుడు ఔశనస తీర్థానికి వెళ్ళాడు. ఆ ఔశనస తీర్థంలో ఆచమించి, స్నానం చేశాడు. అంతలోనే ఆ రాక్షసుని తల

కాలినుండి జారి, నీళ్ళలో పడింది. ఆ కపాలం నుండి విముక్తినంది, ఆ ముని సుఖించాడు. ఆ తల కూడా నీళ్ళలో మునిగి కనిపించకుండా పోయింది. ఆ మహోదరుడు కపాలాన్ని వదిలించుకొని పాపవిముక్తుడై పవిత్రుడై, కృతకృత్యుడై ఆనందంగా ఆశ్రమానికి వచ్చాడు. ఆశ్రమానికి వెళ్ళి, నిర్మల హృదయులైన ఋషులకు ఆ వృత్తాంతాన్ని చెప్పాడు. వారు అందరూ కలిసి ఆ తీర్థానికి **కపాలమోచనమని** పేరు పెట్టారు. ఆ మహర్షి మరల ఆ శ్రేష్ఠతీర్థానికి వెళ్ళి, అక్కడున్న నీటిని కడుపునిండా త్రాగి, సిద్ధిని పొందాడు. బలరాముడు అక్కడ బహుళధనాలను దానం చేసి, విప్రులను పూజించి, ఆపై రుషంగుని ఆశ్రమానికి వెళ్ళాడు.

భారతా! ఆ రుషంగుని ఆశ్రమంలోనే ఆర్ష్టిషేణుడు ఘోర తపస్సు చేశాడు. మహాముని అయిన విశ్వామిత్రుడు అక్కడే బ్రాహ్మణత్వాన్ని పొందాడు. రాజా! ఆ మహాశ్రమం కోరిన వస్తువులతో సమృద్ధమైనది. ఎప్పుడూ మహర్షులు, బ్రాహ్మణులూ దానిని సేవిస్తారు. రాజేంద్రా! ఆపై శ్రీమంతుడైన బలరాముడు తన చుట్టూ బ్రాహ్మణులు నిలువగా రుషంగుముని తనుత్యాగం చేసిన ఆ ఆశ్రమానికి వెళ్ళాడు. భారతా! రుషంగుడు బ్రాహ్మణుడు, వృద్ధుడు, నిత్యమూ తపస్సు చేసేవాడు. ఆ మహాతపస్వి దేహత్యాగం మీద మనస్సు నిలిపి, అప్పుడు అనేకరీతుల ఆలోచించి, కొడుకులనందరినీ పిలిపించి, "నన్ను పృథూదక తీర్థం దగ్గరకు తీసికొనిపొండి" అని అన్నాడు. తపోధనులైన ఆ కుమారులు రుషంగునికి వయస్సు మీదపడినదని గ్రహించి, ఆ తపోధనుని సరస్వతీ తీర్థానికి కొనిపోయారు. ఆ మహాతపస్వి అక్కడ యథావిధిగా మునిగి, తీర్థగుణాలను కూడా గ్రహించి, పరమానందపడి, తనను సేవిస్తున్న కుమారులందరితో ఇలా అన్నాడు. "సరస్వతీ నదికి ఉత్తరతీరంలో పృథూదకంలో జపిస్తూ, తనుత్యాగం చేసినవాడు, భవిష్యత్తులో మరణతాపాన్ని పొందడు". విప్రవత్సలుడు, ధర్మాత్ముడైన బలరాముడు అక్కడ మునిగి, స్నానం చేసి బ్రాహ్మణులకు అనేక ధనాలను దానం చేశాడు. ఆపై బలరాముడు లోకపితామహుడైన బ్రహ్మ లోకాలను సృష్టించిన చోటు మునిసత్తముడైన ఆర్ష్టిషేణుడు వ్రతపాలనతో, తీవ్ర తపస్సుతో బ్రాహ్మణత్వాన్ని పొందినచోటు, రాజర్షి అయిన సింధుద్వీపుడు మహాతపస్వి అయిన దేవాపి, ఉగ్రతేజస్వి అయిన విశ్వామిత్రుడు బ్రాహ్మణత్వాన్ని పొందినచోటు చేరాడు.'

40. పారస్వతోపాఖ్యానము - 4.

జనమేజయుడిలా అడిగాడు. పూజ్యుడైన ఆర్ష్టిషేణుడు విపుల తపస్సు నెలా చేశాడు? ఆ సమయంలో సింధుద్వీపుడు ఎలా బ్రాహ్మణత్వాన్ని పొందాడు. దేవాపి, విశ్వామిత్రుడు, ఎలా బ్రహ్మత్వాన్ని పొందారు? అది నాకు వివరించు. ఎంతో కుతూహలంగా ఉంది". వైశంపాయనుడిలా చెప్తున్నాడు. "రాజా! పూర్వం కృతయుగంలో ద్విజోత్తముడైన ఆర్ష్టిషేణుడు గురుకులంలో నివసిస్తూ నిత్యమూ అధ్యయనాసక్తితో ఉండేవాడు. అయినా అతనికి విద్య కానీ, వేదాలు కానీ పూర్తిగా అబ్బలేదు. రాజా! అప్పుడు అతడు నిరాశవడి మహాతపస్సు చేశాడు. ఆ తపస్సుతో ఆర్ష్టిషేణుడు ఉత్తమవేదాలను పొందాడు. ఆ ఋషి సత్తముడు పండితుడై, వేద వేత్తయై, సిద్ధుడై ఆ తీర్థానికి మూడు వరాలనిచ్చాడు. "మహానది అయిన సరస్వతీ తీర్థంలో స్నానం చేసినవాడు ఇకనుండి అశ్వమేధ యాగ ఫలితం పుష్కలంగా పొందుతాడు. ఇప్పటినుండి ఇక్కడ సర్పభయం ఉండదు. స్వల్పకాలంలోనే పుష్కలమయిన ఫలం లభిస్తుంది." మహాతేజస్వి అయిన మహర్షి ఇలా చెప్పి స్వర్గానికి వెళ్లిపోయాడు. ప్రతాపశాలి అయిన ఆర్ష్టిషేణుడు ఇలా సిద్ధిపొందాడు. మహారాజా! ఆ కాలంలోనే ప్రతాపశాలి అయిన సింధు ద్వీపుడు, దేవాపి కూడా బ్రాహ్మణత్వం పొందారు. అలాగే నిత్యతపస్వి, జితేంద్రియుడు అయిన కౌశికుడు చక్కని తపస్సు చేసి, బ్రాహ్మణత్వం పొందాడు.

రాజా! భూలోకంలో ప్రసిద్ధికెక్కిన గాధి అనే క్షత్రియుడు ఉండేవాడు. అతని కొడుకు విశ్వామిత్రుడు. అతడే కౌశికుడు - మహాయోగి అయ్యాడు. మహాతపస్వి అయిన గాధి తనకొడుకయిన విశ్వామిత్రుని రాజ్యాభిషిక్తుని చేసి, తాను దేహత్యాగం చేయాలనుకొన్నాడు. అపుడు ప్రజలు ఆతనిని చేరి నమస్కరించి, "మహాప్రాజ్ఞా! మీరు వెళ్లవద్దు. మమ్ములను ఈ మహాభయం నుండి రక్షించండి" అన్నారు. అపుడు గాధి ప్రజలతో ఇలా అన్నాడు. "నా కుమారుడు జగత్తు నంతటినీ రక్షిస్తాడు" ఇలా అని; విశ్వామిత్రుని రాజుగా నిలిపి స్వర్గానికి వెళ్లిపోయాడు. విశ్వామిత్రుడు రాజయ్యాడు. అతడెంత ప్రయత్నంచేసినా రాజ్యాన్ని రక్షించలేకపోయాడు. పైగా రాక్షసుల నుండి మహాభయం కలుగుతోందని విన్నాడు. అతడు నగరంనుండి చతురంగబలాలతో బయలుదేరి, చాలా దూరం వెళ్లి వసిష్ఠాశ్రమం చేరాడు. ఆ విశ్వామిత్రుని సేనలు అక్కడ ఎన్నో అకృత్యాలను చేశారు. ఆపై పూజ్యబ్రాహ్మణుడైన వసిష్ఠుడు ఆశ్రమానికి వచ్చాడు. పూర్తిగా భంగపడిఉన్న ఆ మహావనాన్ని చూశాడు. దానితో మునిసత్తముడైన వసిష్ఠుడు కోపించాడు. "భీకరులైన శబరులను సృష్టించు" అని తన ధేనువుతో చెప్పాడు.

వసిష్ఠుడలా చెప్పగానే ఆ ధేనువు భీకరస్వరూపులైన పురుషులను సృష్టించింది. వారు విశ్వామిత్రుని సేనపై అన్నిదిక్కులనుండి దాడిచేసి, భంగపరిచారు. గాధిసుతుడైన విశ్వామిత్రుడు తనసేన పారిపోయినదని తెలిసికొని, తపస్సునే గొప్పదిగా భావిస్తూ, తపస్సుపై మనస్సు పెట్టాడు. రాజా! ఆ విశ్వామిత్రుడు సరస్వతీ తీరమందలి ఈ శ్రేష్ఠతీర్థంలో నియమోపవాసాలతో తన దేహాన్ని కృశింపజేయసాగాడు. విశ్వామిత్రుడు జలాహారుడు, వాయుభక్షుడు, పర్ణాహారుడు అయ్యాడు. అలాగే అరుగులమీదనే పడుకొనేవాడు. ఇతర నియమాలను కూడా విడివిడిగా పాటించేవాడు. దేవతలు మాటిమాటికీ ఆయన నియమాలకు విఘ్నాలు కల్పించారు. అయినా ఆ మహాత్ముని బుద్ధి నియమాలనుండి తొలగిపోలేదు. ఆపై తీవ్రప్రయత్నంతో, అనేకవిధాలయిన తపస్సులు చేసి విశ్వామిత్రుడు తేజస్సుతో సూర్యసమానుడయ్యాడు. ఆ రీతిగా తపోయుక్తుడైన విశ్వామిత్రుని చూసి, మహాతేజస్వి, వరదుడు అయిన బ్రహ్మ విశ్వామిత్రునకు వరమివ్వాలని భావించాడు. 'నేను బ్రాహ్మణుడను కావాలి' అని విశ్వామిత్రుడు వరమడిగాడు. సర్వలోకపితామహుడైన బ్రహ్మ అలాగే అన్నాడు. మహాయశస్వి అయిన విశ్వామిత్రుడు ఉగ్రతపస్సుతో బ్రాహ్మణత్వాన్ని పొంది, ఆశయాన్ని సిద్ధింపజేసికొని, దేవతాతుల్యుడై భూమండలమంతా సంచరించాడు. ఆ శ్రేష్ఠతీర్థంలో బలరాముడు వివిధధనాలను, పాలనిచ్చే గోవులను, వాహనాలను, శయ్యలను, వస్త్రాలను, అలంకారాలను, రుచికరమైన భక్ష్యపానీయాలను ఆనందంగా ఇచ్చాడు. రాజా! బ్రాహ్మణోత్తములను అర్చించి, బలరాముడు దగ్గరలోనే ఉన్న బకుని ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడే దాల్భ్యుడైన బకుడు తీవ్రతపస్సు చేశాడని జనశ్రుతి.'

41. సారస్వతోపాఖ్యానము - 5.

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'బ్రాహ్మణత్వాన్ని కల్పించే ఆ తీర్థంనుండి బలరాముడు అవాకీర్ణ తీర్థానికి వెళ్ళాడు. రాజా! అక్కడనే ఆశ్రమంలో నిలిచి మహాతపస్వి అయిన దల్భుని కొడుకు - బకుడు ప్రతాపవంతుడు, ధర్మాత్ముడై ఘోరతపస్సుతో తనదేహాన్ని కృశింపజేసి, తీవ్రక్రోధంతో విచిత్రవీర్యుని కుమారుడైన ధృతరాష్ట్రుని రాష్ట్రాన్ని హోమం చేశాడు. పూర్వకాలంలో నైమిశారణ్యవాసులైన ఋషులు పండ్రెండు సంవత్సరాలు సాగే యాగాన్ని ఆరంభించారు. అది ముగియగానే ఋషులు విశ్వజిద్యాగ సమాప్తివేళలో పంచాలదేశానికి వెళ్ళారు. అక్కడ అభిమానధనులైన వారు దక్షిణకై రాజును ధనాన్ని యాచించారు. అక్కడ ఆ మహర్షులు పంచాలుర నుండి ఇరవైయొక్క ఆవుదూడలను పొందారు. అవి రోగాలు లేనివి. బలిష్ఠాలు. దాల్భ్యుడైన బకుడు వారితో "మీరు ఈ

పశువులను పంచుకోండి. నేను వీటిని వీడి, మరో రాజుదగ్గర పశువులను యాచిస్తాను" అన్నాడు. బకుడు ఋషులందరితో అలా పలికి తాను ధృతరాష్ట్రుని భవనానికి వెళ్ళి పశువులను యాచించాడు. ధృతరాష్ట్రుడు కోపించి, అనుకోకుండా మరణించిఉన్న గోవులను చూపించి, ఆ రాజసత్తముడు "బ్రహ్మబంధూ! నీకిష్టమైతే వెంటనే ఈ పశువులను తీసికొనిపో" అన్నాడు. ధర్మవేత్త అయిన ఆ ఋషి అటువంటి మాటను విని "అయ్యో! సభలో ఈ రాజు ఎంత క్రూరంగా మాటాడాడు" అని చింతించాడు. ముహూర్తకాలం ఆలోచించి, రోషంతో నిండి, ఆ ద్విజోత్తముడు ధృతరాష్ట్రమహారాజును నాశనం చేయాలని తలచాడు.

ఆ మునిశ్రేష్ఠుడు ఆ మృత పశువులమాంసాన్ని ముక్కలు చేసి వాటితో ధృతరాష్ట్రమహారాజు రాష్ట్రానికి ఆహుతి చేయసాగాడు. మహారాజా! సరస్వతీతీరంలోని అవాకీర్ణ తీర్థంలో అగ్నిని ప్రజ్వలింపజేసి మహాతపస్వి, దల్భ సుతుడైన ఆ బకుడు పరమ నియమపరుడై ఆ మృతపశువుల మాంసపు ముక్కలతోనే ఆ రాష్ట్రాన్ని ఆహుతి చేయసాగాడు. ఆ దారుణమైన యాగం యథావిధిగా సాగుతుండగా, అప్పుడు ధృతరాష్ట్రుని రాజ్యం క్షీణించసాగింది. ఆ ధృతరాష్ట్రుని రాజ్యం క్షీణిస్తూ ఆపదలో పడింది. ఇబ్బందుల పాలయి నిస్తేజమయింది. అలా సంకటగ్రస్తమైన తన రాజ్యాన్ని చూసి, ధృతరాష్ట్రుడు వికలహృదయుడై విచారించాడు. బ్రాహ్మణులతో కలిసి ఆపదలనుండి బయటపడవేయటానికి ప్రయత్నించాడు. అయినా శ్రేయస్సు కనిపించలేదు. రాష్ట్రం క్షీణిస్తూనే ఉంది. దానితో ఆ రాజు, ఆ బ్రాహ్మణులు కూడా ఖిన్నులయ్యారు. ఎలాచేసినా రాజ్యానికి ఇబ్బందులనుండి విముక్తి కలగకపోవటంతో ధృతరాష్ట్రుడు ప్రశ్నజాతకులను పిలిపించి అడిగాడు. అప్పుడు ప్రాశ్నికులిలా చెప్పారు "పశువులను యాచించిన బకమునిని మీరు తిరస్కరించారు. దానితో ఆ పశువుల మాంసంతో ఆ ముని నీ రాజ్యాన్ని ఆహుతి చేస్తున్నాడు. ఆయన అలా హోమం చేస్తున్నందువలన నీ రాజ్యానికి ఇలా మహావినాశం సంభవించింది. ఇది ఆయన తపస్సు ప్రభావం దానివలననే నీ రాజ్యానికి మహాప్రళయం. రాజా! సరస్వతీ నదీ తీరంలోని కుంజంలోనున్న ఆయనను ప్రసన్నుని చేసికో."

ఆపై ధృతరాష్ట్రుడు సరస్వతీ నది దగ్గరకు వెళ్ళి బకునితో మాటాడాడు. తలను నేలకు తాకించి, చేతులు జోడించి ఇలా అన్నాడు. "స్వామీ! మీరు ప్రసన్నులు కావాలి. నా అపరాధాన్ని క్షమించాలి. లోభంతో, మూర్ఖత్వంతో బుద్ధిని కోల్పోయి తప్పు చేశాను. ఇప్పుడు దీనుడనైన నాకు తమరే గతి. తమరే దిక్కు. దయచూపండి." ఆ రీతిగా శోకంతో అచేతనంగా విలపిస్తున్న ఆ రాజును చూసి, బకుడు దయతో ఆయన

రాజ్యానికి విముక్తి కలిగించాడు. ఆ రాజుపై ప్రసన్నుడైన ముని, కోపాన్ని వీడి, ఆ ధృతరాష్ట్ర రాజ్యవిముక్తికై మరల ఆహుతుల నిచ్చాడు. ఆపై రాజ్యానికి విముక్తి కలిగించి, అనేక పశువులను ప్రతిగ్రహించి, ఆ బకుడు ఆనందించి, మరల నైమిశారణ్యానికి వెళ్ళిపోయాడు. ధృతరాష్ట్రుడు కూడా మనస్సులో కుదుటపడి మహాసమృద్ధి గల తన నగరానికి వెళ్ళిపోయాడు. మహారాజా! ఉదారబుద్ధిగల బృహస్పతి కూడా ఆ తీర్థంలో రాక్షసవినాశం, దేవతల అభ్యుదయం ఆశించి మాంసాలతో యాగం చేశాడు. దానితో అసురులు క్షీణించారు. విజయవిలాసం గల దేవతలు ఆ అసురులను భంగపరచగలిగారు. బలరాముడు ఆ తీర్థంలోకూడా యథావిధిగా బ్రాహ్మణులకు గుర్రాలను, ఏనుగులను, గాడిదలు పూన్చిన రథాలను, విలువయిన రత్నాలను, పుష్కలంగా ధనధాన్యాలను ఇచ్చి, అక్కడనుండి **యయాతి** తీర్థానికి వెళ్ళాడు.

మహారాజా! నహుషుని కొడుకు, మహాత్ముడూ అయిన యయాతి గతంలో అక్కడ యాగం చేశాడు. అప్పుడు సరస్వతి నేతిని, పాలను ప్రవహింపజేసింది. పురుషోత్తముడైన యయాతిరాజు అక్కడ యజ్ఞంచేసి ఆనందించి, ఊర్ధ్వలోకానికి వెళ్ళి, అక్కడ పుణ్యలోకాల నెన్నింటినో పొందాడు. సమర్థుడైన యయాతి మహారాజు యజ్ఞం చేస్తున్నప్పుడు ఆయన పరమౌదార్యాన్ని, తనపై గల స్థిరభక్తిని గమనించి, సరస్వతి అక్కడున్న బ్రాహ్మణులకు ఎవరు కోరినది వారికిచ్చింది. యయాతి యజ్ఞానికి ఆహ్వానంపై వచ్చిన బ్రాహ్మణులు ఎక్కడ నిలిస్తే అక్కడే నదీమతల్లి అయిన సరస్వతి విడిదిని, శయ్యాసనాదులను, షడ్రసభోజనాలను, వివిధ దానాలను కల్పించింది. వారంతా యయాతియే ఆ భూరిదానాలను ఇస్తున్నాడని భావించి, ఆనందించి, రాజుకు శుభాశీస్సులనిచ్చి స్తుతించారు. ఆ యజ్ఞసంపదతో దేవతలు, గంధర్వులు కూడా ఆనందించారు. మనుష్యులు ఆశ్చర్యానికి లోనయ్యారు. ఆపై బలరాముడు **వసిష్ఠాపవాహతీర్థానికి** వెళ్ళాడు. అక్కడ సరస్వతి మహాభయంకరంగా, వేగంగా ప్రవహిస్తుంది.'

42. సారస్వతోపాఖ్యానము - 6.

జనమేజయుడిలా అడిగాడు. "స్వామీ! వసిష్ఠాపవాహ తీర్థంలో సరస్వతీనది భీకరవేగాన్ని ఎలా పొందింది ? నదీమతల్లి అయిన సరస్వతి ఆ మహర్షిని ఎందుకు ప్రవహింపజేసింది? ఆయనతో వైరమెలా వీర్పడింది? ఎందుకు వీర్పడింది? మహాప్రాజ్ఞా! నేనడిగిన విషయాన్ని చెప్పు. నీ మాటలెంత విన్నా తృప్తికలగటం లేదు." వైశంపాయనుడిలా చెప్తున్నాడు. "భారతా! విశ్వామిత్రునకు, బ్రహ్మర్షి అయిన వసిష్ఠునకు మధ్య తీవ్రవైరముంది.

తపస్సులో పోటీ పడటం వలన ఆ మహాశత్రుత్వం కలిగింది. స్థాణు తీర్థంలో తూర్పుఒడ్డున వసిష్ఠాశ్రమముండేది. అది విశాలమైనది. పడమటి ఒడ్డున ధీమంతుడైన విశ్వామిత్రుని ఆశ్రమముండేది. మహారాజా! అక్కడ పరమేశ్వరుడు తీవ్రమైన తపస్సు చేశాడు. ధీమంతులు అక్కడ పరమశివుడు చేసిన ఘోరతపస్సు గురించి చెప్పుకొంటుంటారు. పూజ్యుడైన స్థాణువు అక్కడ యాగం చేసి, సరస్వతిని పూజించి, ఆ తీర్థాన్ని ఏర్పరిచాడు. అందుకే అది స్థాణు తీర్థమైంది. ఆ తీర్థంలోనే దేవతలు రాక్షస వినాశనం కోసం స్కందుని మహాసేనాధిపతిగా అభిషేకించారు. ఆ సారస్వత తీర్థంలో విశ్వామిత్రుడు తీవ్రతపస్సుతో వసిష్ఠుని చలింపజేశాడు. ఆ విషయం చెపుతా విను. భారతా! తపోధనులైన ఆ వసిష్ఠవిశ్వామిత్రులు ఇద్దరూ పోటీపడి తీవ్రతపస్సు నాచరించేవారు. వారిలో మహాముని అయిన విశ్వామిత్రుడు ఎక్కువగా తపించేవాడు. వసిష్ఠుని తేజస్సు చూసి, విశ్వామిత్రుడు చింతకు లోనయ్యాడు. నిత్యమూ ధర్మతత్పరుడైన ఆ విశ్వామిత్రుడిలా ఆలోచించాడు.

"ఈ సరస్వతి తపోధనుడు, తాపసశ్రేష్ఠుడు అయిన వసిష్ఠుని వెంటనే వేగంగా నాదగ్గరకు తీసికొని రావాలి. నా దగ్గరకు వచ్చిన ఆ ద్విజశ్రేష్ఠుని నిస్సంశయంగా చంపివేస్తాను". అలా నిశ్చయించుకొని విశ్వామిత్రుడు క్రోధంతో ఎర్రబడ్డ కన్నులతో ఆ నదీమతల్లిని స్మరించాడు. ఆ ముని అలా ధ్యానించటంతో సరస్వతి కలతపడింది. సదాలోచనగల ఆ సరస్వతి విశ్వామిత్రుడు అప్పుడు తీవ్రకోపంతో ఉన్నట్లు గ్రహించింది. అప్పుడు సరస్వతి వివర్ణమై, కంపిస్తూ, చేతులు జోడించి మునివరుడైన విశ్వామిత్రుని సమీపించింది. భర్తను కోల్పోయిన స్త్రీవలె ఆ సరస్వతి తీవ్రంగా దుఃఖించింది." ఏం చేయాలో చెప్పండి" అని మునివర్యుని అడిగింది. ఆ విశ్వామిత్రుడు కోపంతో "వెంటనే వసిష్ఠుని తీసికొనిరా! ఈ రోజు అతనిని చంపాలి" అని ఆదేశించాడు. అది విని సరస్వతీనది వ్యథచెందింది. ఆపై ఆ కమలనయన చేతులు జోడించి, గాలిదెబ్బ తిన్న తీగవలె భయంతో తీవ్రంగా కంపించింది. ఆ రూపంలోనున్న ఆ మహానదిని చూసి విశ్వామిత్రుడు "నీవు ఏ ఆలోచనా లేకుండా వసిష్ఠుని నాదగ్గరకు తీసికొని రా" అని ఆజ్ఞాపించాడు. ఆ సరస్వతి విశ్వామిత్రుని మాట విని, ఆయన చేయగోరిన పాపకర్మను తెలిసికొని, లోకంలో అసామాన్యమైన వసిష్ఠుని ప్రభావ మెరిగినది కాబట్టి వసిష్ఠుని దగ్గరకే వెళ్ళి, ధీమంతుడైన విశ్వామిత్రుడు తనను ఆదేశించిన విషయాన్ని వసిష్ఠునకు చెప్పింది. ఇద్దరి శాపాలకూ భయపడి సరస్వతి పదే పదే కంపిస్తూ మహాశాపాన్ని గూర్చి ఆలోచిస్తూ, విశ్వామిత్రుని కారణంగా తీవ్రంగా భయపడసాగింది.

రాజా! కృశించి, వివర్ణయై, చింతాక్రాంతయైన ఆ సరస్వతిని చూసి,

మనుజోత్తముడు, ధర్మాత్ముడు అయిన వసిష్ఠుడు ఇలా అన్నాడు. "నదీమతల్లీ! నిన్ను నీవు కాపాడుకో. నన్ను త్వరగా తీసికొని వెళ్ళు. లేకపోతే విశ్వామిత్రుడు శపించవచ్చు. నీవు విచారించవద్దు". కృపాశీలుడైన ఆ వసిష్ఠుని మాటను విని, ఆ నది "ఏం చేస్తే మంచి జరుగుతుంది" ? అని ఆలోచించింది. "వసిష్ఠుడు నాపై ఎంతో దయను ప్రదర్శించాడు. నిత్యమూ ఆయనకు హితమైన పనినే నేను చేయాలి" అని విచారించసాగింది. రాజా! ఆపై తన ఒడ్డున జపం చేస్తూ, హోమం చేస్తున్న ఋషిశ్రేష్ఠుడైన విశ్వామిత్రుని చూసి సరస్వతి "ఇదే తగిన అదను" అని ఆలోచించి తన వేగంతో తూర్పు ఒడ్డును బ్రద్దలు చేసి ప్రవహింపసాగింది. అలా కొట్టుకొనిపోతున్న ఒడ్డుతో పాటు వసిష్ఠుడు కూడా కొట్టుకొని పోయాడు. రాజా! అలా వెళుతూ వసిష్ఠుడు సరస్వతిని స్తుతించాడు. "సరస్వతీ ! నీవు పితామహుని సరస్సు నుండి ప్రభవించావు. అందుకే సరస్వతివి. పవిత్రమైన నీ నీటితో ఈ విశ్వమంతా వ్యాపించింది. దేవీ ! నీవు ఆకాశంలో ప్రవహిస్తూ మేఘాలలో నీటిని కలిగిస్తున్నావు. జలమంతా నీ స్వరూపమే. నీవలననే మేమంతా వేదాధ్యయనం చేస్తున్నాం. పుష్టి, ద్యుతి, కీర్తి, సిద్ధి, బుద్ధి, ఉమ, వాణి, స్వాహా అన్నీ నీవే ఈ జగత్తంతా నీకు లోబడి ఉంది. నీవే నాలుగు విధాలుగా సర్వభూతాలలోనూ నివసిస్తున్నావు." రాజా! ఆ రీతిగా వసిష్ఠమహర్షిచే స్తుతింపబడుతూ సరస్వతి ఆ విప్రుని విశ్వామిత్రాశ్రమం వైపు తీసికొనిపోయింది.

వసిష్ఠుడు వచ్చినట్టు విశ్వామిత్రునకు అదే పనిగా చెప్పింది. సరస్వతి తీసికొనివచ్చిన ఆ వసిష్ఠుని చూసి విశ్వామిత్రుడు కోపసమన్వితుడై వసిష్ఠుని అంతం చేయగల ఆయుధం కోసం వెదకాడు. విశ్వామిత్రుడు కోపంగా ఉండటంచూసి, ఆ నది బ్రహ్మహత్యా భయంతో ఆలస్యం లేకుండా, విశ్వామిత్రుని మోసగించి వసిష్ఠుని మరల తూర్పుదిశగా తీసికొనిపోయింది. ఆ నది మునులిద్దరి మాట పాటించినట్లయింది. ఋషిసత్తముడైన వసిష్ఠుని సరస్వతి మరల తీసికొనిపోవటం చూసి, అసహనశీలుడైన విశ్వామిత్రుడు దుఃఖంతో కోపించి ఇలా అన్నాడు. "నదీమతల్లీ! నీవు నన్ను మోసం చేసి మరలా వెళ్ళిపోయావు. కాబట్టి నీవు నీటి బదులు నెత్తుటిని ప్రవహించు. అది రాక్షసులకిష్టం." ఆపై ధీమంతుడైన విశ్వామిత్రుని చేత శపింపబడిన సరస్వతి అప్పుడు సంవత్సర కాలం వరకు నెత్తురు కలిసిన నీటితో ప్రవహించింది. ఆ తరువాత ఋషులు, దేవతలు, గంధర్వులు, అప్సరసలు ఆ స్థితిలోనున్న సరస్వతిని చూసి ఎంతో దుఃఖించారు. రాజా! ఈ రీతిగా వసిష్ఠావహం లోకంలో ప్రసిద్ధికెక్కింది. మరలా ఆ నదీమతల్లి తన మార్గంలోనికి వచ్చింది.'

43. పారస్వతోపాఖ్యానము - 7.

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'ధీమంతుడైన విశ్వామిత్రునిచే కోపంతో శపింపబడిన ఆ సరస్వతి నిర్మలమైన ఆ శ్రేష్ఠ తీర్థంలో రక్తంతో ప్రవహించింది. ఆపై రాక్షసులు అక్కడకు వచ్చి, అక్కడ నెత్తురు త్రాగుతూ వారంతా సుఖంగా ఉండేవారు. దానితో బాగా తృప్తిపడి నిశ్చింతగా సుఖించేవారు. స్వర్గాన్ని గెలిచినట్లు నవ్వుకొంటూ, నాట్యమాడుతూ గడిపేవారు. కొంతకాలానికి మహాతపోధనులైన ఋషులు తీర్థయాత్రకై సరస్వతీ నదికి వచ్చారు. పండితులు అయిన ఆ ముని పుంగవులు ఆ తీర్థాలన్నింటిలో చక్కగా మునిగి, పరమానందాన్ని పొంది, అక్కడనుండి నెత్తుటితో ప్రవహిస్తున్న తీర్థం దగ్గరకు వచ్చి ఆ నదీ జలాన్ని చూశారు. రాక్షసులెందరో ఆ నెత్తుటినీరు త్రాగుతున్నారు. ఆ మునులు ఆ రాక్షసులను చంపి, సరస్వతీనదిని రక్షించాలని తీవ్రప్రయత్నం చేశారు. ఆ మహాభాగులందరూ కూడి ఆ నదీమతల్లిని ఆహ్వానించి ఇలా పలికారు. "కళ్యాణీ ! కారణం చెప్పు. నీ ప్రవాహం ఎందుకిలా కలుషితమైనది. విని ఉపాయమేదైనా ఆలోచిస్తాం." అప్పుడు పరస్వతి వణుకుతూ జరిగిన వృత్తాంతమంతా చెప్పింది. దుఃఖిస్తున్న ఆ సరస్వతిని చూసి తపోధను లిలా అన్నారు. "అనఘా! కారణం తెలిసింది. శాపవిషయం తెలిసింది. తపోధనులందరూ ఈ విషయంలో చేయవలసినది చేస్తారు". ఆ నదీమతల్లితో అలా పలికి "మనమందరం ఈ సరస్వతిని శాపం నుండి విడిపిద్దాం" అని పరస్పరం మాటాడుకొన్నారు.

రాజా! ఆ విప్రులందరు తపస్సులతో నియమాలతో, వివిధోపవాసాలతో, యమాలతో, కష్టవ్రతాలతో పశుపతి, జగత్పతి అయిన పరమేశ్వరుని ఆరాధించి, నదీమతల్లి అయిన ఆ సరస్వతీదేవికి విముక్తి కలిగించారు. వారి ప్రభావంతో సరస్వతి పూర్వ స్వరూపాన్ని పొందింది. జలం అంతకుముందువలె నిర్మలమయింది. మునులు సరస్వతీ జలాన్ని ఆలా నిర్మలంచేయటం చూసి, ఆకలిగొన్న రాక్షసులు కూడా ఆ మునులనే శరణుకోరారు. "మేము ఆకలితో ఉన్నాం. శాశ్వత ధర్మానికి దూరమై ఉన్నాం. మేము పాపాలు చేసేవాళ్ళమే. కానీ అది మా ఇష్టంకొద్దీ జరుగుతున్నది కాదు. మీవంటివారి అనుగ్రహం లేనందువల్ల మేము దుష్కృత్యాలు చేస్తున్నాం. మా పాపం పెరిగినప్పుడు మేము బ్రహ్మరాక్షసుల మవుతున్నాం. స్త్రీలు వ్యభిచార పాపంచేత రాక్షసు లవుతారు. క్షత్రియ, వైశ్య, శూద్రులలో బ్రాహ్మణులను ద్వేషించినవారు రాక్షసు లవుతారు. ఆచార్యుని, ఋత్విక్కును, గురువును, వృద్ధజనులను అవమానించిన ప్రాణులు కూడా ఇక్కడ రాక్షసు

లవుతారు. కాబట్టి ద్విజోత్తములారా! ఇక్కడ మమ్ములను కూడా తరింపజేయండి. మీరు సమస్తలోకాలను కూడా తరింపజేయగలవారు".

వారి మాటలు విని, నియతమనస్కులై ఆ మహర్షులు రాక్షసుల విముక్తికై ఆ మహానదిని స్తుతిస్తూ ఇలా అన్నారు. "ఉమ్మివేసిన అన్నం, పురుగులు పడిన అన్నం, ఎంగిలి కూడు, వెంట్రుకలున్న అన్నం, తిరస్కారపూర్వకంగా లభించిన అన్నం, కన్నీట తడిసిన అన్నం, కుక్కలు ముట్టిన అన్నం – అదంతా లోకంలో రాక్షసభాగం – కాబట్టి పండితుడు వీటిని గమనించి ప్రయత్నపూర్వకంగా వాటిని వదలివేయాలి. ఇటువంటి అన్నాన్ని తిన్నవాడు రాక్షసాన్నం తిన్నట్టే." ఆ తరువాత తపోధనులైన ఆ ఋషులు ఆ తీర్థాన్ని శుద్ధిచేసి, రాక్షసవిముక్తికై ఆ నదిపై ఒత్తిడి తెచ్చారు. మహర్షుల అభిప్రాయాన్ని గ్రహించి, ఆ నదీమతల్లి తన స్వరూపమే అయిన అరుణను రప్పించింది. ఆ రాక్షసులు ఆ అరుణలో స్నానం చేసి, శరీరాలను త్యజించి, దివంగతు లయ్యారు. ఆ అరుణ బ్రహ్మహత్యాపాపాన్ని పోగొట్టగలది. ఈ విషయాన్ని తెలిసికొని దేవరాజైన ఇంద్రుడు ఆ శ్రేష్ఠతీర్థంలో స్నానంచేసి, బ్రహ్మహత్యాపాపం నుండి విముక్తిని పొందాడు. జనమేజయుడిలా అడిగాడు. "పూజ్యుడైన ఇంద్రుడు బ్రహ్మహత్యా దోషాన్ని ఎలా పొందాడు? ఈ తీర్థంలో మునిగి ఎలా పాపాన్ని పోగొట్టుకొన్నాడు ?" వైశంపాయనుడిలా చెప్తున్నాడు. రాజా! గతంలో ఇంద్రుడు నముచిదగ్గర తాను చేసిన ప్రతిజ్ఞను భంగపరిచాడు. ఆ ఉపాఖ్యానాన్ని జరిగినది జరిగినట్లుగా విను.

నముచి ఇంద్రునివలన భయపడి సూర్యరశ్మిలో ప్రవేశించాడు. ఇంద్రుడు అతనితో సఖ్యత కూర్చుకొని ఇలా అన్నాడు. 'తడి ఆయుధంతో గానీ, పొడి ఆయుధంతో గానీ, రాత్రి గానీ, పగలు గానీ, నేను నిన్ను చంపను. సత్యప్రమాణంగా చెప్తున్నాను.' రాజా! దేవరాజైన ఇంద్రుడు ఆ రీతిగా ప్రతిజ్ఞ చేసి అంతటా మంచు కప్పి ఉండటం చూసి, నీటి నురుగుతో ఆ నముచి తలను ఖండించాడు. తెగిపోయిన ఆ నముచితల ఇంద్రుని వెంట పడింది. ఇంద్రుని దగ్గరకు పోయి "ఓరీ! మిత్రఘాతా పాపాత్ముడా!" అని పలుకసాగింది. ఆ తల మాటిమాటికీ అలా వెంటబడుతుంటే బాధపడి ఇంద్రుడు పితామహునకు ఆ విషయాన్ని నివేదించాడు. అప్పుడు లోకగురువైన బ్రహ్మ ఇలా చెప్పాడు. "దేవేంద్రా! పాపభయాన్ని పోగొట్టే అరుణతీర్థంలో యథావిధిగా యాగంచేసి, స్నానం చేయి. ఇంద్రా! మునులు ఈ అరుణాతీర్థజలాన్ని పవిత్రీకరించారు. ఈ తీర్థంలో అంతకుముందు నుండీ అరుణ గుప్తంగా ఉంది. ఆపై సరస్వతీ దేవి సమీపించి తన

జలంతో అరుణాదేవిని పూర్తిగా ముంచింది. అరుణాసరస్వతుల ఈ సంగమస్థానం మహాపుణ్యప్రదమైంది. దేవేంద్రా! ఇక్కడ యాగమాచరించి, అనేక దానాలను చేయి. ఇక్కడ స్నానం చేసి, నీవు ఈ ఘోరపాతకం నుండి విముక్తి నందగలవు". బ్రహ్మ అలా చెప్పగా దేవేంద్రుడు సరస్వతీ తీరంలోని అరుణాతీర్థంలో యథావిధిగా యాగంచేసి, స్నానం చేశాడు. దానితో బ్రహ్మహత్యాపాతకం నుండి విముక్తినంది ఆ త్రిదశేశ్వరుడు మనసా సంతోషించి వెళ్ళాడు. భారతా! రాజసత్తమా! ఆ నముచిశిరస్సు కూడా ఆ తీర్థంలోనే తడిసి, కోరికలను నెరవేర్చే అక్షయలోకాలను చేరింది. పారమార్థిక కార్యతత్పరుడు మహాత్ముడూ అయిన బలరాముడు ఆ అరుణాతీర్థంలో కూడా స్నానంచేసి, వివిధ దానాలను చేసి, ధర్మఫలాన్ని పొంది, ఉత్తమమూ, శ్రేష్ఠమూ అయిన సోమతీర్థానికి వెళ్ళాడు. అక్కడ గతంలో పార్థివశ్రేష్ఠుడైన సోముడు యథావిధిగా రాజసూయయాగం చేశాడు. ఆ ప్రధానయజ్ఞంలో అత్రి హోతగా వ్యహరించాడు. ఆ యజ్ఞపరిసమాప్తి వేళలో దానవులకు, దైతేయులకు, రాక్షసులకు దేవతలతో యుద్ధం జరిగింది. అది దారుణమైన తారకాసుర యుద్ధం. ఆయుద్ధంలోనే స్కందుడు తారకుని సంహరించాడు. అక్కడే రాక్షసులను సంహరించిన మహాసేనుడు దేవతాసేనాధిపత్యాన్ని పొందాడు. అక్కడ గొప్ప జొన్నచెట్టు ఉంది. అక్కడే సాక్షాత్తూ కుమారస్వామి - కార్తికేయుడు నిత్యనివాసియై ఉంటాడు.'

44. కుమారాభిషేకోపక్రమము.

జనమేజయుడిలా అడిగాడు. "ద్విజసత్తమా! నీవు సరస్వతీ ప్రభావాన్ని గూర్చి చెప్పావు. బ్రాహ్మణా! కుమారుని సేనాధిపతిగా అభిషేకించటాన్ని గూర్చి చెప్పవలసినది. ఏ ప్రదేశంలో, ఏకాలంలో, ఎవరిచేత, ఏ విధంగా పూజ్యుడైన కార్తికేయుడు అభిషిక్తు డయ్యాడు? స్కందుడు దైత్యులతో మహాసంగ్రామమెలా చేశాడు? అదంతా నాకు చెప్పు. నాకెంతో ఉత్సాహంగా ఉంది". వైశంపాయనుడిలా చెప్తున్నాడు. "జనమేజయా! ఈ నీ కుతూహలం కురువంశానికి తగినదే! నా మాటలు ఉల్లాసాన్ని కలిగిస్తూనే ఉంటాయి. రాజా! నీవు సావధానంగా వింటున్నావు కాబట్టి కుమారస్వామి అభిషేకాన్ని గురించి, ప్రభావాన్ని గురించి నీకు చెపుతాను. గతంలో మహేశ్వరుని వీర్యం జారి, అగ్నిలో పడింది. సర్వభక్షకుడైన అగ్ని భగవానుడు అక్షయమైన ఆ వీర్యాన్ని దగ్ధం చేయలేకపోయాడు. దానితో కాంతిమంతుడైన అగ్ని అమితతేజస్వి అయ్యాడు. అప్పుడు తేజోమయమైన గర్భాన్ని ధరించాడు. బ్రహ్మ ఆదేశాన్ని అనుసరించి, అగ్ని ఆ గర్భాన్ని గంగలో విడిచాడు.

ఆపై గంగ కూడా ఆ గర్భాన్ని ధరించలేక హిమగిరిపై రెల్లు పొదలలో దానిని విడిచింది. ఆ అగ్ని కుమారుడు లోకాలనన్నింటిని వ్యాపించి అక్కడ వృద్ధి చెందాడు.

రెల్లుపొదలలో అగ్నివలె ప్రజ్వలిస్తూ సర్వసమర్థుడు మహాత్ముడు అయిన ఆ అగ్నిసుతుని కృత్తికలు చూశారు. పుత్రాభిలాష గలవారు అందరు "ఇతడు నా కుమారుడు" అంటూ ఆక్రోశించసాగారు. ఆ మాతల భావాన్ని గ్రహించి పూజ్యుడు, సమర్థుడు అయిన ఆ కుమారుడు వారి స్రవించిన పాలను ఆరు ముఖాలతో త్రాగాడు. ఆ బాలుని ఆ ప్రభావాన్ని గుర్తించి దివ్యశరీరధారిణులయిన ఆ కృత్తికలు ఎంతో ఆశ్చర్యానికి లోనయ్యారు. కురుసత్తమా! గంగ ఆ స్కందుని ఏ గిరిశిఖరం మీద విడిచిందో ఆ పర్వతం పూర్తిగా స్వర్ణమయమై ప్రకాశించింది. వర్ధిల్లుతున్న ఆ శిశువు ఆ భూమిని వెలుగొందజేశాడు. అందువలన అక్కడి పర్వతాలన్నీ సువర్ణమయా లయ్యాయి. మహాపరాక్రమశాలి అయిన ఆ కుమారుడు కార్తికేయుడని వ్యవహరింపబడ్డాడు. మహాయోగబల సంపన్నుడైన ఆ బాలుడు తొలుత గంగకొడుకు. రాజేంద్రా! శమం, తపస్సు, శక్తులతో కూడి ఆ బాలుడు చంద్రునివలె చూడముచ్చట గొలుపుతూ వేగంగా ఎదిగాడు. దివ్యమూ, సువర్ణమయమూ అయిన ప్రదేశంలో రెల్లుపొదలలో కాంతిమంతుడై నిత్యమూ గంధర్వులు, మునుల స్తుతులను వింటూ ఆ బాలుడు శయనించి యుంటాడు.

అలాగే దివ్యవాద్య నృత్యకళల నెరిగి అందగత్తెలైన వేలకొలది దేవకన్యలు ఆ బాలుని స్తుతిస్తూ నృత్యం చేస్తుంటారు. నదీమతల్లి అయిన గంగానది ఆ బాలుని దగ్గరే ఉంటుంది. పృథివి కూడా ఉత్తమ రూపాన్ని ధరించి, ఆ బాలుని ఒడిలో ధరించింది. బృహస్పతి ఆ బాలునకు అక్కడ జాతకర్మాది సంస్కారాలను చేయించాడు. నాల్గురూపాలు గల వేదం కూడా చేతులు జోడించి బాలుని సన్నిధిలో నిలిచింది. నాల్గుపాదాలు గల ధనుర్వేదమూ, సంగ్రహాలతో సహా శస్త్రసమూహమూ, సాక్షాత్తూ సరస్వతి ఒంటరిగా ఆ బాలుని సేవకై అక్కడ ఉంటారు. ఉమాపతి, వందలకొలది భూతసంఘాలు చుట్టు నిలువగా, పార్వతితో కలిసి కూర్చొని యుండగా, కార్తికేయుడు చూశాడు. భూతసంఘాల సమూహాలు పరమాద్భుతంగా కనిపిస్తున్నాయి. వికృతాకారాలతో వికృతాకారధ్వజాలతో అవి వికృతంగా ఉన్నాయి. పులులు, సింహాలు, ఎలుగుబంట్లు, పిల్లులు, మొసళ్ళ వంటి ముఖాలు కొందరివి. కొందరి ముఖాలు గండుపిల్లులు వంటివి. ఏనుగుముఖాలు, ఒంటెల ముఖాలవారు కొందరు. కొందరివి గుడ్లగూబల వంటి ముఖాలు. కొందరు గ్రద్దలవలె, నక్కలవలె కనిపిస్తున్నారు. కొందరి ముఖాలు క్రౌంచ పక్షుల వలె, పావురాలవలె, జింకల

వలె ఉన్నాయి. అక్కడక్కడ కొన్ని భూతాలు ముండ్లపందులు, ఉడుములు, మేకలు, గొర్రెలవంటి శరీరాలను ధరించిఉన్నాయి. కొందరు పర్వతాలవలె, మేఘాలవలె కనిపిస్తున్నారు. కొందరు చక్రాలు, గదలు మొదలైన ఆయుధాలనెత్తి ఉన్నారు. కొందరు కాటుక ముద్దవలె ప్రకాశిస్తున్నారు. కొందరు తెల్లకొండవలె కాంతిమంతులు. రాజా! ఏడుగురు మాతలు, సాధ్యులు విశ్వేదేవులు, వసువులు, పితరులు, రుద్రులు, ఆదిత్యులు, సిద్ధులు, నాగులు, దానవులు, పక్షులు, పుత్రులతో విష్ణువుతో సహా స్వయంభువు అయిన బ్రహ్మదేవుడు, ఇంద్రుడు వీరంతా అచ్యుతుడైన కార్తికేయుని చూడటానికి వచ్చారు. నారదుడు మొదలయిన దేవతలు, సిద్ధులు, బృహస్పతి, దేవతలకును దేవతలైన పితరులు, యామగణం, ధామగణం అందరూ అక్కడకు వచ్చారు.

ఆ కార్తికేయుడు శూలపాణి దగ్గరకు వచ్చాడు. తన దగ్గరకు వస్తున్న ఆ బాలుని చూసి, ఏకకాలంలో శివుడు, పార్వతి, గంగ, అగ్ని ఇలా భావించారు. "ఈ బాలుడు నా దగ్గరకే వస్తాడేమో!" అని అందరూ అనుకొన్నారు. ఆ నలుగురి అభిప్రాయాన్ని గ్రహించి, ఆ బాలుడు యోగశక్తితో ఒకేసారి నాలుగు శరీరాలను సృష్టించుకొన్నాడు. ఆ కుమారుడు క్షణంలో చతుర్మూర్తి అయ్యాడు. శాఖుడు, విశాఖుడు, నైగమేయుడు అని మిగిలిన మూడు రూపాల పేర్లు. ఈ రీతిగా కార్తికేయుడు తనను నాలుగుగా విభజించుకొన్నాడు. రుద్రుని దగ్గరకు అద్భుత దర్శనుడైన స్కందుడు వెళ్ళాడు. హిమగిరితనయ అయిన పార్వతి దగ్గరకు విశాఖుడు వెళ్ళాడు. ఆ స్వామి – శాఖుడు వాయుమూర్తియై అగ్నిని సమీపించాడు. అగ్నితేజస్సు గల కుమారుడు నైగమేయస్వరూపంతో గంగను సమీపించాడు. ఆ నలుగురిదీ ఒకే రూపం. అందరి శరీరాలు వెలుగులు చిమ్ముతున్నాయి. నలుగురూ ఏకకాలంలో నలుగురి దగ్గరకు వెళ్ళారు. అది అద్భుత మనిపించింది. ఒళ్ళు గగుర్పొడిచే ఆ మహాద్భుతాశ్చార్యాన్ని చూసిన దేవదానవ రాక్షసులలో తీవ్రహాహాకారం చెలరేగింది. ఆపై రుద్రుడు, పార్వతి, అగ్ని, గంగ, అందరూ జగత్పతియైన బ్రహ్మకు నమస్కరించారు. వారంతా విధిపూర్వకంగా నమస్కరించి, ఆపై కార్తికేయునికి ప్రియాన్ని చేయాలని భావించి ఇలా అన్నారు. "స్వామీ! దేవేశా! మా ప్రియంకోసం ఈ బాలునకు తగిన ఆధిపత్యమేదైనా మీకు తోచినది ఇవ్వవలసినది". ఆపై సర్వలోకపితామహుడు "ఇతనికి ఏమివ్వాలి? అని మనసా ఆలోచించాడు.

మహామతి అయిన బ్రహ్మ అంతకుముందే దేవతలకు, గంధర్వులకు, రాక్షసులకు, భూతాలకు, యక్షులకు, పక్షులకు, పాములకు అంతటా ఆయా మహాత్ముల సమూహాలకు

ఆధిపత్యాలను ఆదేశించిఉన్నాడు. కార్తికేయుని కూడా ఆధిపత్యానికి సమర్థునిగా భావించాడు. భారతా! ఆపై ఆయన ముహూర్తకాల మాలోచించి, దేవతల శ్రేయస్సు కోరి, సర్వభూత సేనాధిపత్యాన్ని కుమారునికిచ్చారు. సర్వభూత పితామహుడైన బ్రహ్మ సర్వదేవతా సమూహాలకు రాజులుగా వ్యవహరిస్తున్న వారినందరినీ కుమారుని అధీనులను చేశాడు. ఆపై బ్రహ్మ మొదలైన దేవతలు కుమారుని తీసికొని ఒక్కటిగా కూడి అభిషేకం కోసం హిమగిరిలో, హిమగిరినుండి వెలువడి ప్రవహిస్తున్న పుణ్యనదీమతల్లి అయిన సరస్వతీ తీరానికి వచ్చాడు. సమంతపంచకంలో ప్రవహిస్తూ త్రిలోక విశ్రుతమైనది ఆ సరస్వతి. అక్కడ సర్వగుణసమన్వితమై, పుణ్యప్రదమైన సరస్వతీ తీరంలో దేవగంధర్వులందరూ సంపూర్ణ మనస్సులతో కొలువుతీరారు.'

45. కుమారాభిషేకము.

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'తరువాత అభిషేక సంభారాల నన్నిటినీ సమకూర్చి బృహస్పతి యథాశాస్త్రంగా అగ్నిని ప్రజ్వలింపజేసి అగ్నిలో హోమం చేశాడు. ఆపై పొదిగిన దివ్యరత్నాలతో, మేలుజాతి మణులతో శోభిస్తున్న పవిత్రమైన ఉన్నతాసనంపై కుమారస్వామి కూర్చున్నాడు. ఆ సింహాసనం హిమవంతుడిచ్చింది. దేవతాగణాలు సమస్త మంగళ ద్రవ్యాలను, అభిషేక ద్రవ్యాలను విధిపూర్వకంగా మంత్రపూర్వకంగా గ్రహించారు. మహాశక్తిమంతులైన ఇంద్రవిష్ణువులు, సూర్యచంద్రులు, ధాత, విధాత, అగ్ని వాయువు, పూష, భగుడు, అర్యముడు, అంశుడు, వివస్వంతుడు, మిత్రావరుణులతో కలిసి రుద్రుడు, ఏకాదశరుద్రులు, అష్టవసువులు, ద్వాదశాదిత్యులు, అశ్వినులు కార్తికేయుని చుట్టూ నిలిచారు. విశ్వేదేవులు, మరుత్తులు, సాధ్యులు, పితరులు, గంధర్వులు, అప్సరసలు, యక్షులు, రాక్షసులు, నాగులు, లెక్కలేనంత మంది దేవర్షులు, బ్రహ్మర్షులు, వైఖానసులు, వాలఖిల్యులు, వాయుభక్షకులైన మునులు, సూర్యకిరణ పానంచేసే మునులు, భృగు – అంగిరోవంశీయులైన మునులు, మహనీయులైన యతులు, సర్పాలు, విద్యాధరులు, పుణ్యాత్ములైన సిద్ధయోగులు కార్తికేయుని చుట్టూ నిలిచారు. రాజా! పితామహుడు, పులస్త్యుడు, పులహుడు, అంగిరుడు, కశ్యపుడు, అత్రి, మరీచి, భృగువు, క్రతువు, హరుడు, ప్రచేతుడు, మనువు, దక్షుడు, ఋతువులు, గ్రహాలు, నక్షత్రాలు, ఆకృతి దాల్చిన నదులు, సనాతనవేదాలు, సముద్రాలు, మడుగులు, వివిధ తీర్థాలు, పృథివి, ఆకాశం, దిక్కులు, చెట్లు, దేవమాత అయిన అదితి, హ్రీ, శ్రీ, స్వాహా, సరస్వతి, ఉమ, శచి, సినీవాలి, అనుమతి, కుహువు, రాక, బుద్ధి,

దేవతల ఇతర భార్యలు, హిమవంతుడు, వింధ్యుడు, అనేక శృంగాలు గల మేరువు, అనుచరులతో సహా ఐరావతం, కలలు, కాష్ఠలు, మాసాలు, పక్షాలు, ఋతువులు, పగలు, రేయి, ఉచ్చైఃశ్రవం, వాసుకి అరుణుడు, గరుడుడు, వృక్షాలు, ఓషధులు, పూజ్యుడైన ధర్ముడు, కాలుడు, యముడు, మృత్యువు, యముని అనుచరులు అందరూ కూడివచ్చారు.

చాలామంది ఉండటం వలన వివిధ దేవతాగణాలను గురించి చెప్పటం లేదు. కానీ ఆయా ప్రదేశాలనుండి వారు కుమారుని అభిషేకానికి వచ్చారు. రాజా! అప్పుడు దేవతలందరు అభిషేక భాండాలను, సమస్త మంగళద్రవ్యాలను చేతబట్టారు. రాజా! పరమానందంతో దేవతలు దివ్యసంభారాలతో కూడిన కాంచన కలశాలతో పుణ్యప్రదాలైన ఏడు సరస్వతుల దివ్య జలాలతో మహాత్ముడైన ఆ కుమారుని అసురభయంకరుడైన దేవసేనాపతిగా అభిషేకించారు. పూర్వకాలంలో జలాధిపతి అయిన వరుణుని అభిషిక్తుని చేసినట్టు సర్వలోక పితామహుడైన బ్రహ్మ, మహాతేజస్వి అయిన కశ్యపుడు విశ్వవిఖ్యాతులైన ఇతరమునులు కార్తికేయుని అభిషేకించారు. బ్రహ్మ ప్రీతితో కార్తికేయునకు నలుగురు అనుచరులను సమకూర్చాడు. వారు బలశాలులు, వాయువేగులు, స్వేచ్ఛానుసారంగా శక్తిని ధరించేవారు, సిద్ధులు. నందిసేనుడు, లోహితాక్షుడు, ఘంటాకర్ణుడు మొదట ముగ్గురు. ఘంటాకర్ణుడు కుమారునకు ఇష్టమైనవాడు. నాలుగవవాడు కుముదమాలి పేరుతో ప్రసిద్ధుడు. రాజేంద్రా! పరమశివుడు కుమారునకు ఒక సన్నిహితానుచరుని ఇచ్చాడు. అతడు వందలకొలదిగ మాయలు గలవాడు, స్వేచ్ఛానుసారం బలపరాక్రమసంపన్నుడు, దైత్యసంహారకుడు. అతడే దేవాసుర సంగ్రామంలో భీమపరాక్రమం ప్రదర్శిస్తున్న కోటినలభై లక్షల దైత్యులను, కోపంతో బాహువులతోనే సంహరించాడు. అలాగే దేవతలు దేవశత్రువినాశకమై, విష్ణురూపిణి అయిన సేనను కుమారునకు ఇచ్చారు. ఆ సేన నైరృతులతో నిండి జయింప వీలుకానిది.

అప్పుడు ఇంద్రుడు, ఇతర దేవతలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, మునులు, పితరులు జయజయధ్వానాలు చేశారు. మృత్యువుతో సమానమైన ఇద్దరు అనుచరులను యముడు కుమారున కిచ్చాడు. వారు ఉన్మాథుడు, ప్రమాథుడు. సూర్యుడు ప్రీతితో తన అనుచరులైన సుభ్రాజుని, భాస్వరుని కార్తికేయునకిచ్చాడు. చంద్రుడు కూడా తెల్లని మాలలను ధరించి, తెల్లని చందనం, పూసుకొని కైలాసశిఖరంవలె ప్రకాశిస్తున్న తన అనుచరులైన మణిని, సుమణిని ఇచ్చాడు. అలాగే అగ్ని కూడా శత్రుసేనలను

మధించగల శూరులైన జ్వాలాజిహ్వుని, జ్యోతిని తన కుమారునకు అనుచరులనుగా ఇచ్చాడు. అంశుడు కూడా ధీమంతుడైన స్కందునకు అయిదుగురు అనుచరులను ఇచ్చాడు. వారు పరిఘుడు, వటుడు, మహాబలుడైన భీముడు, దహతి, దహనుడు. చివరి ఇద్దరూ ప్రచండులు, బలశాలులుగా సమ్మానాల నందుకొన్నవారు. పరవీరహంత అయిన ఇంద్రుడు వజ్రధారి అయిన ఉత్క్రోశుని, దండధారి అయిన పంచకుని అనల కుమారునకు అనుచరులుగా ఇచ్చాడు. వారు అనేక యుద్ధాలలో మహేంద్రుని శత్రువులను సంహరించినవారు. విష్ణువు చక్రుని, విక్రమకుని, మహాబలవంతుడైన సంక్రముని - ముగ్గురినీ స్కందునకు అనుచరులనుగా ఇచ్చాడు. భిషగర్వులైన ఆశ్వినులు ప్రీతితో సర్వవిద్యా విశారదులైన వర్ధనుని, నందనుని స్కందునకు ఇచ్చారు. ధాత కుందుని, కుసుముని, కుముదుని, డంబరుని, ఆడంబరుని స్కందునకిచ్చాడు. త్వష్ట బలవంతులు, బలోన్మత్తులు, మహా మాయావులు, మేఘచక్రధారులు అయిన చక్రుని, అనుచక్రుని - ఇద్దరిని కుమారునకు అనుచరులుగా ఇచ్చాడు. ప్రభువైన మిత్రుడు మహాత్ముడైన కుమారునకు సువ్రతుని, సత్యసంధుని ఇచ్చాడు. వారు మహాత్ములు, తపో విద్యాధరులు, అందమైనవారు, వరదాతలు, మూడులోకాలలో ప్రసిద్ధిగొన్నవారు. విధాత మహాత్ముడైన సువ్రతుని, శుభకర్ముని కార్తికేయున కిచ్చాడు. వారిద్దరూ లోకవిశ్రుతులు. భారతా! పూష కూడా మహామాయావులైన పాణీతకుని, కాలికుని కార్తికేయునకు అనుచరులుగా ఇచ్చాడు. మహావక్త్రులు, మహాబలులు అయిన బలుని, అతిబలుని వాయువు కార్తికేయునకిచ్చాడు.

వరుణుడు మహాబలులైన యముని, అతియముని కార్తికేయునకిచ్చాడు. ఆ ఇద్దరిముఖాలు తిమింగలాల వంటివి. హిమవంతుడు అగ్నిసుతుడైన కార్తికేయునకు మహాత్ముడైన సువర్చసుని, అతివర్చసుని ఇచ్చాడు. మేరువు అగ్ని పుత్రునకు మహాత్ములైన కాంచనుని, మేఘమాలిని అనుచరులుగా ఇచ్చాడు. మహాత్ముడైన మేరువే మరో ఇద్దరిని - మహా బలపరాక్రములైన స్థిరుని, అతిస్థిరుని కార్తికేయునకిచ్చాడు. వింధ్యుడు పెద్దపెద్ద బండరాళ్ళను ఆయుధాలు చేసి పోరాడగల ఉచ్ఛ్రుంగుని, అతిశృంగుని అనుచరులుగా కార్తికేయునకిచ్చాడు. సముద్రుడు కూడా గదాధరులయిన సంగ్రహుని, నిగ్రహుని అగ్నికుమారునకిచ్చాడు. ఆ ఇద్దరు గొప్ప అనుచరులు. శుభదర్శన అయిన పార్వతి ఉన్మాదుడు, శంకు కర్ణుడు, పుష్పదంతు డనే ముగ్గురిని కార్తికేయునకిచ్చింది. నాగరాజైన వాసుకి జయుడు, మహాజయుడు అనే సర్పాలను అగ్నిపుత్రుడైన కుమారునకిచ్చాడు. ఇలాగే సాధ్యులు, రుద్రులు, వసువులు, పితరులు, సాగరాలు, నదులు, మహాబలులైన పర్వతాలు శూలాలను, పట్టిశాలను ధరించి, వివిధాయుధాలతో, నానావేశాలంకరణలతో

కూడిన సేనాగణాధ్యక్షులను కార్తికేయున కిచ్చారు. స్కందునకు ఇతర సైనికులు కూడా ఉన్నారు. వారు వివిధాయుధ సంపన్నులు, చిత్రాభరణ భూషితులు. వారిపేర్లు చెపుతా వినుము. రాజా! వారు శంకుకర్ణుడు, నికుంభుడు, పద్ముడు, కుముదుడు, అనంతుడు, ద్వాదశభుజుడు, కృష్ణుడు, ఉపకృష్ణుడు, ఘ్రాణశ్రవుడు, కపిస్కంధుడు, కాంచనాక్షుడు, బలంధముడు, అక్షుడు, సంతర్జనుడు, కునదీకుడు, తమోంతకృత్తు, ఏకాక్షుడు, ద్వాదశాక్షుడు, ఏకజటుడు, ప్రభువు, సహస్ర బాహువు, వికటుడు, వ్యాఘ్రాక్షుడు, క్షితికంపనుడు, పుణ్యనాముడు, సునాముడు, సుచక్రుడు, ప్రియదర్శనుడు, పరిశ్రుతుడు, కోకనదుడు, ప్రియమాల్యానులేపనుడు, అజోదరుడు, గజశిరుడు, స్కంధాక్షుడు, శతలోచనుడు, జ్వాలాజిహ్వుడు, కరాలాక్షుడు, శితికేశుడు, జటి, హరి, పరిశ్రుతుడు, కోకనదుడు, కృష్ణకేశుడు, జటాధరుడు, చతుర్దంష్ట్రుడు, అష్టజిహ్వుడు, మేఘనాదుడు, పృథుశ్రవుడు, విద్యుత్తాక్షుడు, ధనుర్వక్త్రుడు, జాతరుడు, మారుతాశనుడు, ఉదారాక్షుడు, రథాక్షుడు, వజ్రనాభుడు, వసుప్రభుడు, సముద్రవేగుడు, శైలకంపి, వృషుడు, మేషుడు, ప్రవాహుడు, నందుడు, ఉపనందుడు, ధూమ్రుడు, శ్వేతుడు, కపింగుడు, సిద్ధార్థుడు, వరదుడు, ప్రియకుడు, నందుడు, గోనందుడు, ఆనందుడు, ప్రమోదుడు, స్వస్తికుడు, ధ్రువకుడు, క్షేమవాహుడు, సువాహుడు, సిద్ధపాత్రుడు, గోవ్రజుడు, కనకాపీడుడు, మహాపారిషదేశ్వరుడు, గాయనుడు, హసనుడు, బాణుడు, ఖడ్గుడు, వైతాలి, గతితాలి, కథకుడు, వాతికుడు, హంసజుడు, పంకదిగ్ధాంగుడు, సముద్రోన్మాదనుడు, రణోత్కటుడు, ప్రహాసుడు, శ్వేతసిద్ధుడు, నందనుడు, కాలకంఠుడు, ప్రభాసుడు, కుంభాండకోదరుడు, కాలకక్షుడు, పితుడు, భూతమథనుడు, యజ్ఞవాహుడు, సువాహుడు, దేవయాజి, సోమపుడు, మజ్జనుడు, మహాతేజుడు, క్రథుడు, క్రాథుడు, తుహరుడు, తుహోరుడు, చిత్రదేవుడు, మధురుడు, సుప్రసాదుడు, కిరీటి, మహాబలుడు, వత్సలుడు, మధువర్ణుడు, కలశోదరుడు, ధర్మదుడు, మన్మథకరుడు, సూచీవక్త్రుడు, శ్వేతవక్త్రుడు, సువక్త్రుడు, చారువక్త్రుడు, పాండురుడు, దండబాహువు, సుబాహువు, రజుడు, కోకిలకుడు, అచలుడు, కనకాక్షుడు, బాలస్వామి, సంచారకుడు, కోకనదుడు, గృధ్రపత్రుడు, జంబుకుడు, లోహజవక్త్రుడు, జవనుడు, కుంభవక్త్రుడు, కుంభకుడు, స్వర్ణగ్రీవుడు, కృష్ణాజుడు, హంసవక్త్రుడు, చంద్రభుడు, పాణికూర్చుడు, శంబూకుడు, పంచవక్త్రుడు, శిక్షకుడు, చాషవక్త్రుడు, జంబూకుడు, శాకవక్త్రుడు, కుంజలుడు.

జనమేజయా! ఈ పార్షదులందరూ యోగయుక్తులు, మహాత్ములు, నిత్యమూ బ్రాహ్మణప్రియులు, వీరూ బ్రహ్మ ఇచ్చిన మహాత్ములైన మహాపారిషదులు, ఇతరులు యువకులు, బాలురు, వృద్ధులు వేలకొలదిగ కుమారస్వామి సేవకై నిలిచారు. జనమేజయా!

వారిలో వివిధముఖాల వారున్నారు. ఆముఖాలను గూర్చి వినుు. కొందరు కూర్మముఖులు, కొందరు కుక్కుట ముఖులు. కొందరి ముఖాలు కుందేళ్ళ వంటివి. కొన్ని ముఖాలు గుడ్లగూబల వంటివి. గాడిద, ఒంటె, వరాహాల ముఖాల వంటి ముఖాలు మరికొందరివి. పిల్లి, కుందేలు ముఖాలవంటివి కొన్ని, భారతా! కొందరు దీర్ఘవక్త్రులు, కొందరు ముంగిస, గుడ్లగూబ ముఖాలవారు. కొందరి వదనాలు కాకుల వంటివి. చిట్టెలుక, కపిలగోవు, నెమలివంటి ముఖాలు కొందరివి. కొందరు మత్స్యముఖులు, కొందరు మేఘవదనులు, కొందరు మేకలు, గొర్రెలు, గేదెల వంటి ముఖాలవారు. ఎలుగుబంటి, పులి వంటి ముఖాలు కొందరివి. తోడేళ్ళు, సింహాలవంటివారు మరికొందరు. కొందరు భీకర గజముఖులు, కొందరు నక్ర ముఖులు, కొందరు గరుడ ముఖులు, కొందరు తెల్లడేగలు, తోడేళ్ళు, కాకుల వంటి ముఖాల వారు. కొందరు గోముఖులు, కొందరు ఉష్ట్రముఖులు. కొందరు గండుపిల్లి వంటి ముఖాలవారు. భారతా! కొందరి పొట్ట, పాదాలు, ఇతరాంగాలు చాలా పెద్దవి. కన్నులు తారకలవంటివి. కొందరు పారావత ముఖులు. కొందరు వృషముఖులు, కొందరు కోకిల ముఖులు. కొందరు డేగలు, తిత్తిరి పక్షుల వంటి ముఖాలవారు. కొందరి ముఖాలు ఊసరవెల్లి వంటివి, వారు తెల్లటి వస్త్రాలు ధరించినవారు. సర్పముఖులు, శూలముఖులు, చండముఖులు, శుభవదనులు కూడా ఉన్నారు. కొందరు సర్పసమానులు. కొందరు నారచీరలు ధరించినవారు. కొందరి ముఖాలు ఎద్దు ముక్కులవలె ఉన్నాయి. కొందరి పొట్టలు పెద్దవి, శరీరాంగాలు చిన్నవి. కొందరి పొట్టలు సన్ననివి. ఇతరాంగాలు పెద్దవి. కొందరి మెడలు పొట్టివి. కొందరి చెవులు పెద్దవి. రకరకాల సర్పాలు వారి అలంకరణలు. ఏనుగు చర్మాలు ధరించిన వారు కొందరు. మృగచర్మం ధరించినవారు మరికొందరు.

మహారాజా! కొందరి ముఖాలు మెడమీద ఉన్నాయి. కొందరి ముఖాలు పొట్టమీద, కొందరి ముఖాలు వీపుపై, కొందరి ముఖాలు దవడలపై కొందరి ముఖాలు పిక్కలపై ఉన్నాయి. ఎంతోమంది ముఖాలు ప్రక్కగా ఉన్నాయి. శరీరంలోని విభిన్న భాగాలలో ఉన్నాయి కొందరి ముఖాలు. ఆ గణపతులు కీటకాలతో, పక్షులతో సమానమైన ముఖాలతో ఉన్నారు. అనేక సర్పముఖులు కొందరు. అనేక బాహువులు, ఎన్నో మెడలు కలవారు కొందరు. వివిధ తరువుల వంటి భుజాల వారు కొందరు. కటి ప్రదేశంలో తలలు గలవారు మరికొందరు. పాము పడగలవంటి ముఖాలు కొందరు. రకరకాల పాదలను తీగలను కట్టుకొన్నవారు కొందరు. నారబట్టలు చుట్టుకొన్న వారు కొందరు. బంగారు

బట్టలుదాల్చిన వారు కొందరు. వివిధ వేషాలు ధరించినవారు, వివిధ మాలలు, అనులేపనాలు ధరించిన వారు, వివిధ వస్త్రధారులు కొందరు. మరికొందరు తోలుబట్టలు కట్టుకొన్నవారు. కొందరు తలపాగలు, కొందరు కిరీటాలు ధరించారు. మంచి మెడలు, తేజస్సు గలవారు కొందరు. కొందరు కిరీటాలు, మరికొందరు పంచశిఖలు ధరించిఉన్నారు. బంగారు వెంట్రుకలు కొందరివి. కొందరు త్రిశిఖులు, కొందరు ద్విశిఖులు మరి కొందరు సప్తశిఖులు. కొందరివి సిగలు, కొందరికి కిరీటాలు, కొందరు బోడిగుండ్లవారు. కొందరు జడతాల్పులు. కొందరు చిత్రమాలలు ధరించిఉన్నారు. కొందరి ముఖాలనిండా వెంట్రుకలు. కొందరు యుద్ధప్రియులు. వారు సురశ్రేష్ఠులకు కూడా ఆలవికారు. కొందరు నల్లనివారు. కొందరి ముఖాలలో మాంసమే లేదు. కొందరి పృష్ఠం పెద్దది. పొట్టలోపలికి కుదించుకొని పోయింది. కొందరి పృష్ఠం బలిష్ఠం. కొందరిది చిన్న పృష్ఠం. కొందరి పొట్టలు, జననేంద్రియాలు పెద్దవి. కొందరివి విశాలభుజాలు, కొందరివి పొట్టి భుజాలు. కొందరి శరీరాంగాలు చిన్నవి. వారు పొట్టివారు. కొందరు గూనివారు. కొందరి పిక్కలు చిన్నవి. కొందరి చెవులు, మెడలు, ఏనుగుల చెవులు, మెడలవలె ఉన్నాయి. కొందరి ముక్కులు ఏనుగుముక్కులవలె కొందరి ముక్కులు తాబేళ్ళవలె, కొందరి ముక్కులు తోడేళ్ళ వంటివి. దీర్ఘంగా దీర్ఘంగా గాలి పీలుస్తున్నారు. కొందరి పిక్కలు పొడవు. కొందరు అధోముఖులై భయంకరంగా కనిపిస్తున్నారు. రాజా! కొందరి కోరలుపెద్దవి. కొందరి కోరలు చిన్నవి. కొందరు నాలుగు కోరలవారు. ఏనుగుల వంటివారు. వేలకొలది భయంకరులు. భారతా! సరియైన అమరిక గల శరీరాలతో, కాంతితో, చక్కని అలంకారాలతో వారున్నారు. పింగళ వర్ణంతో, కన్నులు, శంకువుల వంటి చెవులు, ఎర్రటి నాసికలతో వారు శోభిస్తున్నారు. విశాలమైన కోరలవారు, పెద్దకోరలవారు, లావు పెదవులవారు, నల్లని వెంట్రుకలవారు అక్కడున్నారు. కొందరి పాదాలు, పెదవులు, కోరలు, చేతులు, మెడలు రకరకాలుగా ఉన్నాయి.

భారతా! కొందరు వివిధచర్మాలను వస్త్రాలుగా ధరించియున్నారు. వివిధ భాషలు మాటాడేవారు, దేశభాషలలో నేర్పరులు, పరస్పర వ్యవహారకుశలులు అక్కడున్నారు. ఆ మహాపారిషదులు ఆనందంతో దూసుకొనివస్తున్నారు. పొడవైన మెడలు, పొడవైన గోళ్ళు, పొడవైన కాళ్ళు, తలలు, భుజాలు వారికున్నాయి. భారతా! కొందరి కళ్ళు పింగళ వర్ణంలో ఉన్నాయి. కొందరి మెడలు నల్లగా ఉన్నాయి. కొందరి చెవులు పెద్దవి, కొందరు తోడేలు రంగుతో, కొందరు కాటుక రంగుతో ఉన్నారు. భారతా! కొందరు తెల్లకన్నులవారు, కొందరి కళ్ళు పింగళ వర్ణం, కొందరి మెడలు ఎర్రన, చాలామంది విచిత్ర వర్ణాలతో

ఉన్నారు. కొందరు వింజామరల వంటి రంగువారు. కొందరు కుసుమకేసరాలవలె తెల్లనివారు. కొందరి శరీరాలపై తెల్లని, ఎర్రని, ముడతలు కనిపిస్తున్నాయి. కొందరు విభిన్న వర్ణాలతో, మరికొందరు సమవర్ణాలతో, కొందరు నెమలికాంతితో ప్రకాశిస్తున్నారు. ఇక ఆయుధాలు ధరించిన ఇతర పారిషదులను గురించి చెపుతాను విను. కొందరుచేతిలో పాశాలను పట్టిఉన్నారు. కొందరు నోరుతెరిచికొని ఉన్నారు. కొందరు గర్దభముఖులు. కొందరు కళ్ళు వెనుకవైపు ఉన్నాయి. కొందరి మెడలు నల్లన, కొందరి బాహువులు గడియలవలె ఉన్నాయి. భారతా! కొందరి చేతిలో శతఘ్నులు, కొందరి చేతులలో చక్రాలు, కొందరు రోకళ్ళు చేతబట్టారు. కొందరి చేతుల్లో కత్తులు, ముద్గరాలు, కర్రలు ఉన్నాయి. కొందరి చేతులలో గదలు, భుశుండులు, తోమరాలు ఉన్నాయి. మహావేగశాలులైన ఆ మహాత్ములు వివిధ భీకరాయుధాలతో కనిపిస్తున్నారు. మహావేగం, మహాబలం గలిగి రణప్రియులైన ఆ మహాపారిషదులు కుమారుని అభిషేకాన్ని చూసి ఆనందించారు. మహాబలులైనవారు మువ్వలు కుట్టిన వస్త్రాలతో శరీరావయవాలను కప్పుకొని నృత్యమాడారు. రాజా! వీరే కాక ఇతరులెందరో మహా పారిషదులు యశస్వి, మహనీయుడైన కార్తికేయుని సేవకై నిలిచారు. దేవతల ఆదేశంతో దేవలోకంలో, అంతరిక్ష లోకంలో, భూలోకంలో ప్రసిద్ధులైన శూరనరపాలురు వెంటనే స్కందునకు అనుచరులయ్యారు. అటువంటి వేలు, లక్షలు, కోట్ల పారిషదులు అభిషిక్తుడైన ఆ మహాత్ముని చుట్టూ నిలిచారు.'

46. తారకవధ

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'రాజా! కుమారునికి అనుచరులైన మాతృగణాల పేర్లు చెపుతాను విను. వారంతా శత్రుగణాలను సంహరింపగలవారు. భారత! యశస్వినులయిన మాతలపేర్లు చెపుతాను. విను. కళ్యాణకారిణులైన వారు మూడులోకాలలోనూ కేటాయింపుగా ఉన్నారు. భరతకులనందనా! రాజేంద్రా! ఆ మాతలపేర్లు ఇవి. ప్రభావతి, విశాలాక్షి, పాలిత, గోస్తని, శ్రీమతి, బహుల, బహుపుత్రిక, అప్సుజాత, గోపాలి, బృహదంబాలిక, జాయావతి; నందిని, ఏకచూడ, మహాచూడ, చక్రనేమి, ఉత్తేజిని, జయత్సేన, కమలాక్షి, శోభన, శత్రుంజయ, క్రోధన, శలభి, ఖరి, మాధవి, శుభవక్త్ర, తీర్థనేమి, గీతప్రియ, కళ్యాణి, రుద్రరోమ, అమితాశన, మేఘస్వన, భోగవతి, సుభ్రువు, కనకావతి, అలాతాక్షి, వీర్యవతి, విద్యుజ్జిహ్వ, పద్మావతి, సునక్షత్ర, కందర, బహుయోజన, సంతానిక, కమల, మహాబల, సుదామ, బహుదామ, సుప్రభ, యశస్విని, నృత్యప్రియ, శతోలూఖల మేఖల,

శతఘంట, శతానంద, భగనంద, భావిని, వపుష్మతి, చంద్రసీత, భద్రకాళి, ఋక్షాంబిక, నిష్కుటిక, వామ, చత్వరవాసిని, సుమంగల, స్వస్తిమతి, బుద్ధికామ, జయప్రియ, ధనద, సుప్రసాద, భవద, జలేశ్వరి, ఏడి, భేడి, సమేడి, వేతాలజనని, కండూతి, కాలిక, దేవమిత్ర, వసుశ్రీ, కోటరీ, చిత్రసేన, కుండారిక, కాకులిక, కుంభిక, శతోదరి, ఉత్క్రాథిని, జలేల, మహావేగ, కంకణ, మనోజవ, కంటకిని, ప్రఘస, పూతన, కేశయంత్రి, త్రుటి, వామ, క్రోశన, తటిత్ప్రభ, మందోదరి, ముండి, కోటర, మేఘవాహిని, సుభగ, లంబిని, లంబ, తామ్రచూడ, వికాశిని, ఊర్ధ్వవేణీధర, పింగాక్షి, లోహమేఖల, పృథువక్త్ర, మధులిక, మధుకుంభ, పక్షాలిక, మత్కులిక, జరాయువు, జర్జరానన, ఖ్యాత, దహదహ, ధమధమ, ఖండఖండ, పూషణ, మణికుట్టిక, అమోఘ, లంబపయోధర, వేణువీణాధర, పింగాక్షి, లోహమేఖల, శశోలూకముఖి, కృష్ణ, ఖరజంఘ, మహాజవ, శిశుమారముఖి, శ్వేత, లోహితాక్షి, విభీషణ, జటాలిక, కామచరి, దీర్ఘజిహ్వ, బలోత్కట, కాలేహిక, వామనిక, ముకుట, లోహితాక్షి, మహాకాయ, హరిపిండ, ఏకత్వచ, సుకుసుమ, కృష్ణకర్ణి, క్షురకర్ణి, చతుష్కర్ణి, కర్ణప్రావరణ, చతుష్పథనికేత, గోకర్ణి, మహిషానన, ఖరకర్ణి, మహాకర్ణి, భేరీస్వన, మహాస్వన, శంఖశ్రవ, కుంభశ్రవ, భగద, మహాబల, గణ, సుగణ, అభీతి, కామద, చతుష్పథరత, భూతితీర్థ, అన్యగోచరి, పశుద, విత్తద, సుఖద, మహాయశ, పయోద, గోద, మహిషద, సువిశాల, ప్రతిష్ఠ, సుప్రతిష్ఠ, రోచమాన, సురోచన, నౌకర్ణి, ముఖకర్ణి, విశిర, మంధిని, ఏకచంద్ర, మేఘకర్ణ, మేఘమాల, విరోచన.

భరతర్షభా! వీరే కాకుండా ఇంకా నానారూపాలు ధరించిన మాతలు వేలకొలదిగ కార్తికేయుని అనుసరిస్తున్నారు. భారత! వారు పొడవైన గోళ్ళు, దంతాలు, ముఖాలు గలవారు. బలశాలినులు, యువతులు, అందమైనవారు. చక్కగా అలంకరించుకొన్నవారు, ప్రభావశాలినులు, స్వేచ్ఛానుసారంగా రూపాన్ని ధరించేవారు. భరతర్షభా! కొందరివి మాంసంలేని శరీరాలు. కొందరు తెల్లనివారు. కొందరిది బంగారువన్నె. కొందరు నీల మేఘసమానులు. కొందరిది సాగరంగు. కొందరిది అరుణవర్ణం.. అందరు భోగశాలినులు. కొందరి జుట్టు పొడవు. కొందరు పైకి జుట్టు ముడి వేసికొన్నవారు. కొందరు తెల్లని వస్త్రాలవారు. కొందరి కళ్ళు గోరోచనం రంగువి. కొందరి మేఖలలు పొడవైనవి. కొందరి పాట్టలు, కొందరి చెవులు, కొందరి స్తనాలు పొడవైనవి. రాగికళ్ళు, రాగిరంగు, నల్లకళ్ళు కొందరివి. వారు వరదలు, కామచారిణులు, నిత్యసంతుష్టులు. పరంతపా! భరతర్షభా! వారిలో కొందరు యమశక్తులు, కొందరు రుద్రశక్తులు, కొందరు సోమశక్తులు, కొందరు కుబేరశక్తులు మహాబలసంపన్నులు. వరుణశక్తులు, మహేంద్రశక్తులు, అగ్ని శక్తులు, వాయుశక్తులు,

కుమార బ్రహ్మ విష్ణు సూరవరాహ శక్తులు మరికొందరు. రూపంలో అప్సరసల వంటివారై, మనస్సులను రంజింపజేస్తూ హరించగలవారు వారు. మాటాడటంలో కోయిలలవంటివారు. సంపదలో కుబేర సమానులు. యుద్ధంలో ఇంద్రతుల్యులు. కాంతిలో అగ్నివంటివారు. యుద్ధంలో వారు నిత్యమూ శత్రువులకు భయం కలిగించేవారు. కామరూపధారిణులు. వేగంలో గాలివంటివారు. ఊహకందని శక్తి, బలం, పరాక్రమం గలవారు. వారు చెట్లమీదా, ఆరుగుల మీదా, కూడళ్ళలో నివసిస్తారు. గుహలలో, శ్మశానాలలో, కొండలలో, సెలయేళ్ళలో నివసిస్తారు. వివిధాభరణాలను, అనేక మాలలను, వస్త్రాలను ధరించేవారు. నానావిధాలైన విచిత్ర వేషధారిణులు, నానా భాషలు మాటాడేవారు. వీరే కాక ఇంకా ఎన్నో శత్రుభీకర గణాలు దేవేంద్రుని అనుమతితో ఆ మహాత్ముని అనుసరించారు.

రాజశార్దూలా! ఆపై పూజ్యుడైన దేవేంద్రుడు రాక్షసవినాశం కోసం కార్తికేయునకు శక్త్యాయుధాన్ని ఇచ్చాడు. మహా గంటలతో, మహాధ్వనితో, తెల్లని కాంతితో ప్రకాశిస్తోంది. భరతర్షభా! పశుపతి ఆ కార్తికేయునకు అరుణుని వలె, సూర్యునివలె ప్రకాశిస్తున్న పతాకాన్ని, సర్వభూతమయమైన పెద్ద సైన్యాన్ని ఇచ్చాడు. ఆ భీకర సైన్యానికి ధనంజయ మనిపేరు. అది వివిధాయుధాలు, తపస్సు, బలం, పరాక్రమాలతో కూడినది. రుద్రుని బలంవంటి బలంగల ముప్పది రుద్ర గణాలతో ఏర్పడి, శత్రువులకు గెలవరాని దది. ఆ సేన ఎప్పుడూ యుద్ధంలో వెనుకంజ వేయదు. శక్తి వర్ధిల్లజేసే వైజయంతీ మాలను విష్ణువు ఇచ్చాడు. ఉమాదేవి సూర్యకాంతిగల రెండు నిర్మల వస్త్రాలనిచ్చింది. గంగ దివ్యమైన ఒక ఉత్తమ కమండలాన్ని ఇచ్చింది. దాని నుండి అమృతం వెలువడుతుంది. బృహస్పతి ప్రీతితో కుమారునకు ఒక దండాన్ని ఇచ్చాడు. గరుడుడు విచిత్రమైన రెక్కలు గల తన ప్రియ కుమారుడైన నెమలిని ఇచ్చాడు. అరుణుడు చరణాలే ఆయుధంగా గల కోడిని ఇచ్చాడు. ఆపై వరుణరాజు బలపరాక్రమాలతో కూడిన ఒక నాగాన్ని ఇచ్చాడు. లోకసృష్టికర్త, సమర్థుడు అయిన బ్రహ్మ బ్రాహ్మణ హితాన్ని కోరుతూ మృగచర్మాన్ని, యుద్ధజయాన్ని అనుగ్రహించాడు. స్కందుడు దేవగణానికి సేనాధిపతియై, జ్వాలలతో వెలుగొందుతున్న రెండవ అగ్నివలె ప్రకాశించాడు. ఆపై పారిషదులతో, మాతలతో కూడి స్కందుడు దేవతాశ్రేష్ఠులకు ఆనందం కలిగిస్తూ రాక్షసవినాశనానికై బయలుదేరాడు.

భయంకరమైన ఆ భూతగణసేన ఘంటలు, భేరులు, శంఖాలు, మురజాల ధ్వనులతో, ఆయుధాలతో, ఎత్తిన కేతనాలతో, పతాకలతో కూడి నక్షత్రాలతో శోభిస్తున్న శరత్కాలపుటాకాశంవలె ప్రకాశించింది. ఆపై ఆ దేవతాసమూహాలు, వివిధభూత గణాలు సావధానంగా మహాధ్వనిగల భేరులను, శంఖాలను, పటహాలను, ఝర్ఝరాలను, క్రకచాలను,

కొమ్ముబూరలను ఆడంబరాలను, గోముఖాలను, డిండిమాలను విరివిగా మ్రోగించారు. ఇంద్రునితో సహా దేవతలందరూ కుమారుని స్తుతించారు. దేవగంధర్వులు గానం చేశారు. అప్సరోగణాలు నృత్యం చేశారు. దానితో ప్రీతి చెంది, మహాసేనుడు "మీరు చంపదలచిన శత్రువులను యుద్ధంలో చంపుతాను" అని దేవతలకు వరమిచ్చాడు. మహాత్ములైన దేవతలు దేవతాశ్రేష్ఠుడైన ఆ కుమారుని నుండి వరాన్ని పొంది, ప్రీతమనస్కులై శత్రువులు మరణించినట్లే భావించారు. మహాత్ముడైన స్కందుడు వరమివ్వగానే సర్వ భూతసంఘాల ఆనందంతో చెలరేగిన నినాదం మూడు లోకాలలోనూ ప్రతిధ్వనించింది. మహాసేనతో కూడిన ఆ మహాసేనుడు దేవతలను రక్షించటానికి, యుద్ధంలో రాక్షసులను సంహరించటానికి బయలుదేరాడు. ప్రయత్నం, జయం, ధర్మం, సిద్ధి, లక్ష్మి, ధృతి, స్మృతి మహాసేనుని సేనలకు ముందు నడిచాయి. ఆ సేన భీకరమైనది. ఆ సైనికులు శూలాలు, ముద్గరాలు, గదలు, ముసలాలు, బాణాలు, శక్తులు, తోమరాలు చేతబట్టారు. చిత్రాభరణాలను, కవచాలను ధరించారు. మండుతున్న కొరివి కట్టెలు పట్టుకొన్నారు. పొగరెక్కిన సింహంవలె నినాదాలు చేయసాగారు. వారితో కలిసి సింహనాదం చేసి, గుహుడు బయలుదేరాడు. ఆ గుహుని చూసి దైతేయులు, రాక్షసులు, దానవులు అందరూ భయోద్విగ్నులై అన్ని దిక్కులకూ అన్నివైపుల నుండి పారిపోయారు. దేవతలు వివిధాయుధాలను చేతబట్టి ఆ రాక్షసుల వెంటబడ్డారు. రాక్షసులు పారిపోవటం చూసి, తేజోబలసంపన్నుడైన స్కందభగవానుడు మాటిమాటికీ శక్త్యస్త్రాన్ని ప్రయోగించాడు. తన తేజస్సును దానిలో నిక్షేపించాడు. ఆది ఆజ్యంపోసిన అగ్నివలె ప్రజ్వరిల్లసాగింది. అమితతేజస్వి అయిన స్కందుడు శక్తి అస్త్రాన్ని ప్రయోగిస్తున్నప్పుడు జ్వలిస్తున్న తోకచుక్క నేలబడింది. ప్రళయకాలంలో పరమభీకర ధ్వని చేస్తూ పిడుగులు పడినట్లు ఆ సమయంలో గర్జనలతో పాటు పిడుగులు పడసాగాయి. అగ్నికుమారుడైన స్కందుడు ఘోరమైన శక్తిని ఒక్కసారి విసరగానే దానినుండి కోట్లకొలది శక్తులు వెలువడ్డాయి. దానితో తృప్తి చెంది, సమర్థుడు, పూజ్యుడు అయిన మహాసేనుడు ప్రసన్నుడై, మహాబలపరాక్రమశాలి అయిన రాక్షసుని సంహరించాడు. ఆ రాక్షసుని పేరు తారకుడు. ఆయన చుట్టూ అప్పుడు లక్షమంది దానవ వీరులున్నారు. స్కందుడు ఎనిమిది పద్మాల సేనతో కూడియున్న మహిషుని కూడా చంపాడు. పదిలక్షల సైనికుల మధ్య నిలిచిన త్రిపాదుని, పది నిఖర్వాల సేనలు చుట్టూ ఉన్న భ్రాదోదరుని కూడా వివిధాయుధాలను చేతబట్టి ఉన్న అతని అనుచరులతో సహా సంహరించాడు.

రాజా! శత్రువులు సంహరింపబడుతుండగా కుమారుని అనుచరులు పది దిక్కులనూ ప్రతిధ్వనింపజేస్తూ పెద్దగా సింహనాదాలు చేశారు. ఆనందంతో నృత్యం

చేశారు. ఎగిరారు, అట్టహాసాలు చేశారు. రాజేంద్రా! శక్తి అస్త్రం నుండి వెలువడి అంతటా విజృంభిస్తున్న జ్వాలలతో మూడు లోకాలూ పూర్తిగా భయపడ్డాయి. ఆ జ్వాలలో వేలకొలదిగ రాక్షసులు దగ్ధమయ్యారు. స్కందుని సింహనాదాలతో కొందరు, పతాకంతో త్రోసి వేయబడి కొందరు రాక్షసులు చనిపోయారు. కొందరు ఘంటాధ్వనులకే భయపడి నేల గూలారు. కొందరు ఆయుధాల దెబ్బలతో ప్రాణాలు కోల్పోయి పడిపోయారు. ఈ రీతిగా కార్తికేయుడు యుద్ధంలో ఆతతాయులయిన రాక్షసుల నెందరినో సంహరించాడు. అప్పుడు బలిచక్రవర్తి కొడుకు అయిన బాణాసురుడు క్రౌంచ పర్వతాన్ని ఆశ్రయించి, దేవసమూహాలను బాధించసాగాడు. మహాసేనుడు ఆ రాక్షసునిపై దాడిచేశాడు. కార్తికేయుని చూసి భయపడి, ఆ బాణుడు క్రౌంచ పర్వతాన్ని శరణుకోరాడు. దానితో కార్తికేయ భగవానునకు తీవ్రకోపం వచ్చింది. దానితో ఆయన క్రౌంచ పక్షుల అరుపులతో ప్రతిధ్వనిస్తున్న క్రౌంచ పర్వతాన్ని అగ్నిదత్తమైన శక్తితో బ్రద్దలు చేశాడు. ఆ క్రౌంచ పర్వతం శాలవృక్షాల బోదెలతో నిండిఉంది. అక్కడి కోతులు, ఏనుగులు బెదరిపోయాయి. పక్షులన్నీ కలతపడి ఎగిరిపోయాయి. పాములు నేలగూలాయి. కొండ ముచ్చులు, ఎలుగుబంట్ల సమూహాలు పారిపోతూ, అరుస్తూ ఆ కొండను ప్రతిధ్వనింపజేస్తున్నాయి. బింకల ఆర్తనాదాలతో అరణ్యం ప్రతిధ్వనిస్తోంది. గుహలనుండి బయటపడి ఏనుగుగున్నలు, సింహాలు వేగంగా పరుగెత్తుతున్నాయి. ఆ కొండ దయనీయస్థితిని పొందింది. అయినా అందంగా కనిపిస్తున్నట్లే ఉంది. ఆ పర్వత శృంగంపై నివసిస్తున్న విద్యాధరులు పడిపోయారు. శక్త్యాయుధం దెబ్బతో పుట్టిన శబ్దానికి కలతపడి కిన్నరులు ఎగిరిపోయారు. ఆపై ప్రజ్వలిస్తున్న ఆ మేటికొండ మీద నుండి విచిత్రాభరణాలు, పూలమాలలు ధరించిన దైత్యులు వందలు, వేలకొలదిగ పడిపోయారు. కుమారస్వామి అనుచరులు వారిపై దాడిచేసి, యుద్ధంలో వారిని చంపారు. అప్పుడు ఆ కుమారస్వామి కూడా కోపించి, ఆ రాక్షసరాజకుమారుని తమ్ములతో సహా దేవేంద్రుడు వృత్రుని చంపినట్లు సంహరించాడు. మహాబలుడు, పరవీరసంహారకుడు అయిన కుమారస్వామి తాను అనేకులుగా, ఒక్కడుగా మారుతూ శక్తి ఆయుధంతో క్రౌంచపర్వతాన్ని బ్రద్దలు చేశాడు.

రణభూమిలో కుమారస్వామి శక్తిని విసిరితే అది మరల ఆయన చేతికి వచ్చి చేరేది. ఆ భగవానుని ప్రభావం అంతటిది, అంతకన్నా ఎక్కువ కూడా. శౌర్యాది గుణాల కలయికతో, తేజస్సుతో, కీర్తితో, సంపన్నతతో కుమారుడు క్రౌంచాన్ని బ్రద్దలు చేయగలిగాడు. వందలకొలది రాక్షసులను సంహరించాడు. ఆ కుమారదేవుడు దేవతల శత్రువులను

చంపి, వారిచే అభినందింపబడుతూ పరమానందాన్ని పొందాడు. ఆపై దుందుభులు, శంఖాలు, మ్రోగాయి. యోగీశ్వరుడైన కుమారదేవునిపై దేవతాస్త్రీలు వందలు, వేల మంది పూలవానను కురిపించారు. పవిత్రమారుతం దివ్యగంధాలను వీచింది. గంధర్వులు, యాగశీలులైన మహర్షులు స్తోత్రాలు చేశారు. కొందరు ఆయనను " ఈ బ్రహ్మ కుమారుడు అందరికన్నా పెద్ద అయి, బ్రహ్మపుత్రు డైన సనత్కుమారుడే" అని నిశ్చయించాడు. కొందరు మహేశ్వరసుతుడని, కొందరు అగ్ని పుత్రుడు, కొందరు ఉమకొడుకని, కొందరు కృత్తికల కుమారుడని, కొందరు గంగ కొడుకని చెప్పుకొనసాగారు. మహాబలుడు, యోగీశ్వరుడు అయిన ఆ కుమారదేవుని లోకులు ఒకటి, రెండు, నాలుగు, వందలు, వేల రూపాలలో భావించసాగారు. రాజా! ఈ రీతిగా కార్తికేయాభిషేకాన్ని గూర్చి నీకు చెప్పాను. ఇక తీర్థరాజమైన సరస్వతి యొక్క పవిత్రతను విను. మహారాజా! దేవతల శత్రువులను కుమారస్వామి సంహరించగా ఆ తీర్థరాజం మరొక స్వర్గంవలె నిలిచింది. అక్కడే నిలిచి కుమారస్వామి విడివిడిగా ఐశ్వర్య ప్రదానం చేశాడు. గణముఖ్యులకు ఆ అగ్నిసుతుడు మూడు లోకాలను ఇచ్చివేశాడు. మహారాజా! ఈ రీతిగా ఆ తీర్థంలో రాక్షసకుల వినాశకుడైన కుమారస్వామి దేవతలచే దేవసేనాపతిగా అభిషిక్తుడయ్యాడు. భరతర్షభా! అది **త్రైజపతీర్థం.** అక్కడే గతంలో జలాధిపతి అయిన వరుణుని దేవతలు అభిషేకించారు. బలరాముడు ఈ తీర్థరాజంలో స్నానంచేసి, స్కందుని, అర్చించి, బ్రాహ్మణులకు బంగారాన్ని, వస్త్రాలను, ఆభరణాలను దానం చేశాడు. బలరాముడు ఆ రాత్రి అక్కడ వసించి, ఆ పూజ్య తీర్థరాజంలో జలాన్ని స్పృశించి, ప్రీతమనస్కుడై ఆనందించాడు. రాజా! నీవు నన్ను అడిగిన విషయమంతా చెప్పాను. బాలుడే అయినా మహాబలుడైన పూజ్య కుమారస్వామిని దేవతలందరూ కలిసి దేవసేనానిగా అభిషేకించిన వృత్తాంతాన్ని వివరించాను.'

47. వరుణాభిషేకము

జనమేజయుడిలా అడిగాడు. "బ్రాహ్మణా! విధిపూర్వకంగా జరిగిన ఈ అద్భుత కుమారాభిషేక వృత్తాంతాన్ని యథాతథంగా విస్తారంగా విన్నాను. తపోధనా! ఇది విని, నన్ను నేను పవిత్రుడనైనట్లు భావిస్తున్నాను. సంతోషంతో గగుర్పాటు కలుగుతోంది. నా మనస్సు ప్రసన్నంగా ఉంది. కుమారుని అభిషేకాన్ని, రాక్షసవధను విని, నాకు పరమానందం కలిగింది. నాకు మరలా కుతూహలం కలుగుతోంది. ఈ ప్రదేశంలో దేవతలు గతంలో వరుణుని ఎలా అభిషేకించారు ? అది నాకు చెప్పు. సత్తమా! నీవు నేర్పరివి" వైశంపాయనుడిలా

చెప్తున్నాడు. "రాజా! పూర్వకల్పంలో జరిగిన ఈ చిత్ర వృత్తాంతాన్ని యథాతథంగా విను. పూర్వం కృతయుగం యథావిధిగా జరుగుతున్నప్పుడు దేవతలందరూ వరుణుని దగ్గరకు పోయి ఇలా అన్నారు. "సురరాజైన ఇంద్రుడు మమ్ములను ఎప్పుడూ భయాలనుండి రక్షించినట్లు నీవు కూడా నదుల కన్నిటికి నాథుడవు కావాలి. దేవా! నీ నివాసమెప్పుడూ మకరాలయమైన సముద్రంలోనే. నదీపతి అయిన సముద్రుడు నీ ఆధీనంలో ఉంటాడు. చంద్రునితో పాటు నీకు కూడా హానీ, వృద్ధీ ఉంటాయి." వరుణుడు "ఆలాగే కానివ్వండి" అని ఆ దేవతలతో అన్నాడు. ఆ పై దేవతలంతా కలిసి, సాగర నిలయుడైన వరుణుని విధివిహితకర్మతో జలాధిపతిని చేశారు.

ఆ తరువాత దేవతలు వరుణుని జలాధిపతిగా అభిషేకించి, జలేశ్వరుని పూజించి, తమ తమ స్థానాలకు వెళ్ళిపోయారు. వరుణుడు కూడా ఆ రీతిగా దేవతలచే అభిషిక్తుడై, ఇంద్రుడు దేవతలను పాలించినట్లు యథావిధిగా నదులను, సముద్రాలను, నదాలను, సరస్సులను పాలించసాగాడు. మహాప్రాజ్ఞుడైన బలరాముడు ఆ తీర్థంలో కూడా స్నానమాడి, అక్కడ నుండి **అగ్నితీర్థానికి** వెళ్ళాడు. అనఘా! అగ్ని శమీ గర్భంలో దాగినప్పుడు ఆయన దర్శనం లేకుండా పోయింది. లోకుల ఆలోకం (దృష్టి) నశించే సమయం వచ్చింది. అప్పుడు దేవతలందరూ సర్వలోకపితా మహుడైన బ్రహ్మదగ్గరకుపోయి "స్వామీ! అగ్ని కనిపించటం లేదు. కారణం తెలియటం లేదు. సర్వప్రాణులు నశించిపోయేటట్లున్నాయి. అగ్నిని కనిపింపజేయండి" అని ప్రార్థించారు. జనమేజయుడిలా అడిగాడు. "అగ్ని ఎందుకు కనిపించకుండా పోయాడు? దేవతలు ఆయననెలా తెలిసికొనగలిగారు. ఉన్నదున్నట్లు నాకు చెప్పు!!" వైశంపాయనుడిలా చెప్తున్నాడు. పూజ్యుడు, ప్రతాపవంతుడూ అయిన అగ్ని భృగువు శాపం వలన తీవ్రంగా భయపడి, జమ్మిచెట్టులో ప్రవేశించి" కనపించకుండా పోయాడు. అగ్ని కనిపించకపోయేసరికి అప్పుడు ఇంద్రునితో సహా దేవతలందరూ తీవ్రదుఃఖంతో అదృశ్యుడైయున్న అగ్నిని వెదకారు. ఆపై అగ్నితీర్థానికి వచ్చి యథావిధిగా జమ్మి చెట్టులో నివసిస్తున్న అగ్నిని చూశారు. నరోత్తమా! బృహస్పతిని ముందుంచుకొని ఇంద్రునితో సహా దేవతలందరూ అగ్నిదగ్గరకు వచ్చి ఆనందించారు. వారంతా వచ్చినరీతిలోనే తిరిగి వెళ్ళిపోయారు. మహాభాగా! అగ్ని భృగువు శాపంవలన సర్వభక్షకు డయ్యాడు.

అక్కడ కూడా స్నానంచేసి మతిమంతుడైన బలరాముడు బ్రహ్మమోని తీర్థానికి వెళ్ళాడు. సర్వలోకపితామహుడైన బ్రహ్మ సృష్టిచేసినది అక్కడే. పూర్వకాలంలో సమర్థుడైన

బ్రహ్మ అక్కడ తీర్థంలో స్నానం చేసి, యథావిధిగా దేవతాతీర్థాలను సృష్టించాడు. అక్కడ స్నానం చేసి, వివిధ ధనాలను దానం చేసి బలరాముడు **కుబేర తీర్థానికి** వెళ్ళాడు. అక్కడ మహాతపస్సు చేసియే, కుబేరుడు ప్రభువై, ధనాధిపత్యాన్ని పొందగలిగాడు. రాజా! అక్కడే అతని దగ్గరకు ధనాలు, నిధులు చేరేవి. నరోత్తమా! హలధరుడైన బలరాముడు ఆ తీర్థానికి వెళ్ళి, యథావిధిగా స్నానంచేసి, బ్రాహ్మణులకు ధనమిచ్చాడు. అక్కడ ఉత్తమవనంలో ఆ కుబేరస్థానాన్ని చూశాడు బలరాముడు. గతంలో మహాత్ముడు, యక్షరాజు అయిన కుబేరుడు అక్కడే దీర్ఘతపస్సు చేసి, ఎన్నో వరాలను పొందాడు. అక్కడే కుబేరుడు ధనాధిపత్యాన్ని, అమితతేజస్వి అయిన రుద్రునితో మైత్రిని, సురత్వాన్ని, లోకపాలకత్వాన్ని, ఒక కొడుకును - నలకూబరుని తేలికగా పొందగలిగాడు. దేవతాగణాలన్నీ ఒక్కటై అక్కడే కుబేరుని అభిషేకించాయి. మనోవేగం గలిగి, హంసలను పూన్చిన దివ్యవిమానాన్ని కూడా వాహనంగా ఇచ్చారు. యక్షులపై ఆధిపత్యాన్ని కూడా ఇచ్చారు. రాజా! బలరాముడు అక్కడ స్నానంచేసి, తెల్ల చందనం పూసికొని, పుష్కలంగా ధనాల నిచ్చి, వేగంగా బదరపాచన తీర్థానికి వెళ్ళాడు. సమస్తప్రాణులు ఆ తీర్థాన్ని ఆశ్రయించి ఉంటాయి. నానాఋతువుల చెట్లు అక్కడ ఎప్పుడూ పూలనూ, పండ్లను అందిస్తాయి. అది శుభకరం.'

48. బదరపాచన తీర్థమహిమ.

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'ఆపై బలరాముడు తపస్సులు, సిద్ధులు చలించే **బదరపాచన తీర్థానికి** వెళ్ళాడన్నాను గదా! రాజా! అక్కడ భరద్వాజుని పుత్రిక శ్రుతావతి వ్రతాలు పూని, నివసిస్తోంది. ఆ కుమారి బ్రహ్మచారిణి, లోకంలో సాటిలేని సౌందర్యవతి. "దేవరాజైన ఇంద్రుడు నా భర్తకావాలి" అన్న నిశ్చయంతో ఆ భామిని అనేక నియమాలను పాటిస్తూ, ఉగ్రతపస్సు చేసింది. కురుకులశ్రేష్ఠా! స్త్రీలు సాధారణంగా పాటించలేని తీవ్రనియమాలను పాటిస్తూ ఆమె అనేక సంవత్సరాలు గడిపింది. ఆమె ప్రవర్తనతో, తపస్సుతో, భక్తితో పూజ్యుడైన ఇంద్రుడు పరమప్రీతిని పొందాడు. సమర్థుడైన దేవేంద్రుడు మహాత్ముడూ, బ్రహ్మర్షి అయిన వసిష్ఠుని రూపాన్ని ధరించి ఆమె ఆశ్రయానికి వచ్చాడు. తాపసశ్రేష్ఠుడు, ఉగ్రతపస్వి అయిన వసిష్ఠుని చూసి, ఆమె ముని జనులకు తగిన ఆచారాలతో ఆయనను సత్కరించింది. అప్పుడు నియమజ్ఞానినియై ప్రియంగా మాటాడగల శుభలక్షణ ఆ శ్రుతావతి ఇలా అన్నది. "స్వామీ! మునిశ్రేష్ఠా! ప్రభూ! మీ

ఆదేశమేమి? సువ్రత! నా శక్తిననుసరించి సర్వమూ మీకు సమర్పించగలను. కానీ ఇంద్రుని మీద భక్తిగలదానను కాబట్టి పాణిగ్రహణానికి మాత్రం ఏ రీతిగానూ అంగీకరించలేను. తపోధనా! వ్రతాలతో, నియమాలతో, తపస్సుతో త్రిలోకాధిపతి అయిన ఇంద్రుని నేను సంతోషపెట్టాలి." భారతా! ఆమె అలా అనగానే పూజ్యుడైన దేవేంద్రుడు ఆశ్చర్యంతో ఆమెను తేరిపారజూచి, ఆమె నియమాన్ని గ్రహించి ఓదార్చుతున్నట్లు ఇలా అన్నాడు.

"సువ్రతా! ఉగ్రతపస్సును చేస్తున్నావని నాకు అర్థమైంది. కళ్యాణీ! ఎందుకీ ప్రయత్నం? నీ మనస్సులో ఏముంది? వరాననా! అదంతా యథార్థంగా సఫలమవుతుంది. తపస్సు చేత అన్నింటినీ పొందవచ్చు. నీ కోరిక కూడా అలాగే సిద్ధిస్తుంది. దేవతల దివ్యస్థానాలను తపస్సుతో పొందవచ్చు. గొప్ప సుఖాలకు తపస్సే కారణం. ఆ భావనతో మానవులు ఘోరతపస్సులు చేసి, శరీరాన్ని వదలిన తరువాత దేవత్వాన్ని పొందుతున్నారు. నా మాట ఒకటి విను. సుభగా! శుభవ్రతా! ఇవిగో, ఈ అయిదు రేగుపండ్లను వండు" అని చెప్పి పూజ్యుడైన ఇంద్రుడు ఆమెదగ్గర వీడ్కోలు తీసికొని, ఆ ఆశ్రమానికి దగ్గరలోనే ఉన్న ఉత్తమ తీర్థానికి చేరి, జపించసాగాడు. మానదా! అది ఇంద్రతీర్థ మని మూడులోకాలలోనూ ప్రసిద్ధి చెందింది. ఆమెను గూర్చి పూర్తిగా తెలిసికొనదలచి పూజ్యుడైన ఆ దేవేంద్రుడు ఆ పండ్లు ఉడకకుండా చేశాడు. ఆయన పాకశాసనుడు గదా ! రాజశార్దూలా! ఆ తరువాత పవిత్రతతో, మౌనభావంతో, అలసట లేకుండా ఆ తపస్వినీ ఆ రేగుపండ్లను అగ్నిలో పడవేసింది. మహావ్రతయై ఆ పండ్లను పక్వం చేయసాగింది. ఆమె అలా వండుతూనే ఉంది. ఎంతోకాలం గడచిపోయింది. అయినా అవి పక్వానికి రాలేదు. రోజంతా గడచిపోయింది. ఆమె దగ్గరున్న కట్టెలన్నీ అగ్నిదగ్ధ మయ్యాయి. అగ్నిలో కట్టెలు అయిపోవటంతో ఆమె తన శరీరాన్నే ఇంధనం చేసింది. చారుదర్శన అయిన ఆమె ముందుగా పాదాలను అగ్నిలో పెట్టింది. పాదాలు తగులబెడినా మళ్ళీ మొలవసాగాయి. అనింద్య అయిన ఆమె మహర్షి అభీష్టాన్ని నెరవేర్చదలచి, దుష్కర కర్మను ఆచరిస్తూ, కాళ్ళు తగులబడుతున్నా విచారించలేదు. ఆమెలో వైమనస్యం కానీ, ముఖంలో భేదం కానీ కలగలేదు. శరీరం అగ్నిలో మండుతున్నా నీటిమధ్యలో నిలిచినట్లే ఉంది ఆమెకు. భారతా! ఆమె మనస్సులో నిరంతరంగా ఆ ముని మాట ధ్వనిస్తోంది. ఎలాగైనా ఈ రేగుపండ్లను పక్వం చేయాలని ఆలోచిస్తోంది. ఆ శుభలక్షణ మహర్షి వచనాన్ని మనస్సులో నుంచుకొనియే రేగు పండ్లను వండసాగింది. కానీ అవి పక్వానికి రాలేదు. అగ్ని భగవానుడు స్వయంగా ఆమె పాదాలను దహించాడు. అప్పుడు కూడా ఆ మనస్సులో కొంచెం కూడా

బాధ కలగలేదు. త్రిలోకాధిపతి ఆమె చేష్టతో తృప్తి చెంది, ఆపై ఆ కన్యకు తన రూపాన్ని ప్రదర్శించాడు. సురోత్తముడు దృఢవ్రతధారిణి అయిన ఆ కన్యతో ఇలా అన్నాడు "శుభలక్షణా! నీ భక్తితో, తపస్సుతో, నియమంతో ప్రీతి చెందాను. కాబట్టి నీకిష్టమైన కోరిక నెరవేరుతుంది. మహాభాగా! శరీరాన్ని విడిచిన తర్వాత స్వర్గలోకంలో నాలో నివసించగలవు. సుభ్రూ! ఈ తీర్థరాజం లోకంలో బదరపాచన మన్న పేరుతో సర్వపాపాలను హరిస్తూ స్థిరంగా ఉంటుంది.

ఇది త్రిలోక ప్రసిద్ధం. బ్రహ్మర్షులెందరో ఇక్కడ స్నానమాడారు. ఈ తీర్థరాజంలో ఒకప్పుడు అరుంధతిని వీడి, సప్తర్షులు హిమాలయానికి వెళ్ళారు. అక్కడకు పోయి వ్రతధారులయిన ఆ మహాభాగులు జీవన నిర్వహణకోసం ఫలమూలాలు తెచ్చుకొనేందుకు వెళ్ళారు. జీవికను కోరుతూ వారు హిమవద్వనంలో నివసిస్తున్నప్పుడు అక్కడ కరువు ఏర్పడింది. అది పండ్రెండు సంవత్సరాలు కొనసాగింది. ఆ తపస్సులు అక్కడ ఆశ్రమాన్ని నిర్మించుకొని నివసించసాగారు. కళ్యాణి అయిన అరుధంతి కూడా అప్పుడు తపస్సుతోనే ప్రతిదినమూ గడిపేది. ఆపై తీవ్ర నియమాలలో నిలిచియున్న అరుంధతిని చూసి, పరమప్రీతి చెంది, వరదుడైన పరమేశ్వరుడు ఆమె దగ్గరకు వచ్చాడు. మహాదేవుడు బ్రాహ్మణ రూపాన్ని ధరించి ఆమె దగ్గరకు వచ్చి "శుభలక్షణా! భిక్షను కోరుతున్నాను" అని ఆమెతో అన్నాడు. అప్పుడు సౌందర్యవతి అయిన అరుంధతి ఆ బ్రాహ్మణునితో "విప్రా! సమీకరించిన అన్నం అయిపోయింది. ఈ రేగుపండ్లను తినండి" అని అన్నది. అప్పుడు మహాదేవుడు "సువ్రతా! అలాగే వాటిని పక్వం చేయి" అన్నాడు. మహాదేవుడు అలా అనగా బ్రాహ్మణుని అభీష్టాన్ని నెరవేర్చదలచి ఆ యశస్వినీ అగ్నిని ప్రజ్వలింపజేసి రేగుపండ్లను వండనారంభించింది. అప్పుడు ఆమె మనోరంజకాలైన దివ్యపుణ్య కథలనెన్నింటినో విన్నది. ఆహారం తినకుండా, రేగుపండ్లను వండుతూ, మంచి కథలను వింటూ ఆమె పండ్రెండు సంవత్సరాలు తీవ్రక్షామాన్ని అతిక్రమించింది. ఆ భీకర సమయం ఆమెకు ఒక్కరోజులా గడచిపోయింది. అంతలో హిమత్పర్వతం నుండి పండ్లు తీసికొని మునులు వచ్చారు. అప్పుడు పరమేశ్వరుడు ఆనందించి అరుంధతితో ఇలా అన్నాడు.

"ధర్మజ్ఞా! నీ తపస్సుతో, నియమంతో సంతసించాను. యథాపూర్వకంగా ఈ మునులసన్నిధికి వెళ్ళు" అప్పుడు భగవంతుడైన హరుడు స్వరూపంతో ప్రత్యక్షమయ్యాడు. ఆమె యొక్క మహాచరితను ఆ మునులకు చెప్పాడు. విప్రులారా! మీరు హిమవత్పర్వతంపై సముపార్జించిన తపస్సు ఈమె తపస్సుతో సమానం కాదని నా అభిప్రాయం. ఈ తపస్వినీ దుశ్చరమైన తపస్సు చేసింది. ఆహారం తీసికోకుండా కేవలం వండుతూ పండ్రెండు

సంవత్సరాలు గడిపివేసింది. ఆపై పరమేశ్వరుడు అరుంధతితో మరల "కళ్యాణి, నీ మనస్సులోనున్న నీ కిష్టమైన వరాన్ని కోరుకో" అన్నాడు. అప్పుడు ఆ అరుంధతి సప్తర్షుల సన్నిధిలో పరమేశ్వరునితో ఇలా అన్నది "స్వామీ! నామీద ప్రసన్నత ఉంటే సిద్ధులకు, దేవర్షులకు ఇష్టమైన ఈ అద్భుతతీర్థాన్ని బదరపాచనవనంగా ప్రకటించండి. దేవదేవేశా! అలాగే ఈ తీర్థంలో పవిత్రంగా మూడు రాత్రులు ఉపవాసంతో నివసించినవాడు పండ్రెండు సంవత్సరాల ఉపవాస ఫలితాన్ని పొందాలి". 'అలాగే' అని పరమేశ్వరుడు ఆ తపస్వినితో అన్నాడు. ఆపై సప్తర్షుల స్తోత్రాలనంది, పరమేశ్వరుడు తనలోకానికి వెళ్ళాడు. ఆ అరుంధతిని చూసి, ఋషులంతా ఆశ్చర్యపడ్డారు. ఆకలిదప్పులతో నున్నా అలసట కానీ తేజోహీనత కానీ ఆమెలో లేవు. నాకోసం నీవు తపించి, సిద్ధిపొందినట్లు పవిత్రురాలైన అరుంధతి కూడా పైరీతిగా గొప్పసిద్ధిని పొందింది. భద్రా! ఈ వ్రతంలో నీవు విశేషించి ఆత్మసమర్పణ చేశావు. నీ నియమశీలతతో బాగా ఆనందించాను కాబట్టి నీకు విశిష్టమైన వరాన్ని ఇప్పుడిస్తాను. మహాత్ముడైన పరమేశ్వరుడు ఆ అరుంధతికి ఇచ్చిన వరంకన్నా అధికంగా, యథావిధిగా నీకు వరమిస్తాను. నీ ప్రభావం, తేజస్సు దానికి కారణం. ఈ తీర్థంలో సావధానంగా ఒకరాత్రిని గడిపిన వాడు, ఇక్కడ స్నానం చేసి, దేహత్యాగాన్ని చేసినవాడు దుర్లభలోకాలను పొందగలుగుతాడు. పుణ్యశీల అయిన శ్రుతావతితో అలా పలికి ఇంద్రుడు మరల స్వర్గానికి వెళ్ళాడు. ఇంద్రుడు వెళ్ళిపోగానే పవిత్రవాసనలు గల దివ్యపుష్పవృష్టి అక్కడ కురిసింది. అక్కడ దేవదుందుభులు మ్రోగాయి. పుణ్య గంధాలతో పవిత్ర పవనం వీచసాగింది. అచ్యుతా! శుభలక్షణ అయిన శ్రుతావతి శరీరాన్ని వదలి ఇంద్రుని పొంది, అతనితో సుఖించసాగింది.'

జనమేజయుడిలా అడిగాడు. 'స్వామీ! ఆమె తల్లి ఎవరు ? ఆ శోభన ఎక్కడ పెరిగింది. విప్రా! అది వినాలని కోరుతున్నాను. నాకెంతో కుతూహలంగా ఉంది.' వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'అప్సరస – ఘృతాచిని చూసి, బ్రహ్మర్షి అయిన భరద్వాజునకు వీర్యస్ఖలన మయింది. మహర్షిశ్రేష్ముడైన ఆయన ఆ రేతస్సును చేతిలోనికి తీసికొన్నాడు. అయితే అది అప్పుడు ఆకుదొన్నెలో పడింది. అది పుత్రిక అయింది. తపోధనుడైన ఆ భరద్వాజమహాముని ఆమెకు జాతకర్మాది సంస్కారాల నన్నింటినీ చేయించాడు. దేవర్షి గణ సమూహంలో ఆ ధర్మాత్ముడు శ్రుతావతి అని పేరు పెట్టాడు. తన ఆశ్రమంలోనే ఆమెనుంచి హిమవద్వనానికి వెళ్ళాడు. బలరాముడు అక్కడ కూడా సావధానంగా స్నానంచేసి మహావిప్రులకు ధనదానంచేసి, అప్పుడు అక్కడనుండి ఇంద్రతీర్థానికి వెళ్ళాడు.'

49. ఇంద్ర - రామ - యమునా - ఆదిత్య తీర్థాల మహిమ

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'ఆపై యదువంశశ్రేష్ఠుడైన బలరాముడు **ఇంద్రతీర్థానికి** పోయి, యథావిధిగా స్నానమాచరించి విప్రులకు ధనాన్ని, రత్నాలను దానం చేశాడు. అక్కడ అమరరాజైన దేవేంద్రుడు వందయాగాలను చేసి, బృహస్పతికి ఎఱతో ధనాన్ని దానం చేశాడు. అనేక దక్షిణలతో కూడి పరిపుష్టి నందిన ఆ యాగాలను వేద పండితులతో కలిసి, యథాశాస్త్రంగా నిర్విఘ్నంగా పూర్తిచేశాడు దేవేంద్రుడు. మహాతేజస్వి అయిన ఇంద్రుడు ఆ యాగాలను యథావిధిగా వందసార్లు పూర్తిచేశాడు. అందువలన శతక్రతు వని ప్రసిద్ధికెక్కాడు. ఆ పేరుమీదనే ఆ తీర్థానికి ఇంద్రతీర్థమని పేరు వచ్చింది. అది శివకరం, పుణ్యప్రదం, సనాతనం, సర్వపాప విమోచకం కూడా. బలరాముడు అక్కడకూడా యథావిధిగా స్నానం చేసి, మంచి వస్త్రాలతో భోజనాలతో బ్రాహ్మణుల నర్చించి, అక్కడనుంచి శుభకరమూ, తీర్థశ్రేష్ఠమూ అయిన **రామతీర్థానికి** వెళ్ళాడు. అక్కడ పరశురాముడు అనేకపర్యాయాలు క్షత్రియశ్రేష్ఠులను సంహరించి భూమిని జయించి, మునిశ్రేష్ఠుడైన తన గురువును - కశ్యపుని ముందు నిలుపుకొని వాజపేయాన్ని వంద అశ్వమేధయాగాలను చేశాడు. సాగరపర్యంతంగా ఉన్న భూమిని దక్షిణగా ఇచ్చివేశాడు. నానారత్నాలతో కూడిన వివిధ దానాలను గోవులతో, ఏనుగులతో, దాసులతో, మేకలతో, గొఱ్ఱెలతో సహా ఇచ్చి అరణ్యానికి వెళ్ళిపోయాడు.

దేవర్షులు బ్రహ్మర్షులు సేవించే ఆ పుణ్య తీర్థరాజంలో మునులకు నమస్కరించి, ఆపై **యమునా తీర్థానికి** వచ్చాడు బలరాముడు. అక్కడే అదితికొడుకు, వరుణుడు రాజసూయం చేశాడు. వరుణుడు అక్కడే యుద్ధంలో మనుష్యులను దేవతలను ఓడించి యజ్ఞాన్ని నిర్వహించాడు. ఆ క్రతువు ముగియగానే మూడులోకాలకూ భయం కలిగిస్తూ దేవదానవయుద్ధం జరిగింది. జనమేజయా! శ్రేష్ఠయాగమైన రాజసూయం జరిగినపుడు క్షత్రియులలో మహాఘోరమైన యుద్ధం జరుగుతుంటుంది.

కోరికలు తీర్చగల ప్రభువైన బలదేవుడు అక్కడ కూడా ఋషులను పూజించి, సేవించి, ఇతర యాచకులకు కూడా దానాలు చేశాడు. కమలేక్షణుడైన బలరాముడు మహర్షుల స్తోత్రాలనందుకొని, ఆనందించి, అక్కడనుండి **ఆదిత్యతీర్థానికి** వెళ్ళాడు. ఆ ప్రదేశంలోనే యాగం చేసి జ్యోతిస్వరూపుడైన సూర్యభగవానుడు గ్రహాధిపత్యాన్నీ, ప్రభుత్వాన్నీ పొందాడు. రాజా! ఆ నదీతీరంలోనే ఇంద్రునితో సహా సకల దేవతలూ, విశ్వేదేవులు, మరుత్తులు, గంధర్వులు, అచ్చరలు, ద్వైపాయనుడు, శుకుడు, మధుసూదనుడైన కృష్ణుడు యక్షులు, రాక్షసులు, పిశాచులు - వీరే కాక ఇతరులు వేలకొలదిగ యోగసిద్ధిని పొందారు.

శివకరమూ, పుణ్యప్రదమూ అయిన ఆ సరస్వతీ తీర్థంలోనే గతంలో విష్ణువు మధుకైటభ రాక్షసులను సంహరించి, స్నానంచేశాడు. ఆ ఉత్తమ తీర్థరాజంలోనే ధర్మాత్ముడైన ద్వైపాయనుడు (వ్యాసుడు) స్నానంచేసి పరమయోగాన్ని, పరమసిద్ధిని పొందాడు. మహాతపస్వి అయిన అసితదేవలబుషి ఆ తీర్థంలోనే పరమయోగాన్ని ఆశ్రయించి, యోగసిద్ధిని పొందాడు.'

50. ఆదిత్య తీర్థమహిమ

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'అసితదేవలుడు గతంలో గృహస్థధర్మాన్ని స్వీకరించి, ఆ తీర్థంలోనే నివసించేవాడు. ఆయన ధర్మనిత్యుడు, పవిత్రుడు, జితేంద్రియుడు, ఎవ్వరినీ శిక్షించేవాడు కాదు, మహాతపస్వి. మనసా, వాచా, కర్మణా సర్వప్రాణులయందు సమభావన గలవాడు. మహారాజా! ఆయన క్రోధరహితుడు. నిందాస్తుతులను సమానంగానే స్వీకరించేవాడు. ఇష్టమైనా, అనిష్టమైనా ప్రవర్తన సమానమే. యమునివలె సమదృష్టిగలవాడు. ఆ మహాతపస్వి బంగారాన్ని, మట్టిగెడ్డను ఒకటిగానే చూడగలవాడు. నిత్యమూ అతిథులను, బ్రాహ్మణులను, దేవతలను పూజించేవాడు. నిత్యమూ బ్రహ్మచర్యపరుడు, సదా ధర్మపరాయణుడు. ఒకప్పుడు ధీమంతుడు, సన్యాసి అయిన జైగీషవ్యముని, యోగాన్ని ఆశ్రయించి, ఆ తీర్థానికి వచ్చి, సమాధి నిష్ఠతో అక్కడ ఉండసాగాడు. రాజా! ఆ మహాతేజస్వి దేవలుని ఆశ్రమంలో ఉండేవాడు. ఆ మహాతపస్వి నిత్యమూ యోగతత్పరుడై సిద్ధిని పొందాడు. అక్కడ నివసిస్తున్న ఆ జైగీషవ్యమహాముని చూస్తూ కూడా దేవలుడు ధర్మబద్ధంగా యోగసాధన చేయలేదు. మహారాజా! ఆ రీతిగా ఆ ఇద్దరుండగా చాలాకాలం గడచిపోయింది. జనమేజయా! ఆపై కొంతకాలం దేవలమునికి జైగీషవ్యుడు నిత్యమూ కనిపించేవాడు కాదు. ధర్మజ్ఞుడు, ధీమంతుడైన జైగీషవ్యుడు భిక్షాకాలంలోనే దేవలుని దగ్గరకు వచ్చేవాడు. భిక్షురూపంలో వచ్చిన ఆ మహామునిని చూసి, దేవలుడు ఎంతో గౌరవాన్ని, ఎంతో ప్రేమను ప్రకటించి, యథాశక్తిగా, బుషులు చెప్పిన పద్ధతిలో ఏకాగ్రతతో అర్చించాడు. అలా కొన్ని సంవత్సరాలు గడచిపోయాయి. రాజా! ఒకప్పుడు మహాతేజస్వి అయిన జైగీషవ్యుని చూసి, మహాత్ముడైన దేవలుని మనస్సులో తీవ్రచింత కలిగింది. 'ఈ మునిని సేవిస్తూ నేను ఎన్నో సంవత్సరాలు గడిపాను. అలసుడైన ఈ భిక్షువు నాతో ఏమీ మాటాడటం లేదు.'

అలా ఆలోచిస్తూనే శ్రీమంతుడైన దేవలుడు కలశాన్ని తీసికొని, ఆకాశమార్గంలో మహాసాగరానికి వెళ్ళాడు. భారతా! సాగరుని దగ్గరకు సమీపిస్తూనే ధర్మాత్ముడైన దేవలుడు

తనకన్నా ముందే అక్కడకు చేరియున్న జైగీషవ్యుని చూశాడు. అప్పుడు అమితతేజస్వి అయిన అసిత దేవలుడు ఆశ్చర్యపడి, ఆలోచించసాగాడు. "ఈ భిక్షువు సముద్రానికి ఎలా వచ్చాడు? అప్పుడే స్నానం కూడా ముగించాడు". జనమేజయా! అలా ఆలోచిస్తూనే ఆ శ్రీమంతుడు సముద్రంలో యథావిధిగా స్నానంచేసి, జపించదగిన మంత్రాలను జపించి, జపాదినిత్యానుష్ఠానాలను ముగించి, కలశాన్ని జలంతో నింపి, తీసికొని ఆశ్రమానికి వెళ్ళాడు. ఆ ముని తన ఆశ్రమపదంలో ప్రవేశిస్తూనే అక్కడ కూర్చొనియున్న జైగీషవ్యుని చూశాడు. జైగీషవ్యుడు దేవలునితో ఏ సంభాషణా చేయలేదు. ఆ మహాతపస్వి కట్టివలె ఆశ్రమపదంలో నివసిస్తున్నాడు. సాగరసమానుడైన జైగీషవ్యుడు సముద్రజలంలో స్నానంచేసి, తన కన్నా ముందే ఆశ్రమంలో ప్రవేశించి ఉండటం చూసి, ధీమంతుడైన అసితదేవలుడు మరల చింతాక్రాంతుడయ్యాడు. రాజేంద్రా! యోగజనితమైన ఆ జైగీషవ్యుని తపఃప్రభావాన్ని చూసి, మునిసత్తముడైన ఆ దేవలుడు "ఈయన సముద్రతీరాన, ఆశ్రమంలో కూడా ఎలా కనిపించాడు" అని ఆలోచించాడు. అలా ఆలోచిస్తూనే మంత్రపారగుడైన ఆ ముని ఆ ఆశ్రమనుండి అంతరిక్షంపైకి ఎగిరిపోయాడు. ఆ దేవలుడు జైగీషవ్యుని శక్తి తెలిసికోవాలని అలా ప్రవర్తించాడు. అక్కడ దేవలుడు ఏకాగ్రచిత్తులు, ఆకాశచారులయిన సిద్ధులను చూశాడు. ఆ సిద్ధులు జైగీషవ్యుని పూజించటం కూడా చూశాడు. ఆపై దృఢవ్రతుడు, ప్రయత్నశీలుడు అయిన ఆ అసితదేవలుడు తీవ్రకోపానికి లోనయ్యాడు. పైపెచ్చు జైగీషవ్యుడు స్వర్గలోకానికి వెళ్ళటం కూడా చూశాడు. అక్కడనుండి పితృలోకానికి, పితృలోకం నుండి యమలోకానికి వెళుతూ జైగీషవ్యుడు కనిపించాడు.

అక్కడనుండి కూడా ఎగిరి జలమయమైన చంద్ర లోకంలో ప్రవేశిస్తున్న జైగీషవ్య మహామునిని దేవలుడు చూశాడు. ఏకాంతంగా యాగాలు చేసే వారు వెళ్ళే శుభ లోకాలకు వెళ్తూ, జైగీషవ్యుడు కనిపించాడు. అక్కడ నుండి అగ్నిహోత్రాల లోకాలవైపు ఆయన వెళ్తున్నాడు. ఆ లోకాలనుండి దర్శపౌర్ణమాసయాగాలు చేసే తపోధనుల లోకానికి, అక్కడ పశుయాగం చేసినవారు వెళ్ళే లోకాలకు వెళ్తూ ఆ ధీమంతుడు - జైగీషవ్యుడు కనిపించాడు. అనేకవిధాలయిన చాతుర్మాస్య దీక్షలతో యాగాలు చేసే తపోధనులు వెళ్ళే లోకాలకు వెళుతూ కనిపించాడు. అవి దేవతల పూజలనందే పవిత్రలోకాలు. అక్కడనుండి అగ్నిష్టోమయాజులు, అగ్నిష్టుత్ యాగం ద్వారా యజించే తపోధనులు వెళ్ళే లోకాలకు వెళ్ళిన జైగీషవ్యుని దేవలుడు చూశాడు. అలాగే భూరిసువర్ణదానాలతో క్రతుశ్రేష్ఠమైన వాజపేయాన్ని చేసే మహాప్రాజ్ఞులు వసించే లోకాలలో జైగీషవ్యుడు కనిపించాడు. రాజసూయ, పౌండరీకయాగాలు చేసినవారు పొందిన లోకాలలో కూడా ఆ దేవలుడు జైగీషవ్యుని

చూశాడు. మేటిక్రతువైన అశ్వమేధయాగాన్ని, నరమేధ యాగాన్ని చేసే నరశ్రేష్ఠుల లోకాలలో కూడా జైగీషవ్యుని చూశాడు. కష్టసాధ్యమైన సర్వమేధయాగాన్ని, సౌత్రామణి యాగాన్ని చేసినవారు వసించే లోకాలలో కూడా ఆ దేవలుడు జైగీషవ్యుని చూశాడు. రాజా! అనేక విధాలుగా ఉండే ద్వాదశయాగాలను చేసినవారు వెళ్ళే లోకాలలో ఆ దేవలుడు జైగీషవ్యుని చూశాడు. ఆపై మిత్రావరుణుల లోకాలలో ఆదిత్యలోకాలలో ప్రవేశించిన జైగీషవ్యుని అసితదేవలుడు చూశాడు. రుద్రుల స్థానాన్ని, వసువుల స్థానాన్ని, బృహస్పతి స్థానాన్ని కూడా అతిక్రమించి, పైకి వెళ్తున్న జైగీషవ్యుని అసితదేవలుడు చూశాడు. గోలోకంలో ప్రవేశించి, ఆపై బ్రహ్మయాగాన్ని చేసేవారు చేరే లోకాలకు వెళ్తున్న జైగీషవ్యుని అసితుడు చూశాడు. ఆపై తన తేజస్సుతో మూడు ఊర్ధ్వలోకాలనూ అతిక్రమించి, పతివ్రతలలోకాలకు వెళ్తున్న విప్రుని - జైగీషవ్యుని అసితుడు చూశాడు.

ఆపై అసితుడు మునివరుడైన జైగీషవ్యుడు మరే లోకంలోనూ ప్రవేశించటం చూడలేదు. ఆయన అదృశ్యయ్యాడు. మహాభాగుడైన ఆ దేవలుడు జైగీషవ్యుని ప్రభావాన్ని, వ్రతశీలాన్ని, సిద్ధిని, అసామాన్యమైన యోగాన్ని గురించి ఆలోచించాడు. అప్పుడు ధీరుడైన అసితుడు అక్కడున్న బ్రహ్మ యాజులైన సిద్ధులను, లోకోత్తములైన సజ్జనులను నియమబద్ధంగా చేతులు జోడించి, ఇలా అడిగాడు. "మహా శక్తిశాలి అయిన జైగీషవ్యుడు కనిపించటం లేదు. ఎక్కడున్నాడో చెప్పండి. వినాలనుకొంటున్నాను. నాకెంతో కుతూహలంగా ఉంది". సిద్ధులిలా అన్నారు. "దృఢవ్రతా! దేవలా ! జరిగిపోయిన విషయాన్ని చెపుతాం విను. జైగీషవ్యుడు శాశ్వత బ్రహ్మలోకానికి వెళ్ళాడు". వైశంపాయనుడు చెప్తున్నాడు. "బ్రహ్మయాజులయిన సిద్ధుల మాటవిని అసితదేవలుడు పైకి ఎగిరాడు. కానీ క్రిందపడిపోయాడు. ఆపై సిద్ధులు ఆ దేవలునితో మరలా ఇలా అన్నాడు. "దేవతా! తపోధనా! జైగీషవ్యుడు వెళ్ళిన బ్రహ్మ సదనానికి వెళ్ళటానికి తగిన శక్తి నీకు లేదు". వైశంపాయనుడిలా అన్నాడు. 'సిద్ధుల ఆ మాట విని, దేవలుడు మరల ఎక్కిన వరుసలోనే ఆ లోకాలనుండి క్రిందకు దిగాడు. పక్షిలా ఎగిరి పుణ్యప్రదమైన తన ఆశ్రమానికి వచ్చాడు. వస్తూనే ఆ దేవలుడు అక్కడ జైగీషవ్యుని చూశాడు.

అప్పుడు దేవలుడు ధర్మయుక్తమైన బుద్ధితో యోగజనితమైన జైగీషవ్యుని తపఃప్రభావాన్ని పరిగణించ సాగాడు. రాజా! ఆ తరువాత మహాత్ముడైన ఆ జైగీషవ్యమహాముని సమీపించి, వినయంతో వంగి, దేవలుడు ఇలా అన్నాడు. "స్వామీ! నేను మోక్షధర్మాన్ని ఆశ్రయించగోరుతున్నాను." దేవలుని ఆ మాట విని, మహాతపస్వి అయిన జైగీషవ్యుడు సంన్యాసం మీద ఆ దేవలుని దృష్టి మరలటం గమనించి, యోగం

యొక్క ఉత్తమవిధిని, కర్తవ్యాకర్తవ్యాలను యథాశాస్త్రంగా ఉపదేశించాడు. విధిచోదితమైన పద్ధతితో సంన్యాస స్వీకారానికి అవసరమైన సర్వకర్మలను చేశాడు. దేవలునకు సంన్యాసంపై బుద్ధి మళ్ళటాన్ని చూసి, పితరులతో సహా ప్రాణులన్నీ "మనకు విడివిడిగా ఇక అన్నం పెట్టే"దెవరని రోదించసాగాయి. ఆ రీతిగా దీనంగా విలపిస్తూ, పది దిక్కుల నుండి పలుకుతున్న ఆ ప్రాణుల మాట విని, దేవలుడు మోక్షధర్మాన్ని వదలివేద్దామని ఆలోచించాడు. అప్పుడు పవిత్ర ఫలాలు, దుంపలు పూలు, ఓషధులు - ఇటువంటి వేల పదార్థాలు "క్షుద్రుడు, దుర్బుద్ధి అయిన ఈ దేవలుడు మరల మనలను ఖండిస్తాడు. సర్వభూతాలకు అభయమిచ్చి కూడా మరల మాట తప్పుతున్నాడు" అని రోదించసాగాయి. మునిసత్తముడైన దేవలుడు "మోక్ష గృహస్థ ధర్మాలలో ఏది శ్రేయస్కర"మని మరల స్వబుద్ధితో విచారించసాగాడు. రాజసత్తమా! దేవలుడు మనసా దానిని భావించి, నిర్ణయానికి వచ్చి, గృహస్థధర్మాన్ని విడిచి మోక్షధర్మాన్ని ఇష్టపడ్డాడు. భారతా! ఇవన్నీ ఆలోచించి, దేవలుడు నిశ్చయానికి వచ్చి, సంన్యాసంతో పరమసిద్ధినీ, ఉత్తమయోగాన్నీ పొందాడు. ఆపై బృహస్పతి మొదలుగాగల దేవతలు, తాపసులు వచ్చి, జైగీషవ్యుని తపస్సును ప్రశంసించసాగారు. ఆపై ఋషిశ్రేష్ముడైన నారదుడు "జైగీషవ్యునిలో తపస్సులేదు. తపశ్శక్తిని వినియోగించి అసితుని విస్మయ పరిచాడు గదా" అన్నాడు. అలా మాటాడుతున్న ఆ ధీరునితో దేవత లిలా అన్నారు. "అదికాదు. జైగీషవ్యుడు మహామునియే అని ప్రకటించారు. ప్రభావమూ, తేజస్సూ, తపస్సూ, యోగమూ - ఈ విషయాలలో మహాత్ముడైన జైగీషవ్యుని మించినవాడు కానీ, సమానుడు కానీ ఎప్పుడూ లేడు". ధర్మాత్ముడైన జైగీషవ్యుడు ఇటువంటి ప్రభావశాలి. అసితుడూ అంతటివాడే. ఆ మహాత్ముల స్థానమైన తీర్థరాజమిది. మహాత్ముడైన బలరాముడు అక్కడకూడా స్నానం చేసి, బ్రాహ్మణులకు ధనాన్ని దానం చేసి, ధర్మఫలాన్ని పొంది, పరమార్థ దృష్టితో **సోమతీర్థానికి** వెళ్ళాడు. అది గొప్ప తీర్థం.'

51. దధీచి సారస్వతముని చరిత్ర

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'భారతా! ఆ సోమతీర్థంలో చంద్రుడు రాజసూయ యాగం చేశాడు. ఆ తీర్థంలోనే తారకామయమైన మహా సంగ్రామం జరిగింది. బలరాముడు అక్కడకూడా స్నానమాడి, దానాలు చేసి, **సారస్వతముని**- తీర్థానికి వెళ్ళాడు. గతంలో పండ్రెండు సంవత్సరాల కరువు ఏర్పడినప్పుడు ఆ తీర్థంలో సారస్వతముని ద్విజోత్తములచే వేదాధ్యయనం చేయించాడు. జనమేజయుడిలా అడిగాడు. "గతంలో పండ్రెండు సంవత్సరాల కరువు ఏర్పడినప్పుడు సారస్వతముని ద్విజోత్తములచే వేదాధ్యయన మెలా చేయించాడు"?

వైశంపాయను డిలా చెప్తున్నాడు. "మహారాజా! పూర్వకాలంలో ధీమంతుడు, మహా తపస్వి, బ్రహ్మచారి, జితేంద్రియుడు అయిన ముని ఉండేవాడు. ఆయన పేరు దధీచుడు. రాజా! మహాతపస్వి అయిన ఆ దధీచి అంటే ఇంద్రునకు భయం. బహువిధఫలాలతో కూడా ఆ దధీచిని ప్రలోభ పెట్టడం శక్యంకాదు. ఆపై పాకశాసనుడు ఆయనను ప్రలోభపెట్టడానికై పవిత్రయై, అందగత్తె అయిన ఒక దివ్యాప్సరసను పంపించాడు. ఆమె పేరు అలంబుష. సరస్వతీ నదీ తీరంలో దేవతలకు తర్పణలనిస్తున్న సమయంలో ఆ మహాత్మునకు దగ్గరగా నిలిచింది ఆ కాంత. దివ్యరూపవతి అయిన అప్సరసను చూడగానే నిర్మలాంతఃకరణుడైన ఆ మునికి వీర్యస్ఖలనమయింది. అది సరస్వతిలో పడింది. ఆ నది దానిని గ్రహించింది. పురుషర్షభా! ఆ మహానది పుత్రునికోరి, ఆ రేతస్సును ఆనందంగా తన కడుపులో నిలుపుకొన్నది. ఆమె గర్భాన్ని ధరించింది.

ప్రసవకాలం సమీపించిన తరువాత ఆ నదీమతల్లి కుమారుని ప్రసవించింది. ఆ కుమారుని తీసికొని ఆ ముని దగ్గరకు వెళ్ళింది. రాజేంద్రా! ఋషుల సభలోనున్న ఆ మునిశ్రేష్ఠుని చూసి, ఆ నది ఆ కుమారుని ఆయనకిస్తూ ఇలా అన్నది. "బ్రహ్మర్షీ! ఇతడు నీ కొడుకు. నీమీది భక్తి భావంతో నేను గర్భంలో ధరించాను. గతంలో అప్సరస అయిన అలంబుషను చూసి, నీకు వీర్యస్ఖలనమైనపుడు నీ మీది భక్తితో నేను కడుపులో ధరించాను. నీ తేజస్సు నశించకూడదన్న నిశ్చయంతో ఇలా చేశాను. నేను ఇస్తున్నాను. ఏ దోషమూ లేని నీకుమారుని నీవు స్వీకరించు." భరతసత్తమా! అలా చెప్పగానే దధీచిముని ఆ బాలుని స్వీకరించాడు. ఎంతో ప్రీతిని పొందాడు. ఆ ద్విజవరుడు ప్రేమతో తన కుమారుని శిరస్సు నాఘ్రాణించాడు. కౌగిలించుకొని, ఎంతోసేపు అలాగే ఉన్నాడు. అప్పుడు ఆ మహాముని ఆనందంతో సరస్వతికి వరమిచ్చాడు. "సుభగా! నీ నీటితో తర్పణలనివ్వగానే విశ్వేదేవులు, పితరులు, గంధర్వులు, అప్సరోగణాలు తృప్తినందగలరు." అలా పలికి ఆ దధీచి పరమానంద భరితుడై ప్రీతిపూర్వకమైన మాటలతో ఆ మహానదిని సుత్తించాడు. "మహాభాగా! ప్రాచీనకాలంలోనే బ్రహ్మసరస్సు నుండి స్రవించావు. నదీమతల్లీ! వ్రతధారణశీలులైన మునులు నిన్ను గ్రహించగలరు. సతతమూ నాకు ప్రియాన్ని కల్గించే దానవు. కాబట్టి లోకభావనుడైన ఈ నీ కొడుకు నీ పేరుతోనే సారస్వతుడనే పేరుతోనే పెరుగుతాడు. సారస్వతుడన్న పేరుతో మహాతపస్వి అవుతాడు. మహాభాగా! ఈ సారస్వతుడు పండ్రెండు సంవత్సరాల కరువు వచ్చినపుడు ద్విజోత్తములచే వేదాధ్యయనం చేయిస్తాడు. సరస్వతీ! నా అనుగ్రహం వలన నీవు పవిత్రనదు లన్నింటికన్నా పుణ్యతమవు కాగలవు". అలా ప్రస్తుతినంది, వరాన్ని పొంది, ఆ మహానది కుమారుని తీసికొని, ఆనందంగా

వెళ్ళిపోయింది. ఆ సమయంలోనే దేవదానవులలో శత్రుత్వమేర్పడి ఇంద్రుడు ఆయుధానికై అన్వేషిస్తూ మూడు లోకాలూ తిరగసాగాడు. అయినా పూజ్యుడైన ఆ ఇంద్రుడు ఆ దేవ దానవులను వధించటానికి యోగ్యమైన ఆయుధాన్ని తాను పొందలేకపోయాడు. అప్పుడు ఇంద్రుడు దేవతలతో ఇలా అన్నాడు. "దధీచిముని ఎముకలు ఉంటే తప్ప దేవతలను ద్వేషిస్తున్న ఈ మహారాక్షసులను నేను సంహరించలేను. కాబట్టి సురసత్తములారా! ఆ ఋషిశ్రేష్ఠుని దగ్గరకుపోయి "దధీచా! ఎముకల నివ్వండి" అని యాచించండి. వాటితో శత్రు సంహారం చేస్తాను. అప్పుడు ఋషివరుడైన దధీచి వారు అడగగానే నిర్విచారంగా, ప్రయత్నపూర్వకంగా ప్రాణత్యాగం చేశాడు. అలా దేవతలకు ప్రియాన్ని కల్పించి, అక్షయలోకాలను పొందాడు.

ఆ తరువాత ఇంద్రుడు సంతుష్టహృదయుడై ఆ ఎముకలతో అనేక దివ్యాయుధాలను చేయించాడు. వాటిలో గద, వజ్రం, పెద్దచక్రాలు, ఎన్నో కర్రలు ఉన్నాయి. ప్రజాపతిసుతుడు, పరమర్షి అయిన భృగువు తీవ్రతపస్సుతో నింపి, లోకకళ్యాణకారకుడైన ఆ దధీచిని విశాలశరీరునిగా, తేజస్వీగా పుట్టించాడు. లోకంలోని సారమంతా ఆయన పుట్టుకలో ఉంది. ఆ దధీచి కొండంత బరువున్న ఎత్తరి. తన శక్తితో లోకవిఖ్యాతుడు. ఇంద్రుడు కూడా ఆయన తేజస్సు చూసి, నిత్యమూ ఉద్వేగానికి లోనవుతాడు. బ్రాహ్మణ తేజస్సునుండి పుట్టిన ఆ వజ్రాన్ని మంత్రపూతంగా, తీవ్రక్రోధంతో విసిరి, పూజ్యుడైన ఇంద్రుడు ఎనిమిదివందల పదిమంది దైత్యదానవవీరులను సంహరించాడు. ఆ తరువాత చాలా కాలం గడచిన తరువాత పండ్రెండు సంవత్సరాల పాటు కొనసాగిన మహాభయంకరమైన క్షామం ఏర్పడింది. రాజా! ఆ ద్వాదశవార్షికమైన అనావృష్టిలో మహర్షులు ఆకలితో జీవికకోసం అన్ని దిక్కులకూ వలసపోయారు. వారంతా అలా వలసపోవటం చూసి సారస్వత ముని కూడా వలసపోవాలను కొన్నాడు. అప్పుడు సరస్వతి ఇలా అన్నది. "కుమారా! ఇక్కడ నుండి వెళ్ళవద్దు. నీకు సర్వదా నేను ఆహారాన్ని అందిస్తాను. మంచి చేపలను ఇస్తాను. ఇక్కడే ఉండు". సరస్వతి అలా అనగానే సారస్వతుడు పితరులను, దేవతలను తృప్తి పరిచాడు. నిత్యమూ ఆహారాన్ని స్వీకరిస్తూ ప్రాణాలనూ, వేదాలనూ నిలుపుకొన్నాడు. ఆ తరువాత ఆ అనావృష్టి తీరిపోగా మహర్షులు మరల స్వాధ్యాయం కోసం పరస్పరం మాటాడుకొనసాగారు.

ఆకలితో అటూ, ఇటూ పారిపోయిన వారిలో వేదం నశించిపోయింది. రాజేంద్రా! వారిలో ఒక్కడు కూడా వేదాన్ని స్మరించలేకపోయాడు. ఆపై ఆ మహర్షులలో ఒకరు సారస్వతుని దగ్గరకు వచ్చాడు. ఋషిశ్రేష్ఠుడైన సారస్వతుడు వ్రతదీక్షగా స్వాధ్యాయం

కొనసాగిస్తూనే ఉన్నాడు. ఆ ఋషి వెళ్ళి దేవతలవలె తేజస్వియై నిర్జనవనంలో స్వాధ్యాయం కొనసాగిస్తున్న సారస్వతుని గూర్చి ఇతర మునులకు చెప్పాడు. ఆపై ఆ మహర్షులందరూ అక్కడకు వచ్చారు. వచ్చి, మాకు కూడా వేదాన్ని చెప్పండి అని మునిశ్రేష్ఠుడైన సారస్వతుని అడిగారు. అప్పుడు ఆయన యథావిధిగా నాకు శిష్యులు కండి అని వారితో అన్నాడు. అప్పుడు మునులందరూ "కుమారా! నీవు బాలుడవు" అన్నారు. అప్పుడు సారస్వతుడు ఇలా అన్నాడు. "నా ధర్మం నశించకూడదు. అందుకే మీరు శిష్యులు కావాలంటున్నాను. అధర్మంగా వేదాన్ని చెప్పినా, అధర్మంగా వేదాన్ని గ్రహించినా వారిద్దరూ నశిస్తారు. లేదా వెంటనే శత్రువు లవుతారు. వయస్సుచేత కానీ, వెంట్రుకలు నెరవటంచేత కానీ, ధనం చేత కానీ, బంధుగణంచేత కానీ ఎవ్వరూ పెద్దవారు కాలేరు. ఋషులు చెప్పిన ధర్మంమేరకు వేదప్రవచనం చేసేవాడే అందరిలో గొప్పవాడు". ఆ సారస్వతుని మాటను విని, ఆ మునులు యథావిధిగా అతని నుండి వేదాలను పొంది, ధర్మాన్ని అనుష్ఠించారు. అరవై వేలమంది మునులు వేదాధ్యయనం కోసం బ్రహ్మర్షి అయిన సారస్వతునకు శిష్య లయ్యారు. సారస్వతుడు బాలుడైనా ఆ విప్రర్షి అధీనంలోనే ఉండి మునులందరూ ఆయన ఆసనంకోసం తలా పిడికెడు దర్భలు తెచ్చేవారు. మహాబలుడు, కృష్ణుని అగ్రజుడు అయిన బలరాముడు ఆ తీర్థంలో కూడా ధనదానం చేసి, ఆనందించి, క్రమంగా తీర్థాలు సేవిస్తూ, వృద్ధకన్యలు నివసిస్తున్న మహాతీర్థంవైపు వెళ్ళాడు.'

52. వృద్ధకన్యా తీర్థమాహాత్మ్యము

జనమేజయు డిలా అడిగాడు. "స్వామీ! పూర్వకాలంలో కుమారి ఎలా తపస్సులో లీనమైంది ? దేనికోసం తపస్సు చేసింది ? ఆమె నియమమేమిటి ? బ్రాహ్మణా! సుదుష్కరమూ, పరమోత్తమమూ అయిన ఈ తపోవిషయాన్ని నీవు ప్రస్తావించావు, విన్నాను. వృత్తాంతమంతా యథాతథంగా చెప్పు. ఆమె ఎందుకు తపస్సు చేసింది?" వైశంపాయను డిలా చెప్తున్నాడు. "రాజా! మహాశక్తిశాలి, మహాయశస్వి అయిన కుణిగర్గుడనే ఋషి ఉండేవాడు. తాపసశ్రేష్ఠుడైన ఆయన గొప్ప తపస్సు చేసి, మనసా ఒక కుమార్తెను కన్నాడు. మహాయశస్వి అయిన ఆ కుణిగర్గముని ఆమెను చూసి ఆనందించి, భౌతికశరీరాన్ని వీడి, స్వర్గానికి వెళ్ళాడు. ఆ రోజుల్లో కమలనయన, కళ్యాణలక్షణ అయిన ఆ సుందరి ఆశ్రమాన్ని నిర్మించుకొని, మహాతీవ్ర తపస్సు చేసి, ఉపవాసాలతో పితరులను, దేవతలను పూజిస్తూ నిందకు దూరమై నివసిస్తుండేది. ఆ తీవ్ర తపస్సుతోనే ఆమె చాలాకాలం గడిపివేసింది. తండ్రి జీవించిఉన్నప్పుడే ఆమెకు పెండ్లి చేయాలని సంకల్పించినా ఆమె

ఇష్టపడలేదు. నిష్కలంక అయిన ఆమె తనకు తగిన భర్తను ఎన్నుకొనలేకపోయింది. ఆపై ఆమె తీవ్రతపస్సుతో తన శరీరాన్ని బాధిస్తూ, ఆ ఏకాంతవనంలో పితృదేవతార్చనలపై ఆసక్తితో గడపసాగింది. రాజేంద్రా! శ్రమతో అలసిపోయి కూడా ఆమె తనను తాను ధన్యురాలిగా భావించుకొంటూ, వార్ధక్యంలో అడుగుపెట్టింది. తపస్సుతో కృశించిపోయింది. ఆమె అడుగుతీసి అడుగువేయలేని స్థితికి వచ్చింది.

అప్పుడు పరలోకానికి వెళ్ళటాన్ని గూర్చి ఆలోచించసాగింది. శరీరాన్ని విడువదలచిన ఆమెను చూసి, నారదు డిలా అన్నాడు. "అనఘా! వివాహసంస్కారం లేని కన్యవు. నీకు పుణ్యలోకా లెలా లభిస్తాయి. మహావ్రతా! నీవు పరమతపస్సును చేశావు కానీ లోకాలను గెలవలేకపోయావని దేవలోకంలో అనుకొంటుంటే విన్నాను." ఆ నారదుని మాటవిని, ఆమె ఋషులసభలో "సత్తమా! నా పాణిగ్రహణం చేసినవానికి నా తపఃఫలంలో సగమిస్తాను" అని పలికింది. ఆమె అలా అనగానే అందరికన్నా ముందుగా గాలవ కుమారుడైన శృంగవంతుడనే ముని ఆమెతో పాణిగ్రహణానికి సిద్ధమై ఈ నియమాన్ని పెట్టాడు. "శోభనా! నీ పాణిగ్రహణం చేస్తాను. కానీ ఒక నియమం. వివాహం తర్వాత ఒక రాత్రి నాతో గడపాలి". అలాగేనని అంగీకరించి, అప్పుడు ఆమె శాస్త్రోక్తవిధితో అగ్నిని ప్రజ్వలింపజేసి, యథావిధిగా తన చేతిని అందించింది. గాలవసుతుడు ఆమె పాణిని గ్రహించి, పరిణయమాడాడు. రాజా! ఆ రాత్రి ఆమె దివ్యాభరణలనూ, వస్త్రాలనూ ధరించింది. దివ్యగంధాలను పూసికొన్నది. అందమైన యువతిగా మారింది. కాంతితో పరిసరాలను ప్రకాశింపజేస్తున్న ఆమెను చూసి శృంగవంతుడు ప్రీతుడై ఆ ఒక్కరాత్రి గడిపాడు. తెల్లవారగానే ఆమె ఆయనతో ఇలా అన్నది. "విప్రా! తాపసశ్రేష్ఠా! నీవు పెట్టిన నియమం మేరకు నీతో ఒకరాత్రి వసించాను. నీకు మంచి జరుగుగాక! మేలు జరుగుగాక! నేను వెళ్తున్నాను". ఆమె వెళ్ళబోతూ ఇలా అన్నది "ఈ తీర్థంలో ఏకాగ్రతతో దేవతలకు తర్పణలనిచ్చి, ఒక రాత్రి నివసించిన వాడు ఏభై ఎనిమిది సంవత్సరాల పాటు చక్కగా బ్రహ్మచర్యాన్ని పాటించినవాడు పొందే ఫలితాన్ని పొందుతాడు". అలా పలికి ఆ సాధ్వి దేహాన్ని వీడి స్వర్గానికి వెళ్ళింది.

ఆ ఋషి ఆ రూపాన్ని గురించి ఆలోచిస్తూ దీనుడయ్యాడు. ఆమె ఇచ్చిన మాట ప్రకారం తపస్సులో అర్ధభాగాన్ని ఎట్టకేలకు స్వీకరించాడు. తానుకూడా శరీరాన్ని విడిచి ఆమె బాటనే అనుసరించాడు. భరతశ్రేష్ఠా! ఆమె సౌందర్యబలంచే లాగబడి దుఃఖించాడు. ఇలా వృద్ధకన్యకు సంబంధించిన మహాచరితను, ఆమె బ్రహ్మచర్యపాలనను, స్వర్గలోకప్రాప్తిరూపమైన సద్గతిని వివరించాను. అక్కడనుండియే బలరాముడు శల్యమరణ

వృత్తాంతాన్ని విన్నాడు. ఆ పరంతపుడు అక్కడ కూడా బ్రాహ్మణులకు దానాలనిచ్చాడు. శల్యమరణవార్తను విని, అక్కడనుండి నిష్క్రమించి, బలరాముడు సమంత పంచక మార్గంగుండా వెలువడి, కురుక్షేత్ర సేవనఫలాన్ని గూర్చి మునుల నడిగాడు. రాజా! యదుశ్రేష్ఠుడైన బలరాముడు అడిగితే ఆ మహాత్ములు ఆయనకు కురుక్షేత్ర సేవన ఫలాన్ని యథాతథంగా అంతా చెప్పారు.'

53. కురుక్షేత్ర మహిమ

ఋషు లిలా అన్నారు. 'బలరామా! సమంతపంచకం సనాతనమైన తీర్థం. అది ప్రజాపతియొక్క ఉత్తరవేది. గతంలో అక్కడ మహావరదాతలైన దేవతలు గొప్పయాగం చేశారు. పూర్వకాలంలో రాజర్షిశ్రేష్ఠుడు, ధీమంతుడు, మహాత్ముడు అయిన కురువు అమితతేజస్సుతో అనేక సంవత్సరాలు ఈ క్షేత్రాన్ని దున్నేవాడు. అందువలననే ఇది కురుక్షేత్రమని ప్రసిద్ధి చెందింది. బలరాము డిలా అడిగాడు. "తపోధనులారా! మహాత్ముడైన కురువు ఈ క్షేత్రాన్ని ఎందుకు దున్నాడు? దానిని చెపితే వినగోరుతున్నాను". ఋషు లిలా అన్నారు. "బలరామా! గతంలో కురువు నిరంతరంగా దున్నుతున్నప్పుడు" స్వర్గలోకం నుండి ఇంద్రుడు వచ్చి, దానికి కారణమడిగాడు. ఇంద్రు డిలా అడిగాడు. "రాజా! తీవ్రప్రయత్నంతో ఏం చేయదలచావు? రాజర్షి ఏ కోరికతో ఈ నేలను దున్నుతున్నావు." కురు విలా సమాధానమిచ్చాడు. "ఇంద్రా! ఈ క్షేత్రంలో చనిపోయిన పురుషులు పాపరహితమైన పుణ్యలోకాలకు వెళతారు". ఆపై ఇంద్రుడు ఆయనను హేళన చేసి, మరలా స్వర్గానికి వెళ్ళిపోయాడు. ఆ రాజర్షికూడా ఉదాసీనత లేకుండా భూమిని దున్నుతూనే ఉన్నాడు. ఇంద్రుడు మరల మరల వస్తూనే ఉన్నాడు. మరల మరల హేళన చేస్తూనే ఉన్నాడు. అడిగిందే అడిగి వెళ్ళిపోతున్నాడు. కురువు మాత్రం తన పని మానలేదు.

ఉగ్రతపస్సులో ఆ రాజు నేలను దున్నుతూనే ఉంటే ఇంద్రుడు దేవతలతో ఆ రాజర్షి చేస్తున్న పనిని గురించి చెప్పాడు. అది విని దేవతలు ఇంద్రునితో ఇలా అన్నారు. "ఇంద్రా! సాధ్యపడేటట్లయితే ఆ రాజర్షికి వరమిచ్చి నీ వైపు త్రిప్పుకో. ఇక్కడ మరణించిన మానవులు మనకై యాగాలు చేయకుండా స్వర్గానికి చేరేటట్లయితే మన యాగభాగాలు నశిస్తాయి. ఆపై ఇంద్రుడు వచ్చి ఆ రాజర్షితో ఇలా అన్నాడు. "నీవు అలా శ్రమపడవద్దు. నా మాట విను. రాజేంద్రా! మహామతీ ఇక్కడ సావధానులై, నిరాహారులై దేహత్యాగం చేసిన మానవులు కానీ, పశుపక్ష్యాదులు కానీ, యుద్ధంలో మరణించిన

వారు కానీ స్వర్గలోకంలో భాగస్వాములు కాగలరు." అప్పుడు కురురాజు 'అలాగే అగుగాక' అని ఇంద్రునితో అన్నాడు. ఆపై ఇంద్రుడు సంతుష్టహృదయుడై ఆయన అనుమతిని పొంది, మరల వెంటనే స్వర్గానికి వెళ్ళిపోయాడు. బలరామా! ఇలా రాజర్షి అయిన కురువు గతంలో ఈ నేలను దున్నాడు. ఇంద్రుడు, బ్రహ్మాదిదేవతలు అంగీకరించి, వరాల నిచ్చారు.

ఇంతకన్నా పుణ్యతరమైన క్షేత్రం భూమండలంలో లేదు. ఇక్కడ తీవ్రతపస్సు చేసిన నరులు అందరూ దేహత్యాగం చేసిన తరువాత బ్రహ్మలోకానికి వెళ్ళగలరు. పుణ్యభాగులైన మానవులు ఇక్కడ దానం చేస్తే అచిరకాలంలోనే వేయిరెట్లు ఫలితాన్ని పొందగలుగుతారు. శుభాకాంక్షులై ఇక్కడ నిత్యమూ నివసించిన మనుజులు ఎప్పుడూ, ఏ రీతిగానూ యమలోకాన్ని చూడరు. మహాక్రతువులు చేసిన రాజులు భూమి ఉన్నంతకాలం స్వర్గనివాసాన్ని పొందుతారు. అంతేగాక ఇక్కడ సురాధిపతి అయిన దేవేంద్రుడు కురుక్షేత్రానికి సంబంధించి ఒక గాథను వెలువరించాడు. బలరామా! దానిని విను. "గాలికి ఎగిరిన కురుక్షేత్ర ధూళికణాలు కూడా చెడ్డపనులు చేసినవారినయినా పరమపదానికి తీసికొని పోగలవు. దేవతాశ్రేష్ఠులారా! బ్రాహ్మణోత్తములు అలాగే నృగుడు మొదలయిన గొప్పరాజులు, నరోత్తములు మహామహా యజ్ఞాలను ఇక్కడ అనుష్ఠించి, దేహత్యాగానంతరం సుగతిని పొందారు. తరంతుక, అరుంతుక, రామకుండ, మచక్రుక కుండాలమధ్య నున్న భూభాగమే సమంతపంచకం. అదే కురుక్షేత్రం. అదే ప్రజాపతియొక్క ఉత్తరవేది. ఇది శుభకరం మహాపుణ్యప్రదం. పర్వగుణ సమన్వితమైన ఈ ప్రదేశం దేవతలకు కూడా ఇష్టమైనది. అందువలన ఈ రణభూమిలో మరణించిన రాజులందరూ సదా అక్షయపుణ్య గతులను పొందగలరు". బ్రహ్మాదులతో కూడిన ఇంద్రుడే స్వయంగా ఇలా అన్నాడు. అదంతా బ్రహ్మవిష్ణు మహేశ్వరులు కూడా ఆమోదించారు.'

54. భీమదుర్యోధన యుద్ధమును చూచుటకు బలరాముని రాక

వైశంపాయను డిలా చెప్తున్నాడు. జనమేజయా! బలరాముడు కురుక్షేత్రాన్ని చూసి, అక్కడ ధనదానాలు చేసి, అక్కడనుండి ఒక మహాదివ్యాశ్రమానికి వెళ్ళాడు. అక్కడ ఇప్పచెట్లు, మామిడిచెట్లు, జువ్విచెట్లు, మర్రిచెట్లు, కానుగు చెట్లు, పనసవృక్షాలు, మద్దిచెట్లు దట్టంగా పెరిగి ఉన్నాయి. శ్రేష్ఠమై, పుణ్యలక్షణాలు గల దానిని చూసి, బలరాముడు ఆ ఆశ్రమ మెవరిదని అక్కడున్న ఋషుల నడిగాడు. రాజా! ఆ మహాత్ము లందరూ

హలాయుధునితో ఇలా అన్నారు. "బలరామా! ఈ ఆశ్రమమెవరిదో వివరంగా విను. పూర్వకాలంలో ఇక్కడ విష్ణుదేవుడు ఉత్తమ తపస్సు చేశాడు. సనాతన యజ్ఞాలనన్నింటినీ తానిక్కడే నిర్వర్తించాడు. ఇక్కడే కుమారావస్థనుండి బ్రహ్మచర్యాన్ని పాటిస్తున్న ఒక సిద్ధబ్రాహ్మణి ఉండేది. తపస్సిద్ధ అయిన ఆ తపస్విని యోగశక్తితో స్వర్గానికి వెళ్ళింది. రాజా! నియమపూర్వకంగా వ్రతాలు పూనుతూ, బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ ఆ సాధ్వి, మహాత్ముడైన శాండిల్యుని కుమార్తె, స్త్రీలకు దుష్కరమైన ఘోరతపస్సును చేసి, ఆ మహాభాగ దేవబ్రాహ్మణ పూజలందుకొని, స్వర్గానికి వెళ్ళింది." ఋషుల మాట విని బలరాముడు ఆ ఆశ్రమానికి వెళ్ళాడు. అక్కడ ఋషులకు అభివాదనలు చేసి, హిమవత్పర్వతపార్శ్వంలో సంధ్యా కార్యాలను అన్నింటినీ నిర్వర్తించి, కొండనెక్కసాగాడు. బలరాముడు ఆ కొండపై కొద్ది దూరం నడిచి పుణ్యప్రదమైన తీర్థరాజాన్ని చూసి, పరమాశ్చర్యానికి లోనయ్యాడు. అది సరస్వతి జన్మస్థానమైన **ప్లక్షప్రస్రవణ తీర్థం**. ఆపై ఉత్తమ తీర్థమైన **కారపవనానికి** వెళ్ళాడు. మహాబలుడైన బలరాముడు అక్కడ కూడా పవిత్రమై, నిర్మలమై, పుణ్యప్రదమైన ఆ చల్లని నీటిలో స్నానం చేసి, దానాలు చేసి, పితరులకు దేవతలకు తర్పణలిచ్చి, యతులతో, బ్రాహ్మణులతో కలిసి ఆ రాత్రి అక్కడ నివసించి, పుణ్యప్రదమైన మిత్రావరుణుల ఆశ్రమానికి చేరాడు. కారపవనం నుండి **యమునాతీర్థానికి** వెళ్ళాడు. ఆ తీర్థంలోనే గతంలో ఇంద్రుడు, అగ్ని, అర్యముడు ఎంతో ప్రసన్నులయ్యారు. ధర్మాత్ముడైన బలరాముడు అక్కడ స్నానం చేసి, పరమప్రీతిని పొందాడు. మహాబలుడైన ఆ యదుపుంగవుడు ఋషులతో సిద్ధులతో కలిసి కూర్చొని పవిత్రకథలను విన్నాడు.

వారంతా అలా నిలిచిఉండగా పూజ్యుడైన నారదముని బలరాముడున్న ఆ ప్రదేశానికి వచ్చాడు. రాజా! ఆ మహాతపస్వి జటామండలమండితుడై బంగారు వస్త్రం ధరించి, హేమదండాన్ని, కమండలాన్ని, సుఖశబ్దాన్ని కల్పించే మనోరంజకమైన వీణ - కచ్ఛపిని కొనివస్తున్నాడు. ఆయన నృత్యగీతాలతో నేర్పరి. దేవ బ్రాహ్మణపూజల నందేవాడు. కలహాలకు కర్త, నిత్యమూ కలహప్రియుడు. శ్రీమంతుడైన బలరాముడున్న చోటికి వచ్చాడు నారదుడు. బలరాముడు లేచి, ఎదురేగి, యత్నవ్రతుడైన ఆ దేవర్షిని చక్కగా పూజించి, కౌరవుల విషయం ఏమయిందని అడిగాడు. అప్పుడు సర్వధర్మవేత్త అయిన నారదుడు తీవ్రకురువినాశనానికి సంబంధించిన విషయమంతా యథాతథంగా ఆయనకు చెప్పాడు. ఆపై బలరాముడు దీనవచనాలతో నారదునితో ఇలా అన్నాడు. "తపోధనా! రాజులందరూ అక్కడ చేరారు గదా! ఆ క్షత్రియుల పరిస్థితి ఏమిటి ? ఇదంతా నేను

ఇంతకుముందే విన్నాను. వివరంగా వినాలని నాకు ఎంతో కుతూహలంగా ఉంది." నారదుడిలా చెప్పాడు.

"బలరామా! భీష్ముడు ముందే పడిపోయాడు. ద్రోణుడు, జయద్రథుడు, సూర్యసుతుడైన కర్ణుడు, మహారథులైన ఆయన కొడుకులు, భూరిశ్రవుడు, పరాక్రమశాలి అయిన మద్రరాజు శల్యుడు చనిపోయారు. వీరే కాక మరెందరో మహాబలులైన రాజులు, రాజకుమారులు - వీరంతా యుద్ధంలో వెనుదిరగనివారు - దుర్యోధనుని విజయంకోసం ప్రియప్రాణాలను కూడా పరిత్యజించి, పోరాడి, చనిపోయారు. బలరామా! ప్రాణాలతో మిగిలిన వారిని గురించి చెపుతా విను. ధార్తరాష్ట్రసేనలో యుద్ధంలో శత్రుమర్దన చేయగలవారు ముగ్గురే మిగిలారు. కృపుడు, కృతవర్మ, అశ్వత్థామ. బలరామా! వారు కూడా భయంతో అప్పుడు పారిపోయారు. శల్యుడు చనిపోగా, కృపాదులు పారిపోగా దుర్యోధనుడు తీవ్రదుఃఖానికి లోనై ద్వైపాయన హ్రదంలో ప్రవేశించాడు. దుర్యోధనుడు నీటిని స్తంభింపజేసి వాటిపై పడుకొనిఉండగా పాండవులు కృష్ణునితో కలిసి పరుషవచనాలతో దుర్యోధనుని నొప్పించారు. రామా! సర్వవిధాలుగా మాటలతో రెచ్చగొట్టబడిన ఆ దుర్యోధనుడు పెద్దగదము పట్టుకొని, మడుగులో నుండి పైకి వచ్చాడు. ఆ దుర్యోధనుడు భీమునితో పోరాడటానికి ఇప్పుడు సిద్ధమై ఉన్నాడు. బలరామా! నేడు వారి మధ్య మరీ దారుణమైన యుద్ధం జరగబోతోంది. మాధవా! నీకు కుతూహలంగా ఉంటే వెళ్ళు. ఆలస్యం చేయవద్దు. చూడాలని భావిస్తే నీ శిష్యుల మహాఘోరయుద్ధాన్ని చూడు."

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. 'నారదుని మాట విని తనతో పాటు వచ్చిన ఆ ద్విజశ్రేష్ఠులను పూజించి వారిని పంపించివేశాడు. సేవకులను "ద్వారకకు వెళ్ళండి" అని ఆదేశించాడు. అచ్యుతుడైన ఆ బలరాముడు శుభప్రదమైన ప్లక్షప్రస్రవణమనే గిరిశిఖరం నుండి దిగి, గొప్పగా ఉన్న ఆ తీర్థఫలాన్ని విని, ఆనందించి విప్రసన్నిధిలో ఈ శ్లోకాన్ని గానం చేశాడు. "సరస్వతీ నివాసానందంతో సమానమైన ఆనందం ఎక్కడుంది? సరస్వతీనివాసంతో అబ్బే గుణాలు మరెక్కడ నుండి వస్తాయి? సరస్వతిని చేరి దివంగతులైన జనులు సరస్వతిని నిత్యమూ స్మరిస్తూనే ఉంటారు. సర్వనదులలోనూ సరస్వతి పవిత్రమైనది. సరస్వతి సర్వదా లోకాలకు శుభాలను కలిగించేది. సరస్వతీ తీర్థానికి చేరినవారు ఇహపరలోకాలలో పాపాలవలన శోకించరు". బలరాముడు మాటిమాటికీ ప్రీతితో సరస్వతిని చూస్తూ, గుర్రాలు పూన్చిన శుభ్రమైన రథమెక్కాడు. వేగంగా సాగే ఆ రథాన్ని ఎక్కి, యదుశ్రేష్ఠుడైన బలరాముడు జరగబోతున్న శిష్యుల యుద్ధాన్ని చూడటానికి వచ్చాడు.'

55. భీమదుర్యోధనులు యుద్ధసన్నద్ధులగుట

వైశంపాయను డిలా చెప్తున్నాడు. 'జనమేజయా! ఇలా అక్కడ ఘోరయుద్ధం జరిగింది. ఆ విషయంలో దుఃఖించి ధృతరాష్ట్రనరపాలుడు సంజయునితో ఇలా అన్నాడు. "సంజయా! గదాయుద్ధం దగ్గరపడగా బలరాముడు తమదగ్గరకు రావటం చూసి, నాకుమారుడు భీమునితో ఎలా పోరాడాడు"? సంజయుడు చెప్తున్నాడు. 'యుద్ధాభిలాషి అయిన నీ కుమారుడు బలరాముని సాన్నిధ్యాన్ని పొంది, ఎంతో సంతోషించాడు. దుర్యోధనుడు బలరాముని చూసి, లేచి, ఎదురేగి, పరమప్రీతితో కూడి, యథావిధిగా అర్చించి, ఆయనకు ఆసనమిచ్చాడు. అనామయాన్ని అడిగాడు. ఆపై బలరాముడు యుధిష్ఠిరునితో మధురమూ, ధర్మ సంయుక్తమూ, శూరులకు హితకరమూ అయిన మాట ఇలా అన్నాడు. 'ఋషులు చెప్తుంటే నేను విన్నాను. కురుక్షేత్ర తీర్థం పరమపవిత్రం. పుణ్యప్రదం, స్వర్గాన్ని ఇవ్వగలది. మహాత్ములైన బ్రాహ్మణులు, దేవతలు, ఋషులు దీనిని సేవిస్తారు. ఆ కురుక్షేత్రంలో యుద్ధం చేసి, శరీరాన్ని విడిచిన మానవులు తప్పనిసరిగా స్వర్గలోకంలో ఇంద్రునితో పాటు నివసిస్తారు. కాబట్టి రాజా! ఇక్కడనుండి సమంతపంచకానికి వేగంగా వెళదాం. అది దేవలోకంలో బ్రహ్మయొక్క ఉత్తరవేదిగా ప్రసిద్ధిచెందింది. సనాతనమూ, మహాపుణ్యతమమూ అయిన అక్కడ యుద్ధంలో మరణిస్తే తప్పక స్వర్గాన్ని పొందవచ్చు". సమర్థుడు, వీరుడు, కౌంతేయుడు అయిన యుధిష్ఠిరుడు 'అలాగే' అని సమంతపంచకం వైపు బయలుదేరాడు. ఆపై అసహనశీలుడు, తేజస్వి ఆయిన దుర్యోధన నరపాలుడు పెద్ద గదను తీసికొని, పాండవులతో కలిసి నడిచాడు. ఆ రీతిగా కవచం ధరించి, గదను చేతబట్టి వస్తున్న దుర్యోధనుని ఆకాశంలో సంచరిస్తున్న దేవతలు "భళీ! భళీ!" అని అభినందించారు. వాతికులు, చారణులు కూడా దుర్యోధనుని చూసి, హర్షాన్ని పొందారు. నీ కొడుకు, కురురాజు అయిన దుర్యోధనుడు పాండవుల మధ్య మదపుటేనుగువలె అడుగులు వేస్తూ వెళ్ళాడు. ఆపై శంఖధ్వనితో, రణభేరుల మహాస్వనాలతో, శూరుల సింహనాదాలతో దిక్కులన్నీ, ప్రతిధ్వనించసాగాయి. ఆపై ఆ నరశ్రేష్ఠులంతా నీ కుమారునితో కూడి పడమటి దిక్కుగా నడిచి, ముందుచెప్పిన కురుక్షేత్రాన్ని చేరారు. ఆ ఉత్తమతీర్థం సరస్వతికి దక్షిణంవైపు ఉంది. సద్గతులు పొందించగలది. అక్కడ చవిటినేల కొంచెం కూడా లేదు. ఆ ప్రదేశంలో తలపడటానికి అందరూ ఇష్టపడ్డారు. మహారాజా! ఆ తరువాత భీముడు కవచాన్ని ధరించి, పెద్ద మొనగల గదను చేతబట్టి, గరుడుని వంటి రూపంతో యుద్ధానికి సిద్ధమయ్యాడు. నీ కుమారుడు బంగారు కవచాన్ని ధరించి,

శిరస్త్రాణాన్ని పెట్టుకొని రణభూమిలో బంగారు కొండవలె విరాజిల్లాడు. కవచాలను ధరించిన ఆ వీరులు లిద్దరూ రణభూమిలో కోపించిన మదపుటేనుగులవలె ప్రకాశించారు. ఆ సోదరులిద్దరూ ఉదయిస్తున్న సూర్యచంద్రులవలె శోభిల్లారు. కళ్ళతోనే దహిస్తున్నట్లుగా పరస్పరం చూసికొన్నారు.

రాజా! దుర్యోధనుడు మనసా మహోత్సాహపడుతూ, పెదవుల కొనలు నాలుకతో స్పృశిస్తూ, క్రోధంతో కళ్ళెర్రజేసి, నిట్టూరుస్తూ గదను తీసికొని భీమసేనుని వైపు తీవ్రంగా చూస్తూ, భీముని యుద్ధానికి ఆహ్వానించాడు. అలాగే వీర్యవంతుడైన భీముడు లోహగదను తీసికొని అరణ్యంలో సింహం సింహాన్ని ఆహ్వానించినట్లు దుర్యోధనుని ఆహ్వానించాడు. చేతితో గదలనెత్తియున్న ఆ దుర్యోధన వృకోదరులు శిఖరాలతో కూడిన కొండలవలె ప్రకాశించారు. వారిద్దరూ భీకర పరాక్రములు. ఇద్దరూ గదాయుద్ధంలో ధీమంతుడైన బలరామునకు శిష్యులు. ఇద్దరూ తీవ్రకోపంతో ఉన్నవారు. శరత్కాలంలో మదజలాన్ని స్రవిస్తూ, ఎదకువచ్చిన ఆడ ఏనుగుతో కలియడానికి పోటీపడుతున్న రెండు మదపుటేనుగుల వలె భీమదుర్యోధనులు ఒకరిమీదకు ఒకరు దూకుతున్నారు. ఇద్దరూ పాములవలె ప్రజ్వలించే క్రోధవిషాన్ని క్రక్కుతున్నారు. అరిందములై తీవ్రకోపంతో పరస్పరం చూసుకొంటున్నారు. పరాక్రమ సమన్వితులైన ఆ భరతశ్రేష్ఠ లిద్దరూ సింహాలవలె ఎదిరించరానివారు, గదాయుద్ధ విశారదులూ. గోళ్ళూ, దంతాలు ఆయుధాలుగా పోరాడే పులుల వలె ఆ వీరులు శత్రుదుస్సహులు. ప్రళయకాలంలో క్షోభించిన సముద్రాలవలె దాటరానివారు. ఆ మహారథు లిద్దరూ కోపించిన అంగారక గ్రహాలవలె మండిపడుతున్నవారు. వర్షాకాలంలో తూర్పు పడమటి దిక్కులనుండి కురుస్తూ రెండు మేఘాలు గర్జిస్తున్నట్లు, అరిందములైన వారిద్దరూ పరస్పరం చూసికొంటూ సింహనాదాలు చేస్తున్నారు. మహోత్ములు, మహాబలులు అయిన ఆ ఇద్దరు కురుశ్రేష్ఠులూ కిరణాలతో కూడి ప్రజ్వలిస్తున్న ఇద్దరు సూర్యులవలె కనిపిస్తున్నారు. రోషంతో పెదవులు అదురుతుండగా ఒకరినొకరు తేరిపారచూస్తూ నరోత్తములు, మహాత్ములు అయిన ఆ ఇద్దరూ గదాహస్తులై కలబడటానికి సిద్ధమయ్యారు. ఆ తరువాత అమిత పరాక్రమశాలి అయిన బలరాముడు, మహాత్ముడైన కృష్ణుడు, మహాత్ములైన పాంచాల సృంజయకేకయగణాలు, తన సోదరులు - వీరందరితో కలిసిఉన్న యుధిష్ఠిరునితో దుర్యోధనుడు సగర్వంగా ఇలా అన్నాడు.

ఈ యుద్ధం నాకూ, భీమునకు మధ్య జరుగుతోంది. రాజశ్రేష్ఠులతో కలిసి, దగ్గరగా కూర్చొని చూడండి". దుర్యోధనుని మాట విని, అందరూ దాన్ని పాటించారు.

అప్పుడు ఆ మహారాజ సమూహం అక్కడ కూర్చుంది. అది ఆకాశంలోని ఆదిత్య మండలంవలె ప్రకాశిస్తూ కనిపించింది. మహారాజా! వారిమధ్యలో బలరాముడు మన్ననల నందుకొంటూ కూర్చొన్నాడు. తెల్లని కాంతిగల ఆ నీలాంబరుడు రాజుల మధ్యలో ఉండి రాత్రివేళ నక్షత్రాలు చుట్టూ నిలిచిన పూర్ణచంద్రునివలె శోభిల్లాడు. ఆ ఇద్దరూ గదలు చేత బట్టి, పరుషవచనాలతో పరస్పరం నొప్పిస్తూ నిలిచారు. ఒకరితో ఒకరు అప్రియవచనాలు పలికి ఆ కురుసత్తములిద్దరూ వృత్రదేవేంద్రులవలె చూసికొంటూ ఆ రణభూమిలో నిలిచారు.'

56. గదాయుద్ధారంభము

వైశంపాయను డిలా చెప్తున్నాడు. 'జనమేజయా! ఆపై అక్కడ భీకరవాగ్యుద్ధం జరిగింది. అది విని ధృతరాష్ట్రనరపతి దుఃఖిస్తూ సంజయునితో ఇలా అన్నాడు. "ఛీ! ఏం మానవజన్మ! ఎటువంటి పరిణామాలకు దారితీస్తుంది! అనఘా! పద్దెనిమిది అక్షౌహిణులకు ప్రభువైన నాకుమారుడు రాజులందరినీ ఆజ్ఞాపించి, ఈ రాజ్యాన్ని అనుభవించి, కడకు గదను పట్టుకొని వేగంగా నడుస్తూ రణభూమిలో నిలిచాడు. జగత్ప్రతిగా నిలిచిన నా కుమారుడు దిక్కులేని వానివలె గదను ఎత్తి, యుద్ధానికి వెళ్తున్నాడు. ఇది దౌర్భాగ్యం కాక మరేమిటి ? సంజయా! నాకు నా కుమారుని కారణంగా మహాదుఃఖం కలిగింది అయ్యో!" ధృతరాష్ట్రరాజు అలా పలికి దుఃఖార్తుడై విరమించాడు. సంజయుడిలా చెప్తున్నాడు. "అప్పుడు రణభూమిలో మేఘంవలె గర్జిస్తూ ఆబోతువలె రంకెవేస్తూ, పరాక్రమవంతుడైన ఆ దుర్యోధనుడు భీముని యుద్ధానికి ఆహ్వానించాడు. కురురాజు భీముని ఆహ్వానించినప్పుడు భయంకర రూపంలో ఎన్నో అపశకునాలు పుట్టాయి. రాజా! మేఘగర్జనలతో పాటు పెనుగాలులు వీచాయి. దుమ్ముపాన పడింది. అన్ని దిక్కులలో చీకట్లు క్రమ్మాయి. భూమిని బ్రద్దలు చేస్తూ వందలకొలదిగ ఉల్కలు గగనతలం నుండి పడ్డాయి. వాటితో పాటు రోమాంచ జనకంగా, భీకరంగా పున్నమి కాకపోయినా రాహువు చంద్రుని మ్రింగాడు. అరణ్యాలు, వనాలతో సహా భూమి తీవ్రంగా కంపించింది. నేలపై కంకరను కురిపిస్తూ కఠినమైన గాలులు వీచాయి. గిరిశిఖరాలు కూడా నేలగూలాయి. రకరకాల జంతువులు పది దిక్కులలో పరుగెత్తుతున్నాయి. మరీ భయంకరంగా ఘోరరూపాలతో నిప్పుక్రక్కుతూ నక్కలు అరవసాగాయి. రోమాంచాన్ని కల్గిస్తూ పరమభయంకరంగా ఉరుములు వినిపించాయి. దిక్కులు ప్రజ్వలిస్తున్నట్లుంది. జంతువులు అమంగళాన్ని సూచిస్తున్నాయి. రాజా! బావులలోని

నీరు అన్నివైపులనుండీ పొంగుతోంది. అప్పుడు శరీరాలు కనపడకుండా మహానాదాలు వినిపిస్తున్నాయి. ఇటువంటి నిమిత్తాలను (శకునాలను) చూసి, వృకోదరుడు తన అన్న అయిన ధర్మరాజుతో ఇలా అన్నాడు.

"ఈ సుయోధనుడు యుద్ధంలో నన్ను గెలవలేడు. అర్జునుడు ఖాండవవనంలో అగ్నిని విడిచినట్లు చిరకాలంనుండి నా హృదయంలో నిగూఢంగా ఉన్న క్రోధాన్ని ఇప్పుడు కౌరవనాథుడైన సుయోధనునిపై విడుస్తాను. పాండవా! నీ హృదయంలోని ముల్లును నేడు తొలగిస్తాను. ఈ పాపాత్ముని గదతో చంపి, నేడు కీర్తిమయమైన మాలను నీ మెడలో అలంకరిస్తాను. నేడు పాపకర్ముడైన ఈ సుయోధనుని రణశిరస్సున గదతో చంపి, అతని శరీరాన్ని గదతోనే నూరు ముక్కలుచేస్తాను. ఈ సుయోధనుడు మరల హస్తినాపురంలో ప్రవేశించడు. నా ప్రక్కలో పాములు విడిచాడు. అన్నంలో విషం పెట్టాడు. ప్రమాణకోటి జలంలో పడవేశాడు. లక్క ఇంటిలో తగులబెట్టాడు. సభలో పరిహసించాడు. సర్వస్వాన్ని అపహరించాడు. అరణ్యవాసం చేయించాడు. సంవత్సరంపాటు అజ్ఞాతవాసం చేయించాడు. ఆ దుఃఖాల కన్నింటికీ నేను నేడు ముగింపు పలుకుతాను. ఒక్కదినంలో ఇతనిని చంపి, నన్ను నేను ఋణవిముక్తుని చేసికొంటాను. ఈ దుర్యోధనుని ఆయువు నేడు ముగుస్తుంది. మాతా పితృదర్శనం కూడా ముగుస్తుంది. దుర్మతి అయిన కురురాజు సౌఖ్యంకూడా నేటితో ముగుస్తుంది. మహారాజా! నారీదర్శనం కూడా ముగుస్తుంది. కురురాజైన శాంతనుని వంశంలోని ఈ కళంకం నేడు ప్రాణాలను, లక్ష్మిని, రాజ్యాన్ని వీడి నేలబడి పోతుంది. ధృతరాష్ట్ర మహారాజు కూడా కుమారుని పతనాన్ని గూర్చి విని, శకుని బుద్ధినుండి పుట్టిన అశుభకర్మలను తలచుకొంటాడు." అలా పలికి భీమసేనుడు గదను తీసికొని, దుర్యోధనుని ఆహ్వానిస్తూ నిలిచాడు. దుర్యోధనుడు గదనెత్తి నిలిచాడు. శిఖరంగల వెండి కొండవలె ఉన్నాడు. అతనిని చూసి భీమసేనుడు మరల క్రుద్ధుడై దుర్యోధనునితో ఇలా అన్నాడు.

వారణావతంలో ధృతరాష్ట్రమహారాజా, అలాగే నీవు చేసిన దుష్కృతాలను, జరిగినదానిని తలచుకో. కొలువుకూటంలో రజస్వల అయిన ద్రౌపదిని కష్టపెట్టావు. నీవు, శకుని కలిసి జూదంలో ధర్మరాజును వంచించారు. నీవలననే అరణ్యంలో మేము తీవ్రదుఃఖాన్ని పొందవలసివచ్చింది. విరాటనగరంలో కూడా మారురూపాలతో బ్రతకవలసి వచ్చింది. ఆ కోపాన్నంతా నేడు నీ మీద పడవేస్తాను. దుర్మతీ! అదృష్టం కొద్దీ కనిపించావు. ప్రతాపవంతుడు, రథికశ్రేష్ఠుడు అయిన భీష్ముడు నీకోసమే శిఖండిచేత దెబ్బతిని, అంపశయ్యపై

డుకొనిఉన్నాడు. ద్రోణుడు, కర్ణుడు, శల్యుడు చనిపోయారు. వైరానికి ఆదికర్త అయిన కుని కూడా చనిపోయాడు. ద్రౌపదికి క్లేశాన్ని కలిగించిన ఆ పాపి - ప్రాతికామి చనిపోయాడు. పరాక్రమించి, పోరాడే శూరులైన నీ సోదరు లందరూ చనిపోయారు. వీరే కాక ఇంకా ఎందరో రాజులు నీకోసం చనిపోయారు. ఈ రోజు నిన్ను గదతో చంపుతాను. ఈ విషయంలో సంశయం లేదు". రాజేంద్రా! ఆ రీతిగా పెద్దగా మాటాడుతున్న వృకోదరునితో సత్యవిక్రముడైన నీ కుమారుడు నిర్భయంగా ఇలా అన్నాడు.

వృకోదరా! ఇన్ని ప్రగల్భాలు ఎందుకు? పోరాడు. కులాధమా! ఈ రోజు నీ యుద్ధశ్రద్ధను పోగొడతాను. క్షుద్రా! నీవంటి వాడెవ్వడూ ఇతర సాధారణజనుని వలె దుర్యోధనుని మాటలతో బెదిరించలేడు. నాకు చిరకాలం నుండి నీతో గదాయుద్ధం చేయాలన్న కోరిక మనస్సులో ఉంది. దేవతలు దానినిలా కల్పించారు. దుర్మతీ! ఇన్ని మాటలెందుకు ? ప్రగల్భాలెందుకు? ఆ మాటను పనితో సంపన్నంచేయి. ఆలస్యం చేయవద్దు". దుర్యోధనుని ఆ మాటను విని, అక్కడున్న రాజులందరూ, సోమకులూ అతనిని అభినందించారు. ఆపై అందరి అభినందనల నందుకొని రోమాలు నిక్కపొడుచుకొనగా కురునందనుడు మరల యుద్ధానికి ధైర్యంగా సిద్ధపడ్డాడు. మదించిన ఏనుగువలె అసహనశీలుడైన దుర్యోధనుని రాజులందరూ కరతాలధ్వనులతో మరల ఉత్తేజపరిచారు. పాండుసుతుడు, మహాత్ముడు అయిన వృకోదరుడు గదను ఎత్తి, వేగంగా మహాత్ముడైన దుర్యోధనుని పైకురికాడు. జయాన్ని కోరుతున్న పాండవుల ఏనుగులు అక్కడ ఘీంకరిస్తున్నాయి. గుర్రాలు అదేపనిగా సకిలిస్తున్నాయి. శస్త్రాలు ప్రజ్వరిల్లుతున్నాయి.'

57. భీమదుర్యోధన గదాయుద్ధము

సంజయుడిలా చెప్తున్నాడు. 'ఆపై ఉదారహృదయుడైన దుర్యోధనుడు ఆ రీతిగా ఆక్రమిస్తున్న భీమసేనుని చూసి, సింహనాదం చేస్తూ, తీవ్రవేగంతో ఎదిరించాడు. కొమ్ములు గల ఆబోతులవలె ఒకరిమీదికొకరు దాడికి వచ్చారు. ఆ దెబ్బల చప్పుడు పెద్దపిడుగు పడిన ధ్వనివలె ఉంది. ఒకరినొకరు గెలవాలన్న తలంపుతో పోరాడుతున్న ఆ ఇద్దరి యుద్ధం రోమాంచజనకంగా, భీకరంగా జరుగుతోంది. అభిమానవంతులు, అయిన ఆ ఇద్దరూ గదలను చేతబట్టి, శరీరమంతా నెత్తురోడుతూ పుష్పించిన కింశుకవృక్షాలవలె కనిపించారు. ఆ రీతిగా పరమదారుణంగా యుద్ధం జరుగుతుంటే నిప్పురవ్వలు ఎగిశాయి. వాటివలన ఆకాశం మిణుగురుపురుగులు ఎగురుతున్నట్లు చూడముచ్చటగా ప్రకాశించింది.

ఆ ఇద్దరూ ముహూర్తకాలం విశ్రమించి, మరల విచిత్రంగా, అందంగా ఉన్న గదలను తీసికొని పోరాడసాగారు. నరోత్తములు విశ్రమించిన తరువాత గదలను చేతబట్టి పోరాడుతుంటే దేవతలు, గంధర్వులు, మానవులు పరమాశ్చర్యానికి గురి అయ్యారు. దుర్యోధనవృకోదరులను చూసి సర్వప్రాణులూ ఎవరు గెలుస్తారో అని సందేహించాయి.

ఇద్దరూ మరలా కలబడి, ఒకరి పొరపాట్లను మరొకరు వినియోగించుకొనదల్చి అవకాశం కోసం చూస్తూ, అడుగులు వేస్తున్నారు. భీమసేనుడు తన గదను త్రిప్పుతుంటే ప్రేక్షకులు దానిని యమదండంవలె చూశారు. ఆ గద పెద్దది. ఇంద్రుని వజ్రాయుధంవలె ఎత్తిపట్టబడినది. భీకరమై శత్రుసంహారం చేయగలది. గదను త్రిప్పే సమయంలో ముహూర్తకాలం ఘోరమూ, భయంకరమైన శబ్దం వినిపించింది. భీముడు అసాధారణవేగంతో ఆ గదను త్రిప్పటం చూసి, దుర్యోధనుడు ఆశ్చర్యపోయాడు. వారిద్దరూ ఒకరితో ఒకరు కలబడి, ఒకరినుండి ఒకరు కాపాడుకొనే ప్రయత్నం చేస్తూ రొట్టెకోసం పోట్లాడుకొనే పిల్లులవలె మాటిమాటికీ కొట్టుకొనసాగారు. భీమసేనుడు వివిధ మార్గాలలో, విచిత్రమండలాకృతులలో, ముందుకు, వెనుకకు అడుగులు వేస్తూ సంచరించాడు. వేగంగా ముందుకు దూకటం, పడగొట్టే ప్రయత్నం చేయటం, నిలవటం, పోరాడటం, శత్రువును దెబ్బతీయటంకోసం చక్కర్లు కొట్టడం, శత్రువును నిరోధించటం, జారి తప్పించుకోవటం, గంతులు వేయటం, ముందుకు వచ్చి కొట్టడం, వెనుకగా కొట్టడం – ఈరీతిగా సంచరిస్తూ గదాయుద్ధవిశారదులైన ఆ ఇద్దరూ పరస్పరం గాయపరచుకొంటున్నారు. ఆ ఇద్దరూ ఒకరినొకరు మోసగించుకొంటూ, పదే పదే యుద్ధక్రీడను ప్రదర్శిస్తూ మండలాకృతిలో సంచరించసాగారు. పరస్పరం కలబడి, దంతాలతో గాయపరచుకొని, నెత్తురోడుతున్న శరీరాలతో శోభించే ఏనుగులవలె ఆ వీరులు నెత్తురోడుతూ శోభిల్లారు. ఈ రీతిగా పగలు ముగిసేలోగా ఇంద్రవృత్రాసురుల మధ్య జరిగినట్లు వారిద్దరిమధ్య క్రూరమూ, ఘోరమూ అయిన యుద్ధం జరిగింది.

ఆపై ఇద్దరూ గదలు చేతబట్టి మండలాకారంలో నిలిచారు. వారిలో బలశాలి అయిన దుర్యోధనుడు దక్షిణ మండలంపై, భీమసేనుడు ఎడమమండలంపై నిలిచారు. ఆ రీతిగా రణశిరస్సున సంచరిస్తున్న భీమసేనుని ప్రక్కటెముకల మీద దుర్యోధనుడు దెబ్బకొట్టాడు. నీ కుమారు డలా కొట్టగానే భీమసేనుడు ఆ దెబ్బను తలచుకొంటూ బరువైన తన గదను త్రిప్పసాగాడు. గదను త్రిప్పుతున్న ఆ భీమసేనుని చూసి, నీ కొడుకు భీకరమైన గదను పైకెత్తి, భీముని గదపై కొట్టాడు. వాయువేగం గల నీ

కుమారుని గదా వేగంతో భీకరమైన ధ్వని పుట్టింది. గదల తాకిడితో నిప్పు పుట్టింది. విధిమార్గాలలో సంచరిస్తూ, విడివిడిగా వివిధ మండలాకృతులు, ప్రదర్శిస్తూ తేజస్వి అయిన ఆ సుయోధనుడు భీముని కన్నా మిన్నగా శోభించాడు. పరిపూర్ణ వేగంతో భీమసేనుడు త్రిప్పిన ఆ పెద్ద గద పెద్ద చప్పుడు చేస్తూ పొగతో, జ్వాలలతో కూడా నిప్పును వెడలగ్రక్కింది. భీమసేనుడు గిరగిరత్రిప్పిన ఆ గదను చూసి, సుయోధనుడు లోహమయమైన తన గదను త్రిప్పుతూ, ఎంతో శోభించాడు. వాయువేగంతో సమానమైన ఆ మహాత్ముని గదా వేగాన్ని చూసి, సమస్త పాండవులు, సోమకులూ భయపడ్డారు. వారిద్దరూ రణభూమిలో అన్నివైపులా యుద్ధక్రీడను ప్రదర్శిస్తూ గదలతో వేగంగా ఒకరినొకరు కొట్టసాగారు. మహారాజా! పరస్పరం కలబడి ఆ వీరులు నెత్తురోడుతూ శోభిల్లారు. ఈ రీతిగా పగలు ముగిసేలోగా ఇంద్రవృత్రాసురుల మధ్య జరిగినట్లు వారిద్దరి మధ్యా క్రూరమూ, ఘోరమూ అయిన యుద్ధం బహిరంగంగా జరిగింది.

భీముడు నిలిచిఉండటం చూసి మహాబలుడైన నీ కుమారుడు మరీ విచిత్రమైన మార్గాలలో సంచరిస్తూ, భీముని ఆక్రమించాడు. అతిక్రుద్ధుడైన దుర్యోధనుడు చేబట్టిన మహావేగశాలి అయిన ఆ బంగారు గదను క్రుద్ధుడైన భీముడు తన గదతో కొట్టాడు. మహారాజా! ఆ రెండుగదల తాకిడినుండి భీకర శబ్దమూ, నిప్పురవ్వలు వెలువడసాగాయి. పరస్పరం విసిరిన రెండు వజ్రాలు ఢీకొన్నట్లుంది అది. భీమసేనుడు విడచిన వేగశాలిని అయిన ఆ గద పడుతుంటే భూమి కంపించింది. ఎదురు నిలిచిన ఏనుగును చూసి, కోపించిన మదపుటేనుగువలె రణభూమిలో తన గద త్రిప్పికొట్టబడటాన్ని దుర్యోధనుడు సహించలేకపోయాడు. దానితో ఒక నిశ్చయానికి వచ్చిన ఆ దుర్యోధన నరపాలుడు సర్వమండలంగా తిరిగి, తీవ్రవేగం గల గదతో భీముని తలపై కొట్టాడు. మహారాజా! నీ కుమారుడు గదతో అలా కొట్టినా భీమసేనుడు చలించలేదు. అది అద్భుతంగా కనిపించింది. గద దెబ్బతిని కూడా భీముడు ఒక్క అడుగు కూడా కదలలేదు. ఆశ్చర్యకరమైన ఆ అంశాన్ని సర్వసేనలూ అభినందించాయి.

ఆపై భీమపరాక్రముడైన భీముడు సువర్ణాలంకారాలతో ప్రజ్వలిస్తున్న బరువైన గదను దుర్యోధనునిపై విసిరాడు. మహాబలుడైన దుర్యోధనుడు తడబాటు లేకుండా నేర్పుతో ఆ దెబ్బను వ్యర్థంచేశాడు. అది మహాశ్చర్యాన్ని కలిగించింది. రాజా! భీముడు విసిరిన ఆ గద వ్యర్థమై, పిడుగు పాటువలె పెద్దగా ధ్వనిచేస్తూ, నేలపై పడి నేలను కంపింపజేసింది. గద పడిపోవటం, భీమసేనుడు విఫలంకావటం చూసి, దుర్యోధనుడు

కౌశికమార్గాన్ని ఆశ్రయించి, మాటిమాటికి పైకి ఎగురుతూ, భీముని దారి తప్పిస్తూ కోపంతో గదతో భీముని రొమ్ముపై కొట్టాడు. నీ కుమారుడు గదతో కొట్టగానే మహారణ భూమిలో మోహానికి గురి అవుతున్న భీముడు కింకర్తవ్యతా మూఢు డయ్యాడు. భీముడు ఆ స్థితిలో ఉండగా సోమక పాండవులు ఉత్సాహహీను లయ్యారు. ఆ దెబ్బతో భీముడు వేగంగా సింహం వనగజంపై దూకినట్టు గదతో నీ కుమారుని మీద దాడిచేశాడు. రాజా! గదను ప్రయోగించటంలో నేర్పుగల భీమసేనుడు నీ కొడుకును - దుర్యోధనుని సమీపించి, అప్పుడు దుర్యోధనుని ప్రక్కటెముకపై కొట్టాడు. ఆ దెబ్బతో మతితప్పి, దుర్యోధనుడు మోకాళ్ళ మీద నేలపై కూర్చొన్నాడు. రాజా! ఆ కురుకులశ్రేష్ఠుడు మోకాళ్ళతో నేలగూలగానే సృంజయులలో సింహనాదం చెలరేగింది. ఆ సింహనాదాలను విని, నీ కుమారుడు అసహనంతో కోపానికి లోనయ్యాడు. మహాసర్పంవలె బుసకొడుతూ లేచి, కళ్ళతోనే దహిస్తున్నట్లు భీమసేనునివైపు చూశాడు. గదను చేతబట్టి, భీమసేనుని శిరస్సును మథిస్తున్నట్లు దూసికొనివచ్చి, మహాత్ముడైన భీముని నుదుటిపై కొట్టాడు. కానీ భీముడు చలించకుండా కొండవలె నిలిచాడు. గదదెబ్బతిన్న భీమసేనుడు నెత్తురోడుతూ మదజలాన్ని స్రవిస్తున్న మదపుటేనుగు వలె శోభించాడు. ఆపై భీమసేనుడు లోహగదను తీసికొని, బలంగా పరాక్రమించి, దుర్యోధనుని కొట్టాడు. ఆ గద పిడుగుపాటువలె తీవ్రధ్వని చేస్తోంది. భీమసేనుని దెబ్బతిన్న నీ కుమారుడు శరీరంలోని నరాలన్నీ, కంపించగా నేలగూలాడు. అరణ్యంలో చక్కగా పుష్పించిన శాలవృక్షం గాలివేగానికి దెబ్బతిని, కదలిపోయి, నేలబడినట్లుంది అది. నీ కుమారుని చూసి, పాండవులు హర్షంతో సింహనాదాలు చేశారు.

ఆ తరువాత నీ కుమారుడు చైతన్యాన్ని పొంది, మడుగునుండి ఏనుగు లేచినట్లు పైకి లేచాడు. ఆ దుర్యోధనరాజు శిక్షణపొందినవానివలె తిరుగుతూ ఎదుట నిలిచిఉన్న భీముని కొట్టాడు. శరీరం శిథిలమై ఆ భీమసేనుడు నేలను తాకాడు. ఆ దుర్యోధనుడు సింహనాదం చేశాడు. గదను విసిరి భీముని శరీరాన్ని రక్షిస్తున్న వజ్రతుల్యమైన కవచాన్ని బ్రద్దలు చేశాడు. ఆపై దేవతలు, అప్సరసలు చేస్తున్న హర్షధ్వానాలతో అంతరిక్షంలో పెద్దచప్పుడు చెలరేగింది. దేవతలు కురిపించిన విచిత్రపుష్పవృష్టి గొప్పగా కురిసింది. నేలబడిన భీముని, బలం తగ్గని దుర్యోధనుని చూసి, చాలాగట్టిగా ఉన్న భీముని కవచం బ్రద్దలు కావటం గమనించి, శత్రువులలో ఎంతో భయం కలిగింది. ఆపై ముహూర్తకాలంలో చైతన్యాన్ని పొంది, నెత్తుట తడిసిన తన ముఖాన్ని తుడుచుకొని, ధైర్యం తెచ్చికొని, కళ్ళు తెరచి చూస్తూ వృకోదరుడు బలాన్ని కూడదీసికొని నిలిచాడు.

ఆపై పరాక్రమంలో యమునితో సమానులైన నకుల సహదేవులు, ధృష్టద్యుమ్నుడు, పరాక్రమవంతుడైన సాత్యకి "నేను, నేను" అంటూ విజయాభిలాషతో మహావేగంతో నీకుమారుని పోరు కాహ్వానిస్తూ అతనిపై పరాక్రమించసాగారు. అయితే బలశాలి అయిన భీమసేనుడు వారినందరినీ నిహరించి, మరల యమునివలె తానే నీకుమారుని ఎదుట నిలిచి, భేదాన్నీ, వణుకును వీడి, దేవేంద్రుడు రాక్షసశ్రేష్ఠుడైన నముచిని ఆక్రమించినట్లు రణభూమిలో సంచరించసాగాడు.

58. దుర్యోధన వధ

భీమదుర్యోధనుల పోరులోని విజృంభణను చూసి అర్జునుడు యశస్వి అయిన వాసుదేవునితో ఇలా అన్నాడు. "జనార్దనా! యుద్ధంలో ఈ వీరులలో ఎవరు మిన్న అని నీవు భావిస్తున్నావు? ఎవరిలో ఏ గుణం ఎక్కువగా ఉంది? చెప్పు". వాసుదేవు డిలా చెప్పాడు. "అధ్యయనంలో ఈ ఇద్దరూ సమానమే. కానీ భీముడు బలంలో మిన్న. అయితే దుర్యోధనుడు అభ్యాసంతో, ప్రయత్నంతో భీముని కన్నా ఎక్కువ. ధర్మబద్ధంగా పోరాడితే భీమసేనుడు గెలవలేడు. అన్యాయంగా పోరాడితే సుయోధనుని చంపగలడు. దేవతలు మాయతోనే రాక్షసులను ఓడించారని నేను విన్నాను. ఇంద్రుడు మాయతోనే విరోచనుని ఓడించాడు. ఇంద్రుడు వృత్రుని తేజస్సును మాయద్వారానే నశింపజేశాడు. కాబట్టి ఈ భీముడు మాయామయమైన పరాక్రమాన్నే ఆశ్రయించాలి. జూదమాడినప్పుడు "రణభూమిలో గదతో నీ తొడలు బ్రద్దలు చేస్తా"నని భీముడు సుయోధనునితో ప్రతిజ్ఞ చేశాడు గదా! భీముడు ఆ ప్రతిజ్ఞనే పాటించాలి. మాయావి అయిన దుర్యోధన నరపాలుని మాయతోనే సంహరించాలి. ఈ భీముడు బలాన్ని నమ్ముకొని న్యాయబద్ధంగా పోరాడితే అప్పుడు ధర్మరాజు విషమస్థితిలో పడతాడు.

"పాండుకుమారా! అర్జునా! మరల చెప్తున్నాను. విను. ధర్మరాజు చేసిన తప్పువలన మరల మనం భయపడవలసి వచ్చింది. ఎంతో పరాక్రమాన్ని ప్రదర్శించి, భీష్ముడు మొదలైన కౌరవులను దెబ్బతీసి, విజయాన్ని పొందాం. గొప్పకీర్తిని పొందాం. శత్రుత్వానికి పూర్తిగా బదులు తీర్చాం. అలా పొందిన విజయం మరల సంశయాస్పదమైంది. ధర్మరాజు పెద్ద తెలివితక్కువ పని చేశాడు. ఒక్కనిగెలిస్తే అందరినీ గెలిచినట్లేనని ఘోరమైన పందెం పెట్టాడు. దుర్యోధనుడు యుద్ధనిపుణుడు, వీరుడు, ఒకే లక్ష్యంతో నిలిచినవాడు. శుక్రాచార్యుడు చెప్పిన ప్రాచీన శ్లోకమొకటుంది. రాజనీతి తత్త్వానికి సంబంధించినది. దానిని చెపుతా విను. జీవితం మీద కోరికతో యుద్ధం నుండి పారిపోయి తిరిగివచ్చిన శత్రుశేషాన్ని చూసి భయపడాలి. ఆ శత్రువులకు ఒకే లక్ష్య ముంటుంది. అర్జునా! జీవితంపై ఆశలేకుండా

సాహసంతో మీదకు వచ్చిన వారి ఎదుట ఇంద్రుడు కూడా నిలువలేడు. భంగపడి, సైన్యాన్ని కోలుపోయి, మడుగులో దాగి, పరాజితుడై, రాజ్యసాధనలో నిరాశపడి, అరణ్యాలకు పోదలచిన ఈ సుయోధనుని ప్రాజ్ఞు డెవడైనా రణభూమిలో ద్వంద్వ యుద్ధానికి పిలుస్తాడా? మనం గెలిచిన రాజ్యాన్ని సుయోధనుడు మరల హరించకూడదు. తాను పదమూడు సంవత్సరాలపాటు గదాయుద్ధాన్ని శ్రమతో అభ్యసించాడు. భీమసేనుని చంపాలని ఆటూ, ఇటూ, పైకి ఎగిరిపడుతున్నాడు. భీమసేనుడు అన్యాయమార్గంలో అయినా చంపకపోతే ఈ ధార్తరాష్ట్రుడే మీకు, కౌరవులకు రాజు కాగలడు!"

కేశవుని మాట విని, అర్జునుడు భీమసేనుడు చూస్తుండగా కుడితొడకొట్టాడు. ఆ సన్నను గ్రహించి భీముడు రణభూమిలో యమకం - ఇంకా ఇతర విచిత్రమండలాలు ప్రదర్శిస్తూ సంచరించసాగాడు. రాజా! పాండుకుమారుడైన భీముడు శత్రువులను మోహింపజేస్తూ దక్షిణ వామ, గోమూత్రక మండలాలతో సంచరింపసాగాడు. అదే రీతిగా గదాయుద్ధ మార్గాలలో నేర్పరియైన నీ కుమారుడు కూడా భీమసేనుని చంపగోరి, విచిత్రంగా వేగంగా కదలసాగాడు. శత్రుత్వాన్ని ముగించాలన్న కోరికతో రణభూమిలో చందనాన్ని అగరును, అలదిన ఆ భీకర గదలను త్రిప్పుతూ కోపించిన యములవలె కన్పించారు ఆ ఇద్దరూ. ఒకరినొకరు చంపగోరుతూ నరోత్తములైన ఆ వీరు లిద్దరూ పాముమాంసాన్ని పొందగోరుతూ పోరాడుతున్న గరుత్మంతులవలె యుద్ధంచేస్తున్నారు. విచిత్రమైన మండలాలతో తిరుగుతున్న ఆ భీమదుర్యోధనుల గదల తాకిడివలన అక్కడ అగ్ని జ్వాలలు పుట్టాయి. ఆ ఇద్దరూ రణభూమిలో సమానంగా దెబ్బకొడుతున్నారు. పెనుగాలికి క్షోభించిన రెండు సముద్రాలవలె, సమానంగా పోరాడుతున్న రెండు మదపుటేనుగులవలె ఉన్నారు. వారి గదల తాకిడివలన పిడుగుపాటు వంటి శబ్దం పుడుతోంది. ఆ రీతిగా దారుణంగా ఎంతో భయంకరంగా ఆ పోరు జరుగుతుంటే ఆ ఇద్దరూ అలసిపోయారు.

పరంతపా! వారు ముహూర్తకాలం విశ్రమించి మరల పెద్ద గదలను చేతబట్టి, కోపంతో కొట్టుకొనసాగారు. రాజేంద్రా! గదాప్రహారాలతో ఒకరినొకరు చెనకుతున్న ఆ ఇద్దరి మధ్యా బహిరంగంగా భయంకరమైన యుద్ధం జరిగింది. ఆ వీరులిద్దరూ రణభూమిలో వేగంగా దాడిచేస్తూ, బురదలో నున్న రెండు దున్నపోతులవలె పరస్పరం దెబ్బకొట్టసాగారు. శరీరాలు చితికిపోగా నెత్తుటితో పూర్తిగా తడిసి, ఆ భీమసుయోధనులు హిమాలయంపై పుష్పించిన మోదుగచెట్లు వలె కనిపిస్తున్నారు. అర్జునుడు భీమునకు అవకాశాన్ని సంకేతంతో చూపించగానే దుర్యోధనుడు కనుకొనులతో అర్జునునివైపు చూసి, మరల వేగంగా ముందుకు

కదిలాడు. ప్రాజ్ఞుడైన వృకోదరుడు రణభూమిలో దుర్యోధనుడు దగ్గరగా రావటం గమనించి, బలశాలి అయిన భీముడు అతనిపై మహావేగంతో గదను విసిరాడు. రాజా! భీముడు గదను విసరటాన్ని చూసి, నీ కొడుకు ఆ స్థానం నుండి తప్పుకొన్నాడు. ఆ గద వ్యర్థమై నేలబడింది. కురుసత్తమా! ఆ దెబ్బనుండి తప్పించుకొని, నీ కొడుకు పెను విసురుగా గదతో భీమసేనుని కొట్టాడు. ఆ దెబ్బతో అమితతేజస్వి అయిన భీముని శరీరంనుండి నెత్తురు కారసాగింది. గట్టిగా దెబ్బతగలటం వలన మూర్ఛవచ్చినంత పని అయింది. భీముడు యుద్ధంలో గట్టిగా దెబ్బతిన్నాడన్న విషయాన్ని దుర్యోధనుడు గ్రహించలేదు. శరీరంలో అంతబాధ కలిగినా భీముడు నిలద్రొక్కుకొన్నాడు. బదులుదెబ్బకొట్టడానికే రణభూమిలో భీముడు నిలిచిఉన్నాడని భావించాడు నీ కొడుకు. అందుకే తప్పించుకొనే ఆలోచనలో ఉండి మరొకసారి భీమునిపై వేటువేయలేదు. రాజా! ఆపై ముహూర్తకాలంలో ఊరటపడి, భీమసేనుడు దగ్గరగా నిలిచిఉన్న దుర్యోధనునిపై వేగంగా దాడిచేశాడు. అమిత బలంతో, కోపంతో మీదకు వస్తున్న భీమసేనుని చూసి, నీ కొడుకు ఆ దెబ్బను వ్యర్థం చేయదలచాడు. రాజా! వృకోదరుని వంచించాలని భావించి మహా మనస్వి అయిన నీ కొడుకు ముందు స్థిరంగా నిలవాలని భావించి, ఆపై ఎగిరిదూకి తప్పించుకోదలచాడు. కానీ భీమసేనుడు ఆ రాజు చేయదలచిన పనిని గ్రహించాడు. ఆ పై సింహంలా గర్జించాడు. నడకతో వంచించి, మరల ఎగిరి దూకదలచిన నీకుమారుని తొడలమీద వేగంగా గదను విసిరాడు. భీకర పరాక్రమాన్ని ప్రదర్శిస్తున్న భీముడు విసిరిన ఆ గద వజ్రపాతంవలె పడి ఆ దుర్యోధనుని అందమైన తొడలను బ్రద్దలు చేసింది. భీమసేనుడు తన తొడలు విరగగొట్టగానే నరోత్తముడైన నీ కొడుకు భూమిని ప్రతిధ్వనింపజేస్తూ పడిపోయాడు.

రారాజు అయిన దుర్యోధనుడు అలా నేలగూలగానే పిడుగులతో పాటు పెనుగాలులు వీచాయి. ధూళివర్షం కురిసింది. చెట్లతో, వనాలతో, పర్వతాలతో సహా భూమి కూడా కంపించింది. భూపాలుడు పడిపోగానే పెనుచప్పుడుతో, పెద్ద వెలుగుతో, పెనుగాలులతో భయంకరంగా పెద్ద తోకచుక్క పడింది. ఇంద్రుడు నెత్తుటివానను, ధూళివర్షాన్ని అక్కడ కురిపించాడు. అంతరిక్షంలో యక్షరాక్షసపిశాచాల మహాకోలాహలం వినిపిస్తోంది. ఆ ఘోరశబ్దంతో పాటు అనేక మృగాలు, పక్షుల ఘోరతరమైన శబ్దం అన్ని దిక్కులలో ప్రతిధ్వనించింది. అక్కడ మిగిలి ఉన్న గుర్రాలు, ఏనుగులు, మనుష్యులు పెద్దపెద్దగా అరవసాగారు. నేలమీద పడి ఉన్న భేరులు, శంఖాలు, మృదంగాల మహాధ్వని

రేగింది. అనేకపాదాలు, అనేకభుజాలు కలిగి భీకరంగా కనిపిస్తున్న కబంధాలు (తలలేని మొండెములు) నృత్యం చేస్తూ, భయపెడుతూ అన్నిదిక్కులలో వ్యాపించాయి. నీ కుమారుడు పడగొట్టబడగానే అక్కడున్న శస్త్రాస్త్రధారులు, ధ్వజశాలులు అయిన వీరులు కంపించిపోయారు. మడుగులు, బావులు నెత్తుటిని ఉప్పొంగించసాగాయి. తీవ్రవేగం గల నదులు వెనుకకు ప్రవహించసాగాయి. స్త్రీలు పురుషులవలె, పురుషులు స్త్రీలవలె ప్రవర్తించసాగారు. ఆశ్చర్యకరాలైన ఆ ఉత్పాతాలను చూసి పంచాలురు, పాండవులు అందరి మనస్సులు ఉద్విగ్నతకు లోనయ్యాయి. ఆపై దేవతలు, గంధర్వులు, అప్సరసలు నీ కుమారుల ఆ అద్భుతయుద్ధాన్ని గురించి చెప్పుకొంటూ స్వేచ్ఛగా వెళ్ళిపోయారు. అదే రీతిగా సిద్ధులు, వాతికులు, చారణులు, నరశ్రేష్ఠులైన ఆ భీమదుర్యోధనులను ప్రశంసిస్తూ, వచ్చినట్లే వెళ్ళిపోయారు.

59. యుధిష్ఠిర విలాపము

ఎదిగిన మహాశాలవృక్షం వలె పడిపోయిన ఆ దుర్యోధనుని చూసి, అక్కడ పాండవులందరూ ప్రసన్న హృదయులై దగ్గరకు వెళ్ళి, అతనిని చూడసాగారు. సోమకులందరూ కూడా సింహం పడగొట్టిన గజరాజువలె ఉన్న ఆ సుయోధనుని చూశారు. హర్షంతో వారి రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఆపై భీమసేనుడు తాను పడగొట్టిన దుర్యోధనుని సమీపించి ఇలా అన్నాడు. "మూర్ఖుడా! గతంలో కొలువులో ఎద్దు ఎద్దు అంటూ, ఏకవస్త్ర అయిన ద్రౌపదిని కొలువులోని కీడ్పించి మమ్ములను హేళన చేస్తూ, మాటాడావు. ఆ అపహాసానికి తగిన ఫలితాన్ని నీవు నేడు పొందావు." అలా పలికి భీమసేనుడు ఎడమకాలితో దుర్యోధనుని కిరీటాన్ని తాకాడు. ఆ రాజశ్రేష్ఠుని తలను కూడా కాలితో నెట్టాడు. ఈ రీతిగా క్రోధంతో ఎర్రబడ్డ కళ్ళతో, శత్రు సేనాపీడకుడైన భీముడు మరల దుర్యోధనునితో పలికిన మాట చెపుతా విను.

"గతంలో మూర్ఖులై మీరంతా "ఎద్దు, ఎద్దు" అంటూ మమ్ములను చూసి నృత్యం చేశారు. ఇప్పుడు మిమ్ములను "ఎద్దు, ఎద్దు" అంటూ బదులు పలుకుతూ మేము నృత్యం చేస్తాం. మేము కపటంగా ఉండం. తగులబెట్టం, జూదమాడం, మోసం చేయం. మా బాహుబలాన్ని ఆశ్రయించియే శత్రువులను బాధిస్తాం". ఈ రీతిగా తీవ్రవైరం యొక్క అంతు చూసి, వృకోదరుడు మెల్లగా నవ్వి యుధిష్ఠిరుడు, కృష్ణుడు, అర్జునుడు, నకుల సహదేవులు, సృంజయులతో ఇలా అన్నాడు. "రజస్వల అయిన ద్రౌపదిని కొలువులోనికి రప్పించి వివస్త్రను చేయబోయిన ధార్తరాష్ట్రులను ద్రౌపది తపస్సుతో పాండవులు

యుద్ధభూమిలో సంహరించారు. చూడండి. గతంలో మనలను పుచ్చిన నువ్వలనుగా పలికిన క్రూరులు ధృతరాష్ట్ర రాజకుమారులు. వారిని తమసేవకులతో బంధువులతో సహా సంహరించాం. స్వర్గానికే వెళతామో. నరకానికే వెళతామో, ఏదైనా సరే!". అలా పలికి భీమసేనుడు నేలపై పడిఉన్న దుర్యోధనుని భుజంమీద నున్న ఆ గదను తీసికొని, ఎడమకాలితో తలను మర్దించి, దుర్యోధనుని వంచకునిగా పలికాడు. రాజా! ఆనందపారవశ్యంతో అల్పబుద్ధి అయిన భీమసేనుడు దుర్యోధనుని తలపై కాలుమోపటాన్ని ధర్మాత్ములైన సోమకశ్రేష్ఠులు అభినందించలేకపోయారు. ఆ రీతిగా నీ కుమారుని చంపి, ప్రగల్భాలు, పలుకుతూ పదే పదే నృత్యం చేస్తున్న భీమసేనునితో ధర్మరాజు ఇలా అన్నాడు.

"వైరం ఋణం తీర్చుకొన్నావు. మంచి పనో, చెడ్డపనో చేసి ప్రతిజ్ఞను పూర్తి చేశావు. ఇక ఊరుకో! అతని తలను కాలితో మర్దించకు. నీవు ధర్మాన్ని అతిక్రమించవద్దు. దుర్యోధనుడు దాయాది. దెబ్బతిని ఉన్నాడు. నీకిది న్యాయం కాదు. పదకొండు అక్షౌహిణులకు అధిపతి, కౌరవులకధిపతి, రాజు, దాయాది, అయిన సుయోధనుని కాలితో తాకదగదు. ఈ రాజు బంధువులు చనిపోయారు. అమాత్యులు చనిపోయారు. సైన్యం నశించింది. యుద్ధంలో దెబ్బతిన్నాడు. అన్నివిధాలా జాలిచూపదగినవాడే కానీ పరిహసింపదగినవాడు కాదు. ఇతడు ధ్వంస మయ్యాడు. ఇతని అమాత్యులు, సోదరులు, ప్రజలు చనిపోయారు. పిండంపెట్టేవారు కూడా లేరు. పైగా మన సోదరుడు, నీవు న్యాయబద్ధంగా ప్రవర్తించలేదు. గతంలో జనులు "ఈ భీమసేనుడు ధార్మికుడు" అనేవారు. భీమసేనా! అటువంటి నీవు దుర్యోధనుని కాలితో ఎందుకు నెట్టావు?" భీమసేనునితో అలా పలికి యుధిష్ఠిరుడు దీనంగా అరిందముడైన దుర్యోధనుని సమీపించి, బాష్పగద్గద కంఠంతో ఇలా అన్నాడు.

"నాయనా! కోపపడవద్దు. బాధపడవద్దు. ఎవరైనా పురాకృతమైన ఘోరకర్మల ఫలితాన్ని తప్పక అనుభించవలసిందే. కురుసత్తమా! మేము నిన్ను చంపాలనుకొన్నాం. నీవు మమ్ము చంపాలనుకొన్నావు. ఇది తప్పక విధాత నిర్ణయమే. మనం చేసిన చెడ్డ పనుల ఫలితాన్ని ఇలా నిర్దేశించాడు. భారతా! లోభంవలననో, మదం వలననో, బాల్యం వలననో నీవు చేసిన అపరాధానికి ఇటువంటి తీవ్రకష్టాన్ని నీవు పొందవలసి వచ్చింది. మిత్రులను, సోదరులను, పితరులను, పుత్రులను, పౌత్రులను, ఇతరులను కూడా చంపించి, నీవుకూడా చనిపోయావు. నీవు చేసిన అపరాధం వలన మేము నీ సోదరులను చంపాం. జ్ఞాతులనూ సంహరించాం. విధిని తప్పించలే మనిపిస్తోంది. నీ గురించి నీవు జాలి

పడనవసరం లేదు. అనఘా! నీ మరణం శ్లాఘనీయం. కౌరవా! సర్వవిధాలుగా ఇప్పుడు మేమే శోచనీయస్థితిలో ఉన్నాం. ప్రియబంధువుల నందరినీ కోలుపోయి దీనంగా నిలిచిఉన్నాం. సోదరుల భార్యలు, పుత్రుల భార్యలూ శోకవిహ్వలలై ఉన్నారు. దుఃఖంలో మునిగిఉన్న ఆ విధవలను ఎలా చూడగలం ? రాజా! నీవు ఒక్కడవే సుఖంగా ఉంటావు. నీకు తప్పక స్వర్గం లభిస్తుంది. మేమే నరక మనే దారుణదుఃఖాన్ని పొందుతాం. విధవలైన ధృతరాష్ట్రుని కొడుకుల భార్యలు, మనవళ్ళ భార్యలు శోకానికి లోనై, వ్యాకులపాటుతో మమ్ము తప్పక నిందిస్తారు". సంజయుడిలా చెప్తున్నాడు. అలా పలికి, తీవ్రదుఃఖంతో ఆ రాజు నిట్టూర్చాడు. యుధిష్ఠిరుడు ఎంతోసేపు విలపించాడు.'

60. బలరామ సాంత్వనము.

ధృతరాష్ట్రుడిలా ఆడిగాడు. "సూతా! అధర్మంగా దుర్యోధనుని కొట్టడాన్ని చూసి, బలరాముడు ఏమన్నాడు? వివరంగా చెప్పు". సంజయుడు చెప్తున్నాడు. "భీమసేనుడు నీ కుమారుని తలమీద కొట్టగా చూసి, బలశాలి, శ్రేష్ఠయోధుడు అయిన బలరాముడు తీవ్రంగా కోపించాడు. ఆపై రాజుల సమక్షంలో బలరాముడు చేతులు పైకెత్తి, ఘోరంగా ఆర్తనాదం చేస్తూ ఇలా అన్నాడు. "భీమా! ఛీ! ఏమిటిది ? అయ్యో! ధర్మబద్ధంగా పోరాడుతూ బొడ్డు క్రింద కొట్టాడు. ఛీ! వృకోదరుడు చేసిన పని గదాయుద్ధంలో ఎక్కడా చూడలేదు. బొడ్డు క్రింద కొట్టగూడదని శాస్త్రనిర్ణయం కానీ ఈ వృకోదరుడు శాస్త్రమెరుగని మూఢుడై ఇష్టంవచ్చినట్లు ప్రవర్తిస్తున్నాడు." అలా ఆయా విషయాలు చెపుతున్న బలరామునకు తీవ్రరోషం కలిగింది. అప్పుడు దుర్యోధనరాజును చూసి, కోపంతో కన్నెర్ర చేశాడు. మహారాజా! ఆపై బలరాముడిలా అన్నాడు. "కృష్ణ! దుర్యోధనుడు నా అంతటివాడు. అతనికి సాటి ఎవ్వరూ లేరు. ఇప్పుడు అన్యాయంగా పడగొట్టింది కేవలం దుర్యోధనుని కాదు (నన్ను కూడా). శరణాగతుని దౌర్బల్యం వలన శరణమిచ్చిన వానిని కూడా తిరస్కరించినట్లయింది". అప్పుడు బలరాముడు నాగలినెత్తి భీమసేనుని పైకి వెళ్ళాడు. చేతులుపైకెత్తిన ఆ మహాత్ముని రూపం అనేకధాతువులతో విచిత్రమైన మహాశ్వేతపర్వతంతో సమానంగా ఉంది.

అర్జునునితో సహా అస్త్రకోవిదులైన తన సోదరులతో కూడిఉన్న భీమసేనుడు బలరాముని ఆ స్థితిలో చూసి కూడా వ్యథచెందలేదు.

బలశాలి అయిన కృష్ణుడు భీముని మీదకు వెళ్తున్న ఆ బలరాముని బలిష్ఠంగా, నున్నగా ఉన్న తన బాహువులతో ప్రయత్న పూర్వకంగా, బలంగా, వినయపూర్వకంగా

పట్టి, ఆపాడు. రాజేంద్రా! తెల్లని బలరాముడు, నల్లని కృష్ణుడు కలిసి అప్పుడు వెండికొండ, కాటుక కొండ కలిసినట్లు, దినాంతంలో ఆకాశంలోని సూర్యచంద్రులవలె శోభిల్లారు. కోపించిన బలరాముని శాంతింపజేస్తున్నట్లుగా కృష్ణ డిలా అన్నాడు. "ఎవరి వృద్ధి అయినా ఆరు రకాలుగా ఉంటుంది. తన వృద్ధి, తన మిత్రులవృద్ధి, మిత్రమిత్రులవృద్ధి, శత్రుపక్షంలో శత్రుహాని, శత్రుమిత్రహాని, శత్రుమిత్రమిత్రహాని. తనకు కానీ, తన మిత్రులకు కానీ విపరీత పరిస్థితి కలిగినప్పుడు మనస్సులో బాధపడాలి. వెంటనే ఇబ్బందిని తొలగించే ప్రయత్నం చేయాలి. విశుద్ధపౌరుషం గల పాండవులు మనకు సహజ మిత్రులు, మేనత్త కొడుకులు కాబట్టి మనవారు. శత్రువులు వీరిని తీవ్రంగా వంచించారు. ప్రతిజ్ఞాపాలనం ఈలోకంలో క్షత్రియధర్మ మని నాకు తెలుసు. "మహాసంగ్రామంలో సుయోధనుని తొడలు బ్రద్దలు చేస్తా"నని భీముడు గతంలో నిండు కొలువులో ప్రతిజ్ఞ చేశాడు. పరంతపా! పూర్వమే మైత్రేయమహర్షి "భీముడు గదతో నీ తొడలను బ్రద్దలు చేస్తా" డని సుయోధనుని శపించాడు. అందువలన నాకేమీ తప్పనిపించటం లేదు. బలరామా! కోపపడవద్దు. పాండవులతో మనకు రక్తసంబంధముంది. సౌహార్ద సంబంధముంది. వారి అభివృద్ధి మన అభివృద్ధికి కారణమవుతుంది. పురుషోత్తమా! కోపపడవద్దు". వాసుదేవుని మాట విని ధర్మవేత్త అయిన బలరాముడు ఇలా అన్నాడు.

"సజ్జనులు ధర్మాన్ని చక్కగా పాటించారు. ఆ ధర్మాన్ని అర్థకామాలు నియంత్రించే ప్రయత్నం చేస్తాయి. **పరమలోభియొక్క అర్థమూ, అత్యాసక్తిగల వాని కామమూ ధర్మాన్ని పాడుచేస్తాయి. కామంతో ధర్మార్థాలమా, అర్థంతో ధర్మకామాలమా, ధర్మంతో అర్థకామాలను బాధించకుండా ధర్మార్థకామాలను సేవించిన వాడు మహాసుఖాన్ని పొందగలడు.** గోవిందా! భీమసేనుడు ధర్మానికి హాని కలిగించి. మొత్తాన్ని కలవరపాటుకు గురిచేశాడు. నీవు నాతో చెప్పిన మాటలన్నీ నీ అభీష్టానికి సంబంధించినవే". శ్రీకృష్ణుడిలా అన్నాడు. "క్రోధరహితుడు, ధర్మాత్ముడు, నిత్యమూ ధర్మవత్సలుడు అని లోకంలో నీకు ప్రఖ్యాతి ఉంది. కాబట్టి శాంతించు. కోపపడవద్దు. కలియుగం ప్రారంభమైందని గ్రహించు. భీముని ప్రతిజ్ఞను గురించి ఆలోచించు. పాండుసుతుడైన భీమసేనుడు నేడు వైరాన్ని, ప్రతిజ్ఞను తీర్చుకొన్నాడు.

రణభూమిలో పురుషశ్రేష్ఠుడైన భీముడు వంచకుడైన దుర్యోధనుని చంపి వెళ్ళాడు. భీముడు శత్రువును చంపినరీతిలో అధర్మం లేదు. కురువంశానికీ, వృష్ణివంశానికీ కూడా కీర్తి తేగల వీరుడు - అభిమన్యుడు రణభూమిలో పోరాడుతుంటే ఈ దుర్యోధనుని ఆదేశంతోనే కర్ణుడు వెనుకనుండి వింటిని విరిచాడు. ఆపై విల్లు విరిగినా, విరథుడై కూడా పారిపోకుండా పరాక్రమాన్ని ప్రదర్శిస్తున్న

అభిమన్యుని నిరాయుధుని చేసి ఈ సుయోధనుడే చంపాడు. దుర్మాతుడు, దుర్బుద్ధి, పాపాత్ముడు, వంశకళంకుడు, పుట్టిననాటినుండి లోభి అయిన దుర్యోధనుని భీమసేనుడు చంపాడు. భీమసేనుని ప్రతిజ్ఞ పదమూడు సంవత్సరాల నాటిది లోకమంతా ఎరిగినదే. పోరాడే సమయంలో దుర్యోధనుడు దానినెందుకు గుర్తుంచుకోలేదు ? వేగంగా పైకి ఎగిరి తనను చంపబోతున్న సమయంలో భీముడు గదతో తొడలు బ్రద్దలు చేశాడు. అప్పుడు దుర్యోధనుడు బరిలోనూలేడు, నిలిచీ లేడు!".

సంజయుడిలా చెప్తున్నాడు. 'రాజా! శ్రీకృష్ణుడు కౌటిల్యంతో కూడిన ధర్మాన్ని ప్రతిపాదించగా విని, ఆ బలరాముని మనస్సు ప్రసన్నం కాలేదు. మరల నలుగురి మధ్య ఇలా అన్నాడు. "ధర్మాత్ముడైన సుయోధన నరపాలుని అధర్మ మార్గంలో చంపి, భీమసేనుడు కపటయోధిగా లోకంలో ప్రసిద్ధికెక్కుతాడు. ధర్మాత్ముడైన దుర్యోధనుడు కూడా శాశ్వత సద్గతిని పొందుతాడు. దుర్యోధన నరపాలుడు ఋజుమార్గంలో పోరాడి చనిపోయాడని ఖ్యాతినందుతాడు. యుద్ధదీక్షతో రణభూమిలో ప్రవేశించి, రణయజ్ఞాన్ని కొనసాగించి, శత్రువులచే అగ్నిలో తనను ఆహుతి చేసికొని కీర్తి అనే అవభృథ స్నానాన్ని చేయబోతున్నాడు". అలా పలికి ప్రతాపశాలి అయిన బలరాముడు రథమెక్కి, తెల్లని మొయిళ్ళమొనవలె ప్రకాశిస్తూ ద్వారకకు వెళ్ళిపోయాడు. రాజా! బలరాముడు ద్వారకకు వెళ్ళిపోగా పంచాలురు, వార్ష్ణేయులు, పాండవులు ఉదాసీనులయ్యారు. మనస్సుల్లో ఉత్సాహం నిలవలేదు. ఆపై యుధిష్ఠిరుడు విచారంతో తల వాల్చాడు. శోకంతో ఆయన సంకల్పం భంగపడింది.

అలా దీనంగా ఉన్న ధర్మరాజుతో కృష్ణుడిలా అన్నాడు. "ధర్మరాజా! నీవు అధర్మాన్ని ఎందుకు అంగీకరిస్తున్నావు. బంధువులను కోల్పోయి ఈ దుర్యోధనుడు నేలపైబడి అచేతనంగా ఉన్నాడు. అతని శిరస్సును భీముడు కాలితో త్రొక్కుతున్నాడు. నీవు ధర్మజ్ఞుడవై, రాజువై ఎలా ఊరుకొంటున్నావు". యుధిష్ఠిరుడిలా అన్నాడు. "కృష్ణా! భీమసేనుడు కోపంతో దుర్యోధన నరపాలుని తలను కాలితో తాకటం నాకూ నచ్చటం లేదు. వంశవినాశనం జరుగుతుంటే నేను ఆనందించటం లేదు. ధృతరాష్ట్రకుమారులు నిత్యమూ వంచనతో పరాభవించారు. పరుషవచనాలతో దూషించారు. అరణ్యాలకు పంపించారు. భీమసేనుని హృదయంలో తీవ్రమైన ఆ దుఃఖ ముంది. కృష్ణా! ఆ ఆలోచనతోనే దీనిని నేను ఉపేక్షించాను. కామానికి లొంగిపోయిన లుబ్ధుడు దుర్యోధనుడు. ఆత్మనియంత్రణ లేని అతనిని చంపి, ధర్మమో! అధర్మమో! భీముడు తన కోరిక తీర్చుకొన్నాడు. అందుకే ఆలోచిస్తున్నాను." ధర్మరాజు అలా చెప్పగానే యదుకులశ్రేష్ఠుడైన కృష్ణుడు ఎట్టకేలకు "అలాగే! సహించవలసినదే" అన్నాడు. భీమసేనుని హితాన్ని, ప్రియాన్ని కోరుకొనే వాసుదేవుడు అలా అనగానే యుధిష్ఠిరుడు భీమసేనుడు రణభూమిలో చేసినదానికంతా ఆమోదించాడు.

మహాబాహువైన అర్జునుడు కూడా అసంతుష్ట మనస్కుడయ్యాడు. సోదరుడు చేసిన పనిని మంచి అని కానీ, చెడు అని కానీ ఏమీ అనలేదు.

అసహనశీలుడైన భీమసేనుడు కూడా రణభూమిలో నీ కుమారుని చంపి, ఆనందించి, చేతులు జోడించి, నమస్కరించి ధర్మజుని ఎదుట నిలిచాడు. రాజా! మహాతేజస్వి, జయశీలుడు అయిన భీముడు ఆనందంగా కళ్ళు విప్పారగా యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "మహారాజా! ఇప్పుడు ఈ రాజ్యమంతా నీదే! శత్రువులు నశించారు. క్షేమం కలిగింది. స్వధర్మాన్ని పాటిస్తూ దీనిని పరిపాలించు. రాజా! కపటత్వాన్ని ఇష్టపడి వంచనతో ఈ వైరానికి కారకుడైన ఈ దుర్యోధనుడు నేలబడిఉన్నాడు. దుశ్శాసనుడు మొదలైన ఆ ఉగ్రవాదులందరూ, కర్ణుడూ, శకునీ – ఈ నీ శత్రువులందరూ చనిపోయారు. మహారాజా! నీ శత్రువులు చనిపోయారు. రత్న పూర్ణమైన ఈ నేల వనపర్వతాలతో పాటు ఇప్పుడు నిన్ను సేవిస్తుంది." యుధిష్ఠిరుడిలా అన్నాడు. "వైరం చచ్చిపోయింది. సుయోధనరాజు పడిపోయాడు. కృష్ణుని మద్దతుతో ఈ నేలను గెలిచాం. అదృష్టం కొద్దీ నీవు తల్లి ఋణాన్ని, కోపఋణాన్ని తీర్చుకొన్నావు. దుర్దర్షా! అదృష్టం కొద్దీ నీవు గెలిచావు. శత్రువును పడగొట్టావు."

61. కృష్ణపాండవ దుర్యోధన సంవాదము

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. 'సంజయా! రణభూమిలో భీమసేనుడు దుర్యోధనుని పడగొట్టడం చూసి పాండవులు, సృంజయులు ఏం చేశారు ?" సంజయుడు చెప్తున్నాడు. "మహారాజా! దుర్యోధనుని భీమసేనుడు పడగొట్టడం చూసి పాండవులు, కృష్ణుడు ప్రసన్న హృదయులయ్యారు. పంచాలురు, సృంజయులు ఉత్తరీయాలను ఎగురవేశారు. సింహనాదాలు చేశారు. ఆనందభరితులైన వారిని ఈ నేల భరించలేకపోయింది. కొందరు ధనుష్టంకారాలు చేశారు. మరి కొందరు అల్లెత్రాళ్ళను లాగారు. కొందరు పెద్ద శంఖాలను మ్రోయించారు. మరికొందరు దుందుభులు మ్రోగించారు. కొందరు ఆటలాడసాగారు. నీ శత్రువులు నవ్వుకొన్నారు. వీరులు పదే పదే భీమసేనునితో ఇలా అన్నారు.

"రణభూమిలో అత్యంత నిపుణుడైన దుర్యోధనుని పడగొట్టి, ఈ రోజు దుష్కరమైన మహాపరాక్రమాన్ని ప్రదర్శించావు. మహాసంగ్రామంలో ఇంద్రుడు వృత్రుని వధించినట్లు నీవు శత్రువును వధించావని ఈ జనులంతా అనుకొంటున్నారు. వివిధమార్గాలలో చరిస్తూ, అన్నిరకాల మండలాకృతులను ప్రదర్శిస్తూ, పోరాడిన శూరుడైన దుర్యోధనుని వృకోదరుడు తప్ప మరెవడు చంపగలడు ? ఇతరులు అధిగమించలేని రీతిగా శత్రుత్వపు

అంతానికి చేరావు. ఇటువంటి సంపాదన ఇతరులకు శక్యమైనది కాదు. వీరా! అదృష్టంకొద్దీ రణశిరస్సున మదించిన ఏనుగువలె నీవు దుర్యోధనుని తలను పాదంతో త్రొక్కావు. అనఘా! సింహం దున్నపోతునెత్తురు త్రాగినట్లు నీవు మేటిపోరు సలిపి అదృష్టం కొద్దీ దుశ్శాసనుని నెత్తురు త్రాగగలిగావు. అదృష్టం కొద్దీ ధర్మాత్ములైన యుధిష్ఠిర మహారాజుకు అపకారం చేసిన వారి తలపై నీ పరాక్రమంతో నీవు పాదం మోపావు. శత్రువులపై ఆధిపత్యాన్ని సాధించటం వలన, దుర్యోధనుని వధించటం వలన లోకంలో నీకు మహాయశస్సు దక్కింది. ఇది అదృష్టఫలమే. వృత్రుడు చనిపోయినపుడు స్తోత్రపాఠకులు ఇంద్రుని స్తుతించినట్లు శత్రువులను చంపిన నిన్ను కూడా మేము అభినందిస్తున్నాం. భారతా! దుర్యోధనుని వధతో హర్షంతో నిక్కపొడుచుకొన్న మా రోమాలు ఇప్పటికి కూడా వాలటం లేదు చూడు". అక్కడ కూడియున్న వాతికులు (స్తోత్రపాఠకులు) భీమసేనునితో ఆలా అన్నారు. పురుషోత్తములైన పంచాలురు, పాండవులు ఆనందంతో అలా అనుచితంగా మాటాడటాన్ని గమనించి కృష్ణుడు వారితో ఇలా అన్నాడు.

"రాజాలారా! చచ్చిన శత్రువును ఆదేపనిగా పరుషవచనాలతో మరల చంపకూడదు. ఈ మందమతి పడిపోయాడు గదా! ఈ పాపాత్ముడు లోభంతో, పాపులసహాయంతో, మిత్రుల మాటను అతిక్రమించి, సిగ్గులేకుండా ప్రవర్తించినప్పుడే చనిపోయాడు. విదురుడు, ద్రోణుడు, కృపుడు, భీష్ముడు, సృంజయులు, పాండవులు ఎంతగా ప్రార్థిస్తున్నా పాండవుల పితృ భాగాన్ని ఇవ్వలేదు. ఇప్పుడు ఈ పురుషాధముడు యోగ్యుడు కాదు. ఎవరికీ మిత్రుడూ కాదు, శత్రువూ కాదు. ఎండినకట్టెవలె ఇప్పుడు కఠినుడు. పరుషవచనాలతో నలగగొట్టడమెందుకు ? రాజులారా! రథాలనెక్కండి. వెంటనే వెళదాం. అదృష్టం కొద్దీ అమాత్యులతో, దాయాదులతో, బంధువులతో సహా ఇతనిని పడగొట్టగలిగాం". రాజా! కృష్ణుడు అలా అధిక్షేపించగా విని, దుర్యోధన నరపాలుడు అసహనానికి వశమై లేచి, రెండు చేతులను నేలపై మోపి, పిర్రలమీద కూర్చున్నాడు. బొమముడి వేసి కృష్ణునిపై దృష్టి సారించాడు. శరీరంలో పై భాగమే నిలిచియున్న ఆయనరూపం కోపంతో ఉన్న తోకతెగిన పామువలె ఉన్నది.

ప్రాణాలు తీస్తున్న ఘోరమైన వేదనను కూడా లెక్కచేయకుండా దుర్యోధనుడు పరుషవచనాలతో కృష్ణుని నొప్పించసాగాడు. "కంసుని దానుని కొడుకువు నీవు. గదాయుద్ధంలో అధర్మంగా నన్ను పడగొట్టారు. దీనికి నీవు సిగ్గుపడటం లేదు. తొడలను విరగగొట్టమని కపటంగా భీమునకు గుర్తుచేస్తూ అర్జునునితో నీవన్న మాటలు నాకు తెలియదనుకొంటున్నావా?

నిజాయితీగా పోరాడే రాజులను వేలకొలదిగ అనేక కపటోపాయాలతో చంపించావు. నీకు సిగ్గులేదు, జాలీ లేదు. ప్రతి దినమూ శూరులతో మహాసంగ్రామం చేస్తున్న భీష్మపితామహుని శిఖండిని ఎదురు నిలిపి చంపించావు. సుదుర్బుద్ధీ! అశ్వత్థామ పేరుతో సమానమైన పేరుగల ఏనుగును చంపి, ద్రోణుని చేత శస్త్రసంన్యాసం చేయించావు. అది నాకు తెలియదా ? క్రూరుడైన ఆ ధృష్టద్యుమ్నుడు పరాక్రమవంతుడైన ఆ ద్రోణుని ఆ స్థితిలో పడగొట్టాడు. నీవు చూసి కూడా, అతనిని నివారించలేదు. అర్జునుని చంపటం కోసం యాచించి, తీసికొన్న ఇంద్రశక్తిని ఘటోత్కచునిపై ప్రయోగింపజేశావు. నీకన్న మరీ పాపాత్ముడెవడు ? బలశాలి అయిన భూరిశ్రవుని చేయి తెగింది. ప్రాయోపవేశంలో ఉన్నాడు. ఆ స్థితిలో మహాత్ముడైన సాత్యకి నీ ప్రేరణతోనే భూరిశ్రవుని చంపాడు. నరోత్తముడైన కర్ణుడు అర్జునుని సంహరించాలని గొప్ప పరాక్రమాన్ని ప్రదర్శిస్తున్నప్పుడు నాగరాజైన అశ్వసేనుడు అర్జునుని చంపాలని వెళితే నీవే విఫలం చేశావు. మరల రథచక్రం నేలలో కూరుకొనిపోయినప్పుడు ఇబ్బందులలో పడిన కర్ణుని పరాజితునిగా భావించి రణభూమిలో నీవు చంపించేశావు. నాతో కానీ, కర్ణునితో కానీ, భీష్మద్రోణులతో కానీ యుద్ధరంగంలో ఋజుమార్గంలో పోరాడి ఉంటే నీవు గెలిచేవాడివి కావు. నీవు అనార్యుడవు. స్వధర్మాన్ని అనుష్ఠిస్తున్న మమ్ము, మరెందరో రాజులను అధర్మమార్గంలో చంపించావు".

కృష్ణుడిలా అన్నాడు. "గాంధారీసుతా! పాపమార్గాన్ని ఆశ్రయించినీవు సోదరులతో, సుతులతో, బాంధవులతో, అనుచరులతో, మిత్రులతో సహా దెబ్బతిన్నావు. నీ దుష్ప్రతాలవల్లనే వీరులైన భీష్మద్రోణులు పడిపోయారు. నీ శీలాన్ని అనుసరించియే కర్ణుడు కూడా రణభూమిలో చనిపోయాడు. మూర్ఖా! నేనే వచ్చి యాచించినా పాండవులకు తండ్రి భాగాన్ని ఇవ్వలేదు. లోభంతో, శకుని నిశ్చయంతో పాండవులనుండి వారి రాజ్యాన్ని కూడా లాగికొన్నావు. దుర్బుద్ధీ! నీవు భీమసేనునకు విషం పెట్టావు. పాండవుల నందరినీ తల్లితో సహా లక్క ఇంటిలో తగులబెట్టించావు. జూదమన్న సాకుతో సభలో యజ్ఞ సంభవయైన ద్రౌపదిని రజస్వలగా ఉన్నప్పుడు పరాభవించావు. సిగ్గులేనివాడా! నిన్ను ఆరోజే చంపి ఉండవలసింది. జూదంలో నిపుణుడైన శకుని ద్వారా జూదం తెలియని ధర్మమూర్తిని - యుధిష్ఠిరుని వంచనతో ఓడించావు. అందువలననే యుద్ధంలో దెబ్బతిన్నావు. పాండవులు వేటకై తృణబిందుని ఆశ్రమానికి వెళ్ళిఉన్నప్పుడు పాపాత్ముడైన సైంధవుడు అరణ్యంలో ద్రౌపదిని కష్టపెట్టాడు. పాపాత్ముడా! రణభూమిలో ఒంటరిగా నిలిచిన బాలుని అభిమన్యుని అనేకులు కలిసి, నీ తప్పువలననే సంహరించారు. అందుకే యుద్ధంలో పడిపోయావు.

పాండవుల అనర్థాన్ని కోరుతూ రణభూమిలో పరాక్రమాన్ని ప్రదర్శిస్తున్న భీష్ముని శిఖండి

మిత్రులకోసం వధించాడు. దానిలో తప్పులేదు. ద్రోణాచార్యుడు నీకు ప్రియాన్ని చేయాలని స్వధర్మాన్ని వెనక్కునెట్టి, అపమార్గాన్ని ఆశ్రయించాడు. అందుకే యుద్ధంలో ధృష్టద్యుమ్నుడు ద్రోణుని చంపాడు. తన ప్రతిజ్ఞను యథార్థం చేయాలనుకొని, రణభూమిలో విద్వాంసుడైన సాత్యకి మహారథుడైన తన శత్రువును భూరిశ్రవుని సంహరించాడు. రాజా! పురుషశ్రేష్ఠుడైన అర్జునుడు రణభూమిలో పోరాడుతూ ఎప్పుడూ ఎటువంటి చెడ్డపని చేయడు. ఎన్నోసార్లు లోపాలు కనిపించినా వీరుల మర్యాదను తలచుకొంటూ అర్జునుడు యుద్ధంలో కర్ణుని చంపలేదు. దుర్బుద్ధీ! ఇలా మాటాడకు. దేవతల అభిప్రాయం తెలిసి వారికి ప్రియమూ, హితమూ అయిన పని చేయాలని నేను అర్జునునిపై ప్రయోగించిన మహానాగాస్త్రాన్ని విఫలం చేశాను. నీవు, భీష్ముడు, కర్ణుడు, ద్రోణుడు, అశ్వత్థామ, కృపుడు విరాటనగరంలో ఆ అర్జునుని దయవలననే బ్రతికిపోయారు. అర్జునుడు ఆ నాడు గంధర్వులపై ప్రదర్శించిన పరాక్రమాన్ని తలచుకో. గాంధారీసుతా! పాండవులు నీతో ప్రవర్తించిన దానిలో అధర్మమేముంది ? వీరులు, పరంతపులైన పాండవులు తమ బాహుబలాన్ని ఆశ్రయించి, స్వధర్మంతో యుద్ధంలో గెలిచారు. నీవు పాపాత్ముడవు. చావబోతున్నావు.

మేమెన్నో అకృత్యాలు చేశామని మాటాడుతున్నావు. అవన్నీ కూడా నీ అధర్మం కారణంగా అనుష్ఠించినవే. నీవు బృహస్పతి, శుక్రుడు, చేసిన ఉపదేశాలు వినలేదు. వృద్ధులను సేవించలేదు. హితవచనాలు వినలేదు. నీవు తీవ్రలోభానికీ, ఆశకూ లోబడిపోయి, చేయదగని పనులు చేశావు. వాటి ఫలితాన్ని అనుభవించు". దుర్యోధనుడిలా అన్నాడు. "యథావిధిగా చదువుకొన్నాను. దానాలు చేశాను. సాగరాలతో సహా భూమిని పాలించాను. శత్రువుల తలలపై నిలిచాను. ఇంత మంచి ముగింపు మరెవరికి దక్కుతుంది? స్వధర్మంపై దృష్టిపెట్టే క్షత్రియ బంధువులు కోరుకొనే మరణమే నాకు ప్రాప్తించింది. ఇంత మంచి ముగింపు మరెవరికి దక్కుతుంది ? ఇతర రాజులకు అంత తేలికగా లభించని దేవోచిత భోగాలను పొందాను. ఉత్తమైశ్వర్యాన్ని పొందాను. ఇంతమంచి ముగింపు మరెవరికి దక్కుతుంది. మిత్రులతో, అనుచరులతో కలిసి నేను స్వర్గానికి వెళ్ళబోతున్నాను. మీరు కోరికలు తీరక దుఃఖంతో జీవిస్తారు."

భీముడు నా శిరస్సుపై కాలు పెట్టినందుకు నాకు బాధలేదు. క్షణకాలం తర్వాత కాకులో, డేగలో, గ్రద్దలో నామీద కాలు వెడతాయి.

సంజయుడిలా చెప్తున్నాడు. "ధీమంతుడైన కురురాజు ఆ మాట పూర్తి చేయగానే పవిత్రవాసనలు గల మహాపుష్పవృష్టి కురిసింది. గంధర్వులు మనోహర వాద్యాలను మ్రోయించారు. అప్సరసలు దుర్యోధనుని కీర్తిని గానం చేశారు. రాజా! సిద్ధులు 'భళీ! భళీ' అని అభినందనలు పలికారు. పుణ్యవాసనతో మృదువుగా, సుఖంగా గాలి వీచింది. దిక్కులన్నీ విరాజిల్లాయి. ఆకాశం వైడూర్యంవలె భాసించింది. వాసుదేవుడు మొదలైన

పాండవపక్షీయులు ఆ అద్భుతాలను చూసీ, దుర్యోధనునకు జరుగుతున్న సత్కారాన్ని చూసీ సిగ్గుపడ్డారు. భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, భూరిశ్రవుడు అధర్మంగా చంపబడ్డారని విని వారు శోకార్తులై, దుఃఖించారు. ఆ రీతిగా దీనహృదయులై విచారంలో మునిగిన పాండవులను చూసి, కృష్ణుడు మేఘదుందుభుల వంటి కంఠ స్వరంతో ఇలా అన్నాడు.

"ఈ దుర్యోధనుడు చాలావేగంగా అస్త్రప్రయోగం చేయగలవాడు. ఎవ్వరూ గెలవలేరు. ఆ భీష్మాదులు మహారథులు, ఋజుయుద్ధంలో పరాక్రమిస్తే మీరు వారిని సంహరించలేరు. ఈ దుర్యోధననరపాలుడు కానీ, ఆ భీష్మాదులందరూ కానీ ధర్మ యుద్ధంలో ఎప్పుడూ చంపటానికి వీలుకాని వారే. నేనే అనేకోపాయాలతో, పదేపదే మాయా యోగంతో మీ హితాన్ని కోరుతూ, వారినందరినీ యుద్ధంలో చంపాను. నేనే కానీ ఇటువంటి కపటత్వాన్ని రణభూమిలో అసలు ప్రదర్శించకపోయినట్లయితే మీకు విజయమూ, రాజ్యమూ, ధనమూ ఎలా దక్కేవి ? ఆ నలుగురు మహారథులు - భీష్మద్రోణ కర్ణభూరిశ్రవులు- అందరూ మహాత్ములు. ధర్మమార్గంలో స్వయంగా లోకపాలురైనా వారిని జయించలేరు. అదే రీతిగా యుద్ధంలో అలసటనెరుగని ఈ దుర్యోధనుడు కూడా గదను చేబడితే ధర్మయుద్ధంలో దండధారి అయిన యముడు కూడా ఆయనను సంహరించలేడు. కాబట్టి ఈ రీతిగా శత్రువులను చంపామని మీరు మనస్సులో పెట్టుకోవద్దు. శత్రువులు బలాధికులై ఎక్కువమంది ఉంటే వివిధోపాయాలతో కపటనీతితో చంపవచ్చు. రాక్షససంహార సమయంలో ప్రాచీనులైన దేవతలు ఈ దారినే అనుసరించారు. శ్రేష్ఠులు నడిచిన బాటలో అందరూ నడుస్తారు. మీ పని పూర్తి అయింది. సాయంకాలమైంది. విశ్రమించాలి. రాజులారా! అందరం గుర్రాలు, ఏనుగులు, రథాలతో పాటు విశ్రమిద్దాం. అప్పుడు వాసుదేవుని మాటలు విని పాండవులు, పంచాలురు పరమోత్సాహంతో సింహసమూహంవలె గర్జించారు. ఆపై దుర్యోధన పతనాన్ని చూసి, హర్షంతో అందరూ శంఖాలు ఊదారు. కృష్ణుడు పాంచజన్యాన్ని మ్రోగించాడు.

అర్జునుడు పరమోల్లాసంతో దేవదత్తశంఖాన్ని పూరించాడు. కొంతేయుడైన యుధిష్ఠిరుడు అనంతవిజయాన్నీ, వృకోదరుడు పౌండ్రమనే మహాశంఖాన్నీ ఊదారు. నకులుడు సుఘోషాన్ని, సహదేవుడు మణిపుష్పకాన్నీ, ధృష్టద్యుమ్నుడు క్షైత్రాన్ని, సాత్యకి నందివర్ధనాన్ని పూరించారు. భరతర్షభా! ఆ మహాశంఖ నాదంతో ఆకాశమంతా నిండిపోయింది. భూమి ఊగసాగింది. ఆపై పాండుసేనలలో శంఖాలు, భేరులు. పణవాలు, ఆనకాలు, గోముఖాలు మ్రోగాయి. ఆ చప్పుడు భయంకరంగా ఉంది. ఇతరులు మంగళకరాలైన స్తుతి వచనాలతో పాండవులను కీర్తించారు.'

62. వాసుదేవుని సాగనంపుట

సంజయుడిలా చెప్తున్నాడు. 'ఆ రాజులందరూ శంఖాలనూ పూరిస్తూ శిబిరాలకు వెళ్ళిపోయారు. రాజా! మన శిబిరం వైపు వెళ్తున్న పాండవుల వెనుక యుయుత్సుడు, సాత్యకి, ధృష్టద్యుమ్నుడు, శిఖండి, ద్రౌపదికొడుకు లందరూ, ఇతర ధనుర్ధారులు కూడా శిబిరాలలోనికి వెళ్ళారు. ఆపై పాండవులు దుర్యోధనుని శిబిరంలో ప్రవేశించారు. ప్రేక్షకులు వెళ్ళిపోగానే శోభాహీనమైన రంగమండపంవలె, ఉత్సవాలు లేని నగరంవలె, ఏనుగులు లేని సరస్సువలె దుర్యోధనుడు లేకపోవడంతో తేజోహీనమై ఉంది. స్త్రీలు, నపుంసకులు, వృద్ధామాత్యులు మాత్రమే అక్కడున్నారు. అక్కడ దుర్యోధనుని ముందు నడిచే సేవకులు మలినమైన కాషాయవస్త్రాలు ధరించి, చేతులు జోడించి, పాండవులను ఆశ్రయించారు. పాండవులు కురురాజుశిబిరానికి వచ్చి, రథాలనుండి దిగారు. ఆపై నిత్యమూ అర్జునుని ప్రియహితాలకై నిలిచే కృష్ణుడు ఆ గాండీవితో ఇలా అన్నాడు. "గాండీవాన్ని, అక్షయాలైన ఈ అమ్ములపొదులను దించు. భరతసత్తమా! నీవు కూడా దిగు. ఆ తరువాత నేను దిగుతాను. ఇది నీకు శ్రేయస్కరం.' ధనంజయుడు అలాగే చేశాడు. ఆ తరువాత, అర్జునుని వెనుక, గుర్రాల పగ్గాలను వదలి, కృష్ణుడు ఆ అర్జునుని రథంమీదనుండీ తాను కూడా దిగాడు. కృష్ణుడు రథం మీద నుండి దిగగానే అర్జునుని దివ్యధ్వజమైన వానరుడు కూడా అంతర్ధానమయ్యాడు. రాజా! ద్రోణకర్ణుల దివ్యాస్త్రాలచే దగ్ధమై ఉన్న ఆ మహారథం వెంటనే అంటుకొని మండసాగింది. అర్జునుని ఆ రథం అమ్ములపొదులతో, కళ్ళెపుత్రాళ్ళతో, గుర్రాలతో, కాడితో, కాడిత్రాళ్ళతో సహా బూడిదై నేలబడింది. అలా బూడిదైపోయిన ఆ రథాన్ని చూసి పాండవులు ఆశ్చర్యానికి లోనయ్యారు.

అర్జునుడు చేతులు జోడించి, వినయపూర్వకంగా సాగిలపడి, నమస్కరించి కృష్ణునితో ఇలా అన్నాడు. "గోవిందా! ప్రభూ! ఈ రథం ఎందువల్ల అగ్ని దగ్ధమయింది? యదునందనా! ఏమిటిది ? చాలా ఆశ్చర్యంగా ఉంది. మహాబాహూ! నేను వినదగినదే అని నీవు భావిస్తే నాకు చెప్పు." వాసుదేవుడు చెప్తున్నాడు. "అర్జునా! వివిధాస్త్రాలతాకిడితో ఇది ఎప్పుడో దగ్ధమైంది. కానీ నేను దానినెక్కి ఉన్నాను కాబట్టి రణభూమిలో బూడిదకాలేదు. కౌంతేయా! ఇప్పుడు నీ పని పూర్తి కాగానే, నేను దానిని వీడగానే, బ్రహ్మాస్త్రతేజస్సు వల్ల ముందే దగ్ధమైఉన్న ఇది బూడిదై పడింది". భగవంతుడు – కేశవుడు చిరునవ్వు నవ్వుతూ ధర్మరాజును కౌగిలించుకొని ఇలా అన్నాడు. "కౌంతేయా! భాగ్యం కొద్దీ గెలిచావు. భాగ్యం కొద్దీ శత్రువులు ఓడిపోయారు. రాజా! అదృష్టం కొద్దీ అర్జునుడు, భీమసేనుడు, నీవు,

నకుల సహదేవులు క్షేమంగా ఉన్నారు. వీరులంతా నశించిన ఈ యుద్ధం నుండి శత్రువులను చంపి, ప్రాణాలతో బయటపడ్డారు. ఇక చేయవలసిన పనులను వెంటనే చేయి. గతంలో నేను అర్జునునితో కలిసి ఉపప్లావ్యానికి వచ్చినపుడు మధుపర్కాన్ని ఇచ్చి నీవు "కృష్ణా! ఆపద వేళలలో ఎప్పుడూ నీవే రక్షించాలి" అన్నావు. నీ వలా అనగానే 'అలాగే' అని నే నన్నాను. రాజా! ఆ నీ అర్జునుడు నా రక్షణలో విజయాన్ని పొందాడు. రాజేంద్రా! వీరులంతా నశించిన ఈ రోమాంచజనకమైన యుద్ధంలో సోదర సహితంగా ఈ అర్జునుని ప్రాణాలతో నిలిపాను".

కృష్ణుడలా పలుకగానే ధర్మరాజుకు ఆనందంతో రోమాలు నిక్కపొడుచుకొన్నాయి. అప్పుడు కృష్ణునితో ఇలా అన్నాడు. 'అరిమర్దనా! ద్రోణకర్ణులు ప్రయోగించిన బ్రహ్మాస్త్రాన్ని నీవు తప్ప మరెవరు సహించగలరు. సాక్షాత్తు వజ్రధారి అయిన ఇంద్రుడు కూడా సహించలేడు. నీ అనుగ్రహం వలననే సంశప్తకగణాలు ఓడిపోయారు. అర్జునుడు మహాసంగ్రామంలో వెనుదిరగకుండా నిలువ గలిగాడు. అదేరీతిగా ఎన్నోసార్లు మా పనులను సిద్ధింపజేశావు. మా తేజస్సుకు శుభపరిణామాలు కల్పించావు. ఉపప్లవ్యంలో కృష్ణద్వైపాయన మహర్షి **"ధర్మమెక్కడుంటే కృష్ణుడక్కడుంటాడు. కృష్ణుడెక్కడుంటే విజయమక్కడ ఉంటుందని నాకు చెప్పాడు"**. ధర్మజుడు అలా అనగానే ఆ వీరులు నీ శిబిరంలోనికి ప్రవేశించి ఖజానాను, రత్నాలను, ధనాగారాన్ని అదుపులోనికి తీసికొన్నారు. వెండి, బంగారం, మణులు, ముత్యాలు, మంచి మంచి నగలు, కంబలాలు, మృగచర్మాలు, లెక్కలేనంత మంది దాసదాసీ జనం, రాజోపకరణాలు అన్నీ దొరికాయి. శత్రుసంహారం చేసిన ఆ మహాభాగులు అక్షయమైన నీ ధనాన్ని పొంది, పెద్దపెద్దగా హర్షధ్వానాలు చేశారు. ఆ వీరులు తమ వాహనాలను (గుర్రాలను) విప్పి, అక్కడే విశ్రమింపజేశారు. పాండవులు, సాత్యకి అందరూ అక్కడ ఒక్కటై కూర్చున్నారు.

వాసుదేవుడు "మనం మన శుభంకోసం ఈ రోజు శిబిరం వెలుపలే నివసించాలి" అన్నాడు. 'అలాగే' అని ఆ పాండవులందరూ, సాత్యకి కృష్ణునితో సహా శుభం కోసం వెలుపలకు వెళ్ళారు. శత్రుసంహారం చేసిన ఆ పాండవులు పవిత్ర అయిన ఓఘవతీ నదీ తీరంలో ఆ రాత్రి వసించారు. ఆపై యుధిష్ఠిరరాజు సమయోచితంగా ఆలోచించి, ఇలా అన్నాడు. "మాధవా! క్రోధంతో మండిపడుతున్న గాంధారికి ఉపశమనాన్ని కలిగించటానికి నీవు హస్తినకు వెళితే బాగుంటుంది. యుక్తిసహితంగా, సకారణంగా, సమయానికి తగినట్లుగా మాటాడి వెంటనే గాంధారికి ఉపశమనాన్ని నీవే కల్గించగలవు. పితామహుడైన వ్యాస

భగవానుడు కూడా అక్కడే ఉంటాడు." వైశంపాయనుడిలా చెప్పాడు. ఆపై కృష్ణుని హస్తినాపురికి పంపించారు. ప్రతాపవంతుడైన వాసుదేవుడు దారుకుని రథమెక్కించి, తాను రథమెక్కి, ధృతరాష్ట్రుని సన్నిధికి వేగంగా బయలుదేరాడు. శైబ్యసుగ్రీవహయాలుపూన్చిన రథంపై వెళ్తున్న ఆయనతో "పుత్రులను కోలుపోయి ఉన్న ఆ యశస్వినిని గాంధారిని ఓదార్చు" అని చెప్పారు. పాండవుల అభ్యర్థన మేరకు సాత్వతశ్రేష్ఠుడైన కృష్ణుడు వేగంగా ప్రయాణం చేసి, పుత్రులను కోలుపోయిన ఆ గాంధారి దగ్గరకు వేగంగా చేరాడు.'

63. ధృతరాష్ట్ర, గాంధారీ సమాశ్వాసనము

జనమేజయుడిలా అడిగాడు. 'ధర్మరాజు వాసుదేవుని గాంధారి దగ్గరకు ఎందుకు పంపించాడు? అంతకుముందు కౌరవులతో సంధికోసం కృష్ణుడు వెళ్ళాడు గదా! అప్పుడు ఆయన అభీష్టం సిద్ధించలేదు. అందువలననే ఈ యుద్ధం జరిగింది. యోధులంతా చనిపోయారు. దుర్యోధనుడు కూడా పడిపోయాడు. ధర్మరాజుకు ఇక శత్రువులెవరూ లేరు. కౌరవులు శిబిరాలు ఖాళీ చేసి పారిపోయారు. ఉత్తమకీర్తి లభించింది. మళ్ళీ కృష్ణుని పంపించటానికి కారణమేమిటి ? స్వయంగా జనార్దనుడే వెళ్ళాడంటే స్వల్పకారణం కాదనిపిస్తోంది నాకు. యథాతథంగా చెప్పు. ఈ కార్యనిర్ణయంలో కారణమేమై యుంటుంది ?" వైశంపాయనుడిలా చెప్తున్నాడు. "రాజా! నీవడిగిన ప్రశ్న తగినదే. దానిని యథాతథంగా నేను చెపుతాను. దుర్యోధనుని భీమసేనుడు రణభూమిలో గదాయుద్ధంలో నియమాల నతిక్రమించి, అన్యాయంగా చంపాడు. మహారాజా! అది చూసి యుధిష్ఠిరునిలో తీవ్రభయం ప్రవేశించింది. గాంధారి తపోబలం గలది. ఘోరతపస్సుతో మూడు లోకాలనూ దహించగలది. ఆ గాంధారిని గురించి ఆలోచించాడు ధర్మజుడు. అలా ఆలోచిస్తున్నప్పుడు ముందుగా క్రోధంతో మండిపడే అవకాశమున్న గాంధారిని శాంతింపజేయాలని బుద్ధి కలిగింది. "మనం ఇలా పుత్రులను చంపినట్లు వింటే ఆమె కోపంతో తన మనస్సులో పుట్టిన అగ్నితో మనలను బూడిద చేయవచ్చు. ఋజువుగా పోరాడే తన కుమారుని వంచనతో చంపారని విని, గాంధారి ఆ తీవ్రదుఃఖాన్ని ఎలా సహించగలదు ?" అలా అనేకవిధాలుగా ఆలోచించి భయానికి, శోకానికి లోనయి ధర్మరాజు వాసుదేవునితో ఇలా అన్నాడు.

"గోవిందా! నీ అనుగ్రహం వలన రాజ్యం శత్రురహితమైంది. మేము మనసా కూడా ఊహించనిది మాకు లభించింది. రోమాంచ జనకంగా జరిగిన యుద్ధంలో నీవు కూడా మహావినాశనాన్ని కల్పించావు. నేను చూశాను. గతంలో దేవాసుర సంగ్రామంలో

రాక్షస సంహారం కోసం ఎంతో సహాయం చేశావు. రాక్షసులు సంహరింపబడ్డారు కూడా. అదే రీతిగా మాకు కూడా సహాయం చేశావు. నీ సారథ్యంతోనే మమ్ము నిలిపావు. ఈ మహాసంగ్రామంలో అర్జునునకు నీవు దిక్కుగా నిలవకపోయినట్లయితే ఈ సేనాసముద్రాన్ని యుద్ధంలో జయించటం ఎలా సాధ్యం ? కృష్ణా! మా కోసం ఎన్నో గదల దెబ్బలు తిన్నావు. పరిఘలు, శక్తులు, భిందిపాలాలు, తోమరాలు, గొడ్డళ్ళ దెబ్బలు భరించావు. పరుషవచనాలను వినవలసివచ్చింది. రణభూమిలో వజ్రాయుధ స్పర్శవంటి శస్త్రాఘాతాలను భరించావు. దుర్యోధనుడు పడిపోగానే నీవు తిన్న దెబ్బలన్నీ సఫలమయ్యాయి. కృష్ణా! ఆ ఫలితమంతా మరల నశించకుండా నిలిచేటట్లు ప్రయత్నించాలి. కృష్ణా! మేము గెలిచినా కూడా మా మనస్సు డోలాయమానంగా ఉంది. మాధవా! గాంధారి కోపాన్ని గురించి ఆలోచించు. ఆ మహాభాగ నిత్యమూ తీవ్రతపస్సుతో కృశించి ఉంటుంది. పుత్రపౌత్ర సంహారాన్ని విని, ఆమె తప్పక మమ్ములను దహించివేస్తుంది. ఆమెను అనునయించటమే ఇప్పుడు కర్తవ్యంగా నా కనిపిస్తోంది. పుత్రవ్యసనంతో బలహీనమై, కోపంతో కన్నెర్రచేసిన ఆమెను పురుషోత్తమా! నీవు తప్ప మరెవ్వరూ చూడలేరు. క్రోధంతో మండిపడే గాంధారిని శాంతింపజేయటానికి నీవు అక్కడకు వెళ్ళటం ఇప్పుడు నాకిష్టమైన పని. లోకాలకు నీవే కర్తవు, వికర్తవూ, ఉత్పత్తీ, ప్రళయమూ కూడా నీవే. యుక్తిసహితంగా, సకారణంగా సమయానికి తగినట్లుగా మాటాడి వెంటనే గాంధారికి ఉపశమనాన్ని నీవే కల్గించగలవు. పితామహుడైన వ్యాసభగవానుడు కూడా అక్కడే ఉంటాడు. పాండవుల హితాన్ని కోరి నీవే ఎలాగైనా గాంధారి కోపాన్ని నశింపజేయాలి" ధర్మరాజు మాట విని, కృష్ణుడు దారుకుని పిలిపించి రథాన్ని సిద్ధం చేయమని ఆదేశించాడు.

ఆపై కేశవుని మాట విని, దారుకుడు త్వరగా పనిచేసి 'రథం సిద్ధ'మని మహాత్ముడైన కేశవునకు నివేదించాడు. కేశవుడు ఆ రథాన్నెక్కి, త్వరగా హస్తినాపురాన్ని చేరి నగరంలో ప్రవేశించాడు. వీరుడైన కృష్ణుడు నగరంలో ప్రవేశించి, రథఘోషతో ప్రతిధ్వనింపజేశాడు. తనరాకను ధృతరాష్ట్రునకు తెలియజేసి, రథం నుండి దిగి, ధృతరాష్ట్రుని భవనంలోనికి ప్రవేశించాడు. అంతకుముందే అక్కడకు వచ్చి ఉన్న ఋషి శ్రేష్ఠుని చూశాడు కృష్ణుడు. వ్యాసునకు, ధృతరాష్ట్రునకు పాదనమస్కారం చేసి జనార్దనుడు ఏ కలవరపాటు లేకుండా గాంధారికి కూడా అభివాదన చేశాడు. ఆ తరువాత కృష్ణుడు ధృతరాష్ట్రుని చేతిని పట్టుకొని, గొంతువిప్పి రోదించాడు. ముహూర్తకాలం వరకు శోకంతో పుట్టిన కన్నీరు కార్చి, నీటితో కళ్ళు శుభ్రం చేసికొని, యథావిధిగా ఆచమించి, కృష్ణుడు ధృతరాష్ట్రునితో

ప్రస్తుతానికి అనుగుణంగా ఇలా అన్నాడు. "భారతా! నీవు పెద్దవాడవు. నీకు తెలియనిదేదీ లేదు. కాలమహిమవలన జరిగిన ఘటన అంతా నీకు బాగా తెలుసు. అందరూ భారతా! నీ మనస్సు ననుసరించి ప్రవర్తించే పాండవులు వంశనాశనం, క్షత్రనాశనం జరగకుండా చూడాలని ఎంతో ప్రయత్నించారు. సోదరులతో జరిగిన ఒప్పందం మేరకు ధర్మవత్సలుడైన ధర్మరాజు కష్టాలు సహించాడు. కపటద్యూతంలో ఓడిపోయినా పరిశుద్ధభావనతోనే వనవాసాన్ని స్వీకరించారు. నానావేషాలతో తమను తాము కప్పుకొని కష్టంతో అజ్ఞాతవాసం ముగించారు. ఇంకా ఎన్నో కష్టాలు వచ్చినా ఎప్పుడూ అసమర్థులవలెనే వాటిని భరించారు. యుద్ధకాలం సమీపించినప్పుడు నేనే స్వయంగా వచ్చి, ప్రజలందరి సమక్షంలో అయిదు గ్రామాలకై యాచించాను. కాలప్రేరణ వలన పుట్టిన లోభంతో నీవు ఇవ్వలేదు. రాజా! నీ అపరాధం వలననే క్షత్రియులంతా నశించి పోయారు. భీష్ముడు, సోమదత్తుడు, బాహ్లీకుడు, కృపుడు, ద్రోణుడు, అశ్వత్థామ, ధీమంతుడైన విదురుడు సంధికోసం నిన్ను యాచించారు. అయినా నీవు ఆ పని చేయలేదు. భారతా! కాల ప్రభావం చేత మనస్సు దెబ్బతిన్నప్పుడు అందరూ మూఢు లవుతారు. యుద్ధానికి సిద్ధపడుతున్న సమయంలో గతంలో నీవు కూడా అలాగే అయ్యావు. కాల మహిమ కాకపోతే మరేమిటిది ? అందరికీ విధియే గతి. మహాప్రాజ్ఞా! పాండవులను తప్పు పట్టవద్దు. మహాత్ములైన పాండవులలో ధర్మదృష్టితో కానీ, న్యాయ దృష్టితో కానీ, స్నేహదృష్టితో కాని ఎటువంటి పొరపాటు లేదు. ఇదంతా నీవు చేసిన దోషం ఫలితమే అని గ్రహించి, పాండవులపై నీవు అసూయను చూపవద్దు. ఇక నీ కులమూ, వంశమూ పాండవుల ద్వారానే కొనసాగాలి. నీకు గానీ, గాంధారికి కానీ పుత్రులు చేయవలసిన పిండదానాది ఫలం పాండవుల ద్వారానే జరగాలి. కురుశార్దూలా! నీవు కానీ, కీర్తిమతి అయిన గాంధారి కానీ పాండవులకు కీడు కలగాలని భావించకండి. ఇదంతా ఆలోచించి, నీ అపరాధాలను కూడా గుర్తించి, పాండవులను మంచిగా రక్షించు. నీకు నమస్కారం. స్వాభావికంగా ధర్మరాజుకు నీ మీద ఉన్న భక్తి, స్నేహమూ నీ వెరుగుదువు. తనకు అపకారం చేసిన శత్రువులతో ఈ యుద్ధాన్ని చేసి, ఆ ధర్మరాజు పగలు, రేయి కుమిలిపోతున్నాడు. సుఖాన్ని పొందటం లేదు. నీ గురించి, గాంధారి గురించి బాధపడుతూ ఆ ధర్మరాజు శాంతిని పొందలేకపోతున్నాడు. నీవు పుత్రశోకంతో తపించిపోతున్నావు. నీ బుద్ధి ఇంద్రియాలు కలతపడి ఉన్నాయి. అందువలన ఎంతో సిగ్గుపడుతూ ధర్మరాజు నీ దగ్గరకు రాలేకున్నాడు." మహారాజా! కృష్ణుడు ధృతరాష్ట్రునితో అలా పలికి శోకంతో కృశించిన గాంధారితో ఇలా మంచి మాటలన్నాడు.

"గాంధారీ ! శుభలక్షణా ! నేను చెప్పేది విను. గ్రహించు. లోకంలో ఈనాడు నీతో సమానమైన పతివ్రత లేదు. రాణీ! కళ్యాణి! గుర్తున్నది కదా! సభలో నా సమక్షంలో ఉభయపక్షాలకూ హితకరమై, ధర్మార్థ సహితమైన మాటను నీవు చెప్పావు. కానీ నీ కొడుకులు దానిని పాటించలేదు. జయాభిలాషి అయిన దుర్యోధనునితో నీవు పరుషంగానే "మూర్ఖా! నాకోసం మాట వినను. ధర్మమున్న చోటే గెలుపు ఉంటుంది" అని చెప్పావు. ఆ నీ వాక్యం ఇప్పుడు ఇలా జరిగింది. గ్రహించు. మనస్సును శోకం వైపు మళ్ల నీకు. నీ తపోబలం వలన చరాచర ప్రాణులతో సహా ఈ భూమిని క్రోధంతో మండే కన్నులతోనే దహించగలదానవు నీవు. పాండవవినాశం వైపు బుద్ధి నెప్పుడూ మరల్చవద్దు." వాసుదేవుని మాట విని గాంధారి ఇలా అన్నది. "కేశవా! నీవు చెప్పింది నిజమే. మనోవ్యథలతో మండిపోతున్న నా మతి కొంచెం చలించింది కూడా. కానీ జనార్దనా! నీ మాటలు విన్న తరువాత అది నిలకడగా ఉంది. కేశవా! అంధుడు, వృద్ధుడు, పుత్రులను కోలుపోయినవాడు ఈ రాజు. ఇప్పుడు వీరులైన పాండవులతో కలిసి నీవే దిక్కుకావాలి". అలా మాటలాడి, పుత్రశోకంతో తపించిపోతున్న గాంధారి గుడ్డతో ముఖం కప్పుకొని, పెద్దగా వీడ్చింది. ఆపై కేశవుడు శోకంతో కృశించిన ఆ గాంధారిని యుక్తిసహంగా, హేతుబద్ధంగా ఉన్న వాక్యాలతో అనునయించాడు. మాధవుడు గాంధారినీ, ధృతరాష్ట్రునీ అనునయించి.

అంతలోనే అశ్వత్థామ సంకల్పించిన భావాన్ని గ్రహించాడు కేశవుడు. వేగంగా లేచి, వ్యాసుని పాదాలపై తలవాల్చి నమస్కరించి, ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. "కురుశ్రేష్ఠా! సెలవు. మనస్సును శోకంలోనికి నెట్టవద్దు. అశ్వత్థామ పాపపు ఆలోచన చేశాడు. అందువలన వెంటనే లేవవలసి వచ్చింది. రాత్రివేళ పాండవులను సంహరించాలని అశ్వత్థామకు బుద్ధి పుట్టింది." ఆ మాట విని ధృతరాష్ట్రుడు గాంధారితో కలిసి కేశవునితో ఇలా అన్నాడు. "మహాబాహూ! వెంటనే బయలుదేరు. పాండవులను రక్షించు. జనార్దనా! త్వరలోనే మరలా నీతో కలుస్తాను". అచ్యుతుడు దారుకునితో సహా వేగంగా ప్రయాణం చేశాడు. వాసుదేవుడు వెళ్ళిపోగానే అమేయబలుడు, లోకనమస్కృతుడు అయిన వ్యాసుడు ధృతరాష్ట్ర నరపాలునితో ఇలా అన్నాడు.'రాజా! ధర్మాత్ముడైన వాసుదేవుడు కూడా పని సఫలం చేసికొని పాండవులను చూడాలని హాస్తినపురం నుండి శిబిరానికి వెళ్ళాడు. రాత్రివేళ శిబిరానికి వచ్చి కృష్ణుడు పాండవులను కలిశాడు. విషయమంతా వారికి చెప్పి సావధానంగా వారితోనే కలిసి ఉన్నాడు.'

64. దుర్యోధన విలాపము.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "సంజయా! తొడలు విరిగి నేలగూలిన నా కుమారుని తలమీద భీమసేనుడు కాలుమోపాడు గదా! ఆత్మాభిమాని అయిన నా కుమారుడు అప్పుడేమన్నాడు? ఆ రాజు తీవ్రకోపనుడు, పాండవుల శత్రువు. మహాసంగ్రామంలో అంత తీవ్రదుఃఖానికి లోనయి ఏమన్నాడు?" సంజయుడిలా చెప్తున్నాడు. 'రాజా! జరిగినది జరిగినట్లు చెపుతా. ఆ దుఃఖవేళలో తొడలు విరిగి పడిన దుర్యోధన నరపాలుడు ఏమన్నాడో విను. రాజా! దుర్యోధనుని తొడలు విరిగాయి. ఒళ్ళంతా ధూళి కప్పింది. అప్పుడు జుట్టు సవరించుకొంటూ, పది దిక్కులూ చూస్తూ, ప్రయత్న పూర్వకంగా జుట్టు ముడివేసికొని, పాములవలె నిట్టూరుస్తూ, కోపమూ కన్నీరూ కలగలిసిన కళ్ళతో నావైపు చూశాడు. బాగా మదించిన ఏనుగువలె బాహువులను నేలపై రుద్ది, చెదరిన వెంట్రుకలను పైకి విసిరి, పళ్ళు కొరుకుతూ, యుధిష్ఠిరుని నిందిస్తూ నిట్టూర్చి ఇలా అన్నాడు. భీష్ముడు, కర్ణుడు, కృపుడు, శకుని, ద్రోణుడు, అశ్వత్థామ, శల్యుడు, కృతవర్మ రక్షకులుగా ఉండి కూడా ఈ స్థితిని పొందాను. పదకొండు అక్షౌహిణులకు అధిపతినైన నేను ఈ దశకు వచ్చాను. మహాబాహూ! కాలం సమీపిస్తే దాని నెవరూ అతిక్రమించలేదు. యుద్ధంలో ఇంకా జీవించిఉన్న నా వారితో చెప్పు. భీమసేనుడు నియమాన్ని అతిక్రమించి, నన్ను దెబ్బతీశాడు. భూరిశ్రవుడు, కర్ణుడు, భీష్ముడు, శ్రీమంతుడైన ద్రోణుడు - వీరి విషయంలో పాండవులు ఎన్నో క్రూర చేష్టలు చేశారు. క్రూరకర్ములైన ఆ పాండవులు అపకీర్తికరమైన పనిని చేశారు. సత్పురుషులమధ్య వారు పశ్చాత్తాప పడవలసివస్తుందని నా అభిప్రాయం.

శక్తిమంతుడైన వాడు వంచనతో విజయాన్ని పొంది ప్రీతినందగలడా? నియమాన్ని భంగపరచిన వానిని ఏ పండితుడు గౌరవించగలడు ? పాపి అయిన వృకోదరుని వలె అధర్మంగా విజయాన్ని పొంది ఏ పండితుడు ఆనందిస్తాడు ? ఇంతకన్న చిత్ర విషయమేముంటుంది ? భీమసేనుడు కోపించి తొడలు విరిగిపడిఉన్న నా తలను కాలితో మర్దించాడు. సంజయా! తేజస్సుతో తపిస్తూ, రాజ్యశ్రీ సేవల నందుకొంటూ, బంధువుల మధ్య నున్న వానితో ఇలా ప్రవర్తించిన వాడు గౌరవాన్ని పొందగలడు. నా తల్లి! తండ్రి యుద్ధధర్మాలు తెలిసినవారే సంజయా! దుఃఖార్తులైఉన్న వారికి నా మాటగా ఇలా చెప్పు. యాగాలు చేశాను. భృత్యులను భరించాను. సాగర పర్యంతమైన భూమిని చక్కగా పరిపాలించాను. సంజయా! బ్రతికియున్న శత్రువుల తలమీదనే కాలుపెట్టాను. యథాశక్తిగా దానాలు చేశాను. మిత్రులకు ప్రియమైనవి కల్పించాను. శత్రువులనందరినీ బాధించాను.

ఇంతమంచి ముగింపు మరెవరికి దక్కుతుంది ? బాంధవుల నందరినీ సత్కరించాను. లొంగిన జనాన్ని గౌరవించాను. ధర్మార్థకామాలను పూర్తిగా సేవించాను. ఇంతమంచి ముగింపు మరెవరికి దక్కుతుంది ? పెద్దపెద్ద రాజులపై పెత్తనం చేశాను. అంత తేలికగా లభించని గౌవరాన్ని పొందాను. మేలుజాతి గుర్రాలపై స్వారి చేశాను. ఇంతమంచి ముగింపు మరెవరికి దక్కుతుంది ? పరరాజ్యాలను ఆక్రమించాను. ఆ రాజులను దాసులవలె పాలించాను. ఇష్టమైన వారిని చక్కగా మేలు చేశాను. ఇంతమంచి ముగింపు మరెవరికి దక్కుతుంది ? బాగా అధ్యయనం చేశాను. శాస్త్రోక్తంగా దానాలు చేశాను. రోగాలు లేని ఆయుస్సు పొందాను. స్వధ్వర్మంతో లోకాలను జయించాను. ఇంతమంచి ముగింపు మరెవరికి దక్కుతుంది ? అదృష్టం కొద్దీ నేనెప్పుడూ యుద్ధంలో ఓడిపోలేదు. దాసులవలె శత్రువుల శరణు కోరలేదు. అదృష్టంకొద్దీ విశాలరాజలక్ష్మిని పొందాను. రాజా! నామరణం తర్వాతనే అది పరాధీనమయింది.

స్వధర్మాన్ని పాటించే క్షత్రియబంధువులు కోరుకొనే మరణమే నాకు ప్రాప్తించింది. ఇంతమంచి ముగింపు మరెవరికి దక్కుతుంది ? అదృష్టం కొద్దీ నేను యుద్ధంలో వెనుదిరుగలేదు. నీచునివలె ఓడిపోయి, శత్రుత్వాన్ని వీడి, వెనుకంజ వేయలేదు. బుద్ధిహీనుని ఎవరినో ఆశ్రయించి, పరాజయాన్ని పొందలేదు. అది కూడా అదృష్టమే. నిదురిస్తున్న వాడినో, పిచ్చివాడినో చంపినట్లు, లేదా విషమిచ్చి ఎవరినైనా చంపినట్లు ధర్మోల్లంఘన చేసే భీమసేనుడు నియమాల నతిక్రమించి నన్ను చంపాడు. అశ్వత్థామతో, కృతవర్మతో, కృపునితో నా మాటగా చెప్పు. పాండవులు ఎన్నోసార్లు అధర్మమార్గంలో ప్రవర్తించి యుద్ధనియమాల నతిక్రమించారు. మీరు వారినెప్పుడూ నమ్మవద్దు." ఆపై నీ కొడుకు వార్తాహరులతో ఇలా అన్నాడు. "భీమసేనుడు యుద్ధంలో అధర్మంగా నన్ను చంపాడు. నేనిప్పుడు స్వర్గానికి వెళ్ళిఉన్న ద్రోణుడు, కర్ణుడు, శల్యుడు, వృషసేనుడు, శకుని, జలసంధుడు, భగదత్తుడు, సోమదత్తుడు, జయద్రధుడు, దుశ్శాసనాది సోదరులు, దుశ్శాసనుని కొడుకు, లక్ష్మణుడు – వీరందరూ, అంతేకాక నావైపు పోరాడిన వేలకొలదిగా ఉన్న ఇతరవీరులు – వీరి వెనుకే వెళతాను.

తోటివారితో విడిపోయిన బాటసారి వంటి వాడను నేను. సోదరులందరూ, తన భర్త కూడా చనిపోయారని విని రోదిస్తూ నా సోదరి – దుశ్శల ఎలా నిలువగలదు ? పుత్రుల భార్యలతో, మనుమల భార్యలతో గాంధారితో కలిసి వృద్ధుడైన నా తండ్రి – ధృతరాష్ట్రమహారాజు ఏ స్థితిని పొందుతాడో! విశాలలోచన, కళ్యాణి అయిన లక్ష్మణుని

తల్లి (నా భార్య) భర్తనూ, పుత్రునీ పోగొట్టుకొని వెంటనే నశించిపోతుందేమో! వాగ్విశారదుడైన సన్యాసి – చార్వాకుడు నా పరిస్థితిని తెలిసికొంటే, ఆ మహాభాగుడు తప్పనిసరిగా నా శత్రుత్వానికి బదులు తీర్చుకొంటాడు. మూడు లోకాలలో ప్రసిద్ధి చెందిన ఈ పవిత్ర సమంతపంచకంలో మరణించి, నేను శాశ్వతలోకాలను పొందగలను". మారిషా! ఆపై వేలకొలదిగ ఉన్న జనులు కన్నులలో నీరు నింపుకొని, దుర్యోధనుని ప్రలాపాలు విని, పది దిక్కులకూ పారిపోయారు. చరాచర ప్రాణులతో, సముద్రాలతో, వనాలతో సహా భూమి పిడుగుపాటు చప్పుళ్ళతో కంపించింది. దిక్కులు మలినమయ్యాయి. వారు అశ్వత్థామ దగ్గరకు వచ్చి జరిగినదంతా చెప్పారు. భారతా! శోకంతో కలతపడిన మనస్సులతో, దుఃఖ సంతప్తులైన ఆ వార్తాహరులు గదాయుద్ధ వ్యవహారాన్నీ, దుర్యోధనుని పతనాన్ని అశ్వత్థామకు చెప్పి, అందరూ ఎంతో సేపు విచారించి, ఆర్తితో వచ్చిన రీతిగానే వెళ్ళిపోయారు.'

65. సేనాపతిగా అశ్వత్థామకు అభిషేకము

సంజయుడిలా చెప్తున్నాడు. 'రాజా! వార్తాహరుల ద్వారా దుర్యోధనుని పతనాన్ని విని, హతశేషులైన కౌరవ మహారథులు – అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ వేగంగా సాగే గుర్రాలతో రణభూమికి వచ్చారు. వారు అప్పటికే గదలు, తోమరాలు, శక్తులు, పదునైన బాణాలతో గాయపడిఉన్నారు. అక్కడకు వచ్చి మహాత్ముడైన దుర్యోధనుడు పడి ఉండటం చూశారు. అరణ్యంలో గాలివిసురుకు కూలిపోయిన పెద్దవేగిస చెట్టువలె ఉన్నాడు. అరణ్యంలో బోయవాడు పడగొట్టిన పెద్ద ఏనుగువలె నెత్తుటితో తడిసి, నేలపై పొర్లుతున్నాడు. నెత్తుటి ప్రవాహంలో తడిసి, మాటిమాటికీ అటు ఇటూ ఒత్తిగిల్లుతున్నాడు. దైవికంగా సూర్యచక్రం నేలబడినట్లు, పెనుగాలిరేగటంతో సముద్రం ఎండిపోయినట్లు, ఆకాశంలో పూర్ణచంద్ర మండలంపై మంచుకప్పినట్లు దుర్యోధనుని దశ కనిపిస్తోంది. పరాక్రమించిన ఏనుగువలె ఆ దీర్ఘభుజుడు ధూళిలో మునిగి ఉన్నాడు. ధనాన్ని కోరుతున్న సేవకులు ఉత్తమరాజును చుట్టుముట్టినట్లు మాంసభక్షకాలైన భయంకర జంతువులు చుట్టూ ఉన్నాయి. ముఖంమీది వెంట్రుకలు ముడివడి ఉన్నాయి. క్రోధంతో కళ్ళపైకి లేచి ఉన్నాయి. పడిపోయిన పులివలె ఆ నరోత్తముడు అసహనంతో నిండి ఉన్నాడు. కృపుడు మొదలయిన ఆ రథికులు అందరు నేలబడి ఉన్న ఆ మేటివిలుకాడైన రాజును చూసి, మోహానికి లోనయ్యారు. రథాలనుండి దిగి రాజుదగ్గరకు పరుగెత్తారు. దుర్యోధనుని చేరి అందరూ నేలపై కూర్చున్నారు.

అప్పుడు అశ్వత్థామ కళ్ళలో నీరు నింపుకొని నిట్టూరుస్తూ భరతశ్రేష్ఠుడైన

దుర్యోధనునితో ఇలా అన్నాడు. 'ఈ మానవలోకంలో ఏదీ సత్యం (శాశ్వతం) కాదన్న మాట నిశ్చయం. లేకపోతే నీవు కూడా దుమ్ముకొట్టుకొని పడియుంటావా? రాజేంద్రా! ఒకప్పుడు రాజువై, భూమిని శాసించి ఇప్పుడు నిర్జనవనంలో ఒంటరిగా ఎలా ఉన్నావు ? ఏమిటిది ? దుశ్శాసనుడు కనిపించటం లేదు. మహారథుడైన కర్ణుడు కానీ, ఆ మిత్రులందరూ కానీ కనిపించటం లేదు. ఏ రీతిగా అయినా సరే యముని గమనాన్ని కానీ, లోకగమనాన్ని కానీ తెలియటం కష్టం. కాకపోతే నీవు కూడా దుమ్ముకొట్టుకొని పడి ఉంటావా ? ఈ పరంతపుడు పట్టాభిషిక్తుల అగ్రభాగాన నిలిచినవాడు. గడ్డితో కూడా ధూళి కరుస్తున్నాడు. కాలం గిరికీలను చూడు. రాజా! ఆ వెల్లగొడుగేది ? ఆ చామరాలేవి ? రాజోత్తమా! నీ ఆ మహాసేన ఎక్కడకు పోయింది ? ఏ కారణంతో ఏ కార్యం జరుగుతుందో తెలిసికొనటం చాలా కష్టం. ఎందుకంటే నీవు లోకగురువుగా బ్రతికి ఇప్పుడీ దశను పొందావు. తీవ్రంగా ఇంద్రునితో సంఘర్షించగల నీకు కూడా బాధ కలగటం చూస్తుంటే మానవులందరిలోను సంపద బాగా అస్థిరంగా కనిపిస్తోంది. రాజా! బాగా దుఃఖిస్తున్న ఆ అశ్వత్థామ మాటలు విని నీ కుమారుడు శోకంతో కన్నీరు కారుతుండగా రెండు చేతులతోనూ కళ్ళు తుడుచుకొన్నాడు.

ఆ నరాధిపుడు ఆ కృపాదివీరు లందరితో ఇలా అన్నాడు. "బ్రహ్మ లోక ధర్మాన్ని ఈ రీతిగానే నిర్దేశించాడని అంటుంటారు. సర్వప్రాణులకు కాలక్రమంగా తమ వంతు వచ్చినప్పుడు నాశం తప్పదు. ఇప్పుడు నా వంతు వచ్చింది. మీరందరూ చూస్తూనే ఉన్నారు. నేను రాజ్యాన్ని పాలించినవాడిని ఈ పరిస్థితికి వచ్చాను. అదృష్టం కొద్దీ నేను ఎటువంటి ఆపదలోనూ వెనుదిరగలేదు. విశేషించి ఈ పాపాత్ములు నన్ను మోసంతోనే పడగొట్టారు. ఇదీ అదృష్టమే. అదృష్టం కొద్దీ యుద్ధం చేస్తున్న నేను ఎప్పుడూ ఉత్సాహంగానే ఉన్నాను. అదృష్టం కొద్దీ దాయాదులు, బాంధవులు చనిపోయిన తరువాతనే నేను పడిపోయాను. అదృష్టంకొద్దీ ఇంత జనవినాశనం నుండి బయటపడిన మిమ్ము చూస్తున్నాను. మీరు క్షేమంగా ఉన్నారు. ఏదైనా సాధించగలస్థితిలో ఉన్నారు. అది కూడా నాకు బాగా ఇష్టమైనదే. మీరు స్నేహభావంతో నా మరణానికి దుఃఖించవద్దు. మీకు వేదాలే ప్రమాణ మయితే నేను అక్షయలోకాలను గెలుచుకొన్నట్లే. కృష్ణుని ప్రభావం తెలిసి కూడా, చక్కగా పాటించిన క్షత్రధర్మంనుండి నేను ఎప్పుడూ తప్పుకొనలేదు. ఆ ధర్మఫలాన్ని నేనిప్పుడు పొందాను. ఏ రీతిగానూ జాలిచూపదగను. మీకు తగినట్లుగా మీరు యోగ్యమైన పరాక్రమాన్ని ప్రదర్శించారు. విజయానికై నిరంతరంగా ప్రయత్నించారు. కానీ దైవాన్ని అతిక్రమించటం

కష్టం." రాజేంద్రా! అంతవరకు పలికి కన్నీటితో కలత పడిన కన్నులతో, తీవ్రవేదనతో విహ్వలుడై మౌనంగా ఉన్నాడు.

కన్నీటితో, దుఃఖంతో కూడిఉన్న రాజును చూసి, అశ్వత్థామ ప్రళయకాలాగ్ని వలె మండిపడ్డాడు. ఆ అశ్వత్థామ క్రోధంతో నిండి, చేతితో దుర్యోధనుని చేతిని పట్టుకొని, కన్నీటితో చెదిరిన మాటతో దుర్యోధనునితో ఇలా అన్నాడు. "ఆ క్షుద్రులు క్రూరమైన చేష్టతో నాతండ్రిని చంపారు. అయినా ఇప్పుడు నీ వధతో తపిస్తున్నంతగా అప్పుడు బాధపడలేదు. రాజా! నా ఈ మాట విను. సత్యంమీదా, ఇష్టాపూర్తాల మీదా, దానం మీద, ధర్మంమీద, పుణ్యం మీద ఒట్టువేసి చెపుతున్నాను. ఈ రోజు సర్వోపాయాలతోనూ, వాసుదేవుడు చూస్తుండగానే సర్వపంచాలురను యమ సదనానికి పంపుతాను. మహారాజా! నీవు నన్ను అనుమతించాలి." అశ్వత్థామ పలికిన ఆ మాట దుర్యోధనుని మనస్సుకు ప్రీతి కలిగించింది. అప్పుడు దుర్యోధనుడు "ఆచార్యా! వెంటనే జలపూర్ణమైన కలశాన్ని తెప్పించు" అని కృపునితో అన్నాడు. ఆ కృపుడు రాజుమాటను విని, పూర్ణకలశాన్ని తీసికొని రాజుదగ్గరకు వచ్చాడు. మహారాజా! నీ కుమారుడు కృపునితో ఇలా అన్నాడు. "ద్విజోత్తమా! నీవు నా ప్రియాన్ని కోరేటట్లయితే నా ఆదేశంగా అశ్వత్థామను సేనాపతిగా అభిషేకించు. నీకు మేలు కలుగుగాక!" "బ్రాహ్మణుడు విశేషించి, క్షత్రధర్మంలో ఉండే బ్రాహ్మణుడు రాజు ఆదేశిస్తే యుద్ధం చేయాలి" అని ధర్మవేత్తలంటారు. కృపుడు రాజుమాటను విని, రాజాదేశాన్ని బట్టి అశ్వత్థామను సేనాపతిగా అభిషేకించాడు. అభిషిక్తుడైన ఆ అశ్వత్థామ నృపోత్తముడైన దుర్యోధనుని కౌగిలించుకొని, సింహనాదంతో సర్వదిక్కులనూ ప్రతిధ్వనింపజేస్తూ వెళ్ళాడు. రక్తంతో తడిసిఉన్న దుర్యోధనుడు కూడా సర్వప్రాణులకూ భయాన్ని కలిగించే రాత్రికి దగ్గరయ్యాడు. రాజా! ఆ కృపాదులు ఆ రణభూమి నుండి వేగంగా తొలగిపోయి శోకవ్యాకులచిత్తులై చింతామగ్నులయ్యారు.'

ఇది శల్యపర్వం

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
సౌప్తిక పర్వం

1. అశ్వత్థామ ఆలోచనము.

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

నరుల మనస్సులే నివాస స్థానమైన నారాయణునికీ, నరోత్తమునికీ, సరస్వతీ దేవికీ, వ్యాసమహర్షికీ నమస్కరించి శ్రీమహాభారతమును చదువవలెను/ చెప్పవలెను.

సంజయుడు ఇలా అన్నాడు – "రాజా! దుర్యోధనుని ఆజ్ఞను అనుసరించి, కృపాచార్యుడు అశ్వత్థామను సేనాపతి పదవికి అభిషేకించిన తరువాత, ఆ ముగ్గురు వీరులు అశ్వత్థామ, కృపాచార్యుడు, కృతవర్మ కలిసి దక్షిణదిశకు వెళ్ళారు. ప్రొద్దుగ్రుంకే వేళకు సైనికశిబిరాలకు చేరుకొన్నారు. శత్రువుల జాడ తెలియక, ముగ్గురూ భయపడి, దట్టమైన అడవిలోకి పోయారు. గుఱ్ఱాలను విడిచిపెట్టి రహస్య ప్రదేశంలో దాక్కున్నారు. సేనాశిబిరాలకు దగ్గరలో విశ్రాంతి తీసుకొన్నారు. పదునైన ఆయుధాల దెబ్బలతో, ముగ్గురికీ ఒంటినిండా గాయాలై ఉన్నాయి. పాండవులను గురించి ఆలోచిస్తూ, వేడి నిట్టూర్పులు విడుస్తూ, జయాభిలాషతో పాండవులు చేస్తున్న భయంకరమైన నినాదాలకు భయపడి, గుఱ్ఱాలెక్కి మళ్లీ తూర్పుదిశకు పారిపోయారు. వాళ్లు సుమారు గంటసేపు ప్రయాణించారు. గుఱ్ఱాలు అలసిపోయాయి. వారికి దప్పిక అవుతోంది. మహాధానుష్కులు ఆ స్థితిని భరించలేకపోయారు. క్రోధమూ, అసూయా నిండిపోయాయి. దుర్యోధనుని మరణానికి దుఃఖిస్తూ కొద్దిసేపు మెదలకుండా ఉండిపోయారు."

ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు – "సంజయా! పదివేల ఏనుగుల బలం కలిగిన నా కొడుకు, దుర్యోధనుడు భీముని చేతిలో చచ్చిపోయాడంటే నమ్మలేకపోతున్నాను. సంజయా! నా కొడుకు నవయువకుడు. అతని దేహం వజ్రం లాంటిది. ఏ ప్రాణీ

అతనిని చంపలేదు. అటువంటివాడు యుద్ధరంగంలో పాండవుల చేత చంపబడ్డాడు. గవల్గణకుమారా! పాండవులందరూ కలిసి, యుద్ధంలో నా కుమారుణ్ణి పడగొట్టారు. **విధిని అతిక్రమించటం మానవులకు సాధ్యం కాదు.** సంజయా! వందమంది కొడుకులు చచ్చిపోయినారని విన్నా, నా గుండె వేయి ముక్కలుగా పగిలిపోలేదంటే, అది తప్పకుండా బండరాయే. కొడుకులు చచ్చిన ఈ ముసలి జంట ఎలా బ్రతుకుతుంది ? ధర్మరాజు రాజ్యంలో, పాండవుల దగ్గర ఉండటం నాకు ఇష్టంలేదు. సంజయా! స్వయంగా రాజును, రాజు తండ్రిని అయిన నేను, ధర్మరాజు అదుపాజ్ఞలలో సేవకుడుగా ఎలా ఉండగలను? సంజయా! భూమి మొత్తం నా ఆజ్ఞతో నడిచింది. అందరూ నాకు తలవంచారు. ఈ ముసలితనంలో, నేను మరొకరికి దాసుడుగా ఎలా ఉండగలను ? సంజయా! నా పుత్రులు వందమందిని ఒకే ఒక్కడు చంపాడు. అటువంటి భీముని మాటలను నేను ఎలా వినగలను? సంజయా! నా కొడుకు నా మాటను పాటించక మహాత్ముడైన విదురుని పలుకులను నిజం చేశాడు. నా కొడుకు దుర్యోధనుడు అధర్మంగా చంపబడితే, కృతవర్మ, కృపాచార్యుడు, అశ్వత్థామ ఏం చేశారు?"

సంజయుడు పలికాడు – "రాజా! నీ పక్షాన ఉన్న ముగ్గురూ రకరకాల చెట్లు, తీగెలతో నిండిన భయంకరమైన అడవిలో కొంతదూరం వెళ్లి ఆగిపోయారు. వారు కొద్దిసేపు విశ్రమించారు. గుఱ్ఱాలకు నీళ్లు త్రాగించారు. ప్రొద్దుగ్రుంకే వేళకు దట్టమైన అడవిలోకి ప్రవేశించారు. దానిలో పలుజంతువుల గుంపులు ఉన్నాయి. పలుజాతుల పక్షుల సమూహాలు ఉన్నాయి. పలురకాల చెట్లు, తీగెలు అల్లుకొని ఉన్నాయి. అనేక సర్పజాతులు ఉన్నాయి. చాలా రకాల నీళ్లతో నిండి ఉన్నది. చాలా రకాల పూలతో శోభిల్లుతోంది. వందలకొలది ఎఱ్ఱతామరలు, నల్లకలువలతో కూడిన జలాశయాలతో విరాజిల్లుతోంది. ఘోరమైన ఆ అడవిలోకి అన్నివైపులా పరిశీలిస్తూ ప్రవేశించి, కొన్నివేల కొమ్మలతో దట్టమై ఉన్న పెద్ద మఱ్ఱిచెట్టును చూశారు. రాజా! కృతవర్మ, కృపాచార్యుడు, అశ్వత్థామ ఆ మఱ్ఱిచెట్టు దగ్గరకు చేరారు. వారు రథాల నుండి క్రిందికి దిగి గుఱ్ఱాలను విడిచిపెట్టారు. యథోచితంగా ఆచమించి, స్నానసంధ్యావందనాలను పూర్తి చేశారు. అప్పుడు సూర్యుడు పడమటి కొండకు చేరేసరికి, సర్వజగత్తుకు రాత్రి అయింది. గ్రహాలు, నక్షత్రాలు, తారలతో నిండుగా అలంకరించబడిన ఆకాశం, కన్నుల పండువుగా ఉన్న చీరలాగా, అంతటా ఆకర్షణీయంగా అలరారుతోంది. ఇష్టం వచ్చినట్లు పగటివేళ తిరిగే జంతువులు అన్నీ నిద్రకు ఉపక్రమించాయి. రాత్రివేళ తిరిగే జంతువుల అరుపులు దారుణంగా

ఉన్నాయి. రాత్రి అయినందుకు ఘోరమైన క్రూరమృగాలు సంతోషించాయి.

ఘోరమైన ఆ రాత్రివేళ, దుఃఖశోక సమన్వితులైన కృతవర్మ, కృపాచార్యుడు, అశ్వత్థామ దగ్గరగా కూర్చున్నారు. మట్టిచెట్టు దగ్గర కూర్చొని, యుద్ధంలో జరిగిన కౌరవ, పాండవ నాశనాన్ని తలచుకొని దుఃఖిస్తూ, అనేక బాణాలతో అయిన గాయాలబాధ, అలసటలతో నిద్రవచ్చిన ఆ ముగ్గురు నేలపై పడుకొన్నారు. సుఖంగా ఉండవలసినవారు, దుఃఖపడదగనివారు, మహారథులు అయిన కృపుడు, కృతవర్మ నిద్రావశులై నేలపైనే పడుకొన్నారు. గొప్ప పడకలు కలిగిన సంపన్నులైనా, శ్రమశోకాలతో, అనాథల్లాగా కటికనేలపైనే నిద్రపోయారు. క్రోధమూ, రోషాలకు లొంగిన అశ్వత్థామ మాత్రం పాములాగా బుసలుకొడుతూ నిద్రపోకుండా ఉన్నాడు. అశ్వత్థామ కోపంతో దహింపబడుతూ, నిద్రరాక, చూడటానికి ఘోరంగా ఉన్న అడవిని కలయచూస్తున్నాడు. పలురకాల జంతువులతో కూడిన ఆ అడవిని చూస్తూ ఉండగా కాకులతో నిండిన మట్టిచెట్టు అతనికి కనపడింది. రాజా! ఆ చెట్టుపైన కొన్నివేల కాకులు వేర్వేరు గూళ్లలో సుఖంగా నిద్రపోతూ రాత్రి గడిపేస్తున్నాయి. ఆ మట్టిచెట్టుపైన కాకులన్నీ హాయిగా నిద్రపోతూ ఉండగా రివ్వున వచ్చి వాలిన భయంకరమైన గుడ్లగూబను అశ్వత్థామ చూశాడు. పెద్ద గొంతు, పెద్ద దేహం, ఎఱ్ఱని కళ్లు, పసుపు బూడిదరంగు, పొడుగైన ముక్కు, పదునైన గోళ్లు కలిగి, గరుత్మంతుని లాగా వేగంగా వచ్చి, అది అక్కడ వాలింది.

రాజా! ఆ గుడ్లగూబ కాకుల్లో కలిసిపోయేటట్లు మృదువుగా శబ్దం చేస్తూ, మట్టిచెట్టు కొమ్మపైకి చేరుదామనుకొంది. మట్టిచెట్టుకొమ్మపైకి చేరిన గుడ్లగూబ, నిద్రపోతున్న కాకులను ఎన్నిటినో, చప్పుడు కాకుండా చంపింది. కొన్ని కాకులరెక్కలు విరిచింది. తలలు కొరికింది. తన కాళ్లు ఆయుధాలుగా చేసుకొని, కొన్ని కాకుల కాళ్లు విరగ్గొట్టింది. తన కంటికి కనబడిన కాకులు అన్నిటినీ క్షణంలో చంపేసింది. వాటి అవయవాలతో, మృతదేహాలతో మట్టిచెట్టు కొమ్మలన్నీ నిండిపోయాయి. తన శత్రువులైన కాకులను యథేచ్ఛగా చంపి, ప్రతీకారం తీర్చుకొన్నందుకు గుడ్లగూబ సంతోషించింది. ఆ రాత్రివేళ గుడ్లగూబ చేసిన క్రూరకృత్యాన్ని చూసిన అశ్వత్థామకు మనసులో ఒక సంకల్పం కలిగింది. ఒంటరిగా ఇలా ఆలోచించాడు." ఈ గుడ్లగూబ నాకు యుద్ధనీతిని ఉపదేశించింది. దానితో శత్రుసంహారానికి అనువైన ఉపాయమూ, తగిన కాలమూ నాకు ప్రాప్తించాయి. లక్ష్యం నెరవేరిన విజయోల్లాసంతో ఉత్సాహంతో ఉన్న పాండవులను చంపటం ఇప్పుడు నాకు సాధ్యంకాదు. పాండవులను చంపుతానని నేను దుర్యోధనునికి ప్రమాణం చేశాను.

కానీ ఆ పని మిడత అగ్గిలో దూకినట్టు ఆత్మనాశనకరం. న్యాయంగా యుద్ధం చేసినవాడు నిస్సందేహంగా చచ్చిపోతాడు. మోసంతో కార్యం సిద్ధిస్తుంది. శత్రుక్షయం జరుగుతుంది. దాంతో సంశయాత్మకమైన పని నిస్సంశయంగా నెరవేరుతుంది. అప్పుడు శాస్త్రవిశారదులైన పెద్దలు కూడా అలా చేసినవాణ్ణి గౌరవిస్తారు.

ఈ లోకంలో ఈ పని నిందార్హం కావచ్చు. ప్రజలంతా దూషించవచ్చు. కానీ క్షత్రియధర్మాన్ని అనుసరించే మానవుడు ఇలా చేయకతప్పదు. నిందార్హమైనవి, కుత్సితమైనవి, కపటమైనవి అన్ని అకృత్యాలు అపవిత్రాత్ములైన పాండవులు చేశారు. ఈ విషయంలో ధర్మపరులు, న్యాయవేత్తలు, తత్త్వదర్శులు చెప్పిన తత్త్వ శ్లోకాలు ఎన్నో వినిపిస్తున్నాయి. శత్రుసైన్యం అలిసిపోయినా, చెదిరిపోయినా, భోజనం చేస్తున్నా, ప్రయాణం చేస్తున్నా విశేష ప్రదేశాలలో ప్రవేశిస్తున్నా, శత్రువులు వారిని సంహరించవచ్చు. నడిరాత్రి నిద్రపోతున్నా, నాయకుడు చచ్చిపోయినా, యోధులు విడిగా ఉన్నా, సైన్యం రెండుగా విడిపోయి ఉన్నా, శత్రువులు వారిని చంపవచ్చు. ఆ నీతిని అనుసరించి రాత్రివేళ నిద్రపోతున్న పాండవులను చంపాలి" అని ప్రతాపశాలి అయిన అశ్వత్థామ నిశ్చయించాడు. మేనమామ కృపాచార్యుని, భోజవంశికుడు కృతవర్మను నిద్రలేపాడు. నిద్రలేచిన కృపాచార్య కృతవర్మలు అశ్వత్థామ చెప్పినదంతా విన్నారు. సిగ్గుతో, సమాధానం చెప్పకుండా మౌనంగా ఉన్నారు.

అప్పుడు అశ్వత్థామ కొంతసేపు ఆలోచించి, కన్నీటితో గద్గద స్వరంతో ఇలా అన్నాడు. "ఏ రాజు కోసం మనం పాండవులతో వైరం పెట్టుకున్నామో ఆ మహాబలుడు, దుర్యోధనుడు చంపబడ్డాడు. పదకొండు అక్షౌహిణుల సేన కల దుర్యోధనుడు భీమసేనునిచే పడగొట్టబడి సామాన్య సైనికుల మధ్య యుద్ధభూమిలో పడిఉన్నాడు. నీచుడు, క్రూరుడు అయిన భీముడు ఈ పాడుపని చేశాడు. పట్టాభిషిక్తుని శిరస్సును కాలితో తన్నాడు. పాంచాలయోధులు ఆనందంతో సింహనాదాలు చేస్తున్నారు. నవ్వుతున్నారు, శంఖధ్వానాలు చేస్తున్నారు. దుందుభులు మ్రోగిస్తున్నారు. శంఖనాదాలతో కలిసిన వివిధ వాద్యధ్వనులు గంభీరంగా, భయంకరంగా గాలిలో వ్యాపించి దశదిశల నిండిపోతున్నాయి. గుఱ్ఱాల హేషలు, ఏనుగుల బృంహణాలు, శూరుల సింహనాదాలు చెవులు బ్రద్దలయ్యేలా వినబడుతున్నాయి. ఆనందంతో, వేగంగా తూర్పుదిశగా వెళుతున్న పాండవ వీరుల రథచక్ర ధ్వనులు, ఒళ్లు గగుర్పొడిచే విధంగా వినబడుతున్నాయి. పాండవులకు ధార్తరాష్ట్రులకు జరిగిన యుద్ధంలో, నాశనం కాకుండా మనం ముగ్గురం మాత్రమే మిగిలి ఉన్నాం. సర్వాస్త్రకోవిదులు పాండవుల చేతిలో మరణించటం కాల మహిమ అనుకొంటున్నాను.

అలాగే తత్త్వ దృష్టితో ఈ పనిని గురించి ఆలోచించాలి. గతంలో దుష్కరమైన కార్యాలలో చూపిన నిష్ఠను ఇప్పుడు కూడా చూపాలి. మీ ప్రజ్ఞ మోహంతో తగ్గిపోకూడదు. ఎదురుగా ఉన్న ఈ మహాకార్యంలో ఏది మనకు శ్రేయస్కరమో అది చెప్పండి."

2. ద్రౌణి - కృప సంవాదము

కృపుడు ఇలా అన్నాడు - "నీవు చెప్పినదంతా నేను విన్నాను. ఇప్పుడు కొంచెం నేను చెప్పబోయే మాటను నీవు విను. మానవులందరూ రెండు విధాలయిన పనులకు కట్టుబడి ఉన్నారు. ఒకటి దైవం, మరొకటి మానవ ప్రయత్నం. ఈ రెండింటిని మించినది మరొకటి లేదు. సత్తమా! ఆచ్చంగా దైవం చేతగాని, మానవ ప్రయత్నం చేతగాని జరుగని పనులు రెండిటి కలయిక వలన నెరవేరుతాయి. చిన్నవయినా, పెద్దవయినా అన్ని పనులు, దైవపురుషకారాలకే కట్టుబడి ఉన్నాయి. జరిగేవి, జరుగనవి అంతటా కనిపిస్తాయి. పర్వతంపై కురిసిన మేఘం ఫలితాన్ని సాధిస్తుందా? అలాగే దున్నిన పొలంపై కురిసి ఫలాన్ని సాధించకుండా ఉంటుందా ? **అదృష్టంలేని పురుషప్రయత్నం వ్యర్థం. పురుషప్రయత్నం లేని అదృష్టం వ్యర్థం.** అన్నిచోట్ల ఈ చర్చ ఉంటుంది. మొదటి పక్షమే నిశ్చయింపబడుతుంటుంది. దైవం చక్కగా వర్షం కురిపిస్తే, పొలాన్ని చక్కగా దున్నితే గింజ ఎంతో లాభమిస్తుంది. మానుషసిద్ధి కూడా అటువంటిదే" (దైవ పురుషార్థాల మీద ఆధారపడుతుంది.) ఆ రెండింటిలో దైవం స్వతంత్రంగా నిశ్చయం చేసికొని ప్రవర్తిస్తుంది. పురుష ప్రయత్న విషయంలో, ప్రాజ్ఞులు తమ సామర్థ్యాన్ని అమపరించి ప్రవర్తిస్తారు. మానవుల ప్రవృత్తి నివృత్తి రూపాలయిన సర్వకార్యాలూ, దైవ పురుషార్థాలతోనే సిద్ధిస్తాయి. పురుష ప్రయత్నం చేసినా, అది కూడా దైవం వలననే సిద్ధిస్తుంది. అలాగే దైవానుకూల్యం వలననే కర్తకు కర్మఫలం లభిస్తుంది. సమర్థులైన మనుష్యుల ప్రయత్నం ఎంత చక్కగా నిర్వహింపబడినా, దైవం విడిచిపెడితే, నిష్ఫలం కావటమే లోకంలో కనిపిస్తుంది.

అభిమానహీనులయిన మనుష్యులు సోమరితనంతో పురుష ప్రయత్నాన్ని నిందిస్తారు. కానీ ప్రాజ్ఞుల కది రుచించదు. లోకంలో చేసిన పని ఏదీ దాదాపు ఫలరహితం కాదు. పనిచేయకపోతే మాత్రం దుఃఖం కలుగుతుంది. కాబట్టి కర్మనే మహాఫలదాయకంగా చూడాలి. యాదృచ్ఛికంగా పనిచేయకపోయినా కొంత ఫలితం లభించవచ్చు. పని చేసి కూడా కొందరు ఫలితాన్ని పొందలేక పోవచ్చు. కానీ అటువంటివారు అరుదుగానే ఉంటారు.

సమర్థుడు జీవించగలడు. అలసుడు సుఖాన్ని పొందలేడు. జీవలోకంలో సమర్థులందరూ, దాదాపుగా హితాభిలాషులుగానే ఉంటారు. సమర్థుడు కర్మనారంభించి కూడా కర్మఫలాన్ని పొందలేకపోవచ్చు. దానికి అతని నిందింప పని లేదు. తన లక్ష్యాన్ని తాను పొంది తీరుతాడు. *ఈ లోకంలో పని చేయకుండానే కూర్చొని ఫలాన్ని అనుభవించే వాడు నిందింపదగినవాడు. తాను ఇతరుల ద్వేషానికి కూడా ఎక్కువ గురికావలసి వస్తుంది. దీనిని కాదని మరొకరీతిగా ప్రవర్తించినవాడు, తనకు తానుగా అనర్థాన్ని తెచ్చుకొన్నట్లే అన్నది బుద్ధిమంతుల నీతి. పురుష ప్రయత్నం లేని దైవం, దైవం లేని పురుష ప్రయత్నం - ఈ రెండు కారణాల వలననే పని విఫలమవుతుంది. పురుషకారం లేకుండా ఈ లోకంలో కర్మసిద్ధి లేదు. దక్షుడై, దాక్షిణ్య సంపన్నుడై, దేవతలకు నమస్కరించి, కార్యసిద్ధికై యత్నించినవాడు వైఫల్యాల దెబ్బతినడు. చక్కగా పనిచేయడమంటే ఇది. వృద్ధులను సేవించి, శ్రేయస్సును గురించి ప్రశ్నించి, వారి హితవచనాలను పాటించటమే. ప్రతిదినమూ లేచి, పెద్దలు మన్నించిన వారిద్వారా అడిగి సూచనలు పొందాలి. వారు చెప్పిన ఉపాయాలే ఫలసిద్ధిలో మూలకారణా లవుతాయి. పెద్దల మాట విని, అభ్యుదయ కర్మను ప్రారంభిస్తే, ఆ కర్మఫలితాన్ని పూర్తిగా, తక్కువ వ్యవధిలోనే పొందవచ్చు. తనను తాను అదుపు చేసికొనని వాడు, ఇతరులను పరాభవించేవాడు రాగం ద్వారానో, క్రోధం ద్వారానో, భయలోభాల వల్లనో అర్థాలను కోరుకొన్నా, వెంటనే సంపదలకు దూరమవుతాడు. దుర్యోధనుడు లుబ్ధుడు, దీర్ఘదృష్టి లేనివాడు. మూఢుడై అనాలోచితంగా, ఎవరి సమ్మతిని పొందకుండా ప్రారంభించాడు. హితాన్ని కోరేవారిని తిరస్కరించి, దుర్మార్గులతో సంప్రదింపులు జరిపి, అందరూ వారిస్తున్నా వినకుండా, తనకన్న గుణవత్తరులైన పాండవులతో శత్రుత్వాన్ని కొని తెచ్చుకొన్నాడు.

మొదటినుండి దుస్స్వభావం గలవాడు. ధైర్యాన్ని ప్రదర్శించలేడు. మిత్రుల మాట వినలేదు. పని చెడగానే పశ్చాత్తాపపడుతున్నాడు. ఆ పాపిని మనం అనుసరిస్తున్నాం. అందువలన మనకు కూడా అత్యంత దారుణమైన ఈ అనర్థం ప్రాప్తించింది. ఈ అనర్థంతో తపించిపోతూ, ఇప్పుడు నా బుద్ధికూడా చెడింది. ఎంత ఆలోచించినా, నాకేది శ్రేయస్కరమో తెలియటం లేదు. మనుష్యుడు మోహానికి లోనైనపుడు మిత్రజనులను కర్తవ్యాన్ని గురించి ప్రశ్నించాలి. అప్పుడే బుద్ధి వివేకాన్ని, శ్రేయస్సును గమనించ

* అకృత్వా కర్మ యో లోకే ఫలం విందతి ధిష్ఠితః ।
వ తు వక్తవ్యతాం యాతి ద్వేష్యో భవతి భూయశః ॥ 17

గలుగుతుంది. కర్తవ్యాన్ని అడిగినపుడు, పండితులు కార్యాల మూలకారణాన్ని నిశ్చయించి సలహానిస్తారు. ఆ రీతిగా పని చేయవలసి ఉంటుంది. కాబట్టి మనం కలిసి వెళ్ళి, ధృతరాష్ట్రుని, గాంధారిని మహామతి అయిన విదురుని అడుగుదాం. మనం అడిగితే, వారు ఇప్పుడు మనకేది హితకరమో చెపుతారు. అదే మనం చేయాలి. నా బుద్ధి నిశ్చయ మదియే. పనులను ప్రారంభించకుండా ఫలిత మెప్పుడూ లభించదు. పురుషకార్యాన్ని చేసినా, కార్యం సిద్ధించకపోతే వారు దైవోపహతులు. అక్కడ మరొక ఆలోచన తగదు."

3. అశ్వత్థామ నిశ్చయము.

"మహారాజా! ధర్మార్థసహితమై, శుభంకరమైన కృపుని మాట విని, అశ్వత్థామ దుఃఖశోకాలకు లోనయ్యాడు. మండుతున్న అగ్నివలె, శోకం అశ్వత్థామను దహించింది. దానితో క్రూరంగా ఆలోచించి, కృప కృతవర్మలతో ఇలా అన్నాడు. ప్రతిపురుషునిలోనూ విడివిడిగా బుద్ధి ఉంటుంది. అది ఆ పురుషునకు అందంగా కనిపిస్తుంది. అందరూ తమ తమ ప్రజ్ఞతో విడివిడిగా సంతోషిస్తుంటారు. ప్రజలందరూ తమను తాము, ఇతరులకన్న ఎక్కువ బుద్ధిగల వారుగానే భావిస్తారు. అందరికీ తామే ఇష్టం. అందరూ తమను తామే ప్రశంసించుకొంటారు. అందరికీ తమ బుద్ధియే అభినందింపదగినదనీ, ప్రతిష్ఠకు తగినదనీ అనిపిస్తుంది. పరుల బుద్ధిని నిందిస్తూ, తమ బుద్ధిని పదేపదే ప్రశంసించుకొంటారు. ఏదో కారణంవలన, ఏదో సమూహంలో, ఇద్దరి ఆలోచనలు కలిస్తే ఇద్దరూ తుష్టినందుతారు. మాటిమాటికీ ఒకరినొకరు గొప్పగా భావిస్తారు. కానీ కాలవిపర్యాసంతో, ఆ మనుష్యుల యొక్క ఆ బుద్ధియే అప్పుడప్పుడు విపరీతమై, పరస్పరం ఇబ్బందులను కలిగిస్తుంది. మనస్సులు విచిత్రమైనవి. ప్రత్యేకించి మనుష్యుల మనస్సులు విలక్షణమైనవి. ఆయా సందర్భాలలో మనస్సు వ్యాకులపడినపుడు రకరకాలుగా బుద్ధిపుడుతుంది. రాజా! నేర్పరి అయిన వైద్యుడు యథాశాస్త్రంగా వ్యాధిని గుర్తించి, దాని ఉపశాంతికై యోగ్యతను బట్టి వైద్యం చేసినట్లు, మానవులు కార్యసిద్ధికై తమప్రజ్ఞతో ఆలోచించి నిశ్చయాత్మక బుద్ధిని ఆశ్రయిస్తారు. కానీ ఇతరులు దానిని నిందిస్తారు.

మనిషి యౌవనంలో ఏదో బుద్ధితో మోహానికి లోనవుతాడు. మధ్యవయస్సులో మరొకరీతి బుద్ధి పని చేస్తుంది. వార్ధక్యంలో మరొకవిధమైన బుద్ధిని ఇష్టపడతాడు. భోజవంశీయా! పురుషుడు మహాఘోరమైన ఆపదలో పడ్డప్పుడు, విపరీతమైన సంపదను పొందినపుడు బుద్ధిలో వికృతి కలుగుతుంది. దుఃఖమో, సంతోషమో కలుగుతాయి. ఒకే

పురుషునిలో, భిన్నభిన్న సమయాలలో, భిన్న భిన్న రూపాల్లో బుద్ధిపుడుతుంది. కానీ అక్కరకు అనుగుణంగా లేనందువలన ఆ ఆలోచన వారికే నచ్చదు. తన ప్రజ్ఞను అనుసరించి, నిశ్చయించుకొని, సరియైనదిగా భావించుకొన్న బుద్ధి ననుసరించి, మానవుడు పని చేస్తాడు. ఆ బుద్ధి తనకు కార్యసిద్ధిని కలిగిస్తుంది. కృతవర్మా! ఏ పురుషుడైనా 'ఇది మంచి'దని నిర్ణయించుకొని, ప్రసన్నతతో కార్యారంభం చేస్తాడు. ఇతరులను సంహరించే కర్మలకైనా సిద్ధపడతాడు. నరులు అందరూ తమబుద్ధిని లేదా వివేకాన్ని అనుసరించియే వివిధ చేష్టలు చేస్తారు. అవి తమకు హితకరా లనియే భావిస్తారు. ఈ దుఃఖంలో నుండి నాలో జనించిన బుద్ధిని మీకిద్దరకూ వివరిస్తాను. అది నా శోకాన్ని తొలగిస్తుంది.

ప్రజాపతి ప్రజలను సృష్టించి, వారికై కర్మలను కూడా విధించాడు. ప్రతివర్ణంలోనూ ఒక్కొక్క విశిష్ట గుణముంటుంది. బ్రాహ్మణులలో ఉత్తమవేదాన్ని, క్షత్రియులలో ఉత్తమతేజస్సును, వైశ్యునిలో వ్యాపార సామర్థ్యాన్ని, శూద్రులలో సర్వవర్ణాలకూ అనుకూలంగా ఉండటాన్ని స్థాపించాడు. అదుపులేని బ్రాహ్మణుడు చెడ్డవాడు. తేజోహీనుడైన క్షత్రియుడు అధముడు, సామర్థ్యంలేని వైశ్యుడు నింద్యుడు. వర్ణాలకు ప్రతికూలంగా నిలిచే శూద్రుడు కూడా నింద్యుడు. నేను బ్రాహ్మణకులంలో పుట్టాను. అది చక్కగా గౌరవింపబడే ఉత్తమకులం. కానీ మందభాగ్యుడను కాబట్టి క్షత్రియధర్మాన్ని అనుష్ఠిస్తున్నాను. నేను క్షత్రధర్మాన్ని తెలిసి కూడా, బ్రాహ్మణత్వాన్ని ఆశ్రయించి, మరొక గొప్ప పనిచేసినా, ఆ నాపని సాధుసమ్మతం కాదు. నేను దివ్యధనుస్సును, దివ్యాస్త్రాలను ధరించి కూడా, రణభూమిలో తండ్రి మరణాన్ని చూస్తూ ఊరకొన్నానంటే, పదిమంది మధ్యలో ఎలా సమర్థించుకోగలను ? అటువంటి నేను, ఇప్పుడు నా ఇచ్ఛానుసారంగా క్షత్రధర్మాన్ని పాటిస్తూ, మహోత్ముడైన నా తండ్రిబాటను, మహారాజు మార్గాన్ని అనుసరిస్తాను. విజయంతో శోభించే పాంచాలురు, ఈ రాత్రి తమ గెలుపును తలచుకొంటూ, ఆనందంతో నిండి, గుర్రాలను విడిపించి, కవచాలు తీసి నిస్సంశయంగా నిదురిస్తుంటారు. దీర్ఘపరిశ్రమవలన కృశించి, అలసిపోయి ఉంటారు. రాత్రి స్వస్థచిత్తంతో నిదురిస్తున్న ఆ పాంచాలుర శిబిరంలోనికి చొరబడి వారిని సంహరిస్తాను. ఇతరులకు వీలుకాని రీతిలో శిబిరాన్ని ధ్వంసం చేస్తాను.

ఇంద్రుడు దానవులపై పరాక్రమించినట్లు, శిబిరంలో, ప్రేతాలవలె నిశ్చేతనంగా నిదురిస్తున్న ఆ పాంచాలురపైకి దూకి సంహరిస్తాను. సజ్జనోత్తమా! ఈ రోజు ధృష్టద్యుమ్నుడు మొదలైన ఆ పంచాలుర నందరినీ, నిప్పు చెత్తాచెదారాన్ని తగులబెట్టినట్లు చంపుతాను. ఆ పంచాలురను చంపి, శాంతిని పొందుతాను. రుద్రుడు తీవ్రక్రోధంతో, పినాకపాణియై

స్వయంగా ప్రాణులను ఆక్రమించినట్లు, నేను ఈ రోజు యుద్ధంలో పాంచాలురను చంపుతూ వారిపాలిట రుద్రుడ నవుతాను. ఈ రోజు నేను సర్వపాంచాలురను నరికి చంపి, ఆనందంతో, రణభూమిలో పాండవులను కూడా ధ్వంసం చేస్తాను. ఈ రోజు పాంచాలుర శరీరాలతో రణభూమిని శరీరధారిణిని చేసి, ఒక్కొక్కరినిగా వారిని చంపి, తండ్రి ఋణాన్ని తీర్చుకొంటాను. దుర్యోధనుడు, కర్ణుడు, భీష్ముడు, సైంధవుడు వెళ్ళిన దుర్గమమార్గంలో ఈనాడు పంచాలురను కూడా నడిపిస్తాను. ఈ రాత్రి మొదలయిన వెంటనే పాంచాలరాజైన ధృష్టద్యుమ్నుని తలను, పశువు శిరస్సునువలె మథిస్తాను. కృపాచార్యా! ఈ రాత్రి, నిదురిస్తున్న పాంచాల పాండవుల కొడుకులను కూడా, యుద్ధభూమిలో పదునైన కత్తితో సంహరిస్తాను. మహామతీ! ఈ రాత్రి నిదురిస్తున్న ఆ పాంచాల సేనను చంపి, కృతకృత్యుడనై సుఖంగా ఉంటాను."

4. అశ్వత్థామ సూచనను కృపాచార్యుడు నిరాకరించుట.

కృపుడు చెప్తున్నాడు. "అచ్యుతా! అదృష్టం కొద్దీ నీలో ప్రతీకార బుద్ధి కలిగింది. స్వయంగా దేవేంద్రుడైనా నిన్ను వారించలేడు. తెల్లవారగానే మేమిద్దరం కూడా కలిసి నిన్ను అనుసరిస్తాం. ఈ రాత్రి కవచాన్ని, ధ్వజాన్ని విడిచి విశ్రమించు. నేను, కృతవర్మ కూడా కవచాలు ధరించి, రథాలనెక్కి, శత్రువులకు ఎదురు వెళుతున్న నిన్ను అనుసరిస్తాం. రేపు ఉదయం మాతో కలిసి యుద్ధంలో విక్రమించి, అనుచరులతో పాటు పంచాలురను చంపవచ్చు. విక్రమించటానికి నీవు సమర్థుడవే. ఈ రాత్రి విశ్రమించు నాయనా! నీవు మేల్కొనే చాలాసేపు గడిపావు. ఈ రాత్రి నిదురించు. మానదా! విశ్రాంతి తీసికొని, చక్కగా నిదురించి, స్వస్థచిత్తుడవై, రణభూమిలో ప్రవేశించి శత్రువులను చంపగలవు. సంశయం లేదు. రథికశ్రేష్ఠుడవైన నీవు గొప్పగొప్ప ఆయుధాలను పట్టి నిలిస్తే, దేవతలలోని ఇంద్రుడు కూడా, ఎప్పుడూ నిన్ను జయించాలని ఉత్సాహపడడు. కృపునితో కూడి, కృతవర్మ రక్షణలో వెళ్ళి, కోపంతో యుద్ధం చేస్తున్న అశ్వత్థామతో ఎవరు పోరాడగలరు ? ఇంద్రుడు కూడా పోరాడలేడు. కాబట్టి మనం ఈ రాత్రి విశ్రమించి, నిద్రను వదిలించుకొని, చింతారహితులమై, రాత్రి తెలవారగానే శత్రువులను చంపుదాం. నీవి దివ్యాస్త్రాలు, నావీ అంతే. అనుమానం లేదు. కృతవర్మ కూడా మేటివిలుకాడు. సర్వదా యుద్ధనిపుణుడు. కాబట్టి నాయనా! మనమందరం కలిసి, ఎదురువచ్చిన శత్రువుల నందరినీ బలపూర్వకంగా చంపి, అమందానందాన్ని పొందుదాం. కలత మాని విశ్రమించు. ఈ రాత్రి సుఖంగా

నిదురించు. విలుకాండ్రమూ, పరతాపనులమూ అయిన నేను, కృతవర్మా, కవచాలు ధరించి, రథాలనెక్కి, యుద్ధానికి త్వరపడుతూ బయలుదేరిన నిన్ను అనుసరిస్తాం.

నీవు నరోత్తముడవూ రథికుడవూ. అటువంటి నీవు వారి శిబిరానికి వెళ్ళి, పేరు వినిపించి, రణభూమిలో పోరాడుతున్న శత్రువులతో మహాయుద్ధం చేయగలవు. తెల్లవారగానే, నిర్మలమైన ఆ పగటిపూట వారితో యుద్ధంచేసి, ఇంద్రుడు మహారాక్షసులను చంపినట్లు, వారిని చంపి విహరించు. ఇంద్రుడు కోపించి రాక్షససేనను జయించినట్లు, నీవు పంచాలసేనను యుద్ధభూమిలో జయించగలవు. కృతవర్మ రక్షణలో నాతో కలిసి రణభూమిలో నున్న నిన్ను, సాక్షాత్తు దేవేంద్రుడు స్వయంగా వచ్చినా, సమర్థుడైనా సరే సహించలేడు. నాయనా! రణభూమిలో పోరాటంలో, పాండవులను ఓడించకుండా నేను కానీ, కృతవర్మ కానీ ఎటూ వెళ్లం. రణభూమిలో పంచాలురను పాండవులతో సహా చంపి మనం వెనుదిరుగుదాం. మనమే చనిపోతే స్వర్గానికి వెళదాం. రేపు ఉదయం మేము సర్వోపాయాలతోనూ నీకు సహాయంగా నిలుస్తాం. నీకు సత్యం చెపుతున్నాను." మేనమామ ఆ రీతిగా హితవచనాలు పలుకగా, అశ్వత్థామ కోపంతో కన్నెర్రజేసి మేనమామతో ఇలా అన్నాడు.

"నరుడు శోకాతురుడైనా, అసహనానికి లోనైనా, వివిధ కార్యాలను గురించి ఆలోచిస్తున్నా, ఏవేని కోరికలలో తగుల్కొన్నా వానికి నిదురపట్టదు. చూడు ! ఇప్పుడు నాలో ఈ నాలుగు లక్షణాలూ ఉన్నాయి. ఈ నాలుగింటిలో ఒకటి, నిదురపట్టిన వెంటనే దానిని భంగపరుస్తోంది. తండ్రి హత్యను గురించి తలచుకొంటూ, లోకంలో నేను అనుభవించని దుఃఖమేముంది ? ఆ శోకాగ్ని నా హృదయాన్ని రేయింబవళ్ళు దహిస్తోంది. చల్లారటం లేదు. ఆ పాపాత్ములు ప్రత్యేకించి నా తండ్రిని ఎలా చంపారో, అదంతా నీవు ప్రత్యక్షంగా చూశావు. అది నా మర్మస్థానాలను కోసేస్తోంది. ఆ స్థితిలోనున్న నావంటివాడు ముహూర్తకాలమైనా ఎలా జీవించగలడు ? ద్రోణుడు ధృష్టద్యుమ్నుని చేతిలో మరణించాడని పాంచాలురు అంటుంటే నేను విన్నాను. ఆ ధృష్టద్యుమ్నుని చంపకుండా నాకు బ్రతకాలనిపించటం లేదు. నా తండ్రిని చంపినందువలన ఆ ధృష్టద్యుమ్నుని, అతనికి సహకరించినందువలన పంచాలురను నేను చంపాలి. తొడలు విరిగి విలపిస్తున్న దుర్యోధనుని విలాపం నేను విన్నాను. ఎంతక్రూరుని మనస్సునైనా అది దహించకుండా ఎలా ఉంటుంది ? తొడలు విరిగిన ఆ రాజు పలుకుతున్న ఆ మాటలు వింటుంటే, దయమాలిన వాని కన్నులనుండి అయినా, కన్నీరు కారకుండా ఉంటుందా ? నేను

బ్రతికిఉండగానే మిత్రపక్షమంతా ఓడింపబడింది. అది నా శోకాన్ని పెంచుతూనే ఉంది. అలా ఆ విషయమొక్కటే చింతిస్తున్న నాకు నిద్రఎక్కడిది ? సుఖమెక్కడిది ? వాసుదేవుడు, అర్జునుడు రక్షిస్తున్న వారు మహేంద్రుని కైనా సహింపరాని (ఎదిరింపరాని) వారని నాకనిపిస్తోంది. ఇలా చెలరేగుతున్న ఈ కోపాన్ని అణచుకొనలేక పోతున్నాను. ఈ కోపం నుండి నన్ను మరలించగలవాడు ఈ లోకంలో ఎవ్వడూ కనిపించటం లేదు. ఈ రీతిగా నేను తీసికొన్న నిర్ణయం నాకు యుక్తమనిపిస్తోంది. మిత్రుల పరాభవాన్ని గురించి, పాండవుల విజయాన్ని గురించి వార్తాహరులు చెప్పిన మాట నా హృదయాన్ని దహించినట్లయింది. ఈ రోజే నిదురిస్తున్న సమయంలో నేను యుద్ధం చేసి, శత్రు సంహారం చేసి, ఆపై విశ్రమిస్తాను. నిశ్చింతగా నిదురిస్తాను."

5. అశ్వత్థామ - కృపుడు - కృతవర్మ పాండవ శిబిరానికి బయలుదేరుట

కృపుడు చెప్తున్నాడు. "**ఇంద్రియాలపై అదుపులేనివాడు, బుద్ధి కలుషితమైనవాడు ధర్మార్థాలను గురించి విన్నా, పూర్తిగా అర్థం చేసుకోలేడు.*** అలాగే మేధావి అయినా, వినయాన్ని అలవరచుకోకపోతే, ధర్మార్థ నిశ్చయాన్ని కొంచెంకూడా అవగతం చేసికోలేడు. శూరుడైనా, బుద్ధిజాడ్యానికి లోనైతే, ఎంతకాలం పండితుని సేవించినా, గరిటె పప్పురుచిని గ్రహించలేనట్లు, ధర్మాలను తెలిసికొనలేడు. ప్రాజ్ఞుడు పండితుని ముహూర్తకాలం సేవించినా, నాలుక పప్పురుచిని గ్రహించినట్లు, వెంటనే ధర్మాలను గ్రహించగలడు. జితేంద్రియుడు, మేధావి అయిన పురుషుడు పండితులనుండి వినగోరి, విని, ఆగమాల నన్నింటినీ గ్రహించగలడు. తెలిసికొనవలసిన దానితో విరోధించడు. మంచిబాటలో నడిపించరానివాడు, ఇతరుల నవహేళన చేసేవాడు, దురాత్ముడు, పాపాత్ముడు అయితే, ఉపదేశించిన కళ్యాణమార్గాన్ని వీడి అనేక పాపకృత్యాలు చేస్తాడు. పరాధీనత గలవానిని మిత్రులు పాతకాల నుండి రక్షించగలరు. భాగ్యవంతుడు పాపకర్మలనుండి మరలగలడు. కానీ భాగ్యహీనుడు పాపకృత్యాలనుండి మరలలేడు. పిచ్చివానిని రకరకాల అనునయ వచనాలతో, బెదిరింపుతో దారికి తెచ్చినట్లు, మిత్రులు సహచరుని నియంత్రించవచ్చు. సుఖపడేట్టు చేయవచ్చు. మాట వినినివాడు దుఃఖపడతాడు. అదేరీతిగా ప్రాజ్ఞుడైన మిత్రుడు పాపకర్మలు చేస్తుంటే, ప్రాజ్ఞులు అదేపనిగా, యథాశక్తిగా వాటిని

* శుశ్రూషురపి దుర్మేధాः పురుషోఽనియతేంద్రియः ।
నాలం వేదయితుం కృత్స్నో ధర్మార్థావితి మే మతిः ॥ 1

నిషేధిస్తారు. కాబట్టి నాయనా! నిన్ను నీవు నియంత్రించుకొని, మంచిపనులపై మనస్సుపెట్టి నా మాట వినుము. వింటే పశ్చాత్తాప పడవలసిన పరిస్థితి రాదు. నిదురిస్తున్నవానిని, శస్త్రాలు విడిచినవానిని, రథహీనుని, వాహనహీనుని, నీవాడ నన్న వానిని, శరణాగతుని, తలవెంట్రుకలు వీడినవానిని, వాహనాలు మరణించిన వానిని చంపటం ధర్మబద్ధమని లోకం మన్నించదు. ప్రభూ! పంచాలురు అందరూ ఈ రోజు రాత్రి కవచాలను వీడి, విశ్వాసంతో, మరణించినవారివలె నిశ్చేతనులై నిదురిస్తూ ఉంటారు. నిజాయితీని వదలి ఆ స్థితిలో నున్న వానికి ద్రోహంచేసినవాడు, అగాధమైన విశాల నరకంలో మునిగిపోతాడు. బయటపడవేసే తెప్ప ఉండదు. లోకంలో సర్వాస్త్రపండితులలో నీవు శ్రేష్ఠుడవని ప్రసిద్ధి. ఈ లోకంలో ఇంతవరకు ఎప్పుడు చిన్న దోషం కూడా కనిపించలేదు. నీవు సూర్యునివంటి తేజస్సు గలవాడవు. రేపు సూర్యుడు ఉదయించగానే సర్వప్రాణుల ఎదుట, యుద్ధంలో శత్రువులను జయించవచ్చు. నీవు నిందింపబడే పనిచేయటం ఊహింపరాని విషయం. తెల్లని వస్త్రంపై ఎర్రని మరకవంటి దవుతుందని నా భావం."

అశ్వత్థామ ఇలా అన్నాడు. "మామా! నీవు చెప్పినది యథార్థమే. సంశయం లేదు. కానీ పాండవులు ఈ ధర్మసేతువును ఇంతకుముందే నూరు ముక్కలు చేశారు. రాజు లందరూ చూస్తుండగా, నీ సన్నిధిలోనే శస్త్రసన్యాసం చేసిన నా తండ్రిని ధృష్టద్యుమ్నుడు చంపాడు. రథికశ్రేష్ఠుడైన కర్ణుడు రథచక్రం దిగబడి, పెద్ద సంకటంలో పడిపోయినప్పుడు, అర్జునుడు ఆయనను చంపాడు. అదే రీతిగా శిఖండిని ముందుంచుకొని భీష్ముని శస్త్రహీనునీ, నిరాయుధునీ చేసి అర్జునుడు పడగొట్టాడు. అదేవిధంగా మేటి విలుకాడైన భూరిశ్రవుడు రణభూమిలో ప్రాయోపవిష్టుడై యుండగా, రాజులందరి ఆక్రోశాల మధ్య సాత్యకి ఆయనను చంపాడు. భీమసేనుడు రణభూమిలో, రాజులు కూడి చూస్తుండగా, గదతో దుర్యోధనుని అధర్మంగా పడగొట్టాడు. నరోత్తముడైన దుర్యోధనుడు ఒంటరి. అనేకమహారథులు చుట్టుముట్టారు. ఆ దశలో భీమసేనుడు అధర్మంగా ఆయనను పడగొట్టాడు. తొడలు విరిగిన ఆ రాజు విలాపం వార్తాహరులు చెప్పగా విన్నాను. నా మర్మస్థానాలు బ్రద్దలయి నట్లనిపించింది. ఈ రీతిగా పాపాత్ములైన పంచాలురు అధార్మికులై ధర్మసేతువును బ్రద్దలు చేశారు. హద్దుల నతిక్రమించిన వారిని నీవెందుకు నిందించవు ? నా తండ్రిని చంపిన పంచాలురను రాత్రి నిదురించే సమయంలో నేను చంపుతాను. కీటకంగా పుట్టినా, పక్షిగా పుట్టినా ఫరవాలేదు. అది నా కిష్టమే. నేను చేయదలచినది చేయాలని నాకెంతో తొందరగా ఉంది. ఆ తొందరలోనున్న నాకు నిద్ర ఎక్కడిది ?

సుఖమెక్కడిది ? ఆ పంచాలురను చంపదలచుకొన్న నా బుద్ధిని వెనక్కు త్రిప్పగలవాడు ఈ లోకంలో ఇంతవరకు పుట్టలేదు. భవిష్యత్తులో పుట్టడు కూడా."

సంజయుడిలా చెప్తున్నాడు. "మహారాజా! ఆ రీతిగా పలికి ప్రతాపవంతుడైన అశ్వత్థామ ఏకాంతంగా గుర్రాలను పూన్చి, శత్రువుల కభిముఖంగా బయలుదేరాడు. మహాత్ములైన కృతవర్మ కృపులు ఇద్దరూ అశ్వత్థామతో ఇలా అన్నారు. "రథాన్ని ఎందుకు కట్టావు? ఏ పనిచేయదలచుకొన్నావు ? నరర్షభా! మేమిద్దరం నీతోపాటు బయలుదేరుతాం. నీ సుఖదుఃఖాలలో మేమూ భాగస్వాములమే. మమ్ములను శంకించవద్దు." అశ్వత్థామ మాత్రం తండ్రి వధను తలచుకొంటూ తీవ్రకోపంతో తాను చేయదలచిన పనిని యథాతథంగా వారికి చెప్పాడు. "తన పదునైన బాణాలతో వందలు, వేలమందిని చంపి, ఆయుధాన్ని వీడినపుడు, నా తండ్రిని ధృష్టద్యుమ్నుడు సంహరించాడు. ఆ ధృష్టద్యుమ్నుని అలాగే చంపుతాను. ధర్మ పరిత్యాగం చేసిన ఆ పాపాత్ముని పాపకర్మతోనే చంపుతాను. పశువువలె నాచే చంపబడిన ఆ పాపాత్ముడు - ధృష్టద్యుమ్నుడు, ఏ రీతిగానూ, శస్త్రంతో లోకాలను జయించినవాడు పోయే లోకాలకు పోలేడని నా అభిప్రాయం. మీరిద్దరూ వేగంగా కవచాలు ధరించి, కత్తులనూ, ధనుస్సులనూ చేబట్టి, రథాలనెక్కి నాకోసం ఎదురు చూడండి." అలా పలికి అశ్వత్థామ రథాన్ని ఎక్కి శత్రువులున్న వైపు బయలుదేరాడు. కృతవర్మ, కృపుడు ఆయనను అనుసరించారు. ఆ ముగ్గురూ శత్రువుల వైపు వెళుతూ, మూడు అగ్నులవలె భాసించారు. రాజా! జనమంతా నిదురిస్తున్న ఆ శిబిరానికి వెళ్ళారు. మహారథుడైన అశ్వత్థామ ద్వారం దగ్గరకు చేరి నిలబడ్డాడు."

6. అశ్వత్థామ చింతించుట.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "సంజయా! ఆపై ద్వారదేశంలో అలా నిలిచిన అశ్వత్థామను చూసి కృతవర్మ, కృపుడు ఏం చేశారో నాకు చెప్పు". సంజయుడు చెప్తున్నాడు. "కృతవర్మ కృపుల నుండి అశ్వత్థామ వీడ్కోలు తీసికొని, కోపంతో నిండిన మనస్సుతో శిబిరద్వారాన్ని చేరాడు. అక్కడ అశ్వత్థామ చంద్రసూర్య తేజస్సు, విశాల శరీరమూగల ఒక ప్రాణిని చూశాడు. ఆ పురుషుడు ద్వారానికి అడ్డంగా నిలిచిఉన్నాడు. చూస్తేనే చాలు, ఒళ్ళు గగుర్పొడుస్తోంది. ఆ మనిషి బాగా నెత్తురోడుతున్న పులితోలును ధరించి, జింక చర్మాన్ని ఉత్తరీయంగా వేసికొని, పాములను యజ్ఞోపవీతంగా ధరించాడు. బాహువులు లావుగా, పొడవుగా ఉన్నాయి. అనేకాయుధాలను ఎత్తిపట్టిఉన్నాడు. పెద్దపాములను అంగదాలుగా

ధరించాడు. ముఖంనిండా అగ్నిజ్వాలలు వ్యాపించి ఉన్నాయి. నోరుతెరిచి, కోరలతో భయంకరంగా కనిపిస్తున్నాడు. ఆ భీకర పురుషుడు వేలకొలది విచిత్రనయనాలతో శోభిస్తున్నాడు. అతని శరీరాన్నీ, వేషాన్నీ వర్ణించి చెప్పటం శక్యం కాదు. అతనిని అన్ని కోణాలనుండి చూస్తే పర్వతాలు కూడా బ్రద్దలవుతాయి. అతని ముఖంనుండి, నాసికారంధ్రాలనుండి, చెవులనుండి, వేల కన్నులనుండి అన్నివైపులకు పెద్ద జ్వాలలు వెలువడుతున్నాయి. ఆపై ఆ తేజఃకిరణాలనుండి శంఖ, చక్ర, గదలను ధరించిన విష్ణుమూర్తులు వందలు, వేలుగా పుట్టుకొనివచ్చారు.

లోకభయంకరమైన ఆ అద్భుతప్రాణిని చూసికూడా, అశ్వత్థామ కలతపడకుండా, దివ్యాస్త్ర వృష్టిని కురిపించాడు. అశ్వత్థామ విడిచిన ఆ బాణాలను ఆ పెనుభూతం మ్రింగివేసింది. తన బాణసమూహాలు వ్యర్థం కావటం చూసి, అశ్వత్థామ మండుతున్న అగ్నిజ్వాల వంటి రథశక్తిని అతనిపైకి విడిచాడు. ప్రళయకాలంలో ఆకాశం నుండి జారుతున్న పెద్దతోకచుక్క, సూర్యునకు తగిలి శిథిలమైనట్లు, ప్రజ్వలిస్తున్న కొనలతో ఆ భూతాన్ని తాకిన ఆ రథశక్తి బ్రద్దలైపోయింది. ఆపై ఆకాశంవలె నిర్మలంగా ప్రకాశిస్తున్న బంగారు పిడిగల దివ్యఖడ్గాన్ని, ఒరనుండి బయటకు తీసి అశ్వత్థామ ఆ ప్రాణిపైకి విసిరాడు. అది ఆ భూతాన్ని తాకి, ముంగిస బిలంలోనికి దూరినట్లు, అతని శరీరంలోనికి వెళ్ళిపోయింది. దానితో కోపించిన అశ్వత్థామ ప్రజ్వలిస్తున్న గదను అతనిపైకి విసిరాడు. ఆ ప్రాణి దానిని కూడా మ్రింగివేశాడు. ఆయుధాలన్నీ అయిపోయాయి. అప్పుడు అశ్వత్థామ అటు ఇటు చూశాడు. ఆకాశమంతా జనార్దనులే. అసలు ఆకాశం కనిపించలేదు. నిరాయుధుడైన అశ్వత్థామ మహాద్భుతమైన ఆ దృశ్యాన్ని చూసి, తీవ్రంగా దుఃఖించి, కృపుని వచనాన్ని తలచుకొంటూ ఇలా అనుకొన్నాడు. 'అప్రియమైనా హితాన్ని చెప్పున్న మిత్రుల మాటలను వినని వాడు ఆపదలలో పడి నా వలె విచారిస్తాడు. నేను కృప కృతవర్మల మాటలను ఉల్లంఘించాను. శాస్త్రజ్ఞుల మాటలను అతిక్రమించి, ఇతరులను హింసించదలచిన మూర్ఖుడు, ధర్మమార్గభ్రష్టుడై, పెడత్రోవను పట్టి దెబ్బతింటాడు. గోవులపై, బ్రాహ్మణులపై, స్త్రీలపై, మిత్రులపై, తల్లిపై, గురువుపై, దుర్బలునిపై, జడునిపై, అంధునిపై, నిదురిస్తున్నవానిపై, బెదరినవానిపై, మత్తునిపై, ఉన్మత్తునిపై, ఏమరినవానిపై ఆయుధాలను ప్రయోగించరాదు. ఈ రీతిగా పెద్దలు గతంలోనే అందరూ, అన్నివేళలా పాటించవలసిన నీతిని ఉపదేశించారు. కానీ నేను శాస్త్రం సూచించిన ఆ సనాతన మార్గాన్ని వీడి, తప్పుద్రోవలో ఇలా ప్రవర్తించి, భయంకరమైన ఆపదలో పడ్డాను.

మహాకార్యాన్ని ప్రారంభించి భయంతో వెనుదిరగటం, లేదా శక్తిబలాలతో ఆ పని చేయటానికి అశక్తుడు కావటం – ఇవి మరీ ఇబ్బందిపెట్టే ఆపదలని బుద్ధిమంతులు చెపుతారు. మానుషకర్మ దైవం కన్నా గొప్పది కాదు. మానవ ప్రయత్నంతో కర్మ చేస్తున్నప్పుడు దైవికంగా అది సిద్ధించకపోతే, ఆ మనిషి ధర్మమార్గాన్ని వీడి ఆపదలో పడతాడు. పనిని ప్రారంభించి, భయంతో వెనుకంజవేసేటట్లయితే, ఆ ప్రతిజ్ఞను అజ్ఞానంగానే భావిస్తారు పండితులు. ఇప్పుడు నా దుష్కృత్యం వలననే నాకీ భయం కలుగుతోంది. ద్రోణుని కొడుకు యుద్ధంలో ఎన్నడూ వెనుదిరగడు. ఈ మహాభూతం ఎత్తిన దైవదండంవలె నా దారికి అడ్డు నిలిచింది. ఎన్నివిధాలుగా ఆలోచించినా ఈ ప్రాణి ఎవ్వరో తెలియటం లేదు. నా కలుషమతి అధర్మ మార్గంలో నడిచింది. అనుమానం లేదు. దాని ఫలితంగా, దానిని ఆపటానికే ఈ భీకర పరిణామం జరిగింది. దైవానుకూలత ఉంటే తప్ప, మరొకరీతిగా నేను ఇప్పుడు మరల ఉద్యమించలేను. కాబట్టి నేను ఇప్పుడు సమర్థుడైన మహాదేవుని శరణు కోరతాను. ఆయనే ఈ భీకరదైవదండాన్ని నాశనం చేయగలడు. శంకరుడు తన తపస్సుతో, పరాక్రమంతో దేవతలనందరినీ మించిపోయాడు. కాబట్టి ఆ కపర్దిని, దేవదేవుని, ఉమాపతిని, అనామయుని, కపాలమాలిని, రుద్రుని, భగనేత్రవినాశకుని, శూలపాణిని, గిరిశుని శరణు కోరుతున్నాను."

7. అశ్వత్థామ శివునిద్వారా కత్తిని పొందుట

"అశ్వత్థామ ఆ రీతిగా ఆలోచించి, రథాసనం నుండి దిగి, శివునకు నమస్కరించి, నిలిచాడు. ఇలా స్తుతింపనారంభించాడు." దేవా! ఉగ్రుడు, స్థాణువు, శివుడు, రుద్రుడు, శర్వుడు, ఈశానుడు, ఈశ్వరుడు, గిరిశుడు మొదలయిన పేర్లతో ఆరాధింపబడే వరదాతవు నీవు. సృష్టికర్త అయిన పరమేశ్వరుడవు నీవే. శితికంఠుడవు, అజుడవు, శుక్రుడవు నీవే. దక్షునియాగాన్ని ధ్వంసం చేసినది నీవే. హరుడవు, విశ్వరూపుడవు, విరూపాక్షుడవు, అనేకరూపుడవు, ఉమాపతివి నీవే. నీవు శ్మశానవాసిని, శక్తితో గర్వపడేవాడవు. మహాగణపతివి, సర్వవ్యాపివి నీవే. ఖట్వాంగధారివి నీవే. రుద్రుడవు, జటిలుడవు, బ్రహ్మచారివి నీవే. అల్పబుద్ధులకు అసాధ్యమైన పవిత్ర హృదయంతో త్రిపుర సంహారివైన నీకు నేను ఆత్మార్పణ గావించి యాగం చేస్తాను. దేవా! నీవు స్తుతింప బడినవాడవు, స్తుతింప దగినవాడవు, స్తుతింపబడుతున్నవాడవు. వైఫల్య మెరుగనివాడవు. నీవు నీలకంఠుడవు, రక్తవర్ణుడవు, పులితోలు తాలుపువు, నీవు సహింపరాని వాడవు, తేరిచూడరాని వాడవు.

శుద్ధ బ్రహ్మవు, బ్రహ్మను సృష్టించిన వాడవు. బ్రహ్మచారివి. వ్రతశీలుడవు, తపోనిష్ఠుడవు, అనంతుడవు, తపించేవారికి నీవే దిక్కు. నీవు బహురూపుడవు. గణాధ్యక్షుడవు, త్రిలోచనుడవు, నీ అనుచరులకు ప్రియమైనవాడవు. కుబేరుడెప్పుడూ నిన్నే చూస్తుంటాడు. గౌరీ హృదయవల్లభుడవు నీవే. నీవు కుమారస్వామి తండ్రివి. పింగళవర్ణుడవు, వృషభవాహనుడవు. సూక్ష్మవస్త్రధారివి. అత్యుగ్రుడవు. ఉమను అలంకరించుటలో ఆసక్తి గలవాడవు. పరాత్పరుడవు నీవే. నిన్ను మించినది ఏదీ లేదు. మేటి విలుకాడవు, దేశరక్షకుడవు, దిగంతవ్యాపివి. సువర్ణకవచుడవు, చంద్రమౌళివి నీవు. అటువంటి నిన్ను పరమైకాగ్రతతో శరణుకోరుతున్నాను. పరమదుష్కరమైన ఈ ఘోరవిపత్తునుండి బయటపడితే, నేను, సర్వభూతమయమైన పవిత్రాహుతులతో పవిత్రుడైన పరమేశ్వరుని యజిస్తాను."

ఆ రీతిగా అశ్వత్థామ నిశ్చయించుకొనటం తెలిసి, ఆ మహాత్ముని శుభకర్మల ఫలితంగా ఎదురుగా ఒక బంగారు వేదిక ఏర్పడింది. రాజా! ఆ వేదికపై అప్పుడే తన జ్వాలలతో దిక్కులనూ, మూలలనూ నింపుతూ అగ్నిదేవుడు ప్రత్యక్షమయ్యాడు. అక్కడ నుండి మహాగణాలు పుట్టాయి. వారు ద్వీపాలవలె, పర్వతాలవలె కనిపిస్తున్నారు. వారికళ్ళు ముఖాలు జ్వలిస్తున్నాయి. వారికి ఎన్నో పాదాలు, తలలు, భుజాలు ఉన్నాయి. రత్నాలతో చిత్రంగా ఉన్న అంగదాలను ధరించియున్నారు వారు. చేతులు పైకెత్తి ఉన్నారు. వారి రూపాలు కుక్కలవలె, పందులవలె, ఒంటెలవలె ఉన్నాయి. కొందరి ముఖాలు గుర్రాలు, నక్కలు, ఆబోతులు, ఎలుగుబంట్లు, పిల్లులు, పులులు, చిరుత పులులు, కాకులు, కోతులు, చిలుకలు, పెనుబాములు, వండ్రంగిపిట్టలు, పాలపిట్టల ముఖాలవలె ఉన్నాయి. కొందరు హంసవదనాలతో తెల్లని కాంతి కలిగియున్నారు. మరికొందరి ముఖాలు తాబేళ్ళు, మొసళ్ళు, పిడుక మొసళ్ళు, పెద్ద మొసళ్ళు, తిమింగలాలు, నెమళ్ళు, క్రౌంచపక్షులు, పావురాలు, ఏనుగులు, నీటికాకుల ముఖాలవలె ఉన్నాయి. కొందరికి చేతుల్లోనే కళ్ళున్నాయి. కొందరు సహస్రాక్షాలు, కొందరి పొట్టలు పెద్దవి. కొందరి ఒంటిలో మాంసం లేదు. కొందరి ముఖాలు కాకులు, డేగల ముఖాల వంటివి. కొందరికి తలలు లేవు. కొందరు ఎలుగుబంటి మొహాల వారు. కొందరి కళ్ళు, నాలుకలు మండుతున్నాయి. కొందరి దేహవర్ణం అగ్నిజ్వాలవలె ఉంది. వారి వెంట్రుకలు అగ్ని జ్వాలలవలె ఉన్నాయి. వారి రోమాలు మండుతున్నాయి.

వారంతా చతుర్భుజులే. కొందరి ముఖాలు గొర్రెలు, మేకల ముఖాలవంటివి. కొందరి ముఖాలు, రంగు, కాంతి శంఖాలవంటివి, శంఖమాలలను అలంకరించుకొన్న

వారి నోటినుండి శంఖ ధ్వని వంటి చప్పుడు వినిపిస్తోంది. వారిలో కొందరు జటలను, కొందరు పంచశిఖలను ధరించినవారు. కొందరు వెంట్రుకలు లేనివారు. సన్నని పొట్ట, నాలుగు కోరలు, నాలుగు నాలుకలు, మోళ్ళవంటి చెవులతో నున్న వారు కిరీట ధారులు. కొందరు మౌంజీధరులు, కొందరు జుట్టు ముడివేసి కొన్నవారు. కొందరు తలపాగాలు, కొందరు కిరీటాలు ధరించారు. వారు సుందరవదనులు, చక్కగా అలంకరించుకొన్నవారు. కొందరు పద్మకిరీటాలు, కొందరు ఉత్పల కిరీటాలు, కొందరు మామూలు కిరీటాలు ధరించియున్నారు. వందలు, వేలకొలది మాహాత్మ్యులు గలవారు వారు. వారు శతఘ్నులను, వజ్రాయుధాలను, ముసలాలను, భుశుండులను, పాశాలను, దండాలను చేతబట్టి ఉన్నారు. వీపున అమ్ములపొదులను ధరించారు. విచిత్రబాణాలను పట్టి యుద్ధోన్మాదులై యున్నారు. ధ్వజాలు, పతాకలు, ఘంటలు, గొడ్డళ్ళు వారిదగ్గరున్నాయి. మహాపాశాలను చేతులతో ఎత్తిపట్టి ఉన్నారు కొందరు. కొందరు కర్రలను, కొందరు కంబాలను, కొందరు కత్తులను చేతబట్టారు.

కొందరి తలలపై నాగకిరీటాలున్నాయి. కొందరు పెద్దపాములనే అంగదాలుగా ధరించారు. కొందరు చిత్రాభరణాలు ధరించారు. అంతా దుమ్ముకొట్టుకొని కొందరు, బురదపూసికొని కొందరు కనిపిస్తున్నారు. అందరూ తెల్లని వస్త్రాలు ధరించి యున్నారు. కొందరివి నల్లని శరీరాలు, కొందరు పింగళవర్ణులు, కొందరు గడ్డంగీసుకొన్నవారు. బంగారువన్నెగల ఆ పారిషదులు ఉల్లాసంగా భేరులను, శంఖాలను, మృదంగాలను, ఝర్ఝరాలను, ఆనకాలనూ, గోముఖాలనూ మ్రోగించారు. కొందరు పాడుతున్నారు, మరికొందరు నృత్యమాడుతున్నారు. ఆ మహారథులు ఎగురుతూ, దూకుతూ, దాటుతూ వేగంగా పరుగెత్తుతున్నారు. తలవెంట్రుకలే లేనివారు కొందరు. కొందరి కేశాలు గాలికి ఎగురుతున్నాయి. మదించిన పెద్ద ఏనుగులవలె మాటిమాటికీ గర్జిస్తున్నారు. శూలాలు, పట్టిశాలు చేతబట్టినవారు ఘోరరూపాలతో భయంకరంగా ఉన్నారు. వారు వివిధ వర్ణాల వస్త్రాలను, రత్నాలతో చేసిన చిత్ర అంగదాలను ధరించారు. వివిధ మాలలను, లేపనాలను అలంకరించుకొన్నారు. చేతులు పైకెత్తి ఉన్నారు. వారు మొండిగా శత్రువులను చంపగల శూరులు. అసహ్య పరాక్రములు. రక్తాన్ని, వసను త్రాగేవారు. మాంసాన్ని, ప్రేవులను తినేవారు. కొందరు తలలపై శిఖలు పెట్టుకొన్నవారు. కొందరు చెవులలో కర్ణికారాలను అలంకరించుకొన్నవారు. బానపొట్టల వారు కొందరు, మరీపొట్టిగా కొందరు, మరీ పొడవుగా కొందరు. కొందరు వ్రేలాడుతున్నట్టు భీకరంగా ఉన్నారు.

అందరూ హర్షోల్లాసితులే. కొందరు వికటంగా కనిపిస్తున్నారు. కొందరు నల్లని వ్రేలాడే పెదవులతో, కొందరు పెద్దలింగాలతో, అండ కోశాలతో కూడినవారు. రకరకాల విలువైన కిరీటాలతో కొందరు. కొందరు ముండులు, కొందరు జటాధారులు. సూర్యునితో, చంద్రునితో, గ్రహాలతో, నక్షత్రాలతో సహా ఆకాశాన్ని భూమికి దించగలవారు, నాల్గువిధాలయిన ప్రాణి సముదాయాన్ని చంపగలవారు వారు. వారెప్పుడూ భయపడనివారు. పరమశివుని బొమముడిపాటు సహించగలవారు. సదాస్వేచ్ఛగా కార్యాలు నిర్వహించే వారు. త్రిలోకపాలకులను కూడా శాసించగలవారు. నిత్యమూ ఆనందంగా ఉంటారు. మాటను అదుపులో నిలుపుకొంటారు. మాత్సర్యరహితులు. అణిమాదులయిన అష్టైశ్వర్యాలను పొందికూడా గర్వపడనివారు. మనసా, వాచా, కర్మణా వారు నిత్యమూ తనను ఆరాధిస్తుంటే, వారి కర్మలతో పూజ్యుడైన పరమేశ్వరుడు నిత్యమూ విస్మయానికి లోనవుతాడు. మనసా, వాచా, కర్మణా కూడా తన భక్తులైన ఆ గణాలను, కన్నబిడ్డలవలె పరమేశ్వరుడు రక్షిస్తాడు. వారిలో కొందరు వసారక్తాలను త్రాగుతూ, బ్రహ్మద్వేషులపై నిత్యమూ కోపాన్ని ప్రకటిస్తారు. నాలుగురకాలైన సోమాన్ని (అన్నం, సోమరసం, అమృతం, చంద్రకళలు) వారెప్పుడూ త్రాగుతారు. వేదాధ్యయనంతో, బ్రహ్మచర్యంతో, తపస్సుతో, ఇంద్రియ నిగ్రహంతో వారు శివునికి సమర్పించి, శివుని సాయుజ్యాన్ని పొందారు.

పూజ్యుడు, భూత భవిష్య ద్వర్తమానాలకు ప్రభువు అయిన మహేశ్వరుడు, స్వస్వరూపులైన ఆ మహాభూతగణాలతో, పార్వతితో కలిసి యాగభాగాలు భుజిస్తాడు. వివిధవాద్య ధ్వనులతో, నవ్వులతో, సింహనాదాలతో, ఆక్రోశాలతో, గర్జితాలతో ప్రపంచాన్ని భయపెడుతూ, వారు అశ్వత్థామ దగ్గరకు వచ్చారు. భీకరరూపాలూ, తేజస్సు గల ఆ భూతసమూహాలు మహోత్ముడైన అశ్వత్థామ మహిమను పెంపొందింపజేయటానికి పరమేశ్వరుని స్తుతిస్తూ, ఆయన పరాక్రమాన్ని తెలియగోరుతూ, రాత్రివేళ జరగబోయే సంహారాన్ని చూడగోరుతూ, భయంకరాలైన పరిఘలను, కొరివికట్టెలను, శూలాలను, పట్టిశాలను చేతబట్టి, అశ్వత్థామ చుట్టూ నిలిచారు. తమ దర్శనంతో మూడులోకాలకూ భయాన్ని కలిగించగలవారు ఆ పారిషదులు. కానీ మహాబలుడైన అశ్వత్థామ వారిని చూసికూడా వ్యథచెందలేదు. ఆపై అశ్వత్థామ విల్లుచేతబట్టి, ఉడుము చర్మంతో చేసిన చేతితొడుగులను ధరించి, స్వయంగా తనను తాను పరమేశ్వరునకు అర్పించుకొన్నాడు. భారతా! ఆ ఆత్మసమర్పణ యాగంలో ధనుస్సులు సమిధలు. పదునైన బాణాలు పవిత్రాలు. ఆత్మబలసంపన్నుడైన అతని ఆత్మయే హవిస్సు. ఆపై అశ్వత్థామ సౌమ్యమంత్రంతో

తనను తానే ఉపహారంగా అర్పించాడు. ఆ తరువాత రౌద్రకర్మలు చేసే తన స్వభావం నుండి జారిపోని మహాత్ముని - రుద్రుని చేతులు జోడించి స్తుతిస్తూ, ఇలా అన్నాడు.

ఆంగిరసవంశంలో పుట్టిన ఈ శరీరాన్ని ఇప్పుడు అగ్నికి ఆహుతి చేస్తున్నాను. నన్ను బలిగా స్వీకరించు. మహాదేవా! నీమీద నున్న భక్తితో పరిపూర్ణమైన ఏకాగ్రతతో ఈ ఆపత్కాలంలో నీ ముందు సమర్పిస్తున్నాను. నీయందు సర్వప్రాణులూ ఉంటాయి. సర్వప్రాణులలో నీవున్నావు. ప్రధానగుణాలన్నీ కలిసి నీలో ఉన్నాయి. సర్వభూతాలకు ఆశ్రయుడవు నీవు. ప్రభూ! దేవా! నేను హవిస్సుగా నిలిచాను. నేను శత్రువులను గెలవలేకపోతే నన్నే ప్రతిగ్రహించు". అశ్వత్థామ అలా పలికి అగ్నిప్రజ్వలిస్తున్న ఆ వేదిపై నిలిచి, ప్రాణాలపై ప్రేమను వీడి, అగ్నిమధ్యలో కూర్చున్నాడు. చేతులు పైకెత్తి, నిశ్చేష్టంగా హవిస్సు రూపంలో నిలిచిన అశ్వత్థామను చూసి, భగవంతుడైన మహాదేవుడు నవ్వుతూ ఇలా అన్నాడు. "సత్యంతో, శౌచంతో, త్యాగంతో, తపస్సుతో, నియమంతో, సహనంతో, భక్తితో, ధైర్యంతో, బుద్ధితో, మాటతో నన్ను యథావిధిగా ఆరాధించాడు కృష్ణుడు. ఆయన అనాయాసంగా కార్యసాధన చేయగలవాడు కూడా. కాబట్టి నాకు ఆయనయే అందరికన్నా ఇష్టమైన వాడు. మరొకడు లేడు. నాయనా! వారిని గౌరవించాలనీ, నిన్ను పరీక్షించాలనీ నేను పంచాలురను వెంటనే రక్షించాను. ఎన్నో మాయలను కల్పించాను. పాంచాలురను రక్షించి నేను కృష్ణునే సమ్మానించినట్లయింది. కానీ ఇప్పుడు కాలానికి లొంగిపోయారు. వారి కిక జీవితం లేదు." మహాత్ముడైన అశ్వత్థామతో అలాపలికి, పరమేశ్వరుడు తన రూపమైన ఆ అశ్వత్థామలో ప్రవేశించాడు. నిర్మలమైన ఖడ్గాన్ని ఆయన కిచ్చాడు. మహేశుడు అలా ఆవేశించగానే అశ్వత్థామ మరల తేజస్సుతో వెలిగిపోయాడు. దైవదత్తమైన తేజస్సుతో రణభూమిలో వేగవంతుడయ్యాడు. సాక్షాత్తు మహేశ్వరునివలె శత్రుశిబిరంవైపు వెళ్తున్న ఆ అశ్వత్థామను అదృశ్యంగా ఉన్న భూతాలు, రాక్షసులు అనుసరించారు."

8. రాత్రియుద్ధమున పాంచాలాదిసంహారము.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "అశ్వత్థామ ఆ రీతిగా శిబిరం వైపు దూసికొని పోయినప్పుడు కృపుడు, కృతవర్మ భయపీడితులై వెనుదిరగలేదు గదా! క్షుద్రులైన ద్వారరక్షకులు వారిని నిరోధించలేదు గదా! వారినెవరూ గుర్తించలేదా? ఆ మహారథులు ఆ పని సహింపరానిదని భావించి వెనుదిరగలేదు గదా! సంజయా! ఆ రాత్రి శిబిరాన్ని మథించి,

సోమకపాండవులను సంహరించి అశ్వత్థామ తన ప్రతిజ్ఞను సఫలం చేసికొన్నాడా? సంజయా! ఆ వీరులిద్దరూ పాంచాలురచేతిలో చచ్చి, శాశ్వత నిద్రపోలేదు గదా! యుద్ధంలో మరణించి, ఉత్తమమైన దుర్యోధనుని బాటలో వెళ్ళలేదు గదా! వారిద్దరూ పరాక్రమకర్మను ప్రదర్శించారా? అదంతా నాకుచెప్పు."

సంజయుడు చెప్తున్నాడు. "అశ్వత్థామ శిబిరంలోనికి ప్రవేశిస్తున్నపుడు కృపుడు, కృతవర్మ శిబిరద్వారం దగ్గర నిలిచారు. రాజా! ప్రయత్నశీలులైన ఆ మహారథులను చూసి, అశ్వత్థామ ఉల్లాసంగా, మెల్లగా ఇలా అన్నాడు. "మీరు సిద్ధపడితే సర్వశత్రువినాశనం చేయగల వారు. ఇక చావగా మిగిలిన ఈ వీరులను, విశేషించి నిదురిస్తున్న వారిని చంపటమెంత ? నేను శిబిరంలో ప్రవేశిస్తాను. యమునివలె సంచరిస్తాను. ఒక్క మనిషికూడా ప్రాణాలతో బయటపడకూడదు. మీరు దానికి తగినట్లు ప్రవర్తించాలని నా అభిప్రాయం". అలా పలికి అశ్వత్థామ ద్వారంతో సంబంధం లేకుండా ఎగిరి దూకి, పాండవుల శిబిరంలో ప్రవేశించాడు. ప్రాణభయాన్ని విడిచిపెట్టాడు. శిబిరంలోని ప్రాంతాలగురించి తనకు తెలుసు. అందువల్ల మెల్లగా ధృష్టద్యుమ్నుని నివాసస్థానానికి వెళ్ళాడు. వారు రణభూమిలో బలపూర్వకంగా మహాపరాక్రమాన్ని ప్రదర్శించి, అలసిపోయి, విశ్వాసంతో గాఢంగా నిదురిస్తున్నారు. చుట్టూ తమసేన నిలిచి ఉంది. భారతా! ధృష్టద్యుమ్నుని గుడారంలో ప్రవేశించి అశ్వత్థామ, దగ్గరగానే, విలువయిన దుప్పట్లు పరచిన తెల్లని పట్టు పరుపులతో ఏర్పాటుచేసిన పెద్దపక్కపై నిదురిస్తున్న ధృష్టద్యుమ్నుని చూశాడు. ఆ పక్క మంచిపూల మాలలు, చందనం, ధూపాలతో మంచివాసనలు విరజిమ్ముతోంది. రాజా! నిర్భయంగా, స్వేచ్ఛగా శయనించియున్న ఆ మహాత్ముని - ధృష్టద్యుమ్నుని అశ్వత్థామ కాలితో తన్ని మేల్కొలిపాడు.

ఆ కాలితాకిడితో లేచి, ధృష్టద్యుమ్నుడు అశ్వత్థామను గుర్తించాడు. అశ్వత్థామ, పక్కమీద నుండి లేస్తున్న ధృష్టద్యుమ్నుని జుట్టు పట్టుకొని, చేతులతో ఎత్తి, నేలపై పడవేసి నొక్కసాగాడు. బలంగా అశ్వత్థామ నలిపివేయటం వలన, భయం వలన, అప్పుడే నిద్రలేవటం వలన ధృష్టద్యుమ్ను డప్పుడు కదలలేకపోయాడు. అతనిపై బడి కాలితో ఆ ధృష్టద్యుమ్నుని గొంతుమీద, గుండెలమీద, త్రొక్కి పశువును కొట్టినట్టు కొట్టసాగాడు. ధృష్టద్యుమ్నుడు అరుస్తూ ఎగిరిపడసాగాడు. ఆ ధృష్టద్యుమ్నుడు గోళ్ళతో అశ్వత్థామను గీరుతూ "ఆచార్యపుత్రా! నన్ను ఆయుధంతో చంపు. జాగు చేయవద్దు. నీ వలన పుణ్యలోకాలకు వెళతాను" అని అస్పష్టంగా అన్నాడు. పాంచాలరాజకుమారుడు ఆ రీతిగా పలికి అశ్వత్థామ పూర్తిగా ఆక్రమించగా మిన్నకుండిపోయాడు. అస్పష్టంగా వినిపించిన

ఆ ధృష్టద్యుమ్నుని మాట విని అశ్వత్థామ "కులనాశనా! గురువును చంపిన వారికి ఉత్తమ గతులుండవు. కాబట్టి దుర్మతీ! ఆయుధంతో చావటానికి నీకు అర్హతలేదు" అన్నాడు. అలా అంటూనే అశ్వత్థామ కోపంతో భయంకరమైన తన కాలిమడమలతో ఆ వీరుని మర్మస్థానాలలో కొట్టాడు. దెబ్బతింటూ, ఆ వీరుడు చేసిన ఆర్తనాదాలతో, గుడారంలోని స్త్రీలు, అతని రక్షకులు మేల్కొన్నారు. అమానుష పరాక్రమంతో ధృష్టద్యుమ్నుని కొడుతున్న ఆ అశ్వత్థామను చూసి వారు పెనుభూతంగా భావించి, భయంతో నోటమాట లేకుండా పోయారు. రాజా! ఆ ఉపాయంతో ధృష్టద్యుమ్నుని యమసదనానికి పంపి, ఆ అశ్వత్థామ గుడారం నుండి వెలువడి అందమైన తనరథాన్ని ఎక్కాడు.

బలశాలి అయిన అశ్వత్థామ శత్రువుల నందరినీ చంపగోరి, గర్జనలతో దిక్కులను ప్రతిధ్వనింపజేస్తూ, రథంపై శిబిరాల మీదకు దాడికి వెళ్ళాడు. ఆ అశ్వత్థామ నిష్క్రమించగానే, ధృష్టద్యుమ్నుని భార్యలు రక్షకు లందరితో కలిసి ఏడవసాగారు. భారతా! తమరాజు మరణించటం చూసి, తీవ్రశోకానికి లోనైన ధృష్టద్యుమ్నుని సేనలోని క్షత్రియు లందరూ ఆక్రోశించసాగారు. వారి ఆర్తనాదధ్వనులతో దగ్గరలోనున్న క్షత్రియోత్తము లందరూ వెంటనే కవచాలు ధరించి "ఏమిటిది?" అంటూ అడిగారు. రాజా! అశ్వత్థామను చూసి భయపడిన ఆ స్త్రీలు దీన కంఠాలతో "వెంటనే పరుగెత్తండి. రాక్షసుడో, మానవుడో మాకు తెలియదు కానీ, ఆ వ్యక్తి పాంచాలరాజును చంపి, రథమెక్కి నిలిచాడు" అని చెప్పారు. ఆపై ప్రధానయోధు లందరూ వేగంగా అశ్వత్థామను చుట్టుముట్టారు. మీదకు వస్తున్న వారినందరినీ అశ్వత్థామ రుద్రాస్త్రంతో సంహరించాడు. అశ్వత్థామ దగ్గరలోనే పక్కపై నిదురిస్తున్న ఉత్తమౌజుని చూశాడు. ఆ ఉత్తమౌజునిపై కూడా విరుచుకుపడి, కాలితో బలంగా గొంతుపై, గుండెపై త్రొక్కుతూ ధృష్టద్యుమ్నుని చంపినట్టే చంపాడు అశ్వత్థామ. ఉత్తమౌజుడు పెద్దపెట్టున అరుస్తూ మరణించాడు. ఉత్తమౌజుని ఎవడో రాక్షసుడు చంపాడని భావించి, యుధామన్యుడు అక్కడకు వచ్చి, గదనుఎత్తి, వేగంగా అశ్వత్థామ రొమ్ముపై కొట్టాడు. అశ్వత్థామ ఉత్తమౌజునిపైకి దూకి ఆయనను నేలపై పడగొట్టాడు. ఆ పట్టునుండి తప్పించుకొనటానికి ఉత్తమౌజుడు ఎంత గింజుకొంటున్నా పశువును చంపినట్టు ఆయనను చంపివేశాడు.

ఆపై ఇతరులమీదకు వెళ్ళాడు. అప్పుడు వారు గిలగిలలాడుతూ వణికిపోతున్నారు. అయినా, యజ్ఞంలో పశువధ చేస్తున్న పురుషునివలె, అశ్వత్థామ ఆ మహారథులను చంపాడు. ఆపై అశ్వత్థామ కత్తి తీసికొని, ప్రతిభాగంలోనూ విభిన్నమార్గాలలో సంచరిస్తూ

విడివిడిగా అందరినీ చంపాడు. అదే రీతిగా, గుడారంలో పడుకొనిఉన్న ద్వితీయశ్రేణి రక్షకులను చూశాడు. అలసిపోయి, అస్తవ్యస్తంగా ఆయుధాలు పడవేసి నిదురిస్తున్న వారినందరినీ క్షణంలో సంహరించాడు. ఆ మంచికత్తితో అశ్వత్థామ సైనికులను, గుర్రాలను, ఏనుగులను నరికివేశాడు. ఒళ్ళంతా నెత్తుట తడిసి కాలప్రేరితుడైన యమునివలె కనిపించాడు. చచ్చిపోతున్న వారి కాళ్ళు, చేతులు ఎగిరిపడుతున్నందు వలన, కత్తినెత్తినందువలన, కత్తిని అన్నివైపులకూ విసిరినందు వలన - మూడు రకాలుగా అశ్వత్థామ నెత్తుటితో తడిశాడు. నెత్తుటితో అశ్వత్థామ ఎర్రబడ్డాడు. పోరాటంలో కత్తి మిలమిల మెరుస్తోంది. పరమభీకరమైన ఆ అశ్వత్థామ ఆకారం అమానుషంగా భాసిస్తోంది. కౌరవ్యా! మేలుకొని ఉన్న సైనికులు కూడా ఆ హడావుడిలో కర్తవ్యమూఢులయ్యారు. ఒకరివైపు ఒకరు చూసికొంటూ, వారు అశ్వత్థామను చూసి, వ్యథ చెందారు. శత్రుసూదనులైన ఆ క్షత్రియులు ఆ అశ్వత్థామ రూపాన్ని చూసి, రాక్షసునిగా భావించి కళ్ళుమూసుకొన్నారు. ఆపై ఆ అశ్వత్థామ భీకరరూపంతో యమునివలె ఆ శిబిరంలో సంచరించాడు. ఇంకా మిగిలియున్న సోమకులను, ద్రౌపది కొడుకులను చూశాడు. రాజా! ధృష్టద్యుమ్నుడు చనిపోయాడని విని, ద్రౌపది కొడుకు లయిదుగురు, ఆ కోలాహలానికి భయపడి, ధనుస్సులు చేతబట్టి నిలిచారు. నిర్భయంగా అశ్వత్థామపై బాణవృష్టిని కురిపించారు. ఆపై ఆ చప్పుడుతో మేలుకొన్న ప్రభద్రకులు, శిఖండి కూడా బాణాలతో అశ్వత్థామను పీడించారు. వారిని చూసి, భారద్వాజుడు ఆ మహారథులను చంపగోరి, పెద్దపెట్టున సింహనాదం చేశారు. ఆపై తండ్రివధను తలచుకొంటూ, తీవ్రకోపంతో రథాసనంనుండి దిగి, త్వరపడుతూ నిర్మలంగా ఉన్న డాలును, నిర్మలమైన దివ్య సువర్ణఖడ్గాన్ని తీసికొని, రణభూమిలో దాడిచేశాడు.

ద్రౌపది కొడుకులపైకురికి ఆ బలశాలి వారిని కత్తితో ధ్వంసం చేశాడు. రాజా! ఆపై ఆ నరోత్తముడు ప్రతివింధ్యుని పొట్టలో కొట్టాడు. అతడు చచ్చి నేలగూలాడు. సుతసోముడు ప్రాసంతో అశ్వత్థామను గాయపరిచి, మరల కత్తినెత్తి అశ్వత్థామపై దాడిచేశాడు. నరర్షభా! కత్తితో సహా ఆ సుతసోముని చేతిని నరికి, అశ్వత్థామ మరల ప్రక్కటెముకపై కొట్టాడు. గుండె బ్రద్దలై అతడు పడిపోయాడు. నకులుని కొడుకు, శతానీకుడు చేతులతో రథచక్రాన్ని ఎత్తి, వేగంగా అశ్వత్థామ రొమ్ముపై కొట్టాడు. శతానీకుడు చక్రాన్ని విడువగానే, అశ్వత్థామ అతనిని కొట్టాడు. అతడు కలతతో నేలబడ్డాడు. ఇంతలోనే అతని తలను నరికివేశాడు. శ్రుతకర్మ పరిఘను తీసికొని, అశ్వత్థామపై దాడిచేశాడు. డాలు పట్టి ఉన్న అతని ఎడమ చేతిపై తీవ్రంగా దాడిచేశాడు. ఆ అశ్వత్థామ కత్తితో శ్రుతకర్మ ముఖంపై

కొట్టాడు. ఆ శ్రుతకర్మ దెబ్బతిని, చైతన్యహీనుడై భూమిపై పడిపోయాడు. ముఖం వికృతంగా కనిపించింది. ఆ కోలాహలాన్ని విని, శ్రుతకీర్తి అశ్వత్థామ దగ్గరకు వచ్చి, ఆయనపై శరవృష్టిని కురిపించాడు. ఆ శ్రుతకీర్తి కురిపించిన బాణవర్షాన్ని కూడా అశ్వత్థామ డాలుతో నివారించి, కుండలాలతో ప్రకాశిస్తున్న అతని తలను శరీరం నుండి వేరు చేశాడు.

శిఖండి ప్రభద్రకులందరితో సహా, అనేకాయుధాలతో అశ్వత్థామను హింసించసాగాడు. మరొకబాణంతో అశ్వత్థామ కనుబొమల మధ్య గాయపరిచాడు. ఆ అశ్వత్థామ క్రోధావేశంతో శిఖండి మీదకు వచ్చి, తన కత్తితో అతనిని రెండుముక్కలుగా నరికాడు. అశ్వత్థామ క్రోధావేశంతో అలా శిఖండిని చంపి, ప్రభద్రకసేనలన్నింటిపై వేగంగా దాడిచేశాడు. విరాటసేనలో మిగిలియున్న వారిపై కూడా దాడికి దిగాడు. ద్రుపదుని పుత్రులను, పౌత్రులను, మిత్రులను వెదకి వెదకి సంహరించాడు అశ్వత్థామ. అశ్వత్థామ ఇతరేతర పురుషులను కూడా తరిమి తరిమి కత్తితో నరికాడు. అప్పుడు పాండవసేనలు రూపుకట్టిన కాలరాత్రిని చూశాయి. ఆమె కన్నులు, ముఖం ఎర్రగా ఉన్నాయి. ఎర్రని మాలలను, చందనాన్ని ధరించింది. ఎర్రటి వలువలు దాల్చించి. పాశాలు చేతబట్టి ,సాటిలేని రీతిగా కనబడుతోంది. ఆమె సఖులుకూడా వెంటనున్నారు. గీతాలు పాడుకొంటూ భీకరపాశాలతో మనుష్యులను, గుర్రాలను, ఏనుగులను బంధించి తీసికొనిపోతోంది. రాజా! మారిషా! అది వెంట్రుకలు లేని వివిధప్రేతాలను, పాశాలతో బంధించి తీసికొనిపోతోంది. అదే రీతిగా ఆయుధాలు వీడి నిదురిస్తున్న మహారథులను కొనిపోతూ, ఆ ప్రముఖ యోధులకు ఇతర రాత్రులలో కూడా కలలలో కనిపించింది. శత్రుసంహారం చేస్తున్న అశ్వత్థామ కూడా సర్వదా వారికి కలలలో కనిపించేవాడు. కురుపాండవసేనల మధ్య యుద్ధం ప్రారంభమైన నాటి నుండి, వారు కన్యారూపంలోని ఆ కాలరాత్రిని, అశ్వత్థామను కలలలో చూస్తూనే ఉన్నారు. వారు ముందే దైవోపహతులు. ఆ తరువాత అశ్వత్థామ సర్వప్రాణులనూ భయపెడుతూ, భీకర సింహనాదాలు చేస్తూ వారిని చంపాడు. దైవపీడితులైన ఆ వీరులు అంతకుముందు తాము కలలో చూసినదానిని తలచుకొని "అదే ఇది" అని భావించారు.

ఆ కోలాహలంతో పాండవుల శిబిరంలోని విలుకాండ్రు వందలు, వేలమంది నిదురలేచారు. కాలం రెచ్చగొట్టిన యమునివలె, అశ్వత్థామ కొందరి కాళ్ళు నరికాడు. కొందరి నడుములు విరగగొట్టాడు. కొందరి ప్రక్కటెముకలు బ్రద్దలు చేశాడు. రాజా!

భయంకరంగా కాలరాయబడిన వీరులు పెడబొబ్బలుపెడుతూ గోలచేస్తున్నారు. ఏనుగులు, గుర్రాలు కొందరిని త్రొక్కాయి. రణభూమి వారందరితో వ్యాపించి ఉంది. "ఏమిటిది ? ఎవరితను? ఈ శబ్దమేమిటి ? ఏం జరుగుతోంది. అని ఆక్రోశిస్తున్న ఆ వీరుల పాలిటికి అశ్వత్థామ యముడే అయ్యాడు. ఆయుధాలను, కవచాలను వీడి నిదురిస్తూ, మధ్యలో లేచి కవచాలు ధరించిన పాండవులను, సృంజయులను, మేటి పోటుగాడైన అశ్వత్థామ మృత్యులోకానికి పంపించాడు. ఆపై కళ్లు మూసికొని, చైతన్యహీనులై నిదురిస్తున్న వీరులు ఆ శబ్దానికి ఉలిక్కిపడి లేచి, మరల భయంతో కలతపడి ఎక్కడికక్కడ దాక్కొన్నారు. తొడలు మొద్దుబారి కదలలేనిస్థితి, కలవరపాటుతో బలోత్సాహాలు నశించాయి. తీవ్రభయంతో పెడబొబ్బలు పెడుతూ ఒకరినొకరు కౌగిలించుకొంటున్నారు. ఆపై అశ్వత్థామ భీకరంగా ధ్వనించే తన రథాన్ని ఎక్కి, విల్లు చేతబట్టి బాణాలతో ఇతర వీరులను యమసదనానికి పంపించాడు. తన మీదకు రాదలచిన నరోత్తములైన ఇతర శూరులను కూడా, అశ్వత్థామ దూరం నుండియే చంపి కాలరాత్రికి నివేదించాడు.

అలాగే అశ్వత్థామ తన రథంముందు భాగాన నిలిచి, శత్రువుల వైపు పరుగెత్తి, వివిధ శరాల వానలను కురిపించాడు. రాజేంద్రా! ఆ విధంగా అశ్వత్థామ పాండవశిబిరాన్ని కలయత్రొక్కాడు. రాజా! అచేతనులై నిద్రిస్తున్న ఆ యోధులందరూ ఆ శబ్దంతో ఉలిక్కిపడి లేచి, భయంతో దీనంగా అటూ ఇటూ పరుగెత్తసాగారు. గొంతుపెగలకుండా కొందరు ఆక్రోశించసాగారు. కొందరు అసంబద్ధంగా ఏవేవో మాటాడుతున్నారు. వారు తమ ఆయుధాలను కానీ, వస్త్రాలను కానీ అసలు పట్టించుకోలేదు. కొందరు జుట్టు విరబోసుకొని పరుగెత్తుతున్నారు. ఒకరినొకరు గుర్తించటం లేదు. అప్పుడు కొందరు పడుతూ, లేస్తూ అక్కడ తిరగసాగారు. రాజేంద్రా! కొందరు మలవిసర్జన చేశారు. కొందరు మూత్రవిసర్జన చేశారు. కొన్ని గుర్రాలు, ఏనుగులు కట్లు త్రెంపుకొని, మహావ్యాకులపాటును కలిగిస్తూ పరుగెత్తాయి. అక్కడ కొందరు మనుషులు భయపడి నేలను హత్తుకొని పడిఉన్నారు. అలా పడిఉన్న వారిని ఏనుగులు, గుర్రాలు త్రొక్కుతున్నాయి. ఆ రీతిగా ఆ సంహారం సాగుతుంటే రాక్షసులు పరమోల్లాసంతో పెద్దపెద్దగా అరవసాగారు. ఆనందంతో నిండిన ఆ భూతసమూహాల మహాకోలాహల ధ్వని అన్ని దిక్కులలో ప్రతిధ్వనింపసాగింది.

ఆ సేనల ఆర్తనాదాలను విని, బెదరిన ఏనుగులు, గుర్రాలు కట్లు త్రెంచుకొని, శిబిరంలోని జనులను త్రొక్కుకొంటూ అంతటా పరుగెత్తసాగాయి. ఆ శిబిరంలో అవి

ఆలా పరుగెత్తుతుంటే దుమ్ము పైకి లేచింది. దానితో ఆ రాత్రివేళ చీకటి రెట్టింపు ఆయింది. అలా చీకటి రెట్టింపుకాగానే జను లందరూ వ్యామోహంలో పడిపోయారు. తండ్రులు కొడుకులను, సోదరులు సోదరులను గుర్తించటం లేదు. భారతా! ఏనుగులు ఏనుగులను, రౌతులులేని గుర్రాలు గుర్రాలను ఆక్రమించి, గాయంచేస్తున్నాయి. భంగపరుస్తున్నాయి. అలాగే త్రొక్కివేస్తున్నాయి. ఒకదానినొకటి కొట్టుకొంటూ గాయపడిన ఏనుగులు, గుర్రాలు కూడా పడిపోతున్నాయి. కొన్నింటిని పడగొడుతున్నాయి. త్రొక్కుతున్నాయి. అక్కడ మనుష్యులు నిద్రమత్తులో ఉన్నారు. చీకటి క్రమ్మివేసింది. దానితో అక్కడ కాలప్రేరణతో తమవారిమీద తామే దాడిచేసి చంపుతున్నారు. ద్వారపాలకులు ద్వారాలను వీడి, శిబిరరక్షకులు శిబిరాలను వీడి శక్తికొద్దీ పారిపోతున్నారు. ఎటుపరుగెత్తేదీ తెలియకుండా పరుగెత్తుతున్నారు. రాజా! పారిపోతున్న వారికి ఒకరికొకరు తెలియటం లేదు. దైవవశాన బుద్ధి నశించింది. "తండ్రీ! బిడ్డ" అని అరుస్తూ పరుగెత్తుతున్నారు. తమ బంధువులను సైతం వీడి దిక్కులుపట్టి పారిపోతున్నారు. ఆ సమయంలో గోత్రాలతో, పేర్లతో ఒకరి నొకరు పిలుచుకొంటున్నారు. కొందరు హాహాకారాలు చేస్తూ నేలపై పడిపోయారు. రణమత్తుడైన అశ్వత్థామ వారిని గుర్తించి సంహరించాడు.

మరికొందరు క్షత్రియులు పదేపదే దెబ్బతింటూ నిశ్చేష్టులై, భయపీడితులై శిబిరం నుండి బయటపడి పోతున్నారు. భయపడి బ్రతుకుమీది ఆశతో శిబిరంనుండి బయటకు వస్తున్న వారిని కృతవర్మ, కృపుడు ద్వారం దగ్గర చంపివేశారు. ఆ సైనికుల యంత్రాలు, కవచాలు జారిపోయాయి. జుట్టు విరగబడింది. చేతులు జోడించి, భయంతో వణుకుతూ, నేలగూలారు. కానీ కృతవర్మ, కృపుడు ఎవ్వరినీ వదలలేదు. శిబిరం నుండి వెలుపలికి వచ్చిన వాడొక్కడూ వారి చేతినుండి తప్పించుకొనలేదు. కృపుడు, కృతవర్మ అశ్వత్థామకు ఇంకా ప్రియం కలిగించాలని భావించి ఆ శిబిరంలో మూడు చోట్ల నిప్పు ముట్టించారు. దానితో శిబిరంలో వెలుగు జిమ్మింది. తండ్రికి ఆనందాన్ని కలిగించాలని అశ్వత్థామ కత్తి చేతబట్టి, సిద్ధహస్తునివలె సంచరించసాగాడు. కొందరు వీరులు మీదకు వస్తున్నారు. మరికొందరు పారిపోతున్నారు. ద్విజవరులలో శ్రేష్ఠుడైన అశ్వత్థామ వారినందరినీ కత్తితో ప్రాణాలనుండి విడదీశాడు. అశ్వత్థామ కొంతమంది యోధులను, కోపంతో, నువ్వుకాడలనువలె, కత్తితో మధ్యకు నరికి పడవేశాడు. భరతర్షభా! తీవ్రంగా గాయపడి, నేలబడి పెడబొబ్బలు పెడుతున్న నరులు, గుర్రాలు, మేటి ఏనుగులతో రణభూమి నిండిపోయింది. వేలకొలది మనుష్యులు చచ్చి పడిపోయారు. వారిలో చాలామంది కబంధాలు

(మొండెములు) లేచి నిలిచి, మరల పడిపోతున్నాయి. భారతా! ఆయుధాలతో, అంగదాలతో సహా బాహువులను, తలలను, ఏనుగుతొండాలవంటి తొడలను, చేతులను, కాళ్ళను అశ్వత్థామ ఖండించాడు.

మహాత్ముడైన అశ్వత్థామ కొందరి వీపులు, కొందరి ప్రక్కటెముకలు, మరికొందరి తలలు నరికివేశాడు. మరి కొందరిని తరిమికొట్టాడు. కొందరు మనుష్యుల నడుములు విరిచాడు. మరి కొందరు చెవులు నరికాడు. మరికొందరి గొంతుల మీద కొట్టి, తలలను శరీరంలోనికి చొప్పించాడు. ఆ రీతిగా సంచరిస్తూ లెక్కలేనంతమంది నరులను చంపుతున్నాడు అశ్వత్థామ. కొందరు పురుషులు ఇంకా కొన ఊపిరితో ఉన్నారు. వేలకొలదిగా ఇతరులు చనిపోయారు. ఎన్నో ఏనుగులు, గుర్రాలు చచ్చిపడి ఉన్నాయి. వాటితో భూమి భయంకరంగా కనిపించింది. యక్షులు, రాక్షసులతో నిండి, రథాలు, గుర్రాలు, ఏనుగులతో దారుణంగా ఉన్న ఆ రణభూమిపై, కోపించిన అశ్వత్థామచేత నరకబడి ఎందరో నేలగూలారు. కొందరు సోదరులను కొందరు తండ్రులను, మరికొందరు పుత్రులనూ పిలుస్తూ అరుస్తున్నారు. కొంద రిలా అన్నారు. "క్రూరకర్ములైన రాక్షసులు నిదురిస్తున్న మనలను సంహరిస్తున్నారు. క్రుద్ధులైన ధార్తరాష్ట్రులు కూడా రణభూమిలో ఇటువంటి పని చేయలేదు. పాండవులు ఇక్కడ లేనందువలన మనకు ఇటువంటి యుద్ధం ఏర్పడింది. బ్రాహ్మణభక్తుడు, సత్యవచనుడు, జితేంద్రియుడు, సర్వభూతాలపై దయగలవాడు అర్జునుడు. ఆయనకు జనార్దనుడు రక్షకుడు. ఆ కొంతేయుని అసురులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు కూడా గెలవలేరు. అర్జునుడు నిదురిస్తున్న వానిని కానీ, ఏమరుపాటులోనున్న వానిని కానీ, ఆయుధాలు వీడినవానిని కానీ, చేతులు జోడించినవానిని కానీ, పారిపోతున్న వానిని కానీ, జుట్టు విరగబడినవానిని కానీ చంపడు. కానీ క్రూరకర్ములైన రాక్షసులు ఇటువంటి ఘోరకృత్యం చేస్తున్నారు." అని ప్రలాపిస్తూ అనేకులు పడిఉన్నారు.

కొందరు గర్జిస్తున్నారు. కొందరు విలపిస్తున్నారు. ఆ భీకర కోలాహల ధ్వని ముహూర్తకాలంలో అణగిపోయింది. భీకరంగా వ్యాపించిన ఆ దుమ్ము కూడా, నెత్తుట తడిసిన నేలపై క్షణకాలంలో అదృశ్యమైంది. రుద్రుడు ప్రాణులను చంపినట్లు, ఆ అశ్వత్థామ వేలకొలదిగ మనుష్యులను చంపాడు. వారు ప్రాణరక్షణకై ప్రయత్నిస్తూ, కలతపడి, నిరుత్సాహంగా నిలిచినవారు. ఒకరినొకరు కౌగిలించుకొని పడుకొన్నవారు కొందరు. పారిపోతున్నవారు కొందరు. కొందరు దాగారు. కొందరు పోరాడుతున్నారు. అశ్వత్థామ వారినందరినీ సంహరించాడు. ఒకవైపు అగ్ని తగలబెడుతోంది. మరొకవైపు అశ్వత్థామ

చంపుతున్నాడు. అప్పుడు ఆ యోధులే ఒకరినొకరు యమసదనానికి పంపుతున్నారు. రాజేంద్రా! ఆ పాండవ మహాసేనను, ఆ రాత్రి అర్ధభాగంలోనే అశ్వత్థామ యమసదనానికి పంపగలిగాడు. నిశాచరులైన ప్రాణులకు ఆ రాత్రి ఆనందాన్ని పెంపొందించింది. మనుష్యులకు, ఏనుగులకు, గుర్రాలకు మహా రౌద్రంగా వినాశకమయింది. అక్కడ రాక్షసులు, రకరకాల పిశాచాలు నరమాంసం తింటూ, నెత్తురు త్రాగుతూ కనిపించాయి. ఆ పిశాచాలు గోధుమరంగుతో, కొండలవంటి దంతాలతో, జడలతో, పొడవైన తలలతో, అయిదు కాళ్ళతో, పెద్ద పొట్టలతో, దుమ్ముకొట్టుకొని భయంకరంగా ఉన్నాయి.

అక్కడి రాక్షసులు వివిధ రూపాలతో కనిపిస్తున్నారు. కొందరి వ్రేళ్ళు వెనుదిరిగి ఉన్నాయి. క్రూరంగా, కురూపాలతో భీకరంగా అరుస్తున్నారు. కొందరు ఘంటల మాలలు ధరించారు. కొందరి కంఠాలు నల్లగా, భయంకరంగా ఉన్నాయి. భార్యలతో పిల్లలతో కలిసి ఉన్నారు. క్రౌర్యంతో, చూడటానికి వీలుకాని రీతిలో, దయారహితులై వారున్నారు. కొందరు నెత్తురుత్రాగి, ఉల్లాసంగా ఉన్నారు. కొందరు గుంపులుగా నృత్యం చేస్తున్నారు. "ఇది గొప్పది. ఇది శుభ్రంగా ఉంది. ఇది రుచిగా ఉంది" అని మాటాడుకొంటున్నారు. క్రొవ్వు, ఎముకలలోని గుజ్జు, ఎముకలు, రక్తం, వస బాగా తినే మాంసజీవులైన రాక్షసులు, క్రూరజంతువులు ఇతరుల మాంసాన్ని తింటున్నాయి. పొట్టలేని కొందరు రాక్షసులు కరిగిన క్రొవ్వును త్రాగి పరుగులు తీస్తున్నారు. పచ్చి మాంసం తినే ఆ రాక్షసులు వివిధ ముఖాలతో భీకరంగా ఉన్నారు. రాజా! ఆ మహాజన వినాశనంలో తృప్తిపడి ఆనందించిన రాక్షస గణాలు అక్కడ చాలా ప్రోగయ్యాయి. ఘోర రూపాలు ధరించి, క్రూరకర్మలు చేసే ఆ గణాలలో కొన్నింటిలో పదివేలమంది, కొన్నింటిలో లక్షమంది, మరికొన్నింటిలో పది లక్షలమంది రాక్షసులున్నారు.

ప్రత్యూషవేళలో శిబిరంలో నుండి నిష్క్రమించదలచాడు అశ్వత్థామ. రాజా! అశ్వత్థామ మానవరక్తంతో తడిసి ఉన్నాడు. కత్తిపిడి కూడా నెత్తుటితో తడిసి, చేతితో కలిసిపోయి శరీరంలోని భాగమే అన్నట్లుంది. జనసంహారం చేసి, దుర్గమమైన తన లక్ష్యాన్ని సాధించిన అశ్వత్థామ, ప్రళయకాలంలో సర్వప్రాణులనూ బూడిదచేసిన అగ్నివలె విరాజిల్లాడు. రాజా! అశ్వత్థామ తన తండ్రివలె దుర్గమమైన మార్గాన్ని అనుసరించి, ప్రతిజ్ఞ చేసినట్లు లక్ష్యాన్ని సాధించి, విచారంలోనుండి బయటపడ్డాడు. ఆ నరోత్తముడు జనమంతా నిదురిస్తున్న శిబిరంలో ఆ రాత్రి ప్రవేశించినట్లే, అందరిని చంపినతరువాత నిశ్శబ్దంగా నిష్క్రమించాడు. రాజా! అశ్వత్థామ శిబిరం నుండి నిష్క్రమించి, ఆ

కృపకృతవర్మలను కలిసి, ఉల్లాసంగా వారికి ఆనందాన్నిస్తూ, తాను చేసిన ఆ పనినంతా వివరంగా చెప్పాడు. అప్పుడు అశ్వత్థామకు ప్రియాన్ని కల్గించిన ఆ ఇద్దరు కూడా తాము వేలకొలదిగ పంచాలురను, సృంజయులను చంపిన ప్రియ విషయాన్ని చెప్పారు. ఆనందంతో ఆ ముగ్గురూ పెద్దగా గర్జించారు. చప్పట్లు కొట్టారు. ఈ రీతిగా ఆ రాత్రి, ఏమరుపాటుగా నిదురించిన సోమకుల పాలిటికి అత్యంతమూ భయంకరమైంది. మన జనాన్ని నశింపజేసిన వారందరూ ఆ రీతిగా చనిపోయారంటే, కాలగతిని ఎవరూ అతిక్రమించలేరనటంలో సందేహం లేదు."

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "నా కుమారుని గెలుపుకోసమై గట్టిపట్టుతో ఉన్న అశ్వత్థామ ఇటువంటి మహాకర్మను అంతకుముందే ఎందుకు చేయలేదు ? పైపెచ్చు దుర్యోధనుడు దెబ్బతిన్న తరువాత, మహాత్ముడైన ఆ అశ్వత్థామ ఇటువంటి నీచ కృత్యాన్ని ఎందుకు చేశాడు?" సంజయుడు చెప్తున్నాడు. "కురునందనా! పాండవులకు భయపడి, ఆ పని చేయలేదన్నది నిశ్చయం. పాండవులు, ధీమంతుడైన కృష్ణుడు, సాత్యకి లేనివేళలో అశ్వత్థామ ఈ పని సాధించాడు. రాజా! పాండవుల సమక్షంలో వారిని చంపగలవా డెవడు? సాక్షాత్తు దేవేంద్రుడైనా సరే! ప్రభూ! వారంతా నిదురిస్తున్న వేళ ఈ ఘటన ఇలా జరిగింది. ఆపై పాండవులకు మహా వినాశనమైన జనసంహారాన్ని చేసి ఆ మహారథులు కలిసి "ఇదంతా అదృష్టం కొద్దీ జరిగింది" అని ఒకరితో ఒకరు చెప్పుకొనసాగారు. ఆపై వారి అభినందనల నంది, అశ్వత్థామ వారిని కౌగిలించుకొని, ఆనందంతో మహత్వపూర్ణమైన ఈ ఉత్తమ వాక్యాన్ని చెప్పసాగాడు. "పంచాలురందరూ చనిపోయారు. ద్రౌపది కొడుకులు, సోమకులు, మత్స్యసేనలలో మిగిలినవారు - అందరినీ నేను చంపాను. ఇప్పుడు కృతకృత్యులమయ్యాం. ఆలస్యం చేయకుండా అక్కడికే వెళదాం. మన రాజు బ్రతికిఉంటే ఆయనకు మనం చెపుదాం".

9. దుర్యోధన ప్రాణత్యాగము.

సంజయుడిలా చెప్తున్నాడు. "ఆ ముగ్గురూ సర్వపాంచాలురనూ, ద్రౌపది కొడుకులందరినీ చంపి, ఒక్కటై దుర్యోధనుడు పడి ఉన్న తావుకు వచ్చారు. కొన ఊపిరితో ఉన్న దుర్యోధనుని చూశారు. వెంటనే రథాలనుండి దిగి, నీ కొడుకు చుట్టూ చేరారు. రాజేంద్రా! దుర్యోధనుని తొడలు విరిగి ఉన్నాయి. కష్టం మీద ఊపిరితీస్తున్నాడు. అచేతనంగా పడి ఉన్నాడు. నోటినుండి నేలమీదకు నెత్తురు కారుతోంది. భీకరంగా

కనిపిస్తున్న అనేక క్రూరజంతువులు, కుక్కల గుంపులు ఆయనను తినబోతూ నాలుగువైపుల దగ్గరగా నిలిచిఉన్నాయి. తనను తినగోరుతున్న ఆ క్రూరజంతువులను ఎంతో కష్టంమీద నివారిస్తూ, తీవ్రవేదనతో నేలపై పొర్లుతున్నాడు. నేలమీద ఆ రీతిగా పడి, నెత్తురోడుతున్న ఆ దుర్యోధనుని చూసి, చావునుండి తప్పించుకొన్న ముగ్గురు వీరులు - అశ్వత్థామ, కృపుడు, కృతవర్మ శోకార్తులై చుట్టూ కూర్చున్నారు. నెత్తుటిరంగు పులుముకొన్న ఆ ముగ్గురు మహారథులు నిట్టూరుస్తూ చుట్టూ నిలువగా, ఆ దుర్యోధనుడు మూడు అగ్నులు చుట్టూ ఉన్న వేదివలె శోభించాడు. తనకు తగని రీతిగా ఆలా పడుకొనిఉన్న ఆ రాజును చూసి, సహింపరాని దుఃఖంతో ఆ ముగ్గురూ రోదించారు. ఆపై రణభూమిలో శయనించిఉన్న ఆ రాజు నోటినుండి కారుతున్న నెత్తుటిని తమ చేతులతో తుడిచి, వారు దీనంగా విలపించారు.

కృపుడిలా అన్నాడు. "దైవానికి అసాధ్యమంటూ ఏదీ లేదు. కాకపోతే పదుకొండు అక్షౌహిణులకు ప్రభువైన దుర్యోధనుడు దెబ్బతిని పడిపోతాడా? చూడండి. సుయోధనుడు గద నిష్టపడేవాడు. బంగారువన్నెగల ఈ దుర్యోధనుని సువర్ణభూషితమైన గద ప్రక్కనే నేలపై పడి ఉంది. ఈ శూరుని ఈ గద ఏ యుద్ధంలోనూ విడివడలేదు. ఈ యశస్వి స్వర్గానికి వెళ్తున్న సమయంలో కూడా ప్రక్కనే నిలిచింది. సువర్ణభూషితమైన ఈ గదను చూడండి. అంతఃపురంలో అనురాగవతి అయిన భార్య శయనంలో ప్రక్కనే ఉన్నట్లు, ఈ వీరుని ప్రక్కనే ఉంది. ఈ దుర్యోధనుడు పట్టాభిషిక్తులైన రాజులలో అగ్రగామిగా ఉండేవాడు. తానే ఇప్పుడు నేలబడి దుమ్ము కరుస్తున్నాడు. కాల మెలా తిరుగుతుందో చూడండి. గతంలో ఈ రాజు చేత చచ్చి ఎందరో శత్రువులు నేలగూలి పడుకొన్నారు. ఆ కురురాజు ఇప్పుడు శత్రువుల చేత దెబ్బతిని నేలపై పడిఉన్నాడు. వందలకొలది రాజులు భయంతో, దుర్యోధనుని ముందు తలవంచేవారు. ఆయన నేడు క్రూర జంతువులు చుట్టుముట్టగా వీరశయ్యపై పడుకొన్నాడు. గతంలో ధనంకోసం బ్రాహ్మణులు ఈ రాజును సేవించేవారు. ఇప్పుడు మాంసంకోసం క్రూరజంతువులు ఆయనను సేవిస్తున్నాయి."

సంజయుడిలా చెప్తున్నాడు. "భరతసత్తమా! ఆపై పడియున్న కురుశ్రేష్ఠుని చూసి అశ్వత్థామ దీనంగా ఏడవసాగాడు. "రాజశార్దూలా! విలుకాండ్రు అందరిలో నీవు ముఖ్యుడ వంటారు. నీవు యుద్ధంలో కుబేరసమానుడవు. బలరాముని శిష్యుడవు. అయినా భీమసేనుడు నీలో ఎలా లోపాన్ని (అవకాశాన్ని) చూడగలిగాడు? నీవు బలవంతుడవు, నేర్పరివి, నిత్యాభ్యాసివి. రాజా! ఆ పాపాత్ము డెలా దెబ్బకొట్టగలిగాడు ? మహారాజా!

ఈ లోకంలో కాలమే నిజంగా బలవత్తరం. భీమసేనునితో పోరాడుతూ దెబ్బతిన్న నిన్ను ఇలా చూస్తామా? సర్వధర్మవేత్తవైన నిన్ను, క్షుద్రుడు, పాపాత్ముడు అయిన వృకోదరుడు బుద్ధిహీనుడై వంచనతో చంపుతాడా? కాలాన్ని అతిక్రమించలేమనటం వాస్తవమే. భీమసేనుడు ధర్మయుద్ధానికి నిన్ను ఆహ్వానించి, రణభూమిలో అధర్మబలంతో, గదతో నీ తొడలు బ్రద్దలు చేశాడు. రణభూమిలో అధర్మంగా చంపి, కాలితో తలను త్రొక్కుతున్నా చూస్తూ ఊరుకొన్నారు కృష్ణుడు, యుధిష్ఠిరుడు, ఛీ! ఛీ! అసహ్యం వేస్తోంది. నిన్ను భీముడు వంచనతో పడగొట్టాడు. కాబట్టి ప్రాణులున్నంతవరకు యోధులు యుద్ధవిషయంలో భీముని తప్పక తప్పుపడతారు. బలరాముడు "గదాయుద్ధంలో దుర్యోధనునితో సమానమైనవాడు లే"డని నీ గురించి చెప్తుంటాడు. రాజసభలలో బలరాముడు "గదాయుద్ధంలో దుర్యోధనుడు నా శిష్యుడు" అని నిన్ను ప్రశంసిస్తుంటాడు. పరమమహర్షులు యుద్ధంలో ఎదురునిలిచి చనిపోవటమే క్షత్రియునకు ప్రశస్తమైన గతి అని చెప్పారు. నీవా గతినే పొందావు.

పురుషర్షభా! నీ గురించి నేను బాధపడటం లేదు. పుత్రులను పోగొట్టుకొన్న గాంధారిని గురించి, నీ తండ్రి గురించి బాధపడుతున్నాను. వారు బాధతో భిక్షుకులై ఈ నేలపై తిరుగుతారేమో! వృష్ణివంశస్థుడైన కృష్ణునీ, దుర్బుద్ధి అయిన అర్జునుని నిందిస్తున్నాను. వారు తమను తాము ధర్మజ్ఞులనుకొంటూ కూడా నిన్ను (అధర్మంగా) చంపుతుంటే ఉపేక్షించారు. రాజా! ఆ పాండవులందరూ కూడా "దుర్యోధనుని మేము చంపా"మని సిగ్గులేకుండా ఎలా చెప్పుకొంటారు. గాంధారీతనయా! నీవు ధన్యుడవు. దాదాపుగా ధర్మపూర్వకంగానే శత్రువుల నెదిరిస్తూ యుద్ధంలో చనిపోయావు. పుత్రులను కోల్పోయి, జ్ఞాతులు, బంధువులు మరణించగా గాంధారి ఏ స్థితిని పొందుతుందో ! దుర్జయుడు, ప్రజ్ఞానేత్రుడు అయిన ధృతరాష్ట్రుడు ఏ దశకు చేరుతాడో! కృతవర్మ, నేను, మహారథుడైన కృపుడు నిందింపదగిన వారమే! రాజును నిన్ను ముందు నిలుపుకొని స్వర్గానికి వెళ్ళలేకపోతున్నాం. నీవు కోరికల నన్నింటినీ తీర్చేవాడవు. ప్రజాహితాన్ని కాపాడేవాడవు. అటువంటి నిన్ను మేము అనుసరించలేకపోతున్నాం. నరాధములమైన మమ్ము నిందించాలి. నీ పరాక్రమంవలననే కృపునకు, నాకు, మా తండ్రికి, మా సేవకులకు కూడా రత్నాలతో నిండిన ఇళ్ళు లభించాయి. నీ అనుగ్రహంవలననే మిత్రులతో, బంధువులతో సహా మేము భూరిదక్షిణలతో అనేక ప్రధానయజ్ఞాలను చేయగలిగాం.

ఏ భావంతో నీవు సమస్త నరపాలురను ముందుంచుకొని, స్వర్గానికి వెళ్తున్నావో, ఆ భావాన్ని పాపాత్ములమైన మేము ఎక్కడనుండి తెచ్చుకొనగలం. రాజా! మేము ముగ్గురమూ పరమగతిని పొందుతున్న నిన్ను అనుసరించలేకపోతే, స్వర్గాన్ని కోలుపోయి, అర్థాలను కోలుపోయి, నీ సుకృతాన్ని తలచుకొంటూ కుమిలిపోతాం. నిన్ను మేము అనుసరించలేకపోతే మేము ఏ పని చేస్తున్నట్టు? నిశ్చయంగా నిరంతర దుఃఖంతో ఈ నేలపై జీవిస్తాం. రాజా! నీవు లేకపోతే మాకు శాంతి ఎక్కడిది ? సుఖమెక్కడిది? మహారాజా! స్వర్గానికి వెళ్ళి నీవు ఆ మహారథులను కలిసి, నా మాటగా జ్యేష్ఠానుపూర్వకంగా, శ్రేష్ఠానుపూర్వకంగా వారిని అర్చించు. రాజా! సర్వధనుర్ధారులకు కేతువువంటి మన ఆచార్యుని పూజించి, ధృష్టద్యుమ్నుడు ఈ రోజు నా చేతిలో చచ్చాడని చెప్పు. బాహ్లికరాజును, సైంధవుని, సోమదత్తుని, భూరిశ్రవుని కౌగిలించుకో. అదే రీతిగా నీ కన్నా ముందుగా స్వర్గానికి చేరిఉన్న రాజసత్తములను కౌగిలించి, మామాటగా వారి అనామయాన్ని అడుగు". సంజయుడు చెప్తున్నాడు. "తొడలు విరిగి, అచేతనంగా పడిఉన్న దుర్యోధన నరపాలునితో అలా పలికి, అశ్వత్థామ మరల పరికించి చూసి, ఇలా అన్నాడు.

దుర్యోధనా! నీవు జీవించిఉండగానే శ్రవణ సుఖమైన వాక్యాన్ని విను. పాండవపక్షంలో ఏడుగురు మిగిలారు. కౌరవపక్షంలో మేము ముగ్గురం మిగిలాం. వారు ఆయిదుగురు సోదరులు, వాసుదేవుడు, సాత్యకి, నేను, కృతవర్మ, శరద్వత్పుత్రుడైన కృపుడు. భారతా! ద్రౌపదికొడుకు లందరూ చనిపోయారు. ధృష్టద్యుమ్నుని కొడుకులూ మరణించారు. పంచాలురు, మత్స్య దేశీయులలో మిగిలిఉన్నవారు అందరూ చనిపోయారు. వారు చేసినదానికి బదులు ఎలా తీర్చానో చూడు. పాండవుల పుత్రులు చనిపోయారు. రాత్రి నిదురిస్తున్న సమయంలో నరులతో, వాహనాలతో పాటు శిబిరమంతా నశించింది. రాజా! పాపకర్మ చేసిన ధృష్టద్యుమ్నుని, నేను రాత్రివేళ శిబిరంలో ప్రవేశించి, పశువును చంపినట్లు చంపాను. మనస్సుకు నచ్చిన ఆ మాటను విని, దుర్యోధనుడు మరల చైతన్యాన్ని, పొంది ఈ మాట అన్నాడు.

"ఈ రోజు కృపకృతవర్మలతో కలిసి నీవు చేసినంత ప్రియం భీష్ముడు కానీ, కర్ణుడు కానీ, నీ తండ్రి కానీ నాకు చేయలేదు. ధృష్టద్యుమ్నుడు శిఖండితో సహా మరణించాడు. నేనిప్పుడు నన్ను ఇంద్రునితో సమానమైన వానిగా భావించుకొంటున్నాను. "సుఖాలను పొందండి. మీకు మేలు కలుగుతుంది. మరల మనకు స్వర్గంలోనే కలయిక"

మహా మనస్వి, వీరుడు అయిన కురురాజు ఆ రీతిగా పలికి, మౌనంగా ఉండి, మిత్రులకు దుఃఖాన్ని కలిగిస్తూ ప్రాణాలు విడిచాడు. పుణ్యఫలమైన స్వర్గానికి వెళ్ళాడు. శరీరం నేలబడిపోయింది. రాజా! ఈ రీతిగా నీ కుమారుడు - దుర్యోధనుడు చనిపోయాడు. యుద్ధంలో శూరుడై ముందుకు సాగి, ఆపై పరులచే చంపబడ్డాడు. దుర్యోధనుని మరణానికి ముందు ఆయన ఆ ముగ్గురినీ కౌగిలించుకొన్నాడు. వారుకూడా దుర్యోధనుని కౌగిలించారు. మాటిమాటికి దుర్యోధనుని వైపు చూస్తూ తమ రథాలను ఎక్కారు. ఈ రీతిగా అశ్వత్థామ పలికిన దీనవచనాలను విని, శోకార్తుడనై ప్రొద్దుటే లేచి, నగరానికి పరుగెత్తుకొని వచ్చాను. రాజా! నీ అవినీతివలన కురుపాండవసేనలకు ఈ రీతిగా ఘోరమై, భయంకరమై, సంహారరూపమైన వినాశం సంభవించింది. అనఘా! నీ కుమారుడు స్వర్గానికి వెళ్ళగానే, శోకానికి లొంగిపోయిన నాకు, ఆ వ్యాసమహర్షి ఇచ్చిన దివ్యదృష్టి కూడా నశించింది." వైశంపాయనుడిలా అన్నాడు. ఆ ధృతరాష్ట్రమహారాజు ఆ రీతిగా కుమారుని మరణవిషయాన్ని విని, వేడి నిట్టూర్పులు విడిచి చింతలో మునిగిపోయాడు."

10. యుధిష్ఠిరశిబిర ప్రవేశము

వైశంపాయనుడిలా అడిగాడు. "ఆ రాత్రి గడచిపోగానే ధృష్టద్యుమ్నుని రథసారథి ధర్మరాజును కలిసి ఆ రాత్రి జరిగిన యుద్ధాన్ని గురించి చెప్పాడు. "రాజా! విశ్వాసంతో రాత్రి తమ శిబిరాలలో గాఢంగా నిదురిస్తున్న ద్రౌపది కొడుకులు, ధృష్టద్యుమ్నుని కొడుకులతో సహా చనిపోయారు. కృతవర్మ, కృపుడు, అశ్వత్థామ రాత్రి మీ శిబిరంలో అందరినీ చంపారు. ప్రాసాలు, శక్తులు, పరశ్వధాలు ధరించి ఈ ముగ్గురూ వేలకొలది మనుష్యులను, ఏనుగులను, గుర్రాలను చంపి, నీ సేనను మిగలకుండా చేశారు. భారతా! గొడ్డళ్ళతో మహావనాన్ని నరుకుతుంటే పుట్టిన శబ్దంవలె, నీ సేనలో మహాకోలాహలం వినిపించింది. ధర్మాత్మా! ఆ సైన్యంలో నేనొక్కడినే మిగిలాను. కృతవర్మ ఇతరులను చంపటంలో లగ్నమైఉన్నప్పుడు ఎంతో కష్టంతో బయటపడ్డాను." అమంగళకరమైన ఆ మాటవిని, యుధిష్ఠిరుడు పుత్రశోకంతో నేలగూలిపోయాడు. యుధిష్ఠిరుడు పడిపోతుంటే సాత్యకి ముందుకు వచ్చి పట్టుకొన్నాడు. భీమసేనుడు, అర్జునుడు, మాద్రికొడుకులైన నకులసహదేవులు కూడా పట్టుకొన్నారు.

యుధిష్ఠిరుడు స్పృహలోనికి వచ్చి శోకాకులమైన గొంతుతో ఆర్తునివలె దుఃఖిస్తూ "ముందు శత్రువులను గెలిచి, తర్వాత ఓడిపోయాను" అని విలపించసాగాడు.

'దివ్యదృష్టిగలవారికి కూడా అర్థగతిని గ్రహించటం కష్టమే. కొందరు ఓడి గెలుస్తారు. మనం గెలిచి ఓడిపోయాం. సోదరులను, సహచరులను, తండ్రులను, పుత్రులను, మిత్రులను, బంధువులను, అమాత్యులను, పౌత్రులను – అందరిని గెలిచికూడా మనం ఓడిపోయాం. ఒక్కొక్కసారి అనర్థం కూడా అర్థంలా కనిపిస్తుంది. ఒక్కొక్కసారి అనర్థం అర్థవంతంగా కనిపిస్తుంది. మన ఈ గెలుపు ఓటమిగా మారింది. అందువల్ల మనం గెలిచి ఓడిపోయాం. గెలిచి కూడా తరువాత ఆపన్ననివలె పశ్చాత్తాప పడవలసి వస్తే, చెడ్డవాడు అయినా దాన్ని గెలుపుగా ఎలా భావిస్తాడు? కాబట్టి శత్రువులచేతిలో పూర్తిగా ఓడిపోయాం. విజయసిద్ధి కోసం మిత్రవధ రూపమైన పాపకర్మను చేస్తే, ఒక్కొక్కసారి విజయంతో ఉల్లాసంగా ఉండగలరు. కానీ అప్రమత్తులైన శత్రువుల చేతిలో తరువాత ఓటమి పొందక తప్పదు.

కోపించిన కర్ణుడు మనుష్యులపాలిటి నరసింహుడు. కర్ణి నాలీకా లనబడే బాణాలు ఆయన కోరలు. రణభూమిలో ఎత్తినకత్తి నాలుక. విల్లు తెరచిన నోరు. అల్లెత్రాటి చప్పుడు గర్జనలు. యుద్ధంలో ఎప్పుడూ వెన్నుచూపని ఆ కర్ణుని చేతిలో తప్పించుకొన్నవారు, వీరంతా ఏమరుపాటువలన చనిపోయారు. ద్రోణాచార్యుడు మహాసముద్రం వంటివాడు. రథాలు మడుగులు, బాణవృష్టి అలలు. నగలే రత్నాలు. రథాశ్వాలు, నీటి గుర్రాలు. శక్తులు, ఋష్టులు చేపలు. ధ్వజాలు, ఏనుగులు మొసళ్ళు. విండ్లు సుడులు. పెద్దబాణాలు నురుగులు. యుద్ధం చంద్రోదయం. అందువలన పెరిగిన వేగమే చెలియలికట్ట. రథపుటిరుసుల చప్పుడు సముద్రఘోష. గొప్ప ఆయుధాలు అనే నావలతో ఆ సముద్రాన్ని దాటిన రాజకుమారులు ఏమరుపాటుతో మరణించారు.

జీవలోకంలోని మనుష్యులకు, ఏమరుపాటును మించిన మృత్యువు లేదు. ప్రమత్తుడైన మనిషిని అర్థాలు పూర్తిగా వీడిపోతాయి. అవర్థాలు కూడా దరిచేరుతాయి. మహాసంగ్రామంలో భీష్ముడు అగ్నివలె పాండవులను దహించాడు. అప్పుడు ఎత్తైన ధ్వజాలపైన ఎగురుతున్న పతాకలు పొగ బాణవృష్టి అగ్నిజ్వాలలు. క్రోధం ప్రచండవాయువు. ధనుష్టంకారాలు, అల్లెత్రాటి ధ్వనులు, రథనేమి శబ్దాలు చిటపటలు. కవచాలు, వివిధశస్త్రాలు ఆహుతులు. మహాసైన్యం ఎండిన వనాలు. దావాగ్నివలె అది తగులబడిపోయింది. చేత ఆయుధాలు పట్టి ఆ తీక్ష్ణవేగాన్ని సహించిన రాజకుమారులు ఏమరుపాటుతో చనిపోయారు. సావధానంగా లేని నరుడు విద్యను కానీ, తపస్సును కానీ, సంపదను కానీ, ఘనకీర్తిని కానీ పొందలేడు. సావధానతతో శత్రువుల నందరినీ చంపి, సుఖంగా వర్ధిల్లుతున్న మహేంద్రుని గమనించండి. ఇంద్రునివలె పరాక్రమవంతులయిన

రాజకుమారులు, రాజుల మనుమలు ఏమరుపాటు వలన సామాన్యమానవులవలె చనిపోయారు. సంపన్నులైన వ్యాపారులు సముద్రాన్ని దాటి, అవహేళనతో (ఏమరుపాటుతో) చిన్ననదిలో మునిగిపోయినట్లయింది. నిదురిస్తున్న వారిని శత్రువులు కోపానికి లోనయి సంహరించారు. మరణించిన వారు తప్పని సరిగా స్వర్గానికే చేరుతారు.

కానీ ద్రౌపది గురించియే బాధ. ఆ సాధ్వి ఇప్పుడు శోకసముద్రంలో మునిగి నశిస్తుందేమో! ఇప్పటికే శోకంతో ఆమె శరీరమంతా కృశించింది. ఇప్పుడు సోదరులు, పుత్రులు, ముసలితండ్రి చనిపోయారని విని మరీ కృశించి, స్పృహ లేకుండా నేల కూలుతుంది. అనుమానం లేదు. సుఖాల ననుభవించడానికి తగినది ద్రౌపది. ఆమె శోకంతో పుట్టిన ఈ దుఃఖాన్ని దాటలేక ఏమవుతుందో? పుత్రవినాశనంతో, సోదరవధతో వ్యథచెంది, ఆ శోకాగ్ని దహిస్తుంటే ఏమవుతుందో ?" ఈ రీతిగా ఆర్తితో విలపిస్తూ ఆ కురురాజు "వెళ్ళు! ఆ మందభాగిని అయిన ఆ రాజకుమారిని తన తల్లివైపు ఆడవాళ్ళతో కూడా ఇక్కడకు తీసికొనిరా" అని నకులునితో అన్నాడు. ధర్మరాజు వాక్యాన్ని స్వీకరించి, నకులుడు వేగంగా ద్రౌపదీ భవనానికి వెళ్ళాడు. ద్రుపదుని భార్యలు కూడా అక్కడే ఉన్నారు. ధర్మరాజు నకులుని పంపి, శోకానికి లోనై, మిత్రులతో కలిసి, తీవ్రంగా విలపిస్తూ, కుమారులు మరణించిన రణభూమికి వెళ్ళాడు. ఆ రణరంగం భూతగణాలతో నిండి ఉంది. అమంగళకరంగా, భయంకరంగా ఉన్న ఆ రణభూమిలో ప్రవేశించి, పుత్రులను, మిత్రులను, సహచరులను చూశాడు. వారంతా శరీరమంతా నెత్తుట తడిసి నేలగూలిఉన్నారు. శరీరాలు ముక్కలై ఉన్నాయి. తలలు తెగి ఉన్నాయి. యుధిష్ఠిరుడు తీవ్రదుఃఖానికి లోనై పెద్దగా ఏడుస్తూ, సహచరులతో పాటు నిశ్చేతనుడై నేలపై పడ్డాడు."

11. అశ్వత్థామను చంపుటకై భీముడు వెళ్ళుట.

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. "జనమేజయా! తన కొడుకులు, మనుమలు, మిత్రులు యుద్ధంలో మృతి చెందటం చూసి, యుధిష్ఠిరుని మనస్సు తీవ్రదుఃఖానికి లోనైంది. ఆపై పుత్రులను, మనుమలను, సోదరులను, బంధువులను తలచుకొంటున్న ఆ మహాత్మునికి మహాదుఃఖం కలిగింది. అప్పుడు కళ్ళనిండా నీరు క్రుక్కుకొని, నిశ్చేతనుడై వణికిపోతున్న యుధిష్ఠిరుని, తీవ్రంగా కలతపడిన మిత్రులు ఓదార్చసాగారు. అదే సమయంలో నకులుడు దుఃఖంతో పరమదీనంగా ఉన్న ద్రౌపదితో సహా అక్కడకు వచ్చాడు. అప్పుడు ఉపప్లవ్యానికి వెళ్ళిఉన్న ఆ ద్రౌపది తన పుత్రులందరూ చనిపోయారన్న అప్రియమైన

మాటను విని, వ్యధకు గురి అయింది. గాలి తీవ్రంగా వీస్తే కంపిస్తున్న అరటిచెట్టువలె ద్రౌపది వణికిపోతూ ధర్మరాజు దగ్గరకు వచ్చి శోకార్తయై నేలగూలింది. వికసించిన తామర రేకులవంటి కన్నులుగల ఆ ద్రౌపదిముఖం వెంటనే శోకపీడితమై, చీకటి మ్రింగిన సూర్యునివలె కనిపించింది. అప్పుడు ద్రౌపది పడిపోతుండటం చూసి, కోపంతో ఉన్న భీముడు ఉరికివచ్చి, బాహువులతో ఆమెను పట్టుకొన్నాడు. ఆ భామినిని భీమసేనుడు ఓదార్చాడు.

ఆమె ఏడుస్తూనే ధర్మరాజుతో ఇలా అన్నది. "రాజా! అదృష్టం కొద్దీ నీవు క్షత్ర ధర్మంతో పుత్రులను యమునకిచ్చి, ఈ భూమినంతా పొంది అనుభవించగలవు. మదపుటేనుగువలె నడిచి వచ్చే ఈ భూమినంతా పొంది నీవు క్షేమంగా ఉన్నావు. భాగ్యవంతుడవే. కానీ నీకు అభిమన్యుడు గుర్తురావటం లేదు. క్షత్రధర్మం మేరకు నీ శూరకుమారులు చనిపోవటం విని కూడా, ఉపప్లావ్యంలో నాతోపాటు నివసిస్తూ, నీవు వారిని కూడా మరచిపోగలవు. అదీ భాగ్యమే. పార్థా! పాపకర్ముడైన అశ్వత్థామ నిదురిస్తున్న నా కుమారులను చంపాడని విని, అగ్ని ఆశ్రయాన్ని తగులబెట్టినట్లు శోకం నన్ను దహిస్తోంది. ఈ రోజు నీవు యుద్ధంలో పరాక్రమించి పాపపు పని చేసిన ఆ అశ్వత్థామ ప్రాణాలను, బంధుజనుల ప్రాణాలతో సహా అపహరించకపోతే, నేనిక్కడే ప్రాయోపవేశం చేస్తాను. పాండవులారా! వినండి. ఈ పాపకృత్యానికి తగిన ఫలితాన్ని అశ్వత్థామ పొందకపోతే నేను బ్రతకను." యాజ్ఞసేని ధర్మరాజుతో అలా పలికి ఆయన ఎదురుగా కూర్చుంది. తన ప్రియరాజ్ఞి అలా కూర్చోవటం చూసి యుధిష్ఠిరుడు ఆమెతో ఇలా అన్నాడు.

"కళ్యాణీ! నీ కొడుకులు, సోదరులు, ధర్మబద్ధంగా పోరాడి ధర్మమార్గంలో మరణించారు. వారిని గురించి బాధపడవద్దు. అశ్వత్థామ ఇక్కడనుండి ఎంతో దూరంలోని దుర్గమారణ్యానికి వెళ్ళాడు. యుద్ధంలో అతనిని చంపగలిగినా, నీకు నమ్మకమెలా కలుగుతుంది ?" ద్రౌపది ఇలా అన్నది. "అశ్వత్థామ తలపై సహజమైన మణి ఉంటుందని నేను విన్నాను. ఆ పాపాత్ముని యుద్ధంలో చంపి ఆ మణిని తెస్తే చూస్తాను. రాజా! ఆ మణిని నీ తలమీద ధరిస్తేనే నేను బ్రతుకుతాను. ఇది నా నిర్ణయం". యుధిష్ఠిర వరపాలునితో అలాపలికి అందగత్తె అయిన ఆ ద్రౌపది, ఆపై భీముని దగ్గరకు వచ్చి, చివరి మాటగా ఇలా అన్నది". భీమా! క్షత్రధర్మాన్ని తలచుకొంటూ నీవు నన్ను కాపాడాలి. పాపకర్మచేసిన ఆ అశ్వత్థామను, శంబరుని ఇంద్రుడు చంపినట్లు చంపు. పరాక్రమంలో నీతో సమానుడైన మగవాడు ఈ లోకంలో ఎవ్వడూ లేడు. వారణావతనగరంలో తీవ్రకష్టాలు

కలిగినపుడు, పాండవుల రక్షణకై నీవే ద్వీపంగా నిలిచినవైనం, సర్వలోకాలలోనూ వినిపించే విషయమే. అలాగే హిడింబ కనిపించినప్పుడు కూడా నీవే గతి అయ్యావు. అదే రీతిగా విరాటనగరంలో కీచకుడు నన్ను మిక్కిలిగా పీడించినప్పుడు, ఆ కష్టం నుండి నీవే నన్ను ఉద్ధరించావు. భీమా! గతంలో ఎలా మహాకార్యాలు చేశావో అలాగే అశ్వత్థామను చంపి, సుఖంగా ఉండు." దుఃఖంతో అనేకరీతులుగా నున్న ఆ ద్రౌపదీ విలాపాన్ని విని, భీమసేనుడు భరించలేకపోయాడు. అశ్వత్థామను చంపాలని నిర్ణయించుకొని స్వర్ణభూషితమై, విచిత్రాంగాలతో శోభిస్తున్న మహారథాన్ని ఎక్కాడు. బాణాలతో, అల్లెతాటితో సహా వింటిని చేతబట్టాడు. నకులుని సారథిని చేసి, వింటినెక్కుపెట్టి, బాణాన్ని సంధించి, వేగంగా గుర్రాలను నడిపాడు. ఆ గుర్రాలు వాయువేగంతో త్వరత్వరగా శీఘ్రగమనంతో వెళ్ళసాగాయి. శిబిరం నుండి వెలుపలికి వచ్చి, అచ్యుతుడైన ఆ భీముడు అశ్వత్థామ వెళ్ళిన రథచిహ్నాలను అనుసరిస్తూ, ఆ మార్గంలోనే వేగంగా ముందుకుపోయాడు."

12. కృష్ణ యుధిష్ఠిర సంవాదము

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. "భీమసేనుడు బయలుదేరగానే పుండరీకాక్షుడు యుధిష్ఠిరునితో ఇలా అన్నాడు. "పాండునందనా! ఈ నీ సోదరుడు పుత్ర శోకపరాయణుడై, యుద్ధంలో అశ్వత్థామను చంపాలని ఒంటరిగా దాడి చేయబోతున్నాడు. భీముడు సోదరులందరిలో నీకు ప్రియమైనవాడు. ఈ రోజు కష్టాలనెదుర్కొనబోతున్నాడు. నీవెందుకు సహకరించవు ? ద్రోణుడు కుమారునకు బ్రహ్మశిరోనామకమైన అస్త్రాన్ని ఉపదేశించాడు. అది భూమండలాన్ని దహించగలది. ద్రోణాచార్యుడు అర్జునునిపై ప్రీతితో, ఆ అస్త్రాన్ని ఉపదేశించాడు. దానిని సహించలేని అశ్వత్థామకు, అతని అభ్యర్థన మేరకు, ద్రోణుడు అంతగా ఇష్టంలేకపోయినా ఉపదేశించాడు. దురాత్ముడైన తన కుమారుని చపలత్వం ఆచార్యునకు తెలుసు. అందువలన సర్వధర్మవేత్త అయిన తాను ఆ తర్వాత తన కుమారుని ఇలా శాసించాడు. "నాయనా! ఎంత ఆపదలోనున్నా, యుద్ధభూమిలో ఈ అస్త్రాన్ని విశేషించి మనుష్యులపై ప్రయోగించదగదు". గురువైన ద్రోణుడు అలా పలికి ఆపై మరలా ఇలా అన్నాడు. "నీవు ఎప్పుడూ సజ్జన మార్గంలో నిలవ వని నా సందేహం". అప్రియమైన ఆ తండ్రిమాటను విని ఆ దురాత్ముడు సమస్తశుభాల మీదా ఆశను వీడి, శోకంతో లోకసంచారం చేయసాగాడు.

ఆ తరువాత నీవు అరణ్యంలో ఉన్నప్పుడు ద్వారకకుపోయి, వృష్ణివంశీయులచే గొప్పగా పూజలందుకొని నివసించాడు. ఆ అశ్వత్థామ ఒకప్పుడు ద్వారవతిలో సముద్ర తీరంలో నేను ఒంటరిగా ఉన్నప్పుడు, ఒంటరిగా వచ్చి నవ్వుతూ నాతో ఇలా అన్నాడు. "కృష్ణా! నా తండ్రి ఉగ్రతపస్సు చేసి అగస్త్యుని ద్వారా బ్రహ్మశిరోనామకమైన అస్త్రాన్ని పొందాడు. దేవతలు, గంధర్వులు దానిని పూజిస్తారు. దాశార్హా! మా తండ్రి దగ్గర ఉన్నట్లు అది ఇప్పుడు నా దగ్గర కూడా ఉంది. యదూత్తమా! నా ద్వారా ఆ దివ్యాస్త్రాన్ని పొంది, రణభూమిలో శత్రుసంహారం చేయగల చక్రాన్ని నాకిమ్ము!" చేతులు జోడించి, ప్రయత్నపూర్వకంగా నానుండి చక్రాన్ని అభ్యర్థిస్తున్న అశ్వత్థామతో, నేను కూడా ప్రసన్నంగా ఇలా అన్నాను. "దేవతలు, దానవులు, గంధర్వులు, మనుష్యులు, పక్షులు, నాగులు – వీరంతా కలిసినా నా పరాక్రమంలో నూరవవంతుతో కూడా సమానం కాదు. ఇది ధనుస్సు. ఇది శక్తి, ఇది చక్రం, ఇది గద, నా నుండి వీటిలో నీకేది కావాలో కోరుకో. అది నీకిస్తాను. దేనిని ఎత్తగలవో, రణభూమిలో ప్రయోగింపగలవో దానిని తీసుకో. నీవు నాకివ్వదలచిన అస్త్రం ఇవ్వనవసరం లేదులే!" ఆ మహాభాగుడు నాతోనే పోటీపడుతూ, నానుండి లోహమయ చక్రాన్ని కోరుకొన్నాడు.

అది చక్కని కేంద్రం గలది. కేంద్ర స్థానంలో వజ్రాలు పొదిగినది. వేయి అరలు గలది. 'చక్రాన్ని తీసికో' అని నే నన్నాను. వెంటనే ఎగిరిపడి ఎడమచేతితో వెంటనే చక్రాన్ని పట్టుకొన్నాడు. కానీ దానిని ఉన్నచోటునుండి కనీసం కదిలించ లేకపోయాడు. ఆ తర్వాత కుడిచేతితో దాన్ని తీసికొనే ప్రయత్నం చేశాడు. భారతా! పూర్తిశక్తితో పూర్తిగా ప్రయత్నించినా, పట్టుకొని ఎత్తలేకపోయాడు. ఆపై పూర్ణబలాన్ని వినియోగించినా కదల్చలేకపోయాడు. అప్పుడు అశ్వత్థామ ఎంతో దుఃఖించాడు. ప్రయత్నించి, అలసిపోయినందువలన ఆ ప్రయత్నం నుండి వెనుదిరిగాడు. ఆ అభిప్రాయం నుండి మనస్సును మరల్చుకొని, అచేతనుడైఉన్న అశ్వత్థామను పిలిచి ఉద్విగ్నుడైన అతనితో ఇలా అన్నాను. "బ్రాహ్మణా! అర్జునుడు మానవులలో ఎప్పుడూ పరమప్రమాణం. అతడు సాక్షాత్తు దేవదేవుడైన శితికంఠుని – ఉమాపతిని ద్వంద్వ యుద్ధంలో ఓడించి ఆ శంకరుని ఆనందింపజేశాడు. నాకు లోకంలో అర్జునుని కన్నా ప్రియతరుడు మరొకడు లేడు. అతనికి ఇవ్వకూడనిదంటూ ఏదీలేదు. భార్యనైనా, బిడ్డలనైనా సరే. అటువంటి అర్జునుడు – నామిత్రుడు కూడా ఇప్పుడు నీవు నాతో మాటాడినట్టు ఎప్పుడూ మాట కూడా అనలేదు.

మూర్ఖుడా! నేను పండ్రెండు సంవత్సరాలపాటు ఘోరబ్రహ్మచర్యాన్ని పాటించి, హిమాలయ సానువులలో తపస్సు చేశాను. రుక్మిణి కూడా నాతో సమానంగా వ్రతాన్ని పాటించింది. ఆ మా ఇద్దరికీ పుట్టినవాడు ప్రద్యుమ్నుడు. తేజస్వి అయిన సనత్కుమారుడే, ప్రద్యుమ్నుడుగా - నా కొడుకుగా పుట్టాడు. అటువంటి ఆ ప్రద్యుమ్నుడు కూడా, యుద్ధభూమిలో తిరుగులేని ఈ దివ్య చక్రాన్ని అడగలేదు. ఇప్పుడు నీవు అడుగుతున్నావు. అత్యంతమూ బలశాలి అయిన బలరాముడు కూడా ఇంతకుముందెప్పుడూ ఇలా అనలేదు. నీవడిగినట్లు గదుడూ, సాంబుడూ కూడా అడగలేదు. ద్వారకలో నివసించే వృష్ణి, అంధకవంశాలకు చెందిన మహారథులు కూడా ఎప్పుడూ ఇలా అడగలేదు. ఇప్పుడు నీవు దానిని కోరుకొంటున్నావు. రథికశ్రేష్ఠా! నీవు భారతాచార్యుడైన ద్రోణుని కుమారుడవు. సర్వయాదవులూ గౌరవించే వాడివి. నాయనా! ఈ చక్రంతో ఎవరితో పోరాడాలనుకొంటున్నావు ?"

నేనలా అనగానే అశ్వత్థామ నాతో ఇలా అన్నాడు". కృష్ణా! నిన్ను పూజించి నీతోనే యుద్ధం చేయాలనుకొంటున్నాను. నేను ఓడిపోకూడదని దేవదానవులు పూజించే ఈ చక్రాన్ని అడిగాను. ప్రభూ! నీకు సత్యం చెప్తున్నాను. కేశవా! దుర్లభమైన ఆ కోరిక నీద్వారా తీరకుండానే నేను మరలిపోతున్నాను. గోవిందా! నాకు శుభం కలగాలని చెప్పు. ఇది భీకరచక్రం. నీవు భయానకవీరులలో మేటివి. దీనిని నీవు ధరించావు. మరెవ్వరి దగ్గరా ఇటువంటి చక్రం లేదు. ఈ లోకంలో మరెవ్వరూ దీనిని ఎత్తలేరు". నాతో అలా పలికి అశ్వత్థామ రథానికి పూన్చదగిన గుర్రాలను, ధనాన్ని, వివిధరత్నాలను తీసికొని తగినవేళలో వెళ్ళిపోయాడు. ఆ అశ్వత్థామ కోపిష్ఠి, దురాత్ముడు, చపలుడు, క్రూరుడు కూడా. బ్రహ్మ శిరోనామకమైన అస్త్రమెరిగినవాడు. కాబట్టి భీముని కాపాడాలి."

13. అశ్వత్థామ బ్రహ్మాస్త్రము ప్రయోగించుట.

వైశంపాయనుడిలా చెప్తున్నాడు. "కృష్ణుడు సర్వాయుధాలతో కూడిన ఉత్తమరథాన్ని ఎక్కాడు. ఉదయించే సూర్యుని వంటి వన్నె గల ఆ రథభారాన్ని సువర్ణమాలలు ధరించిన గుర్రాలు మోస్తున్నాయి. అవి కాంబోజ దేశానికి చెందిన మేలుజాతివి. కుడివైపు శైబ్యం, ఎడమవైపు సుగ్రీవం రథభారాన్ని వహించాయి. ఆ రథం పార్శ్వభారాన్ని మేఘపుష్పవలాహకాలు మోస్తున్నాయి. ఆ రథంపై దివ్యధ్వజ ముంది. విశ్వకర్మ దానిని నిర్మించాడు. రత్నధాతువులతో దానిని అలంకరించారు. వైకెత్తిన మాయవలె అది కనిపిస్తోంది. ఆ ధ్వజంపై, కాంతిమండలంతో,

కిరణాలతో భాసిస్తున్న గరుత్మంతు డున్నాడు. ఆ గరుడుడు సత్యశీలుడైన కృష్ణుని పతాకంవలె కనిపిస్తున్నాడు. ఆ తరువాత సర్వధనుర్ధారులకు పతాకాయమానుడైన కృష్ణుడు రథ మెక్కాడు. అర్జునుడు, యుధిష్ఠిరుడు కూడా రథ మెక్కారు. కృష్ణుని ప్రక్కనున్న ఆ మహాత్ములు అర్జున యుధిష్ఠిరులు ఇంద్రుని ప్రక్కనున్న అశ్వినీ దేవతలవలె శోభించారు. కృష్ణుడు లోకపూజితమైన రథంపై వారినిద్దరినీ ఎక్కించుకొని వేగశాలులయిన ఆ ఉత్తమాశ్వాలను కొరడాతో అదిలించాడు. పాండవు లిరువురూ, కృష్ణుడు ఎక్కిన ఆ ఉత్తమరథాన్ని మోస్తూ గుర్రాలు వేగంగా ముందుకురికాయి. కృష్ణుని వహిస్తూ ఆ గుర్రాలు వేగంగా దౌడుతీస్తుంటే, ఎగురుతున్న పక్షుల ధ్వనివలె మహాశబ్దం పుట్టింది. ఆ ముగ్గురు వేగంగా వెన్నంటి క్షణకాలంలో మేటివిలుకాడైన భీమసేనుని సమీపించారు. ఆ మహారథులు భీముని సమీపించి కూడా ఆ కౌంతేయుని నివారించలేకపోయారు. ఆ ముగ్గురు చూస్తుండగానే, ఆ భీముడు తీవ్రవేగం గల గుర్రాలతో భాగీరథీ తీరానికి చేరాడు. పాండవుల పుత్రులను చంపిన అశ్వత్థామ అక్కడున్నట్లు వినికిడి. అక్కడ గంగాతీరంలో, వ్యాసుడు ఋషులతో కలిసి కూర్చొనిఉండగా చూశాడు భీముడు. ఆయనకు దగ్గరలోనే కూర్చొనిఉన్న అశ్వత్థామను కూడా గమనించాడు. ఆ క్రూరకర్ముడు ఒంటికి నేయి పూసికొని, దర్భచీరలు ధరించి ఉన్నాడు. ఒళ్ళంతా దుమ్ము అంటుకొని ఉంది.

కౌంతేయుడు బాణాలతో పాటు వింటిని చేతబట్టి అశ్వత్థామ మీదకు వెళ్ళాడు. భీమసేనుడు "నిలు! నిలు!" అని అరిచాడు కూడా. ఆ అశ్వత్థామ భీకరధనుర్ధారి అయిన భీముడు విల్లుపట్టి రావటాన్ని, ఆయన వెనుక కృష్ణుని రథంపైనున్న ధర్మరాజును, అర్జునుని చూసి, వ్యథకు లోనయ్యాడు. అప్పటి కర్తవ్యాన్ని ఇలా భావించుకొన్నాడు. అశ్వత్థామ దివ్యమైన ఆ పరమాస్త్రాన్ని గురించి ఆలోచించాడు. ఎడమచేతితో ఒక గడ్డిపరకను పట్టుకొన్నాడు. దివ్యాయుధాలు ధరించి ఎదుట నిలిచిన ఆ శూరులను సహించలేకపోయాడు. అంతటి ఆపదను పొందిన అశ్వత్థామ కోపంతో దివ్యాస్త్రాన్ని (బ్రహ్మాస్త్రాన్ని) ప్రయోగించాడు. "పాండవులనందరినీ ఈ అస్త్రం సంహరించా"లని దారుణమైన మాట అన్నాడు. అలాపలికి అశ్వత్థామ సర్వలోకాన్ని మోహంలో పడవేయాలని ఆ అస్త్రాన్ని విడిచాడు. ఆపై ఆ గడ్డిపరకలో నిప్పు పుట్టింది. అది ప్రళయకాలయముని వలె మూడు లోకాలనూ దహిస్తున్నట్లు కనిపించింది."

14. అర్జునుడు బ్రహ్మాస్త్రమును ప్రయోగించుట

వైశంపాయనుడు చెప్తున్నాడు. "కృష్ణుడు మొదటనే అశ్వత్థామ చేష్టద్వారా అతని అభిప్రాయాన్ని గ్రహించి, అర్జునునితో ఇలా అన్నాడు. "పాండవా! అర్జునా! ద్రోణుడు ఉపదేశించిన దివ్యాస్త్రం నీ మనస్సులో ఉన్నది. దానిని ప్రయోగించటానికి ఇప్పుడు ఇది తగిన కాలం. భారతా! నిన్ను, నీ సోదరులనూ రక్షించుకొనటానికి నీవు కూడా యుద్ధంలో అదే అస్త్రాన్ని ప్రయోగించు. ఇది అశ్వత్థామ ప్రయోగించిన అస్త్రాన్ని నివారిస్తుంది." కేశవుడు అలా అనగానే అర్జునుడు ధనుర్బాణాలను చేతబట్టి, వెంటనే రథంనుండి దిగాడు. ముందుగా అశ్వత్థామకూ, ఆపై తనకూ, ఆపై సమస్త సోదరులకూ శుభం జరగాలని పలికి దేవతలకూ, సర్వగురువులకూ నమస్కరించి "ఈ అస్త్రం శత్రువుల బ్రహ్మాస్త్రాన్ని శాంతింపజేయా"లని ధ్యానించి, ఆ దివ్యాస్త్రాన్ని విడిచాడు. అర్జునుడు ప్రయోగించిన ఆ అస్త్రం, వెంటనే ప్రళయకాలాగ్నివలె మహాజ్వాలలతో ప్రజ్వరిల్ల సాగింది. అదే రీతిగా ఆ అశ్వత్థామ ప్రయోగించిన అస్త్రం కూడా తేజోమండలం మధ్య నిలిచి, మహాజ్వాలలతో ప్రజ్వలించసాగింది. అప్పుడు వజ్రపాతం వంటి శబ్దాలు ఎన్నో పుట్టాయి. వేలకొలది తోకచుక్కలు రాలాయి. సర్వభూతాలకూ మహాభయం కలిగింది. ఆకాశంలో ఆ అగ్ని జ్వాలలమాలలతో వ్యాప్తమైంది. ప్రచండశబ్దాలు పుడుతున్నాయి. పర్వతాలతో, వనాలతో, చెట్లతో సహా భూమి మొత్తం కంపించింది. ఆ రెండు అస్త్రాల తేజస్సులు లోకాలను తపింప జేస్తూ నిలిచాయి.

అప్పుడు సర్వభూత స్వరూపుడైన నారదుడు, భరతపితామహుడైన వ్యాసుడు - ఈ ఇద్దరు మహర్షులూ కలిసి ప్రత్యక్షమయ్యారు. పరమ తేజస్సులు, సర్వధర్మజ్ఞులూ, సర్వభూతహితాభిలాషులు అయిన ఆ మునులిద్దరూ అశ్వత్థామ, అర్జునుడు - ఈ వీరులిద్దరినీ శాంతింపజేయాలని ప్రజ్వలిస్తున్న ఆ రెండు అస్త్రాల మధ్య నిలిచారు. ఆ మును లిద్దరినీ ప్రాణధారులు తిరస్కరించరు. దేవదానవులు కూడా వారిని గౌరవిస్తారు. వారు లోకహితాన్ని కోరుతూ, అస్త్రతేజస్సును శాంతింపజేయటానికి వచ్చారు. ఋషులిలా అన్నారు. "గతంలో నానాశస్త్రవేత్తలయిన ఎందరో మహారథులు వెళ్ళిపోయారు. వారెవ్వరూ ఈ అస్త్రాన్ని మనుష్యులపై ఎప్పుడూ ప్రయోగించలేదు. వీరులారా! మహావినాశకమైన ఈ సాహసం చేశారేమిటి ?"

15. బ్రహ్మశిరోస్త్రము పాండవగర్భమున ప్రవేశించుట - 1.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "నరశార్దూలా! అగ్నివంటి తేజస్సుగల ఆ ఋషులను అర్జునుడు సమయోచితంగా ఆలోచించి, వేగంగా ఆ దివ్యాస్త్రాన్ని ఉపసంహరించాడు. అప్పుడు అర్జునుడు చేతులు జోడించి, ఆ ఋషులతో ఇలా పలికాడు. "అశ్వత్థామ ప్రయోగించిన అస్త్రాన్ని శాంతింపజేయాలని నేను ఆస్త్రాన్ని ప్రయోగించాను. నేను ఈ అస్త్రాన్ని ఉపసంహరిస్తే, పాపకర్ముడైన అశ్వత్థామ, మమ్ములనందరినీ అస్త్రతేజస్సుతో, నిశ్శేషంగా తప్పనిసరిగా దహించివేస్తాడు. మాకూ! సర్వలోకాలకూ కూడా సర్వవిధాలా హితకరమైన రీతిగా దేవసమానులైన మీరిద్దరూ అంగీకరించి చెప్పాలి." అలా పలికి అర్జునుడు మరల అస్త్రాన్ని ఉపసంహరించాడు. రణభూమిలో దేవతలు కూడా దానిని అంత తేలికగా ఉపసంహరించలేరు. ఆ పరమాస్త్రాన్ని రణభూమిలో ప్రయోగించినతరువాత అర్జునుడు తప్ప మరెవ్వరూ - సాక్షాత్తూ దేవేంద్రుడైనా దానిని ఉపసంహరించలేరు. ఆ అస్త్రం బ్రహ్మతేజస్సునుండి పుట్టినది. జితేంద్రియుడు కాని వాడు దానిని ప్రయోగిస్తే మరల నివర్తింపజేయలేడు. బ్రహ్మచర్య వ్రతాన్ని పాటించినవాడే ఆలా చేయగలడు. బ్రహ్మచర్యాన్ని పాటించనివాడు దానిని ప్రయోగించి, మరలా ఉపసంహరిస్తే, ఆ అస్త్రం ప్రయోగించినవాని తలను, తత్సంబంధీకుల తలలను కూడా కత్తిరిస్తుంది. అర్జునుడు బ్రహ్మచర్యాన్నీ వ్రతశీతలనూ పాటించి, దుర్లభమైన ఆ అస్త్రాన్ని పొందాడు. ఎంత ఇబ్బందులు కలిగినా దానిని ప్రయోగించలేదు. అర్జునుడు సత్యవ్రతధారి, శూరుడు, బ్రహ్మచారి. గురువుల ఆదేశానుగుణంగా నడిచేవాడు. అందువలననే ఆ అస్త్రాన్ని వెనక్కు మళ్ళించగలిగాడు.

అశ్వత్థామ కూడా ఎదుట నిలిచిన ఆ ఋషులను చూశాడు. బలపూర్వకంగా ఆ భయంకరాస్త్రాన్ని ఉపసంహరించే ప్రయత్నం చేశాడు. కానీ వీలు కాలేదు. రాజా! రణభూమిలో ఆ పరమాస్త్రాన్ని ఉపసంహరించటంలో అశక్తుడైన అశ్వత్థామ దీనహృదయుడై వ్యాసమహర్షితో ఇలా అన్నాడు. మునీ! భీమసేనుని చూసి భయపడి, తీవ్ర సంకటస్థితిలో పడి, ప్రాణాలను రక్షించుకొనగోరి నేను ఈ అస్త్రాన్ని ప్రయోగించాను. భగవన్! ఈ భీమసేనుడు దుర్యోధనుని చంపదలచి, రణభూమిలో, అసత్యమార్గంలో అధర్మంగా ప్రవర్తించాడు. అందువలన నన్ను నేను అదుపు చేసికొనలేక ఈ అస్త్రాన్ని ప్రయోగించాను. మరలా దానిని ఉపసంహరించుకోవాలని నేను ఉత్సాహపడటం లేదు. మునీ! ఎవ్వరూ ఎదిరించలేని ఈ దివ్యాస్త్రాన్ని, నేను పాండవనిర్మూలనం కోసం, అగ్నితేజస్సుతో అభిమంత్రించి

ప్రయోగించాను. కాబట్టి పాండవులనందరినీ అంతం చేసేందుకు సంకల్పించిన ఈ అస్త్రం ఈ రోజు పాండవుల నందరినీ ప్రాణాలనుండి తప్పిస్తుంది. బ్రహ్మస్వరూపా! రోషంతో నిండిన మనస్సుతో పాండవుల వధను కోరి, యుద్ధభూమిలో ఈ అస్త్రాన్ని ప్రయోగించి నేను ఈ పాపం చేశాను."

వ్యాసుడిలా అన్నాడు. "నాయనా! కౌంతేయుడు జ్ఞాని, ఆ అర్జునుడు రణభూమిలో బ్రహ్మశిరోస్త్రాన్ని రోషంతో కానీ, నిన్ను నాశనం చేయాలని కానీ ప్రయోగించలేదు. యుద్ధంలో నీవు ప్రయోగించిన అస్త్రాన్ని శమింపజేయాలని, అర్జునుడు ఈ అస్త్రాన్ని ప్రయోగించాడు. మరల ఉపసంహరించాడు. నీ తండ్రి ఉపదేశంతో ఈ బ్రహ్మాస్త్రాన్ని పొంది కూడా, అర్జునుడు క్షత్రధర్మం నుండి తొలగిపోలేదు. ఇలా అర్జునుడు ధృతిమంతుడు, సాధువు, సర్వాస్త్రవేత్త, సజ్జనుడు అయినా అటువంటివానిని సోదరులతో, బంధువులతో సహా చంపాలని నీవెందుకనుకొన్నావు? బ్రహ్మశిరోస్త్రం, అంతకన్నా గొప్ప అస్త్రంచే వశింపజేయబడితే, ఆ రాజ్యంలో పండ్రెండు సంవత్సరాల వరకు వర్షం కురవదు. అందువలననే అర్జునుడు శక్తిమంతుడై కూడా ప్రజలకు హితం చేయాలన్న తలంపుతో ఈ అస్త్రాన్ని నశింపజేయలేదు. నీవు పాండవులనూ, నిన్నూ, రాజ్యాన్ని కూడా ఎప్పుడూ రక్షించాలి. కాబట్టి మహాభుజా! ఈ దివ్యాస్త్రాన్ని నీవు ఉపసంహరించు. నీ కోపమూ శాంతించాలి. పాండవులూ క్షేమంగా ఉండాలి. రాజర్షి అయిన అర్జునుడు అధర్మంగా గెలవాలని కోరుకోడు. ఇప్పుడు నీ తలపైనున్న మణిని ఇచ్చివేయి. అది తీసికొని, పాండవులు, బదులుగా నీకు ప్రాణాలనిస్తారు."

అశ్వత్థామ ఇలా అన్నాడు. "పాండవులు పొందిన రత్నాలు, కౌరవులు సాధించిన ధనం – వీటన్నిటికన్నా ఈ మణి విశిష్టమైనది. ఈ మణిని ధరిస్తే ఆయుధాలవలన కానీ, వ్యాధులవలన కానీ, ఆకలివలన గానీ, దేవతలవలన గానీ, దానవులవలన గానీ, నాగులవలన గానీ ఏ రీతిగానూ భయముండదు. రాక్షసగణాలవలన భయంలేదు. అలాగే దొంగభయం లేదు. ఇటువంటి శక్తిగల మణి ఇది. ఏ స్థితిలోనూ దీనిని విడువను. కానీ పూజ్యులైన తమ ఆదేశాన్ని పాటించి తీరాలి. ఇదిగో మణి. ఇదిగో నేను. కానీ ఆ గడ్డిపరక మాత్రం పాండవేయుల గర్భంలోని శిశువులపై పడుతుంది. ఈ ఉత్తమాస్త్రం వ్యర్థం కాకూడదు. భగవన్! ప్రయోగించిన దానిని ఉపసంహరించే శక్తి నాకు లేదు. మహామునీ! అందువలననే ఈ అస్త్రాన్ని పాండవుల గర్భాల మీదనే ప్రయోగిస్తున్నాను. మీ మాటను పాటించకపోవటమన్నది లేదు." వ్యాసుడిలా అన్నాడు. "అనఘా! అలాగే

చేయి. మరొకరీతిగా ఆలోచించవద్దు. ఈ అస్త్రాన్ని పాండవేయుల గర్భాలపై విడిచి శాంతించు". వైశంపాయనుడు చెప్తున్నాడు. ఆపై అశ్వత్థామ వ్యాసుని మాటను గౌరవించి, రణభూమిలో ప్రయోగించిన ఆ పరమాస్త్రాన్ని పాండవుల గర్భాలపై ప్రయోగించాడు.

16. బ్రహ్మశిరోస్త్రము పాండవగర్భమున ప్రవేశించుట - 2

వైశంపాయనుడు చెప్తున్నాడు. "అప్పుడు పాపకర్ముడైన అశ్వత్థామ ప్రయోగించిన ఆ అస్త్రాన్ని తెలిసికొని, కృష్ణుడు ప్రసన్నుడై అశ్వత్థామతో ఈ మాట అన్నాడు. "గతంలో అర్జునుని కోడలైన విరాటుని కుమార్తె (ఉత్తర) ఉపప్లవ్యంలో ఉండగా వ్రతశీలి అయిన ఒక బ్రాహ్మణుడు ఆమెను చూసి ఇలా అన్నాడు. 'కురువంశం నశించిపోయేటప్పుడు నీకు ఒక కొడుకు పుడతాడు. పరిక్షీణ సమయంలో పుట్టినందువలన అతని పేరు పరిక్షిత్తు కాగలదు. ఆ సజ్జనుని ఆ మాట సత్యమవుతుంది. ఆమెకు మరలా వంశాన్ని నిలపగల కొడుకు పరిక్షిత్తు పుడతాడు." గోవిందుడు అలా అనగానే అశ్వత్థామ తీవ్రకోపంతో ఇలా సమాధానమిచ్చాడు. 'పుండరీకాక్షా! కేశవా! నీవు పక్షపాతంతో మాటాడుతున్నావు. నీవన్నది జరగదు. నామాట అసత్యం కాదు. కృష్ణా! నీవు ఉత్తరగర్భాన్ని రక్షించదలచుకొన్నావు. కానీ నేను ప్రయోగించిన అస్త్రం తప్పక ఆమె గర్భంలోని శిశువుపై పడుతుంది.' శ్రీభగవానుడన్నాడు. "ఆ అస్త్రం అమోఘమైనదే. ఉత్తర గర్భంపై పడుతుంది. ఆ శిశువు మరణించియే బయటపడతాడు. కానీ దీర్ఘాయువును పొందుతాడు. నీవు చెడ్డవాడివనీ, పాపాత్ముడవనీ, పదేపదే పాపకర్మలు చేసేవాడివనీ, బాలకుని చంపినవాడివనీ మనీషులందరికీ తెలుసు.

కాబట్టి నీవు ఈ పాపకర్మకు ఫలితాన్ని అనుభవించు. మూడువేల సంవత్సరాల వరకు ఈ నేలపై తిరుగుతూనే ఉండు. ఎప్పుడూ, ఎక్కడా, ఎవ్వరితోనూ, ఏ మాటా ఫలికే అవకాశముండదు. అసహాయుడవై, నిర్జనప్రదేశాలలో తిరుగుతుంటావు. క్షుద్రుడా! నీకు జనసముదాయంలో ఉనికి ఉండదు. పాపాత్ముడా! నెత్తుటి దుర్గంధంతో, సర్వవ్యాధులతో కూడి దుర్గమారణ్యాలను ఆశ్రయించి తిరుగుతుంటావు. పరిక్షిత్తు దీర్ఘాయువై, వేదాధ్యయనం చేసి, వ్రతాలను పాటించి, శరద్వత్సుతుడైన కృపుని ద్వారా అస్త్రవిద్యను పూర్తిగా పొందగలడు. పరమాస్త్రాలను గ్రహించి, క్షత్రధర్మంలో నిలిచి ఆ మహాత్ముడు అరవై సంవత్సరాలు రాజ్యమేలగలడు. దుర్బుద్ధీ! ఇక మీద నీవు చూస్తుండగానే మహాబాహువైన పరిక్షిన్మహారాజే కురురాజు కాగలడు. నరాధమా! నీవు ప్రయోగించిన అస్త్రంలోని అగ్నితేజస్సు దహించిన

ఆ శిశువును నేను బ్రతికిస్తున్నాను. నా తపశ్శక్తిని, సత్యశక్తిని చూడు.

వ్యాసుడిలా అన్నాడు. "నీవు మమ్ము తిరస్కరించి ఈ దారుణ కృత్యాన్ని చేశావు. నీవు బ్రాహ్మణుడవైయుండీ, నీ నడవడి ఇలా అయింది. నీవు క్షత్రధర్మాన్ని ఆశ్రయించావు. అందువలన కృష్ణుడు మంచిమాటే చెప్పాడు. నీ విషయంలో ఆలాగే జరుగుతుంది." అశ్వత్థామ ఇలా అన్నాడు. "నేను మనుష్యులలోనే, కేవలం మీతోనే ఉంటాను. భగవంతుడైన ఈ పురుషోత్తముని మాట సత్యమే అవుతుంది'. వైశంపాయనుడు చెప్తున్నాడు. "ఆపై అశ్వత్థామ మహాత్ములైన పాండవులకు మణి నిచ్చి, వారందరూ చూస్తుండగానే కలుషిత హృదయుడై అరణ్యానికి వెళ్ళాడు.

శత్రుసంహారం చేసిన పాండవులు కూడా వ్యాసునకూ, నారదునకూ నమస్కరించి, అశ్వత్థామ ఇచ్చిన ఆ సహజమణిని తీసికొని, కృష్ణుని ముందు నిలుపుకొని త్వరపడుతూ, ప్రాయోపవేశం చేసి ఉన్న మనస్విని అయిన ద్రౌపది దగ్గరకు వచ్చారు." వైశంపాయనుడు చెప్తున్నాడు. "ఆపై పురుషోత్తములైన పాండవులు, కృష్ణునితో కలిసి, వాయువేగం గల మేలు జాతి గుర్రాలతో మరల శిబిరానికి వచ్చారు. ఆ మహారథులు రథాలనుండి దిగి త్వరపడుతూ, దీనంగా ఉన్న ద్రౌపదిని చూశారు. వారు మరీ దీనులై ఉన్నారు. దుఃఖశోకాలకు లోనై, ఆనందానికి దూరమై ఉన్న ఆ ద్రౌపది చుట్టూ కృష్ణునితో సహా పాండవులు నిలిచారు. ఆపై ధర్మరాజు అనుమతితో, మహాబలుడైన భీమసేనుడు, ఆ దివ్యమణిని ద్రౌపదికిచ్చి ఈ మాట అన్నాడు. "కళ్యాణీ! నీ కుమారులను చంపిన ఆ అశ్వత్థామ శిరోమణి ఇదియే. అతడు ఓడిపోయాడు. శోకాన్ని వీడిలెమ్ము ! క్షాత్రధర్మాన్ని స్మరించుకో. కృష్ణుడు సంధికై వెళ్ళుతున్నప్పుడు ఆ మధుసూదనునితో నీవన్న మాటలు తలచుకో. ధర్మరాజు శాంతిని కోరుతూ కృష్ణుని పంపుతున్నపుడు "గోవిందా! నాకు భర్తలు లేరు. కొడుకులు లేరు. సోదరులు లేరు. ఇక నీవూ లేవు" అంటూ పురుషోత్తమునితో నీవు క్షత్రధర్మానికి అనుగుణంగా, తీవ్రంగా పలికిన మాటలను తలచుకోవాలి. రాజ్యాన్ని కాజేసిన పాపాత్ముడు - దుర్యోధనుడు చచ్చిపోయాడు. నేను చెలరేగి దుశ్శాసనుని నెత్తురు త్రాగాను. శత్రుత్వ ఋణం తీరింది. మాటకారు లెవ్వరూ ఇప్పుడు మనలను నిందించరు. బ్రాహ్మణుడన్న గౌరవంతో అశ్వత్థామను, ఓడించి ప్రాణాలతో విడిచాం. అశ్వత్థామ కీర్తి పడిపోయింది. జీవితం మాత్రమే మిగిలింది. మణిని పీకివేశాం. ఆయుధం నేలబడింది."

ద్రౌపది ఇలా అన్నది. "గురుపుత్రుడు నాకూ గురువే, పుత్రమరణానికి బదులు

కోరాను. అది దొరికింది. భారతా! ధర్మరాజు ఈ మణిని తలదాల్చాలి". ఆపై ధర్మరాజు ఆ మణిని తీసికొని అప్పుడు ద్రౌపది మాటమేరకు దానిని తలదాల్చాడు. అది గురుప్రసాదమని భావించాడు. అప్పుడు సమర్థుడైన ధర్మరాజు, ఆ దివ్యమణిని శిరసా ధరించి, చంద్రునితో కూడిన పర్వతంవలె శోభించాడు. ఆ తరువాత పుత్రశోకంతో దీనంగా ఉన్న ఆ మనస్విని - ద్రౌపది లేచింది. ధర్మరాజు కృష్ణుని ఇలా అడిగాడు.

17. కృష్ణ యుధిష్ఠిర సంవాదము

రాత్రివేళ ముగ్గురు మహారథులు సర్వసేనలనూ సంహరించగా, దానికై దుఃఖిస్తూ ధర్మరాజు కృష్ణునితో ఇలా పలికాడు. "కృష్ణా! అశ్వత్థామ క్షుద్రుడు, పాపాత్ముడు, ఏగొప్పపనులూ చేసినవాడు కాదు. అయినా మహారథు లయిన నా కుమారులను ఎలా చంపగలిగాడు ? అదే విధంగా ద్రుపదుని కొడుకులు అస్త్రవిద్యా నిపుణులు, పరాక్రమవంతులు, లక్షలమందితో కూడా పోరాడగలవారు. వారిని కూడా అశ్వత్థామ ఎలా చంపగలిగాడు ? మేటి విలుకాడైన ద్రోణుడు కూడా రణభూమిలో ధృష్టద్యుమ్నునికి ఎదురుపడేవాడు కాదు. ఆ రథికశ్రేష్ఠుని - ధృష్టద్యుమ్నుని అశ్వత్థామ ఎలా చంపగలిగాడు ? నరోత్తమా? ఒంటరిగా, రణభూమిలో మన వారినందరినీ చంపాడు అశ్వత్థామ. అంత శక్తినివ్వగల పని ఏం చేశాడు తాను ?" శ్రీభగవానుడన్నాడు. "ఆ అశ్వత్థామ దేవదేవుని శరణుకోరాడు. దానితో అందరినీ చంపగలిగాడు. ప్రసన్నుడైన మహాదేవుడు అమరత్వాన్ని కూడా ఇవ్వగలడు. ఇంద్రుని కూడా చంపగల శక్తిని కూడా పరమేశ్వరుడు అనుగ్రహించగలడు. ఆ మహాదేవుని తత్త్వం, గతంలో ఆయన చేసిన వివిధ కర్మలు నాకు తెలుసు. భారతా! ఆయనయే ప్రాణులకు ఆది, మధ్య, అంతం కూడా. ఆయన కర్మవలననే ఈ జగమంతా నడుస్తోంది. ప్రాణసృష్టి చేయదలచిన పితామహుడు, ముందు ఈ మహాదేవుని వైపే చూసి 'ప్రాణులను సృష్టించు. జాగు చేయవద్దు'. అని ఆయనతో అన్నాడు. అలాగే అని పలికి మహాదేవుడు భూతాలలోని వివిధ దోషాలను చూసి, నీటిలో మునిగి ఆ మహాతపస్వి దీర్ఘకాలం తపస్సు చేశాడు. ఆపై ఆయనకై ఎంతోకాలం ఎదురుచూసి, బ్రహ్మ సర్వభూత సృష్టికర్తను మరొకని మనసా సృష్టించాడు.

అప్పుడు ఆ రెండవ స్రష్ట నీటిలో నిదురించిఉన్న మహాదేవుని చూసి "నాకన్న పెద్దవాడు మరొకడు లేకపోతేనే నేను ప్రజలను సృష్టిస్తాను" అని తండ్రితో పలికాడు. అప్పుడు తండ్రి ఆయనతో "నీవు తప్ప నీ కన్నా ముందు పుట్టినవాడెవ్వడూ ఉండడు.

ఈ స్థాణువు నీటమునిగియున్నాడు. స్వేచ్ఛగా సృష్టి చేయి" అన్నాడు. అప్పుడు సృష్టికర్త ఏడురకాల భూతాలను, దక్షుడు మొదలైన ప్రజాపతులను సృష్టించాడు. వారి ద్వారా ఈ చతుర్విధ భూతసముదాయం విస్తరించింది. రాజా! సృష్టి జరగగానే సర్వప్రజలు ఆకలికి గురియై, ప్రజాపతినే తిని వేయాలని వెంటనే ఆయన దగ్గరకు పరుగుపెట్టారు. వారు తినివేయబోతుంటే, ఆ ప్రజాపతి రక్షణ కోరుతూ, పితామహుని దగ్గరకు పరుగెత్తి "తమరే వీరినుండి కాపాడాలి. వీరికి వృత్తిని కల్పించండి" అని అడిగాడు. అప్పుడు వారికి అన్నం, ఓషధులు మొదలయిన స్థావరపదార్థాలనూ, జంగమప్రాణులను ఆహారంగా ఇచ్చాడు. బలంగల ప్రాణులకు బలహీన ప్రాణులను ఆహారంగా నిర్ణయించాడు. రాజా! సృష్టించబడిన ఆ ప్రాణులు, భోజనవిధి కుదరటంతో, వచ్చిన రీతిగానే వెళ్ళిపోయారు.

అప్పటినుండి తమవారిపై ప్రీతిని పెంచుకొంటూ వర్ధిల్లసాగారు. భూతసముదాయం పెరిగింది. బ్రహ్మ ఆనందించాడు. అప్పుడు జ్యేష్ఠుడు నీటినుండి లేచాడు. ఈ ప్రజలను చూశాడు. అనేక రూపాల ప్రజలు సృష్టింపబడ్డారు. తమ తేజస్సుతో వృద్ధి చెందారు. పూజ్యుడైన రుద్రుడు కోపించాడు. తన లింగాన్ని ఖండించి విసిరివేశాడు. ఖండింపబడి, విసిరివేయబడిన ఆ లింగం అలాగే భూమిపై నిలిచింది. అవ్యయబ్రహ్మ మాటలతో ఆయనను శాంతింపజేయగోరి ఇలా అన్నాడు. "శర్వా! నీటిలో చిరకాలమున్నావు. ఏం చేశావు? ఇప్పుడు ఈ లింగాన్ని సృష్టించి నేలపై ఎందుకు పడవేశావు ?" దానితో జగద్గురువైన శివుడు కోపంతో బ్రహ్మతో ఇలా అన్నాడు. "ఇంకెవరో ప్రజలను సృష్టించారు. ఇక ఈ లింగంతో ఏం చేసికొనేది ? పితామహా! నేను తపస్సు చేసి ప్రజలకోసం అన్నాన్ని సంపాదించాను. ఈ ఓషధులు (అన్నం) ప్రజలవలెనే ఎప్పుడూ విభిన్న రూపాలను పొందుతుంటాయి." అలా పలికి మహాతపస్వి అయిన ఆ దేవదేవుడు కోపంతో, వికల మనస్సుతో తపస్సు చేయటానికై ముంజవత్పర్వత పాదాల దగ్గరకు వెళ్ళిపోయాడు."

18. మహాదేవుని కోపము - అమగ్రహము

శ్రీభగవానుడిలా చెప్తున్నాడు. "ఆపై సత్యయుగం ముగిసిన తరువాత దేవతలు యథావిధిగా యజ్ఞాలను చేయదలచి, వేదప్రమాణాల ననుసరించి యజ్ఞం చేశారు. ఆ తరువాత యజ్ఞసాధనాలను, హవిస్సులను, యజ్ఞభాగాలు పొందవలసిన దేవతలను, యజ్ఞద్రవ్యాలను కల్పించుకొన్నారు. రాజా! అప్పుడు దేవతలు రుద్రుని వాస్తవస్వరూపాన్ని గుర్తించలేక, స్థాణువైన పరమశివునకు యాగభాగాన్ని కల్పించలేదు. అమరులు యజ్ఞభాగాలను

కల్పించకపోవటంతో, పరమశివుడు వారిని శిక్షింపదలచి, సాధనాలను కల్పించుకొనదలచి ముందు వింటిని సృష్టించాడు. లోకయజ్ఞం, క్రియా యజ్ఞం, సనాతనమైన గృహయజ్ఞం, పంచభూత యజ్ఞం, మనుష్య యజ్ఞ మని యజ్ఞం అయిదు రకాలు. వాటినుండి సర్వజగత్తు పుట్టింది. లోకయజ్ఞ, మనుష్యయజ్ఞాలతో, కపర్ది ధనుస్సును సృష్టించాడు. ఆ ధనుస్సు అయిదు మూరల పొడవు గలది. భారతా! వషట్‌కారం ఆ వింటికి అల్లెత్రాడయింది. యజ్ఞాంగాలు నాలుగు (స్నానం, దానం, హోమం, జపం) ఆయనకు కవచమయ్యాయి. ఆపై మహాదేవుడు ఆ వింటిని తీసికొని, కోపంతో, దేవతలు యాగం చేస్తున్న చోటికి వచ్చాడు. బ్రహ్మచారి, అవ్యయుడు అయిన మహాదేవుడు వింటినిపట్టగా చూసి, భూదేవి వ్యథ చెందింది. పర్వతాలు కంపించాయి. గాలి వీచలేదు. అజ్యమిచ్చినా అగ్నిమండలేదు. ఆకాశంలోని నక్షత్రమండలం ఉద్విగ్నతతో తిరుగసాగింది. సూర్యుడు ప్రకాశించలేదు. చంద్రమండలంలో శోభలేదు. ఆకాశమంతా చీకటితో చుట్టుకొని ఉంది. దానితో దేవతలు దెబ్బతిన్నారు. విషయాన్ని గ్రహించలేకపోయారు. యజ్ఞవిధి కూడా మనస్సులలో స్ఫురించలేదు. దానితో దేవతలు భయపడ్డారు. ఆపై శివుడు భయంకరబాణంతో యజ్ఞపురుషుని రొమ్ముపై గాయపరిచాడు. దానితో యజ్ఞపురుషుడు మృగరూపాన్ని ధరించి అగ్నితో పాటు పారిపోయాడు. ఆ యజ్ఞపురుషుడు అదే రూపంతో (మృగశీర్షనక్షత్ర రూపం) ఆకాశాన్ని చేరి, విరాజిల్లసాగాడు.

యుధిష్ఠిరా! ఆకాశంలో కూడా రుద్రుడు (ఆరుద్ర) ఆయనను అనుసరించాడు. యజ్ఞుడు అక్కడనుండి తొలగిపోగా దేవతల చైతన్యం లుప్తమయింది. చైతన్యం కోల్పోవటంతో, దేవతలకేమీ తెలియలేదు. పరమశివుడు కోపించి, వింటికొనతో సవిత బాహువులను, భగుని కళ్ళను, పూషనిదంతాలను ఖండించాడు. ఆపై దేవతలు, యజ్ఞాంగాలు అన్నీ అక్కడనుండి పారిపోయాయి. కొందరు అక్కడే పడి మూలుగుతూ మృతప్రాయులయ్యారు. ఆ శితికంఠుడు, యాగసంబంధమైనదంతా తొలగించి, దేవతలను పరిహసించి, వింటికొనను ఆసరాగా తీసికొని దేవతలను నిరోధించాడు. ఆపై దేవతల ప్రేరణతో వాణి ఆ వింటి అల్లెత్రాటిని త్రెంపివేసింది. రాజా! అల్లెత్రాడు తెగిన ఆ ధనుస్సు, వెంటనే ఎగిరిపడింది. ఆపై దేవతలు, యజ్ఞపురుషునితో సహా, విల్లు చేతిలో లేని ఆ పరమశివుని సమీపించి శరణుకోరారు. ఆ ప్రభువు అనుగ్రహించాడు. రాజా! ఆ తరువాత ప్రసన్నుడైన పరమశివుడు తన కోపాన్ని జలాశయంలో ఉంచాడు. ఆ జలమే అగ్నిగా మారి ఎప్పుడూ నీటిని శుష్కింపజేస్తుంది. పాండునందనా! పరమశివుడు భగుని కళ్ళను, సవిత బాహువులను, పూష దంతాలను, యజ్ఞాంగాలను మరలా కల్పించాడు. ఆపై తిరిగి సమస్తమూ

యథాపూర్వస్థితికి వచ్చింది. దేవతలు సర్వహవిస్సులలో మహాదేవునకు భాగం కల్పించారు. రాజా! మహాదేవుడు కోపిస్తే లోకమంతా అస్వస్థతకు గురి అయింది. ప్రసన్నుడు కాగానే మరల స్వస్థతను పొందింది. ఆ వీర్యవంతుడు ఈ అశ్వత్థామకు ప్రసన్న డయ్యాడు. ఆ కారణంగానే మహారథులయిన నీ కుమారులను, పాంచాలుని అనుచరులయిన ఇతర శూరులను చాలామందినీ చంపగలిగాడు. మహాదేవుని అనుగ్రహంతో ఆ అశ్వత్థామ చేసిన పనిని మనస్సులో పెట్టుకోకు. అనంతరకార్యానికి ఉపక్రమించు."

ఇది సౌప్తికపర్వం

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
స్త్రీ పర్వం

1. ధృతరాష్ట్ర విలాపము - సంజయుని సాంత్వనము.

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

నరుల మనస్సులే నివాస స్థానమైన నారాయణునికీ, నరోత్తమునికీ, సరస్వతీ దేవికీ, వ్యాసమహర్షికీ నమస్కరించి శ్రీమహాభారతమును చదువవలెను/ చెప్పవలెను.

జనమేజయుడు ఇలా అన్నాడు. "వైశంపాయన మహర్షీ! దుర్యోధనుడు, అతని సైన్యం మొత్తం మరణించిన వార్త విని, ధృతరాష్ట్ర మహారాజు ఏం చేశాడు ? ఆదే రీతిగా మహామనస్వి, కురురాజు అయిన ధర్మజుడు, కృపుడు, మొదలైన ఆ ముగ్గురు (కృపుడు, కృతవర్మ, అశ్వత్థామ) ఏం చేశారు ? శ్రీకృష్ణుడు అశ్వత్థామను శపించటం, అశ్వత్థామ పాండవులను శపించటం - ఈ పరస్పర శాప వృత్తాంతపర్యతం అశ్వత్థామగురించి విన్నాను. ఆ తరువాత సంజయుడు ధృతరాష్ట్రునకు చెప్పిన వృత్తాంతం చెప్పు." వైశంపాయనుడు చెప్తున్నాడు. "తన నూరుగురు కొడుకులు చనిపోగా, కొమ్మలు విరిగిన చెట్టువలె ఉన్నాడు ధృతరాష్ట్రమహారాజు. పుత్రశోకంతో తీవ్రంగా తపిస్తున్నాడు. మహారాజా! పుత్రులనే తలచుకొంటూ మౌనంగా ఉన్నాడు. చింతలో మునిగిపోయి ఉన్నాడు. ఆ ధృతరాష్ట్రుని సమీపించి సంజయుడిలా చెప్పాడు. "మహారాజా! దుఃఖిస్తున్నావా? ఈ శోకంలో నిన్ను ఆదుకొనేందుకు ఎవ్వరూ లేరు. యుద్ధంలో పడ్డెనిమిది అక్షౌహిణులూ చనిపోయాయి. ఇప్పుడు భూమి నిర్జనమైంది. శూన్యంగా మాత్రమే మిగిలింది. నానా దిక్కులనుండి, నానాదేశాల నుండి రాజులు వచ్చారు... వారందరూ నీ కుమారునితో పాటు చనిపోయారు. తండ్రులకు, కొడుకులకు, మనుమలకు, దాయాదులకు, మిత్రులకు, గురువులకు యథాక్రమంగా అంత్యక్రియలు జరిపించు"

వైశంపాయనుడు చెప్తున్నాడు. "దీనమైన ఆ వాక్యాన్ని విని, పుత్రపౌత్ర మరణంతో పీడింపబడుతున్న ఆ దుర్ధర్షుడైన ధృతరాష్ట్రుడు గాలికి కూలిన చెట్టువలె నేలబడిపోయాడు. ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "పుత్రులు, అమాత్యులు, సర్వ మిత్రులు చనిపోయారు. ఇక ఈ నేలపై సంచరిస్తూ, కేవలం దుఃఖిస్తూ మాత్రమే అనుభవిస్తాను. వార్ధక్యంలో, శిథిలమై, రెక్కలు తెగిపోయిన పక్షివలె, బంధువులను కోల్పోయిన నేను ఇక బ్రతకట మెందుకు? మహాప్రాజ్ఞా! రాజ్యం పోయింది. బంధువులు చనిపోయారు. చూపు మొదటి నుండీ లేదు. కిరణాలు నశించిన సూర్యునివలె ఇక వెలుగొందలేను. మిత్రుల మాట వినలేదు. పరశురాముడు, దేవర్షి అయిన నారదుడు, కృష్ణద్వైపాయనుడు (వ్యాసుడు) చెప్పినా వినలేదు. కొలువులో కృష్ణుడు నాకు శ్రేయస్కరమైన మాట పలికాడు. "రాజా! శత్రుత్వ మిక వద్దు. నీ కుమారుని అదుపు చేయి." అని చెప్పాడు. దుర్మతినైన నేను ఆ మాట కూడా వినలేదు. అందుకే తీవ్రంగా తపిస్తున్నాను. ధర్మయుక్తమైన భీష్మవచనాన్ని ఇక వినలేను. అలాగే ఆబోతులా రంకె వేసే దుర్యోధనుని మాట కూడా ఇక వినలేను. దుశ్శాసనుని వధను, కర్ణుని వినాశాన్ని, ద్రోణు డనే సూర్యునికి గ్రహణం పట్టడాన్ని విని, నా హృదయం బ్రద్దలవుతోంది. సంజయా! మూఢుడనైన నేను ఇప్పుడు ఈ ఫలితాన్ని అనుభవించటానికి, గతంలో ఏ పాపం చేశానో కొంచెం కూడా గుర్తు రావటం లేదు. తప్పక గతజన్మలలో ఏదో పాపం చేసి ఉంటాను. అందువలననే బ్రహ్మ నన్ను దుఃఖానికి కారణమైన పనులలోనే నియోగించాడు. వయస్సు మళ్ళింది. సర్వబంధువులు నశించారు. దైవయోగం వలన సహచరులు, మిత్రులు కూడా పోయారు. ఈ భూమండలంలో నాకన్న ఎక్కువ దుఃఖించే మనిషి ఎవడున్నాడు ? కాబట్టి తెరచిఉన్నటువంటి విశాలబ్రహ్మలోక మార్గంలో ముందుకు సాగిపోయే నన్ను నియతవ్రత శీలురైన పాండవులు ఈనాడే చూస్తారు." వైశంపాయనుడు చెప్తున్నాడు. "తీవ్రశోకాన్ని వ్యక్తంచేస్తూ అలా విలపిస్తున్న ధృతరాష్ట్రుని శోకాన్ని దూరం చేస్తూ సంజయుడిలా పలికాడు.

రాజా! శోకాన్ని తొలగించుకో. నృపోత్తమా! పెద్దల ద్వారా ఎన్నో వేద నిశ్చయాలు, శాస్త్రాలు, ఆగమాలు నీవు విన్నావు. గతంలో సృంజయులు పుత్రశోకంతో దీనులయినప్పుడు మునులు ఏమన్నారో విన్నావు గదా! రాజా! నీ కొడుకు యౌవనంలో పుట్టిన పాగరుతో ప్రవర్తిస్తున్నప్పుడు, ఆత్మీయులు చెప్పిన మాటను నీవు పట్టించుకోలేదు. నీవు లోభంతో, ఫలితం మీద పేరాసతో నీ స్వార్థంలో మరెవ్వరికీ చోటు పెట్టలేదు. ఒకే వాదర గల కత్తివలె నీ బుద్ధికనుగుణంగా ప్రవర్తించావు. దాదాపు శీలసంపద లేని వారినే ఎల్లప్పుడూ

ఆశ్రయించావు. దుశ్శాసనుడు, దురాత్ముడైన రాధేయుడు, దుష్టమనస్కుడైన శకుని, దుర్బుద్ధి అయిన చిత్రసేనుడు, ఈ లోకాన్నంత కంటకప్రాయం చేసిన శల్యుడు నీ కుమారునకు మంత్రులు. కురువృద్ధుడైన భీష్ముడు, విదురుడు, ద్రోణుడు, శరద్వత్సుతుడైన కృపుడు, కృష్ణుడు, ధీమంతుడైన నారదుడు, అమిత తేజస్వి అయిన వ్యాసుడు, ఇతర ఋషులు – వీరెవ్వరి మాటా నీ కొడుకు వినలేదు. ఎప్పుడూ యుద్ధాన్నే కోరుతూ, ఏ ధర్మాన్నీ సరిగా అనుష్ఠించలేదు. అల్పబుద్ధియై, అహంకారియై, నిత్యమూ యుద్ధాన్ని గురించియే మాటాడేవాడు. పరాక్రమవంతుడైనా సదా క్రూరుడై, అసహనశీలుడై, అసంతుష్టుడై ఉండేవాడు. చదువుకొన్నవాడవు, మేధావివి, సదా సత్యవంతుడవు, నీవంటి బుద్ధిమంతులు, సజ్జనులు మోహానికి లోనుకారాదు.

నీ కుమారుడు ఏ ధర్మాన్నీ సరిగా పాటించలేదు. రాజు లందరినీ సంహరింపజేశాడు. శత్రువుల కీర్తిని వర్ధిల్లజేశాడు. నీవు కూడా తటస్థంగానే ఉన్నావు. తగినమాట ఏదీ చెప్పలేదు. నీవు ఎదురులేనివాడవు. కానీ ఉభయపక్షాల భారాన్నీ సరిగా తూకం వేయలేదు. మనుష్యుడు మొదటే యథోచితంగా ప్రవర్తించాలి. అప్పుడు జరిగిపోయిన అర్థాన్ని గురించి పశ్చాత్తాపపడవలసిన అవసర ముండదు. రాజా! పుత్రలోభంతో నీవు అతనికి ప్రియాన్నే చేయగోరావు. అందువలననే ఈ పశ్చాత్తాపాన్ని పొందుతున్నావు. నీవు బాధపడదగదు. పైనున్న తేనెను మాత్రమే చూస్తూ, క్రిందనున్న లోయను గమనించకపోతే, మధులోభంతో లోయలో పడతాడు. ఇప్పటి నీవలె దుఃఖిస్తాడు. దుఃఖిస్తూ ఉంటే అర్థసిద్ధి ఉండదు. శోకిస్తూ ఉంటే ఏ ఫలాన్నీ పొందలేం. శోకించేవాడు సంపద పొందలేడు. శోకపరాయణుడైతే పరమాత్మను కూడా పొందలేడు. స్వయంగా నిప్పు వెలిగించి, బట్టలలో చుట్టబెట్టుకొని, తగులబడిపోతున్నానని మనస్తాపాన్ని పొందితే వాడు పండితుడు కాడు. నీవూ, నీ కుమారుడూ కలిసి పాండవ లనే అగ్నిని ముట్టించారు. మీ మాటలు గాలియై వారిని రెచ్చగొట్టాయి. మీ లోభమనే ఆజ్యంతో దాన్ని తడిపారు. ప్రజ్వలిస్తున్న ఆ అగ్నిలో మిడతలవలె, నీ కొడుకులు పడిపోయారు. శరాగ్నిలో దహింపబడిన వారిని గురించి నీవు బాధపడవద్దు. రాజా! నీ ముఖం కన్నీటి ధారలతో తడిసి ఉంది. ఇది శాస్త్ర సమ్మతం కాదు. పండితులు దీనిని అభినందించరు. ఈ కన్నీటి బిందువులు నిప్పురవ్వలవలె మానవులను దహిస్తాయి. కాబట్టి దుఃఖాన్ని విడిచిపెట్టు. నిన్ను నీవు నిగ్రహించుకో. వైశంపాయనుడు చెప్తున్నాడు. పరంతపా! మహాత్ముడైన సంజయుడు అలా ఊరడించగా, మరలా విదురుడు ఆయనను ఓదారుస్తూ సాలోచనతో ఇలా అన్నాడు."

2. విదురుడు ధృతరాష్ట్రుని ఊరడించుట - 1

వైశంపాయనుడిలా చెప్పాడు. "ఆ తరువాత అమృతతుల్యవచనాలతో పురుషశ్రేష్ఠుడైన ధృతరాష్ట్రుని ఆనందింపజేస్తూ విదురుడు చెప్పినది విను. విదురుడు చెప్తున్నాడు. "రాజా! లే! పడుకొన్నావెందుకు? నిన్ను నీవు నిగ్రహించుకో. ప్రజానాథా! సర్వప్రాణులకూ పరాగతి ఇదియే. **కూడిబెట్టినవాటికి నాశమే ముగింపు. ఎగిసిపాటుకు పతనమే ముగింపు. సంయోగాలకు వియోగమే ముగింపు. జీవితానికి మరణమే ముగింపు.*** భారతా! క్షత్రియశ్రేష్ఠా! శూరుని అయినా, పిరికివానినైనా యముడు లాగుకొనిపోతాడు. ఆ స్థితిలో క్షత్రియులు పోరాడక ఏం చేస్తారు. మహారాజా! పోరాడకపోయినా మరణించవచ్చు. పోరాడినా జీవించవచ్చు. కాలం సమీపిస్తే అంతే ! ఎవ్వడూ అతిక్రమించలేడు. భారతా! ప్రాణులు పుట్టకముందు లేవు. మధ్యలో కనిపిస్తాయి. పోయిన తరువాత ఉండవు. దానికై ఏడుపెందుకు? నరుడు శోకిస్తున్నా కూడా, చనిపోయినవారి ననుసరించడు. దుఃఖిస్తాడే కానీ వారికై చావడు. లోకస్వభావ సిద్ధమిది. ఇక దేనికై దుఃఖిస్తున్నావు ? కురుసత్తమా! వివిధజాతులకు చెందిన సర్వప్రాణులనూ కాలం లాగుకొని పోతుంది. కాలానికి ఎవ్వడూ ప్రియమైనవాడు కాదు. ఎవ్వడూ ద్వేషించదగినవాడూ కాదు.

భరతర్షభా! గాలి గడ్డిపోచలను అన్నివైపులకూ త్రిప్పినట్లు, ప్రాణులన్నీ కూడా, కాలానికి అధీనమై తిరుగుతాయి. ఒకటిగా సంసారయాత్ర చేస్తున్న వారందరూ అక్కడకు వెళ్ళవలసినవారే. ముందు ఎవరి కాలంవస్తే వాడు ముందుగా వెళతాడు. దానికి ఏడుపెందుకు ? రాజా! రణభూమిలో చనిపోయిన వీరికోసం కూడా శోకింపనవసరం లేదు. శాస్త్రాలు నీకు ప్రమాణమే అయితే వారంతా పరమగతిని పొందినట్లే. అందరూ అధ్యయన సంపన్నులే. అందరు వ్రతాలను పాటించినవారే. అందరూ ఎదురునిలిచి నశించినవారే. దానికై ఏడుపెందుకు ? కనిపించని చోటు నుండి వచ్చారు. మరలా కనిపించకుండా పోయారు. వారు నీ వారూ కాదు. నీవు వారివాడవూ కాదు. దానికై ఏడుపెందుకు ? చనిపోతే స్వర్గానికి వెళ్ళవచ్చు. చంపితే కీర్తిని పొందవచ్చు. రెండూ గొప్పవే. యుద్ధంలో నిష్ఫలత లేదు. భరతర్షభా! ఇంద్రుడు వీరికిష్టమైన కోరికలు తీర్చే, లోకాలను వీరికై కల్పిస్తాడు. వీరంతా ఇంద్రునకు అతిథులవుతారు. శూరులు యుద్ధంలో చనిపోతే స్వర్గానికి వెళతారు. ఆ అవకాశం భూరిదక్షిణలతో చేసిన యాగాలవలన గానీ, తపస్సులవలన కానీ, విద్యవలన

---

* **సర్వే క్షయాంతా నిచయాః పతనాంతాః సముచ్ఛ్రయాః ।**
సంయోగా విప్రయోగాంతాః మరణాంతం చ జీవితమ్ ॥ 3

కానీ అంత తేలికకాదు. శూరుల శరీరాగ్నులలో వారు శరాలను ఆహుతులుగా చేసి హోమాలు చేశారు. ఆ తేజస్సులు తమ శరీరాలలో ఆహుతి చేయబడుతున్న శరీరాలను పరస్పరం సహించారు. రాజా! అందుకే నీకు చెప్తున్నాను. ఈ లోకంలో క్షత్రియునకు స్వర్గం చేరటానికి, యుద్ధంకన్నా గొప్పదైన మంచిబాట లేదు. యుద్ధానికి వన్నె తేగల మహాత్ములు, శూరులు అయిన ఆ క్షత్రియు లందరూ గొప్ప దీవనలు పొందారు. వారిలో ఎవ్వరినీ గురించి శోకింప నవసరం లేదు. పురుషశ్రేష్ఠా! నిన్ను నీవే ఊరడించుకో. శోకించవద్దు. ఇప్పుడు నీవు శోకంతో దెబ్బతిని, శరీరత్యాగం చేయదగదు.

సంసారపరంపరలో వేలకొలదిగ తల్లిదండ్రులు ఉన్నారు. పిల్లలు, భార్యలు వందల కొలది కడచి పోయారు. వారెవరివారు ? మనమెవరివారం ? వేలకొలదిగ శోకకారణాలు, వందలకొలదిగ భయకారణాలు ప్రతిదినమూ కలుగుతుంటాయి. కానీ అవి మూఢుని ఆవేశిస్తాయి. పండితుని ఆవేశింపవు. కురుసత్తమా! కాలానికి ఇష్టమైనవాడు కానీ ద్వేషింపదగినవాడు కానీ ఎవ్వడూ లేడు. దానికెక్కడా తటస్థస్థితి కూడా లేదు. కాల మన్నింటినీ లాగుకొంటుంది. కాలం ప్రాణులను పరిపక్వం చేస్తుంది. కాలం ప్రజలను లయింపజేస్తుంది. అందరూ నిదురిస్తున్నా, ఆది మేలుకొంటుంది. కాలాన్ని అతిక్రమించటం కష్టం. యౌవనమూ, రూపమూ, జీవితమూ, ధనాన్ని కూడబెట్టడం ఆరోగ్యమూ, ప్రియుల సహవాసమూ – అన్నీ అనిత్యాలే. పండితుడు వాటికై లోభపడడు. ఈ దుఃఖం అందరిదీ. నీవొక్కడవే బాధపడకూడదు. శోకిస్తూ మరణించినా కూడా శోకమేమీ తొలగిపోదు. తనలో పరాక్రమముంటే, శోకించటం మాని, శోక కారణానికి ప్రతిక్రియ చేయాలి. దుఃఖాన్ని గురించి ఆలోచింపకపోవటమే దానికి తగిన చికిత్స. ఆలోచిస్తుంటే అది పోదు. పైపెచ్చు పెరుగుతుంది. అనిష్టపదార్థాలతో సంయోగం, ఇష్టపదార్థాలతో వియోగం – ఈ రెండింటివలన, అల్పబుద్ధులయిన మానవులు మాత్రమే, దుఃఖానికి లోనై తపింపబడతారు. నీవిలా శోకించటం వలన అర్థం కానీ, ధర్మం కానీ, సుఖం కానీ లేదు. దీనివలన కర్తవ్యం నుండి భ్రష్టులవుతారు మనుష్యులు. ధర్మార్థకామాలకు దూరమవుతారు.

ధనంయొక్క వివిధ విశిష్టదశలు కలిగినప్పుడు అసంతుష్టులు మోహానికి గురి అవుతారు. పండితులు మాత్రం సంతోషిస్తారు. ప్రజ్ఞతో మానస దుఃఖాన్ని, ఔషధాలతో శారీర దుఃఖాన్ని దూరం చేసికోవాలి. ఇది విజ్ఞాన సామర్థ్యం. బాలురవలె అవివేకంతో వ్యవహరించగూడదు. నరుడు పూర్వజన్మలో చేసిన కర్మ తాను పడుకొంటే పడుకొంటుంది. నిలిస్తే నిలుస్తుంది. పరుగెత్తితే వెంటబడి పరుగెత్తుతుంది. శుభమో, అశుభమో ఏయే

దశలలో ఏయే పనిచేస్తే, ఆయా దశలలో దాని ఫలితాన్ని పొందవలసి వస్తుంది. ఎవరై, ఏయే శరీరంతో ఏయే పనిని చేస్తే, ఆయా శరీరాన్ని ఆయా పనుల ఫలితాన్ని పొందవలసి వస్తుంది. తనకు తానే బంధువు. తనకు తానే శత్రువు. తనకుతానే సాక్షి. మంచి పనిచేసినా, చెడ్డ పనిచేసినా సరే! శుభకర్మ ద్వారా సౌఖ్యం, పాపకర్మ ద్వారా దుఃఖం, ఏదైనా, చేసిన దాని ఫలితమే కానీ చేయనిది ఎక్కడా కలగదు. జ్ఞానానికి విరుద్ధాలై, అనేకాపాయాలను కలిగించే పనులు మూలానికే మోసం తెస్తాయి. నీవంటి బుద్ధిమంతుడు అటువంటివానిలో తగుల్కొనడు."

3. విదురుడు ధృతరాష్ట్రుని ఊరడించుట - 2

ధృతరాష్ట్రుడు ఇలా అడిగాడు. "మహాప్రాజ్ఞా! నీ మంచి మాటలతో నాశోకం తొలగిపోయింది. ఇంకా తాత్త్వికవచనాలను వినా లనుకొంటున్నాను. అనిష్ట వస్తు సంయోగం వలన, ఇష్టవస్తు వియోగం వలన కలిగే మానసిక దుఃఖం నుండి పండితులు ఎలా బయటపడతారు?" విదురుడు చెప్తున్నాడు. "మనస్సు ఏ ప్రయత్నం వలన దుఃఖం నుండి కానీ, సుఖం నుండి కానీ విడుదల పొందుతుందో ఆ ప్రయత్నాల ద్వారా దానిని నియంత్రించి జ్ఞాని శాంతిని పొందాలి. బాగా ఆలోచిస్తే ఇదంతా అశాశ్వతం. లోకం అరటిబోదె వంటిది. దానిలో సారముండదు. ప్రాజ్ఞులు కానీ, మూఢులు కానీ, ధనవంతులు కానీ, దరిద్రులు కానీ అందరూ శ్మశానభూమిలో నిశ్చింతగా నిదురిస్తుంటారు. మాంసరహితంగా, ఎముకల ప్రోవుగా, నరాలతో బంధింపబడి ఉన్న ఆ శరీరాలను చూసి, ఇతరులు వానిలో కులరూప విశేషాలను గుర్తించగల ప్రత్యేకతను చూడగలరా? అయినా ఒకరిపై ఒకరు ముచ్చటపడతా రెందుకు? నరుల బుద్ధులు వంచనకు లోనయ్యాయి. మానవుల శరీరాలు గృహాల వంటివని పండితులు చెప్పారు. అవన్నీ సమయం వచ్చినప్పుడు నశించేవే. శాశ్వతంగా నిలిచేది ఆత్మ ఒక్కటే. బట్ట చిరిగినా, చిరగకపోయినా పురుషుడు దానిని వీడి, మరొకవస్త్రాన్ని ఇష్టపడతాడు. ప్రాణుల శరీరాలు కూడా అటువంటివే. సమయాన్ని బట్టి స్వీకరిస్తారు, విడిచిపెడతారు.

ప్రాణులు తాము చేసిన కర్మను బట్టియే ఈ లోకంలో దుఃఖాన్నో, సుఖాన్నో పొందుతారు. కర్మనుబట్టి స్వర్గమో, (నరకమో), సుఖమో, దుఃఖమో కలుగుతాయి. ప్రాణి ఆ భారాన్ని స్వవశుడయి కానీ, పరవశుడై కానీ మోస్తుంటాడు. మట్టికుండను చేసేటప్పుడు, మట్టి ముద్దను చక్రంమీద పెట్టగానే విరిగిపోవచ్చు. కొన్ని కొంత తయారయిన

తరువాత, కొన్ని దాదాపు పూర్తిగా తయారయిన తరువాత, కొన్ని దారంతో కోసేటప్పుడు, కొన్ని క్రిందకు దించిన తరువాత, కొన్ని పచ్చిగా ఉన్నప్పుడే, కొన్ని ఎండిన పిదప, కొన్ని కాల్చేటప్పుడు, కొన్ని కాలిన తరువాత ఎత్తిపెట్టేటప్పుడు, కొన్ని పైకెత్తిన తరువాత నశించి పోతుంటాయి. మానవశరీరాలు కూడా అంతే. కొందరు గర్భంలోనే, కొందరు పుట్టగానే, కొందరు రోజులలో, కొందరు పక్షంలో, కొందరు ఒకనెలలో కొందరు సంవత్సరంలో, కొందరు రెండు సంవత్సరాలలో, కొందరు యౌవనంలో, కొందరు మధ్య వయస్సులో, కొందరు ముసలితనంలో మరణిస్తారు. పురాకృత కర్మల ననుసరించి ఉంటారు. లేదా పోతారు. లోకసిద్ధి ఇలా ఉంటే బాధపడతావెందుకు ? రాజా! క్రీడకోసం నీటిలో దిగిన ప్రాణి కొద్దిసేపు మునుగుతుంది. కొద్దిసేపు పైకి వస్తుంది. ఈ రీతిగా గహనమైన ఈ సంసారంలో మునిగి తేలుతుంటాం. అల్ప బుద్ధులు మాత్రమే ఈ కర్మ భోగంలో చిక్కుకొని బాధలు పడుతుంటారు. ఈ సంసారంలో సత్త్వగుణంలో నిలిచి, అందరిహితాన్ని కోరుతూ, ఈ ప్రాణి సమాగమాలు కర్మను బట్టియే అని తెలిసిన ప్రాజ్ఞులు పరమగతిని పొందుతారు."

4. విదురుడు ధృతరాష్ట్రుని ఊరడించుట - 3

ధృతరాష్ట్రుడడిగాడు. "వాగ్మి శ్రేష్ఠా! గహనమైన ఈ సంసారాన్ని ఎలా అర్థం చేసికోవాలి. ఇది వినాలని అడుగుతున్నాను. యథార్థంగా చెప్పు". ప్రాణుల పుట్టుకనుండి సమస్తక్రియ గుర్తింపబడుతోంది. ప్రారంభంలో జీవుడు కలిల రూపంలో ఉంటాడు. (కలిలం = శుక్రశోణితాల ముద్ద) కొంతకాలం తర్వాత - అయిదవ నెల గడచిన తరువాత చైతన్యరూపుడై పిండంలో నివసింప నారంభిస్తాడు. ఆ తరువాత ఆ గర్భస్థ పిండం సర్వాంగసంపూర్ణ మవుతుంది. అప్పుడు రక్తమాంసాలు పూసికొని అపవిత్రమైన గర్భాశయంలో ఉంటాడు. ఆపై వాయు వేగంవలన కాళ్ళపైకి, తల క్రిందకు వస్తుంది. ఆ స్థితిలో యోని ద్వారానికి దగ్గరై ఎన్నో ఇబ్బందులు పడవలసి వస్తుంది. అక్కడ పూర్వకర్మలతో కలిసి, జీవి యోనిమార్గంలో బాధపడుతూ, అక్కడ నుండి వెలువడి, సంసారంలో పడి చాలా ఉపద్రవాలను ఎదుర్కొంటాడు. కుక్కలు మాంసపు ముక్కపై పడినట్లు, బాలగ్రహాలు ఆ జీవుని అనుసరిస్తాయి. ఆపై రోజులు గడిచే కొద్దీ, తన కర్మలచే బంధింపబడిన ఆ జీవునికి, ఆయా అవస్థలకు సంబంధించిన వ్యాధులు సంక్రమిస్తాయి. రాజా! ఆసక్తి కారణంగా, రసప్రతీతి గల ఇంద్రియ పాశాలచే బంధింపబడిన ఆ జీవునకు వివిధ వ్యసనాలు కూడా కలుగుతాయి. ఆ ఇంద్రియాలకు లోబడిన జీవుడు

ఎప్పుడూ తృప్తిపడడు. అప్పుడు మంచిపని చేస్తున్నా, చెడ్డపని చేస్తున్నా కూడా అతనికేమీ అర్థంకాదు. ధ్యానంలో లగ్నమైఉన్నవారు, సరియైన మార్గంలో నడిచి ఆత్మరక్షణ చేసి కొనగలుగుతారు. అలా లేనివారు, దగ్గరకు వచ్చిన యమలోకాన్ని గూడా గ్రహించలేరు. కాలం వచ్చినపుడు యమదూతలచే వెలుపలికి లాగబడి, మృత్యువును పొందుతాడు. అపుడు మాటాడలేడు. తాను చేసిన శుభాశుభకర్మలు తనముందే ప్రకటింపబడతాయి.

మరల తనను తాను బంధాలను లోను చేసికొంటూ ఉదాసీనంగా ఉంటాడు. లోభానికి వశమై ఈ లోకం మోసంలో పడిపోతోంది. లోభ క్రోధ భయాలతో ఉన్మత్తమై తనను తాను తెలిసికొన లేకపోతోంది. తక్కువ వంశంలో పుట్టినవారిని అసహ్యించుకొంటూ కులీనతలో తృప్తి పడుతుంది. ధనవంతుడు ధనగర్వంతో పేదవారిని అసహ్యించుకొంటాడు. ఇతరులను మూర్ఖులంటూ తనను తాను గమనించుకోడు. ఇతరుల దోషాలను అధిక్షేపిస్తాడు కానీ తనను తాను అదుపు చేసికోడు. ప్రాజ్ఞులు కానీ, మూఢులు కానీ, ధనవంతులు కానీ, దరిద్రులు కానీ, కులీనులు కానీ, తక్కువ వంశం వారు కానీ, అభిమానవంతులు కానీ, అభిమానహీనులు కానీ అందరూ శ్మశానభూమిలో చర్మం కూడా నశించి నిదురిస్తుంటారు. మాంసరహితంగా, ఎముకలప్రోవుగా, నరాలతో బంధింపబడియున్న ఆ శరీరాలను చూసి, ఇతరులు వానిలో కులరూప విశేషాలను గుర్తించగల ప్రత్యేకతను చూడగలరా? మరణానంతరం శ్మశానంలో అందరూ సమానంగానే నేలపై గోతిలో ఉంచబడి నిదురిస్తారు. అయినా దుర్బుద్ధితో పరస్పరం మోసగించుకొంటుంటారు. అనిశ్చితమైన ఈ జీవలోకంలో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఈ వేదవచనాన్ని తెలిసికొని, పుట్టిననాటి నుండీ ధర్మాన్ని అవలంబించిన వాడు పరమగతిని పొందుతాడు. రాజా! ఈ రీతిగా సర్వమూ గ్రహించి, తత్త్వాన్ని అనుసరించినవాడు మోక్షమార్గాన్ని పొందగలడు."

5. విదురుడు ధృతరాష్ట్రుని ఊరడించుట - 4

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "ధర్మంలోని నిగూఢవిషయాలు బుద్ధిచేతనే తెలిసికొనబడతాయి. కాబట్టి ఆ బుద్ధిమార్గాన్ని పూర్తిగా సవిస్తరంగా నాకు చెప్పు". విదురుడు చెప్పున్నాడు. "స్వయంభువునకు నమస్కరించి నిగూఢమైన ఈ సంసారవనాన్ని గురించి నీకు వివరిస్తాను. పరమమునులు ఆ విషయాలు తెలుపుతుంటారు. ఒకానొక మహారణ్యంలో ప్రయాణిస్తున్న ఒక బ్రాహ్మణుడు మరీ దట్టమైన ప్రదేశానికి వచ్చాడు. అక్కడ క్రూరజంతువులు నిండా ఉన్నాయి. పెద్దపెద్దగా అరుస్తున్న సింహాలు, పులులు, ఏనుగులు, ఎలుగుబంట్ల సమూహాలతో అతిఘోరంగా ఉంది. పెద్దపెద్ద ఆకారాలతో

భీకరమై భయపెడుతున్న మాంసభక్షక జీవులు అన్నివైపులా చుట్టేస్తున్నారు. దానిని చూస్తే యముడు కూడా భయపడేటట్లుంది. పరంతపా! అది చూసి ఆ ద్విజుని హృదయం తీవ్రంగా ఉద్వేగానికి లోనైంది. వెంట్రుకలు నిక్కబొడుచుకొన్నాయి. మనస్సు వికారాలకు లోనైంది. ఆ విప్రుడు ఆ వనంలో వెనుకకు మరలుతున్నాడు. ఇటూ అటూ పరుగెత్తుతున్నాడు. శరణమెక్కడ దొరుకుతుందని అన్నిదిక్కులలో చూస్తున్నాడు. అతడు ఆ జంతువుల మధ్య సందు చూసికొని భయపీడితుడై పరుగిడుతున్నాడు. కానీ ఎక్కువదూరం వెళ్ళలేకపోతున్నాడు. అవి కూడా ఆయనను వదలటం లేదు.

అపుడు ఒక పెద్దవలను చూశాడు. అది ఆ వనాన్ని అన్నివైపుల నుండి ఆవరించి ఉంది. పరమఘోరంగా ఒక కాంత దాన్ని తన చేతులతో విసిరిపట్టుకొని ఉంది. ఆ మహావనంలో ఆకాశాన్నంటే పెద్దపెద్ద చెట్లున్నాయి. కొండలవలె బాగా ఎత్తైన అయిదు తలల పాములు వ్యాపించిఉన్నాయి. ఆ వనమధ్యంలో ఒక బావి ఉంది. గడ్డికప్పిన గట్టి తీగలు ఆ బావిని అన్నివైపుల నుండి కప్పి ఉన్నాయి. ఆ ద్విజుడు గూఢంగా ఉన్న ఆ బావిలో పడ్డాడు. లతల సమూహాలు అల్లిఉన్నందున క్రిందపడలేదు. మధ్యలోనే చిక్కుకొని నిలిచాడు. పెద్ద పనసపండు తొడిమతో చెట్టును పట్టుకొని వ్రేలాడినట్లు ఆ విప్రుడు కాళ్ళుపైకి తలక్రిందకూ పెట్టి వ్రేలాడుతున్నాడు. అప్పుడు అక్కడకూడా ఆయనకు మహోపద్రవం కలిగింది. బావి మధ్యలో బలిష్ఠమైన పెద్దపామును చూశాడు. బావి పైభాగాన, గట్టుదగ్గర ఒక పెద్ద ఏనుగును చూశాడు. దానికి ఆరుముఖాలు, పండ్రెండు కాళ్ళు. అది తెల్లగా నల్లగా ఉంది. అది మెల్లగా లతా వృక్షాలతో చుట్టబడిఉన్న ఆ బావి మీదకు వస్తోంది. ఆ బ్రాహ్మణుడు తగుల్కొనియున్న చెట్టు కొమ్మలపై ఘోరమైన, వివిధ రూపాలతో తేనెటీగలు భయంకరంగా ఉన్నాయి. అంతకుముందే పట్టుపెట్టుకొన్న ఆ తేనెటీగలు ఆ తేనెచుట్టూ మూగి ఉన్నాయి.

భరతర్షభా! సర్వప్రాణులకు రుచిగా కనిపించే ఆ తేనెను మాటిమాటికీ త్రాగాలని అవి భావిస్తున్నాయి. బాలుడు కూడా దానివైపు ఆకర్షింపబడతాడు. అప్పుడు అక్కడ ఆ తేనె అనేకధారలుగా స్రవించసాగింది. వ్రేలాడుతున్న ఆ పురుషుడు, ఆ తేనె ధారను నిరంతరంగా త్రాగుతున్నాడు. సంకటస్థితిలో నుండి కూడా ఆ తేనెను త్రాగుతున్న ఆ బ్రాహ్మణుని ఆశ తీరలేదు. తృప్తి లేకుండా మరల మరల ఆపకుండా తేనె త్రాగాలనుకొంటున్నాడు. ఆ స్థితిలో కూడా అతనికి జీవితంపై విరక్తి కలగలేదు. అలా నిరంతరంగా తేనె త్రాగటం మీదనే ఆ బ్రాహ్మణుని జీవితాశ నిలిచింది. నల్లని, తెల్లని ఎలుకలు ఆ చెట్టును కొరుకుతున్నాయి. దట్టమైన ఆ వనాంతంలో పాములు, పరమ

భీకరమైన కాంత, బావిలో క్రింద పాము, పై గట్టుమీద ఏనుగు, ఎలుకలు కొరికితే చెట్టు పడి పోతుందేమో అని అయిదవ భయ కారణం, మధువు మీది ఆశతో తేనెటీగల వలన మహాభయం - ఇది ఆరవది. అలాగే సంసారసాగరంలో పడిపోయిన మనిషి కూడా, అనేక భయాలమధ్య నివసిస్తుంటాడు. జీవితాశ అలాగే ఉంటుంది. ఎప్పుడూ నిర్వేదాన్ని పొందడు."

6. విదురుడు ధృతరాష్ట్రుని ఊరడించుట - 5

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "అయ్యో! ఆ బ్రాహ్మణునకెంత బాధ కలిగింది. ఎంత కష్టపడి నిలద్రొక్కుకున్నాడు ? వాగ్మివరా! ఆ స్థితిలో ఆయనకు తేనెమీద ఎలా ఇష్టం కలిగింది ? సంతోషమెలా కలిగింది ? ఆ బ్రాహ్మణుడు అలా ధర్మ సంకటస్థితికి లోనైన ఆ బ్రాహ్మణుడు నిలిచిన ప్రదేశమేది? ఆ మహాభయం నుండి ఆ నరుడు ఎలా విముక్తి నందగలడు ? అదంతా నాకు వివరంగా చెప్పు. తప్పించే ప్రయత్నం చేద్దాం. ఆయనను ఉద్ధరించాలని నాకెంతో దయ కలుగుతోంది."

విదురుడు చెప్తున్నాడు. "రాజా! మోక్షవేత్తలు ఉదాహరించిన పోలిక ఇది. దీనిని గ్రహించటం వలన, మానవుడు పరలోకంలో సుకృత ఫలాన్ని పొందగలడు. ఆ అడవి అన్నది మహాసంసారమే. దుర్గమవన మన్నది సంసారం యొక్క నిగూఢ (క్లిష్ట) స్వరూపం. పాము లని చెప్పినవన్నీ రోగాలు. పెద్దశరీరంతో అక్కడ నిలిచిఉన్న స్త్రీ అంటే వార్ధక్యమే. అది రూపాన్నీ, రంగునూ నాశనం చేస్తుంది. రాజా! అక్కడ బావి అని చెప్పినది జీవి శరీరమే. అక్కడ బావిలో క్రింద ఉన్న ఆ మహాసర్పం కాలమే. అది సర్వప్రాణులనూ అంతం చేసేది. దేహధారుల సర్వస్వాన్నీ అపహరించేది. బావి మధ్యలో పెరిగిన తీగ దేహధారులకు గల జీవితాశ. దానిలో చిక్కుకొనే గదా ఆ మానవుడు వ్రేలాడుతున్నది. రాజా! ఆ బావిపై గట్టు దగ్గర ఆ చెట్టును సమీపిస్తున్న ఆరు ముఖాల ఏనుగు సంవత్సరం. దానిముఖాలు ఆరు ఋతువులు. పాదాలు పన్నెండు నెలలు. ఎప్పుడూ ఉద్యమిస్తూ, ఆ వృక్షాన్ని కొరుకుతున్న ఎలుకలు రాత్రింబవళ్ళు. ప్రాణివిచారణ చేసే పండితులు అలా చెప్పారు. అక్కడున్న తేనెటీగలు కోరికలుగా చెప్పబడుతున్నాయి. విరివిగా తేనె ధారలను స్రవిస్తున్న ఆ ధారలు, కామరసాలు అని గ్రహించాలి. మానవులు వాటిలోనే మునిగిపోతారు. పండితులు సంసార చక్ర గమనాన్ని ఈ విధంగా గ్రహిస్తారు. అందుకే ఆ బుధులు (వైరాగ్యంతో) సంసారచక్ర బంధాలను ఛేదిస్తారు."

7. విదురుడు ధృతరాష్ట్రుని ఊరడించుట - 6

ధృతరాష్ట్రుడిలా అన్నాడు. "తత్త్వదర్శివయిన నీవు ఆశ్చర్యకరమైన కథ చెప్పావు. నీ వాగమృతాన్ని గ్రోలి మరల నేను ఎంతో ఆనందించాను". విదురుడు చెప్తున్నాడు. "ఈ మార్గాన్ని గురించి మరల విస్తారంగా చెపుతాను విను. దీనిని వింటే విచక్షణులు సంసార బంధాలనుండి విముక్తి పొందుతారు. భారతా! రాజా! సుదీర్ఘమార్గంలో ప్రయాణం ప్రారంభించిన పురుషుడు, శ్రమతో అలసిపోయి, అక్కడక్కడ విడిది చేసినట్లు, ఈ సంసారచక్రంలో అజ్ఞానులు గర్భవాసంలో విడిది చేస్తారు. పండితులు దానినుండి విముక్తి నందుతారు. అందువలననే శాస్త్రవేత్తలయిన జనులు గర్భవాసాన్ని మార్గమనే అంటారు. ధీమంతులు ఈ గహనసంసారాన్నే వన మంటారు. భరతర్షభా! స్థావర జంగమాత్మకాలైన ప్రాణులకు ఇదే సంసారచక్రం. పండితుడు దానిపై ఆసక్తి గొనడు. మర్త్యులకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను కలిగే శారీరమానస వ్యాధులే సర్పాలని పండితులంటారు. భారతా! తమ కర్మ లనే ఆ మహా సర్పాలచే నిత్యమూ బాధింపబడుతూ, నివారింపబడుతూ ఉన్నా కూడా అల్ప బుద్ధులు దీనిపై ఉద్వేగాన్ని (విరక్తిని) పొందరు. రాజా! శబ్ద రూప రస స్పర్శలతో, నానా గంధాలతో మజ్జామాంసా లనే పెద్ద బురదతో కూడుకొని ఎటు చూసినా నిరాలంబంగా ఉన్న ఈ శరీర మనే బావిలో నున్న మనుష్యుడు ఆ వ్యాధుల నుండి విముక్తిని పొందినా, ఆ తరువాత రూపాన్ని నశింపజేసే వార్ధక్యం ఆవరించియే తీరుతుంది. సంవత్సరాలు, నెలలు, పక్షాలు, అహోరాత్రాలు, పూర్వాపర సంధ్యలు క్రమంగా రూపాన్ని, ఆయువును శుష్కింపజేస్తాయి. ఇవి కాలానికి ప్రతినిధులు, అజ్ఞానులు వీటిని గ్రహించలేరు.

సర్వప్రాణుల నుదుట, బ్రహ్మ కర్మనానుసరించి వ్రాసిఉంటాడని పెద్దలంటారు. ప్రాణుల శరీరం రథం. సత్యం సారథి. ఇంద్రియాలు, గుర్రాలు. మనస్సు పగ్గాలు. వేగంగా పరుగెత్తే ఆ గుర్రాల వెంటపడి పరుగెత్తేవాడు, ఈ సంసార చక్రంలో చక్రంవలె తిరుగుతూనే ఉంటాడు. సంయమియై, బుద్ధితో వాటిని నియంత్రించినవాడు మరల సంసారంలో పడడు. ఈ సంసారచక్రంలో పడి చక్రంవలె తిరుగుతున్న వారు, తిరుగుతూ ఉన్నా మోహానికి లోను కాకపోతే, వారు మరలా సంసారభ్రమలో పడరు. రాజా! సంసారంలో తిరిగేవారికి ఇటువంటి దుఃఖమే కలుగుతుంది. అందువలన ఈ బంధనివృత్తికై జ్ఞాని ప్రయత్నం చేయాలి. దీనిని ఉపేక్షించకూడదు. జాగుచేస్తే వందలకొమ్మలతో వృద్ధి చెందుతుంది. రాజా! జితేంద్రియుడై, క్రోధలోభాలను తిరస్కరించి, సంతుష్టుడై, సత్యవాదియై ఉన్న

నరుడు శాంతిని పొందుతాడు. రాజా! ఈ సంసారం యమలోకానికి కొనిపోయే రథం. అజ్ఞానులు దానితో మోహానికి లోనవుతారు. నరాధిపా! నీవు పొందిన ఈ దుఃఖస్థితిని అటువంటి వారు పొందుతారు. భారతా! తృష్ణపెరిగితే, ఇలా రాజ్యనాశం, మిత్రనాశం, పుత్రనాశం తద్ద్వారా మహా దుఃఖం కలుగుతుంది. సజ్జనుడు మనస్సును నియంత్రించుకొని, జ్ఞానమనే మహౌషధాన్ని పొంది, ఈ పరమదుఃఖాలకు చికిత్స చేసికోవాలి. కానీ ఆ మహౌషధం పరమ దుర్లభం. అయినా సాధించి, ఈ దుఃఖరూపమైన మహావ్యాధిని ఛేదించాలి. స్థిరంగా నియంత్రణలో నిలుపుకొన్న మనస్సే, ఈ దుఃఖం నుండి ముక్తిని కలిగించగలదు. అంతే కానీ పరాక్రమమో, ధనమో, మిత్రులో, ఆత్మీయులో దీనిని కల్పించలేరు.

కాబట్టి భారతా! సర్వత్ర మైత్రీభావంతో శీలాన్ని దిద్దుకోవాలి. దమం, త్యాగం, ఏమరుపాటు లేకపోవటం – ఈ మూడు బ్రహ్మను చేర్చే గుర్రాలు, రాజా! శీల మనే పగ్గాలు పట్టి, మానసరథంలో పయనించిన వాడు మృత్యుభయాన్ని వీడి, బ్రహ్మలోకాన్ని చేరగలడు. రాజా! సర్వప్రాణులకూ అభయమిచ్చినవాడు అనామయమై, పరమపదమైన విష్ణుస్థానాన్ని పొందగలడు. నరుడు అభయదానంతో పొందినంత ఫలాన్ని, వేలకొలది యాగాలు చేసినా, నిత్యోపవాసాలు చేసినా కూడా పొందలేడు. భారతా! ప్రాణులకు తమ కన్న ఎక్కువైనది ఏదీ లేదు. ప్రాణుల కన్నింటికీ మరణం ఇష్టంకానిది. కాబట్టి **పండితుడు సర్వ ప్రాణులపై దయము చూపాలి.** బుద్ధిజాలంతో బంధింపబడి, నానామోహాలతో కూడి, సూక్ష్మ దృష్టిలేని మూఢులు అక్కడక్కడే పరిభ్రమిస్తూనే ఉంటారు. **బాగా సూక్ష్మదృష్టి గలవారు శాశ్వతబ్రహ్మ పదాన్ని చేరుతారు.** మహాప్రాజ్ఞా! ఇది గ్రహించి వారికందరికి ఔర్ధ్వ దైహిక క్రియలు చేయి. దానితో నీవు సత్ఫలాన్ని పొందవచ్చు."

8. విదురుడు ధృతరాష్ట్రుని ఊరడించుట - 7

వైశంపాయనుడు చెప్తున్నాడు. "విదురుని ఆ మాట విని, ధృతరాష్ట్రుడు పుత్రశోకంతో కుమిలిపోతూ మూర్ఛిల్లి నేలపై పడ్డాడు. భారతా! చైతన్యాన్ని కోలుపోయి, అలా నేలపైబడిన ఆ ధృతరాష్ట్రుని చూసి బాంధవులు, వ్యాసుడు, విదురుడు, సంజయుడు, ఆత్మీయులైన ఇతరులు, విశ్వసనీయులైన ద్వారపాలకులు – అందరూ చల్లగా, సుఖకరంగా ఉన్న నీటిని చల్లి, వింజామరలతో వీస్తూ, చేతులతో శరీరాన్ని స్పృశిస్తూ, ఆ స్థితిలో నున్న ధృతరాష్ట్రునికి ప్రయత్నపూర్వకంగా చాలాసేపు ఉపచారాలు చేశారు. ఆపై చాలాసేపటికి

స్పృహలోనికి వచ్చిన ధృతరాష్ట్ర మహారాజు, పుత్రశోకంలో మునిగి చాలాసేపు విలపించాడు. మానుషజన్మ ధిక్కరింపదగినది. అందునా వివాహాది బంధాలు. వాటివలననే పదేపదే దుఃఖాలు కలుగుతుంటాయి. రాజా! పుత్రులు నశించినా ధనం నశించినా, దాయాదులు, వియ్యాలవారు నశించినా విషంతో, అగ్నితో సమానమైన మహాదుఃఖం కలుగుతుంది. ఆ దుఃఖం శరీరాలను దహిస్తుంది. దానితో ప్రజ్ఞ నశిస్తుంది. వాటిని ఎదుర్కొనవలసిన పురుషుడు మరణాన్నే గొప్పగా భావిస్తాడు. భాగ్యం తారుమారైనందువలన, బంధునాశన రూపమైన ఆ దుఃఖం నాకు కలిగింది. ప్రాణాలు విడిచిపెట్టడం తప్ప మరో రీతిగా దానిని అధిగమించలేను. 'ద్విజోత్తమా! ఈరోజే నేను ఆపని (ప్రాణ పరిత్యాగం) చేస్తాను' అని తన తండ్రితో (వ్యాసునితో)పలికి, ధృతరాష్ట్రుడు పరమశోకంతో నిశ్చేష్ట డయ్యాడు. రాజా! ఆ ధృతరాష్ట్ర మహారాజు మౌనంగా చింతిస్తూ కూర్చున్నాడు. వ్యాసుడు ధృతరాష్ట్రుని ఆ మాట విని, పుత్రశోకంతో కుమిలిపోతున్న తన కుమారునితో ఇలా అన్నాడు.

"ధృతరాష్ట్రా! నేను చెప్పేది విను నీవు పండితుడవు, మేధావివి. ధర్మార్థకుశలుడవు. నీకు తెలియనిది లేదు. తెలిసికొనవలసినదీ లేదు. మర్త్యుల అనిత్యత్వం కూడా నీవెరుగుదువు. సంశయం లేదు. జీవలోకం అశాశ్వతం. శాశ్వతమైన స్థానం మరొకటున్నది. జీవితానికి ముగింపు మరణమే. దానికై శోకమెందుకు ? రాజేంద్రా! నీ కుమారుని నిమిత్తంగా చేసికొని, కాలప్రేరణతో, ఈ శత్రుత్వం నీకళ్ళ ఎదుటనే పుట్టింది. రాజా! కురువంశస్థుల సంహారం తప్పక జరిగి తీరవలసినది. ఇక పరమగతిని పొందిన ఆ శూరులను గురించి శోకించట మెందుకు ? మహాబాహూ! రాజా! మహాత్ముడైన విదురుడు ఇదంతా తెలిసి, సంధి కోసం సర్వశక్తినీ వినియోగించి, ప్రయత్నించాడు. దైవసంకల్పితమైన మార్గాన్ని, ఎంతకాలం ప్రయత్నించినా, ఏ ప్రాణీ నియంత్రించలేదని నా అభిప్రాయం. దేవతలు సంకల్పించిన పనిని నేను ప్రత్యక్షంగా విన్నాను. అది నేను నీకు చెపుతాను. దానితో నీకు స్థైర్యం లభిస్తుంది.

గతంలో నేను వేగంగా ఇంద్రసభకు వెళ్ళాను. నాకేమీ అలసట లేదు. దానిని నేను జయించాను. అక్కడ దేవతలంతా ఒక్కచోటు చేరి ఉండటం చూశాను. అనఘా! నారదాది ప్రముఖ దేవర్షులు కూడా అక్కడున్నారు. రాజా! అక్కడ దేవతల దగ్గరకు ఏదో పని మీద వచ్చిన పృథివి కూడా నాకు కనిపించింది. భూదేవి అక్కడ చేరిఉన్న దేవతలతో ఇలా అన్నది. 'నాకు మీతో ఉన్న పనిని బ్రహ్మసదనంలో ఇంతకుముందే

చెప్పాను. మీరు మాట ఇచ్చారు కూడా! మహాభాగులారా! అది త్వరగా ఏర్పాటు చేయండి.' ఆమె పలికిన ఆ మాట విని, విష్ణువు నవ్వుతూ దేవసభలో భూమితో ఇలా అన్నాడు. "ధృతరాష్ట్రుని నూర్గురు కుమారులలో పెద్దవాడు - దుర్యోధను డని పేరు. అతడు నీ పని చేస్తాడు. అతనిని రాజుగా పొంది నీవు కృతకృత్యురాలవు కాగలవు. అతని కోసం కురుక్షేత్రంలో కూడిన పోటుగాళ్ళయిన రాజులు గట్టి ఆయుధాలతో పరస్పరం చంపు కొంటారు. దేవీ! ఆ యుద్ధంలో నీ భారం నశిస్తుంది. త్వరగా నీ తావుకు వెళ్ళు. శోభనా! లోకాలను ధరించు. రాజా! ఆ నీ కొడుకు లోకసంహారం కోసం కలి అంశతో గాంధారీ గర్భంలో జన్మించాడు. అతడు అసహనశీలుడు, చపలుడు, క్రోధనుడు, అనునయింపరాని వాడు కూడా. దైవయోగం వలన అతని సోదరులు కూడా అటువంటి వారే పుట్టారు. మేనమామ అయిన శకుని, పరమమిత్రుడైన కర్ణుడు అటువంటివారే.

అతనితో కలిసిన రాజులు కూడా వినాశం కోసమే భూమిపై పుట్టినవారు. రాజు ఎటువంటి వాడైతే అతని ప్రజలు కూడా అటువంటివారే అవుతారు. రాజు ధార్మికుడైతే, అధర్ములైన భృత్యులు కూడా ధర్మబద్ధంగా ఉంటారు. **ప్రభువు గుణదోషాలను బట్టియే భృత్యులుంటారు.** దీనిలో సంశయం లేదు. మహాబాహూ! రాజా! చెడ్డరాజును పొంది, నీ కుమారులంతా చనిపోయారు. ఈ విషయం తత్త్వవేత్త అయిన నారదునకు తెలుసు. తమ తప్పు వలన నీ కొడుకులు నశించిపోయారు. వారిని గురించి శోకించవద్దు. శోకింపదగిన కారణమే లేదు. పాండవులు చిన్న తప్పు కూడా చేయరు. నీ కొడుకులు దురాత్ములు. వారే భూమిని చంపివేశారు. నీకు మేలు కలగాలి. నారదుడు గతంలోనే రాజసూయ సమయంలో, యుధిష్ఠిరుని కొలువులో, నిస్సంశయంగా "కౌంతేయా! పాండవులు కౌరవులు అందరూ కలబడి, పరస్పరం చంపుకొంటారు. దానికి తగినట్లు కర్తవ్యాన్ని పాటించు" అని చెప్పాడు. నారదుని మాట విని అప్పుడు పాండవులందరూ బాధ పడ్డారు. రాజా! సనాతనమై దేవరహస్యమైన దీనిని నీకు పూర్తిగా చెప్పాను. ఇది 'దైవకల్పితమైన విధి' అని గ్రహించి నీ శోకం తొలగిపోయేటట్లు, ప్రాణులపై దయ కలిగేటట్లు, పాండు పుత్రులతో స్నేహం కలిగేటట్లు ప్రవర్తించు. మహాబాహూ! ఈ విషయాన్ని నేను చాలాముందే విన్నాను. క్రతుశ్రేష్ఠమైన రాజసూయ సమయంలో ధర్మరాజుకు చెప్పాను. నేనీ రహస్యాన్ని చెప్పగానే ధర్మరాజు కురువంశీయుల మధ్య యుద్ధం జరగరాదని ఎంతో ప్రయత్నించాడు. కానీ విధి బలవత్తరం.

రాజా! దైవవిధానాన్ని స్థావర జంగమప్రాణులు ఏ రీతిగానూ అతిక్రమింపలేవు. భారతా! నీవు ధర్మాసక్తుడవు. గొప్ప బుద్ధిగలవాడవు. ప్రాణుల చావుపుట్టుకల గురించి తెలిసినవాడవు. ఇక మోహమెందుకు ? నీవు శోకసంతప్తుడవై, మాటిమాటికీ మూర్ఛిల్లుతున్నట్లు తెలిస్తే, ధర్మరాజు ప్రాణాలను కూడా పరిత్యజిస్తాడు. రాజేంద్రా! **పశువక్ష్యాదులపై కూడా ఎప్పుడూ దయ చూపేవాడు ధర్మరాజు.** అటువంటివాడు నీపై దయ నెందుకు చూపడు ? భారతా! నేను చెప్తున్నాను కాబట్టి, విధిని మరలించలేము కాబట్టి, పాండవుల మీద దయతో నీవు జీవించు. నాయనా! నీవు ఇలా ప్రవర్తిస్తేలోకంలో నీకు కీర్తి కలుగుతుంది. మహా ధర్మమూ, అర్థమూ కూడా సిద్ధిస్తాయి. చిరకాలం తపస్సు చేసినంత ఫలితం లభిస్తుంది. మహాభాగా! పుత్రశోకంతో పుట్టి, జ్వలిస్తున్న అగ్నిని జ్ఞానజలంతో శాశ్వతంగా చల్లార్చు". వైశంపాయనుడు చెప్తున్నాడు. ఆ వ్యాసుని మాట విని, ధృతరాష్ట్రుడు ముహూర్తకాలం లోతుగా ఆలోచించి ఇలా అన్నాడు." "ద్విజోత్తమా! ఈ మహాశోక మనే వల నాపై బిగుసుకొంటోంది. మాటిమాటికీ మోహానికి లోనవుతూ, నన్ను నేను తెలిసికొనలేక పోతున్నాను. ఇదంతా దైవనియోగం వలన జరిగిందన్న నీ ఈ మాట విన్నాను. ఇక ప్రాణాలతో ఉంటాను. శోకానికి దూరమయ్యే ప్రయత్నం చేస్తాను." రాజేంద్రా! వ్యాసుడు ధృతరాష్ట్రుని ఆ మాట విని అక్కడే మాయమయ్యాడు."

9. విదురు వచనము

జనమేజయుడిలా అడిగాడు. "బ్రాహ్మణశ్రేష్ఠా! పూజ్యుడైన వ్యాసుడు నిష్క్రమించగానే ధృతరాష్ట్రమహారాజు ఏం చేశాడు? దానిని నాకు వివరించి చెప్పు. అదే రీతిగా మహామనస్వి, కురురాజు అయిన ధర్మజుడు ఏం చేశాడు ? కృపుడు మొదలయిన ఆ ముగ్గురు (కృపుడు, కృతవర్మ, అశ్వత్థామ) ఏం చేశారు ? అశ్వత్థామ చేసిన పని, పరస్పర శాపాలను గురించి విన్నాను. ఆ తరువాత ఏం జరిగిందో చెప్పు. సంజయుడు ఏం మాటాడాడు ?" వైశంపాయనుడిలా చెప్తున్నాడు. "దుర్యోధనుడు మరణించి, సర్వసేనలు చనిపోయిన తరువాత సంజయుడు దివ్యదృష్టిని కోలుపోయి ధృతరాష్ట్రుని దగ్గరకు వచ్చాడు. సంజయు డిలా చెప్పాడు. "రాజా! నానాదేశాల నుండి వచ్చిన వివిధ జనపదాల రాజులు నీ కుమారులతో పాటు పితృలోకానికి వెళ్ళిపోయారు. భారతా! ఎంతోమంది నిత్యమూ శాంతికై యాచించినా కూడా, నీ కుమారుడు వైరాన్ని ముగించగోరి, భూమండలా న్నంతటినీ నాశనం చేశాడు. రాజా! కొడుకులకు, మనుమలకు, తండ్రులకు అందరికీ

కూడా క్రమంగా ప్రేతకార్యాలు జరిపించు."

ధృతరాష్ట్ర మహారాజు సంజయుని ఆ ఘోరవచనాన్ని విని, నిశ్చేష్టుడై ప్రాణాలు కోలుపోయినట్లు నేలపై పడ్డాడు. నేలపై పడుకొనియున్న ఆ రాజును చూసి సర్వధర్మవేత్త అయిన విదురుడు ఇలా అన్నాడు. "రాజా! లే! ఎందుకు పడుకొన్నావు? భరతర్షభా! శోకించవద్దు. లోకేశ్వరా! ఇది సర్వప్రాణులకూ కూడా అంతిమగతియే. భారతా! **ప్రాణులు పుట్టుటకు ముందు లేవు. మధ్యలో కనిపిస్తాయి. పోయిన తరువాత ఉండవు. దానికై శోకమెందుకు ?** నరుడు శోకిస్తున్నా కూడా, చనిపోయిన వారిని అనుసరించడు. దుఃఖిస్తాడే కానీ వారికై చావడు. లోకస్వభావ సిద్ధ మిది. దేనికై దుఃఖిస్తున్నావు ? పోరాడకపోయినా మరణించవచ్చు. పోరాడినా జీవించవచ్చు. కాలం సమీపిస్తే అంతే. ఎవ్వడూ అతిక్రమించలేడు. కురుసత్తమా! వివిధ జాతులకు చెందిన సర్వప్రాణులనూ కాలం లాగుకొనిపోతుంది. కాలానికి ఎవ్వడూ ప్రియమైన వాడు కాదు. ఎవ్వడూ ద్వేషింపదగినవాడూ కాదు. భరతర్షభా! గాలి గడ్డిపోచలను అన్నివైపులకూ త్రిప్పినట్లు ప్రాణులన్నీ కూడా కాలానికి అధీనమై తిరుగుతాయి. ఒకటిగా సంసారయాత్ర చేస్తున్న వారందరూ అక్కడకు వెళ్ళవలసినవారే. ముందు ఎవడి కాలం వస్తే వాడు ముందుగా వెళతాడు. దానికై శోకమెందుకు ? రాజా! యుద్ధంలో చనిపోయినవారిని గురించి నీవు శోకిస్తున్నావు. కానీ వారిని గురించి దుఃఖపడవద్దు. వారంతా స్వర్గానికి వెళ్ళారు. శూరులై శరీరాలను విడిచినవారు స్వర్గానికి వెళ్ళినట్లు భూరిదక్షిణలతో చేసిన యాగాల వలన కానీ, తపస్సుల వలన కానీ, విద్య వలన కానీ స్వర్గానికి వెళ్ళలేరు.

ఆ శూరు లందరూ వేదవేత్తలే. అందరూ చక్కగా వ్రతాలను అనుష్ఠించినవారే. అందరూ ఎదురునిలిచి చనిపోయినవారే దానికై శోకమెందుకు ? శూరుల శరీరాగ్నులలో, వారు శరాలను ఆహుతులుగా చేసి హోమాలు చేశారు. ఆ ఉత్తమ పురుషులు ఆహుతి చేయబడుతున్న శరాలను సహించారు. రాజా! అందుకే నీకు చెప్తున్నాను. ఈ లోకంలో క్షత్రియునకు స్వర్గం చేరటానికి, యుద్ధంకన్నా గొప్పదైన మంచిబాట లేదు. యుద్ధానికి వన్నె తేగల మహాత్ములు, శూరులు అయిన ఆ క్షత్రియు లందరూ గొప్ప దీవెనలు పొందారు. వారిలో ఎవ్వరిని గురించీ శోకింపనవసరం లేదు. పురుషశ్రేష్ఠా! నిన్ను నీవే ఊరడించుకో. శోకించవద్దు. ఇప్పుడు నీవు శోకంతో దెబ్బతిని, కర్తవ్యాన్ని పరిత్యజించవద్దు."

10. ధృతరాష్ట్రుడు రణభూమికి బయలుదేరుట.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "పురుషశ్రేష్ఠుడైన ధృతరాష్ట్రుడు ఆ విదురుని మాట విని "రథాన్ని సిద్ధం చేయండి" అని ఆదేశించి మరలా ఇలా అన్నాడు. "వెంటనే గాంధారిని, భరతస్త్రీలనందరినీ తీసికొని రండి. కుంతిని, ఆమె వెంటనున్న ఇతర స్త్రీలను కూడా తీసికొనిరండి." ధర్మవేత్తలలో ఉత్తముడైన విదురునితో ఆలా పలికి, శోకంతో జ్ఞానం నశించిన ధృతరాష్ట్రుడు రథంపై కెక్కాడు. పుత్రశోకంతో దీనంగా ఉన్న గాంధారి, భర్త ఆదేశంతో, కుంతితో, ఇతర స్త్రీలతో సహా ధృతరాష్ట్ర మహారాజు దగ్గరకు వచ్చింది. వారంతా ధృతరాష్ట్ర రాజు దగ్గరకు వచ్చి, తీవ్ర శోకంతో ఒకరినొకరు పిలుస్తూ, ఒకరితో ఒకరు పెనవేసికొని పెద్దగా విలపించసాగారు. విదురుడు తాను వారికన్న దీనంగా ఉండి కూడా, వారిని ఓదార్చాడు. డగ్గుత్తికతో ఉన్న వారినందరినీ రథాలనెక్కించి, విదురుడు నగరం నుండి బయలుదేరాడు. ఆపై కౌరవు లందరి ఇళ్ళలో ఆర్తనాదాలు పుట్టాయి. పిల్లలతో సహా నగరమంతా శోకవ్యాకుల మయింది. ఆ స్త్రీలు గతంలో దేవగణాలు కూడా చూడని వారు. కాని వారు ఇప్పుడు భర్తలను కోల్పోయి, సాధారణ జనాలకు కూడా కనిపిస్తున్నారు. అందమైన తమ కురులను విరబోసికొని, నగలను ఒలిచిపెట్టి, ఆ స్త్రీలు ఏకవస్త్రధారిణులై, అనాథలవలె యుద్ధభూమి వైపు బయలుదేరారు. వెండికొండల వంటి రూపంగల గృహాలనుండి వారు బయటకు వచ్చారు. అప్పుడు యూథపతి మరణించగా కొండగుహల నుండి బయటపడిన చిత్రహరిణాల వలె వారున్నారు. రాజా! ప్రాసాదప్రాంగణంలో గుమిగూడిన ఆ అనేకస్త్రీల సముదాయాలు, శోకపీడితాలై, ఆవు పెయ్యల గుంపులవలె రణభూమివైపు బయలుదేరాయి.

వారు ఒకరి చేతులొకరు పట్టుకొని పుత్రులను, సోదరులను, తండ్రులను తలచుకొంటూ, ఆక్రోశిస్తున్నారు. వారు ప్రళయకాలంలోని లోకవినాశక దృశ్యాలను చూస్తున్నారు అన్నట్లు కనిపిస్తున్నారు. విలపిస్తూ, ఏడుస్తూ, ఇటు అటూ పరుగిడుతూ, వారు శోకంతో తెలివిని కోల్పోయి కర్తవ్యాన్ని తెలియలేకపోయారు. గతంలో చెలుల మధ్యకు రావటానికి కూడా సిగ్గుపడుతున్న స్త్రీలు, ఇప్పుడు ఏకవస్త్రలై సిగ్గు విడిచి, మామల ఎదుట నిలిచారు. గతంలో చిన్న చిన్న కలతలు కలిగినా, పరస్పరం ఓదార్చుకొంటున్న, ఆ స్త్రీలు శోకంతో వ్యాకులపడి, కేవలం ఒకరివైపు ఒకరు చూస్తున్నారు. అలా ఏడుస్తున్న వేలకొలది స్త్రీలు తన చుట్టూ నిలువగా, ధృతరాష్ట్ర మహారాజు దీనుడై, నగరం నుండి యుద్ధభూమివైపు బయలుదేరాడు. శిల్పులు, వ్యాపారులైన వైశ్యులు, చేతివృత్తులవారు అందరూ ఆ రాజును

ముందుంచుకొని, నగరం నుండి వెలుపలకు బయలుదేరారు. కౌరవుల నాశనంతో ఆర్తితో ఆక్రోశిస్తున్న ఆ స్త్రీల ఆర్తనాదాలతో, లోకాలను కలతపెడుతూ మహాశబ్దం పుట్టింది. ప్రళయకాలం ప్రాప్తించినప్పుడు ప్రాణులన్నీ ద్దగ్ధమవుతున్నట్లు, ఆ శబ్దం వినిపించింది. ప్రాణు లందరూ వినాశకాలం వీర్పడిందని భావించారు. మహారాజా! అప్పుడు కౌరవవినాశంతో తీవ్రంగా ఉద్వేగానికి లోనైన మనస్సులతో, వారిపై అనురాగం గల పౌరులు పెద్దగా ఆక్రోశించసాగారు."

11. ధృతరాష్ట్రుడు కృప - అశ్వత్థామ - కృతవర్మలను కలియుట.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "వారు హస్తిన నుండి క్రోసెడు దూరం మాత్రమే వెళ్ళి, మహారథులైన కృపుని, అశ్వత్థామను, కృతవర్మను చూశారు. ప్రజ్ఞాచక్షువు, ప్రభువు అయిన ధృతరాష్ట్ర నరపాలుని చూడగానే వారు నిట్టూర్చి, కన్నీటితో గొంతులు నిండగా ఏడుస్తూ ఇలా చెప్పారు. "భూపతీ! మహారాజా! నీ కుమారుడు దుష్కర పరాక్రమాన్ని ప్రదర్శించి, అమచరులతో పాటు స్వర్గలోకానికి వెళ్ళాడు. భరతర్షభా! దుర్యోధన సేననుండి, మహారథులమైన మేము ముగ్గురమే బయటపడ్డాం. మిగిలిన నీ సైన్యమంతా పూర్తిగా నశించింది." శరద్వత్పుత్రుడైన కృపుడు ధృతరాష్ట్రమహారాజుతో అలా పలికి. పుత్రశోకంతో దీనయై ఉన్న గాంధారితో ఇలా అన్నాడు.

"నీ కుమారులు నిర్భయంగా పోరాడుతూ, శత్రుగణాలనెన్నింటినో సంహరిస్తూ, వీరోచిత కర్మలను చేస్తూ చనిపోయారు. వారు తప్పక ఆయుధాలతో గెలుచుకున్న పుణ్యలోకాలను పొంది, తేజోమయ శరీరాలతో దేవతలవలె విహరిస్తుంటారు. శూరులలో ఒక్కడు కూడా పోరాడుతూ వెన్ను చూపలేదు. ఎవ్వడూ చేతులు జోడించలేదు. అందరూ ఆయుధాల ద్వారానే చనిపోయారు. ఈ రీతిగా యుద్ధంలో ఆయుధంతో చావటమే క్షత్రియులకు పరమగతి, అని ప్రాచీనులు చెప్పారు. కాబట్టి శోకింపదగదు. రాణీ! శత్రువులైన పాండవులు కూడా ఏమంత లాభపడలేదు. అశ్వత్థామతో కలిసి మేము ఏంచేశామో చెపుతా విను. భీమసేనుడు నీ కుమారుని అధర్మంగా చంపాడని విని, నిదురలోనున్న పాండవ శిబిరానికి చేరి యుద్ధం చేశాం. ధృష్టద్యుమ్నుడు మొదలయిన పాంచాలుర నందరినీ సంహరించాం. ద్రుపదుని కొడుకులను, ద్రౌపది కొడుకులను కూడా చంపాం. నీ కుమారుని శత్రుగణాలను ఆ రీతిగా రణభూమిలో నాశనం చేసి, మేము ముగ్గురం పారిపోతున్నాం. ఇహ ఇక్కడ నిలువలేము. శూరులు, మేటివిలుకాండ్రు అయిన ఆ

పాండవులు అసహనానికి లోనై, వైరానికి బదులు తీర్చుకోవాలని వేగంగా రాబోతున్నారు. యశస్వినీ ! శూరులు, పురుషశ్రేష్ఠులైన ఆ పాండవులు తమ కుమారులు చనిపోయారని విని, సావధానులై మా అడుగు జాడలను గమనిస్తూ త్వరలోనే వస్తారు. వారి పుత్రులతో, మిత్రులతో పోరాడి చంపిన మాకు, ఇక్కడ నిలవాలని ఉత్సాహం లేదు. రాణీ! మాకు అనుమతి నివ్వు. శోకంపై మనస్సు పెట్టవద్దు. రాజా! నీవు అనుమతించు. మహాధీరుడవై నిలు. క్షాత్రధర్మాన్ని మాత్రమే దృష్టిలోనుంచుకొని వారి మృత్యువును పరికించు." భారత! మహారాజా! కృపుడు, కృతవర్మ, అశ్వత్థామ ధృతరాష్ట్రునితో అలా పలికి, ఆయనకు ప్రదక్షిణం చేసి, మనీషి అయిన ధృతరాష్ట్రుని చూస్తూ గంగవైపు వేగంగా గుర్రాలను అదిలించారు.

అప్పుడు ఆ మహారథు లందరూ అక్కడనుండి తొలగి, ఉద్వేగంతో ఒకరినుండి ఒకరు వీడ్కోలు తీసికొని, ముగ్గురూ మూడు దారులలో వెళ్ళారు. శరద్వత్పుత్రుడైన కృపుడు హస్తిన పురికి వెళ్ళాడు. కృతవర్మ తన దేశానికి, అశ్వత్థామ వ్యాసాశ్రమానికి వెళ్ళారు. మహాత్ములైన పాండవుల విషయంలో పాపం చేసి, ఆ వీరులు ముగ్గురూ భయార్తులై, ఒకరినొకరు చూసుకొంటూ వెళ్ళిపోయారు. ధృతరాష్ట్ర మహారాజును కలిసి మహాత్ములూ, అరిందములూ అయిన ఆ ముగ్గురూ సూర్యోదయానికి ముందే తమతమ గమ్యాలవైపు వెళ్ళారు. రాజా! ఆ తరువాతనే, మహారథులైన పాండుపుత్రులు వ్యాసాశ్రమంలో అశ్వత్థామను సమీపించి, పరాక్రమించి, యుద్ధంలో అశ్వత్థామను ఓడించారు"

12. ధృతరాష్ట్రుడు భీమప్రతిమమ బ్రద్దలు చేయుట.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "సర్వసేనలూ సంహరింపబడగా, ధర్మరాజు వృద్ధుడైన తన తండ్రి (ధృతరాష్ట్రుడు) హస్తినపురి నుండి బయలుదేరాడని విన్నాడు. మహారాజా! అప్పుడు పుత్రశోకంలో మునిగియున్న ఆ ధర్మరాజు, పుత్రశోకార్తుడై దుఃఖిస్తున్న ధృతరాష్ట్రుని దగ్గరకు సోదరులతో కలిసి వచ్చాడు. కృష్ణుడు, యుయుధానుడు (సాత్యకి), యుయుత్సువు ఆయన వెంట వచ్చారు. తీవ్రదుఃఖంతో దీనయై ఉన్న ద్రౌపది కూడా, ఆ సమయానికి అక్కడకు వచ్చిన పాంచాల స్త్రీలతో కలిసి ధర్మరాజును అనుసరించింది. ఆ యుధిష్ఠిరుడు గంగా తీరంలో, ఆర్తితో ఆక్రోశిస్తున్న క్రౌంచపక్షుల వలె ఉన్న ఆ స్త్రీల బృందాలను చూశాడు. పాండవులకు ప్రియులు, అప్రియులు అయిన వారికై చేతులు వైకెత్తి, ఆర్తితో ఏడుస్తూ, ఆక్రోశిస్తున్న వేలకొలది స్త్రీలు అక్కడ యుధిష్ఠిరుని చుట్టుముట్టారు.

"రాజు ధర్మజ్ఞత్వం ఎక్కడకు పోయింది ? దయాలుత్వం ఏమైంది ? తండ్రులను, సోదరులను, గురుపుత్రులను, మిత్రులను కూడా చంపించావు. ద్రోణుని చంపి, పితామహుడైన భీష్ముని పడగొట్టి, జయద్రథుని సంహరించి నీ మనస్సు ఏ స్థితిలో ఉంది ? పితరులు, సోదరులు, దుర్ధర్షుడైన అభిమన్యుడు, ద్రౌపది కొడుకులు లేకుండా రాజ్యాన్ని నీవు ఏం చేసికొంటావు ?" క్రౌంచపక్షులవలె ఆక్రోశిస్తున్న వారిని దాటి, ధర్మరాజు పెదనాన్నకు నమస్కరించాడు. ఆపై పాండవులందరూ ధర్మబద్ధంగా తండ్రికి నమస్కరించి పేర్లు తెలుపుకొన్నారు. పుత్రవధతో పీడింపబడుతున్న ఆ ధృతరాష్ట్రుడు, తన కుమారులను అంతం చేసిన ధర్మరాజును శోకార్తితో, అనిష్టంగానే కౌగిలించుకొన్నాడు.

భారతా! ధర్మరాజును కౌగిలించుకొని, ఓదార్చి, దుష్టాత్ముడైన ధృతరాష్ట్రుడు దహింపదలచుకొన్న అగ్నివలె భీమునికై ఎదురుచూశాడు. శోక మనే గాలిచే వీచబడుతున్న ఆ ధృతరాష్ట్రుని కోపాగ్ని భీమసేను డనే వనాన్ని తగలబెట్టదలచినట్లుంది. ఆయన సంకల్పాన్ని, భీమునకు జరగబోయే అశుభాన్ని గ్రహించి కృష్ణుడు చేతులతో భీముని ప్రక్కకు నెట్టి, లోహంతో చేసిన భీమప్రతిమను ధృతరాష్ట్రుని ముందుంచాడు. మహాబుద్ధిమంతుడు, మహాప్రాజ్ఞుడు అయిన కృష్ణుడు ధృతరాష్ట్రుని ఇంగితాన్ని ముందే గ్రహించి, ఆ ఏర్పాటు చేయించి పెట్టాడు. భీమసేనుని లోహప్రతిమను చేతులతో పట్టుకొన్న వెంటనే, ధృతరాష్ట్రుడు భీమసేనునిగానే భావిస్తూ దాన్ని బ్రద్దలు చేశాడు. ఆ ధృతరాష్ట్రమహారాజు పదివేల ఏనుగుల బలంగలవాడు. ఆ లోహ భీమప్రతిమను బ్రద్దలు చేయగానే ఆయన రొమ్ము నలిగిపోయింది. నోటినుండి నెత్తురు కారింది. ఆపై అలాగే నెత్తుట తడిసి నేలపై పడిపోయాడు. చిటారు కొమ్మలలో పుష్పించిన పారిజాత వృక్షంవలె కన్పట్టాడు. అప్పుడు విద్వాంసుడు, సూతుడు అయిన సంజయుడు ఆయనను పట్టుకొన్నాడు. ఆయనను ఓదారుస్తూ, శాంతపరుస్తూ 'ఇలా చేయదగదు' అన్నాడు. అంతలో మహామనస్వి అయిన ధృతరాష్ట్రుని ఆవేశం దూరమయింది. ఆ రాజు కోపాన్ని వీడి శోకానికి లోనై "అయ్యో ! భీమా" అంటూ ఆక్రోశించాడు. భీమసేనుని చంపినట్లు భావించి బాధపడుతున్న ధృతరాష్ట్రుని కోపం తొలగిపోయినట్లు గ్రహించి, పురుష శ్రేష్ఠుడైన వాసుదేవుడు ఇలా అన్నాడు.

"ధృతరాష్ట్రా! నీవు శోకించవద్దు. నీవు భీమసేనుని చంపలేదు. రాజా! నీవు పడగొట్టింది లోహప్రతిమను మాత్రమే. భరతర్షభా! నీవు క్రోధానికి లోబడి ఉన్నావని గ్రహించి, నేను మృత్యువు కోరల మధ్య చిక్కుకొన్న భీముని తప్పించాను. బలంలో నీతో

సమానమైన వాడెవ్వడూ లేడు. మహాబాహూ! నీ భుజాల పట్టును ఏ నరుడు సహించగలడు ? యముని సమీపించిన వాడెవ్వడూ ప్రాణాలతో బయటపడలేనట్లు, నీ చేతుల మధ్య చిక్కినవాడు ఎవ్వడూ బ్రతకలేడు. కాబట్టి కౌరవ్యా! నీ కొడుకు తయారు చేయించిన ఈ భీముని ఈ లోహప్రతిమనే నేను నీముందు నిలిపాను. రాజేంద్రా! పుత్రశోకంతో తపించిపోతున్న నీ మనస్సు ధర్మంనుండి తొలగింది. అందుకే నీవు భీమసేనుని చంపదలచుకొన్నావు. ఇది నీకు తగిన పని కాదు. భీమసేనుని చంపినంత మాత్రాన నీ కుమారులు జీవించే అవకాశం లేదు. కాబట్టి శాంతిని స్థాపించాలనే ఉద్దేశ్యంతో మేము చేసినదానినంతా నీవు కూడా అనుమతించు. మనస్సును శోకంపై నిలుపవద్దు."

13. ధృతరాష్ట్రుడు పాండవులను చేరదీయుట.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "ఆపై పరిచారకులు శౌచక్రియను అనుష్ఠింపజేయటానికి ధృతరాష్ట్రుని దగ్గరకు వచ్చారు. శౌచక్రియను ముగించిన పిమ్మట మరల మధుసూదను డిలా అన్నాడు. "రాజా! నీవు వేదాధ్యయనం చేశావు. వివిధ శాస్త్రాలు చదివావు. పురాణాలు విన్నావు. కేవల రాజధర్మాలనూ విన్నావు. ఈ రీతిగా పండితుడవు, మహాప్రాజ్ఞుడవు, బలాబల నిర్ణయంలో సమర్థుడవూ అయి కూడా, నీ తప్పు వలన వినాశం జరిగితే నీవు ఇలా కోపిస్తావెందుకు ? భారతా! నేను, భీష్మద్రోణులు, విదురుడు, సంజయుడు అప్పుడే చెప్పాం. కానీ రాజా! నీవు ఆ మాటను అమలుపరచలేదు. కౌరవా! బలశౌర్యాలలో పాండవులు అధికులని తెలిసికూడా, మేము నివారిస్తున్నా మా మాటను అప్పుడు పాటించలేదు. స్థితప్రజ్ఞుడైన రాజా తాను తన దోషాలనూ, దేశ కాల విభాగాలనూ గ్రహించగలిగితే గొప్ప శ్రేయస్సును పొందగలడు. చెపుతున్నా కూడా శ్రేయస్సును, హితాహితాన్నీ స్వీకరింపలేని వాడు అన్యాయ మార్గంలో నిలిచి, ఆపదలను పొంది శోకిస్తాడు. భారతా! నిన్ను నీవు పరిశీలించుకో. ఎప్పుడూ అన్యాయంగానే ప్రవర్తించావు. రాజా! నీవు దుర్యోధనునికి లోబడి నిన్ను నీవు అదుపుచేసికోలేకపోయావు. నీ తప్పువలన ఆపదలను పొంది, భీమసేనుని ఎందుకు చంపదలచావు ? కాబట్టి నీవు కోపాన్ని ఉపసంహరించుకో. నీ దుష్కృత్యాలను తలచుకో. స్పర్ధతో పాంచాలిని సభలోనికి రప్పించిన క్షుద్రుడు దుర్యోధనుడు. వైరానికి బదులు తీర్చుకొనగోరి భీమసేను డతనిని చంపాడు. నీవూ, దురాత్ముడైన నీ కొడుకూ చేసిన అత్యాచారాలను పరికించు. ఏ తప్పు చేయని పాండవులను పరిత్యజించావు."

వైశంపాయనుడు చెప్పాడు. "రాజా! కృష్ణుడలా పూర్తిగా వాస్తవాలను చెప్పగా విని ధృతరాష్ట్రమహారాజు దేవకీ నందనునితో ఇలా అన్నాడు. "మాధవా! నీవు చెప్పినదంతా యథార్థమే. బలిష్ఠమైన పుత్రస్నేహం, ధైర్యం నుండి నన్ను మళ్ళించింది. కృష్ణా! అదృష్టం కొద్దీ, భీముని నీవు రక్షించినందువలన నా బాహువుల మధ్యకు రాలేదు. మాధవా! ఇప్పుడు నేను ప్రశాంతంగా ఉన్నాను. కోపం పోయింది. చింత తొలగింది. వీరుడైన పాండవ మధ్యముని చూడగోరుతున్నాను. రాజశ్రేష్ఠ లంతా చనిపోగా, పుత్రు లందరూ మరణించగా ఇక ప్రీతి, హితాభిలాష నాకు పాండవుల మీదనే." ఆపై ఆ ధృతరాష్ట్రుడు భీముని, అర్జునునీ, నకుల సహదేవులను తన శరీవయవాలతో హత్తుకొని, వారిని అనునయించి "శుభమస్తు" అని వారితో అన్నాడు."

14. పాండవులను శపింపబూనిన గాంధారిని వ్యాసుడు శాంతింపజేయుట.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "ఆ తరువాత ధృతరాష్ట్రుని అనుమతితో ఆ పాండవులు, సోదరులందరూ కలిసి కృష్ణునితో సహా గాంధారి దగ్గరకు వెళ్ళారు. గాంధారి నిందలకెప్పుడూ గురికానిది. శత్రుసంహారం చేసి యుధిష్ఠిరుడు తన దగ్గరకు వచ్చిన విషయం తెలిసి, పుత్రశోకంతో దీనయై, అతనిని శపింపగోరింది. పాండవుల విషయంలో గాంధారికి పాపసంకల్పం కలిగిందని వ్యాసముని ముందే గ్రహించాడు. అలా ఆమె అభిప్రాయం తెలిసి ఆ మహర్షి మనోవేగంతో వచ్చి, పవిత్రమూ, పరిమళభరితమూ అయిన ఆ గంగాపుణ్య జలాన్ని ఆచమించి, ఆ ప్రదేశానికి వచ్చాడు. ఆ వ్యాసముని దివ్యదృష్టితో తదేక మనస్సుతో ధ్యానించి; సర్వప్రాణుల మనస్సులలోని భావాన్ని గ్రహించగలడు. హితాన్ని ఉపదేశించే ఆ మహాతపస్వి, తగిన వేళలో తన కోడలు దగ్గరకు వచ్చి, శాపావసరాన్ని తప్పించి, శాంతి ఆవశ్యకాన్ని నిర్దేశిస్తూ ఇలా అన్నాడు.

గాంధారీ! పాండవులపై కోపింపవలదు. శాంతిని పొందు. శాపవాక్యాలను అణచుకో. ఈ నా మాట విను. జయాన్ని కోరుతున్న నీ కుమారుడు పద్దెనిమిది రోజుల నుండి ప్రతిదినమూ నీతో ఇలా అంటున్నాడు. "అమ్మా! శత్రువులపై యుద్ధానికి వెళ్తున్నాను. నాకు మేలు కలగాలని దీవించు". గాంధారి! జయాభిలాషియై దుర్యోధనుడు నిన్ను అలా అడిగినప్పుడల్లా నీవు "ధర్మమున్న వైపే గెలుపుంటుంది" అని దీవించావు. గాంధారి! గతంలో ఎప్పుడు మాటాడే సమయంలో, అసత్యవచనం పలికినట్లు నాకు గుర్తులేదు. అలా నీవు ప్రాణిహితం కోరేదానవు. రాజుల భీకరసంగ్రామంలో పాండవులు హద్దులను

మించిపోయి యుద్ధంలో జయించారు. సంశయం లేదు. వారివైపే ధర్మమెక్కువ ఉన్నట్టు. గతంలో సహనశీలవై ఇప్పుడు ఎందుకు సహించలేకపోతున్నావు. ధర్మజ్ఞా! అధర్మాన్ని విడు. ధర్మమున్న వైపే గెలుపు ఉంటుంది. మనస్వినీ, గాంధారీ! స్వధర్మాన్ని, నీవు పలికిన మాటనూ తలచుకొని కోపాన్ని నియంత్రించుకో! సత్యవాదినీ! మరెప్పుడూ ఇలా ఆలోచించవద్దు !"

గాంధారి ఇలా అన్నది. "భగవన్! పాండవులపై కోపం లేదు. వారిని నశించాలని కోరటం లేదు. కానీ పుత్రశోకం నా మనస్సును బలవంతంగా కలతపెడుతోంది. పాండవులను కుంతి రక్షించినట్లే, నేను కూడా రక్షించాలి అలాగే నీవు రక్షించినట్లే ధృతరాష్ట్రుడు కూడా రక్షించాలి. దుర్యోధనుడు సుబలసుతుడైన శకుని, కర్ణదుశ్శాసనులు చేసిన అపరాధం వలన ఈ కౌరవ వినాశనం జరిగింది. అర్జునుడు కానీ, భీమసేనుడు కానీ, నకుల సహదేవులు కానీ, యుధిష్ఠిరుడు కానీ ఎప్పుడూ తప్పు చేయలేదు. కౌరవ్యులు, పోరాడుతూ పరస్పరం సంహరించుకొంటూ సహచరులతో కలిసి చనిపోయారు. కాబట్టి నాకు అనిష్టాన్ని కలిగించే అంశమేదీ లేదు. కానీ మహామనస్వి అయిన భీముడు దుర్యోధనుని గదా యుద్ధానికి పిలిచి, వాసుదేవుడు చూస్తుండగానే చేసిన అధర్మకృత్యం నాకు నచ్చలేదు. రణభూమిలో అనేక రీతుల సంచరిస్తున్న దుర్యోధనుడు అభ్యాసం వలన తనకన్నా అధికుడని గ్రహించి, బొడ్డుక్రింద కొట్టాడు. అది నా కోపాన్ని పెంచింది. మహాత్ములయిన ధర్మజ్ఞులు సూచించిన ధర్మాన్ని, శూరులు రణభూమిలో ఏ రీతిగానైనా ప్రాణరక్షణ కోసం ఎలా పరిత్యజిస్తారు ?"

15. జలప్రదానికపర్వము

వైశంపాయనుడు చెప్తున్నాడు. "ఆపై ఆ గాంధారి మాటలు విని భీమసేనుడు బెదురుతూ, అనునయపూర్వకంగా గాంధారితో ఈ మాట అన్నాడు. "అధర్మమో, ధర్మమో, అక్కడ భయపడి అలా చేశాను. అది ఆత్మ రక్షణకోసమే. ఆ నా తప్పును నీవు క్షమించాలి. మహాబలుడైన నీ కుమారుని, ధర్మయుద్ధంలో నియంత్రించటం ఏ రీతిగానూ సాధ్యం కాదు. అందుకే విషమంగా ప్రవర్తించాను. గతంలో దుర్యోధనుడు కూడా అధర్మంగానే యుధిష్ఠిరుని ఓడించాడు. ఎప్పుడూ మమ్ములను మోసగిస్తూనే ఉండేవాడు. అందువలన విషమంగా ప్రవర్తించాను. కౌరవసైన్యంలో తానొక్కడే మిగిలాడు. ఆ వీర్యవంతుడు గదా యుద్ధంలో, నన్ను చంపి రాజ్యాన్ని హరించగూడదని నేను అలా ప్రవర్తించాను. రజస్వలయై,

ఏకవస్త్రయై ఉన్న పాంచాలరాజ కుమారితో నీ కొడుకు ఏమన్నాడో అంతా నీకు తెలుసు. సుయోధనుని సంహరించకుండా సాగరసహితంగా ఈ భూమిని ఎదురు లేకుండా పరిపాలించలేము. అందుకే నేనలా ప్రవర్తించాను. సభామధ్యంలో ద్రౌపదికి తన ఎడమతొడ చూపించి, నీ కుమారుడు మాకు ఎంతో అప్రియాన్ని చేశాడు. దుష్ప్రవర్తన గల నీ కుమారుని మేము అప్పుడే చంపవలసింది. అప్పుడు ధర్మరాజు ఆదేశం మేరకు సమయానికై వేచి ఉన్నాం. రాణీ! నీ కుమారుడు మహాశత్రుత్వాన్ని ప్రజ్వలింపజేశాడు. అరణ్యంలో నిత్యమూ బాధించాడు. అందువలన నేను అలా చేశాను. యుద్ధంలో దుర్యోధనుని సంహరించి శత్రుత్వాన్ని అతిగమించాం. యుధిష్ఠిరుడు రాజ్యాన్ని పొందాడు. మాకూ కోపం పోయింది.

గాంధారి ఇలా అన్నది. "నాయనా! నా కుమారుని గురించి ఇంతగా చెప్తున్నావు. కాబట్టి ఇది దుర్యోధనుని వధ కాదు. నీవు నాతో చెప్తున్న మాటలన్నీ (తప్పులన్నీ) దుర్యోధనుడు చేసినవే. భారతా! వృషసేనుడు నకులుని గుర్రాలను, చంపినపుడు, నీవు దుశ్శాసనుని యుద్ధంలో చంపి, ఆ శరీరం నుండి స్రవిస్తున్న నెత్తురు త్రాగావు. అది సజ్జనులు నిందించే విషయం. నీచజనులు చేసే పని, వృకోదరా! నీవు ఆ క్రూరకర్మ చేశావు. అది తగనిపని." భీమసేనుడిలా అన్నాడు. "ఇతరుల నెత్తురును కూడా త్రాగరాదు. ఇక సొంత నెత్తురును త్రాగవచ్చా? తానెంతో తన సోదరుడూ అంతే. తేడా ఏమీ లేదు. అమ్మా! నెత్తురు నాదంతాలనూ, పెదవులనూ దాటిపోలేదు. శోకించవద్దు. ఆ విషయం యమునికి తెలుసు. కేవలం నాచేతులు నెత్తుట తడిశాయి. రణభూమిలో గుర్రాలు చనిపోయిన నకులుని చూసి, దుశ్శాసనుని సోదరు లందరూ పరమోల్లాసంతో ఎగిసిపడ్డారు. అందుకని వారిని నేను భయపెట్టాను. జూదమాడినప్పుడు ద్రౌపది తలవెంట్రుకలు లాగారు. అప్పుడు కోపంతో నేను చేసిన ప్రతిజ్ఞ నా మనస్సులో ఉంది. రాణీ! ఆ ప్రతిజ్ఞను నెరవేర్చకపోతే, శాశ్వతంగా క్షత్రధర్మానికి దూరమవుతాను. అందువలన నేను అలా చేశాను. గాంధారి! నాలో దోషాన్ని శంకించదగదు. గతంలో నిరపరాధులమైన మాపై అకృత్యాలు చేసిన నీ కుమారులను, గతంలో నివారించకుండా, ఇప్పుడు నాలో దోషాలను ఆరోపించదగునా?

గాంధారి ఇలా అన్నది. "నీవు ఓటమిలేని వాడవే. కానీ ఈ వృద్ధుని కుమారులను వందమందినీ చంపావు. వీరిలో చిన్న తప్పులు చేసినవారి నయినా మిగిల్చియుండవచ్చు గదా! నాయనా! మేమిద్దరం వృద్ధులం, అంధులం, రాజ్యాన్ని కోల్పోయాం. ఈ స్థితిలో

మాకు ఊతకర్రగా నిలువగల ఒక్క కుమారుని అయినా ఎందుకు విడువలేదు ? నాయనా! నా కుమారుల పాలిటికి నీవు అంతకుడవు. నీవు ధర్మాన్ని పాటిస్తూ, ఒక్కరినైనా మిగిల్చి ఉంటే నాకింత దుఃఖం కలిగేది కాదు." అలా పలికి గాంధారి పుత్రులు, మనుమల మరణంతో బాధకు లోనై కోపంతో "ఆ రాజెక్కడ?" అని యుధిష్ఠిరుని గూర్చి ప్రశ్నించింది. అది విని యుధిష్ఠిరమహారాజు వణుకుతూ చేతులు జోడించి, మధురవచనాలతో ఇలా అన్నాడు. "దేవీ, నీ కుమారులను చంపిన క్రూరుడను, యుధిష్ఠిరుడను నేనే. పృథివీపాలు రందరూ నశించటానికి కారణమైన వాడను నేనే. శాపానికి తగినవాడను. నన్ను శపించు. నేను మిత్రద్రోహిని- అవివేకిని. అటువంటి మిత్రులను చంపుకొని, ఇప్పుడు నాకు జీవితంతో కానీ, రాజ్యంతో కానీ, ధనంతో కానీ ప్రయోజనం లేదు." ఆ రీతిగా భయంతో మాటాడుతూ దగ్గరగా నిలిచిన ధర్మజుని అప్పుడు గాంధారి ఏమీ పలుకలేదు. కేవలం దీర్ఘంగా నిట్టూర్చసాగింది. యుధిష్ఠిరుడు శరీరాన్ని వాల్చి ఆమె పాదాలపై పడబోయాడు. ధర్మజ్ఞ, దీర్ఘదర్శిని అయిన ఆ గాంధారి కళ్ళకు కట్టుకొన్న గంతలలో నుండి ధర్మరాజు వ్రేళ్ళకొనలను చూసింది. దానితో ఆ ధర్మరాజు అందమైన గోళ్ళు నల్లబడిపోయాయి. ఆ స్థితిలోనున్న ధర్మజుని చూసి అర్జునుడు వాసుదేవుని వెనుక దాగాడు. భారతా! ఆ రీతిగా బెదరిపోయి" అటు ఇటు తిరుగుతున్న ఆ పాండవులను గాంధారి తల్లివలె ఓదార్చింది. ఆమె కోపం తొలగిపోయింది. ఆమె అనుమతి తీసికొని, విశాలవక్షఃస్థలం గల ఆ పాండవులు ఒక్కటిగా వీరమాత అయిన తమ తల్లి (కుంతి) దగ్గరకు వెళ్ళారు. ఎంతో కాలానికి కొడుకులను చూసిన ఆమె (కుంతి), కొడుకులు పడ్డ కష్టాలను తలచుకొని, శోకంలోమునిగి, కొంగుతో ముఖం కప్పుకొని, కన్నీరు కార్చసాగింది. అప్పుడు కుంతి కుమారులతో కలిసి కన్నీరు కార్చి, వారివైపు తేరి చూసింది. వారు శస్త్రాస్త్రాలతో అనేక విధాలుగా గాయపడి ఉన్నారు. మాటిమాటికీ పుత్రులను ఒక్కొక్కరినిగా స్పృశిస్తూ, దుఃఖిస్తూ, కుంతి కొడుకులను పోగొట్టుకున్న ద్రౌపదికై శోకించింది. అప్పుడు నేలపై బడి రోదిస్తున్న పాంచాలిని చూసింది.

ద్రౌపది ఇలా అన్నది. "పూజ్యురాలా ! అభిమన్యునితో సహా నీ మనుమలంతా ఎక్కడ ? ఎంతో కాలం తర్వాత ఈరోజు తపస్వినై నన్ను చూడటానికి రావటం లేదు. కొడుకులు లేకుండా నాకు ఈ రాజ్యంతో పనేముంది ?" విశాలనేత్ర అయిన కుంతి శోకంతో కృశించి ఏడుస్తున్న ద్రౌపదిని లేవదీసి, ఓదార్చింది. రాజా! పుత్రులు తనను అనుసరిస్తుంటే ఆ ద్రౌపదితో కలిసి, తాను దీనంగా ఉన్నా, దీన అయిన గాంధారి

దగ్గరకు వెళ్ళింది. గాంధారి కోడలితో సహా ఉన్న యశస్విని అయిన కుంతితో ఇలా అన్నది. "అమ్మా! ఇలా శోకంతో కలతపడకూడదు. చూడు. నేను కూడా దుఃఖంలోనే ఉన్నాను. కాలవైపరీత్య ప్రేరణతో ఈ లోకవినాశం జరిగిందని భావిస్తున్నాను. ఇది తప్పించరానిది. స్వాభావికంగా గగుర్పాటు కలిగిస్తోంది. కృష్ణుని అనునయం విఫలమైనపుడు మహామతి అయిన విదురుడు చెప్పిన మహావాక్యం ఇప్పుడు సంభవించింది. అది తప్పింపరాని విషయం. విశేషించి ఇప్పుడు అది గతించిన విషయం. బాధపడవద్దు. రణభూమిలో మరణించిన వారిని గురించి శోకించవద్దు. నాదీ నీదీ ఒకే స్థితి. మనలను ఎవరు అనునయిస్తారు? నా దోషం వలనే గొప్పవంశం నశించిపోయింది."

16. రణభూమిలో గాంధారి విలాపము

వైశంపాయనుడు చెప్తున్నాడు. "అలా పలికి గాంధారి అక్కడే నిలిచి దివ్యదృష్టితో కౌరవ వినాశమంతా చూసింది. గాంధారి పతివ్రత, సౌభాగ్యవతి. భర్తతో సమానంగా వ్రతాలు పాటిస్తుంది. తీవ్రతపస్సుతో కూడినది. సతతమూ సత్యవాదిని. పుణ్యకర్మలు చేసే మహర్షి అయిన వ్యాసుని వరదానంతో దివ్యజ్ఞానబలాన్ని పొంది, (రణభూమిని చూసి) వివిధ రీతులలో విలపించసాగింది. గాంధారి బుద్ధిమతి. ఆమె అద్భుతమై, గగుర్పాటు కల్గించే ఆ నరవీరుల రణభూమిని, దూరంనుండి కూడా దగ్గరగా ఉన్నట్లే చూడగలిగింది. ఆ రణభూమి ఎముకలతో వెంట్రుకలతో, క్రొవ్వుతో, వ్యాపించి ఉంది. రక్తప్రవాహాలతో తడిసి ఉంది. ఎన్నో వేల శవాలు అన్ని వైపులా పడి ఉన్నాయి. ఏనుగులపై, గుర్రాలపై, రథాలపై నిలిచి పోరాడే యోధుల నెత్తుటితో ఆ రణభూమి కలుషితమై ఉంది. తలలు లేని మొండెములు, శరీరం లేని తలల సమూహాలు పడి ఉన్నాయి. ఏనుగులు, గుర్రాలు, మనుష్యులు, స్త్రీల ఆర్తనాదాలతో రణభూమి ప్రతిధ్వనిస్తోంది. నక్కలు, కొంగలు, నల్లకాకులు, తెల్లడేగలు, కాకులు దాని ఆశ్రయించి ఉన్నాయి. మనుష్యులను తినే రాక్షసులు అక్కడ ఆనందిస్తున్నారు. క్రౌంచపక్షులు గోలచేస్తున్నాయి. అమంగళకరాలైన నక్కల అరుపులతో ధ్వనిస్తోంది. గ్రద్దలు దాన్ని సేవిస్తున్నాయి.

ఆపై వ్యాసుని అనుమతితో ధృతరాష్ట్ర మహారాజు, పాండవులు అందరూ యుధిష్ఠిరుని నేతృత్వంలో అటు బయలుదేరారు. వాసుదేవునితో, బంధువులను కోల్పోయిన ధృతరాష్ట్ర మహారాజుతో కలిసి, కురుస్త్రీలు గుమిగూడి రణభూమి వైపు బయలుదేరారు. భర్తలను పోగొట్టుకొన్న ఆ కాంతలు కురుక్షేత్రానికి వచ్చి, అక్కడ చనిపోయిన కొడుకులను,

సోదరులను, తండ్రులను, భర్తలను చూశారు. మాంసాన్ని తినే, జంతువులు, నక్కల గుంపులు, కాకులు, భూతాలు, పిశాచాలు, రాక్షసులు, వివిధ నిశాచరులు ఆ శవాలను తింటున్నాయి. రుద్రుని క్రీడాస్థలం వలె ఉన్న ఆ రణభూమిని చూసి, స్త్రీలు ఆ విలువైన వాహనాల నుండి ఆక్రోశిస్తూ పడిపోయారు. ఎప్పుడూ చూడని ఆ రణభూమిని చూసి, భరత స్త్రీలు దుఃఖార్తులై కొందరు ఆ శవాలపై పడ్డారు. కొందరు నేలగూలారు. అలసిపోయి, అనాథలయి ఉన్న ఆ పాంచాలకౌరవ కాంతలలో కొంచెం కూడా చైతన్యం లేదు. చాలా దయనీయ దశలో వారున్నారు. దుఃఖంతో మనస్సులు దెబ్బతిన్న ఆ స్త్రీల విలాపాలతో అన్నివైపులు ప్రతిధ్వనిస్తున్నాయి. పరమభీకరంగా ఉన్న ఆ రణభూమిని చూసి ధర్మజ్ఞ అయిన గాంధారి, పుండరీక నేత్రుడైన కృష్ణుని పిలిపించి, కౌరవుల వినాశనాన్ని పరికిస్తూ ఇలా అన్నది. పుండరీకాక్షా! మాధవా! భర్తలను కోల్పోయిన నా కోడళ్ళు జుట్టు విరబోసికొని క్రొంచపక్షుల వలె విలపిస్తున్నారు చూడు. వారు తమ భర్తల గుణాలను తలచుకొంటూ వారి శవాలవైపు వెళ్తున్నారు. పుత్రులు, సోదరులు, తండ్రులు భర్తల శవాలవైపు ఎవరికి వారుగా పరుగెత్తుతున్నారు. మహారాజా! పుత్రులను కోల్పోయిన వీరమాతలతో ఒకవైపు, భర్తలను పోగొట్టుకొన్న వీరపత్నులతో ఒకవైపు రణభూమి ఆవరింపబడింది. ప్రజ్వలించే అగ్నివలె పురుషోత్తములైన కర్ణుడు, భీష్ముడు, అభిమన్యుడు, ద్రోణుడు, ద్రుపదుడు, శల్యులచే రణభూమి శోభిస్తోంది.

మహాత్ముల బంగారు కవచాలు, పతకాలు, మణులు, భుజకీర్తులు, కేయూరాలు, హారాలతో యుద్ధరంగం అలంకరింపబడింది. ఒకవైపు వీరుల చేతులనుండి వెలువడిన శక్తులు, పరిఘలు, రకరకాల తీక్ష్ణఖడ్గాలు, ధనుస్సులు, బాణాలు పడి ఉన్నాయి. ఒకవైపు ఆనందంగా గుంపులు గూడి క్రూరజంతువుల సమూహాలు నిలిచి ఉన్నాయి. వాటిలో కొన్ని ఆడుకొంటున్నాయి. కొన్ని పడుకొని ఉన్నాయి. ప్రభూ! ఇటువంటి ఈ రణరంగాన్ని చూడు. జనార్దనా! చూసే కొద్దీ శోకంతో నేను తగలబడిపోతున్నాను. మధుసూదనా! పంచాలురు, కౌరవులు నశించడమంటే పంచభూతాల వధ జరిగినట్లే నేను భావిస్తున్నాను. నెత్తుట తడిసిన గరుడపక్షులు, గ్రద్దలు వారిని లాగుతున్నాయి. వేలకొలదిగ గ్రద్దలు వారిని కాళ్ళతో నొక్కి పెట్టి, తింటున్నాయి. జయద్రథుడు, కర్ణుడు, ద్రోణుడు, భీష్ముడు, అభిమన్యుడు వీరి వినాశనాన్ని ఎవరు ఊహించగలరు ? దాదాపు ఎవ్వరూ చంపలేని వారంతా, ఇప్పుడు చంపబడి, ప్రాణాలు కోల్పోయి, అచేతనంగా పడి ఉన్నారు. గ్రద్దలకు, డేగలకు, వెలిచియ పక్షులకు, డేగలకు, కుక్కలకు, నక్కలకు ఆహారమయ్యారు. దుర్యోధనునికి

లోబడి, నిలిచి, అసహనానికి లోనై, ఆపదలను పొంది, చల్లారిన అగ్నివలె నున్న ఈ పురుషోత్తములను చూడు. గతంలో మెత్తని పరుపులపై శయనించిన వీరంతా, ఇప్పుడు మరణించి, కటికనేల మీద పడుకొని ఉన్నారు. ఆయా సమయాలలో ఎప్పుడూ వందులచే, స్తుతులచే అభినందింపబడిన వారు, ఇప్పుడు నక్కలు చేసే అమంగళకరాలైన రకరకాల అరుపులను వింటున్నారు. గతంలో చందనం, అగురు పూసికొని, పరుపులపై పడుకొన్న యశస్వినులైన వీరులు ఇప్పుడు ధూళిలో పడుకొని ఉన్నారు.

ఈ గ్రద్దలు, నక్కలు, కాకులు, ఆడనక్కలు మాటిమాటికి ఘోరంగా అరుస్తూ ఆ వీరుల ఆభరణాలను లాగుతున్నాయి. యుద్ధాభిమానులై ఆ వీరు లందరూ, సజీవులన్నట్లే పదునైన గుణాలనూ, కాంతిగల కత్తులను, నిర్మలగదలను చేతబట్టి ఉన్నారు. చక్కని రూపం, రంగు గలిగి ఆబోతులవలె బలిష్ఠులై, ఆకుపచ్చని హారాలు ధరించిన ఎందరో వీరులు పడి ఉన్నారు. క్రూరజంతువులు వారిని పొర్లిస్తున్నాయి. గడియల వంటి బాహువులు గల కొందరు శూరులు, ప్రియురాళ్ళను వలె గదలను కౌగిలించుకొని అభిముఖులై పడి ఉన్నారు. జనార్దనా! కొందరు కవచాలను, నిర్మలాయుధాలను ధరించి ఉన్నారు. క్రూరజంతువులు వారిని పీకటం లేదు. బ్రతికియే ఉన్నారని భావిస్తున్నాయి. ఇతర మహాత్ములను కొందరిని క్రూరజంతువులు లాగుతున్నాయి. చిత్రంగా ఉన్న వారి బంగారు గొలుసులు చెల్లాచెదరుగా అంతటా పడి ఉన్నాయి. భయంకరంగా కనిపిస్తున్న ఈ వేలకొలది నక్కలు, యశస్వులైన మృతుల మెడలలోని హారాలను లాగుతున్నాయి. వృష్ణివంశ శ్రేష్ఠా! ప్రతిరాత్రి గడచిపోగానే సుశిక్షితులైన వందులు గొప్పగొప్ప స్తుతులతో, ఉపచారాలతో వీరిని ఆనందింపజేసేవారు. అటువంటి వారి దగ్గర తీవ్రశోకానికి లోనైన సుందరస్త్రీలు దుఃఖార్తితో దీనంగా విలపిస్తున్నారు.

కేశవా! ఆ సుందరీమణుల అందమైన ముఖాలు వాడిపోయి ఎర్రకలువల సమూహాలవలె ప్రకాశిస్తున్నాయి. కురుస్త్రీలు ఏడుపును ఆపి, తమవారిని గురించి చింతిస్తూ, పరిజనులతో పాటు వారిని వెదుకుతూ, దుఃఖంతో వారి దగ్గరకు వెళ్తున్నారు. సూర్యకాంతితో, బంగారువన్నెతో ప్రకాశించే కురుకాంతల ముఖాలు రోషంతో, ఏడుపులతో రాగిరంగుకు తిరిగాయి. కేశవా! మంచి కాంతి గలిగి, ఏకవస్త్రలై, శ్యామల శ్వేతవర్ణాలతో నున్న దుర్యోధనుని భార్యల సమూహాలను చూడు. ఒకరి ఏడుపులలో మరొకరి ఏడుపులు, కలిసిపోయి ఈ స్త్రీల ఆర్తనాదాలలో, విలాపాలలోని అర్థం పూర్తిగా తెలియటం లేదు. ఈ వీరవనితలు దీర్ఘంగా నిట్టూర్చి, ఆక్రోశించి, విలపించి, దుఃఖంతో నిశ్చేష్టులై ప్రాణత్యాగం చేయదలుస్తున్నారు.

ఎంతోమంది స్త్రీలు తమవారి శరీరాలను చూసి, ఆక్రోశిస్తున్నారు. విలపిస్తున్నారు. మరికొంత మంది తమ మృదువైన చేతులతో తలలు బాదుకొంటున్నారు. పడిపోయిన తలలు, చేతులు, సర్వశరీరావయాలు ప్రోగులుపడ్డాయి. ఒకదానితో ఒకటి కలిసిపోయాయి. వాటితో రణభూమి వ్యాపించి ఉంది. తలలులేని అందమైన మొండెములు, మొండెములు లేని తలలు చూసి వారి దగ్గరకు వెళ్ళిన స్త్రీలు మూర్ఛిల్లుతున్నారు.

ఎరుకలేని ఆ స్త్రీలు, తమవారిని వెదుకుతూ అక్కడ కనిపించిన తలను మొండెంతో కలిపి చూస్తున్నారు. అది సరిపడటం లేదు. మరొకతల కనిపించటం లేదు. ఇది ఇతనిది కాదు. అని మళ్ళీ ఏడుస్తున్నారు. బాణాలతో ఖండించబడి, విడివిడిగా పడిఉన్న చేతులను, తొడలను, కాళ్ళను కలిపి చూస్తూ, దుఃఖిస్తున్న ఈ స్త్రీలు పదేపదే మూర్ఛిల్లుతున్నారు. కొన్ని శవాలకు తలలు లేవు. కొందరిని జంతువులు, పక్షులు తినివేశాయి. దానితో కొందరు భరతస్త్రీలు, భర్తలను చూసి కూడా గుర్తించలేకపోతున్నారు. మధుసూదనా! శత్రువులు చంపిన తమ సోదరులను, తండ్రులను, కొడుకులను, భర్తలను చూసి, మరికొందరు చేతులతో తలలు బాదుకొంటున్నారు. కత్తులతో సహా చేతులు, కుండలాలతో సహా తలలు పడి ఉండటంతో, నేలపై కదలటం కూడా కష్టంగా ఉంది. మాంసం, నెత్తురూ కలిసి బురదగా తయారయ్యాయి. గతంలో ఇటువంటి దుఃఖానికి తగని ఈ అందగత్తెలు ఇప్పుడు దుఃఖంలో మునిగిపోయారు. సోదరులతో, భర్తలతో, కొడుకులతో భూమి ఆవరింపబడింది. జనార్దనా! అందమైన కురులుగల ధృతరాష్ట్రుని కోడళ్ళ సమూహాలు, ఎన్నో గుర్రపుపిల్లల గుంపుల వలె కనిపిస్తున్నాయి. చూడు. కేశవా! ఈ కోడళ్ళు అందరూ పెద్దగా ఆర్తనాదాలు చేస్తున్నారు. నాకు ఇంతకన్నా పెద్దదుఃఖం ఏముంటుంది ? మాధవా! చనిపోయిన కొడుకులను, మనుమలను, సోదరులను ఇలా చూస్తూన్నానంటే పూర్వజన్మలలో తప్పక పాపం చేసి ఉంటాను." ఈ రీతిగా పుత్రశోకంతో దీనంగా ఏడుస్తూ, కృష్ణునితో మాటాడి గాంధారి చనిపోయిన తన కొడుకును (ధుర్యోధనుని) చూసింది."

17. దుర్యోధనుని చూసి గాంధారి విలపించుట.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "మరణించిన దుర్యోధనుని చూసి శోకానికి లోనైన గాంధారి వెంటనే, తోటలో విరిగిన అరటిచెట్టువలె నేలపై పడింది. ఆ గాంధారి మరలా చైతన్యాన్ని పొంది, ఆక్రోశించి, విలపించి, నెత్తురోడుతూ పడియున్న దుర్యోధనుని చూసి, కౌగిలించుకొని, దీనంగా ఏడ్చింది. శోకార్తితో ఇంద్రియాలు కలతపడగా "అయ్యో!

కుమారా" అని విలపించసాగింది. దుర్యోధనుని మెడఎముక మాంసం మాటున దాగి ఉంది. వక్షస్థలంపై హారాలు, పతకాలు అలంకారాలుగా ఉన్నాయి. కన్నీటితో అతని రొమ్ము తడుపుతూ, గాంధారి శోకంతో తపించిపోయింది. దగ్గరలోనే కృష్ణునితో ఇలా అన్నది. "ప్రభూ! వార్ధేయా! దాయాదులను నాశనం చేసిన ఈ యుద్ధం వచ్చినప్పుడు ఈ దుర్యోధనుడు చేతులు జోడించి "ఈ దాయాదుల పోరులో నాకు జయం కలగాలని దీవించు అమ్మా" అని నాతో అన్నాడు. పురుషోత్తమా ! దుర్యోధనుడు అలా పలుకగానే తనకు వచ్చిన ఇబ్బందినంతా గ్రహించి నేను ఇలా అన్నాను. **ధర్మమెటు ఉంటే అటే గెలుపు.** కుమారా! యుద్ధం చేస్తూ నీవు ధర్మమూఢుడవు కాకపోతే, దేవతలవలె, తప్పక ఆయుధాలతో గెలిచిన లోకాలను పొందగలవు. ప్రభూ! గతంలోనే ఆ రీతిగా నేను చెప్పాను. కాబట్టి ఇతనిని గురించి శోకించటం లేదు. బాంధవులను పోగొట్టుకొని దీనంగా ఉన్న ధృతరాష్ట్రుని గురించి దుఃఖిస్తున్నాను.

మాధవా! అసహనశీలుడు, అస్త్రనిపుణుడు, యుద్ధ దుర్దముడు, యోధులలో మేటి అయిన నా కుమారుడు వీరశయ్యపై పడి ఉన్నాడు, చూడు. పరంతపుడైన ఈ దుర్యోధనుడు పట్టాభిషిక్తులలో ముందు నిలిచేవాడు. కానీ ఇప్పుడు దుమ్ములో పడిఉన్నాడు. కాలమెంత తారుమారయిందో చూడు. వీరుడైన దుర్యోధనుడు దుష్కరమైన గతినే పొందాడన్నది నిశ్చయం. ఎందుకంటే ఈ వీరోచితమైన శయ్యపై వెల్లకిలానే పడుకొన్నాడు. గతంలో ఈ స్థితిలో అందగత్తెలు సేవిస్తూ ఆనందింపజేసేవారు. ఇప్పుడు వీరశయ్యపై నిదురిస్తున్న ఇతని, అమంగళహేతువులైన నక్కలు వినోదింపజేస్తున్నాయి. గతంలో రాజులు ఇతనిని సేవించి ఆనందింపజేసేవారు. ఇప్పుడు చచ్చి, నేలబడి ఉన్న ఇతనిని గ్రద్దలు సేవిస్తున్నాయి. గతంలో ఈ దుర్యోధనుని అందమైన వింజామరలతో స్త్రీలు విసిరేవారు. ఇప్పు డతనిని కెక్క లనే వింజామరలతో పక్షులు విసురుతున్నాయి. సత్యవిక్రముడు అయిన ఈ దుర్యోధనుని, సింహం ఏనుగును పడగొట్టినట్లు, యుద్ధంలో భీముడు పడగొట్టాడు. కృష్ణా! భీమసేనుని చేత దెబ్బతిని, నెత్తురోడుతూ, గదను పట్టుకొనియే పడుకొని ఉన్న భరతవీరుని - దుర్యోధనుని చూడు. కేశవా! గతంలో పదకొండు అక్షౌహిణుల సేనలను రణభూమికి రప్పించగలిగిన దుర్యోధనుడు, అధర్మంవలన యుద్ధంలో చనిపోయాడు. మేటివిలుకాడు, మహాబలుడు అయిన ఈ దుర్యోధనుని, సింహం శార్దూలాన్ని పడగొట్టినట్టు భీమసేనుడు పడగొట్టాడు. ఆ మందభాగ్యుడు బాలుడు, బుద్ధిహీనుడై విదురుని, తండ్రిని కూడా తిరస్కరించి మృత్యువుకు చిక్కాడు. పదమూడు సంవత్సరాల

పాటు ఈ భూమి శత్రువులు లేకుండా దుర్యోధనుని అధీనంలో ఉంది. ఇప్పుడు ఆ రాజు - నాకుమారుడు, చనిపోయి, నేలబడి ఉన్నాడు. కృష్ణా! దుర్యోధనుని పాలనలో ఈ భూమి ఏనుగులతో, గోవులతో, గుర్రాలతో నిండుగా ఉండేది. కానీ అది ఎక్కువకాలం నిలవలేదు. మాధవా! ఈ భూమినే నేడు ఇతరుల పరిపాలనలో చూస్తున్నాను. ఏనుగులు, గోవులు, గుర్రాలు కూడా పోయాయి. ఎలా జీవించేది ?

పుత్రవధ కన్న నాకు మరీ కష్టంగా ఉన్న విషయాన్ని చూడు. ఈ కాంత లందరూ యుద్ధభూమిలో చనిపోయిన ఈ శూరులను సేవిస్తున్నారు. కృష్ణా! లక్ష్మణుని తల్లిని (దుర్యోధనుని భార్య) చూడు. సువర్ణవేది వలె కాంతిమతియై, సుశ్రోణి అయిన ఈమె దుర్యోధనుని తొడలపై జుట్టు విరబోసుకొని కూర్చుంది. గతంలో, దుర్యోధనుడు బ్రతికి ఉన్నప్పుడు, తప్పనిసరిగా మనస్విని అయిన ఈ బాలిక, మంచిభుజాలు గల దుర్యోధనుని భుజాల నాసరాగాకొని ఆనందించేది. పుత్రునితో సహా రణభూమిలో చచ్చిపడి ఉన్న కుమారుని చూసికూడా, నా హృదయం వందముక్కలుగా ఎందుకు బ్రద్దలు కావటం లేదు? పతివ్రత అయిన ఆ అందగత్తె నాకోడలు దుర్యోధనుని చేతితో తడుముతూ, నెత్తుట తడిసిన తన కుమారుని శిరస్సు నాఘ్రాణిస్తోంది. మాధవా! ఆ మనస్విని భర్తకై దుఃఖిస్తోందో, కుమారునికై దుఃఖిస్తోందో తెలియటం లేదు. ఆ స్థితిలో ఆమె కనిపిస్తోంది. ఆ విశాలనయన కొడుకును చూసి, పది వ్రేళ్ళతో తన తలను బాదుకొంటూ తన భర్త అయిన దుర్యోధనుని రొమ్ముపై పడుతోంది. పద్మంలోపలి భాగం వంటి కాంతిగల ఆ పద్మస్వరూప - ఆ తపస్విని భర్తముఖాన్ని, కుమారుని ముఖాన్నీ తడుముతోంది. వేదాలు, ఆగమాలు సత్యమే అయితే ఈ రాజు దుర్యోధనుడు తన బాహుబలంతో సంపాదించిన పుణ్యలోకాలను తప్పక పొందినట్లే."

18. దుశ్శాసనాదులను చూసి గాంధారి విలపించుట.

గాంధారి ఇలా అంటోంది. "మాధవా! అలసటను జయించిన నా వందమంది కుమారులను చూడు. వారినందరినీ దాదాపు భీమసేనుడే గదతో రణభూమిలో సంహరించాడు. ఈ పిల్లలు - నా కోడళ్ళు పుత్రులను కూడా కోల్పోయి, రణభూమిలో జుట్టు విరబోసి కాని పరుగెత్తుతున్నారు. ఇది నాకు మరీ ఎక్కువ దుఃఖాన్ని కలిగిస్తోంది. గజ్జెలు అలంకరించిన పాదాలతో, మేడలపైభాగాన తిరుగుతున్న వీరు, ఆపదలలో పడి, నెత్తుట తడిసిన ఈ నేలను తాకుతున్నారు. దుఃఖంతో దీనలై పిచ్చిపట్టినట్లు ఆక్రోశిస్తూ తిరుగుతున్నారు.

గ్రద్దలను, నక్కలను, కాకులను ఎంతో కష్టం మీద దూరంగా తరుముతున్నారు. పిడికెడంత నడుముగల ఈ సర్వాంగసుందరి భయంకరమైన రణభూమిని చూసి, తీవ్రదుఃఖంతో పడిపోయింది. లక్ష్మణుని తల్లి రాజకుమారి, ఈ రాజపుత్రిని చూస్తుంటే నా మనస్సు ఊరట చెందటం లేదు. రణభూమిలో మరణించిన సోదరులను కొందరు, తండ్రులను, కొడుకులను కొందరు చూసి, ఆ మహాభుజులను పట్టుకొని పడిపోతున్నారు. అపరాజితా! ఈ దారుణసంహారంలో బంధువులను పోగొట్టుకొన్న నడిమి వయస్సు స్త్రీలు, వృద్ధస్త్రీలు చేస్తున్న ఆక్రందనలను విను. మహాభుజా! శ్రమతో, మోహంతో దీనలయిన ఈ స్త్రీలు రథాసనాలను, చనిపోయిన ఏనుగులను, గుర్రాలను ఆసరాగా చేసికొని నిలిచారు. చూడు. కృష్ణా! ఆమెను చూడు, శరీరం నుండి వేరుపడిన తన బంధువు తలను పట్టుకొని నిలిచి ఉంది. ఎత్తైన ముక్కుతో, అందమైన కుండలాలతో ఆ తల శోభిస్తోంది. అనఘా! ఏ దోషాలు లేని వీరు, అల్పమతినైన నేను గత జన్మలో చేసిన పాపం చాలా ఎక్కువే అనుకొంటున్నాను.

అందుకే జనార్దనా ! ధర్మరాజు నావారిని సంహరించాడు. వార్ష్ణేయా! **పుణ్యకర్మలైనా, పాపకర్మలైనా ఫలితమనుభవించక నశింపవు.** మాధవా! ఈ స్త్రీలు నవయౌవనలు, వీరి వక్షఃస్థలం, ముఖాలు చూడముచ్చటగా ఉన్నాయి. ఉత్తమవంశంలో పుట్టినవారు. లజ్జావతులు కనుబొమలు, వెంట్రుకలు, నల్లనివి, హంసలవలె గద్గదంగా మాటాడగలవారు. కానీ దుఃఖ శోకాలతో మోహానికి లోనై, బెగ్గురుపక్షులవలె రోదిస్తూ పడి ఉన్నారు, చూడు. పుండరీకాక్షా! ఏ మచ్చలేక వికసించిన తామరల వలె ప్రకాశిస్తున్న ఈ కాంతల ముఖాలను సూర్యుడు తపింపజేస్తున్నాడు. వాసుదేవా! మదించిన ఏనుగులవలె పొగరెక్కి, ఈర్ష్యాళువులైన నా కుమారుల యొక్క భార్యలను, సాధారణజనులు ఈ రోజు చూడగలుగుతున్నారు. గోవిందా! చూడు. వంద చంద్రచిహ్నాలు గల కాళ్ళు, సూర్యతేజస్సు గల ధ్వజాలు, బంగారు కవచాలు, బంగారు పతకాలు, ఈ శిరస్త్రాణాలు ఆజ్యంపోసిన అగ్నివలె ప్రకాశిస్తూ ప్రజ్వలిస్తున్నాయి. ఇవన్నీ కుమారులవే. శూరుడు, శత్రుసూదనుడు అయిన భీముడు రణభూమిలో చంపి, సర్వావయవాల నుండి నెత్తురు త్రాగిన నా కుమారుడు దుశ్శాసనుడు, ఇదిగో పడుకొని ఉన్నాడు.

మాధవా! ద్రౌపది ప్రేరణతో, జూదం నాటి కష్టాలను తలచుకొని, భీమసేనుడు గదతో చంపిన నా కుమారుని చూడు. జనార్దనా! సభలో జూదంలో ఓడిపోయిన ద్రౌపదిని చూసి, తన సోదరుడికి, కర్ణునికి ప్రియాన్ని చేయాలని తలచి ఈ దుశ్శాసనుడు 'పాంచాలీ !

సహదేవునితో, నకులునితో అర్జునునితో సహా నీవు మాకు దాసివయ్యావు. వెంటనే మా ఇంటిలోనికి ప్రవేశించు. కృష్ణా! అప్పుడునేను దుర్యోధన నరపాలునితో ఇలా చెప్పాను. "కుమారా! శకుని మృత్యుపాశాలలో చిక్కుకొని ఉన్నాడు. ఆయనను వదలిపెట్టు. నీ మేనమామ కలహప్రియుడు, దుర్మతి. అది గ్రహించు. వెంటనే ఆయనను వీడి, పాండవులతో సంధి చేసికో. దుర్బుద్ధీ! భీముడు, అసహనశీలుడు, నీవది అర్థంచేసికోవటం లేదు. కొరివితో ఏనుగును రెచ్చగొట్టినట్టు తీక్ష్ణవాగ్బాణాలతో భీముని రెచ్చగొడుతున్నావు." ఈ రీతిగా ఏకాంతంలో వారికి చెప్పాను. అలాగే భీమసేనుడు ఆ వాగ్బాణాలను తలచుకొంటూ పాము ఆబోతులను కాటు వేసినట్లు, నా కుమారులపై విషంక్రక్కాడు. సింహం మహాగజాన్ని చంపినట్లు భీమసేనుడు చంపగా, ఈ దుశ్శాసనుడు విశాలభుజాలను విప్పార్చి పడి ఉన్నాడు. మిక్కిలి అసహనశీలుడైన భీముడు మరీ రౌద్రంగా ప్రవర్తించాడు. రణభూమిలో కోపంతో దుశ్శాసనుని నెత్తురు త్రాగాడు."

19. గాంధారీ విలాపము - 1

గాంధారి చెపుతోంది. "మాధవా! పెద్దలు మెచ్చుకొనే ఈ నా కుమారుని వికర్ణుని భీముడు వందముక్కలు చేశాడు. ఆ వికర్ణుడు చచ్చి నేలమీద పడి ఉన్నాడు. మధుసూదనా! వికర్ణుడు చనిపోయి, శరత్కాలంలో నీలమేఘాల మధ్యనున్న చంద్రునివలె, ఏనుగుల మధ్య పడుకొని ఉన్నాడు. వింటిని పట్టిపట్టి ఈ వికర్ణుని చేతిపై పెద్ద కాయకాచింది. దానిపై చేతితొడుగును ధరించి ఉన్నాడు. గ్రద్దలు దానిని తినాలని కష్టపడి దానిని ఖండిస్తున్నాయి. మాధవా! తపస్వినిని అయిన ఈ అమ్మాయి - వికర్ణుని భార్య, మాంసం తినగోరుతున్న గ్రద్దలను, కాకులను అదేపనిగా నివారిస్తోంది. కానీ వీలు కావటం లేదు. మాధవా! వికర్ణుడు శూరుడు, యువకుడు, దేవతాసమానుడు. సుఖంగా జీవించినవాడు. సుఖంగా జీవింపదగినవాడు. అయినా దుమ్ములో పడి ఉన్నాడు. రణభూమిలో కర్ణులు (బాణాలు), నాలీకాలు, నారాచాలు ఇతని మర్మస్థానాలను ఛేదించాయి. అయినా ఇప్పటికీ కళ తగ్గలేదు. శత్రుగణ సంహారకుడైన దుర్ముఖుడు సంగ్రామ శూరుడై, ప్రతిజ్ఞను పాలించే భీమసేనునిచే చంపబడి, రణభూమిలో వెల్లకిలా పడుకొని ఉన్నాడు. నాయనా! కృష్ణా! క్రూరజంతువులు ఈ దుర్ముఖుని ముఖాన్ని సగం తినివేశాయి. అయినా సప్తమినాటి చంద్రునివలె ఎంతో ప్రకాశిస్తోంది. కృష్ణా! రణశూరుడైన ఇతని ముఖం ఎలా ఉందో చూడు. అటువంటి నా కుమారుడు శత్రువులచే చంపబడి, ఎలా దుమ్ము కరుస్తున్నాడో

చూడు. సౌమ్యా! రణభూమిలో ఇతనికి ఎదురునిలువ గలవాడు లేడు. దేవలోకాన్ని అయినా గెలువగలవాడు. అటువంటి దుర్ముఖుని శత్రువులు ఎలా చంపగలిగారు ? మధుసూదనా! విలుకాండ్రకే ఆదర్శమైన ఈ చిత్రసేనుని చూడు. ఈ ధార్తరాష్ట్రుడు చచ్చి, నేలపై పడుకొని యున్నాడు. చిత్రమైన మాలలు, ఆభరణాలు ధరించిన అతనిని, శోకంతో కృశించిన యువతులు, క్రూరజంతువులతో కలిసి ఏడుస్తూ సేవిస్తున్నారు. ఒకవైపు స్త్రీల రోదనధ్వని, మరొకవైపు క్రూరజంతువుల గర్జనలు, కృష్ణా! అద్భుతమైన ఈ సన్నివేశం నాకు విచిత్రంగా కనిపిస్తోంది.

మాధవా! వివింశతి యువకుడు, దేవతాసమానుడు సుందరస్త్రీలచే సేవింపబడేవాడు. అటువంటివాడు శిథిలమై, ధూళిలో పడుకొని ఉన్నాడు. కృష్ణా! బాణాలు ఇతని కవచాన్ని బ్రద్దలు చేశాయి. యుద్ధంలో చనిపోయిన వీరుని గ్రద్దలు నాలుగు వైపులా చుట్టి కూర్చున్నాయి. ఈ శూరుడు పాండవుల సేనలో ప్రవేశించి పోరాడినవాడు. ఆ మేటివీరుడు సత్పురుషులకు తగిన వీరశయ్యపై పడుకొని ఉన్నాడు. కృష్ణా! వివింశతి ముఖం చూడు. చక్కని ముక్కు, చక్కని కనుబొమలు గలిగి, చిరునవ్వుతో చంద్రునివలె వెలుగుతూ ఎంత నిర్మలంగా ఉందో! క్రీడిస్తున్న గంధర్వుని వేలకొలదిగ దేవకన్యలు సేవించినట్టు గొప్ప కాంతలు ఎందరో ఇతనిని అనేకవిధాలుగా సేవించేవారు. శత్రుసైన్య సంహారకుడు, శూరుడు, యుద్ధానికే శోభ కల్పించేవాడు. అటువంటి దుస్సహుని ఎవడు సహించగలడు ? అంతటా బాణాలు గ్రుచ్చుకొన్న ఈ దుస్సహుని శరీరం, తనపై వికసించిన గోగుపూలతో వ్యాపించిన కొండవలె ప్రకాశిస్తోంది. ఈ దుస్సహుడు మరణించి కూడా బంగారు హారాలతో, ప్రకాశించే కవచంతో కూడి మండుతున్న శ్వేత పర్వతంవలె ప్రకాశిస్తున్నాడు."

20. విరాటస్త్రీల విలాపమును గాంధారి వర్ణించుట

దాశార్హా! కేశవా! అభిమన్యుడు గర్వించిన సింహంవలె అభిమాని. బలంలో, పరాక్రమంలో తమ కన్నా ఒకటిన్నరరెట్లు ఎక్కువని అర్జునుడు, నీవు కూడా చెప్పారు. శత్రుదుర్భేద్యమైన నా సేనను తాను ఒంటరిగా భంగపరిచాడు. అతడు ఇతరుల మరణానికి కారకుడై, కడకు తాను కూడా మృత్యువును పొందాడు. కృష్ణా! అమితతేజస్వి అయిన ఆ అర్జునకుమారుడు - అభిమన్యుడు చనిపోయినా కాంతిని కోల్పోనట్లే నాకు కనిపిస్తున్నాడు. విరాటుని కూతురు, అర్జునుని కోడలూ అయి, ఏ దోషమూ లేని ఈ ఉత్తర, చనిపోయిన

వీరుని తన భర్తను చూసి దీనంగా శోకిస్తోంది. కృష్ణా! విరాటుని కూతురు, అభిమన్యుని భార్య అయిన ఈ ఉత్తర భర్త దగ్గరకు పోయి చేతితో స్పృశిస్తోంది. అభిమన్యుని ముఖం వికసించిన తామరవలె ఉంది. మెడ గుండ్రని శంఖంవలె ఉంది. కమనీయ రూపం, అభిమానం గల ఆ ఉత్తర, అభిమన్యుని ముఖాన్ని ఆఘ్రాణించి, కౌగిలిస్తోంది. గతంలో మధుపానంతో మదించి, మైకం కమ్మి, సిగ్గుపడుతూ అలా కౌగిలించుకొనేది. కృష్ణా! బంగారు అలంకరణలు గలిగి, నెత్తుటితో తడిసిన ఆ అభిమన్యుని కవచాన్ని తొలగించి శరీరాన్ని పరికించిచూస్తోంది.

కృష్ణా! ఆ అభిమన్యుని చూస్తూ ఉత్తర "పుండరీకాక్షా! నీ కన్నులవంటి కన్నులు గల ఈ అభిమన్యుడు పడిపోయాడు" అని నీతో అంటోంది. అనఘా! బలంలో, పరాక్రమంలో, తేజస్సులో రూపంలో కూడా నీతో సమానుడైన అభిమన్యుడు, శత్రువుల దాడితో నేలగూలి పడుకొని ఉన్నాడు. "నీవు మరీ సుకుమారుడవు. మృగచర్మంపై శయనించే వాడవు. ఇప్పుడు నేలపై పడుకొంటే నీ శరీరానికి నొప్పి లేదా? ఏనుగు తొండాలవలె పెద్దవై, అల్లెత్రాటిని లాగటం వలన బిరుసెక్కిన చర్మం గలవై, బంగారు అంగదాలు ధరించి ఉన్న ఈ విశాల భుజాలను విప్పార్చి, పడుకొని ఉన్నావు. ఎన్నో విధాలుగా పరిశ్రమించి, అలసటతో సుఖ నిద్రపోతున్నావా? ఇలా దీనంగా విలపిస్తున్న నాతో మాటాడవా ? గతంలో నన్ను దూరం నుండీ చూడగానే పలుకరించే వాడవు గదా! నేను ఏ తప్పు చేసినట్టు నాకు గుర్తులేదు. నాతో ఎందుకు మాటాడవు ? ఆర్యా! పూజ్యురాలైన సుభద్రను, దేవతా సమానులైన ఈ నీ తండ్రులను, దుఃఖంతో దీనంగా ఉన్న నన్ను విడిచి ఎక్కడకు వెళ్తావు."

ముఖాన్ని ఒడిలో పెట్టుకొని నెత్తుట తడిసిన అతని కేశాలను చేతితో వైకెత్తి అభిమన్యుడు బ్రతికి ఉన్నట్లే అడుగుతోంది. "నీవు వాసుదేవుని మేనల్లుడవు. అర్జునునకు కుమారుడవు. అటువంటి నిన్ను రణభూమిలో ఈ మహారథు లెలా చంపగలిగారు ? క్రూరకర్ములైన ఆ కృపుడు, కర్ణుడు, సైంధవుడు, ద్రోణుడు, అశ్వత్థామ నన్ను విధవను చేశారు. వారిని అసహ్యించుకొంటున్నాను. నాకు దుఃఖం కలిగించటానికై, బాలుడవై ఒంటరివైన నిన్ను చుట్టుముట్టి చంపుతున్నప్పుడు, ఆ రథికశ్రేష్ఠ లందరి మనస్సులు ఏ స్థితిలో ఉన్నాయి ? వీరా! పాండవులూ,. పంచాలురు చూస్తుండగానే సనాథుడవైనా అనాథుడి వలె ఎలా మరణించావు ? అనేకులు కలిసి యుద్ధంలో చంపిన నిన్ను చూసి, వీరుడు, పురుష శ్రేష్ఠుడు అయిన నీ తండ్రి - అర్జునుడు ఎలా బ్రతుకగలుగుతున్నాడు ?

కమలనేత్రా! నీవు లేకపోతే ఈ విశాల రాజ్యలాభం కానీ, శత్రువులను పరాభవించగలగటం కానీ పాండవులకు ప్రీతిని కలిగించలేవు. శత్రువులను ఓడించి, నీవు గెలుచుకొన్న లోకాలను నేను ధర్మంతో, నిగ్రహంతో గెలుచుకొని వేగంగా నిన్ను అనుసరించి వస్తాను. అక్కడ నాకై ఎదురుచూడు. మరణకాలం సమీపించకపోతే ఎవ్వడూ కూడా తేలికగా చావలేరు. అందుకే దురదృష్టవతినైన నేను రణభూమిలో మరణించిన నిన్ను చూసి కూడా, బ్రతికి ఉన్నాను. నరవ్యాఘ్రా! నీవు పితృలోకానికి వెళ్ళి, అక్కడ నాతో మాటాడినట్టు, మరెవరితో నవ్వుతూ మృదు వచనాలతో మాటాడగలవు ? పరమ సౌందర్యంతో, చిరునవ్వుతో కూడిన మాటలతో, స్వర్గలోకంలో తప్పక అప్సరసల మనస్సులను కలచివేస్తావు. సౌభద్రా! పుణ్యాత్ములు వెళ్ళే లోకాలకు వెళ్ళి, అప్సరసలతో కలిసి విహరిస్తూ ఆయా సమయాలలో నా పనులను తలచుకొంటావా ? వీరుడా! ఈ లోకంలో నాతో నీ సహవాసం ఆరునెలలకే పరిమితమైంది. ఏడవనెలలోనే నీవు మరణించావు."

దుఃఖంతో అలా పలుకుతూ ఉన్న ఉత్తరను మత్స్య రాజ కుల కాంతలు ప్రక్కకు తీస్తున్నారు. తన సంకల్పాలన్నీ వ్యర్థమయ్యాయి. తాము మరీ దీనంగా ఉండి కూడా, దీనురాలైన ఆ ఉత్తరను ప్రక్కకు తీసి, చనిపోయిన విరాటుని చూసి ఆ కాంతలు ఆక్రోశిస్తున్నారు, విలపిస్తున్నారు కూడా. ద్రోణుని అస్త్రాలచే, బాణాలచే శిథిలమై, నెత్తురోడుతున్న విరాటుని గ్రద్దలు, నక్కలు, కాకులు లాగుతున్నాయి. పక్షులు విరాటుని లాగుతుంటే చూసిన ఈ నీల నయనలు, ఆదుర్దాతో వాటిని వారించే ప్రయత్నం చేస్తున్నారు కానీ వీలు కావటం లేదు. వారు ఎండలో తపించారు. శ్రమపడి ఉన్నారు. వాటితో ఆ కాంతలముఖాలు కాంతిని కోలుపోయాయి. శరీరం కాంతిహీనమైంది. మాధవా! ఉత్తరుడు, అభిమన్యుడు, కాంబోజ దేశీయుడైన సుదక్షిణుడు, చూటముచ్చటైన లక్ష్మణుడు - వీరంతా బాలకులు, అయినా చనిపోయారు. రణభూమి మధ్యలో శయనించి ఉన్న లక్ష్మణుని చూడు."

21. కర్ణ దర్శనము.

గాంధారి ఇలా చెపుతోంది. "మహారథుడు అయిన కర్ణుడు అర్జునుని తేజస్సుతో అణగారి మండుతున్న అగ్నివలె శాంతంగా పడుకొని ఉన్నాడు. ఎందరో అతిరథులను చంపి, నెత్తుటి ప్రవాహంతో శరీరమంతా తడిసి నేలపై బడి శయనించి ఉన్న సూర్యసుతుని కర్ణుని చూడు. అసహనశీలుడు, దీర్ఘరోషం గల మేటి విలుకాడు, కర్ణుడు అర్జునునిచే

చంపబడి, రణభూమిలో పడుకొని ఉన్నాడు. పాండవుల వలన భయపడుతున్న మహారథులైన నా కొడుకులు, గజరాజును వెన్నంటి నిలిచిన వీనుగులవలె, ఈ కర్ణుని ముందుంచుకొని పోరాడారు. అటువంటివానిని రణభూమిలో అర్జునుడు సింహం పులినివలె, మదపుటేనుగు మదపుటేనుగును వలె పడగొట్టాడు. పురుషోత్తమా! రణభూమిలో మరణించిన ఈ శూరుని దగ్గర కూడి, అతని భార్యలు జుట్టు విరబోసికొని ఏడుస్తూ కూర్చున్నాడు. మాధవా! ఈ కర్ణుని కారణంగా ఉద్వేగానికి లోనై, యుధిష్ఠిరుడైన ధర్మరాజు పదమూడు సంవత్సరాల పాటు చింతతో నిదురించలేదు.

శత్రువులు ఇంద్రుని ఎదిరించలేనట్లు, కర్ణుని కూడా ఇతరులు ఎదిరించలేరు. ప్రళయకాలాగ్ని వంటి తేజస్వి, హిమాద్రివలె నిశ్చలుడు, దుర్యోధనునకు కూడా శరణమైన ఆ వీరుడు, ఇపుడు గాలికి కూలిపోయిన చెట్టువలె చచ్చి నేలపై పడుకొని ఉన్నాడు. వృషసేనుని తల్లి - కర్ణుని భార్య నేలపై పడి దీనంగా ఏడుస్తూ ప్రలపిస్తోంది చూడు. గురుశాపం నీ వెంటబడింది. ఈ నేల రథచక్రాన్ని మ్రింగింది. అప్పుడు యుద్ధానికి వెన్ను తెచ్చే అర్జునుడు, రణభూమిలో బాణంతో నీ తలను అపహరించాడు. అయ్యో! ఎంతపని జరిగింది. బంగారు కవచాన్ని ధరించిన మహాబాహువు, గంభీర హృదయుడు అయిన కర్ణుని చూసి, తీవ్ర వేదనతో ఏడుస్తూ సుషేణుని తల్లి మూర్ఛతో పడిపోయింది. మానవ మాంసాన్ని తినే జంతువులు తినగా ఆ మహాత్ముని శరీరం కొంచెమే మిగిలింది. కృష్ణపక్ష చతుర్దశి నాటి చంద్రుని వలె చూడటానికి ఆనందకరంగా లేడు. నేలపైబడి ఉన్న ఆమె లేచి, మరల దీనంగా కర్ణుని ముఖాన్ని ఆఘ్రాణిస్తూ, పుత్ర మరణంతో తపించిపోతూ పెద్దగా ఏడుస్తోంది."

22. జయద్రథుని, దుశ్శలను చూసి గాంధారి విలపించుట.

గాంధారి చెపుతోంది. "అవంతిరాజు అనేకబంధువులు గలవాడు. కానీ భీమసేనుడు చంపగానే ఆ శూరుడు ఎవ్వరూలేనట్లు పడిపోయాడు. ఆ శవాన్ని గ్రద్దలు, నక్కలు తింటున్నాయి. మధుసూదనా! శూరులతో పోరాడి, నెత్తురోడుతూ, వీరశయ్యపై పడుకొని ఉన్న అతనిని చూడు. అతనిని నక్కలు, తెల్లడేగలు, రకరకాల క్రూరజంతువులు ఆటూ ఇటూ లాగుతున్నాయి. కాలమెంత మారిపోయిందో చూడు. భీకరంగా పోరాడగల ఈ అవంతిరాజు వీరశయ్యపై శయనించి ఉండగా, అతని కాంతలు ఏడుస్తూ అతని చుట్టూ కూర్చొనిఉన్నారు. కృష్ణా! మేటివిలుకాడు, అభిమాని, ప్రతీపమహారాజు కొడుకు అయిన

బాహ్లికుడు బల్లెందెబ్బతో చనిపోయి, నిదురిస్తున్న పులిలా ఉన్నాడు, చూడు. ఇతడు మరణించినా, పున్నమినాడు ఉదయిస్తున్న నిండు చందురుని వలె ముఖం ఎంతో శోభిస్తోంది.

పుత్రశోకంతో తపించి, తన ప్రతిజ్ఞను నెరవేర్చుకొంటూ అర్జునుడు జయద్రథుని పడగొట్టాడు. జయద్రథుడు పూర్తిగా సంరక్షణలో ఉన్నా తన ప్రతిజ్ఞను వాస్తవం చేయదలచి మహాత్ముడైన అర్జునుడు పదకొండు అక్షౌహిణుల సేనలనూ ఛేదించి, ఇతనిని చంపాడు. జనార్దనా! సింధు, సౌవీరదేశాలకు అధిపతి, అయిన ఈ జయద్రథుని నక్కలు, గ్రద్దలు తింటున్నాయి. అచ్యుతా! అనురక్తిగల భార్యలు సంరక్షిస్తున్నా ఆడ నక్కలు వారి దగ్గర నుండి జయద్రథుని శవాన్ని లోతైన గుంటలోనికి లాగుతున్నాయి. జయద్రథుని శవాన్ని కాంబోజయవనస్త్రీలు రక్షిస్తూ, గుమిగూడి చుట్టూ నిలిచారు. జనార్దనా! గతంలో ద్రౌపదిని తీసికొని, జయద్రథుడు కేకయులతో కలిసి పారిపోయినప్పుడే, పాండవులు అతనిని చంపవలసింది. కానీ దుశ్శలమీది అభిమానంతో ఆనాడు విడిచిపెట్టారు. కృష్ణా! ఇప్పుడు మరల ఆ రీతిగానే ఆ దుశ్శలను అభిమానించలేకపోయారు. అటువంటి నా కూతురు దుఃఖంతో విలపిస్తూ, పాండవులపై ఆక్రోశం వెడలగ్రక్కుతూ తనను తాను హింసించుకొంటోంది. కృష్ణా! కూతురు విధవ అయింది. కోడళ్ళు భర్తలను పోగొట్టుకొన్నారు. ఇంతకు మించిన దుఃఖం నాకు మరేముంటుంది. అయ్యో! అయ్యో! ఎంత ఘోరం, చూడు. దుశ్శల దుఃఖాన్ని, భయాన్ని, విడిచినట్టు, భర్తల కనిపించక పోవటంతో ఇటూ అటూ పరుగెత్తుతోంది. కొడుకును కాపాడుకోవాలనుకొంటున్న పాండవుల నందరినీ వారింపగలిగిన జయద్రథుడు, విశాల సేనలను సంహరించి, తానే మృత్యువుకు లోనయ్యాడు. మదించిన ఏనుగువలె పరమదుర్జయుడైన ఆ వీరుని చుట్టూ నిలిచి, చంద్రవదనలైన ఆ స్త్రీలు ఏడుస్తున్నారు."

23. శల్యాదులమ చూసి గాంధారి విలపించుట.

"నాయనా! కృష్ణా! నకులునికి సాక్షాత్తు మేనమామ అయిన ఈ శల్యుడు, ధర్మజ్ఞుడైన ధర్మరాజుచే యుద్ధంలో చంపబడి, పడి ఉన్నాడు. పురుషర్షభా! మహాబలుడైన మద్రరాజు నిత్యమూ అన్నిచోట్లా నీతో సంఘర్షించేవాడు. ఆతడిప్పుడు చచ్చి పడుకొని ఉన్నాడు. నాయనా! రణభూమిలో కర్ణుని రథంపగ్గాలు పట్టి, పాండవుల విజయం కోసం కర్ణుని తేజస్సును నష్టపరచిన శల్యు డీయనయే. అయ్యో! చూడు! పూర్ణచంద్రుని వలె దర్శనీయమై, కమలదళాల వంటి కన్నులు గల శల్యుని ముఖంపై గాయాలు లేవు.

అయినా కాకులు పొడుస్తూనే ఉన్నాయి. కృష్ణా! బంగారువన్నె గల ఈ శల్యుని నోటిలో నుండి, మేలిమి బంగారు కాంతిగల నాలుక బయటకు వచ్చింది. పక్షులు దాన్ని తింటున్నాయి. యుద్ధానికి వన్నె తేగల మద్రరాజు - శల్యుని యుధిష్ఠిరుడు చంపాడు. ఆయన భార్యలు ఏడుస్తూ ఆయన చుట్టూ కూర్చొని ఉన్నారు. బాగా సన్నని వలువలు ధరించిన ఈ క్షత్రియ కాంతలు, క్షత్రియశ్రేష్ఠుడైన శల్యుని సమీపించి ఆక్రోశిస్తున్నారు. బుదరలో చిక్కుకొన్న ఏనుగు చూట్టూ తొలి ఈత ఏనుగులు నిలిచినట్లు, రణభూమిలో పడిపోయిన శల్యుని చుట్టూరా అతని కాంతలు నిలిచి ఉన్నారు. వృష్ణినందనా! ఈ శల్యుడు శరణునిచ్చే శూరుడు. కానీ బాణాలతో ముక్కలై వీరశయ్యపై పడుకొని ఉన్నాడు. శ్రీమంతుడు, ప్రతాపశాలి, గిరివాసి అయిన భగదత్త నరపాలుడు గజాంకుశాన్ని చేతబట్టి, చచ్చి నేలబడి ఉన్నాడు. క్రూరజంతువులు ఇతనిని, తింటున్నాయి. అతని తలపై బంగారుమాల తలవెంట్రుకలను ప్రకాశింపజేస్తూ, విరాజిల్లుతోంది. ఈ భగదత్తునితో అర్జునుడు వృత్రునితో ఇంద్రునివలె పరమదారుణంగా, రౌద్రంగా యుద్ధం చేశాడు. అది రోమాంచజనకంగా సాగింది. ఈ మహాబాహువు అర్జునునితో పోరాడి, అతనిని సందేహంలో పడవేసి, ఆపై అతని చేతిలో మరణించాడు.

శౌర్య పరాక్రమాలలో లోకంలో తనంతవాడు ఎవ్వడూ లేడు. రణరంగంలో భీకర కర్మను చేసేవాడు. అటువంటి భీష్ముడు దెబ్బతిని, పడి ఉన్నాడు. కృష్ణా! సూర్యతేజస్సు గల భీష్ముని చూడు. ప్రళయకాలంలో ఆకాశం నుండి జారిపడిన సూర్యునివలె పడుకొని ఉన్నాడు. కేశవా! సూర్యుడు అస్తమయ పర్వతాన్ని చేరినట్లు, పరాక్రమవంతుడు ఈ నరసూర్యుడు - భీష్ముడు శస్త్ర ప్రతాపంతో రణభూమిలో శత్రువులను తపింపజేసి, అస్తమిస్తున్నాడు. అచ్యుతుడు, ఊర్ధ్వరేతస్కుడు అయిన భీష్ముడు అంపశయ్యపై ఉండి శూరులు సేవించే వీరశయ్యపై పడుకొని ఉన్నాడు. కర్ణులతో, నాలీకాలతో, నారాచాలతో చక్కని శయ్యను పరిపించుకొని భీష్ముడు పూజ్యుడైన స్కందుడు, రెల్లుకాడలపై శయనించినట్లు పడుకొని ఉన్నాడు. అర్జునుడు మూడు బాణాలతో దూదిలేని గొప్ప తలగడను కల్పించాడు. భీష్ముడు దానిని తలక్రింద ఉంచుకొన్నాడు. మాధవా! తండ్రి ఆజ్ఞను పాటిస్తూ, ఊర్ధ్వ రేతస్కుడై, మహాయశస్వి అయిన ఈ శంతనునందనుడు యుద్ధంలో తిరుగులేనివాడు. ఆయన పడి ఉన్నాడు. నాయనా! ఆయన ధర్మాత్ముడు, ఇహపరాలకు సంబంధించిన విషయాలను నిర్ణయించటంలో సర్వజ్ఞుడు. మర్త్యుడైనా దేవతాసమానుడు. ఇంకా ప్రాణాలతో ఉన్నాడు. శంతనుసుతుడైన భీష్ముడు కూడా, నేడు బాణాలదెబ్బ తిని, పడి ఉన్నాడంటే

యుద్ధంలో ఎవ్వడూ నేర్పరి కాడు, ఎవ్వడూ పండితుడు కాడు, పరాక్రమవంతుడూ కాడు అనవలసివస్తోంది. ఈయన ధర్మజ్ఞుడు, సత్యవాది. ఈ శూరుడు పాండవులు అడగగా, స్వయంగా తన మృత్యుమార్గాన్ని చెప్పాడు. నశించిపోతున్న కురువంశాన్ని మరల ఉద్ధరించిన వాడు ఈయన. ఈ మేధావి కురువులతో కలిసి పరాభవాన్ని పొందాడు. నరోత్తమా! మాధవా! దేవతాసమానుడైన దేవవ్రతుడు స్వర్గానికి వెళితే, కురువులిక ధర్మసందేహాలు ఎవరి నడుగుతారు?

అర్జునుని నడిపించినవాడు, సాత్యకికి గురువు, కురువంశస్థులకు ఉత్తమ గురువు అయిన ద్రోణుడు పడి ఉన్నాడు చూడు. మాధవా! దేవేంద్రుని వలె, పరశురాముని వలె మహాపరాక్రమశాలి అయిన ద్రోణుడు కూడా నాల్గురకాలయిన అస్త్రాలు తెలిసినవాడు. ఆయన అనుగ్రహం వలననే, పాండుసుతుడైన అర్జునుడు దుష్కరపరాక్రమాన్ని ప్రదర్శించగలిగాడు. ఆ ద్రోణుడు దెబ్బతిని, పడి ఉన్నాడు. అస్త్రాలు ఆయనను కాపాడలేకపోయాయి. ఆయనను ముందుంచుకొనియే, కౌరవులు పాండవులను యుద్ధానికి ఆహ్వానించే వారు. శస్త్రధారులలో శ్రేష్ఠుడైన ఆ ద్రోణుడు శస్త్రాలతో గాయపడి, పడి ఉన్నాడు. సేనలను దహించే సమయంలో ఆయన గమనం అగ్నివలె ఉండేది. అటువంటి ద్రోణుడు చల్లారిన అగ్నివలె మరణించి, నేలపై పడుకొని ఉన్నాడు. మాధవా! ద్రోణుడు యుద్ధంలో మరణించినా, విల్లు పట్టుకొన్న పిడికిలి అలాగే విడిపోకుండా ఉంది. చేతి తొడుగులు కూడా ఉంటే, సజీవస్థితిలోనే కనిపిస్తున్నాయి. కేశవా! అనాదిగ బ్రహ్మదేవుని నుండి వేదాలు దూరం కానట్లు, నాలుగు వేదాలు, సర్వాస్త్రాలు శూరుడైన ఈ ద్రోణుని నుండి వేరు కాలేదు. అటువంటి ద్రోణుని పాదాలను వందల శిష్యులు అర్చించారు. వందలు స్తుతించారు. శుభకరాలై, నమస్కరింపదగిన ఆ పాదాలను, ఇప్పుడు నక్కలు పీకుతున్నాయి. మధుసూదనా! ధృష్టద్యుమ్నుడు ద్రోణుని చంపాడు. ఆయన భార్య కృపి దుఃఖంతో చైతన్యాన్ని కోలుపోయి, దీనంగా ఆయన దగ్గరలో కూర్చుంది. జుట్టుముడి వీడగా, అధోముఖియై, ఆర్తితో రోదిస్తూ, ద్రోణుని సేవిస్తోంది. ఆయన శస్త్రధారులలో శ్రేష్ఠుడై కూడా చనిపోయాడు.

కేశవా! ధృష్టద్యుమ్నుడు బాణాలతో ద్రోణుని కవచాన్ని ఖండించాడు. రణభూమిలో జటాధారిణియైన ఆ బ్రహ్మచారిణి - కృపి ద్రోణుని సేవిస్తోంది. సుకుమారి, యశస్విని అయిన కృపి యుద్ధంలో చనిపోయిన భర్తకు ప్రేతకృత్యాలు జరిపించటానికి త్వరపడుతూ దీనంగా ప్రయత్నిస్తోంది. యథావిధిగా అగ్నిని స్థాపించి, ద్రోణుని చితిపై నిలిపి, దానిని అన్నివైపులా అంటించి సామగానం చేసేవారు త్రివిధ సామలను గానం చేస్తున్నారు.

జటలు దాల్చిన బ్రహ్మచారులు విండ్లతో, శక్తులతో, రథాసనాలతో, బాణాలతో ఇతర వివిధ పదార్థాలతో చితిని తయారుచేశారు. మహాతేజస్వి అయిన ద్రోణుని దానిపై దహనం చేయదలచారు. అందుకే ద్రోణుని చితిపై ఉంచి, మంత్రాలు పఠిస్తున్నారు. ఏడుస్తున్నారు కూడా. కొందరు అంత్యకాలంలో వాడే త్రివిధ సామలను గానం చేస్తున్నారు. చితిలోని అగ్నిలో అగ్నిహోత్రంతో పాటు ద్రోణాచార్యుని ఉంచి, అగ్నిలో ఆహుతులు వేసి, ద్రోణశిష్యులైన బ్రాహ్మణులు కృపిని ముందుంచుకొని. చితిని అవసవ్యంగా నిలిపి, గంగకు అభిముఖంగా వెళ్తున్నారు."

24. భూరిశ్రవుని, శకునిని చూపి గాంధారి విలపించుట.

గాంధారి అంటోంది. "మాధవా! సాత్యకి పడగొట్టిన భూరిశ్రవుని అనేక పక్షులు పొడుస్తూ లాగుతున్నాయి. చూడు ఇక్కడే కనిపిస్తున్నాడు. జనార్దనా! ఇటు పుత్రశోకంతో తపించిపోయిన సోమదత్తుడు - మేటి విలుకాడైన సాత్యకిని నిందిస్తున్నట్టు కనిపిస్తున్నాడు. అటు ఏ మాటా పడని భూరిశ్రవుని తల్లి శోకంలో మునిగిపోయి, భర్త అయిన సోమదత్తుని అనునయిస్తున్నట్లుంది. 'మహారాజా! నీవు అదృష్టవంతుడివి. దారుణమైన ఈ భరత వినాశనాన్ని, ప్రళయకాలం వలె ఘోరమైన ఈ కౌరవ మహాసంహారాన్ని చూడవలసిన అవసరం లేదు నీకు. యూపం ధ్వజచిహ్నంగా గల నీ కుమారుడు వీరుడు, వేలకొలదిగ బంగారు నాణేలు దక్షిణగా ఇచ్చేవాడు. ఎన్నో యాగాలు చేసినవాడు. అతని మరణాన్ని నీవు చూడటం లేదు. అదృష్టవంతుడివి. మహారాజా! సముద్రతీరంలో సారసపక్షుల రోదనలను వలె రణభూమిలో నీ కోడళ్ళ ఘోరవిలాపాలను వినటం లేదు. అదృష్టవంతుడివి. నీ కోడళ్ళు కొడుకులను, భర్తను కోల్పోయి బట్టలను పూర్తిగానో, సగమో కట్టుకొని నల్లని కురులను విరబోసికొని పరుగెత్తుతున్నారు. అర్జునుడు భూరిశ్రవుని బాహువును ఖండించాడు. సాత్యకి సంహరించాడు. రణభూమిలో మరణించి పడి ఉన్న ఈ శలుని, భూరిశ్రవుని క్రూరజంతువులు తింటున్నాయి. అది నీవు చూడటం లేదు. వివిధ రీతులలో రోదిస్తున్న నీ కోడళ్ళను ఇప్పుడిక్కడ చూడటం లేదు. అదృష్టవంతుడివి. మహోత్ముడు, యూపధ్వజుడు అయిన భూరిశ్రవుని బంగారుగొడుగు రథాసనంపై పడి ఉంది. నీవు అదృష్టవంతుడివి. దానిని చూడటం లేదు. నీలికన్నులు గల ఈ భూరిశ్రవుని భార్యలు సాత్యకి చేతిలో చనిపోయిన భర్తచుట్టూ నిలిచి శోకిస్తున్నారు.

అయ్యో! కేశవా! భర్తశోకంతో కృశించి, జాలికలిగేటట్లు విలపించి, భర్త కెదురుగా దీనంగా నేలగూలుతున్నారు. అర్జునుడు పరమజుగుప్సాకరమైన ఈ పని ఎలా చేయగలిగాడు?

యాగశీలుడైన ఈ శూరుడు ఏమరుపాటులో ఉండగా బాహువును ఖండించాడు. సాత్యకి దానిని మించిన పాపకర్మ చేశాడు. ఇంద్రియాలను నిగ్రహించి, ప్రాయోపవేశం చేస్తున్న భూరిశ్రవుని సంహరించాడు. మాధవా! యూపధ్వజుని (భూరిశ్రవుని) కాంతలు ఎలా ఆక్రోశిస్తున్నారో విను. "ధార్మికా! అధర్మంగా ఇద్దరు కలసి నిన్ను చంపితే నీవు పడిపోయావు. సాత్యకి సజ్జనుల గోష్టులలో, సభలలో అపవిత్రమూ, అపకీర్తికరమూ అయిన ఈ పనిని గురించి ఎలా చెప్పుకొనగలడు ?" పిడికిట ఇమిడిపోయే నడుముగల ఈ భూరిశ్రవుని భార్య భర్త భుజాన్ని ఒడిలో పెట్టుకొని ఇలా దీనంగా ఏడుస్తోంది. "ఈ చేయి శూరులను సంహరించినది. మిత్రులకు అభయమిచ్చినది. వేలకొలది గోవులను దానం చేసినది. క్షత్రియులను అంతం చేసినది. ఈ చేయియే మా మొలనూలును లాగేది. బలిసిన వక్షోజాలను మర్దించేది. నాభిని, ఊరువులను స్పృశించేది. కోకముడిని విడదీసేది. వాసుదేవుని సమక్షంలోనే, అనాయాసంగానే మహాపరాక్రమాన్ని ప్రదర్శింపగల అర్జునుడు, ఇతరులతో పోరాడుతూ అసావధానంగా ఉన్న నీ చేతిని ఖండించాడు. జనార్దనా! సజ్జనగోష్ఠిలో కానీ, కథాప్రసంగాలలో కానీ అర్జునుని ఈ గొప్పపనిని ఎలా చెప్పగలవు ? స్వయంగా అర్జునుడైనా ఎలా చెప్పుకొనగలడు ? ఈ రీతిగా అర్జునుని నిందించి ఈ కాంత మౌనంగా ఉంది. ఆమె సవతులు అత్త కోడలిని గురించి శోకించినట్లు ఆమెను గూర్చి దుఃఖిస్తున్నారు.

బలవంతుడు, సత్యవిక్రముడు, గాంధరరాజు అయిన శకుని సహదేవునకు మేనమామ. ఆ మేనల్లుని చేతిలోనే శకుని చనిపోయాడు. గతంలో బంగారు కర్రలు గల విసనకర్రలచే వీచబడిన ఆ శకుని, ఇప్పుడు రణభూమిలో శయనించి, పక్షులరెక్కలచే వీచబడుతున్నాడు. తన రూపాలను వందలు, వేలు రీతులుగా ప్రదర్శించగల మాయావి శకుని. సహదేవుని తేజస్సుతో ఆ మాయలన్నీ తగులబడిపోయాయి. వంచనలో నేర్పుగల శకుని, మాయతో నిండు కొలువులో యుధిష్ఠిరుని, ఆయన రాజ్యాన్ని జయించాడు. కానీ యుధిష్ఠిరుడు శకుని జీవితాన్ని జయించాడు. కృష్ణా! శకునిని అన్నివైపులనుండి పక్షులు సేవిస్తున్నాయి. నా పుత్రుల వినాశనం కోసం వారికి వంచనను నేర్పించాడు. ఈ శకునివలననే పాండవులతో తీవ్రవైరం ఏర్పడింది. అది సబాంధవంగా శకుని వినాశనానికి, నా కుమారుల మరణానికి కారణమైంది. ప్రభూ! నా కుమారులు ఆయుధాలతో పుణ్య లోకాలను గెలుచుకొన్నట్లు, ఈ దుర్బుద్ధి కూడా ఆయుధాలకు లోబడి పుణ్యలోకాలను పొందుతున్నాడు. మధుసూదనా! వంకరబుద్ధిగల ఈ శకుని సరల మతులైన నాకుమారులకు, ఆ లోకాలలో కూడా సోదరులతో విరోధాన్ని కల్గిస్తాడేమో !"

25. గాంధారి శ్రీకృష్ణుని శపించుట.

గాంధారి అంటోంది. "మాధవా! కాంబోజరాజైన సుదక్షిణుని చూడు. మృదువైన కాంబోజజాతికి చెందిన దుప్పట్లపై పడుకొనవలసినవాడు. ఎద్దు మూపురం వంటి మెడ గలవాడు. ఎదిరింపరానివాడు. చచ్చి దుమ్ములో పడి ఉన్నాడు. చందనంతో అలంకరింపబడి, నెత్తుట తడిసిన అతని బాహువులను చూసి, అతని భార్య తీవ్రదుఃఖంతో అతిదీనంగా ఇలా విలపిస్తోంది. "అందమైన అరచేతులు, వ్రేళ్ళు గలిగి పరిఘల వంటివి ఈ బాహువులు. ఆ బాహువుల మధ్య నిలిచిన నన్ను గతంలో ఎప్పుడూ ప్రీతి విడిచిపోలేదు. రాజా! నీవు లేకపోతే ఇప్పుడు నేనే మవుతాను?" కృష్ణా! ఆత్మబంధువును పోగొట్టుకొని, అనాథయై ఈమె వణుకుతూ, మధురస్వరంతో విలపిస్తోంది. ఎండకు వాడిపోతున్న వివిధ పుష్పమాలలవలె ఈ రాణులు వాడిపోయినా, వారి శరీరాలను శోభ వదలిపెట్టడం లేదు. మధుసూదనా! శూరుడైన ఈ కళింగరాజును చూడు. వెల్లకిలా పడి ఉన్నాడు. ప్రజ్వలించే అంగదాలను భుజాలకు అలంకరించుకొని ఉన్నాడు. జనార్దనా! మగధదేశపు రాజు జయత్సేనుని అన్నివైపులా చుట్టి, భార్యలు తీవ్రంగా కలతపడి రోదిస్తున్నారు. జనార్దనా! చక్కని స్వరంగల ఈ విశాలనేత్రల ఆర్తనాదం మనస్సును, చెవులనూ మోహింపజేస్తూ, నా మనస్సును మూర్ఛిల్లజేస్తోంది. వారి వస్త్రాలు, ఆభరణాలు, అస్తవ్యస్తంగా ఉన్నాయి. శోకంతో వారు కృశించిపోయారు. చక్కగా పరిచిన శయ్యలపై పడుకొనదగిన ఈ మగధదేశపు రాణులు నేలపై పడి ఉన్నారు. కోసల దేశాధిపతి, రాజకుమారుడు అయిన బృహద్బలుని తమ భర్తను చుట్టుముట్టి ఈ స్త్రీలు విడివిడిగా ఏడుస్తున్నారు. అభిమన్యుడు బాహుబలంతో ఈ కోసలాధిపతి శరీరంలో బాణాలను నాటాడు. ఆ బాణాలను ఎంతో దుఃఖంతో తీస్తూ, ఈ రాణులు మాటిమాటికీ మూర్ఛిల్లుతున్నారు. మాధవా! సర్వాంగసుందరులైన ఈ రాణులు ఎండకు అలసిపోయారు. వారి వదనాలు వాడిపోయిన పద్మాలవలె ప్రకాశిస్తున్నాయి. అందమైన అంగదాలు, సువర్ణమాలలు ధరించిన ఈ ధృష్టద్యుమ్నకుమారులను ద్రోణుడు చంపాడు. శూరులైన ఆ శిశువు లందరూ పడి ఉన్నారు. ద్రోణుని రథమే అగ్నిశాల. ధనుస్సే జ్వాల. శరాలు శక్తులు. గద ఇంధనం. అటువంటి ద్రోణాగ్నిని మిడతలవలె సమీపించి వీరు దహించుకుపోయారు. అదే రీతిగా అందమైన అంగదాలు ధరించిన శూరులు, ఈ కేకయసోదరులు అయిదుగురు. వీరంతా ద్రోణుని ఎదిరించి, చచ్చి, పడి ఉన్నారు. మేలిమిబంగారు కవచాలు, తాటిచెట్టు గుర్తుగల రథసమూహాలు గల ఈ రాజకుమారులు మండుతున్న అగ్నులవలె తమ తేజస్సుతో భూమిని ప్రకాశింపజేస్తున్నారు.

మాధవా! అరణ్యంలో పెద్ద సింహం పెద్ద ఏనుగును చంపినట్లు, రణభూమిలో ద్రోణుడు చంపిన ద్రుపదుని చూడు. పుండరీకాక్షా! నిర్మలంగా తెల్లగా ఉన్న పాంచాల రాజగొడుగు శరత్కాలంలోని చంద్రునివలె ప్రకాశిస్తోంది. ఈ ద్రుపదుని కోడళ్ళు, భార్యలు దుఃఖంతో వృద్ధుడైన పాంచాల రాజును - ద్రుపదుని దగ్ధం చేసి అపసవ్యంగా వెళ్ళిపోతున్నారు. చేదిరాజు అయిన ధృష్టకేతువును ద్రోణుడు సంహరించాడు. అతని భార్యలు చైతన్యాన్ని కోలుపోయి, దగ్ధంచేయటానికి తీసికొని పోతున్నారు. మధుసూదనా! ఈ మేటివిలుకాడు రణభూమిలో ద్రోణుని అస్త్రాలను నశింపజేసి, నదీవేగానికి కూలిపోయిన చెట్టువలె చనిపోయి పడి ఉన్నాయి. చేదిరాజు, శూరుడు, మహారథుడు అయిన ఈ ధృష్టకేతువు రణభూమిలో వేలకొలదిగ శత్రువులను చంపి, చచ్చిపడి ఉన్నాడు. హృషీకేశా! సేనలతో, బాంధవులతో సహా సంహరింపబడిన చేదిరాజును పక్షులు పీకుతున్నాయి. ఆయన భార్యలూ చుట్టూ నిలిచి ఉన్నారు. శిశుపాలుని కుమారుడు, సత్యపరాక్రముడు, వీరుడు అయిన ధృష్టకేతువు రణభూమిలో శయనించి ఉంటే, ఆ చేదిరాజు కాంతలు ఆయనను ఒడిలో పెట్టుకొని ఏడుస్తున్నారు. హృషీకేశా! అందమైన కుండలాలు, అందమైన ముఖం గల ఈ ధృష్టకేతువు కొడుకును ద్రోణుడు రణభూమిలో బాణాలతో ముక్కలు ముక్కలు చేశాడు, చూడు. మధుసూదనా! రణభూమిలో శత్రువులతో పోరాడుతున్న తండ్రిని ఈ వీరుడు విడువలేదు. ఇప్పుడు చనిపోయిన తర్వాత కూడా వీడలేదు. మహాబాహూ! ఇదే విధంగా శత్రుసంహారకుడైన నా మనుమడు లక్ష్మణుడు కూడా తన తండ్రి అయిన దుర్యోధనుని అనుసరించాడు.

మాధవా! అవంతీరాజులైన విందుని, అనువిందునీ చూడు. హేమంతం తరువాత పుష్పించిన రెండు మద్దిచెట్లు గాలికి పడిపోయినట్లున్నారు. బంగారు అంగదాలనూ, కవచాలనూ ధరించి, బాణాలను, కత్తిని, వింటినీ ధరించి, నిర్మలమాలలను అలంకరించుకొని, ఎద్దుకళ్ళ వంటి కళ్ళతో పడుకొని ఉన్నారు. కృష్ణా! నీతో సహా పాండవులు ద్రోణభీష్ముల నుండీ, కర్ణుని నుండీ, కృపుని నుండీ, దుర్యోధనుని నుండీ, అశ్వత్థామ నుండీ, జయద్రథుని నుండీ, సోమదత్తుని నుండీ, వికర్ణుని నుండీ, కృతవర్మ నుండీ తప్పించుకొన్నారు. మీరందరూ చంపరానివారు. ఈ నరోత్తములు శస్త్రవేగంతో దేవతలనైనా సంహరించగలవారు. కాని రణభూమిలో చచ్చిపడి ఉన్నారు. కాలవైపరీత్యాన్ని చూడు. మాధవా! నిశ్చయంగా దైవానికి ఏ పనీ భారం కాదు. అందుకే క్షత్రియశ్రేష్ఠులైన ఈ శూరులు క్షత్రియులచే చంపబడ్డారు. కృష్ణా! నీవు రాయబారానికి వచ్చి విఫలుడవై ఉపప్లవ్యానికి తిరిగి వెళ్ళినపుడే నా కొడుకులు చనిపోయారు. భీష్ముడు, ప్రాజ్ఞుడైన విదురుడు "నీ కుమారులపై స్నేహభావాన్ని

ప్రదర్శించవద్దని నాకు అప్పుడే చెప్పారు. జనార్దనా! వారి దీర్ఘదృష్టి మిథ్యకాదు. అచిర కాలంలోనే నా కుమారులు బూడిదై పోయారు."

వైశంపాయనుడు చెప్తున్నాడు. భారతా! అలా పలికి గాంధారి దుఃఖంతో విజ్ఞానాన్ని కోల్పోయి, ధైర్యాన్ని వీడి, శోకమూర్ఛితయై నేలపై పడింది. ఆపై గాంధారి ఒళ్ళంతా కోపంతో నిండిపోయింది. పుత్రశోకంలో మునిగిపోయి, ఇంద్రియాలు కలతపడగా ఆ దోషమంతా కృష్ణునిపై పెట్టింది. గాంధారి ఇలా అన్నది. "కృష్ణా! పాండవులు, ధార్తరాష్ట్రులు పరస్పరం దహించుకొన్నారు. జనార్దనా! వా రలా నశిస్తుంటే నీవెందుకు ఉపేక్షించావు ? మధుసూదనా! మహాబాహూ! నీవూ శక్తిశాలివి. నీ దగ్గర సేవకులు, సైనికులు ఎందరో ఉన్నారు. ఉభయపక్షాలనూ చెప్పి, ఒప్పించగల సమర్థుడవు. మనఃపూర్వకంగానే కురు వంశస్థుల నాశనాన్ని కోరుకొన్నావు. కాబట్టి దానికి తగిన ఫలాన్ని అనుభవించు. చక్రగదాధరా! పతిశుశ్రూషతో నేను సంపాదించిన తపస్సు కొంచెముంది. అది అంత తేలికగా పొందగలది కాదు. ఆశక్తితో నిన్ను శపించబోతున్నాను. గోవిందా! కౌరవులు, పాండవులు దాయాదులు. వారు పరస్పరం చంపుకొంటుంటే ఉపేక్షించావు. కాబట్టి నీవు కూడా దాయాదులను చంపుతావు. మధుసూదనా! **నేటిమండి ముప్పయి ఆరు సంవత్సరాలు గడచిన తర్వాత నీవు కూడా దాయాదులను, అమాత్యులను, పుత్రులను కోలుపోయి; వనచరుడవై, దిక్కులేనివానివలె, ఎవ్వరికీ తెలియకుండా, ఎవ్వరిచేతమా గుర్తింపబడకుండా హీనమైన మార్గంలో మరణాన్ని పొందుతావు.** ఈ భరతస్త్రీల వలె నీ భార్యలు కూడా సుతులను, దాయాదులను, బంధువులను పోగొట్టుకొని శవాలపై పడి ఏడుస్తారు."

ఆ ఘోరమైన మాటను విని, మహామనస్వి అయిన వాసుదేవుడు కొద్దిగా నవ్వుతూ, గాంధారీ దేవితో ఇలా అన్నాడు. "క్షత్రియకాంతా! ఇది ఇలాగే జరుగుతుందని నాకు తెలుసు. నిర్ణయమైన దానినే నీవు చెప్పావు. వృష్ణివంశస్థులు దైవికంగానే నశిస్తారు. ఈ విషయంలో సంశయం లేదు. కళ్యాణీ! వృష్ణివంశాన్ని నాశనం చేసేవాడు నేను తప్ప మరొకడు లేడు. ఇతర నరులు కానీ, దేవదానవులు కానీ వారిని సంహరింపలేరు. అందువలన యాదవులు తమను తామే చంపుకొని నశిస్తారు." శ్రీకృష్ణు డలా అనగానే పాండవుల మనస్సులో భయం కలిగింది. ఎంతో ఉద్వేగానికి లోనయ్యారు. జీవితాలపై నిరాశ కలిగింది కూడా."

26. దహన సంస్కారాలు

శ్రీకృష్ణుడు చెప్తున్నాడు. 'గాంధారీ! లే! లే! మనస్సును శోకంలో నిలుపవద్దు. నీ తప్పు వలననే కౌరవులు మరణించారు. నీ కుమారుడు దుర్యోధనుడు దురాత్ముడు, ఈర్ష్యాళువు, అత్యంతమూ ఆత్మాభిమాని, క్రూరుడు, రూపుకట్టిన శత్రుత్వం వంటివాడు, పెద్దల మాటను అతిక్రమించేవాడు, దుష్కృత్యాలపై ఆసక్తి గలవాడు. అటువంటి వాడిని ముందు నిలుపుకొని మంచి వాడని భావిస్తున్నావు. నీవు చేసిన తప్పును ఇక్కడ నామీద పెట్టాలని ఎలా అనుకొంటున్నావు ? చనిపోయిన వారి గురించి కానీ, నశించిన దానిని గురించి కానీ, నడచిపోయిన దానిని గురించి కానీ ఆలోచించినవాడు, ఆ దుఃఖంతో మరో దుఃఖాన్ని పొందుతాడు. అనర్థాలు రెండవుతాయి. **బ్రాహ్మణస్త్రీ తపస్సుకోసం, ఎద్దు బరువు మోయటానికి, గుర్రం పరుగెత్తటం కోసం, శూద్రకాంత దాస్యం కోసం, వైశ్యస్త్రీ పశుపాలన కోసం, నీ వంటి రాజకుమారి పోరాడి చావటం కోసం పిల్లలను కంటుంది.**" వైశంపాయనుడు చెప్తున్నాడు. 'శ్రీకృష్ణుడు మరలా చెప్పిన ఆ అప్రియ వచనాన్ని విని, గాంధారి మౌనంగా ఉంది. ఆమె కళ్ళు శోకంతో కలతపడ్డాయి. రాజర్షి, ధర్మజ్ఞుడైన ధృతరాష్ట్రుడు అజ్ఞానంతో పుట్టిన తమో గుణాన్ని నిగ్రహించుకొని యుధిష్ఠిరుడైన ధర్మరాజుతో ఇలా అన్నాడు. "పాండునందనా! నీకు బ్రతికిఉన్న సేనల సంఖ్య తెలుసు. చనిపోయిన వారెందరో తెలిస్తే నాకు చెప్పు".

యుధిష్ఠిరుడిలా చెప్పాడు. **"రాజా! ఈ యుద్ధంలో మూట అరవై ఆరు కోట్ల ఇరవై వేల మంది చనిపోయారు. రాజేంద్రా! ఇదిగాక ఇరవైనాలుగు వేల మూట అరవై అయిదుగురి జాడ తెలియలేదు.**" ధృతరాష్ట్రుడడిగాడు. "పురుషసత్తమా! మహాబాహూ! వారంతా ఏ గతిని పొందారు? నా దృష్టిలో నీవు సర్వజ్ఞుడవు. నాకు చెప్పు". యుధిష్ఠిరుడు చెప్తున్నాడు. "ఈ మహాసంగ్రామంలో హర్షంతో శరీరాలను ఆహుతిచేసిన సత్యవిక్రములైన వారందరూ దేవేంద్రునితో సమానమైన లోకాలను పొందారు. భారతా! మనస్సులో హర్షంలేకపోయినా 'చనిపోవాలి' అనే నిర్ణయంతో పోరాడుతూ రణభూమిలో మరణించినవారు గంధర్వలోకాలకు పోయారు. రణభూమిలో నిలిచి, ప్రాణభిక్షను యాచిస్తూ, యుద్ధవిముఖులై ఆయుధాలతో మరణించినవారు గుహ్యక లోకాలను పొందారు. శత్రువులు పడగొట్టగా నిరాయుధులై, శస్త్రహీనులై, ఆ స్థితిలో కూడా సిగ్గుపడుతూ, రణభూమిలో శత్రువులనూ ఎదిరిస్తూ, పదునైన ఆయుధాలతో ఛేదింపబడిన క్షత్రధర్మ పరాయణులైన మహాత్ములు అందరూ బ్రహ్మలోకానికి వెళ్ళారు. ఈ విషయంలో నాకు మరో ఆలోచన

లేదు. రాజా! ఈ రణభూమిలో నిలిచి ఏదో ఒకరీతిగా మరణించిన పురుషులందరూ ఉత్తర కురుప్రదేశానికి వెళ్ళారు.

ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "కుమారా! మహాబాహూ! సిద్ధపురుషుని వలె నీవు ఏ జ్ఞానబలంతో చూడగలుగుతున్నావు? నేను వినవచ్చునంటే అది నాకు చెప్పు" యుధిష్ఠిరుడు చెప్తున్నాడు. "గతంలో నీ ఆదేశంమేరకు అరణ్యంలో తీర్థయాత్రలు చేస్తూ సంచరిస్తున్నప్పుడు నేను ఈ అనుగ్రహాన్ని పొందాను. అప్పుడు దేవర్షి అయిన లోమశుని సందర్శించాను. ఆయన ద్వారా అనుస్మృతి విద్యను పొందాను. గతంలోనే జ్ఞాన యోగం ద్వారా దివ్యదృష్టిని కూడా పొందాను. ధృతరాష్ట్రుడిలా అడిగాడు. "భారతా! ఈ మృతులలో అనాథలు, సనాథులు కూడా ఉన్నారు. వారి శరీరాలకు విధి పూర్వకంగా దహన సంస్కారాలు చేయగలవా ? అగ్ని సంస్కారం చేసే కర్తలు లేనివారికీ, ఆహితాగ్నులు కాని వారికీ కూడా దహన సంస్కారాలు జరగాలి. నాయనా! చాలామందికి చేయవలసి ఉంది కాబట్టి మన మెవరెవరికి చేద్దాం ? యుధిష్ఠిరా! కొందరిని గరుడపక్షులు, గ్రద్దలు ఆటూ ఇటూ లాగుతున్నాయి. వారికి కర్మద్వారా ఉత్తమలోకాలు లభిస్తాయి." వైశంపాయనుడు చెప్తున్నాడు. 'మహారాజా! ధృతరాష్ట్రుడు ఆలా ఆదేశించగానే కొంతేయుడైన యుధిష్ఠిరుడు సుధర్ముని, ధౌమ్యుని, సూతుడైన సంజయుని, మహామతి అయిన విదురుని, కౌరవుడైన యుయుత్సుని ఇంద్రసేనుడు మొదలైన సేవకులను, సారథుల నందరినీ "వీరికి ప్రేతకార్యాలను పూర్తిగా జరిపించండి. అనాథ శవం వలె ఏ శరీరమూ నశింపరాదు" అని ఆదేశించారు. ధర్మజుని ఆదేశాన్ని అనుసరించి విదురుడు, సూతుడైన సంజయుడు, సుధర్ముడు, ధౌమ్యుడు, ఇంద్రసేనాది భృత్యులు గంధపు చెక్కలు, అగరుకట్టె, మ్రానిపసుపు కట్టెలను, నేతిని, నూనెను, గంధాలను, విలువైన పట్టుబట్టలను సమకూర్చారు. కట్టెలను ప్రోగుచేశారు. అక్కడ విరిగిపోయిన రథాలను, వివిధాయుధాలను ప్రోగు చేశారు. తీవ్ర ప్రయత్నంతో చితులను ఏర్పాటుచేసి, ప్రాధాన్యాన్ని అనుసరించి, రాజులను శాస్త్రోక్తమైన కర్మతో ప్రశాంతంగా దహనం చేశారు.

భారతా! దుర్యోధన నరపాలునీ, మహారథులైన ఆయన సోదరులనూ, శల్యునీ, శలునీ, భూరిశ్రవునీ, జయద్రథరాజును, అభిమన్యునీ, దుశ్శాసనుని కొడుకునూ, లక్ష్మణుని, ధృష్టకేతు నరపాలునీ, బృహంతునీ, సోమదత్తునీ, వందకు పైగా ఉన్న సృంజయులనూ, క్షేమధన్వరాజును, విరాట ద్రుపదులనూ, శిఖండినీ, ధృష్టద్యుమ్ననీ, యుధామన్యునీ, ఉత్తమౌజునీ, కోసల రాజైన బృహద్బలునీ, ద్రౌపదికొడుకులనూ, శకునినీ,

అచలునీ, వృషకునీ, భగదత్తునీ, కర్ణునీ, ఆయన కుమారులనూ, కేకయరాజకుమారులనూ, త్రిగర్తులనూ, ఘటోత్కచునీ, బకుని సోదరుడైన అలంబుషునీ, జలసంధనరపాలునీ, ఇంకా ఎన్నోవేల సంఖ్యలో ఉన్న ఇతరరాజులనూ, నేతి ధారలతో ప్రజ్వలిస్తున్న మంటలలో దహించారు. కొంతమంది మహాత్ములకు పిత్రమేధాన్ని కూడా జరిపించారు. కొందరు సామగానాలు చేశారు. ఇతరులు వారికై శోకించారు. సామమంత్రాలు, ఋక్కుల ఘోషతో, స్త్రీల రోదన ధ్వనులతో ఆ రాత్రి సర్వప్రాణులకూ ఎంతో ఇబ్బంది కలిగింది. అప్పుడు పెద్దగా పొగ లేకుండా, ప్రజ్వలిస్తూ, ప్రజ్వలింపజేయబడుతున్న ఆ అగ్నులు ఆకాశంలో చిన్న చిన్న మేఘాలు ఆవరించిన గ్రహాలవలె కనిపించాయి. ఆపై అనేక దేశాలనుండి వచ్చి, అక్కడ అనాథులుగా పడి ఉన్న వారి శవాలనన్నింటినీ వేలరాసులుగా ప్రోగుచేశారు. నేతితో తడిపిన ఎన్నో కట్టెలతో; స్థిరచిత్తంతో, చితులను కల్పింపజేసి రాజశాసనం మేరకు విదురుడు వారినందరినీ దహించాడు. కురురాజైన యుధిష్ఠిరుడు వారికి అంత్యక్రియలు జరిపించి, ధృతరాష్ట్రుని ముందుంచుకొని, గంగవైపు బయలుదేరాడు."

27. కుంతి కర్ణజన్మము గూర్చి చెప్పుట.

వైశంపాయనుడు చెప్తున్నాడు. "ఆ యుధిష్ఠిరాదులు శుభంకరమై, పుణ్యజలాలతో, ఎన్నో తీర్థాలతో కూడి నిర్మలంగా, మహా రూపంతో, ఒడ్డున మహావనాలతో ప్రకాశిస్తున్న గంగను చేరి; ఆభరణాలను, ఉత్తరీయాలను తలపాగాలను తీసి పెట్టారు. ఆపై పితరులకు, సోదరులకు, మనుమలకు, బంధువులకు, పుత్రులకు, పెద్దలకూ ఉదకాల నిచ్చారు. కురుకాంతలు అందరూ తీవ్రదుఃఖంతో రోదిస్తూ, భర్తలకు జలాలనర్పించారు. ధర్మవేత్తలు మిత్రులకు కూడా జలక్రియలు చేశారు. వీరపత్నులు వీరులకు ఉదకాల నిస్తున్నప్పుడు గంగలో దిగటానికి దారి ఏర్పడింది. గంగ విశాలమైంది. ఆ గంగ మహాసముద్రం వలె ఉంది. ఆనందోత్సాహాలు లేకపోయినా, వీరపత్నులతో వ్యాపించిన ఆ గంగాతీరం శోభించింది.

మహారాజా! ఆపై శోకంతో కృశించి ఉన్న కుంతి ఏడుస్తూ వేగంగా, మందవచనాలతో కొడుకులతో ఇలా అన్నది. "పాండవులారా! మేటివిలుకాడు, రథయూథపతులకే యూథపతి, వీర లక్షణ లక్షితుడు, అర్జునుని చేతిలో ఓడిపోయినవాడు, సూతపుత్రు డనీ, రాధేయు డనీ మీరు భావిస్తున్నవాడు, సేనల మధ్య సమర్థుడైన

సూర్యునివలె విరాజిల్లువాడు, గతంలో అనుచరులతో సహా మీతో పోరాడినవాడు, దుర్యోధన సేననంతటినీ తన వెంటనడుపుతూ శోభించిన వాడు, పరాక్రమంలో భూమండలంలో తనతో సమానుడైన రాజులేనివాడు, లోకంలో ఎప్పుడూ ప్రాణాలకన్నా కీర్తినే కోరుకొన్నవాడు కర్ణుడు. యుద్ధంలో పారిపోడు. అనాయాసంగా పనులు చేయగల ఆ మీ సోదరునికి కూడా ఉదకాన్ని ఇవ్వండి. అతడు మీకన్నా ముందు సూర్యుని వలన నాకు పుట్టినవాడు, మీ అన్న. కవచకుండలాలు ధరించి దివాకరునితో సమానమైన కాంతిగల శూరుడతడు". పాండవులందరూ అప్రియంగా ఉన్న తల్లిమాటను విని, కర్ణుని గూర్చియే శోకిస్తూ మరీ నలిగిపోయారు. ఆ తరువాత కుంతీపుత్రుడు, పురుషోత్తముడు అయిన యుధిష్ఠిరుడు పాముపలె దీర్ఘంగా నిశ్వసిస్తూ తల్లితో ఇలా అన్నారు.

"కర్ణుడు మహారథులను ముంచగల జలాశయం వంటి వాడు. బాణాలే దానిలో అలలు, ధ్వజం సుడి, మహాభుజాలే పెద్ద మొసళ్ళు, చప్పట్లే గర్జనలు, అతని బాణాల తాకిడికి అర్జునుడు తప్ప మరెవ్వడూ ఎదురు నిలువలేడు. అటువంటి కర్ణుడు సూర్య సూతుడు గతంలోనే నీకు కొడుకు ఎలా అయ్యాడు ? అతని బాహుప్రతాపంతో మేమంతా తపించి పోయాం. కొంగున అగ్నిని కట్టుకొన్నట్లు ఈ విషయాన్ని ఇప్పటిదాకా ఎలా కప్పిపుచ్చావు ? మేము అర్జునుని బాహుబలాన్ని ఉపాసించినట్లు ధార్తరాష్ట్రులు ఎప్పుడూ ఆ కర్ణుని బాహుబలాన్ని ఉపాసించారు. బలశాలులలో శ్రేష్ఠుడు, కుంతికొడుకు అయిన కర్ణుడు తప్ప మరే రథికుడూ రాజులందరి సేనలనూ నిరోధించగల బలశాలి లేడు. సర్వశస్త్రధారులలో శ్రేష్ఠుడైన ఆ కర్ణుడు మాకు అన్న అనటం నిజమేనా? ఈ అద్భుత పరాక్రమశాలిని గతంలోనే నీవెలా కన్నావు ? ఆహా! నీవు ఈ రహస్యాన్ని దాచిపెట్టి మమ్ములను చంపావు. కర్ణుని మరణంతో బంధువులతో సహా మేము పీడింపబడుతున్నాం. అభిమన్యుడు, ద్రౌపది కొడుకులు, పంచాలుర వినాశనం కన్నా, కౌరవుల పతనం కన్నా, వందరెట్లు ఎక్కువగా ఈ దుఃఖం నన్ను తీవ్రంగా బాధిస్తోంది. కర్ణుని గురించియే శోకిస్తున్నాను. ఎవరో అగ్నిలో పడవేసినట్టు దహించుకొని పోతున్నాను. ఈ విషయం ముందే తెలిసి ఉంటే - స్వర్గంలో ఉన్న వస్తువయినా సరే మాకు అలభ్యమేదీ ఉండేది కాదు. కురువంశాన్ని అంతం చేసిన ఈ ఘోర సంగ్రామం జరిగేది కాదు." ఈ రీతిగా యుధిష్ఠిరుడైన ధర్మరాజు అనేకరీతులుగా విలపించి, రోదించాడు. మెల్లగా ఆ రాజు కర్ణునకు ఉదకాలనిచ్చాడు.

అది విని వెంటనే అక్కడ చేరి, ఉదకాన్ని ఇవ్వటానికి అన్నివైపులా నిలిచి ఉన్న

స్త్రీలందరూ పెద్దగా రోదించసాగారు. ఆ తరువాత ధీమంతుడు, కురురాజు అయిన యుధిష్ఠిరుడు, సోదరునిపై ప్రేమతో, కర్ణుని భార్యలనూ, పరివారంతో సహా అక్కడకు రప్పించాడు. ఆపై ధర్మాత్ముడు, ధీమంతుడు, యుధిష్ఠిరుడు అయిన ధర్మరాజు వారితో కలిసి అనంతరప్రేత కర్మను నిర్వర్తించాడు. "పాపినైన నేను విషయం తెలియక గొప్పవాడైన నా అన్నను చంపాను. కాబట్టి ఇక స్త్రీల మనస్సులలో రహస్యమేదీ నిలువదు" అని పలికాడు. అలా పలికి, ఇంద్రియాలు కలతపడగా, యుధిష్ఠిరుడు గంగలోనుండి బయటకు వచ్చి, సోదరులతో సహా ఒడ్డుపై నిలిచాడు.

ఇది స్త్రీపర్వం


సోదరయ్య గ్రంథాలయ సమితి
96363
A.C.No.
సనత్‌నగర్, హైదరాబాద్-500018.

భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా పెరగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందకు తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నపుడే భారతం చదివితే ఇహపర సౌఖ్యాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.